యండమూరి వీరేంద్రనాథ్

తులసిదళం

తులసిదళం

గ్రీష్మం తన ప్రతాపాన్ని చూపిస్తూంది- ఫెటేలున ఎండకాస్తూంది. పన్నెండు గంటలయింది- సూర్యుడు ఎర్రగా కాలిన పెనంలా వున్నాడు. భూమి బీటలు వారినట్టు వుంది. దూరంగా ఓ కాకి దాహంతో అరుస్తూంది. పెద్ద పెద్ద రాళ్ళూ, గుట్టల్తో ఆ ప్రదేశం అంతా నిండి వుంది. పిచ్చి మొక్కలు, తుప్పలూ ఇష్టం వచ్చినట్టు పెరిగినయ్.

జె. అండ్ జె. కంపెనీ తాలూకు మనుషులు అక్కడ పని చేస్తున్నారు- దాదాపు యాభైమంది. దుమ్ము లేపుకుంటూ శ్రీధర్ జీపువచ్చి ఆగింది.

"హలో! డైరెక్టర్!" అన్నాడు బ్రాహ్మిన్.

"హలో! ఇంజనీర్?"

ఒకరినొకరు చూసి నవ్వుకొన్నారు. "పని ఎలా సాగుతోంది?" శ్రీధర్ అడిగేడు.

"ప్రతి అడుక్కీ ఓ పుర్రె దొరుకుతూంది" బ్రాహ్మిన్ అన్నాడు.

"ఏ జన్మలో చేసుకున్న పాపమో... ఇలా స్మశానాలు తవ్వుతూ కూర్చున్నాం."

పది అడుగుల లోతున్న గొయ్యి తవ్వి పునాది వెయ్యాలి. అక్కణ్నుంచి స్థంభం లేపాలి. మొత్తం రెండు వందల మైళ్ళ లైను. ఇరవై కోట్ల ప్రాజెక్టు.

"ఇంజనీర్లం కదా.... మనకీ మంత్రసాన్లకీ తేడా లేదు".

శ్రీధర్ నవ్వి ముందుకు కదిలేడు. ఎండ తీవ్రంగా వుంది. వడగాల్పు వీస్తూంది. ఆకాశంలో మేఘం అన్నది లేదు- అన్నీ బండరాళ్ళు, ఎర్రమట్టి... దాదాపు ఆరేడు అడుగుల గొయ్యి తవ్వేరు. ఇంకో మూడు అడుగులు తవ్వాలి. గునపాల శబ్దం తప్ప ఇంకేమీ వినపడటం లేదు.

రెండువందల గజాలకొక స్థంభం చొప్పున రెండువందల మైళ్ళు.... మట్టి గుట్టలుగా పక్కన పడుతూంది. ఒకప్పటి స్మశానం కాబోలు అన్నీ ఎముకలూ- పుర్రెలూ-

అతడికి షేక్స్‌పియర్ గుర్తుకొచ్చేడు. ఏ పుర్రె వెనుక ఏ చరిత్ర వున్నదో... ఒక పుర్రె రాజ్యాల్నేలి వుండవచ్చు. ఇంకొక పుర్రె తట్టలు మోసి వుండవచ్చు. ఏది ఏ పని చేసినా చేరేది ఇక్కడికే కదా.

జరుగుతున్న పనిపట్ల సంతృప్తి చెంది అతడు తన జీపు వద్దకు చేరుకున్నాడు. ఈ పది రోజుల్లో అనుకున్న దానికన్నా ఎక్కువ పని జరిగింది. అతడు సీటు పక్కనుంచి వాటర్ బాటిల్ తీసుకొని ఓ నాలుగు గుక్కలు తాగాడు. బాటిల్ లోపల పెట్టి జీపు ఎక్కబోతూ ఆగాడు.

అప్పటివరకూ వినిపిస్తూన్న గునపాల చప్పుడు ఒక్కసారిగా ఆగిపోయింది. అంత రొద ఒక్కసారిగా ఆగేసరికి ఆ నిశ్శబ్దం భయంకరంగా వుంది.

స్మశాన నిశ్శబ్దం అంటే ఇంత భయంకరంగా వుంటుందా? దాహంతో కాకి అరుస్తూనే వుంది. ఎండుపుల్ల విరిగిన చప్పుడు కూడా వినపడుతూనే వుంది. అయినా అవన్నీ నిశ్శబ్దానికి దోహదంచేస్తూ వున్నాయి. ఆ చప్పుళ్ళ మధ్య నిశ్శబ్దం మరింత చిక్కపడుతూంది.

అతడు తల తిప్పి చూశాడు. కూలీలందరూ గుంపుగా చేరి గోతిలోకి చూస్తున్నారు. అంతదూరం నుంచి కూడా వాళ్ళ ముఖాల్లో విస్మయం, భయం కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి. బ్రాహ్మిణ్ పరుగెత్తుకుంటూ అక్కడికి వెళుతున్నాడు.

అతడు కూడా వడివడిగా చేరుకొని, లోపలికి చూశాడు. లోపల నలుగురు మనుష్యులు తవ్వటం ఆపి నిలబడి వున్నారు.

కొద్దిగా మట్టి చెదిరి- నల్లటి పెట్టె- ఆరడుగుల పొడవున్నది- గోతిలో కనిపిస్తూ వుంది.

ఎవ్వరూ మాట్లాడటంలేదు. అతడు నెమ్మదిగా గోతిలోకి దిగాడు. నల్లటి పెట్టె తారులాంటిది పూసి వుంది. శవపేటికలా వుంది. ఎన్నోవేల సంవత్సరాల్నుంచీ లోపల మగ్గిపోతున్నట్టు శిథిలమై వుంది. అతడో క్షణం దానివైపు చూసి, "బైటికి తీయండి" అని అరిచాడు.

"వద్దు" పైనుంచి అరిచాడు బ్రాహ్మిణ్ ... "డిపార్ట్‌మెంట్ వాళ్ళకి చెబ్దాం. వాళ్ళే వచ్చి చూసుకొంటారు".

ఈ లోపులో అతడు పైకి వచ్చాడు. బ్రాహ్మిణ్ ప్రశ్నకు సమాధానంగా "అంతకాలం మనం పని ఆపు చేసుకుని కూర్చుందామా?" అని, తిరిగి లోపలికి చూసి, "పైకి లాగండి" అన్నాడు.

అయిదు నిమిషాలపాటు అక్కడ చాలా టెన్షన్‌తో కూడిన పని జరిగింది. పెట్టెచుట్టూ వున్న మట్టిని పక్కకి తీశారు. అడుగు నుంచి గునపాలతో దాన్ని కదిపేరు. నెమ్మదిగా పెట్టె పైకి చేర్చబడింది. గొళ్ళేనికి చిన్న సీలులాటిది వుంది. పెట్టెమీద ఏవో అర్థంకాని అక్షరాలు వున్నాయి. బ్రాహ్మిణ్ వాటినే చూస్తున్నాడు.

శ్రీధర్ అతడివైపు చూసి నవ్వాడు."మంత్ర తంత్రాలమీద రిసెర్చి చేశానంటావ్‌గా.... మరి ఆ అక్షరాలేమిటో చదవలేవూ!"

బ్రాహ్మిణ్ వంగి దాన్ని చదవడానికి ప్రయత్నించి, విఫలుడై- తల అడ్డంగా వూపుతూ "ఉహూ... లాభంలేదు, మట్టి అక్షరాల్ని తినేసింది...." అన్నాడు.

శ్రీధర్ వంగి సీలు విప్పసాగాడు. అది చూసిన బ్రాహ్మిణ్ కంగారుగా వంగి "వద్దు బాస్! మనకెందుకు, దాన్నలా వదిలెయ్" అన్నాడు.

శ్రీధర్ వినలేదు. తన పని చేస్తూనే "ఏం? ఇందులో ప్రమాదం ఏముంది?" అంటూ పని పూర్తి చేశాడు.

చుట్టూవున్న కూలీలు ఉత్సుకతతో అతడు చేసే పనిని చూడసాగారు.

పెట్టె గొళ్ళేన్ని చేత్తో పట్టుకుని బలంగా మూత తెరిచాడు. ఎన్ని సంవత్సరాల క్రితం వేయబడిందో... తుప్పు పట్టి ఓ పట్టాన రాలేదు. ఇద్దరు కూలీలు సాయం పట్టారు. కిర్రుమన్న చప్పుడుతో నెమ్మదిగా పెట్టె తెరుచుకోవటం ప్రారంభించింది.

అక్కడున్న వాళ్ళంతా ఊపిరి బిగపట్టారు. బ్రాహ్మిణ్ అయితే ఉత్సుకతతో ఏ క్షణం అయినా బరస్ట్ అయ్యేటట్టున్నాడు. శ్రీధర్ దాని వైపే చూస్తున్నాడు. మూత పూర్తిగా పైకి తెరుచుకోగానే అప్రయత్నంగా అడుగు వెనక్కి వేశాడు.

నిద్ర పోతూన్నట్టు వుంది శవం. చేతులు రొమ్ములమీద పెట్టుకొని చర్మం నల్లగా మారివుంది. శరీరం అంతా ఏదో లేపనం పూసినట్టున్నారు, అందుకే శిథిలమవలేదు. కానీ వేసిన బట్టలూ- కప్పిన గుడ్డలూ వీటిని మాత్రం పురుగులు తినేసినయ్. కట్టెలా బిగుసుకు పోయిన ఒక కాలు గాలిలో కొద్దిగా తేలి వుంది. కనుగుడ్లు ప్రాంతంలో రెండు రంధ్రాలున్నాయి. కొద్దిగా సందు చేసుకొని పురుగు రెప్పల సందులోంచి లోపలికి ప్రవేశించి డొల్లచేసి వుంటుంది. తెరచి వున్న నోరు ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తున్నట్టు వుంది.

"మైగాడ్...." తనలో తనే గొణుక్కున్నాడు బ్రాహ్మిణ్ ఆ దృశ్యాన్ని చూస్తూ.

శ్రీధర్ శవంవైపు చూడటంలేదు. దాని రొమ్ములమీద పత్రాన్ని చూస్తున్నాడు. నల్లటి చర్మపు పత్రం మీద ఎర్రటి అక్షరాలు. వంగి దాన్ని పైకి తీశాడు. రక్త వర్ణంతో వ్రాసి వున్న అక్షరాలు అలుక్కుపోయి వున్నాయి. లిపి ఇంగ్లీషులో వుంది, కానీ సరిగ్గా అర్థంకావటంలేదు.

అసలిది ఇంగ్లీషా-లాటినా... లాటిన్ లాంటి ఇంగ్లీషా.

భుజం మీదనుంచి తొంగిచూస్తున్న బ్రాహ్మిణ్‌కి అందించి, "నీకేమయినా అర్థం అవుతుందేమో చూడు" అన్నాడు.

బ్రాహిణ్ కొద్దిగా తటపటాయింపుతో దాన్ని అందుకొన్నాడు. చూపుడు వేలూ, బొటనవేలూ మధ్య దాన్ని పట్టుకొని గాలిలోకి ఎత్తి చదవటానికి ప్రయత్నించేడు. బ్రాహ్మిణ్‌కి దెయ్యాలమీదా, భూతాలమీదా నమ్మకం ఎక్కువ. చేతులకి తాయెత్తులూ, మెడలో మాలలూ వేసుకుని వుంటాడు. అతడి లైబ్రరీ నిండా విచ్‌క్రాఫ్ట్, బ్లాక్‌మాస్, క్షుద్ర విద్యలకి సంబంధించిన పుస్తకాలే! అతడి పూర్తి పేరు అబ్బూరి కేదారేశ్వర బ్రాహ్మిణ్. తన పేరుని కూడా కట్‌చేసి 'అబ్రకదబ్ర' అని పెట్టుకొన్నాడు. దెయ్యాల్ని పారద్రోలే వాడ్ని జర్మనీలో 'అబ్రకదబ్ర' అని అంటారు.

తోలుమీద రాసిన అక్షరాలు అతడికి సరిగ్గా అర్థంకాలేదు. కూలీలు ఆ పెట్టె దగ్గిరే మూగి, తమలో తాము మాట్లాడుకోసాగేరు. శ్రీధర్ బ్రాహ్మిణ్ వైపు సాలోచనగా చూస్తున్నాడు. బ్రాహ్మిణ్ జేబులోంచి భూతద్దం తీసి జాగ్రత్తగా చూస్తూ చదవసాగేడు. పూర్తయ్యేసరికి అతడి మొహం అంతా చెమటలు పట్టినయ్.

"గ్రాండియెర్స్ పాక్ట్" బ్రాహ్మిణ్ అన్నాడు.

"ఏమిటిది?" శ్రీధర్ అడిగేడు.

"గ్రాండియెర్స్ పాక్ట్?"

"అంటే?"

"డాక్టర్ ఫాస్టస్ గురించి నువ్వు చదవలేదా?"

"లేదు".

"బ్రతికున్నప్పుడు సైతాన్‌ని ఆశ్రయిస్తే క్షుద్రమైన విద్యలన్నీ అలవడతాయి. దాంతో సర్వసౌఖ్యాలూ అనుభవించవచ్చు. అయితే ఇందులో ఇంకో క్లాజు ప్రకారం ఆ వ్యక్తి తన మరణానంతరం తన ఆత్మనీ, శరీరాన్నీ దెయ్యానికి అర్పించాలి. చాలా బాధాకరమైన చర్య అది. ఆ అగ్రిమెంట్‌నే గ్రాండియెర్స్ పాక్ట్ అంటారు. ఇది అదే!...."

"ఏం వ్రాసుంది అందులో?"

బ్రాహ్మిణ్ చదవసాగేడు.... "నేను నమ్మిన సైతాన్ ప్రమాణంగా ఈ పత్రాన్ని వ్రాస్తున్నాను. నేను బ్రతికున్నంత కాలమూ నాకు సకల ఐశ్వర్యాలూ ఇచ్చినందుకు కృతజ్ఞతగా నా యీ శరీరాన్ని నేనీ క్షణం నుంచీ సైతానుకి అర్పిస్తున్నాను. నేను బ్రతికున్నంతకాలమూ ప్రజలలో దేవుడిపట్ల నమ్మకం పోగొట్టటానికే ప్రయత్నిస్తాను. నా ఆత్మా, నా శరీరమూ దెయ్యానివే- ఎన్ని వేల సంవత్సరాలైనా నా శరీరాన్ని భద్రపరిచే బాధ్యత దెయ్యం (డెవిల్) తీసుకొంటుంది. నా ఆత్మ డెవిల్ సేవలో గడుపుతుంది... ఇది నా రక్తంతో వ్రాసిచ్చిన అగ్రిమెంటు-అబ్రహాం 240 బి.సి." .... దాని క్రింద జె. అబ్రహాం, జననం, మరణం తేదీలు వేసి వున్నాయి.

"రెండు వేల సంవత్సరాల క్రితంనాటి శవం" ఉద్వేగంతో బ్రాహ్మిణ్ అన్నాడు, "....ఇన్నాళ్ళకి మన కంటబడింది. ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైన సంఘటన. శవాన్ని దెయ్యం ఎంత భద్రంగా రక్షించిందో చూసేవా శ్రీధర్?" అతడి కళ్ళు మెరుస్తున్నాయి. అంతలోనే అనూహ్యమయిన భయం అతడి మొహంలో ప్రతిబింబించింది. "....ఈ శవాన్ని మనం బయటికి తీసేం- మనకేమీ ప్రమాదం లేదుకదా?" అడిగేడు.

శ్రీధర్ మాట్లాడలేదు. గ్రేండియర్స్ పాక్ట్ వైపు చూస్తున్నాడు. తమ శరీరాల్నీ, ఆత్మల్నీ క్షుద్ర దేవతలకి అర్పించుకుని జీవితాంతం సైతానుకి సేవ చేసిన వాళ్ళ గురించి అతడు ఎక్కడో చదివేడు. కానీ ఇది వాస్తవం అంటే నమ్మకం కుదరటం లేదు.

రెండువేల రెండువందల సంవత్సరాల క్రితం నాటి శవం. తనకి అర్పితమైన శరీరాన్ని సైతాన్ రక్షిస్తుందా? ఇంతకాలం అలానే రక్షిస్తూ వచ్చిందా?

శ్రీధర్ అడిగేడు "ఇప్పుడేం చేద్దాం?"

"ప్రభుత్వానికి చెప్పాలి. రేపు వార్తాపత్రికలంతా ఇదే వార్త. కాని దానికన్నా ముందు..." అతడు ఆగి అన్నాడు. "మనం శాంతి చేయించుకోవాలి. ఈ శవం వల్ల మనకేం అరిష్టం రాకుండా".

శ్రీధర్ అతడివైపు సూటిగా చూసేడు. "బ్రాహ్మిణ్! నువ్వు ఇంజనీరువి. అయినా ఈ అరిష్టాలపట్లా, శాంతులపట్లా నమ్మకం వుందా?"

"నీ ఎదురుగానే కనబడుతోందిగా నిదర్శనం".

శ్రీధర్ మాట్లాడలేదు. జీపువైపు నడిచాడు. వెనుకే బ్రాహ్మిణ్ వస్తూ "నేనూ వూళ్ళోకి వస్తాను" అన్నాడు.

అతడి కంఠంలో టెన్షన్‌ని గుర్తించాడు శ్రీధర్. స్టీరింగ్ దగ్గర శ్రీధర్, ప్రక్కనే అతడూ కూర్చున్నారు. జీపు స్టార్టు చెయ్యబోతూ వుంటే అతనన్నాడు– "రెండు వందల నలభై బి.సి ... అంటే మైగాడ్! ఇన్ని సంవత్సరాలు...."

శ్రీధర్ మెదడులో ఏదో తళుక్కున మెరిసింది. ఇగ్నిషన్ ఆఫ్ చేసి "ఏది ఆ తోలు ముక్క" అన్నాడు.

బ్రాహ్మాణ్ ఇచ్చేడు. అతడు దానివైపు ఓ క్షణం చూసి బిగ్గరగా నవ్వసాగేడు. నిమిషం తర్వాత నవ్వాపుకొని "మైడియర్ అబ్రకదబ్రా! మనల్నెవరో ఘోరంగా ఫూల్స్‌ని చేయటానికి ప్రయత్నించేరు బ్రదర్" అన్నాడు. బ్రాహ్మిణ్ అర్థంకానట్టు చూసేడు.

"ఈ అబ్రహాం అనేవాడు ఎప్పుడు చచ్చిపోయేడు?"

"240 బి.సి."

"క్రీస్తు పుట్టకముందు చచ్చిపోయిన వాడికీ బిఫోర్ క్రీస్తు అన్న విషయం ఎలా తెలిసింది? క్రీస్తుశకం అన్నది క్రీస్తుతో ప్రారంభం అయింది కదా?"

శ్రీధర్ చెబుతున్నది అర్థంకాగానే అబ్రకదబ్ర మొహం తెల్లగా పాలిపోయింది. "అంతేనంటావా?" అనడిగేడు.

"ఏం? ఇంకా అనుమానంగా వుందా?" అన్నాడు శ్రీధర్.

"నా ఉద్దేశ్యంలో యీ శవాన్ని పాతిపెట్టి పాతిక సంవత్సరాలు కూడా అయివుండదు. ఏవో కెమికల్స్ పూసి వుంచారు. అయితే నీలాటి వాడి కళ్ళపడగానే ఇంక ప్రపంచమంతా అలజడే కదా! పెద్ద పెద్ద రిసెర్చీలూ, దెయ్యాల మీద చర్చలూ! అసలు నీలాంటి వాళ్ళుండబట్టే యీ దెయ్యాల గురించి ప్రచారం చేసేవాళ్ళు బ్రతుకుతున్నారన్నది నిర్వివాదాంశము. వాడు కొంచెం ఫూలిష్‌గా ప్రవర్తించబట్టి సరిపోయిందిగానీ లేకపోతే ఈ రోజు నువ్వు కనుక్కొన్న శవం తాలూకు కథ చిలవలు పలవలుగా ప్రపంచమంతా పాకిపోయేది కదా!"

ఇంత సులభంగా అతడు చెప్పేది నమ్మాలంటే అబ్రకదబ్రకి ఏదోలా వుంది. ఎదురు వాదించటానికి ఏదో అనబోయేడు. "ఇంకేం వాదించకు. నాకు టైమైంది. ఆ చెక్కపెట్టెని పక్కనే ఇంకోచోట పాతిపెట్టించు.... నేను వెళుతున్నాను. ఏమన్నావ్ నువ్వు? గ్రాండియెర్స్ పాక్టో బ్రాండియెర్స్ పాక్టో– దాన్ని కిరసనాయిలేసి తగలెట్టు" అతడు నవ్వి జీపు స్టార్ట్ చేసేడు. అబ్రకదబ్ర అటే చూస్తూ నిలబడ్డాడు. జీపు దుమ్ము రేపుకుంటూ సాగిపోయింది. పెట్టెలో శవం మాత్రం అలానే వుంది. నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ.

* * *

తూర్పు ఎర్రబడింది. ప్రత్యూషపు లేత కిరణం ఒకటి ఎత్తైన చెట్లమధ్య కొద్దిగా సందు చేసుకొని ఆ భవనపు పురాతనమైన గోడలమీద ప్రతిబింబిస్తూంది.

అప్పుడే లేచిన పక్షులు హడావుడిగా అరుస్తూ తిండికోసం బయలు దేరటానికి ఆయత్తమవుతున్నాయి. ముందున్న తోటలో పక్షుల కలకలం లోపల గదిలోకి లీలగా విన్పిస్తూంది. శ్రీధర్ బద్ధకంగా వళ్ళు విరుచుకొంటూ టైం చూసేడు. ఆరుంపావు.

"ఉత్తిష్ఠనరశార్దూలం..." గాలిలో శారద కంఠం అలలుగా వినిపిస్తూంది.

లేచి స్లిపర్స్ తొడుక్కుని నైట్‌గౌన్ సర్దుకుంటూ పూజ గదిలోకి వచ్చేడు. గుమ్మం లోపలికి అడుగుపెట్టి అలాగే నిలబడిపోయేడు. వెనుకనుంచి ఆమె జడ మందాకినిలా వుంది. కిటికీలోంచి వస్తున్న పిల్ల తెమ్మెరకి ఆమె ముంగురులు లీలగా కదులుతున్నాయి. ఆమె కనులు మూసుకొని దేవుణ్ని ప్రార్థిస్తూంది. ఆమె మొహంలో నిశ్శబ్దం, మూసిన కనురెప్పల్లో నైర్మల్యం, అతడు ఆ తాదాత్మ్యతకి విచలితుడై అలాగే నిలబడి వుండిపోయేడు. దేవుడున్నాడా లేడా అన్నది వేరే విషయం. నైర్మల్యం వుంది. పవిత్రత వుంది. నమ్మకం ఈ రెంటినీ ఇస్తుంది.

ఆమె పూజ ముగించి, వెనుకనుంచి పడుతున్న నీడని గమనించి "అయ్యో!...." అంటూ వెనుదిరిగి "స్నానం చెయ్యకుండా పూజ గదిలోకి వచ్చేసేరా?" అంటూ అంతలోనే అతడి చెప్పుల్ని చూసి మరింత కంగారుపడి "ఆ చెప్పుల్తోనే లోపలికి...." అంటూ లేచింది.

అతడు బయటకు అడుగులేస్తూ "మరి నువ్వు రా బయటకి...." అన్నాడు.

"స్నానం చెయ్యండి, ప్రసాదం తీసుకొందురుగానీ."

"ప్రసాదం ఇస్తే– స్నానం చేస్తాను" నవ్వేడు.

ఆమె చిరుకోపంతో "వయసు పెరుగుతున్నకొద్దీ ఏమిటీ చిన్నతనపు చేష్టలు" అంది.

"వయసు పెరిగిందా? ఏం పెరిగింది? ఐ హావ్ నాట్ ఎట్ బికమ్ ఏ ఫాదర్" అన్నాడు.

ఆమె మొహం క్షణంలో వెయ్యోవంతు వాడిపోయింది. దాన్ని బయటికి కనపడనీయకుండా నవ్వుతూ "అయితేనేం మన పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలైంది" అంది.

"వయసు శరీరాన్నీ కాలాన్నీ బట్టి పెరగదు. మనసుని బట్టి వుంటుంది! ఆ కోణంలో ఐయామ్ వెరీ యంగ్. నువ్వే ఇలా పూజలూ, వ్రతాలూ చేసి ముసలిదానివై పోతున్నావు".

"ముసలిదాన్నైపోతే ఇంకో పెళ్ళి చేసుకొని...." ఆమె మాట మధ్యలోనే ఆపుచేసి కెవ్వున అరిచింది.

శ్రీధర్ శారద చెవిని మరింతగా మెలిపెడుతూ "ఏదీ మళ్ళీ అనూ" అన్నాడు.

"చెప్పులు.... చెప్పులు.... పూజగది" అందామె అతణ్నుంచి విడిపించుకోవటానికి ప్రయత్నిస్తూ "బయటకెళ్ళండి".

అతడామెని వదుల్తూ "వెళ్ళాలిలే, కొంచెంసేపుంటే పూజగది పడకగది అయ్యేట్టు వుంది తెల్లవారురుఝామునే" అంటూ బయటకు వచ్చేడు.

"తెల్లవారురుఝామా? ఏడయింది" అంది ఆమె అతడితోపాటే బైటకొస్తూ "తొందరగా స్నానంచేసి దేవుడిముందు నిలబడి లెంపలేసుకోండి. ప్రొద్దున్నే పూజగదిని అపవిత్రం చేసేరు".

అతడు అమాయకంగా దేవుని విగ్రహంవైపు తిరిగి "సకల చరాచర సృష్టి స్థితి లయకారుడా! నీ ముందు సృష్టి కార్యం గురించి మాట్లాడటం అపవిత్రం ఎలా అవుతుందయ్యా?" అన్నాడు.

ఆమెకు నవ్వొచ్చింది. అది అతడికి కనబడితే మరింత ప్రమాదం జరుగుతుందని "చాల్చాలు.... దేవుడితో అలా మాట్లాడితే కళ్ళుపోతాయి" అంది లోపలికి వెళ్ళిపోతూ.

"శారదా!" అన్నాడు. ఆమె ఆగింది.

"దేవుడున్నాడంటావా?"

ఒక్కక్షణం భయంకరమైన నిశ్శబ్దం ఆ గదిలో తాండవించింది. ఆమెకెందుకో ఆ ప్రశ్న అపశృతిలా వినిపించింది. తన అలజడిని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తూ, నవ్వి "ఆ అనుమానం ఎందుకొచ్చింది?" అంది.

"నాకెప్పుడూ కనపడలేదులే! అందుకని".

"దేవుడు వెనకుండే మనని ఆడిస్తాడండి- అతన్ని భక్తితో పూజిస్తే మనకే లోటూ చెయ్యడు".

"నీకే లోటూ చేయలేదా?"

ఆమె అతడి దగ్గరగా వచ్చి, అతడివైపు ఆప్యాయంగా చూసింది.

"ఈ దేవుణ్ని నాకిచ్చి ఆ దేవుడు నాకు ఏ లోటూ చెయ్యలేదండీ!"

శ్రీధర్ నవ్వేడు. "ఇన్ని పూజలు చేస్తున్నావ్ కదా! మరి నీ కడుపున ఓ నలుసుని పడెయ్యడేం?"

"మనమీద ఇంకా దయ రాలేదేమోనండీ".

అతడు చిలిపిగా నవ్వి "పిల్లలు పుట్టటానికి దేవుడి దయొక్కటే సరిపోతే ఇక 'మేమంతా' ఎందుకు?" అన్నాడు. 'మేము' అన్న పదాన్ని నొక్కిపలుకుతూ.

ఆమె కోపంగా "ఊఁ" అంది.

"సరే అయితే" పందెం కాస్తున్నట్టు అన్నాడు. "నువ్వు దేవుణ్ని ఇంకా భక్తితో ప్రార్థించు. రేపే నేను వేసక్టమీ ఆపరేషన్ చేయించుకొంటాను. ఆ దేవుడు పాపనెలా పుట్టిస్తాడో చూద్దాం".

ఆమె చిగురుటాకులా వణికిపోయి, అతడి నోటిని చేత్తో మూస్తూ "అంతమాట అనకండీ-తథాస్తు దేవతలుంటారట" అంది ఆందోళనగా.

అతడు తేలిగ్గా నవ్వేడు. గడియారం ఏడు కొట్టింది.

* * *

"అన్నయ్యా! ఒక్కసారి తొందరగా రా" పరిగెత్తుకుంటూ వచ్చింది అనిత.

చదువుతున్న పుస్తకం పక్కనపెట్టి "ఎక్కడికి?" అడిగేడు శ్రీధర్.

"చెప్తాగా రా" అంది వెనక్కి తిరుగుతూ.

రాత్రి తొమ్మిదయింది. వర్షం వచ్చే సూచనలు కనబడుతున్నాయి. గాలికి కిటికీ తలుపులు వూగుతున్నాయి. ఆకాశం మేఘావృతమై వుంది. దూరంనుంచి హోరుమని చప్పుడు చేస్తూ వస్తున్న గాలి వెన్నులోంచి చలి పుట్టిస్తూంది. ఎక్కడో సముద్రంలో వాయుగుండం ఏర్పడినట్టూ.... ఒక భయంకరమైన ప్రళయాన్ని సూచిస్తున్నట్టుగా వుంది వాతావరణం.

అతడు కిటికీ తలుపులు వేసి బైటకి వచ్చేడు. మెయిన్ హాలు లైట్లు వెలుగుతున్నాయి. మేడమీద నుంచి దిగబోతూ ఆగేడు. హాలులో మధ్యగా

సోఫాసెట్టు, మధ్యలో బల్ల, పెద్ద సోఫాల్లో భార్య కూర్చొని వుంది. ప్రక్కనే స్టూలు లాక్కొని అనిత కూర్చొని వుంది. ఎదురుగా నారాయణరావు వున్నాడు.

శ్రీధర్ వీళ్ళని చూడటంలేదు. అతడి దృష్టి మధ్యలో వున్న స్టూలు మీద పడింది. ఆ స్టూలుమీద చదరంగం అట్టలాంటిది వుంది. అలికిడికి తలెత్తి చూసిన అనిత "రా, రా!... నీ కోసమే ఆగేం" అంది. అతడు క్రిందికి దిగేడు.

"ఏమిటిది?"

"మనింటికి దెయ్యం వస్తుందిట" అంది శారద నవ్వుతూ. "మీ చెల్లెలు స్కూల్లో ఏదో నేర్చుకు వచ్చి మనకి చూపిస్తుంది" అంది.

శ్రీధర్‌కీ అనితకీ మధ్య పధ్నాలుగేళ్ళ తేడా.

"దెయ్యం ఏమిటి?" అని వచ్చి కూర్చుంటూ బల్లమీద వున్న అట్టని చూశాడు.

అవుజా బోర్డ్!

తనలో తననుకున్నాడు. అనిత ఎప్పుడూ అంతే. ఏదో ఒక కొత్త విషయం తీసుకొచ్చి ఇంట్లో అందర్నీ ఎంజాయ్ చేయిస్తూ వుంటుంది.

అతడు ఈ బోర్డ్ సంగతి తనకి తెలియనట్టు నటిస్తూ మొహం మామూలుగా పెట్టి కుర్చీ లాక్కొని కూర్చుని "ఏమిటది- చెప్పు" అని అడిగాడు.

"గాలిలో దెయ్యాలుంటాయి తెలుసా?" అని అడిగింది.

ఆమె అమాయకమైన మొహంకేసీ, పెద్ద కళ్ళకేసీ చూస్తూ "గాల్లో అన్నమాట ఏమిటి? మనుషుల్లోనూ వుంటాయి" అన్నాడు.

అనిత కోపంగా "అదిగో మాట మారుస్తున్నావ్" అంది.

"మార్చన్లే చెప్పు".

"దీనిమీద వేలుపెట్టు" అంది చిన్న ప్లాస్టిక్ ప్లేటు యిస్తూ, అది క్యారమ్‌బోర్డ్ స్ట్రైయికర్‌లా వుంది.

"పెట్టి?"

"కళ్ళు మూసుకోండి అందరూ, నేనో ప్రశ్న అడుగుతాను ఎవరూ తోయకూడదు. ఊరికే వేళ్ళు పెట్టి వూరుకోవాలంతే. ఆ బిళ్ళ దానంతట అదే ఆన్సర్ చెబుతుంది".

శ్రీధర్ నవ్వి "ఎలా చెబుతుంది?" అని అడిగాడు.

"చెప్పేగా! గాలిలో ఆత్మలుంటాయని. అవి బిళ్ళని తోస్తాయి".

శారద ఉత్సాహంగా ముందుకు వంగి బోర్డుని చూస్తూంది. నారాయణరావు మొహంలో ఏ భావమూ లేకుండా కూర్చుని వున్నాడు.

ఇంత చిన్న వయస్సులో యింత గాంభీర్యత ఎలా సంపాదించాడు? నోటివెంట బయటకి రాలేని మాట గుండెలలో నిశ్శబ్దంగా నిక్షిప్తమై పోయిందా?

శ్రీధర్ చెల్లెలి వైపు చూశాడు. "ఏం ప్రశ్న అడుగుతావ్?"

"ముందు వేలు పెట్టు".

అతడు నవ్వుతూ చూపుడు వేలుని బిళ్ళమీద ఆన్చేడు. "ఊఁ అంతా" అంది అనిత పట్టలేని హుషారుతో. మిగతా ఇద్దరూ వేళ్ళు పెట్టారు.

చితిలో కాలుతున్న శవం మధ్యలో పైకి లేవకుండా కర్రలతో నొక్కి పెట్టినట్టూ స్ట్రయికర్ మీద వేళ్ళు.

"అందరూ కళ్ళు మూసుకోండి" అంది అనిత. ఆమె కంఠం ఎగ్జయిట్‌మెంట్‌తో వణుకుతోంది. నలుగురూ కళ్ళు మూసుకున్నారు.

"..... అందరూ ఎవరో ఒకర్ని చనిపోయిన వాళ్ళని తల్చుకోండి". అతడికి తల్లి జ్ఞాపకం వచ్చింది, తండ్రి జ్ఞాపకం వచ్చాడు. తండ్రి 'అవునంటే' తను 'కాదనే' తల్లి. ఇప్పుడు ఈ బిళ్ళని తోయటానికి కూడా ఆ ఇద్దరి ఆత్మలూ బ్రతికి ఉన్నప్పటిలాగానే దెబ్బలాడుకుంటాయా?

అతనికి నవ్వొచ్చింది.

మాటిమాటికీ ఎందుకు నవ్వొస్తుంది! అదంత మంచిదికాదు.

"అలా తల్చుకొంటూనే వుండండి. నేను ప్రశ్న అడుగుతున్నాను, కళ్ళు తెరవకండి". అనిత కళ్ళు మూసుకొనే ఏదో ప్రార్థిస్తూంది. ఆత్మని ప్రార్థిస్తుందా? ఆత్మంటే చనిపోయినవాడి మనసు. మనిషి చచ్చిపోతే ఆత్మ దేవుణ్ని చేరుకొంటుంది. లేకపోతే దెయ్యం అవుతుంది. (రెండే మార్గాలు). మరి ఆత్మ ఇప్పుడు వస్తుందంటే అది దేవుణ్ని చేరుకో లేదన్నమాటేగా? అంటే దెయ్యం అయిందన్నమాట...

దెయ్యాన్ని ప్రార్థించటం.

దూరంగా ఉరుముతోంది. గాలి రివ్వున వీస్తూంది. ఎక్కడో పిడుగు పడిన చప్పుడు. ఇల్లంతా నిర్మానుష్యంగా వుంది. రామయ్య అలికిడి వినిపించటంలేదు.

గాజు అద్దాలలోంచి బయట జల్లు శవంమీద విసిరిన పువ్వుల్లా పడుతూంది.

అనిత ప్రశ్న అడిగింది- "నేను పాసవుతానా?"

అందరూ బిళ్ళమీద వేలుపెట్టి వుంచారు. ఒక్కక్షణం, రెండు క్షణాలు- నిమిషం- గడిచాయి. అనిత వేలుతో బిళ్ళని తొయ్యటానికి ప్రయత్నించింది. శ్రీధర్

వేలిక్రింద అది కదలటంలేదు. అతడికి నవ్వొస్తూంది. కానీ ఆ నవ్వు చూస్తే చెల్లెలు ఉక్రోషంతో ఉడుక్కుంటుందని బిగపట్టాడు.

ఇంకో అర నిమిషం గడిచింది. అనిత అకస్మాత్తుగా "ఇక్కడెవరో దెయ్యాన్ని నమ్మని వాళ్ళున్నారు" అంది.

శారద భర్తవైపు చూసింది. శ్రీధర్ నవ్వి వేలు తీసేస్తూ "నేనే" అన్నాడు. "మీ ముగ్గురూ ఆడండి".

మళ్ళీ ముగ్గురూ కళ్ళు మూసుకున్నారు. అనిత అడిగింది- "నేను పాసవుతానా?"

ఒక్కక్షణం నిశ్శబ్దం.

కిటికీ తెరలు నెమ్మదిగా కదిలినయ్.

"అదిగో దెయ్యం వస్తూంది" అన్నాడు శ్రీధర్. ఎవ్వరూ మాట్లాడలేదు. అతడు బిళ్ళని చూశాడు.

అది కదులుతోంది. నెమ్మదిగా - నెమ్మది నెమ్మదిగా - మీదున్న మూడు వేళ్ళనీ మోసుకుంటూ కదులుతూంది.

అనిత కళ్ళు తెరచి బిళ్ళ స్థానభ్రంశాన్ని పొందటం చూసి ఎగ్జయిట్‌మెంట్‌తో ఊపిరి బిగపట్టి, మళ్ళీ కళ్ళు మూసుకుంది.

అనిత అమాయకురాలు, లోకజ్ఞానం తెలియనిదీ కావొచ్చు. కానీ డామ్ ఇంటెలిజెంట్. ఒక దెయ్యం కాదు వంద దెయ్యాలు కల్సినా అనితని పరీక్ష ఫెయిల్ చేయించలేవు.

అతడు కళ్ళు చిట్లించి చూశాడు.

బిళ్ళ అవునూ కాదూ వైపు కాకుండా 'మూడు' అంకె వైపు వెళుతుంది. ఇదేదో కన్‌ఫ్యూజియస్ తాలూకు దెయ్యం అయి వుంటుంది.

అనిత మూడు సంవత్సరాల వరకూ పాసవదా? ఇదిచూస్తే ఏడుపు వదిలిపెట్టదు. అతడు చెల్లెలివైపు చూశాడు. కనురెప్ప కొద్దిగా తెరిచి బిళ్ళ ఎటువైపుకు వెళుతున్నదీ చూస్తున్నదల్లా, అన్నయ్య తనని గమనిస్తున్నాడని తెలియగానే చప్పున మూసేసుకొంది. బాగా నవ్వొచ్చింది అతడికి.

ఆమె వేలుతో దాన్ని "అవును" వైపు తొయ్యాలని చాలా క్యాజువల్‌గా ప్రయత్నం చేస్తూంది. మరి బిళ్ళ 'మూడో' వైపు కెందుకు వెళుతోంది?

అతడు నారాయణరావు వైపు చూశాడు.

అతడి పెదవి కొద్దిగా వంగి చిరునవ్వుని సూచిస్తూంది. ఎప్పుడూ నవ్వని అతడి మొహంలో నవ్వు ఈసారి చిత్రంగా వుంది. అతడి వేలివైపు చూశాడు. చూపుడువేలు మీద నరం కదులుతోంది. కండరం బిగుసుకుంది. అంటే అతడు ఫోర్స్ వుపయోగిస్తున్నాడన్నమాట!

'కాదు' వైపు.

అనిత ఫేలవ్వాలి. నారాయణరావు చదువుకోలేదు. మూగ, చెవిటి పాఠశాలలో కూడా చదువుకోలేదు. అనిత పాసవటం అతడి కిష్టంలేదు.

మూగవాడు ప్రేమకి అనర్హుడని ఎవరన్నారు? ఆ మాటకొస్తే ప్రేమే మూగది.

బిళ్ళ మూడుని దాటింది. 'ఎ' వైపు కదులుతూంది.

అనిత బలం అంతా ఉపయోగించి అవును వైపు తొయ్యటానికి ప్రయత్నం చేస్తూంది, అయినా బిళ్ళ పైకే వెళుతోంది.

శ్రీధర్‌కి చప్పున ఒక విషయం అర్థమైంది.

న్యూటాన్ చలన సూత్రం ప్రకారం రెండు పరస్పర విరుద్ధమైన పథంలో పయనిస్తూన్న శక్తులు దిశని మార్చుకుంటాయి.

బిళ్ళ అట్టమీద నుంచి కిందికి జారిపోవటంతో అందరూ కళ్ళు తెరిచారు.

"ఈ దెయ్యం బ్యాలెన్స్ లేని దెయ్యం అయి వుంటుంది. మళ్ళీ ఇంకోసారి ట్రై చెయ్యి" అన్నాడు శ్రీధర్ చెల్లెలివైపు చూస్తూ. అప్పటికే అనిత మొహం ఉక్రోషంతో ఎర్రబడింది.

చెల్లెలి నిరాశను గమనించిన శ్రీధర్ "ఈ వేళ్ళు పెట్టి కదపటం లేకుండా దాన్నంతట దాన్నే కదిల్చే దెయ్యం నాకు తెలుసు" అన్నాడు.

గదిలో ఒక్కసారిగా చైతన్యం వచ్చింది. అనిత ఉత్సాహంగా "ఎలా?" అంది.

గదిలో ఒక మూల ఫ్లవర్‌వాజ్ దగ్గర నిలబడ్డ రామయ్యతో ఒక పెద్ద పళ్ళెం, స్టవ్ తెమ్మన్నాడు శ్రీధర్. అందరూ అతడివైపు ఆసక్తిగా చూస్తూవుంటే పళ్ళెంలో నీళ్ళు పోసి అందులో స్ట్రా పెట్టాడు. ఒక నిమిషం గడిచింది.

"ఏం జరుగుతుంది ఇప్పుడు?" ఆతృత పట్టలేక అడిగింది అనిత.

"దెయ్యం వస్తోంది. అదిగో చూడు".

అందరూ కిటికీవైపు చూశారు. ఎర్ర కర్టెన్ గాలికి అలలు అలలుగా ఊగుతూంది.

"నిజంగానా?" అంది అనిత నమ్మలేనట్లు.

"చూడు! దానంతట అదే స్టౌని కదుపుతుంది" అన్నాడు శ్రీధర్ గంభీరంగా.

అనిత స్టౌనే కన్నార్పకుండా చూస్తూంది.

"చెప్పు దెయ్యం... మా అనిత పాసవుతుందా? పాసయ్యేటట్టయితే ఒకసారి- అవనట్టయితే రెండుసార్లూ కొట్టు".

"ఏమిటీ?" అరిచింది అనిత. "అదే చెబుతుందా?"

"ఆహా.... అదే చెబుతుంది చూడు".

అనిత ఎక్సయిట్‌మెంట్ పట్టలేక కుర్చీలోంచి లేచి నిలబడింది. కుర్చీ కోడుని బిగించి పట్టుకున్న ఆమె చేతిని చూస్తూంటే ఆమె ఎంత టెన్షన్‌గా వుందో తెలుస్తూంది. క్షణాలు నెమ్మదిగా గడుస్తున్నాయి.

"చెప్పు దెయ్యమా? స్టౌని పైకి కదల్చటం ద్వారా చెప్పు.... మా అనిత పాసవుతుందా?"

చాలా గాఢమైన నిశ్శబ్దం. అసహనంగా కదలబోయిన శారద చప్పున ఆగిపోయింది. స్టౌ కదుల్తూంది! ఆమె వూపిరి బిగపట్టింది.

అనిత విషయం అయితే అసలు చెప్పనక్కర్లేదు.... కుర్చీలోంచి దాదాపు గెంతబోతూంది. ఏ భావమూ లేకుండా చూస్తున్నది నారాయణరావు ఒక్కడే.

స్టౌ నీళ్ళలో ఒకసారి లేచిపడింది.

"కంగ్రాచ్యులేషన్స్...." అన్నాడు శ్రీధర్ చెల్లెలివైపు చూస్తూ. ఆమె ఈ అభినందనల్ని స్వీకరించే స్థితిలో లేదు. థ్రిల్‌తో మనసు నిండిపోయింది.

"ఏ క్లాస్‌లో పాసవుతాను....? ఫస్ట్ క్లాసయితే ఒకసారి, సెకెండ్ క్లాసయితే రెండుసార్లు, థర్డ్ అయితే మూడుసార్లూ" అంది అనిత. మళ్ళీ నిశ్శబ్దం.

అరనిమిషం తర్వాత స్టౌ ఒకసారి కొట్టింది.

ఈసారి అందరూ అనితకి కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు.

అనిత దీని గురించి ఆలోచించటంలేదు. రేపు ఈ విషయం స్కూల్లో చెబితే వచ్చే థ్రిల్ గురించి ఆలోచిస్తున్నది. దానంతట అదే కదిలే స్టౌ... ప్రపంచంలో ఎనిమిదో వింత...! తమ ఇంటికి దెయ్యం వచ్చిన సంగతి స్కూల్లో అందరికీ తెలియటం, వాళ్ళు తనని ప్రశ్నలడుగుతూ వుండటం వూహించుకుంటోంది.

ఆమె ఆలోచనలో వుండగానే శ్రీధర్ లేచి "ఇక చాలు" అన్నాడు. అక్కడనుంచి వెళ్ళిపోవటానికి సిద్ధమవుతూ.

"ఒక ప్రశ్న" అంది అనిత.

"ఆఖరిది, అడుగు" అన్నాడు శ్రీధర్.

అనిత స్టౌ వైపు ఉత్సుకంగా చూస్తూ "వదినకి పాపెప్పుడు పుడుతుంది? ఒక సంవత్సరమా? రెండు సంవత్సరాలా?" అంది.

శారద మొహం తెల్లగా పాలిపోయింది. ఈ టాపిక్ వచ్చినందువల్ల ఆందోళనంగా చూశాడు శ్రీధర్. నారాయణరావు అలానే కూర్చొని వున్నాడు.

స్టౌ కదల్లేదు.

శ్రీధర్ లేస్తూ "అనితా...! టైమయింది... ఇక చదువుకో..." అన్నాడు.

"అబ్బా! ఇంత వర్షం కురుస్తుంటే చదువేమిటి బాబూ! ఈ చలిగాలిలో వేడి వేడి పకోడీలు తింటే..." అంటూ సపోర్టు కోసం వదినకేసి చూసింది.

శారద మాట్లాడే మూడ్‌లో లేదని గ్రహించి శ్రీధర్- "కోడీలేదు, పకోడీలేదు. వెళ్ళిపడుకో..." అని తన గదిలోకి వెళ్ళిపోయాడు. శారద అతన్ని అనుసరించింది. సడెన్‌గా అక్కడున్న వాతావరణంలో ఏదో మార్పు వచ్చినట్టు గ్రహించి అనిత మరి మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

అనిత గది ఆ ఇంటి మేడమీద వరండాలోకి వెనుకవైపు వుంది. ఆ గది కిటికీ దగ్గర కూర్చుంటే బంగ్లా వెనుకవైపు అంతా కనబడుతుంది.... ఆమెకు రాత్రిళ్ళు అక్కడ కూర్చుని బయటకు చూస్తూ వుండిపోవటం అలవాటు. ఆ రాత్రి ఆ దృశ్యం చాలా భయంకరంగా వుంది. విసురుగా వీస్తున్న గాలికి దూరంగా వేపచెట్టు 'దెయ్యం పట్టిన దానిలా' అటూ యిటూ వూగుతోంది. మెరిసినప్పుడల్లా జల్లు తెల్లగా మెరుస్తూంది. మూసి వున్న అద్దాల అవతల్నుంచి గాలి విసురు తెలుస్తూంది. చీకట్లోకి చూస్తూ కూర్చోవటం అలవాటయ్యాక టైం తెలీదు. ఆమెవి పెద్ద ఆలోచనలేమీ కావు. అమాయకమయిన ఆలోచనలు. దెయ్యం దయతల్చి వదినకో పాపని పుట్టిస్తే.... దెయ్యం దయతల్చి బావకి మాటలు తెప్పిస్తే....

గది గుమ్మం దగ్గర చప్పుడయితే చప్పున తల తిప్పి చూసింది, నారాయణరావు....

గుమ్మాన్ని పట్టుకొని అలానే చూస్తూ నిలబడ్డాడు. ఆమెకూడా కూర్చున్న చోటునుంచి కదల్లేదు. అతడి మొహం భావరహితంగా, పేలవంగా వుంది. నిస్తేజమైన కళ్ళు ఎప్పుడూ ఏదో విపత్తును సూచిస్తున్నట్టే వుంటాయి. ఆ కళ్ళలో జాలితో కూడిన అభ్యర్థన, ఆమెకి జాలేస్తుంది.

జాలి ప్రేమ కాదా?

ఆమె తేరుకొని 'రా బావా...' అనబోయింది. అంతలోనే అతడు అక్కడినుంచి కదిలి వెళ్ళిపోయాడు. ఆమె అలాగే కూర్చొని వుంది. గదిలోని నిశ్శబ్దం భయంకరంగా తోచింది. వెళ్ళి టేప్‌రికార్డర్ ఆన్ చేసింది. ఆమెకి ముఖేష్ పాటలంటే యిష్టం.

సన్నగా పాట వినిపిస్తోంది.

ఆమె పక్కమీద వాలి, పైకప్పుకేసి చూస్తూ పడుకుంది. దూరముగా చెట్టుకొమ్మ విరిగిన చప్పుడు, మళ్ళీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోంచి సన్నగా పాట!

"జానే చలే జాతేహై కహాఁ.....దునియాసే జానేవాలే..." (వెళ్ళిపోయిన వాళ్ళంతా ఎక్కడికి వెళుతున్నారు? ఈ ప్రపంచంనుంచి వెళ్ళిన వాళ్ళంతా...)

ఆమె కెందుకో ఆ సమయంలో ఆ పాట రావటం అంత బాగా అనిపించలేదు.

* * *

అదే టైమ్‌కి గదిలో శ్రీధర్ శారదని అడుగుతున్నాడు. "ఎందుకు ఉన్నట్టుండి మూడ్‌లో లేవు?"

ఆమె మాట్లాడలేదు. "పాప ప్రసక్తి వచ్చినందుకేనా?"

దీనికి కూడా ఆమె మాట్లాడలేదు. ఆమెను గుండెల మీదికి తీసుకుని, ముంగురులు సర్దుతూ "నువ్వీ విషయం గురించి ఎందుకింత వర్రీ అవుతున్నావో అర్థంకావటంలేదు" అన్నాడు.

"అబ్బే! అదేం లేదండీ. ఈ రోజంటే ఆ స్పిరిట్..."

"ఏ స్పిరిట్?"

"ఆ స్టవ్‌ని ఆవహించిన స్పిరిట్–"

ఆమె తలని అలాగే గుండెలమీద పట్టుకొని అతడు నవ్వసాగేడు. ఆమె లేచి అతనివైపు చూడసాగింది. చాలాసేపు నవ్వి "అనిత అంటే అనుకోవచ్చు. నువ్వూ నమ్మేశావా?" అన్నాడు.

ఆమె అర్థంకానట్లు "అంటే?" అంది.

"అదే....స్టౌ కదల్టాన్ని".

"కదిలింది కదా" అందామె.

అతడు నవ్వి "బియ్యేస్సీ చదివేవు. ఆ మాత్రం సైన్స్ తెలీదా?" అన్నాడు. ఆమె మాట్లాడలేదు.

శ్రీధర్ అన్నాడు–

"స్టౌ పెట్టినప్పుడు క్రింద గాలి వుంటుంది. వెలిగించినప్పుడు అది వేడెక్కి నీటి క్రిందినించి బయటికి రావటానికి ప్రయత్నిస్తుంది. అందుకే స్టౌ ఎగిరెగిరి పడుతుంది. మనం చెయ్యాల్సిందల్లా అది ఎగరబోయే సమయానికి ప్రశ్న అడగటమే".

ఆమె ఏదో మాట్లాడబోయి వూరుకుంది. అతడే అన్నాడు– "శారదా! మనిద్దర్నీ డాక్టర్లు పరీక్షించారు. ఏ లోపమూ లేదన్నారు. మనం చెయ్యవలసిందల్లా టైమ్ కోసం వేచి వుండటమే. టైమ్ ఫర్ ఫెర్టిలిటీ–"

ఆమె అతడి మెడచుట్టూ చేతులు వేసింది. గదిలో నీలిరంగు సబ్‌ట్యూబ్ లైటింగ్ పరచుకొని వుంది. తెల్లవారుఝామునే సుప్రభాతాన్ని పఠించే పెదవులు రాత్రవగానే చాలా అల్లరి చేస్తాయి. అతడికి చాలా నచ్చేది అది. ఒకే స్త్రీలో రకరకాల స్త్రీలు– శరీరం మీద వయసు అల్లరి, పెదవుల మధ్య నాలుక అల్లరి. ఎంతసేపో టైమ్ తెలియదు. కేవలం పెదవులతోనే గంటలకొద్దీ ఆడుకుంటూంటే మిగతా శరీరం చేస్తున్న స్ట్రైయిక్. తిరగబడే ప్రవాహపు హోరు, బయట అద్దాన్ని బలంగా తోసే వర్షం, స్థిరంగా నిలబడ్డ కొండ శిఖరం, ఎగిసిపడే సముద్రం, ఉవ్వెత్తున ఎగిరిపడుతూ వచ్చి శిఖరాన్ని ముట్టడించి చల్లగా జారిపోయే కెరటం, నగ్నంగా వున్న వీపుమీద నాట్యం చేస్తున్న వేళ్లు.... గుచ్చుకొనే గోళ్ళు... రహస్యాన్ని శోధించే చేతులు.... నవ్వే కళ్ళు.... అరమోడ్పులయిన కనురెప్పలు.... వెంట్రుకల మధ్య చిక్కుకొన్న మల్లెమొగ్గ, నలిగి వాడిపోయి, ఆ వాడిపోవటంతో అస్థిత్వాన్ని పొందిన మల్లెచెండు, పుణ్యం కట్టుకొన్నవి పళ్ళో, వేళ్ళోగాని చెక్కిలి మీదకు వచ్చి చేరిన నెలవంక– టైమ్ ఫర్ ఫెర్టిలిటీ.....

వర్షం వెలిసింది. దూరంగా ఎక్కడో కప్పుమీద నుంచి ఒక్కో నీటిచుక్కా పడుతూన్న చప్పుడు. "థ్యాంక్యూ శ్రీ".

"దేనికీ?"

"ఫర్ ది ఎంజాయ్‌మెంట్ యూ ఆల్వేస్ గివ్" అన్నదామె.

అతడు మాట్లాడలేదు. దట్టమయిన తలవెంట్రుకలమధ్య మొహాన్ని దాచుకొంటే ప్రపంచంలో బాధలన్నిటినీ మరిపించే నిశ్చింత. అయిదు నిమిషాల తరువాత అతడు అలసట నుంచి తేరుకొని ఆమెవైపు చిలిపిగా చూసి– "దటీజ్ సైంటిఫిక్ వే ఆఫ్ టాకిలింగ్ ఎ గర్ల్" అన్నాడు.

ఆమె నవ్వలేదు "సైన్స్" అంది ఏదో ఆలోచిస్తున్నట్టూ. కీ ఇవ్వని గడియారం ఆగిపోయింది. దూరంగా ఏదో పిట్ట అరుస్తోంది ఆగి ఆగి.

"శ్రీ..."

"ఊఁ..."

"స్టవ్ క్రిందున్న గాలి వేడెక్కి స్టవ్‌ని పైకి తోస్తుంది. అంతేగా, అదేనా సైన్స్!"

"ఆహా..."

"స్టవ్‌ని వెలిగిస్తే ఆ వేడికి...." ఆమె అర్థోక్తిలో ఆపింది.

"అవును."

"నువ్వడగ్గానే రామయ్య స్టౌ తీసుకొచ్చి నీళ్ళలో పెట్టాడు. వెంటనే నువ్వు ప్రశ్నలు అడగటం మొదలుపెట్టావు. కానీ శ్రీ..."

"ఊఁ..."

"స్టవ్‌ని ఎవరు వెలిగించారు?"

శ్రీధర్ నిశ్చేష్టుడయ్యాడు.

దూరంగా గాలిలో నారాయణరావు మౌత్ ఆర్గన్ ధ్వని అలలు అలలుగా వినిపిస్తూంది.

* * *

శ్రీధర్ జె అండ్ జె కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఇంజనీరు. ఆ కంపెనీ డైరెక్టర్లలో ఒకడు. జె అండ్ జె కన్‌స్ట్రక్షన్ కంపెనీ దాదాపు యాభై ఏళ్ళ క్రితం ఒక బ్రిటిష్ కంపెనీకి సబ్‌సిడరీగా స్థాపించబడింది. తరువాత అది నేషనలైజ్ చేయబడింది.

శ్రీధర్ తండ్రి అదే కంపెనీలో ఫోర్‌మెన్‌గా పని చేసేవాడు. అందువలన శ్రీధర్ ఇంజనీర్ అవగానే ఆ కంపెనీలో ఉద్యోగం రావటం పెద్ద కష్టం కాలేదు.

అప్పుడు ఆ ఫ్యాక్టరీలో పెద్ద స్ట్రైయిక్ జరిగింది. నెలరోజుల సంప్రదింపుల తర్వాత యాజమాన్యానికీ, వర్కర్లకీ రాజీ కుదిరింది. ఆ పరిష్కారం ప్రకారం కార్మికుల తరఫున ఒకరు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ప్రాతినిధ్యం వహించాలి.

ఆ బాధ్యత శ్రీధర్‌కి ఒప్పజెప్పబడింది. అతను డైరెక్టరయ్యాడు.

ఆ సంవత్సరమే జె అండ్ జె రెండు కోట్లకు ఒక థర్మల్ స్టేషన్ కాంట్రాక్టు టెండర్ సంపాదించి అనుకున్న టైమ్‌లో దాన్ని పూర్తిచేసి దాదాపు ముప్ఫై లక్షలు సంపాదించింది.

ఈ సంఘటన అతడి జీవితాన్ని మార్చేసింది. ఏదో ఎస్టేటు అమ్మకం జరుగుతూంటే పెద్ద బంగళాని చౌకలో కొన్నాడు. ఇరవైవేలు పెట్టి శుభ్రం చేయించి రంగులు వేయించాడు. తండ్రి పోవటం, శారద గృహిణిగా రావడం జరిగింది.

అతడి జీవితం వడ్డించిన విస్తరి. అయితే ఆ విస్తరిలో అన్ని పదార్థాలు రావటానికి అతడు జీవితపు ప్రారంభంలోనే చాలా కష్టపడ్డాడు. ఒక్క పిల్లల్లేరన్న బాధ తప్ప ఇంకేమీలేదు ఇప్పుడు.

* * *

వెళ్ళిన అరగంటకి పిలుపు వచ్చింది శ్రీధర్‌కి ఆఫీసు నుంచి. వస్తుందని తెలుసు.

మేనేజింగ్ డైరెక్టర్ రాబర్ట్ ఫిన్స్ విశాలమైన గదిలో కూర్చొని వున్నాడు. అతడికి అరవై ఏళ్ళుంటాయి. అయినా దృఢత్వం తగ్గలేదు. ముడతలు పడ్డ చెక్కిళ్ళు, తెల్లటి జుట్టు. రెండు ఎయిర్ కండీషనర్లు చప్పుడు చెయ్యకుండా పనిచేస్తున్నాయి. వెనీషియన్ బ్లైండ్స్ వెనుకనున్న అద్దాలమీద నీడ సరళరేఖలా పడుతూంది.

"హౌ ఆర్యూ శ్రీధర్?"

"థ్యాంక్యూ సర్ - ఫైన్".

పైపులో నుసి ఆష్‌ట్రేలో వేస్తూ అన్నాడు. "యూనియన్‌కి రిజైన్ చేశావటగా?"

అతడు మాట్లాడలేదు.

"చాలా మంచిపని చేశావు".

అతడు విభ్రమంతో తలెత్తి చూశాడు. మేనేజింగ్ డైరెక్టర్ ఒక క్షణం మౌనంగా వుండి చెప్పటం మొదలుపెట్టేడు "మెక్‌డోనాల్డ్ రాజీనామా చెయ్యటంతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టు ఖాళీ అయిందని తెలుసుగా. ఎవర్ని నియమించాలా అని చూస్తున్నాం. ఇంజనీరువి కాబట్టి నిన్ను వెయ్యాలని నేను సజెస్ట్ చేశాను. కానీ అందులో చిక్కువుంది. నువ్వు వర్కర్స్ తరఫు వాడివి. అందుకే ఇంకెవర్నయినా చూడాలనుకున్నాం. జె అండ్ జె ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంటే చాలా పెద్ద పదవనీ, అది నీకు ఈ వయసులో రావటం చాలా అదృష్టమని నేను భావించాను. ఇది ఎలా

పరిష్కరించాలా అని ఆలోచిస్తున్న సమయంలో యూనియన్ నుంచి మాకు నోటీస్ వచ్చింది. నిన్ను వాళ్ళ ప్రతినిధిగా తొలగిస్తున్నట్టూ. ఎంక్వయిరీ చేస్తే నువ్వే దానికి రిజైన్ ఇచ్చినట్టు తెలిసింది. దాంతో మా పని సులభమైంది".

శ్రీధర్ మొహంలో ఆనందం కనపడలేదు. "మీరు నన్ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేస్తే కార్మికులతో పేచీ వస్తుందని నా వుద్దేశ్యం. అదీగాక ఇది నా వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన విషయం కూడా. కేవలం ఎగ్జికూటివ్ డైరెక్టర్ అవటానికే నేను వాళ్ళ ప్రతినిధిగా రాజీనామా యిచ్చానని వాళ్ళు అనుకొంటారు. అది నాకు ఇష్టంలేదు".

"కానీ నీకున్న తెలివితేటలకీ, చదువుకీ ఆ పదవి అంత పెద్దది కాదు."

"వర్కర్లు అలా ఆలోచించరు".

రాబర్ట్ నవ్వేడు. "ఇదంతా మేం ఆలోచించలేదని ఎందుకనుకున్నావ్?" అన్నాడు. "అందుకే కొంతకాలంపాటు నిన్ను పట్వారీ స్థానంలో వుంచి, అక్కడనుంచి యిక్కడికి ఎగ్జిక్యూటివ్‌గా తీసుకొస్తాం. అప్పుడిక ఏసమస్యా వుండదు".

శ్రీధర్‌కి ఒక క్షణం తను వింటున్నది కలో, నిజమో అర్థంకాలేదు. జె అండ్ జె సిస్టర్ కంపెనీ పారిస్‌లో ఒకటున్నది. అక్కడ డైరెక్టర్ పట్వారీ.

కొంతకాలంపాటు తను పారిస్‌లో వుండబోతున్నాడు జె అండ్ జె ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా.

అతికష్టంమీద అతడు ఆనందాన్ని అణచుకున్నాడు. స్వశక్తిమీద సాధించిన విజయాల ఫలితాలని స్వయంగా ఆస్వాదిస్తే గానీ అందులో ఆనందం తెలీదు.

"సాధ్యమైనంత త్వరలో నువ్వు బయల్దేరవలసి వుంటుంది. పాస్‌పోర్ట్ వుందా?"

అతడు తలూపి, లేచి షేక్‌హేండ్ యిచ్చాడు. "థ్యాంక్యూ సర్! రియల్లీ థ్యాంక్యూ" బయటికి రాబోతూ గుమ్మం దగ్గర ఆగి వెనక్కి తిరిగి అడిగాడు. "...మీరు నా మీద ఎందుకింత అభిమానం చూపిస్తున్నారు?"

రాబర్ట్ క్షణం మాట్లాడలేదు. కుర్చీలోంచి లేచి వెనీషియన్ బ్లైండ్స్ దగ్గరికి వెళ్ళాడు. బ్లైండ్స్ నీడలు అతడి మొహంమీద అడ్డంగా గీచిన గీతల్లా పడుతున్నాయి. చేతులు రెండూ పాంటుజేబుల్లో పెట్టుకొని బయటికి చూస్తూ చాలాసేపు వుండిపోయాడు. తరువాత వెనక్కి తిరిగి నెమ్మదిగా అన్నాడు– "ఇరవై నాలుగేళ్ళ

వయసులో... ప్లేన్ యాక్సిడెంట్‌లో చచ్చిపోయిన నా కొడుకు నీలా వుండేవాడు కాబట్టి".

* * *

శ్రీధర్ తన ఛాంబర్‌కి రాగానే శారదకి ఫోన్ చేశాడు. "హలో! మిసెస్ శ్రీధర్ హియర్" అట్నుంచి వినిపించింది.

అతడి మనసంతా ఆనందంతో నిండివుంది. లోపల్నుంచి ఉబికి ఉబికి వస్తూంది. ఎంత ఆపుకుందామన్నా ఆగటంలేదు. స్వరంలో అదేమీ కనబడకుండా మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తూ "శారూ...." అన్నాడు.

"మీరా...!"

"ఆఁ.... నేనే ఒక విషయం చెప్పు. నేను ఇంటినుంచి బయల్దేరేక, నువ్వు పూజ గదిలోకి వెళ్ళి దేవుణ్ని ప్రార్థించావు కదూ?"

"నేను మీకు తెలుగు సినిమా హీరోయిన్‌లాగా కనబడుతున్నానా?" అట్నుంచి వినిపించింది. అతడు నవ్వుతూ "నా ప్రశ్నకి సమాధానం అదికాదు" అన్నాడు.

"ఇంతకీ ఏమైంది చెప్పండి" అందామె భర్త కంఠంలో వినిపిస్తున్న ఆనందాన్ని గుర్తించి.

"మై స్వీట్ హార్ట్– విను, వుయ్ ఆర్ ఫ్లయింగ్ ఆఫ్ టు పారిస్" అవతల ఊపిరి బిగపట్టిన ధ్వని– "పారిస్!"

"హో...హో...పారిస్. జె అండ్ జె ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, మనం పెళ్ళయిన కొత్తలో హనీమూన్ చేసుకోలేదని యిప్పుడు పంపుతున్నారు. ఒకటి రెండు సంవత్సరాల తర్వాత వెనక్కి వచ్చేస్తాం. మళ్ళీ ఇక్కడే కంటిన్యూ అవుతాం".

"శ్రీ...!"

"ఊఁ....!"

"ఈ విషయం మీరు స్వయంగా వచ్చి చెప్పకుండా ఫోన్లో చెప్పటం వల్ల ఎంత గొప్ప బహుమతి మిస్ అయ్యారో తెలుసా?"

అతడికో క్షణం అర్థంకాలేదు. అర్థమయ్యేసరికి కుర్చీలో ముందుకు వంగి సన్నగా విజిల్ వేసి... "డార్లింగ్! ఆ బహుమతి...." అంటూ ఏదో చెప్పబోయాడు.

"ష్.... రిసెప్షనిస్ట్ వింటుంది. అన్నీ పర్సనల్‌గా...."

"ఓకే! ఓకే ఓకే..." ఫోన్ పెట్టేశాడు.

2

"కష్యామినీ.... కాత్యూషా.... కామినీ.... క్రాం క్రీం క్రోధమాత్సర నాశికారిణీ".

అర్ధరాత్రి పన్నెండు గంటలవేళ-దట్టమైన చీకట్లో, స్మశానం నడిబొడ్డున కూర్చొని అతడు క్షుద్రదేవతల్ని పిలుస్తున్నాడు.

దూరంగా ఎక్కడో చితి కాలుతున్న వెలుగు మినుక్కు మినుక్కుమని కనబడుతూంది. చెట్టు సందు కొమ్మలోంచి ఒక గుడ్లగూబ ఆగి, ఆగి అరుస్తూంది.

పిచ్చి మొక్కలూ, రాళ్ళ గుట్టల మధ్యలో హోమం పొగ పైకి లేచి చీకట్లో కలిసిపోతూంది. పక్కనే కూర్చుని దాన్లో ధూపం వేస్తున్నది సాహిర్. అతడో ముస్లిం యువకుడు. గురువు దగ్గర తాంత్రిక విద్యల్ని నేర్చుకోవటానికి వచ్చినవాడు.

దాదాపు ఐదు సంవత్సరాలనుండి సపర్యలు చేస్తున్నా అతడికి విద్య నేర్పబడలేదు. ఎముకలు కొరికే చలిలో స్నానాలు చేశాడు. అర్ధరాత్రి వరకూ అడవులలో తిరిగి గురువడిగినవన్నీ సంపాదించాడు. తెల్లవారుఝాము వరకూ స్మశానాల్లో తిరిగి కపాలాల్ని సంపాదించాడు. ఇప్పుడిప్పుడే గురువు కృప సంపాదించగల్గుతున్నాడు.

ఒరిస్సా రాష్ట్రపు సరిహద్దుల్లో వున్న బిస్తా గ్రామానికి నాలుగు మైళ్ళ దూరంలో వున్న స్మశానం అది. మంత్రగాళ్ళ గురించీ, చేతబడుల గురించీ తెలిసిన వాళ్ళకి ఆ విషయం చెప్పగానే జ్ఞాపకం వచ్చేది 'బిస్తా'. అక్కడున్న పిల్లవాడు కూడా శూన్యంలోకి చూస్తూ దెయ్యంతో మాట్లాడతాడనీ ప్రతీతి. అక్కడున్న ప్రతి వృద్ధుడి వెనుకా ఒక చరిత్ర వుంది. ప్రతివాడూ ఇరవై ముప్పైమంది ప్రాణాలు తీసినవాడే-

క్షుద్ర విద్యలు ఇరవై నాలుగు. వశీకరణ మొదలు అంగక్షిదం వరకూ!

మొదటి పన్నెండు విద్యలదాకా కొద్దిపాటి కష్టంతో (కొద్దిపాటి అంటే పదినుంచీ పదిహేను సంవత్సరాలవరకూ కష్టపడితే అన్నమాట) అలవడతాయి. ఆ తరువాత విద్యలు చాలా కష్టం.

అన్నిటికన్నా చివరిదైన అంగక్షిదాన్ని దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం బిస్తా గ్రామములో 'బర్సోరా' సాధించాడని చెప్పుకొంటారు. ఆ విద్య సాధించినవారికి క్షిత్ అనే దెయ్యం వశమై వుంటుందిట. ప్రపంచంలో వుండే కౄరమైన క్షుద్ర దేవతలన్నిటిలోకి అదే క్షుద్రమయినది అంటారు.

క్షుద్ర విద్యలలో ఎనిమిదవది చేతబడి. అయితే ఈ చేతబడిని తిరగగొట్టటం కూడా సులభమే. ఎనిమిదో విద్య రావటానికి ఎంత కష్టపడాలో అంత కష్టపడితే దాన్ని తిరగకొట్టే విద్య కూడా నేర్చుకోవచ్చు.

అయితే దాని తర్వాత ఎనిమిది స్థానాలు దాటితే కాష్మోరా అనే క్షుద్రదేవత అనుగ్రహం లభిస్తుంది. దీని సాయంతో కూడా చేతబడి చెయ్యవచ్చు. దీనికి తిరుగులేదు.

ఈ కాష్మోరా అనేది పదహారో విద్య.

ఇది తెలిసినవాడు బిస్తాగ్రామంలో ఒక్కడే వున్నాడు. అతడు ఇప్పుడు స్మశానం నడిబొడ్డున కూర్చొని క్షుద్రదేవతల్ని పిలుస్తున్నాడు. అతడి మెడలో మనిషి నరంతో కట్టిన దండ వుంది. అతడి చేతికి పసిపాప చిటికెన వేలి ఎముక కట్టబడి వుంది. అతడి వయసు అరవై దాకా వుండొచ్చు. కానీ శరీరం శుష్కించి తొంభై ఏళ్ళ వ్యక్తిలా కనబడుతున్నాడు. అతడి కళ్ళస్థానే రెండు ఎర్ర గోళాలున్నాయి. చెక్కిళ్ళు పీక్కుపోయి చర్మం వ్రేలాడుతోంది.

అతడి పేరు కాద్రా.

అతడి పెదవులు కదుల్తున్నాయి. అగ్ని పీఠ శక్తుల్ని జపిస్తున్నాయి. "పీతా...శ్వేతా...అరుణా..కృష్ణా...ధూమ...తీవ్రా...స్ఫులింగినీ... రచిరా... జ్వాలినీ..."

అమావాస్య అవటంవల్ల అంతా చీకటిగా వుంది. దూరంగా నక్క ఒకటి ఊళ పెడుతోంది. ఒక తీతువు పిట్ట వికృతంగా అరుస్తూ ఉత్తర దిక్కుగా వెళుతోంది. ప్రేతాత్మలు మేల్కొనే వేళయింది.

"సాహీ.." అన్న పిలుపు కాద్రా గొంతులోంచి వచ్చింది. అయిదేళ్ళ పరిచయం వున్న సాహిర్ కూడా ఆ స్వరానికి వణికి పోయాడు. వణుకుతూన్న చేతులతో చేతిలో వున్న దొప్ప గురువుకి అందించాడు. అందులో చిక్కటి రక్తం వున్నది.

మండుతూన్న హోమం ముందు ఆ రక్తాన్ని పెట్టాడు కాద్రా. "క్షిత్!" పిల్చేడు.

క్షిత్ రాలేదు. కోపంతోనూ, ఉక్రోషంతోనూ కాద్రా మొహం ఆ మంటల ఎరుపులో మరింత ఎర్రబడింది.

"క్షితా!" ఎలుగెత్తి అరిచాడు. స్మశానం అంతా ఆ స్వరం ప్రతిధ్వనించింది. మనిషి రక్తం కోసం ప్రేతాత్మలు ఆ చుట్టుప్రక్కల తిరుగాడటం, అయిదు సంవత్సరాల ఉపాసనతో సాహిర్‌కి స్పష్టంగా కనిపిస్తూంది. అయినా క్షిత్ రాలేదు.

అప్పటికి నెలనుంచి కాద్రా కఠిన ఉపవాసంతో వున్నాడు. ఎన్ని జంతువుల్ని బలి యిచ్చాడో లెక్కలేదు. అందరు దేవతలూ వస్తున్నారు క్షిత్ తప్ప. వెయ్యి సంవత్సరాల తర్వాత మనిషిని ఆవహించటానికి ఆ క్షుద్ర దేవుడు వస్తాడా?

మారణహోమం జరగబోతుందా?

దూరంగా వెలుగు చుక్క పొడిచింది.

కాద్రా దొన్నెలో రక్తాన్ని అష్టభైరవులకు సమర్పించాడు. అతడు పిలవగానే అదృశ్య రూపంలో రురుడు, చండుడు, కాపాలి, కాలుడు మొదలైనవారు వచ్చారు. సాహిర్ చూస్తూ వుండగానే రక్తం అదృశ్యమై పోయింది.

"సాహీ!" అరిచాడు కాద్రా. "ఈసారి వచ్చే అమావాస్యతో నేనో క్షితో తేలిపోవాలి. మనని అనుగ్రహించాడా సరేసరి– లేకపోతే ఈ మారణహోమానికి నా శక్తినంతా ధారపోసి అతడిని ఎదుర్కోబోతున్నాను. నేనో...క్షితో.... ఎవరో తేలిపోవాలి".

క్షుద్రదేవత అనుగ్రహం కోల్పోతే మంత్రవేత్త చాలా దారుణమైన ఫలితం అనుభవించవలసి వుంటుంది. ఎంతోమంది అలా హృదయ విదారకమైన మరణాన్ని పొందటం బిస్తా గ్రామంలో సాహిర్ చూశాడు. రక్తం కక్కుకుని చచ్చిన వాళ్ళు, కనుగుడ్లు తేలిపోయి చచ్చిన వాళ్ళు, కాళ్ళూ చేతులూ ఆడక మంచంమీద నెలల తరబడి తీసుకొని చచ్చిన వాళ్ళూ... అయితే క్షుద్రదేవతల్ని జయించిన మంత్రవేత్తలు కూడా వున్నారు. కానీ ఇప్పుడు కాద్రా ఎదుర్కోబోతున్నది అంతకన్నా బలవంతుడైన "క్షిత్"ని. గెలుస్తాడా?

"సాహీ!"

అతడు దగ్గరికి వెళ్ళాడు. "వచ్చే అమావాస్య నాటికి నేనుండక పోవచ్చు. ఇన్నాళ్ళ శుశ్రూషకి ప్రతిఫలంగా నీకు ఒక విద్య నేర్పుతాను".

సాహిర్ మొహం ఆనందంతో వెలిగిపోయింది.

గురువు మొదటిసారి కనికరించటమే కష్టం. తరువాత తరువాత సులభమే.

"ఈ రోజే.... ఈ రోజే నేర్పుతాను.... ఏమిటో తెలుసా?"

అతడు ఊపిరి బిగపట్టాడు.

"....చేతబడి..."

* * *

దెయ్యంలా మర్రిచెట్టు విరబోసుకుని వుంది. మొదట్లో కూర్చొని వున్నాడు సాహిర్. అతడు ట్రాన్స్‌లో వున్నాడు. పెదవులు మాత్రం కాద్రా చెప్పిన మంత్రాల్ని ఉచ్ఛరిస్తున్నాయి. సమయం ఆసన్నమయింది.

కాద్రా మంటలలోంచి ఒక ఇనుప వూచని తీశాడు.... ఎర్రగా మండుతూంది అది. సాహిర్ కళ్ళు మూసుకునే వున్నాడు.

కాలి వున్న ఇనుప వూచని కుడివైపు లోపలికి గుచ్చేడు. సాహిర్‌కి ప్రేతాత్మల లయవిన్యాసం తప్ప మరేమీ కనబడటం లేదు. మండుతూన్న వూచ దిగటం తెలియటంలేదు. ఊచ ఆత్మస్థానాన్ని తాకింది.

కాద్రా శిష్యుడికి మంత్రం చెప్పేడు.

బిస్తా గ్రామంలో మరొక మంత్రగాడు తయారయ్యేడు.

* * *

జె అండ్ జె యూనియన్ హడావుడి తారాస్థాయి నందుకొంది. శ్రీధర్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీ భర్తీ చెయ్యటానికి కోటయ్యతోపాటు యాదగిరి కూడా పోటీ చేస్తున్నాడు. బలాబలాలు సమంగా ఉన్నాయి. శ్రీధర్ ఉన్నప్పుడు సంగతి వేరు. అతడు వెళ్ళిపోవటంతో అతడి వర్గం కూడా చీలిపోయింది. అయితే శ్రీధర్ వీటి గురించి పట్టించుకోలేదు. అతడు ఫారిన్ వెళ్ళిపోయే ప్రయత్నంలో వున్నాడు.

ఇరువైపులా ప్రచారం ముమ్మరంగా సాగుతూంది. అప్పటికి లీడర్ ఎన్నిక ఇక ఒకరోజే వుంది. ఇరువర్గాలూ ప్రొసెషన్ లేవదీశాయి. ఒకే సమయానికి రెండు గుంపులూ ఫ్యాక్టరీ గేటు దగ్గిర కలుసుకొన్నాయి. నినాదాలు ఎక్కువయ్యేయి.

శ్రీధర్, రాబర్ట్ ఆయన మనవరాలూ, ఇంకా ఫ్యాక్టరీలో ఆఫీసర్లూ అంతా కారిడార్‌లోకి వచ్చి చూస్తున్నారు.

కోటయ్య గుంపులోంచి ఎవరో ఒక సోడాసీసా యాదగిరి గుంపులోకి విసరటంతో పరిస్థితి విషమించింది. కోటయ్య గుంపులోను, యాదగిరి గుంపులోను– ఉన్నట్టుండి– అందరి చేతులలోకి ఆయుధాలు వచ్చేయి.

రాబర్ట్ మనవరాలి చేతిని గట్టిగా పట్టుకొన్నాడు. పదేళ్ళ పాప వింతగా చూస్తున్నది.

శ్రీధర్ 'అరె!' అన్నాడు. ఇంకెవరో ఇంజనీరు పోలీసులకి ఫోన్ చెయ్యటానికి లోపలికి పరుగెత్తాడు.

"రేయ్... సవాల్ రా సవాల్.... సింగిలా, గ్రూప్ ఫైటింగా" అరుస్తున్నాడు కోటయ్య. అతడు తాగి వున్నాడని తెలుస్తూనే వుంది. శ్రీధర్ మనసు వికలమయింది. జె అండ్ జె కాబోయే డైరెక్టరు వాళ్ళలో వున్నాడు. తమ ఎంతో గౌరవప్రదంగా నిర్వహించిన పోస్టు అది.

అతడి ఆలోచన్లని తెంపుతూ యాదగిరి పెట్టిన కేక వినిపించింది. ఆ గుంపులోంచి అతడు బయటికి వచ్చేడు. మిగతా వారందరూ ప్రేక్షకులే అయ్యేరు.

యాదగిరి తన దగ్గరికి రాగానే చప్పున లోపల్నుంచి కత్తి తీసేడు కోటయ్య.

చుట్టూవున్న వాళ్ళంతా దిగ్భ్రాంతులయ్యారు. యాదగిరి కూడా ఒక క్షణం విస్తుబోయి అంతలోనే తేరుకుని "రేయ్" అని అరచి ముందుకి దూకేడు.

మిగతాదంతా క్షణంలో జరిగిపోయింది.

కోటయ్య బలంగా చెయ్యి వెనక్కి లాగి, వెంటవెంటనే రెండు పోట్లు- ఒకటి కడుపులోనూ, ఇంకొకటి డొక్కలోనూ పొడిచాడు. కొంచెంసేపటి వరకూ అక్కడ గాలి స్థంభించింది.

గిలగిలా కొట్టుకుంటూన్న యాదగిరి శరీరమే చప్పుడు చేస్తోంది. తరువాత అదీ ఆగిపోయింది.

యాదగిరి తాలూకు గుంపు రెచ్చిపోయి కదిలే సమయంలో పోలీస్ సైరన్ వినిపించింది. అదే విన్పించకపోతే ఆ రోజు అక్కడ మారణహోమం జరిగి వుండేదే.

పోలీసుల అలికిడి విన్పించగానే కోటయ్య కదిలేడు. చేతిలో కత్తి క్రింద పడేశాడు. బహుశ అతడికి జరగబోయేదంతా ఉరికంబమూ, శిక్షా- అంతా కనపడి వుంటుంది.

పోలీసులు వ్యాన్‌లోంచి దిగబోతూ వుంటే జువ్వలా ఇంకోవైపుకి పరుగెత్తబోయేడు. కాని అట్నుంచి ఇంకోజీపు రావటం చూసి, ఫ్యాక్టరీలోకి పరుగుతీశాడు. నాలుగువైపులనుంచీ విజిల్స్ వినిపించటంతో బెదిరిపోయి ఒక్క క్షణం ఆగేడు. చావు ధైర్యం అతడి మొహంలో స్పష్టంగా కనబడింది.

ఒక్క వూపులో విసురుగా శ్రీధర్ వాళ్ళు నిల్చున్నవైపుకి గాలిలా దూసుకు వచ్చేడు. ఏం జరుగుతుందో అందరూ గ్రహించబోయే లోపుగానే రాబర్ట్ చేతిని పట్టుకొని అమాయంగా నిలబడివున్న పాపని రెండు చేతులలోకి తీసుకొని, అదే వేగంతో ఫ్యాక్టరీ ఆవరణలోకి పరుగెత్తసాగేడు.

అందరూ క్షణం నిశ్చేష్టులయ్యేరు. ముందుగా తేరుకొన్నది శ్రీధర్. "ఆగు" అని అరుస్తూ వెనకే పరుగెత్తాడు. కోటయ్య చేతులలో పాప గిలగిలా కొట్టుకుంటూంది. వెనకే ఉన్న రాబర్ట్ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ప్లేన్ యాక్సిడెంట్‌లో కొడుకూ కోడలు చనిపోతూ అతనికి ఇచ్చిన ఒకే ఒక గుర్తు ఆ పాప. అతడు ఆమెని తన ప్రాణంకన్నా మిన్నగా చూసుకొంటాడని అందరికీ తెలుసు. అతడలా నిశ్చేష్టుడై నిలబడి వుండగానే కోటయ్య పాపతో సహా క్రేన్ పైకి ఎక్కసాగేడు. వెనుకే శ్రీధర్.

కోటయ్య పైవరకూ ఎక్కి అరిచేడు "ఖబడ్దార్! ఎవరన్నా ముందుకొస్తే పాపని విసిరేస్తాను"

యాభై అడుగుల ఎత్తునుంచి అరవటం అందరికీ స్పష్టంగా వినిపించింది.

పోలీసులూ ప్రేక్షకులే అయ్యారు.

"అందరూ ఇక్కణ్నుంచి వెళ్ళిపోవాలి. ఒక జీపు మాత్రం వుంచాలి. లేకపోతే...." అంటూ పాపని నొక్కిపట్టేడు.

పాప చేసిన ఆర్తనాదం అందరి గుండెల్ని కలచివేసింది.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ మైకు అందుకొన్నాడు. "నువ్వెక్కడికీ తప్పించుకోలేవు, క్రిందికి దిగిరా! శిక్ష తక్కువ పడుతుంది".

దానికి ప్రతిగా "ఒక్క నిమిషం టైమ్ ఇస్తున్నాను" అన్న సమాధానం వినిపించింది.

పెద్ద గోడకు క్రేన్ ఆనించి వుంది. దాని క్రిందంతా విశాలమయిన మైదానంలా వుంది. పైకి చేరిన కోటయ్యకి క్రిందున్న మనుష్యులంతా గుంపులా కనిపిస్తున్నారు. ఆ గుంపులోంచి ఎవరన్నా ముందుకొచ్చి క్రేన్ వైపు నడిస్తే అతడికి కనబడుతుంది. ఆ ధీమాతోనే అతడు కొద్దిగా నిర్లక్ష్యంగా వున్నాడు. తన వెనుకనుంచి పైకి వస్తున్న శ్రీధర్‌ని గుర్తించలేదు.

శ్రీధర్ అతడి వెనుక మెట్టుమీద నిలబడి నెమ్మదిగా "కోటయ్యా!" అన్నాడు. గాఢమైన నిశ్శబ్దంలో ఆ పదం ప్రక్కనే బాంబు పేలినట్టు వినిపించింది. క్రిందకి చూస్తున్న కోటయ్య ఉలిక్కిపడ్డాడు. ఒక్కక్షణం అతడికేమీ అర్థంకాలేదు. ఏమీ తోచలేదు కూడా. అసలే అప్పటివరకూ జరిగిన సంఘటనలతో దాదాపు పిచ్చివాడయ్యేడు. దాంతో అతడు మృగంలా అరుస్తూ వెనక్కి తిరిగి శ్రీధర్ మీదకి దూకబోయి ఆ తొందర్లో క్రిందవున్న మెట్ల సంగతి చూసుకోక క్రేన్ ఇనుప సందుల మధ్య అతడి కాలు మెలికపడటం, క్రిందకి జారిపోతూ వుండగా శ్రీధర్ ఒక్క

గెంతులో ముందుకి దూకి అతడి చెయ్యి పట్టుకొని పైకి లాగబోవటం క్షణంలో జరిగినయ్. క్రిందనుంచి హాహాకారాలు వినిపించినయ్.

ఏభై అడుగుల ఎత్తులో అతడి చెయ్యి పట్టుకొని కోటయ్య గాల్లో వ్రేలాడుతున్నాడు. కోటయ్య చేతులలో పాప.

"పాపని ఇలా అందివ్వు" అన్నాడు శ్రీధర్, క్రేన్ రెండోవైపు నుంచి చెయ్యి అందిస్తూ.

"ఇవ్వను" అన్నాడు కోటయ్య. "చావనన్నా చస్తానుగాని పాపను వదల్ను".

ఒంటి చేతిమీద తన బరువునీ, కోటయ్యనీ మోయవలసి రావటం వల్ల చెయ్యి లాగుతుంది. ఇంకెంతోసేపు పట్టుకొని వుండలేడు.

"అందరం పడిపోతాం" అన్నాడు.

"అయినాసరే!"

ఒక్కక్షణం ఏం చెయ్యాలో తోచలేదు.

కోటయ్యే అన్నాడు. "పాపని పైకి ఇవ్వగానే నన్నొదిలెయ్యటానికా?"

ఈ ప్రశ్నతో శ్రీధర్‌లో అణిగిపోతున్న ఆశ చివురించింది. "నా గురించి నీకు బాగా తెలుసు. పాపనివ్వు! నిన్నూ పైకి లాగుతాను. అంతవరకూ హామీ ఇస్తున్నాను".

"ఆ తరువాత నువ్వెళ్ళిపోవాలి".

"వెళ్ళిపోతాను".

"మోసం చెయ్యకూడదు!"

"చెయ్యను!"

కోటయ్య తలెత్తి అతనివైపు చూశాడు. ఒక చేత్తో వ్రేలాడుతున్నాడు శ్రీధర్. ఇద్దరి చూపులూ క్షణం కలుసుకొన్నాయి. శ్రీధర్‌కి క్షణ క్షణం నిస్సత్తువ ఎక్కువ అవుతోంది. కోటయ్య భారీ శరీరాన్ని ఒక్క చేత్తో ఆపలేకపోతున్నాడు.

కోటయ్య పాపని భుజం మీదకు ఎత్తాడు. అక్కడినుంచి శ్రీధర్ చెయ్యి పట్టుకొని పాప పైకి పాకింది. చేతి నరాలు తెగిపోతున్నంత బాధని పళ్ళ బిగువున అదిమిపట్టాడు. పాప క్రేన్ చివర్ని పట్టుకొని పైకి ఎక్కింది.

అదిచూసి ఇన్‌స్పెక్టర్ ఒకడు పరుగెత్తి ముందుకు రాబోయాడు.

"స్టాప్" అరిచాడు శ్రీధర్. "డోంట్ కమ్".

కోటయ్య కళ్ళలో కృతజ్ఞత క్షణంపాటు మెరిసింది.

శ్రీధర్ వూపిరి బిగపట్టి చేతిని పైకి లాగసాగాడు. కోటయ్య భారీ శరీరం గాలిలో ఒక్కొక్క అంగుళం పైకి రాసాగింది. కానీ ఎంత బలాన్ని ఉపయోగించినా నిరర్థకమే అవుతోంది. భుజం తెగిపోతున్నంత బాధ. రెండో చెయ్యి అందితే బావుండును. కానీ రెండో చెయ్యి వదిలితే ఇద్దరికీ ప్రమాదం. కేవలం కాళ్ళు మెలివేసి క్రేన్‌ని పట్టుకోవాలి. ఒక చేత్తో అయితే కేవలం కోటయ్యకే ప్రమాదం.... నిర్ణయించుకోవటానికి ఎక్కువ సమయం లేదు.

క్రేన్ మెట్లమధ్య కాళ్ళుపెట్టి రెండో చెయ్యి వదిలిపెట్టి దాంతో కోటయ్యని పట్టుకొన్నాడు. మరుక్షణం అతడు కూడా క్రిందికి వచ్చాడు. కానీ కోటయ్య క్రేన్‌కి దగ్గరయ్యాడు. జరిగినదంతా కోటయ్యకి అర్థమైంది.

"శ్రీధర్ బాబూ...." కోటయ్య కళ్ళనిండా నీళ్ళు. "మీరు దేవుడు బాబూ!"

కానీ దేవుడు కనికరించలేదు.

కోటయ్య కాలుపెట్టిన చోట బోల్ట్ వదులుగా వుంది. అది చూసుకోని అతడు పట్టు దొరికిన ఆనందంతో దానిమీద బరువు అన్చి శ్రీధర్‌ని తన కూడా లాక్కున్నాడు. అతడికి పట్టు దొరికిందన్న ఉద్దేశ్యంతో శ్రీధర్ తన చేతిని వదిలిపెట్టాడు.

ముందు కోటయ్యా...

వెనుకే శ్రీధర్....

ఎవరో కెవ్వున అరిచారు.

చెవులలోకి రివ్వున వీస్తున్న గాలి.... ఆధారం దొరక్క కొట్టుకుంటున్న కాళ్ళూ చేతులూ... భూమి.... ఆహ్వానిస్తున్న భూమి... క్షణంలో ఫటేల్న తగలబోయే భూమి.... వన్ సెకండ్... ఒక్క క్షణమే...

స్ప్లిట్ సెకండ్ ....

తలక్రిందులుగా జారిపోతూ వుంటే శరీరం తేలికైన అనుభూతి! అరక్షణం ముందుగా క్రిందికి జారుతున్న కోటయ్య నూతిలోకి బొక్కెనలా.... చుట్టూ చూస్తున్న వాళ్ళ ఆకారాలు అస్పష్టంగా..... భూమ్మీద వున్న చిన్న చిన్న మిషన్లు చెల్లాచెదురుగా....

ధడేలున శబ్దం..... అరుపు!

కోటయ్య పడిపోయాడు. తల నేలకి కొట్టుకుంది..... ఫౌంటెన్ లోంచి చిమ్మినట్టు రక్తం మడుగు.... ఉహుఁ ఇంకా తయారవలేదు. తనూ పడిన తర్వాత

తయారవుతుందేమో.... అయిపోయింది.... ఇక రెండు సెకనులు ఎర్రటి ఎరుపు. రేపటి న్యూస్ పేపర్లలో ఈ దారుణాల గురించి పడుతుందా? స్పృహ తప్పుతోందా? తప్పిన స్పృహలోంచి ప్రాణం పోతుందా? ఒక్కక్షణంలో ఎన్ని ఆలోచనలు.... ఇంక ఒక సెకనే! అతడు గాలిలో చప్పున డైవ్ చేశాడు. తల పైకివచ్చి వెల్లకిలా పడేలా- మెత్తటి కోటయ్య శరీరం మీద వెల్లకిలా అతడు.

* * *

సాంబయ్యకి వంద అడుగుల దూరంలో సాహిర్ నడుస్తున్నాడు. చాలా జాగ్రత్తగా అతడిని గమనిస్తూ నడుస్తున్నాడు.

దాదాపు అరగంట నుంచీ అతడిని వెంబడిస్తున్నా కావల్సింది దొరకటం లేదు. సాహిర్‌కి కావల్సింది కూడా పెద్ద విషయమేమీ కాదు.

సాంబయ్య కుడికాలితో తొక్కిన మట్టి! అవును మట్టి!

సాంబయ్యని నెల రోజులలో చంపుతానని చెప్పి అతడు సాంబయ్య ప్రత్యర్థి దగ్గిర వందరూపాయలు తీసుకొన్నాడు.

వందరూపాయలకి ప్రాణాలు తియ్యటం బిస్తా గ్రామవాసులకి సర్వసాధారణ విషయమే. అయితే యిప్పుడు అది అంత సులభ సాధ్యమైన విషయంగా కనబడటంలేదు. సాంబయ్య నడకలోనే ఆ మెలిక వుంది. అడుగు తీసి వేసేటప్పుడు మట్టి అడుగుజాడని కప్పివేసేట్టు నడుస్తున్నాడు. (చేతబడుల భయం వున్న పల్లెటూళ్ళలో చిన్నప్పట్నుంచీ పిల్లలకి యిలా నడవటం నేర్పుతారు)

సాహిర్‌కి ఏం చెయ్యాలో తోచటంలేదు. అంతలోనే సాంబయ్య ఇల్లు చేరుకుని, లోపలికి వెళ్ళిపోయాడు.

సాహిర్ నిరాశతో ఇంటికి వచ్చేశాడు. కాద్రా అతడి కోసం చూస్తున్నాడు.

ఆ గది మధ్యలో ముగ్గువేసి వుంది. ముగ్గు మధ్యలో చిన్న ఎముక, చీపురు, పక్కనే ఒక పాత్ర వున్నాయి. ఆ పాత్రలో సింహం మూత్రం వుంది. పాత్ర పక్కనే చిన్న తెల్లగుడ్డ పరిచి వుంది. దానిమీద ఒక వెంట్రుక వుంది. అది అడవి పందిది.

సింహపు మూత్రమూ, అడవి పంది వెంట్రుక చేతబడులలో చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. పూనా జూలో అధికారులు వారానికి ఒకరోజు ఈ రెండు వస్తువుల్నీ అమ్ముతారు. వీటి కోసం క్యూలో నిలబడతారు.

"ఏమైంది?" అడిగాడు కాద్రా. సాహిర్ జరిగింది చెప్పాడు.

కాద్రా భృకుటి ముడిపడింది. "మట్టి దొరకలేదా?" అన్నాడు. మట్టి దొరక్కపోయినా చేతబడి చేయవచ్చు. కానీ అంతవరకూ యింకా సాహిర్‌కి చెప్పలేదు. అతడింకా నేర్చుకొనే స్థితిలోనే వున్నాడు.

"ఏం చేశావ్?" అడిగాడు సాహిర్‌ని.

అతడు తెల్లమొహం వేశాడు. అక్కడే వున్న సాంబయ్య ప్రత్యర్థి కాద్రావైపు తిరిగి "మీరు చెయ్యండి" అన్నాడు. కాద్రా మొహం కఠినంగా మారింది. "ఒకడొప్పుకున్నాక ఆ పనిని ఇంకొకడు చెయ్యడము బిస్తా సాంప్రదాయానికే విరుద్ధం".

అతడి కళ్ళల్లో ఎరుపు చూసి "పోనీ వదిలేసుకుంటాన్లెండి" అన్నాడు. సాహిర్ మొహం చిన్నబోయింది. మొట్టమొదటిసారి ప్రయోగించబోయే ప్రయత్నం ఇలా విఫలమవుతున్నందుకు "వాడ్ని నాశనం చెయ్యటమే కదా మీ వుద్దేశ్యం?" అన్నాడు.

"అవును".

"వాడి ఆస్తి గేదెలే కదా?"

తలూపేడు. సాహిర్ తేలిగ్గా శ్వాస పీల్చుకొని "వాటిని వట్టిపోయేట్టు చేస్తాను" అన్నాడు.

ఆ రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో సాహిర్ సాంబయ్య పశువుల కొట్టంలో వున్నాడు. నెమ్మదిగా.... ఏ మాత్రం చప్పుడు కాకుండా అతడు ప్రతి గేదె దగ్గరకూ చేరి గోరుతో కొమ్ముమీద గోకి, ఆ పొడిని కొద్దికొద్దిగా స్వీకరిస్తున్నాడు.

ఇది జరిగిన పదిరోజులకి సాంబయ్య వట్టిపోయిన పశువుల్ని కటిక దుకాణానికి అమ్మేసి బికారై పోయాడు.

ఇది బిస్తా చరిత్ర. ఇంత దారుణంగా వుంటుంది.

* * *

శ్రీధర్ కళ్ళు విప్పేటప్పటికి తెల్లటి గోడలు..... పక్కన రక్తం బాటిలూ, హడావుడిగా తిరుగుతున్న నర్సులూ కనిపించారు. తల కొద్దిగా పక్కకు తిప్పిచూస్తే శోకదేవతలా భార్య. అస్పష్టంగా 'శారదా' అన్నాడు.

అతడికి స్పృహ రావటం చూసి ఆమె మొహం విప్పారింది. చప్పున కుర్చీలోంచి లేచి అతడి దగ్గరకు రాబోతూంటే డాక్టర్ వారించాడు.

బాటిల్ సరిచేసి, ఇంకో ఇంజక్షన్ ఇచ్చే లోపులో శ్రీధర్ మరింత తేరుకుని, "ఐయామ్ ఆల్‌రైట్ డాక్టర్" అన్నాడు.

డాక్టర్ నవ్వి "ఎస్! ఎస్!" అన్నాడు. "నౌ యు కెన్ టాక్".

"థాంక్యూ డాక్టర్....."

"నాక్కాదు దేవుడికి చెప్పాలి. అంత ఎత్తునుంచి పడీ.... సర్వైవ్ అవటం.... కేవలం మీ శ్రీమతి అదృష్టం...."

భార్యాభర్తల చూపులు ఒక్కక్షణం కలుసుకొని విడిపోయాయి.

శ్రీధర్ కూడా నవ్వి "ఎంతకాలం నుండి నేను ఇలా వున్నాను? ఇంకా ఎంతకాలముండాలి? ముందు ఆ ప్రశ్నలకి సమాధానం చెప్పండి" అన్నాడు.

"రెండు రోజులైంది. వారం రోజులుండాలి" అని డాక్టర్ వెళ్ళిపోయాడు.

గదిలో నిశ్శబ్దం మిగిలింది!... మాట్లాడే నిశ్శబ్దం.... అతడు ఆమెవైపూ ఆమె అతడివైపూ చూస్తూ కూర్చున్నారు. మౌనంగా, ఆర్ద్రంగా.... అలానే కూర్చుండి పోయారు చాలాసేపు. సంజె చీకట్లు అలుముకొంటున్నాయి. అతడు నెమ్మదిగా చెయ్యిచాచి ఆమె చేతిని అందుకొంటూ "బాధపడకు, అంతాసర్దుకొంటుంది..." అన్నాడు.

అప్పటివరకూ బిగపట్టిన దుఃఖం కట్టలు తెంచుకుంది. అదిచూసి అతడు కంగారుపడి "ఎందుకు శారదా.... ఇప్పుడేమయిందని?" అన్నాడు. అతడి ప్రయత్నం ఫలించలేదు. దాదాపు అయిదు నిమిషాల తర్వాతగానీ ఆమె సర్దుకోలేదు.

అతడు మాట మారుస్తూ "అనిత రాలేదా?" అన్నాడు.

ఆమె కళ్ళు తుడుచుకొని "ఇప్పటివరకూ వుండి ఇప్పుడే వెళ్ళారు తమ్ముడూ, అదీ....." అన్నది.

ఆ క్షణం ఆమెని ఈ ఆలోచన్ల నుంచి తప్పించటంకోసం "అనితని తమతోపాటు తీసుకెళ్ళాలా-ఇక్కడే హాస్టల్లో వుంచాలా" అన్న విషయం గురించి మాట్లాడేడు.

నారాయణరావు కివ్వాలన్న ఆశ ఆమెకుంది. కానీ మూగవాడూ, చదువురానివాడూ అయిన తన తమ్ముడికి అనితను చేసుకొనే ప్రసక్తి తీసుకురాలేకపోయింది.

....

....

అయిదు రోజులు గడిచినయ్.

శ్రీధర్ లేచి స్టిక్ సాయంతో గదిలో తిరగగల్గుతున్నాడు.

రెండ్రోజుల ముందే అతణ్ని పంపటానికి నిశ్చయం జరిగింది.

ఆ రోజే అతణ్ణి డిశ్చార్జ్ చేసేది. పక్కమీద కూర్చుని "టుమారో" మాగ్‌జైన్ చదువుతున్నాడు. శారద పక్కనున్న బల్లమీద కూర్చొని బత్తాయిపండు వలుస్తూంది.

"హౌ ఆర్యూ?" అంటూ డాక్టర్ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఫైన్ డాక్టర్! థాంక్యూ."

డాక్టర్ రూమ్ కలయజూసి "ఇక్కడ మీకు బాగానే వున్నది కదా?" అన్నాడు ఇంగ్లీషులో.

"హోల్లీ డాక్టర్! థాంక్యూ".

"ఈ రోజు మిమ్మల్ని డిశ్చార్జ్ చేస్తాం".

"అవునట. డాక్టర్ మాధుర్ చెప్పేరు".

డాక్టర్ ఏదో చెప్పబోయి ఆగేడు.... కొంచెం తటపటాయింపు.... శ్రీధర్ అది గుర్తించలేదు. "ఇప్పుడెలా వుంది మీకు?"

"పెర్‌ఫెక్ట్‌లీ ఫైన్" హుషారుగా అన్నాడు. "వీలైతే రేపట్నుంచీ ఆఫీస్‌కి వెళ్ళిపోదామనుకొంటున్నాను".

"ఫైన్" అన్నాడు డాక్టర్!" శ్రీధర్! మీ పిల్లలెవరూ కనిపించరేం?"

బత్తాయి తొనలు వలుస్తూన్న శారద చప్పున తలెత్తింది.

శ్రీధర్ తలవంచుకొని "మాకింకా పిల్లల్లేరు డాక్టర్" అన్నాడు.

డాక్టర్ కదిలిపోయి "సారీ.... వెరీ సారీ..." అన్నాడు. శ్రీధర్ సర్దుకొన్నాడు- "ఇట్సాల్ రైట్ డాక్టర్".

మళ్ళీ నిశ్శబ్దం.....

దాన్ని భంగపరుస్తూ "చాలా అదృష్టవంతులు మీరు" అన్నాడు డాక్టర్.

"అవును" శ్రీధర్ నవ్వేడు. "అప్పుడే నా భార్య తిరుపతి అంటూంది కూడా".

డాక్టర్ జోకుకి నవ్వలేదు. "ఆ పడడం కొద్దిగా పక్కకిపడ్డా తలగానీ, కాళ్ళుగానీ ముందుపడ్డా చాలా పెద్ద ప్రమాదం జరిగి వుండేది".

"సిక్త్స్ సెన్స్- సిక్త్స్ సెన్స్ చెప్పింది డాక్టరుగారూ.... ఎక్కడో చదివినట్టు గుర్తు! అది సమయానికి జ్ఞాపకం వచ్చింది. వెల్లకిలా పడితే ప్రమాదం తక్కువట. గాలిలో డ్రైవ్‌చేసి వెన్నెముక ముందు నేలకి తగిలేటట్టూ ఫీట్ చేసేను, వందమంది ప్రేక్షకుల సమక్షంలో" అని భార్యవైపు చూసేడు.

శారద నవ్వింది. డాక్టర్ చూడకుండా పెదవులు సున్నాగా చుట్టి - క్షణంలో వెయ్యవ వంతు భార్యకో సందేశం అందించేడు. చాలా సున్నితంగా దాన్ని రిసీవ్ చేసుకొన్నది శారద.

"చాలా మంచిపని చేసేరు. లేకపోతే ప్రాణాలే పోయి వుండేవి. ప్రాణం ముఖ్యంకదా మనకి.... శ్రీధర్..... సారీ చెప్పవలసి వచ్చినందుకు నేనూ బాధపడుతున్నాను. మీ వెన్నెముకకి దెబ్బ తగిలింది. మీకిక పిల్లలు పుట్టరు. అయినా దాంట్లో విచారించాల్సిన విషయం ఏమీలేదు.... చాలా జీవితం మీ ముందుంది. ఓ పాపని పెంచుకోవచ్చు. ఎంతో అదృష్టం వుండబట్టే మీరు బ్రతికారు. బీ హేపీ శ్రీధర్. డోన్టు బి డిప్రెస్డ్" తొందర తొందరగా చెప్పి వెళ్ళిపోయేడు.

ఎర్రటి సంధ్యా కిరణం ఆ గది గోడలోంచి అతడి మొహం మీదకు సూటిగా పడుతూంది. అతడు కదల్లేదు. అలాగే నిశ్చలంగా వుండిపోయేడు. మెదడులో ఎక్కడో పర్జన్య ఘోష.

శారద ఏడవదేం! ఏడుస్తే-ఓదారుస్తే-అది సంతృప్తి. ఆమెకూడా నిశ్చలంగా అలాగే వుండిపోవటం..... అతడికి భయాన్ని కలిగిస్తూంది. 'మాట్లాడు శారదా..... కనీసం ఏడువు. నీ దేవుడు మనమీద ఆడిన చదరంగపు ఆటకి గుండెలు పగిలేలా ఏడువు'.

....హి హి.... నవ్వొచ్చింది, వస్తూనే వుంది. పిచ్చి.... ఏముంది శారదా నీకు మనసులో! చెప్పవూ? భర్తని కదా... భర్త.... భార్య చేతులలో ఆడుకోవటానికి ఓ పాపనివ్వలేని భర్త!!

అతడున్నట్టుండి బిగ్గరగా నవ్వాడు. ఏడుపుతో కలిసిన నవ్వు. శారద ఆశ్చర్యంగా తలెత్తి చూడలేదు. తల వంచుకొని చేతిలో బత్తాయి పండుకేసి చూస్తూనే వుంది. నెమ్మదిగా గదిలో చీకటి అలుముకొంది.

3

రోజులు నెమ్మదిగా- నిస్సారంగా గడుస్తున్నాయి. విశాలమైన భవంతిలో దట్టమైన నిశ్శబ్దం పేరుకొంది. ఎప్పుడూ హుషారుగా వుండే ఆ భార్యాభర్తలు ఇద్దరూ మౌనంగా, నిశ్శబ్దంగా తమ పనులు చేసుకుపోతున్నారు. అతడు ఫ్యాక్టరీకి వెళుతున్నాడు. వస్తున్నాడు.

శారద ఎక్కువగా తన గదిలోనే గడుపుతూంది. పూజగదిలోకి కూడా వెళ్ళటం లేదు. ఒక రకమయిన నిరాసక్తత ఆమెని ఆక్రమించుకొంది.

ఏదో విపరీతమయిన మార్పు తమ ఇంట్లో వచ్చిందని అనిత గుర్తించింది. కానీ అదేమిటో అర్థంకావటంలేదు. అయినా వూరుకొంది.

సాయంత్రం ఆరయింది. బాల్కనీలో కూర్చుని శ్రీధర్ "విచ్ క్రాఫ్ట్-దెయ్యం గురించిన చీకటి ప్రపంచం" అనే పుస్తకం చదువుతున్నాడు.

ఇంతలో స్కూటర్ చప్పుడైంది.

"ఈ మధ్య నువ్వు డల్‌గా వుంటున్నావు" లోపలికి వస్తూ అన్నాడు అబ్రకదబ్ర.

శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు.

"చెప్పు, మనం సాధించలేనిది ఏమీలేదు ఈ ప్రపంచంలో".

"ఎందుకు లేదూ? వుంది. ఈ అతిశయోక్తులు తగ్గించటం".

అతడు అటూ ఇటూ చూసి ముందుకు వంగి రహస్యంగా "నిన్నొక చోటుకి తీసుకెళతాను. నీ మనసులో కోర్కె నెరవేరే చోటుకి...." అన్నాడు.

శ్రీధర్ అనాసక్తంగా "ఏ చోటు?" అన్నాడు.

"బ్లాక్‌మాస్".

శ్రీధర్ ఉలిక్కిపడి- చివుక్కున తలెత్తాడు. బ్లా....క్....మా....స్....! అతడి వళ్ళు గగుర్పొడిచింది. ఇండియాలో బ్లాక్‌మాస్!

"ఎక్కడ?" అడిగాడు.

"ఉహూ..... చెప్పను. నువ్వు వస్తానంటే తీసుకెళతాను. రేపు రాత్రే! నీ మనసులో కోర్కె తీరుతుంది. దెయ్యాన్ని ప్రార్థించు, దెయ్యం దేవుడికన్నా శక్తివంతమైనది. కానీ నువ్వు వచ్చిన సంగతి మూడో కంటికి తెలియకూడదు. ఆ తెలిసిన మరుక్షణం రక్తం కక్కుకుని చచ్చిపోతావు". అది చెపుతున్నప్పుడు అతడి మొహంలో కనబడ్తున్న పైశాచికత్వాన్ని చూసి శ్రీధర్ వళ్ళు గగుర్పొడిచింది.

దెయ్యం ఎక్కడో లేదు మనిషిలోనే వుంది.

"వస్తాను" అన్నాడు.

* * *

అతడి పేరు మార్షల్ అని అబ్రకదబ్రా చెప్పాడు. చాలా భయంకరంగా వున్నాడు. పెద్ద గౌను వేసుకున్నాడు. మొహంమీద మాస్క్ వుంది. భుజాలమీద పట్టీలు ఎముకల్లా వున్నాయి. అతడే బ్లాక్‌మాస్‌ని నిర్వహించేది.

బ్లాక్‌మాస్ నాలుగు అంచెలుగా నిర్వహించబడుతుంది. దెయ్యానికి స్త్రీని అర్పించటం- రైటువల్ డాన్స్- సభ్యుల కోర్కెలు దెయ్యానికి విన్నవించటం, కొత్త సభ్యులను చేర్చుకోవటం.

దేవుడికి జరిగే పూజకి వ్యతిరేకంగా ప్రేతాత్మల ప్రార్థన ఇక్కడ జరుగుతుంది. రక్తంతో వేయబడిన ముగ్గుమీద ఉప్పునీటి కల్లాపి జల్లుతారు. గదంతా చీకటిగా వుండాలి. అందుకే ఆ గదిలో నల్లకొవ్వొత్తుల కాంతి తప్ప ఇంకేదీ లేదు. ఆ కొవ్వొత్తులు మనుష్యుల కొవ్వుతో చేసినవని అబ్రకదబ్రా చెప్పాడు. ఇద్దరూ నిశ్శబ్దంగా చూస్తున్నారు.... వాళ్ళ కళ్ళు చీకటికి అలవాటు పడుతున్నాయి. బల్లమీద పదమూడు వస్తువులున్నాయి. ఒక పుర్రె, రెండు మనిషి తొడ ఎముకలు, ఒక చిన్న క్రాస్, కత్తి, ఇలాటివే మరికొన్ని.

అంతవరకూ అడ్డుగా వున్న నల్లకర్టెన్ పెద్ద చప్పుడు చేస్తూ క్రింద పడిపోయింది. ఆ చప్పుడు మరి ఆగలేదు. చెవుల్ని బద్దలుకొడుతూ డ్రమ్స్ చప్పుడు వినిపించసాగింది. వాళ్ళ చెవులు వినటం లేదు. కళ్ళు చూస్తున్నాయి.

జారిన కర్టెన్ వెనుక ఒకామె నగ్నంగా నిల్చుని వుంది.

"హైప్రీస్టెస్" అన్నాడు అబ్రకదబ్ర గుసగుస లాడుతున్నట్టు. ఇంతలో ఇద్దరు ఆడవాళ్ళు ఒక పదహారేళ్ళ అమ్మాయిని తీసుకొచ్చారు. సుకుమారంగా ముట్టుకుంటే కందిపోయేలా వుంది ఆ అమ్మాయి. ఆమె వంటిమీద నూలుపోగు లేదు. ఆమె కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. బాగా గంజాయి తాగినట్టుంది.

మ్యూజిక్ మరింత ఎక్కువయింది.

'త్రికోణపు' ఆకారంలో కర్టెన్ మడవబడింది. అమ్మాయిని దానిమీద పడుకోబెట్టారు. ఆమె కాళ్ళమధ్య మార్షల్ నిలబడి వున్నాడు. అతడి చేతిలో నల్లటి కొవ్వొత్తి, అతడి గౌనుమీద కాంతి నల్లగా ప్రతిబింబిస్తూంది.

అతడి రెండో చేతిలో.....

.....విరిగిన 'క్రాస్' వుంది. క్రీస్తుని శిలువ వేసిన క్రాస్, సగంలో విరవబడింది. మాస్క్ వెనుకనుంచి అతడి కళ్ళు క్రూరంగా కనబడుతున్నాయి.

ఒక నల్లకోడిని అక్కడకు తీసుకొచ్చారు. బల్లమీదున్న కత్తితో ఒకే ఒక దెబ్బతో దాని మెడ ఎగిరి దూరంగా పడింది. ఫౌంటెన్‌లోంచి జిమ్మినట్టు రక్తం ఎగిసి- వెల్లకిలా పడుకున్న అమ్మాయి పొత్తికడుపును తడిపింది.

డ్రమ్స్ ధ్వని ఎక్కువయింది.

అతడు నాలుగు దిక్కులకి తిరిగి బిగ్గరగా అన్నాడు ఇంగ్లీషులో. "..... ప్రేతాత్మలని నమ్ముకున్న మనుష్యులు- తమ ఆరాధ్య దైవాలని పిలుస్తున్నారు. రమ్మని అభిమానంతో ఆహ్వానిస్తున్నారు. దేవుడ్నించి మిమ్మల్ని రక్షించటానికీ, ఈ ఉపాసన నిర్విఘ్నంగా జరగటానికీ మీరు రావాలి.... రండి-"

డ్రమ్స్ మ్యూజిక్ ఎక్కువైంది. ఎక్కడ్నుంచి వస్తోందో తెలీదు గానీ- గాలి హోరుమని చప్పుడు చేస్తూ వీస్తూంది. జుట్టు విరబోసుకున్న మనుష్యులు చీకట్లో దెయ్యాల్లా వున్నారు. అంత గాలిలోనూ కొవ్వొత్తులు ఆరకపోవడం చిత్రంగా వుంది. కొందరు ఏడుస్తున్నారు. కొందరు నవ్వుతున్నారు. సగం ఉన్మాదంలో వున్నారు. అయినా నాట్యం చేస్తూనే వున్నారు. వర్తులాకారంగా ముగ్గు చుట్టూ తిరుగుతున్నారు. ముగ్గు మధ్యలో ఆమె పడుకొని వుంది. దెయ్యానికి అర్పితమవబోతున్న కన్య.

మార్షల్ విరిగిన క్రాస్‌తో ఆమెని బ్రెస్ట్స్ దగ్గిర అదిమేడు. తరువాత చేతులు, భుజాలూ స్పృశించి క్రాస్‌ని ఆమె కడుపు దగ్గరికి తెచ్చేడు. బిగ్గరగా దేవుణ్ని తిట్టసాగాడు.

"దేవుడు.....కొడుకు.... దేవుడు...." తిట్లతో దెయ్యాన్ని ప్రార్థించటం మొదలుపెట్టేడు.

.....చీకటి అన్ని వైపుల్నుంచీ వస్తూంది.

అన్ని దిక్కుల్నుంచీ!

రా!! సైతాన్.... దెయ్యమా! రా!!

ఎకో.... ఎకో.... అజరక్...."

"ఎకో.... ఎకో.... అజరక్...." అని బిగ్గరగా అరుస్తూ క్రాస్‌ని ఆమెలోకి రెండు చేతులతోనూ బలంగా తోసేడు.

అప్పుడు ఆమె అరచిన అరుపుని శ్రీధర్ తన జీవితాంతమూ మర్చిపోలేదు. బ్రాహ్మిణ్ చెయ్యి భయంతో వణుకుతూంది. చెవులు బద్ధలుకొట్టే ధ్వని.... అక్కడున్న వాళ్ళంతా డాన్స్ చేస్తూ అరుస్తున్నారు. "ఎకో ఎకో అజరక్... ఎకో ఎకో అజరక్...."

ఆ రాత్రి అక్కడికే దెయ్యాలు దిగి వచ్చాయా అన్నట్టుంది ఆ ప్రదేశం. అందరూ చేతులెత్తి ప్రేతాత్మల్ని ప్రార్థిస్తున్నారు. కోర్కెలు నెరవేర్చమని వేడుకొంటున్నారు. ఒక కొత్త సభ్యుడు చేర్చుకోబడ్డాడు. పొడవైన కత్తితో అతడి నగ్న శరీరం మీద ఆరు అక్షరాలు మూడు (666) వ్రాయబడ్డాయి. కారుతున్న రక్తం

పాత్రలో సైతానుకి అర్పింపబడింది. దేవుడిమీద నమ్మకం లేని మరో మనిషి- దెయ్యాన్ని ఆశ్రయించేడు.

అంతలో దూరంగా గంట మోగింది. బ్లాక్ మాస్ ముగిసింది. వచ్చిన వాళ్ళంతా హుండీలా వున్న పెట్టెలో నోట్లు వేసేరు.

"ఎంత వెయ్యను?" అడిగాడు శ్రీధర్.

"వెయ్యి...."

మ్యూజిక్ మోగుతూనే వుంది. ఒక రకమైన ఆవేశపు మత్తుతో అక్కడివాళ్ళు వూగిపోతున్నారు. బ్లాక్‌మాస్‌లో 'సెక్స్' మిళితమయ్యే వుంటుంది.

ఈ లోపులో మార్షల్ అక్కడికి వచ్చేడు. ఈసారి అతడు కోటులో వున్నాడు. అతడిని ఎవరూ గమనించలేదు. పెట్టె తెరచి డబ్బు తీసుకొని అతడు చీకట్లోకి నడవడం శ్రీధర్ గమనించేడు. అబ్రకదబ్ర- ప్రీస్టెస్ ఇస్తున్న పవిత్రమయిన రక్తపు తీర్థాన్ని స్వీకరించటానికి వెళ్ళటం చూసి అతడు బయటికి నడిచేడు.

లోపలి గందరగోళం ఒక్కరవ్వకూడా బయటికి వినిపించకపోవటం అతడు గమనించేడు. మార్షల్ వడివడిగా నడుస్తున్నాడు.

శ్రీధర్ కారు స్టార్ట్ చేసి నెమ్మదిగా అతడి వెనకే పోనివ్వసాగాడు. మార్షల్ వెనక్కి తిరిగి చూడలేదు. మలుపు తిరిగాడు.

ఆ ఇరుకు సందులో కారు పట్టదు. ఒక పక్కగా తాళం వేసి అతడ్ని అనుసరించేడు. మసక చీకట్లో మార్షల్ ఒక చెక్క ఇంటిముందు ఆగటం చూశాడు. జేబులోంచి తాళం తీసి అతడు లోపలికి వెళుతున్నాడు. ఒక్కక్షణం ఆగి శ్రీధర్ అక్కడకు చేరుకున్నాడు. దగ్గరికి వేసున్న తలుపులు తెరిస్తే తెరుచుకున్నాయి. మేడ మీదకు ఇరుకు మెట్లు.

తలుపు గడియవేసి చప్పుడు కాకుండా మెట్లెక్కాడు. మార్షల్ నల్ల గౌను బొత్తాములు విప్పుకుంటున్నాడు.

"హల్లో మార్షల్!"

అటు తిరిగి చేతులు పైకెత్తి గౌను పైకి లాగబోతున్న మార్షల్ షాక్ తగిలినట్టు క్షణంపాటు అలాగే నిశ్చేష్టుడవటం స్పష్టంగా తెలుస్తూంది.

అతడు వెనక్కి తిరిగి "ఎవరు నువ్వు?" అన్నాడు.

శ్రీధర్ లోపలికి కూర్చుంటూ "అది అనవసరం అనుకుంటాను" అన్నాడు. మార్షల్ భృకుటి ముడిపడింది. "ఏం కావాలి నీకు?"

"దెయ్యం అనేది వున్నదా?"

మార్షల్ మొహంలో రిలాక్సేషన్ కనబడింది. నవ్వి- "దేవుడున్న చోట దెయ్యం వుంటుంది" అన్నాడు.

"దేవుడున్నాడా?" అనడిగాడు.

"ఎవరు నువ్వు?"

"ఇన్‌స్పెక్టర్ ఆఫ్ క్రైమ్స్! దెయ్యం పేరు చెప్పి ఈ రోజు నీ సంపాదన ఎంత?"

క్షణంలో అతడూహించిన సంఘటన జరిగింది. మార్షల్ అంత దూరంనుంచి విసురుగా వచ్చి అతడి మీద పడ్డాడు. శ్రీధర్ చటుక్కున పక్కకి జరిగి కాలు అడ్డం పెట్టాడు. మార్షల్ నిలువునా ముందుకు పడిపోయాడు. ముక్కు నేలకి తగిలి రక్తం కారసాగింది.

శ్రీధర్ వెన్నెముకకి దెబ్బతగిలి దాదాపు రెండు నెలలు కావస్తుంది. అయినా దృఢంగానే వున్నాడు.

"మార్షల్.... ఈ క్షణం నిన్ను అరెస్ట్ చేయగలను. కానీ అక్కర లేదు. నాక్కావల్సింది ఒక్కటే! ఎందుకు నీవీ విద్య మొదలుపెట్టావు? కేవలం క్షుద్ర దేవతల పేరుమీద డబ్బు సంపాదించటానికేనా? ఆ ప్రశ్నకి జవాబు చెప్పు వెళ్ళిపోతాను. లేదా- నా చేతి బలం చూడాలనుకొంటే.... ఇంకొంచెంసేపు చెప్పకుండానే యిలాగే ఆగు."

మొదటి దెబ్బతోనే మార్షల్ లొంగిపోయాడు.

ఉపాసన చేస్తున్నప్పుడు క్రౌర్యం స్థానే కళ్ళలో ఇప్పుడు దైన్యం చోటుచేసుకుంది. రెండు చేతులూ ఎత్తి "చెప్తాను" అన్నాడు.

శ్రీధర్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

అతడు చెప్పినదంతా వింటుంటే ఆశ్చర్యం వేసింది.

మార్షల్ ఒకప్పుడు చర్చిలో పూజారి! ఏదో తప్పు చేయడం వలన ఉద్యోగం పోయింది. ఏం చేయాలో తోచలేదు. రాబడి పోయింది... అప్పుడు అతడికీ ఆలోచన వచ్చింది. ఇంగ్లీషు సినిమాలు చూసి, పుస్తకాలు చదివీ రకరకాల భ్రాంతుల్ని పెంచుకొన్న వాళ్ళ అజ్ఞానం మీద ఆడుకోవటం సులభం అనిపించింది. "బ్లాక్‌మాస్, విచ్‌క్రాఫ్ట్, వూడూ" అన్న పేరులతో డబ్బు సంపాదించటం మొదలుపెట్టాడు.

"ఈ రోజు సంపాదన ఎంత?" శ్రీధర్ అడిగాడు.

"పదిహేను వేలు"

శ్రీధర్ ఒక్కక్షణం ఊపిరి పీల్చడం మర్చిపోయాడు. కానీ అంతలోనే సర్దుకున్నాడు. తనక్కావల్సిన సమధానం దొరికింది చాలు. తెలివి తక్కువవాడి అజ్ఞానంతో తెలివైనవాడు వ్యాపారం చేయటం అన్నదీ వ్యవస్థలోనే వుంది.

లేచి "గుడ్‌నైట్ మార్షల్! బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు.

బయటికి వస్తూంటే వెనుకనుంచి "నన్ను అరెస్టు చెయ్యరుగా?" అన్న మాటలు జాలిగా వినిపించినయ్.

అతడు వెనక్కి తిరగకుండానే అన్నాడు "చెయ్యటానికి నేనెవర్ని? నేను ఇన్‌స్పెక్టర్‌ని కాను...."

"మరెవరు?'

"ఇంజనీర్ని, జె అండ్ జె లో...."

రక్తం ఇంకిపోయిన మార్షల్ మొహం అతడు చూడలేదు. రెండు చేతులూ ఫాంటు జేబుల్లో పెట్టుకొని మెట్లు దిగాడు.

చెక్క మెట్ల దగ్గర తలుపు వేసి సందు మొదట్లో వున్న కారు దగ్గరికి వచ్చాడు. డోర్ వేసి స్టార్ట్ చేయబోయాడు. అవతలిపక్క అద్దం వేయటం మర్చిపోయినట్టున్నాడు. వంగొని అద్దం పైకెత్తి, ఇగ్నిషన్ స్టార్ట్ చేయబోయి అలాగే ఆగిపోయాడు. పక్క సీట్లోంచి వళ్లోకి ఏదో మెత్తగా పాకుతూంది. అతడి నుదుటిమీద చెమట పట్టింది. నోట్లోంచి రాబోయిన కేకని బలవంతంగా ఆపుకున్నాడు. వెన్నులో చలి శరీరాన్ని వణికించింది.

కదలకుండా అలాగే వుండి, నెమ్మదిగా చేతిని క్రిందికి జార్చాడు. చీకట్లో అడుగున ఏమీ కనబడటం లేదు. చేతివేళ్ళు- జరుగుతున్న దానికి తగలగానే పట్టుకొని వెనక సీట్లోకి విసరబోయాడు.

"కుయ్యో!" మన్న శబ్దం, చేతికి తగిలిన బొచ్చు.

ఎత్తి వెలుగులో చూస్తే బొద్దుగా, అందంగా వున్న కుక్కపిల్ల... పుట్టి ఎంతోకాలం కాలేదనుకుంటా- చలికి వణుకుతూంది.

అతడి పెదవుల మీద సన్నగా నవ్వు కదిలింది. దాన్ని అలాగే వళ్ళో వుంచుకొని కారు స్టార్ట్ చేశాడు. ఆ క్రితం రోజు చదివిన పుస్తకంలో వాక్యం జ్ఞాపకం వచ్చింది. పిల్లి దెయ్యానికి ప్రతీక. కుక్క దానికి వ్యతిరేకం. అవి దెయ్యాల్ని తొందరగా పసికడతాయట. దెయ్యాల్ని పసిగట్టినా గట్టకపోయినా దెయ్యాల్లాంటి దొంగల్ని పసిగడతాయి. ఉండనీ....

అతడు ఇంటికి చేరుకొనేసరికి రాత్రి ఒంటిగంట దాటుతూంది. ఆ సమయంలో యింట్లో అన్ని దీపాలూ వెలిగి వుండటం చూసి అతడి భృకుటి ముడిపడింది. మనసేదో అపశకునాన్ని సూచించింది.

కారు పోర్టికోలో ఆపుచేసి, కుక్కపిల్లతో సహా దిగాడు. తలుపు వేస్తూ వుంటే నారాయణరావు కనబడ్డాడు. ఈ వేళప్పుడు ఇతనెందుకు మెలుకువగా వున్నాడు?

అతడేదో చేతులతో సైగ చేస్తున్నాడు. అర్థంకాలేదు. కానీ ఏదో అయింది. శ్రీధర్ వడివడిగా లోపలికి వెళ్ళటం కోసం మెట్లెక్కబోయాడు.

అప్పుడు వినిపించింది.... ఒక పెద్ద కేక గుండెలవిసిపోయేలా....! ఆ భవంతి చుట్టూవున్న పెద్ద పెద్ద చెట్లమధ్య ఆ శబ్దం రెండుసార్లు ప్రతిధ్వనించింది. అతడు స్థాణువై నిలబడిపోయాడు.

ఆ కేక శారదది!

* * *

అతడు నారాయణరావు వైపు చూశాడు. అవే నిస్తేజమైన కళ్ళతో అతడు ఏ భావమూ లేకుండా వున్నాడు. లాగిపెట్టి కొట్టాలన్న కోపాన్నీ, ఉక్రోషాన్నీ అణచుకొని లోపలికి పరుగెత్తాడు.

గదిలోంచి అనిత బైటకొచ్చింది. "వదినకి కడుపునొప్పి వచ్చింది రాత్రి పదకొండింటికి....! డాక్టర్ దమయంతిగారున్నారు లోపల...."

డాక్టర్ ఇంటికొచ్చేటంతగా కడుపునొప్పి....

వడివడిగా అతడు లోపలికి వెళ్ళేసరికి డాక్టర్ ఇంజక్షన్ ఇవ్వటం పూర్తిచేసింది.

శారద అప్పుడే మత్తులోకి జారుకుంటూంది. అయిదు నిమిషాలు ఆమెను గమనించి బైటకొస్తూ "ఇంకేం ఫర్లేదు ప్రొద్దునకి అంతా సర్దుకుంటుంది" అంది డాక్టర్.

ఆమె కారు దగ్గరికి వెళుతోంటే "థాంక్యూ డాక్టర్...." అన్నాడు శ్రీధర్. "....అండ్ సారీ ఇన్‌కన్వీనియెన్స్..."

ఆమె కారు ఎక్కింది. "నో...నో....ఇట్స్ మై డ్యూటీ"

"రేపు మిమ్మల్ని కలుసుకొంటాను."

ఆమె దానికి సమాధానం చెప్పకుండా "శ్రీధర్" అంది. అతడు ఆమెవైపు చూశాడు.

"చాలా అదృష్టం! కానీ యింకో ఆర్నెల్లు ఆమెను కళ్ళలో పెట్టుకొని చూసుకోవాలి. అఫ్‌కోర్స్.... ఆమెకిప్పుడేం ఫర్వాలేదు. కానీ ఇంకో ఆర్నెల్లుపాటు జాగ్రత్త! కొద్దిలో అబార్షన్ తప్పింది".

ఆమె కారు కదిలింది.

"అబార్షన్....?!" అతడికి క్షణంపాటు ఏమీ అర్థంకాలేదు.

అర్థం అయిన తర్వాత అతడు ఆనందంతో పెద్దగా కేక పెట్టబోయాడు. తన వయసు జ్ఞాపకం వచ్చి సిగ్గుపడ్డాడు. లోపల్నుంచి ఆనందం తెరలు తెరలుగా తన్నుకు వస్తూంది. చేతుల మధ్య శారద లేదు, ఉన్న కుక్కపిల్లని ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేశాడు.

....విషాదంగా వున్నప్పుడు టైమ్ ఎంత నెమ్మదిగా గడుస్తుందో దానికి వ్యతిరేకంగా- ఆనందంగా వుండగా రెప్పపాటులో రోజు దొర్లుతుంది.

ఆర్నెల్లు గిర్రున తిరగటానికి అరక్షణం చాలు. ఆరేళ్ళకి మరో అరక్షణం.

* * *

"మరీ అంతగా ముద్దు పెట్టుకోకండి.... ఉక్కిరి బిక్కిరి అయిపోగలదు" అంది శారద.

"ఏం ఫర్లేదోయ్. మనకిందులో పధ్నాలుగు సంవత్సరాల ఎక్స్‌పీరియన్సుంది" అన్నాడు శ్రీధర్ తులసిని క్రిందికి దింపుతూ.

స్కూలు గౌను మార్చుకోవటానికి లోపలికి పరుగెత్తింది తులసి.

"పాప పెద్దదవుతూంది. ఇంక ఈ జోకులు మానెయ్యాలి మీరు" అంది శారద అటే చూస్తూ.

"పన్నెండేళ్ళ వరకూ, అంటే ఇంకో అయిదేళ్ళు వచ్చేవరకూ ఫరవాలేదులే.... నీలాంటి అమ్మాయి అయితే ఇంకో పదేళ్ళ వరకూ.... అంటే ఇరవై ఏళ్ళ వరకూ అసలేమీ...."

తన మొదటిరోజు జ్ఞాపకం వచ్చి సిగ్గుపడింది.

ఈ లోపులో తులసి వచ్చి తండ్రి వళ్ళో చేరింది.

"ఈ రోజు ఏం చెప్పారమ్మా" జుట్టు సవరిస్తూ అడిగాడు.

"ది స్టార్ ఇన్ ది నైట్".

భార్యాభర్తలు ఇద్దరూ శ్రద్ధగా విన్నారు. అంతలో కిటికీల్లోంచి బైట తోటలో అనిత కనబడింది. వళ్ళోంచి క్రిందికి దూకి బైటకి పరుగెత్తింది తులసి. శారద కూడా బైటకి వెళ్ళింది. అతడొక్కడే మిగిలాడు.

ఎంత వేగంగా కదుల్తున్నాయి రోజులు. ఒక్క పాప తన ఛాయని సంతరించుకొని ఉద్భవించిన ఈ చిన్న పాప ఎంత బలంగా ఈ ఇంట్లో అందరి మనసుల్లోనూ ముద్ర వేస్తూంది? ఏ ఒడిదుడుకులూ లేకుండా.... ఏ విషాదమూ లేకుండా.... ఏమీ లేకపోవడం కూడా ఎంతమంది జీవితాల్లో సాధ్యమవుతుంది....?

శారదా అనితా బైట షెటిల్ ఆడుతున్నారు. పాప ఎంపైరింగ్ చేస్తూంది. కిటికీలోంచి అతడు చూడసాగేడు. భూమీ, ఆకాశం కలిసే చోట్నుంచి సంధ్య మేలిముసుగు సవరించుకొంటూ వస్తూంది. తన ఆలోచనల్ల ప్రాంగణంలో అతడు.

అనితకి పెళ్ళి చెయ్యాలి.... అదొక్కటే తన బాధ్యత. నిజానికి అదో పెద్ద బాధ్యత కాదు. కానీ నారాయణరావు.... అతడికిచ్చి చేస్తే శారద సంతోషిస్తుంది. ఈ విషయం ఎప్పుడూ వెల్లడించలేదు. కానీ.....కానీ.... ఆమె తెలివైంది.

నారాయణరావు- చదువూ మాటా లేనివాడు. కేవలం ప్రేమ తిండి పెడ్తుందా? కానీ.... జీవితంలో కావల్సింది తిండి ఒక్కటే కాదుగా....

అయినా ఈ సమస్య తనది కాదు. అనితది.

అవును అనితది. తననే అడగాలి. అతడు బైటకొచ్చేడు.

"ఆడతారా?" అడిగింది శారద. పాప స్టూల్ మీదనుంచి దూకి "నువ్వూ నేనూ ఓ జట్టు నాన్నా" అంది.

శ్రీధర్ తలూపేడు. గేమ్ మొదలైంది. మొదటి అయిదు పాయింట్లూ శ్రీధర్ జట్టుకే వచ్చినయ్‌గానీ ఆ తరువాత శారద షటిల్‌ని కొట్టటానికి ఎత్తిన చెయ్యి తాలూకు భంగిమ ఆటకన్నా ఇంటరెస్టింగ్‌గా వుండటంతో మరి ఒక్క పాయింటూ రాలేదు.

"నువ్వు సరిగా ఆడటం లేదు నాన్నా".

"తెలుస్తూనే వుంది కదమ్మా".

శారదకి కూడా తెలిసింది. అనితే గుర్తించలేదు. "పోనీ, నేనూ పాపా వుంటాం" అంది.

శ్రీధర్ వప్పుకోలేదు. అతడి కారణాలు అతడికి వున్నాయి. కొద్దిగా చీకటి పడింది.

ఆటలో ఓడిపోయిన దృష్ట్యా పాప తన కిడ్డీ బ్యాంక్‌లో వున్న డబ్బుతో అందర్నీ సినిమాకి తీసుకెళ్తానన్న నిర్ణయాన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. చాలా విశాలమైన మనసుతో అనిత.... సినిమా హాల్లో అందరి సాదరుఖర్చు భరిస్తానని వెల్లడి చేసింది. ఈ శుభ సమయంలో శారద తను కారు డ్రైవ్ చేయటానికి భర్తని

పర్మిషన్ అడిగింది. దానికి శ్రీధర్ వప్పుకొన్నాడు. కానీ అనితా, పాపా తీవ్రమైన అభ్యంతరాలు తెలిపారు. అయినా శ్రీధర్ తన వీటో పవర్ ఉపయోగించి, తీర్మానం నెగ్గేలా చేసేడు.

సినిమా నుంచి వచ్చేక ఆ రాత్రి డిన్నర్‌లో శారద ఆరోగ్యం ప్రసక్తి వచ్చింది.

పాప పుట్టిన తరువాత ఆమె ఆరోగ్యం కొద్దిగా పాడయిన మాట నిజమే, అయితే దాన్ని బయటపడనివ్వకుండా కప్పిపుచ్చుతూంది. తల్లిని వదిలి ఓ పది రోజులు వుండటానికి పాప వప్పుకొంది. గాలి మార్పు కోసం ఎక్కడికైనా వెళ్ళటానికి నిర్ణయం జరిగింది.

తరువాత ఎవరి గదులలోకి వారు వెళ్ళిపోయారు. రాత్రి పదకొండయింది. వెన్నెల మసగ్గా పడుతూంది. వాతావరణం ప్రశాంతంగా వుంది. ప్రశాంతంగా.... తుఫాను వచ్చేముందు ప్రశాంతత....

కిటికీ తెరల్ని సర్ది, అనిత టేబిల్ దగ్గరికి వెళ్ళింది. మెయిన్‌లైట్ ఆర్పి బెడ్‌లైట్ వేసింది. రాక్‌లో పుస్తకాలు... టేబుల్‌మీద బుద్ధుడి బొమ్మ, నిశ్చలంగా వున్న కిటికీ తెర.... ఆ గదే స్టిల్ ఫోటోలా వుంది. ఆ నిశ్చలత్వాన్ని భరించలేక సన్నగా టేప్‌రికార్డర్ పెట్టింది. మళ్ళీ అదే టేప్.... ముఖేష్‌ది. "జాన్ చలే జాతే హై కహా....జాన్ వాలే....."

అనితకి ఆ రోజు చదవాలనిపించలేదు. అలాగే పక్కమీద వాలిపోయింది.

....సైన్సు రికార్డు పూర్తి చెయ్యాలి. ఆమెకి బోటనీ అంటే తలనొప్పి, రాబోయే ఫస్ట్‌క్లాస్ ఈ బోటనీ వల్లే పోతుందేమో. దూరంగా గేటు తీసిన చప్పుడు... నారాయణరావు వస్తున్నాడు. ఆమె ఆలోచనలు అతనిమీదికి వెళ్ళినయ్. జాలి....

అదే సమయంలో ఆమె గురించి యింకో గదిలో శ్రీధర్ భార్యతో చర్చిస్తున్నాడు.

"....అంతేనంటావా?"

"ఎలా?– అనిత ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్. ఇతడికేమో మాటకూడా రాదు" ఆమె జాలిగా అంది. ఆమెకూడా తన పంథాలోనే ఆలోచిస్తున్నందుకు అతడికి సంతోషం వేసింది. అయినా పూర్తి సంతోషానికి ఎక్కడో ఏదో అడ్డు పడుతూంది.

ఆ శక్తి నారాయణరావు కళ్ళలోనే వుందా? లేక అతడికి జరుగుతున్న అన్యాయంపట్ల తన గిల్టీ కాన్షస్‌నెస్సా!

తను చెప్పింది శారద వెంటనే వప్పుకోవటం అతడికి ఎందుకో నచ్చలేదు. శారద తనలాగే ఆలోచిస్తూందని అతడు అనుకోలేదు.

ఇంతకీ తను నారాయణరావుని ద్వేషిస్తున్నాడా? ప్రేమిస్తున్నాడా? జాలిపడుతున్నాడా?

ఈ సంభాషణంతా మొదలవటానికి పది నిమిషాల ముందే నారాయణరావు ఇంటికొచ్చాడు.

విశాలమైన డైనింగ్ టేబుల్ ముందు ఒక్కడే కూర్చొని నిశ్శబ్దంగా భోజనం చేశాడు. రామయ్యకూడా అతడికోసం ఎదురు చూడలేదు. అతడు భోజనం పూర్తిచేసి, మేడమీది కారిడార్‌లో నడుస్తూ వుండగా తన ప్రసక్తి వినబడింది. ఆగి, పూర్తిగా విన్నాడు. చాలారోజుల తర్వాత అతడి మొహంలో ఒక భావం.... ఒక ఛాయ కనబడింది. చాలా విషాదకరమైన ఛాయ. అయితే అది క్షణం మాత్రమే. క్షణంలో అతడు మామూలు మనిషైపోయాడు. అక్కడినుంచి కదిలిపోయాడు.

అదే సమయానికి అనిత తన గదిలో వెల్లకిలా పడుకొని పైకప్పుకేసి చూస్తూ వుంది. తలుపు కిర్రున చప్పుడైతే తలతిప్పి చూసింది.

మసక చీకట్లో ఒక ఆకారం నెమ్మదిగా తలుపుతోసి గుమ్మం దగ్గర నిలబడింది. అనిత కెవ్వున అరవబోయి ఆగిపోయింది.

నారాయణరావు...!

"ఏమిటి బావా?" అడగబోయి ఆగింది. అతడి మొహంలో ఏదో భావం ఆమెని మాట్లాడనివ్వలేదు. అతడి కళ్ళు నిస్తేజంగా వున్నాయి. అవే వేయి ప్రశ్నలు అడుగుతున్నాయి. ఆమె అర్థంచేసుకోలేని ప్రశ్నలు.

పక్కమీద సగం లేవబోయి ఆగిపోయిన ఆమె, అలాగే నిశ్చలంగా వుంది. అతడు అచేతనంగా ఆమెవైపు చూసి, నెమ్మదిగా వెనక్కి తిరిగి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు. అతడెందుకు వచ్చాడో, ఏమీ చెప్పకుండా ఎందుకు వెళ్ళిపోయాడో ఆమెకి అర్థంకాలేదు.

అర్థం కాదుకూడా.

* * *

"చాలా అవసరమైన పనిమీద నిన్ను పిలిపించాను" అన్నాడు రాబర్ట్ పైప్ విదిలిస్తూ శ్రీధర్ తలూపాడు.

రాబర్ట్ కొంచెంసేపు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"చెప్పండి" అన్నాడు శ్రీధర్ నిశ్శబ్దాన్ని భరించలేక.

"అదే.... ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తున్నాను" అని ఆగి, "శ్రీధర్! నేను మీకు చాలా ఋణపడి వున్నాను" అన్నాడు.

ఆ ప్రసక్తి ఇప్పుడెందుకొచ్చిందో శ్రీధర్‌కి అర్థంకాలేదు. అతడేదో అనబోతూ వుంటే రాబర్ట్ అన్నాడు. "నాకున్న ఒక్కగానొక్క పాపని రక్షించావు నువ్వు. నా మనమరాల్ని... ఆ సంఘటనే యింకోలా దారితీసి వుంటే.... అది ఆలోచించటానికే నా మనసు భయపడుతూంది. ఒక యాక్సిడెంట్‌లో కొడుకునీ, కోడల్నీ కోల్పోయిన నేను, ఈ సారి పాపని కూడా కోల్పోయి వుంటే ఇక ఆత్మహత్య తప్ప గత్యంతరం వుండేది కాదు".

అదంతా ఇప్పుడు ఎందుకు చెబుతున్నాడో శ్రీధర్‌కి అర్థంకాలేదు. రాబర్ట్ ముందుకు వంగి "ఇక అసలు విషయానికి వస్తాను శ్రీధర్" అన్నాడు. "ఎన్ని సంవత్సరాల క్రితం నేనీ దేశం వచ్చానో తెలీదు. అదృష్టం బావుండి పట్టిందల్లా బంగారమయింది. నీకు తెలియనిదేముంది? ఇప్పుడు నేను కరోర్ పతిని" పైప్ వెలిగించుకోవటం కోసం ఆగి, చెప్పసాగాడు.

"ఇన్ని సంవత్సరాల తరువాత నాకు మళ్ళీ కోర్కె కలిగింది. ఈ ఆఖరి రోజులు నా దేశంలో గడపాలని. నా మనవరాలు కూడా పెళ్ళీడు కొచ్చింది. ఒకసారి నేటివ్ ప్లేస్‌మీద గాలి మళ్ళిందంటే ఆపడం కష్టం" నవ్వాడు.

శ్రీధర్ మాట్లాడలేదు.

"టెక్సాస్‌లో ఒక చిన్న పల్లె మాది. అక్కడే మాకో ఇల్లుకూడా వుంది. విశాలమైన పచ్చిక బయళ్ళూ- దూరంగా కొండలూ, నువ్వొకసారి వచ్చావంటే మళ్ళీ తిరిగి రావాలనిపించదు".

గదిలో ఎయిర్ కండిషనర్ చప్పుడు తప్ప ఇంకేమీ వినిపించటం లేదు. పేపర్ వెయిట్ వేళ్ళమధ్య తిప్పుతూ అతడు వింటున్నాడు.

"నువ్వు నాకో సాయం చెయ్యాలి శ్రీధర్. నీకు తెలియనిదేముంది ఈ దేశం టాక్సుల విషయం- ఓ విదేశీయుడు ఈ దేశం నుంచి ఆస్తులు తీసుకుపోతానంటే రిజర్వ్ బాంక్ వప్పుకోదు. అందుకని....." ఆగాడు.

శ్రీధర్ వూపిరి బిగపట్టాడు. ఏమిటి ఇతడు చెప్పదల్చుకొన్నది?

"శ్రీధర్! నువ్వు నాకో సాయం చెయ్యాలి. ఈ ఆస్తులన్నిటినీ నీ పేర్న మార్పిస్తాను, తరువాత నెమ్మదిగా వీటిని బంగారం రూపంలో నాకు పంపాలి".

అతడి పథకం క్షణంలో అర్థమైంది శ్రీధర్‌కి. కుర్చీలోంచి లేచి "ఇది నేను చేస్తానని ఎలా అనుకొన్నారు? స్మగ్లింగ్" అన్నాడు.

"దీనికింత పెద్ద పదం ఎందుకు.....?"

"ఇదీ అందులోకే వస్తుంది. దేశాన్ని మోసం చెయ్యటం....."

"కానీ ఇది నేను న్యాయంగా సంపాదించిన ఆస్తి".

"క్షమించండి! ప్రభుత్వం ఆ పాలసీ ఎందుకు పెట్టిందో నాకయితే తెలీదు. కానీ దాన్ని ఉల్లంఘించలేను....."

"కానీ నిన్ను నేను పైకి తీసుకొచ్చాను. డైరెక్టర్నీ చేశాను".

"అందుకు నేనెప్పుడూ కృతజ్ఞుడినే. కావాలంటే మీ ఆస్తికి ట్రస్టీగా వ్యవహరిస్తాను.... వచ్చే రాబడినంతా మీరెక్కడుంటే అక్కడికి పంపుతాను. అంతేకాని మోసం చెయ్యలేను".

"బాగా ఆలోచించు శ్రీధర్. నిజానికి నేను ఈ పనికి నిన్ను ఉపయోగించనక్కరలేదు. కానీ కేవలం నా మనవరాల్ని రక్షించావన్న కృతజ్ఞతతో నేను యీ అవకాశం నీకు కల్పిస్తున్నాను. నీకు సగం ఆస్తి ఇస్తాను. ఇంతకన్నా నువ్వు ఎక్కువ ఉహించగలవా?"

శ్రీధర్ మొహం ఎర్రబడింది. "సగంకాదు, పూర్తిగా ఇచ్చినా సరే- నేనిదంతా చేస్తానని ఎలా వూహించారు మీరు?" అన్నాడు.

రాబర్ట్ పైప్ పీలుస్తూ "ఏభై లక్షల ఆస్తి కోసం" అన్నాడు.

శ్రీధర్ దవడ కండరం రోషంతో బిగుసుకొంది. "ఈ మాటేగాని మీరుగాక ఎవరైనా అని వుంటే....." అవతలి మాట రాక ఆగిపోయాడు.

రాబర్ట్ చాలా తాపీగా కుర్చీ వెనక్కి వాలి "ఏమై వుండేది శ్రీధర్?" అన్నాడు.

ఒక్కక్షణం గాఢమైన నిశ్శబ్దం ఆ గదిలో పేరుకుంది. ఏదో అనబోయి తమాయించుకొని "సారీ సర్.... అండ్ ఇట్సాల్‌రైట్, గుడ్‌బై, అండ్ గుడ్‌బై ఫరెవర్...." అన్నాడు శ్రీధర్ లేచి.

అతడు తలుపు దగ్గరికి నడిచి తలుపు తీసి బైటకు రాబోతూంటే "శ్రీధర్" అని వినిపించింది వెనుకనుంచి.

ఆగి వెనక్కి తిరిగేడు.

"ఆఫ్టాల్..... ఐయామ్ లీవింగ్, ఇంకో నాల్గురోజుల్లో వెళ్ళిపోతున్నాను గదా..... జరిగిందంతా మర్చిపోయి ఈ నాల్గురోజులు మామూలుగా ఏమీ జరగనట్టు వుండలేవా?"

ఆ కంఠంలో వచ్చిన మార్పుకి కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అసలేమీ జరగనట్టు ఎంత మామూలుగా వున్నాడు! అందుకే వ్యాపారంలో అంత పైకి రాగలిగేడు.

అతడికి బాధగా వుంది. దాదాపు పదహారేళ్ళ అనుబంధం. ఇంత కాలం ఇంత చక్కగా పెంపొందిన స్నేహం కేవలం డబ్బు కారణంగా విడిపోతుంది.

ఈ నాల్గురోజులూ కలిసి వుంటారు. కానీ ఆ పూర్వపు స్నేహం, గౌరవ భావం వుండవు. ఇలా జరక్కపోయి వుంటే ఎంత బావుండును.

ఆయనంటే ఎంత గౌరవం, ప్రేమ. నిజానికి తను ఏమీలేని స్థితి నుంచి పైకి వచ్చాడంటే కారణం ఆయనే. కానీ....కానీ దానికి ప్రతిఫలంగా ఆయన కోరిన కోర్కె! ఉహూఁ ఆత్మవంచన అంత సులభం కాదు. ఒకవేళ ఆయన చెప్పిన పనికి వప్పుకొన్నా ఆ తర్వాత వచ్చే మానసిక సంఘర్షణని తట్టుకోవటం కష్టం.

ఈ నిర్ణయమే మంచిది. ఆయనక్కావాలంటే ఈ పని చేసిపెట్టేవాళ్ళు- 'కో' అంటే కోటిమంది. వచ్చి కూర్చొన్నాడు.

"నేను జూలై నాలుగున బయల్దేరుతున్నాను".

తెలుసన్నట్టు తలూపేడు.

".....బహుశ..... మళ్ళీ ఈ దేశం రాను".

అతడు మాట్లాడలేదు.

"మనందరం కలిసి ఈ కంపెనీని వృద్ధిపరిచేం. నిజానికి నాకన్నా మీరంతా ఎక్కువ కష్టపడారు".

మౌనంగా వుండిపోయాడు శ్రీధర్. లాభంలేదు- ఏదో ఎక్కడో తెగిపోయింది.

"ఒకవేళ నేను గవర్నమెంటుకి రూల్స్ ప్రకారం ఆస్తి అంతా అప్పజెప్పినా, నాకో యాభై లక్షలదాకా మిగులుతుంది. అదిచాలు నాకు. అఫ్‌కోర్స్! ఆశకి అంతులేదనుకో..... అయినా నాకున్నది ఒక మనవరాలే కదా".

"అయిదు నిమిషాల ముందు ఈ ఆలోచన వచ్చివుంటే ఎంత బావుండును" అనుకొన్నాడు శ్రీధర్.

రాబర్ట్ లేచి "ఓ.కే. శ్రీధర్! విష్ యూ బెస్టాఫ్ లక్" అని షేక్‌హేండ్ కోసం చెయ్యి సాచేడు. శ్రీధర్ కూడా చేయి చాచి షేక్ హేండ్ యిచ్చేడు.

"ఇంకో రిక్వెస్టు! అఫ్‌కోర్స్! ఇది నిన్ను ఇబ్బందిలో పెట్టదనుకో ఆఖరి రోజు నీ కుటుంబం అంతటితో కలిసి లంచ్ తీసుకొందామనుకొంటున్నాను. ఎనీ అబ్జెక్షన్".

ఆ కంఠంలో అభ్యర్థనకి కదిలిపోయేడు. "లేదు లేదు సర్... విత్ ప్లెజర్" అన్నాడు.

* * *

మెరుస్తూన్న డెకొలేం టేబుల్‌మీద అన్ని పదార్థాలూ అందంగా అమర్చబడి వున్నాయి. టేబుల్ చుట్టూ కూర్చొని వున్నారు. ముందు రాబర్ట్, పక్కనే తులసి..... తరువాత దంపతులు..... చివరగా అనిత- విందు ప్రారంభమైన దగ్గర్నుంచీ ఎడతెరిపి లేకుండా కబుర్లు చెపుతున్నాడాయన.

ఇన్ని సంవత్సరాలుగా కలిసి వుండి- అందర్నీ వదలి వెళ్ళటం ఆయనకీ బాధగా వుందనీ శ్రీధర్ గుర్తించేడు. అక్కణ్ణుంచి విమానాశ్రయం వెళ్ళారు.

"ఎప్పుడొస్తావ్ మా వూరు?" తులసిని అడుగుతున్నాడు.

"మా నాన్నగారు ఎప్పుడు తీసుకొస్తే అప్పుడే".

ఎయిర్‌లైన్స్ అనౌన్స్‌మెంట్ వినిపించింది.

ఆయన లేచి "వెళ్ళొస్తాను సన్" అన్నాడు.

శ్రీధర్ మాట్లాడలేదు. మనసులో భావాల్ని చెప్పటానికి ఈ మాటలేం సరిపోతాయి. అతడి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

శారద చేతులు జోడించింది.

రెండో అనౌన్స్‌మెంట్ వినిపించింది.

ఆయన జేబులోంచి ఒక కవరుతీసి శ్రీధర్ చేతిలో పెట్టి "నేను వెళ్ళాక...." అన్నాడు.

ఏముందందులో? క్షమాపణలా?

శ్రీధర్ కవర్ని కోటు జేబులో పెట్టుకొన్నాడు.

ఆయన ముందుకు కదిలేడు..... విజిటర్స్ లాంజ్ బాల్కనీలోంచి అందరూ చూస్తున్నారు.

ఆయన ప్లేన్ ఎక్కబోతూ వెనక్కి తిరిగాడు. తులసి చెయ్యి వూపింది. ఆయన కూడా గాలిలో చెయ్యి వూపాడు. అయిదు నిముషాల తర్వాత ప్లేన్ కదిలింది.

* * *

"దెయ్యంతో మాట్లాడటం ఎలానో తెలుసా?" అబ్రకదబ్ర అడిగాడు.

శ్రీధర్ కుర్చీ వెనక్కు వాలి "బ్రాహ్మిణ్! ఇంజనీరింగ్ చదివావు. మంచి ఫ్యూచరుంది. ఇలా దెయ్యం గురించీ, దేవతల గురించీ ఆలోచించకపోతే ఆ శ్రద్ధ పనిమీద చూపిస్తే బావుంటుందని నా ఉద్దేశ్యం" అన్నాడు.

"నా పనికేమొచ్చింది? మొన్న మా వాడు నాకు "ఎబౌ ఏవరేజి" అని పర్సనల్ రిపోర్టులో వ్రాశాడు" అన్నాడు.

"నీ పర్సనల్ రిపోర్టు 'నీ' కెలా తెలిసింది?" అడిగాడు శ్రీధర్ 'నీ' అన్న పదం నొక్కి పలుకుతూ.

"ఇప్పుడు ఆ పర్సనల్ డిపార్ట్‌మెంటు వాళ్ళకి మెమో ఇస్తావా ఏమిటి? అంత పని మాత్రం చెయ్యకు".

శ్రీధర్ నవ్వాడు. "వాళ్ళకెలాగో మెమో ఇవ్వాలనుకొంటున్నాను..... వాళ్ళ డిపార్ట్‌మెంటునుంచి ఫోన్‌కాల్స్ దాదాపు రెట్టింపయినయ్ ఈ మూడు నెలల్లో, ఫ్లురీ పర్సనల్ కాల్స్ ఎక్కువ చేస్తున్నారు".

"అలా ఎందుకనుకోవాలి?" అన్నాడు. అబ్రకదబ్ర. "పదిరోజుల క్రితం ఓ బుక్‌లో చదివేను. ఒక ఆఫీసులో ఇలాగే కరెంటు ఛార్జీలు వున్నట్టుండి మూడు రెట్లయ్యాయట. అందరూ తలబ్రద్దలు కొట్టుకున్నా ఎందుకో అర్థం కాలేదుట. చివరకు తేలిందేమిటంటే ఆ ఆఫీసులో పనిచేసే ఒక అమ్మాయి దగ్గిర "సైకో కైనెసిస్" అన్న పవర్ వున్నదనీ, అది ఎలక్ట్రిక్ మీటర్ని తెలియకుండానే తిప్పుతుందని. దీనికి నువ్వేమంటావ్?"

"ఏమంటాను? నువ్వు ఇలాంటి చెత్త పుస్తకాలు చదవటం మాన మంటాను".

"నువ్వెన్నయినా చెప్పు, దెయ్యాలున్నాయి. దాన్ని నువ్వు ఇంగ్లీషులో సైకో అంటావో, టెలిపతీ అంటావో నా కనవసరం" అన్నాడు. అబ్రకదబ్ర. "ఆ దెయ్యాలతో నేను చాలా కొద్దికాలంలోనే మాట్లాడబోతున్నాను" అని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

శ్రీధర్ అటే చూస్తూ కూర్చున్నాడు. ఎందుకో నవ్వొచ్చింది. ఈ రక్తంలో జీర్ణించుకుపోయిన మూఢనమ్మకాలు పోవు. తనలాటి వాళ్ళు ఎంత కాదన్నా సరే.

అతడు ఆలోచనల్లో వుండగానే ఫోన్ మ్రోగింది.

"శ్రీధర్ హియర్!" అన్నాడు అందుకొని.

"ఐయామ్ పతి. విద్యాపతి హియర్".

విద్యాపతి లాయరు. జె అండ్ జె వ్యవహారాలు చూస్తూ ఉంటాడు.

"ఎస్! పతీ...?"

"కొద్దిగా మాట్లాడాలి".

"డూ కమ్".

"ఆఫీసుక్కాదు, ఇంటికి వస్తాను".

"ష్యూర్.... సాయంత్రం టీ కి".

"థాంక్యూ!"

ఫోన్ పెట్టేశాడు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో విద్యాపతి వచ్చాడు. కొంత మామూలు సంభాషణ జరిగేక రాబర్ట్ ప్రసక్తి వచ్చింది.

"ఆయన మీకేమీ ఇవ్వలేదా?" అడిగేడు పతి.

"లేదే!"

"తాళంచెవిగానీ, రసీదుకానీ....."

అతడికి అర్థంకాలేదు. "తాళంచెవా! లేదే?"

విద్యాపతి తలగోక్కొని, "సర్లెండి అయితే" అన్నాడు. తర్వాత ఏం మాట్లాడాలో తెలియలేదు యిద్దరికీ. గదిలో కొంచెంసేపు నిశ్శబ్దం తాండవం చేసింది.

"అసలు విషయం ఏమిటి?" అడిగేడు శ్రీధర్.

"రాబర్ట్ ఒక డాక్యుమెంట్ లాకర్‌లో పెట్టేడు. దాని గురించి వివరాలు మీకు చెబుతానన్నారు, మరెందుకు చెప్పలేదో?" చెప్పకపోవటం గురించి విద్యాపతి చాలా ఆశాభంగం చెందాడని అతడి మొహం చెబుతూంది.

"సారీ! నాకేమీ తెలీదు" అన్నాడు శ్రీధర్. అంతలో అతడికి చప్పున జ్ఞాపకం వచ్చింది. ఎయిర్‌పోర్టులో రాబర్ట్ యిచ్చిన కవర్ సంగతి.

లోపలికి వెళ్ళి వెతికాడు. కోటు జేబులో దొరికింది. దళసరి కవరు. అతికించి వున్నది. దాని మీద "తులసి మై డియరెస్ట్" అని వ్రాసి వుంది. తీసుకొని బయటకొచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కవరు చూడగానే విద్యాపతి మొహం విప్పారింది. అంచు చింపి లోపల్నుంచి ఓ కాగితాన్ని తీశాడు శ్రీధర్. దాంతో పాటూ ఒక తాళం కూడా. బ్యాంక్ లాకర్‌ది. ఉత్తరం చదవటం ప్రారంభించాడు.

పూర్తయ్యేసరికి అతడి మొహం టెన్షన్‌తో ఎర్రబడింది. కుర్చీలోంచి లేచి "పదండి వెళ్దాం" అన్నాడు. విద్యాపతి మాట్లాడలేదు.

ఇద్దరూ కారులో కూర్చున్నారు. అయిదు నిమిషాలలో కారు బ్యాంక్ చేరుకుంది. తాళం తీసుకుని విద్యాపతి లోపలికి వెళ్ళాడు.

శ్రీధర్ కార్లోనే కూర్చుని వున్నాడు. బ్యాంక్ ఈవెనింగ్ సెక్షన్ అవటం వల్ల అంత రష్‌గా లేదు. ఒకరో, ఇద్దరో లోపలికి వెళుతున్నారు. అతడు స్టీరింగ్ దగ్గర కూర్చుని వున్నాడు. రెండు నిమిషాలు గడిచాయ్. మళ్ళీ కవరులోని ఉత్తరాన్ని తీశాడు. సంధ్య వెలుగులో చదవటం ప్రారంభించాడు.

"డియర్ శ్రీధర్!

నేను వెళ్ళిపోయిన తర్వాత ఈ ఉత్తరాన్ని చదువుతావు నీవు. అదే నా ఉద్దేశ్యం కూడా. మాటలు చెప్పలేని కొన్ని భావాల్ని ఉత్తరాలు చెబుతాయి.

'మోసం' అనేది ఒక్కో పరిస్థితిలో ఒక్కో అర్థాన్ని యిస్తుందని నా ఉద్దేశ్యం. అయిదు రూపాయలకు కొని పదికి అమ్ముతున్నాం మనం. నిజానికి ఆరుకే అమ్మొచ్చు. అంటే జె అండ్ జె మోసం చేస్తున్నదన్న మాట. ఒక మోసం చేసే కంపెనీలో భాగస్తులం మనందరం.

ఈ మోసాన్నే పెద్ద ఎత్తులో చేద్దామన్న ఊహ నాకు కొద్దిగా వచ్చిన మాట నిజమే. కానీ నేను నువ్వనుకునేటంత దుర్మార్గుడ్ని కాను శ్రీధర్. కష్టపడి సంపాదించిన యాభై లక్షల్ని– కేవలం నేను భారతీయుడిని కాను అన్న కారణంగా ప్రభుత్వానికి అర్పించటం అంత సులభం కాదు. అందుకే నీకు ప్రపోజ్ చేశాను. ఏదో నీ నిజాయితీని పరీక్షించటానికి నేనిదంతా చేశాననుకోకు.

అయితే నీవు కాదన్నావు. ఈ పనిచేస్తే నీకు రెండు మూడు లక్షలు లాభిస్తుందని నీకు తెలుసు. అంతేకాదు. నేను నీ ప్రభుత్వాన్ని మోసం చేసినట్లే నువ్వు నన్ను మోసం చెయ్యదల్చుకుంటే ఆ యాభై లక్షల్నీ స్వంతం చేసుకోవచ్చనీ నీకు తెలుసు. అయినా కాదన్నావు.

శ్రీధర్! ఒక్కో చిన్న విషయం మనిషిమీద అత్యంత ప్రభావం చూపిస్తుందంటారు. కథ క్లయిమాక్స్‌కి వెళ్ళిందనీ, నేను పశ్చాత్తాపంతో కృంగిపోతున్నాననీ అనను. కానీ ఆలోచించాను. ఏ రెండు లక్షల ఆస్తికో వారసుడైన ఒక యువకుడు మరో రెండు లక్షలు వచ్చిపడుతూంటే వద్దనగలిగే నిజాయితీ వున్న వాడైతే నేనేనా కోటీశ్వరుడనై వుండి యాభయ్ లక్షల్ని కాదనలేనిది. చూద్దాం. నిజాయితీ ఎంత సంతృప్తినిస్తుందో?

ఈ ఆలోచన వచ్చాక మరిక ఆ ఆలోచన విరమించుకొన్నాను. ఎవర్నీ నియమించలేదు. అర్థం పర్థంలేని రూల్స్‌ని పెట్టిన ఈ ప్రభుత్వానికి ఆస్తిని వప్పగించడం నా కిష్టంలేదు. అందుకే నా ఆస్తినంతటినీ క్రైస్తవ మిషన్లకు

రాసిచ్చాను. శ్రీధర్! ఇరవై నాలుగేళ్ళ వయసులో ప్లేన్ ప్రమాదంలో నా కొడుకూ, కోడలూ చనిపోయారు ఒక్క మనవరాల్ని వదిలి!

ఆ రోజు జ్ఞాపకం వుందా నీకు? కోటయ్య చనిపోయిన రోజు. ఆ రోజే నా మనవరాలి పదో సంవత్సరపు పుట్టినరోజు. అందుకే ఫ్యాక్టరీకి నా దగ్గరికి వచ్చింది. ఆ రోజు జరిగిన సంఘటన జ్ఞాపకం వస్తే ఇప్పటికీ నా వళ్ళు గగుర్పొడుస్తుంది. నువ్వుగాని రక్షించకపోయివుంటే పదేళ్ళకే నా మనవరాలికి నూరేళ్ళూ నిండి వుండేవి. నాకేమీ మిగిలి వుండేదికాదు.

నా రెండో మనవరాలు తులసి. తులసిని నేను ఎంత అభిమానిస్తానో నీకు తెలుసు. వెళుతూ నీకో బహుమతి ఇచ్చి వెళదామనుకొన్నాను. కానీ యివ్వను. ఎందుకివ్వాలి? నాకు సాయం చెయ్యని వాడికి? బిజినెస్ ఈజ్ బిజినెస్. నీ కివ్వను. నీ కూతురికిస్తాను అదీ యిప్పుడు కాదు పదో సంవత్సరం నిండిన పుట్టినరోజునాడు. ఏ రోజునైతే నా మనవరాలు రక్షించబడిందో– ఆ రోజున నీ కూతురికి ఆ బహుమతి లభిస్తుంది. ప్రభుత్వానికి వెళ్ళవలసింది నీ కూతురికి వస్తుంది.

ఈ కవర్‌లో వున్న తాళంతో లాకర్‌లో వున్న పేపర్సు....."

కారు తలుపు చప్పుడవటంతో తలెత్తి చూశాడు.

విద్యాపతి లోపలికి వచ్చి కూర్చున్నాడు. చేతిలో స్టాంప్ పేపర్లున్నాయి.

"శ్రీధర్" అతడి కంఠం వణుకుతూంది.... "మీ కూతురు ఎంత అదృష్టవంతురాలో తెలుసా?"

"ఎంత?" స్టార్ట్ చేస్తూ అడిగాడు. కారు కదిలింది.

"ఇరవై లక్షలు.... ట్వంటీ లాక్స్".

అతడి చేతులు స్టీరింగ్ మీద బిగుసుకున్నాయి. అయినా కారు వేగాన్ని తగ్గించలేదు. ఇరవై లక్షలు.... ఏదో బహుమతి అనుకున్నాడు గానీ, ఇంత అనుకోలేదు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

జరిగినదంతా నిజమే అన్న నమ్మకం ఇప్పుడిప్పుడే కలుగుతూంది. తనలో తనే నవ్వుకొని "తులసీ డార్లింగ్" అనుకున్నాడు ప్రేమగా.

కారు వేగంగా సాగిపోతోంది. దూరంగా ఎక్కడో ఓ తీతువుపిట్ట అరుస్తూంది.

"చాలా అదృష్టం.... చాలా...." అన్నాడు విద్యాపతి.

"మనిషికి అదృష్టం డబ్బుతోనే వస్తుందా?"

విద్యాపతి ఈ ప్రశ్నకి కొంచెం దెబ్బతిని "డబ్బు చేయనిది ఏముంది ఈ ప్రపంచంలో?" అన్నాడు.

శ్రీధర్ మాట్లాడలేదు. విద్యాపతి మళ్ళీ చేతిలోవున్న పేపర్సు చదవటం ప్రారంభించాడు. కారు వేగంగా సాగిపోతోంది.

"ఇంకా ఏం వ్రాశారు....?" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ శ్రీధర్ అడిగాడు.

"దాదాపు ముప్ఫై అయిదు లక్షలు క్రైస్తవ మిషనరీలకు వెళ్తుంది" అని ఆగి, మళ్ళీ తనే "ఒక వేళ ఆయనేగానీ తనతోపాటు ఈ ఆస్తి అంతా తీసుకుపోదామనుకుంటే అయిదారు లక్షలకన్నా ఎక్కువ వచ్చివుండేది కాదేమో- టాక్సులు పోను" అన్నాడు.

"ఈ ఇరవై లక్షలు?"

"తులసికి రావల్సిన ఇరవై లక్షలు.....! ఆమెకి పదో సంవత్సరం వచ్చేవరకూ బ్యాంక్‌లో వుంచబడుతుంది. దీనిమీద వచ్చే వడ్డీ ఒక శరణాలయానికి చెందుతూంది. సరిగ్గా ఆమె పదో పుట్టినరోజునాడు ఆ ఫిక్సడ్ డిపాజిట్ రశీదు ఆమెకి అందజేయబడుతుంది. ఆపై ఎనిమిది సంవత్సరాలకు ఫిక్సడ్ డిపాజిట్..... ఆమె కోస్తున్న కేక్ పక్కన ఆ డిపాజిట్ రిసీట్ వుంచాల్ట! తాతయ్య యిచ్చిన ప్రజంటేషన్ అని యివ్వాల్ట. చాలా సెంటిమెంటల్ ఫెలోలా వున్నాడు".

ఆయనెంత బిజినెస్ మానో తెలిసిన శ్రీధర్ మాట్లాడలేదు. విద్యాపతి లాయరు. కాబట్టి కాగితాలు క్షుణ్ణంగా చివరికంటా చదివాడు.

లాయర్లెప్పుడూ కీడే శంకిస్తారు. లిటిగేషన్ ఎక్కడుందా అని ఆలోచిస్తారు. పదో సంవత్సరం వచ్చాక ఈ ఆస్తి తులసికి దక్కుతుంది.

రాకపోతే.....?

అతడు చదవటం మొదలుపెట్టాడు. చివరి పేజీలో దొరికింది. అతడి క్కావలసిన జవాబు. పదో సంవత్సరం లోపులో తులసికి ఏదైనా ప్రమాదం జరిగితే ఈ ఆస్తి అంతా శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయానికి చెందుతుంది.

అతనికి ఈ పేరు చాలా వింతగా అనిపించింది.

శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయం! ఆ విషయం శ్రీధర్‌కి చెప్పాడు. అతడికి నవ్వొచ్చింది.

రాబర్ట్‌కి తనమీద కోపం తగ్గలేదన్నమాట....! పదో సంవత్సరం వరకూ ఒక శరణాలయానికీ, తరువాత ఆమె పేరుమీద ఓ బ్యాంక్‌లో, ఆ తరువాత- తన కూతురు 'మేజ'రయ్యాక ఆమెకే డైరెక్టుగా.

అంటే అందులో తన ప్రమేయం ఏమీ వుండకుండా చేశాడన్న మాట. ఆయన ఓ విషయం మర్చిపోయినందుకు అతడికి నవ్వొచ్చింది. తనకీ తులసి

ఒక్కతే కూతురు. తులసి కోసం కాకపోతే తను యింత సంపాదించటం అనవసరం.... ఎలాగూ తనదంతా తులసికే దక్కుతుంది.

అతడు ఈ ఆలోచనల్లో వుండగానే కారు ఇంటి కాంపౌండ్‌లో ప్రవేశించి పోర్టికోలో ఆగింది. లోపల్నుంచి శారద పరుగెత్తుకు వచ్చింది. ఆమె మొహం దిగులుతో వాడిపోయి వుంది.

"ఏవండీ.... తులసి ఇంకా స్కూల్‌నుంచి రాలేదండీ! అక్కడా లేదట...." అంది ఏడుస్తూ.

అతడు నిశ్చేష్టుడయ్యాడు.

4

"శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయం" అన్న బోర్డు అక్కడ వ్రేలాడగట్టబడి వుంది. చిన్న దడి, ఏదయినా బలమైన మేక తోస్తే పడిపోవటానికి సిద్ధంగా వున్నట్టు వుంది. కాంపౌండ్‌లో నాలుగయిదు పాకలు వున్నాయి.

ఒక పాక మిగతావాటికన్నా కొద్దిగా ఎత్తుగా వుంది. అది చిదానంద స్వామి వారిది.

ఆ శరణాలయాన్ని అభివృద్ధి పరచటమే ఆయన జీవితాశయం.... అందుకు ఆయనకి తోడ్పడుతున్నది సరస్వతి, పైడితల్లి అనే విశ్వాస పాత్రమైన యిద్దరు శిష్యులు.

చూడటానికి పైడితల్లి పైడితల్లిలానే వుంటాడు. అంగుళంకన్నా ఎక్కువ పెరగని జుట్టూ పిలకలాటిదీ, పేరుకి అసలు తగినట్టూ, తెలంగాణా భాషా- మధ్యలో ఎలా వస్తుందో తెలీదుగానీ ఇంగ్లీషూ-

ఇక సరస్వతి- కొద్దిగా పొట్టి. ప్రతి విషయానికి అమితంగా భయపడే స్వభావం.... అతడి తండ్రిమీద బెంగాలీ ప్రభావం బాగా పడినట్టుంది. అందుకే కొడుక్కి సరస్వతీచంద్ర ఛటోపాధ్యాయ అని పేరు పెట్టాడు. చివరకి 'సరస్వతి' మిగిలాడు.

ఈ ఇద్దరి తోడ్పాటుతో ఆ ఆశ్రయాన్ని ఓ శాంతినికేతనంగా మార్చటానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కానీ మంచి ప్రయత్నానికి ఆటంకాలు ఎక్కువ అన్నట్టు

ఆయన పని అంత సులభంగా సానుకూల పడేటట్టూ లేదు. ఆయనకేమో దేవుని ధ్యాన చింతనే తప్ప ఇంకోటి లేదు. ఆయన ధ్యాన సమాధిలో వుండగానే తలుపు దగ్గర అలికిడి అయింది. వచ్చి కూర్చున్నాడు సరస్వతి.

"నాయనా" స్వామివారి కంఠంలో విచారం ధ్వనించింది. "మన ఆశ్రయంలో రోజు రోజుకీ చేరేవాళ్ళు ఎక్కువ అవుతున్నారు. పవిత్రమైన ఈ నెలవు ఎంతోమందికి శాశ్వతానసరాలను కల్పించబోతూంది, కానీ ధనం సమస్య. ఈ సమస్య కారణంగా ఇది మూతపడితే మన జీవితాశయం దెబ్బతింటుంది. ఇంతకాలం ఎలాగో నడుపుతూ వచ్చాం. సగం వరకూ వచ్చిన ఈ నౌకని నడిసముద్రంలో వదిలి వెయ్యటానికి నాకు మనస్సు వప్పటంలేదు నాయనా" అంటూ లేచేరు. సరస్వతి ఆయన్ని అనుసరించేడు. ఇద్దరూ బయటనున్న విశాలమైన ప్రాంగణంలోకి వచ్చారు.

అక్కడ సాయంత్రపు ప్రార్థన జరుగుతూంది. అంతమంది ఆడపిల్లలు వరుసగా నిలబడి, దేవుడ్ని నిశ్శబ్దంగా ప్రార్థించటం చూస్తూ ఆయన ఒక క్షణం పొంగిపోయారు. తను స్వయంగా నాటిన ఈ ఆశ్రమం అనే మొక్క చిగుళ్ళు పెట్టుకొని విస్తరిస్తూంది.

"దేవా మమ్మల్ని కరుణతో ఆశీర్వదించు తండ్రీ" అనుకొన్నారు.

ప్రార్థన మొదలైంది. ఆయన చేతులు జోడించి నిలబడి వున్నారు. ప్రార్థన అవగానే బాలికలందరూ భోజన గృహానికి దారితీసేరు.

"మంగమ్మా!" పిలిచేరు. ఓ నలభై ఏళ్ళ విధవరాలు వచ్చింది.

"అందరికీ భోజన సదుపాయాలు బాగానే జరుగుతున్నాయి గదా...."

"జరుగుతున్నాయి స్వామీ.... కానీ...." ఆగి తటపటాయిస్తూ- "ఆహారపదార్థాలు ఇంకో రెండు రోజులకే సరిపడేటట్టు వున్నాయి" అంది.

స్వామి భారంగా నిశ్వసించి- "అంతా దేవుడి దయ" అన్నారు. నాల్గయిదు పాకలున్నాయి. ఎవరి నివాసానికి వారు చేరుకొన్నారు. దూరంగా ఎనిమిది కొట్టింది. ఆ రోజు ఏకాదశి. ఆయన భోజనం చేయరు. ఆయన తిరిగి తన నివాసానికి వచ్చేసరికి అక్కడ పైడితల్లి కూర్చొని వున్నాడు. నోట్లో చుట్ట, మాసిన ధోవతి, జుబ్బా ఖద్దరుది.

"ఏం పైడితల్లీ బాగున్నావా?"

"మీ దయవల్ల బాగానే వున్నా సావీఁ" అన్నాడు.

"ఆ చుట్ట ఆరోగ్యానికి హానికరం నాయనా!" ఆప్యాయంగా హెచ్చరించారు.

"ఫర్లేదులే సావీఁ.... పుట్టిన కాడ్నుంచీ తాగుతున్నా. అప్పుడు సెయ్యనిదింక ఇప్పుడేం సేత్తది...."

"కనీసం నా ముందయినా తాగకు నాయనా!"

"మీరు దేముడిలాటోరు సావీఁ! మీ ముందు తాగొద్దు అంటే ఎక్కడా తాగొద్దన్నమాటేగా. దటీజ్ వెరీ బాడ్ ఆన్ యువర్ పార్ట్ సావీఁ....."

స్వామివారు అతనివంక నిదానంగా చూసి "నీ బట్టలొకసారి మంగమ్మ కివ్వకూడదా నాయనా ఉతికిపెడ్తుంది" అన్నారు.

"ఆత్మ అనేదానికి శరీరమే బట్టలాటిది. మనసు పవిత్రంగా వున్నంత వరకూ బట్టలెట్టాటివయినా ఫర్లేదని మీరే సెప్పినారుగా సావీఁ"

"కానీ నీ జుబ్బా ధోవతి నీ సంస్కార హీనతని చూపిస్తుంది బిడ్డా!"

"సివిలిజేషన్ విల్ నాట్ బి ఇన్ జుబ్బా ధోవతీ సావీఁ"

"నాయనా! మాట్లాడితే పూర్తిగా ఇంగ్లీషు మాట్లాడు, లేకపోతే స్వచ్ఛమైన తెలుగు మాట్లాడు. రెండూ మిశ్రమం చేయకు".

పల్లెటూర్లో పెరిగినోడ్ని.... మధ్యలో నాలుగింగిలీసు ముక్కలు నేర్చుకొన్నానని సెప్పి మొత్తం యవ్వారమంతా మార్చెయ్యాలంటే నావల్ల కుదర్దు సావీఁ, ఈ బాస ఈ బాసే- ఆ లాంగ్వేజీ ఆ లాంగ్వేజే".

"సరే నాయనా! నీ ఇష్టం" అంటూ ఎయిర్ కండిషనర్ ఆన్ చేసేరు.

"మన సంస్థ ఆర్థిక పరిస్థితి పట్ల నాకు చింత ఎక్కువైంది బిడ్డా! వనరులు తగ్గిపోతున్నాయి".

"ఖర్చులు తగ్గించుకోవాల."

"అది కుదర్దు బిడ్డా!"

"అయితే రాబడి పెంచుకోవాల".

"పోలీసుల దృష్టి ఇటే వున్నదనీ- కొంతకాలం వానప్రస్థమైతే మంచిదనీ నీవే శలవిచ్చావుగా నాయనా!"

"రాబడికి చాలా మార్గాలున్నాయని కూడా సెప్పినట్టు గుర్తు సావీఁ!"

ఆయన కూర్చుంటూ "తీర్థం ఏం పుచ్చుకొంటావు నాయనా?" అన్నారు.

"బ్రాందీలో ఎన్నీళ్ళు సావీఁ!"

రెండు గ్లాసులూ నింపేరు. "ఛీర్సు!"

"అంటే సావీఁ?"

"నాకూ తెలీదు నాయనా! తాగు".

"మహాప్రసాదం సావీఁ!"

"డబ్బు సమస్య బిడ్డా!" గుర్తుచేసేరు.

"ఆ ఇంగ్లీషాయన ఎల్లిపోతూ వదిలేసినారుగా...."

"అదింక మూడు నెలలలో మననొదిలేసి వెళ్ళిపోతదిగా?"

"ఎల్లిపోకుండా సెయ్యి సావీఁ!"

"ఎలా బిడ్డా?"

"కత్తిద్వారా గానీ, తుపాకీద్వారా గానీ, పిస్తోలుద్వారా గానీ అలా సెయ్యొచ్చు సావీఁ".

"కానీ పోలీసుల దృష్టి ఇటువైపే వుంది నాయనా! మొదట అనుమానితులం మనమే అవుతాం".

"నిజమే సావీఁ" అన్నాడు పైడితల్లి. "ఇన్నాళ్ళకి నువ్వూ సరిగ్గా ఆలోచిత్తన్నావ్."

"నన్ను మీరూ అను నాయనా!"

"మందు గొట్టినప్పుడు భరించాల సావీఁ".

"ఏదో ఆలోచించి చెప్పు బిడ్డా! నేనా కాటికి కాళ్ళు చాచుకొన్న వాడిని. ఏదో ఈ ఆశ్రమంలో కృష్ణా, రామా అంటూ కూర్చోవలసిన వయసు. నువ్వే పూనుకోకపోతే ఈ పని జరిగేటట్టు లేదు".

"అయితే ట్రంప్ కార్డ్ ఏసెయ్యమంటావా సావీఁ? యు వాంట్ మి టు ప్లే ది ట్రంప్ కార్డ్".

పైడితల్లికి ఏదో ఆలోచన వచ్చిందని గ్రహించి తేలిగ్గా నిశ్వసించారు. పైడితల్లి తల్చుకొంటే జరగనిది లేదని ఆయనకు తెలుసు. "ట్రంప్ కార్డా! అంటే?"

"ఆఖరి అస్త్రం సావీఁ".

* * *

"ఏమైంది?" అడిగాడు శ్రీధర్ కారు దిగబోతూ. "పాప ఇంకా స్కూల్ నుంచి రాలేదండీ!"

"ఏడున్నర కావొస్తూంది. ఇంతవరకూ ఎక్కడికి వెళ్ళింది?" అతడి భృకుటి ముడిపడింది. విసురుగా కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు. అరవై మైళ్ళ స్పీడులో కారు స్కూల్ వైపు దూసుకుపోతుంది. విద్యాపతి ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు.

అప్పుడే పాపకి శత్రువులు తయారయ్యేరా? తన అభిప్రాయం పైకి చెప్పలేదు విద్యాపతి. కానీ ఆలోచన మనసుని తొలిచేస్తూ వుంటుంది ఎప్పుడూ. ఈ లాయరు చదువు కీడుని శంకించటానికి తప్ప దేనికీ పని చేయదనుకుంటా.

కారు స్కూలు ముందు ఆగింది. వాచ్‌మన్ తలుపులు వేస్తున్నాడు. శ్రీధర్ వెళ్ళి అడిగాడు.

"ఏ తులసి?" అడిగాడు వాచ్‌మన్– తెల్లటి బట్టతల గోక్కుంటూ.

శ్రీధర్ వర్ణించి చెప్పాడు.

"ఉహూ....." అన్నాడతను. "ఎంతమంది పిల్లలు. గుర్తుకు రావటం లేదు".

వాళ్ళకేం చేయాలో తోచలేదు. "ఈ రోజు స్కూల్ బస్ వచ్చిందా?"

"వచ్చింది".

తమ ఆతృత గమనించకుండా అతడు ముక్తసరిగా చెప్పే జవాబులు వింటుంటే అతడికి కోపం వచ్చింది. కష్టంమీద నిభాయించుకొన్నాడు. క్రితంరోజు వర్షం బాగా కురిసింది. గుంటల్నిండా నీరు.

పునాదుల కోసం తవ్విన గుంటలు.... ఎందులోనన్నా గోతిలో పడి, ఆ నీళ్ళ మధ్యలో కొట్టుకుంటూ లేత చేతులతో గట్టు పట్టుకొని పైకి ఎక్కలేక, జారిపోతూ–

అతడు తల విదిలించాడు. ఈ రాత్రి ఎక్కడని వెతకాలి?

ఇంతలో విద్యాపతి వాచ్‌మన్‌ని ప్రశ్నించటం వినిపించింది. "ఇక్కడ దగ్గిరలో ఎవరన్నా టీచర్స్ వున్నారా?"

"అదిగో ఆ పచ్చ ఇల్లు భారతీ టీచర్‌ది".

ఆ ఆలోచన తనకి రానందుకు తిట్టుకొన్నాడు. అయిదు నిమిషాల్లో వాళ్ళు భారతి ఇంటి దగ్గరున్నారు. రెండు నిమిషాల తరువాత ఆమె వచ్చింది.

తెల్లచీర, నలభై ఏళ్ళుంటాయి. మొహాన బొట్టులేదు. పిల్లలకి పాఠాలు చెప్పి చెప్పి దయ నింపుకొన్న కళ్ళు.

తాము వచ్చిన పని చెప్పారు.

"అవును.... తులసి ఆఖరి క్లాసు నాదే..... నేను చూశాను" అందామె.

".....ఇంకా ఇంటికి రాలేదు" అన్నాడు. అతడి కంఠం వణకడం అతడికే స్పష్టంగా తెలుస్తూంది. అతడిని అర్థం చేసుకున్నట్టుగా ఆమె మరేమీ ప్రశ్నించకుండా "సాయంత్రం అయిదింటివరకూ క్లాసులోనే వుంది తులసి. నాకు బాగా జ్ఞాపకం... సాధారణంగా రోజీకి క్లాసు ఫస్టురాంకు, తులసికి సెకండూ వస్తూ వుంటాయి. ఈ

రోజు క్లాసులో రోజీ చెప్పలేని ప్రశ్నలన్నిటికి తులసి టకటకా చెప్పింది. నేనన్నాను కూడా ఈసారి తులసికి ఫస్టురాంక్ వస్తుందని".

తనేడుస్తున్నాడా అన్న అనుమానం వచ్చింది శ్రీధర్‌కి. చెంప తడిమి చూసుకోడానికి నామోషీ అడ్డు వచ్చింది.

తను కూతుర్ని ఇంతగా ప్రేమిస్తున్నాడా? ఎంత విషమ పరిస్థితిలోనైనా బ్యాలెన్స్‌డ్‌గా వుండే తను ఇంతగా కదిలిపోతున్నాడేమిటి? ప్రేమంటే ఇదే కాబోలు!

ప్రొద్దున లేవగానే 'గుడ్ మార్నింగ్ డాడీ' అని విష్ చేసే పాప.... సాయంత్రం గార్డెన్‌లో స్కిప్పింగ్ చేస్తూ తను రాగానే ఆడే ఆటని వదలి పరుగెత్తుకుంటూ వచ్చే పాప..... రాత్రి ఒళ్ళో కూర్చొని ఆ రోజు ఏం పాఠాలు చెప్పారో కబుర్లు చెప్పే పాప....

తనమీద ఇంత బలమైన ముద్ర వేసిందా? తమ జీవితాల్తో ఇంతగా అల్లుకుపోయిందా? ఇది కేవలం ఒకే కూతురు కాబట్టా? ఇక పిల్లలు కలగరని తెలియటం వల్లనా?

"కాఫీ తాగండీ!"

అతడు తలెత్తి చూశాడు. టీచర్ ట్రే బల్లమీద పెట్టింది.

"వద్దు!"

"మీ కూతురు గురించి వర్రీ అవకండి– దొరుకుతుంది. కాఫీ తీసుకోండి".

అతడు అన్యమనస్కంగానే తీసుకొన్నాడు. విద్యాపతి అడిగాడు "మీ స్కూల్ బస్ బయల్దేరేటప్పుడు అందరూ ఎక్కిందీ లేనిదీ చూసుకొంటారా? అంటే.... ఐ మీన్... లెక్కబెడతారా?"

ఆమె తల వూపి "ఉహు ..... సాధారణంగా బెల్ అవగానే అందరూ క్యూలో వచ్చి బస్ ఎక్కేస్తారు".

"బస్ డ్రైవర్ ఎక్కడుంటాడు?" విద్యాపతి అడిగాడు.

"ఉహూ ..... నాకు తెలీదు. క్లీనర్ మాత్రం చోటీ గల్లీలో వుంటాడు" అని పేరు చెప్పింది. ఆమెకి సెలవు చెప్పి బయటకొచ్చేసరికి ఎనిమిది అయింది.

బయట్నుంచి ఇంటికి ఫోన్ చేశాడు. అనిత ఎత్తింది ఫోను.

"వచ్చిందా?" ఆతృతగా అడిగాడు.

"ఉహూ.... లేదు".

"వదినేం చేస్తూంది?"

క్షణం తటపటాయింపు ".....ఏడుస్తూంది".

అతను ఫోన్ పెట్టేశాడు. మళ్ళీ కారులో వేట మొదలైంది. కారు చోటీ గల్లీలో కొంతవరకూ మాత్రమే వెళ్ళగలిగింది. అక్కడ ఆపు చేసేరు. ఇరుకుసందు, మున్సిపాలిటీ దీపం మినుకు మినుకుమని వెలుగుతూంది. మురికి కాలువ మీద దోమలు దట్టంగా ఎగురుతున్నాయి. కారు ఆగటం చూసి లైట్ల వెల్తుర్లో గోళీలు ఆడుకొంటూన్న కుర్రవాళ్ళు బిలబిలా పరుగెత్తుకుంటూ వచ్చి మూగేరు.

"ఇస్మాయిల్ ఇల్లెక్కడ?"

ఒక కుర్రవాడు జారిపోతున్న నిక్కరు సవరించుకొంటూ ఒక మూల పాకని చూపించేడు. అందరికన్నా పెద్ద కుర్రవాడికి కారు చూస్తుండమన్న పెద్దరికం ఇచ్చి వాళ్ళు ఆ ఇంటిని సమీపించేరు.

"ఎవరదీ?" లోపల్నుంచి వినిపించింది.

శ్రీధర్ తటపటాయించి "ఇస్మాయిల్" అన్నాడు.

"లోపలికి రండి".

తడిక తోసి లోపలికి వెళ్ళబోయిన వాళ్ళు అక్కడే నిశ్చేష్టులై ఆగిపోయారు.

చిన్న తువ్వాలు మొలకి చుట్టుకొని అతను కూర్చొని వున్నాడు. ముందు సాంబ్రాణి పొగ దట్టంగా అలుముకొని వుంది. ఒక పెద్ద ముగ్గు మధ్యలో కూర్చొని వున్నాడు అతడు. వంటిమీద ఇంకే బట్ట లేదు. పాక చూరుకి తాళ్ళు వేలాడుతున్నాయి. ఆ తాళ్ళకి ముడులు వేసి వున్నాయి. ఎముకలు కనబడేటంత సన్నగా వున్నాడు. చొక్కా వేసుకొని బస్సు వెనక సీట్లో కూర్చొని 'రైట్' అని అరిచే ఆ యువకుడు ఇప్పుడు ఆ పొగ మధ్యలో, ముగ్గుమీద భయానకంగా వున్నాడు.

అపరిచితుల్ని చూసి అతడు చప్పున లేచి "ఎవరు మీరు?" అని అడిగేడు.

శ్రీధర్ ఒక్కక్షణం మాట్లాడలేదు. ముందు తేరుకొన్నది విద్యాపతి. మామూలుగా పగలు తమ పని చేసుకొనేవాళ్ళు రాత్రిళ్ళు ఇలాటి విద్యలలో మునుగుతారని అతనెక్కడో చదివేడు.

"తులసి అనే పాప స్కూలులో చదువుతూంది. ఆ పాప ఇంటికి రాలేదు" ముక్తసరిగా వచ్చిన పని చెప్పాడు.

"తులసి అంటే.... పెట్రోల్ బంకు స్టాపులో దిగిపోతుంది..... ఆ పాపేనా?" ఇస్మాయిల్ అడిగేడు.

"ఆ పాపే" చప్పున అన్నాడు శ్రీధర్.

"అక్కడే దిగినట్టు గుర్తు!"

శ్రీధర్ మొహం వాడిపోయింది. "కొంచెం జ్ఞాపకం తెచ్చుకో....."

అతడు ఆలోచించి, తల విదిలిస్తూ "లేదు సార్.... చాలామంది పాపలు.... జ్ఞాపకం రావటం లేదు" అన్నాడు.

శ్రీధర్ అక్కణ్నుంచి వెళ్ళటానికి తొందరపడుతున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఇంత సేపటివరకూ రిపోర్టివ్వకపోవటమే తప్పు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కి ఎవరితో చెప్పించాలా అని ఆలోచిస్తున్నాడు.

"పోదామా?" విద్యాపతి అడిగేడు. వెంటనే తలూపాడు శ్రీధర్. విద్యాపతి ముందు నడిచేడు బయటికి.

శ్రీధర్ తడిక తోసుకొని బయటికి రాబోతూ వుంటే వెనుకనుంచి నెమ్మదిగా ఇస్మాయిల్ కంఠం వినిపించింది. "పాపెక్కడుందో ప్రేతాత్మ నడుగుదాం సార్!"

షాక్ తగిలినట్టు అతడు నిలబడిపోయేడు. నెమ్మదిగా తల తిప్పి వెనక్కి చూసేడు. సాంబ్రాణి నిప్పు ఎర్రదనం అతడి మొహంమీద ప్రతిబింబిస్తూంది. నిశ్చలంగా అతను నిలబడి వున్నాడు. చుట్టూ తాళ్ళు..... గదిలో నిశ్శబ్దం పేరుకుని వుంది.

ఈ లోపులో విద్యాపతి వెనక్కి వచ్చి "ఏమిటీ?" అన్నాడు. ఇస్మాయిల్ మళ్ళీ చెప్పేడు. శ్రీధర్ ఏదో అనబోయేటంతలో "ఎంతసేపు పడ్తుంది?" అని అడిగేడు విద్యాపతి. శ్రీధర్ మొహం చిట్లించేడు.

"ఎంత సార్! ఐదు నిమిషాలు".

"సరీగ్గా చెబితే పది రూపాయలిస్తాం!"

అతను నవ్వేడు. "పాపలంటే నాకు చాలా ఇష్టంసార్! అంతేకానీ డబ్బుకోసం కాదు" అంటూ పని ప్రారంభించేడు. ఒక మూలనున్న కుండల్ని గది మధ్యలో వుంచేడు. ఒక తట్టతో మట్టి తెచ్చి వాటిలో పోసేడు. ఒక కర్రముక్క విద్యాపతి కిచ్చి "దీన్ని విరవండి సార్!" అన్నాడు.

శ్రీధర్ విసుగ్గా టైమ్ చూసుకొన్నాడు. ఎనిమిదిన్నర కావొస్తూంది. చీకట్లు దట్టమవుతున్న కొద్దీ అతడికి ఆందోళన ఎక్కువవుతుంది. కాలు నిలవటం లేదు. విద్యాపతి మీద కోపం వచ్చింది. అయినా అది క్షణికమే. తన కోసం ఇంత కష్టపడుతున్న అతడిమీద కృతజ్ఞత ఒకవైపు.

శ్రీధర్ ఇలా ఆలోచిస్తున్న సమయంలో ఇస్మాయిల్ విద్యాపతి చేతిలోంచి కర్రలను తీసుకొని మట్టిలో గుచ్చేడు. బైటకెళ్ళి ఏడు ఆకుల్ని తీసుకొచ్చి మధ్య చిల్లుపొడిచి, ఆ కర్రలకి గుచ్చి క్రిందికి జార్చేడు.

తన కూతురు కనబడటం లేదన్న ఆతృత లేకపోతే యీ గారడీనంతా అతడు నవ్వుతూ చూసేవాడే - కానీ అక్కడ ఇంట్లో శారద పరిస్థితి ఎలావుందో అన్న ఆతృత ఒకవైపు, కూతురి గురించి ఆతృత మరొక వైపూ అతడిని తొందర పెడుతున్నాయి.

ముగ్గుమీద ఏడు కుండలున్నాయి. వాటిమీద మూత కప్పినట్టు ఆకులు, మధ్యలో పుల్లలు. ఇస్మాయిల్ చేతులు రెండూ గాలిలోకి సాచి తల ఎత్తి ఏదో అస్పష్టంగా అనసాగేడు. శ్రీధర్‌కి సరిగ్గా వినిపించలేదు.

".....ఏక్ చే.... ట్రాడ్ జ్ఞ....బేటహోమ....సైతా.....దాలా తాత్రి దాన్ ది...."

తరువాత అతని పెదవులు కదలటం మానేసినయ్. అచేతనంగా... స్థాణువులా అలానే నిలబడిపోయాడు. విద్యాపతి కుతూహలంగా చూస్తున్నాడు. శ్రీధర్ యీ తంతు ఎప్పుడయిపోతుందా అని చూస్తున్నాడు.

ఐదు నిమిషాలు గడిచినయ్. అకస్మాత్తుగా తన జుట్టుపాయని కదిలిస్తూ గాలి తెమ్మెర ఒకటి వెళ్ళినట్టు అతనికి అనిపించింది. చల్లటిగాలి, కూల్‌గా ఎవరో తనకి ప్రక్కనుంచే వెళ్ళిపోయిన భావన, అయినా పాకలో వున్న ఒక గుడ్డ పీలిక కూడా కదలకపోవటం అతడు గమనించేడు.

"ఆత్మ చేరుకొంది..." అన్నాడు ఇస్మాయిల్.

"అడగండి.... ఆత్మ ఆకుని కదిపి జవాబు నిస్తుంది! మీరు చెయ్యవలసినదల్లా ఆత్మకీ మీకూ మధ్య కమ్యూనికేషన్ ఏర్పరచుకోవటమే".

విద్యాపతి ఒక కాగితం తీసుకొని పెన్‌తో ఎ.బి.సి.డి. వ్రాయటం ప్రారంభించేడు. శ్రీధర్ ఇస్మాయిల్‌నే చూస్తున్నాడు.

కమ్యూనికేషన్!

"కమ్యూనికేషన్" అన్నంత పెద్ద పదాన్ని ఈ బస్ క్లీనర్ ఎలా ఉపయోగించగలిగేడు? ఇతడు ఇంగ్లీషు బాగా తెలిసిన మోసగాడా? అయితే డబ్బు ఎందుకు వద్దన్నాడు?

అతని ఆలోచన్లు తెగ్గొడుతూ విద్యాపతి, "ఇరవై ఆరు అక్షరాలూ రాసేను. ఒక్కో అక్షరం మీదా పెన్ కదుపుతాను. సరేనా?" అన్నాడు.

ఇస్మాయిల్ మాట్లాడలేదు.

"ఒక్కటే ప్రశ్న. పాప తులసి ఎక్కడుంది?" గదిలో గాలి స్థంభించినట్టయింది. తామందరూ అసంకల్పితంగా ఊపిరి బిగపట్టటం వల్ల అలా ఫీలయినట్టు శ్రీధర్ గమనించేడు.

విద్యాపతి పెన్ ఎ.బి.సి.ల మీదుగా కదులుతూంది.

పెన్ 'ఐ' దగ్గిర కొచ్చేసరికి.... పుల్లలమీద ఆకులు నెమ్మదిగా పైకి లేచి క్రిందకు జారాయి. ప్రేక్షకులిద్దరూ తమ కళ్ళని నమ్మలేకపోయారు. ఇస్మాయిల్ మాత్రం మొహంమీద ఏ భావమూ లేకుండా అలానే నిలబడి వున్నాడు.

శ్రీధర్ ముందుకెళ్ళి ఆకుల్ని పరీక్షించాడు. అవి అచేతనంగా పడివున్నాయి. జీవరహితంగా. మళ్ళీ పెన్ కదిలింది.

ఈసారి ఎమ్.... ఆకులు కదిలినయ్. వచ్చిన అక్షరాల్ని చూస్తే తయారయిన పదం–

'IMHUUS'

"ఇమ్‌హౌస్! ఇదేం అర్థంలేని పదం?" శ్రీధర్ మొహం చిట్లించాడు.

విద్యాపతి చేతిలో కాగితాన్ని పరీక్షగా చూసి "ఇంకో ప్రశ్న; ఆర్ యూ ఏ జర్మన్?" అన్నాడు.

'....Y....E....S' మూడు అక్షరాలు.

విద్యాపతి శ్రీధర్ వైపు తిరిగి "ఇమ్‌హౌస్ అంటే..... ఇన్ ది హౌస్.... 'ఇంట్లో వుంది' అని అర్థం.... జెర్మన్–" అన్నాడు.

ఈసారి శ్రీధర్ ప్రశ్న అడిగాడు."ఎలా తెలిసింది నీకు?"

పెన్ కదిలింది. 'LES YEUX SANS VISAGE'

అంటే అర్థం ఏమిటి అన్నట్టు విద్యాపతి వైపు చూశాడు. "ఐస్ వితౌట్ ఫేస్. మొహం లేకుండా చూపు" అనువదించాడు.

"నువ్వెప్పుడు చచ్చిపోయావు?"

"....ఆత్మ చావదు".

తన ప్రశ్నలోని తప్పు గ్రహించి, సరిదిద్దుకొంటూ "చివరిసారిగా నువ్వు జీవించిన శరీరం పేరేమిటి?" అడిగాడు శ్రీధర్.

"వెర్నర్ క్రాస్".

విద్యాపతి ఉలిక్కిపడ్డాడు. "ది స్టూడెంట్ ఆఫ్ ప్రాగ్ అన్న జర్మనీ చిత్రంలో స్కాపినెల్లీ వేషం వేసి ప్రపంచ చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిపోయిన వెర్నర్ క్రాస్‌వి నువ్వేనా?" అని అడిగాడు.

"అవును–"

విద్యాపతి ఇంకేదో ప్రశ్న వేస్తూ వుంటే శ్రీధర్ బయటకి నడిచాడు. అతడికి యీ వింతల రహస్యం శోధించటం కన్నా తన పాప గురించి తెలుసుకోవటం

ముఖ్యం అనిపించింది. కారుని అక్కడే వుంచి, మెయిన్‌రోడ్ మీదకు వచ్చి, హోటల్నుంచి ఇంటికి ఫోన్ చేశాడు. శారద అందుకొంది.

"శారదా.... నేను, శ్రీధర్‌ని.... తులసి"

అతడి మాటలని మధ్యలోనే ఆపుచేస్తూ "వచ్చిందండీ ఇప్పుడే. రోజీ తనతోపాటు తీసుకెళ్ళిందట...." తొందర తొందరగా ఆమె చెబుతోంది.

మొదటివాక్యం మాత్రమే అతను విన్నాడు.

* * *

ఇద్దరూ కారులో తిరిగి వస్తూంటే అన్నాడు. "నువ్వెళ్ళాక ఆ కుండల్లోగానీ- మట్టిలోగానీ ఏదైనా మర్మం వుందేమోనని చూశాను ఏమీ లేదు".

శ్రీధర్ మాట్లాడలేదు. పాప ఇంటికొచ్చేసిందని తెలిసింది కాబట్టి నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాడు.

"మనమధ్య మామూలుగా తిరిగే మనుషులలోనే ఫకీర్లుంటారన్న మాట."

"ఉంటారు. మనుషుల అజ్ఞానం మీద ఆడుకునే ఇస్మాయిల్ లాంటి వాళ్ళు. ఇంతకీ ఎంతిచ్చావ్ అతనికి?" అడిగేడు.

"వద్దన్నాడు. బలవంతంగా పది రూపాయలిచ్చాను" అన్నాడు విద్యాపతి. "ఇదంతా మ్యాజిక్ అనుకుంటున్నావా?"

"అతడి కళ్ళలో మాగ్నటిక్ పవర్ వుంది. ఆ విషయాన్ని మాత్రం ఒప్పుకుంటాను. కావాలంటే ఆ 'ఏకాగ్రత'ని నువ్వూ ప్రాక్టీసు చెయ్యొచ్చు. రెండు నెలలలో బల్లమీదున్న పెన్సిల్‌ని కొద్దిగా కళ్ళతో జరపగలుగుతావ్. అలాగే ఆర్నెల్లుపోతే ఆకుల్ని కూడా".

"కానీ ఆత్మ రావటం...."

"అంతా ట్రాష్–"

"కానీ అది జర్మనీలో మాట్లాడటం...."

"ఆ ఇస్మాయిల్‌కి ఇటువంటి మ్యాజిక్‌లు చెయ్యటంతోపాటే, దానికి సరిపడా ఇంగ్లీషు కూడా వచ్చు. మనలాటి చదువుకున్న వాళ్ళని ఇంకింత మభ్య పెట్టడానికి మిగతా భాషలు కూడా కొద్ది కొద్దిగా వచ్చి వుంటాయి. మనం మరింత ఆసక్తి చూపించి వుండివుంటే ఆ ఆకుల్ని ఆవహించటానికి చార్లెస్ డిగోల్, అబ్రహాం లింకన్ కూడా వచ్చి వుండేవారు".

"నువ్వు చెప్పింది నిజమే అయుండవచ్చు. ఎందుకంటే ఆ ఆత్మని జనరల్ నాలెడ్జిలో "కాంబియా ప్రధాని ఎవరని?" ఒక ప్రశ్న అడిగాను.

"ఏమని చెప్పింది?"

"జనరల్ డిసౌజా అని చెప్పింది" అన్నాడు విద్యాపతి.

"కాదా?"

"కాదు. పొద్దున్న మా వాడు బ్యాంకు పరీక్షకి వెళుతూంటే చెప్పాను, కార్ల్‌మాంటన్".

శ్రీధర్ బిగ్గరగా నవ్వి, "ఒక జనరల్ నాలెడ్జీ బుక్ వాడికి కొని యిద్దాం. యాదృచ్ఛికమైనా పాప సంగతి సరిగా చెప్పాడు పాపం" అన్నాడు.

"మనం కూడా ఈ కదల్చటాలు నేర్చుకొంటే ఆడపిల్లల్ని బాగా ఆకర్షించవచ్చు. ఉన్నట్టుండి తన పైట ఎందుకు జారిందో తెలియని ఆడపిల్ల.." నవ్వాడు విద్యాపతి.

"ఇంత వయసు వచ్చినా నీకా దృష్టి పోలేదేమిటి?"

"వయసూ, దృష్టీ ఇన్‌వెర్సలీ ప్రపోర్షనేట్ అని నా అభిప్రాయం".

కారులో మళ్ళీ నవ్వులు ప్రతిధ్వనించాయి. అదే కారులో ఓ ట్రాన్సిస్టర్ ఫిట్ చేసి వుంది. వాళ్ళేగాని దాని స్విచ్ ఆన్‌చేసి వుంటే తొమ్మిదిగంటల న్యూస్ వచ్చి వుండేది, కాంబియాలో కూప్ జరిగిందని ఆ రోజు సాయంత్రమే జనరల్ డిసౌజా పదవిలోకి వచ్చాడని వాళ్ళకి తెలిసి వుండేది.

వాళ్ళ సంభాషణలో వాళ్ళున్నారు.

మరో రెండు నిమిషాలలో కారు బంగ్లా చేరుకొంది. శారద లోపల్నుంచి వచ్చింది.

"బాగా కంగారుపడ్డావా?" అని అడిగాడు తనసలు ఏమీ కంగారుపడనట్టు.

శారద నవ్వి వూరుకొంది.

"రా లోపలికి, కొంచెం టీ తాగి వెళుదువుగానీ.... బాగా అలసి పోయావ్" స్నేహితుడ్ని ఆహ్వానించాడు.

"ఇప్పుడేం 'టీ' వెళతాను. నీ కారు తీసుకెళతాను. రేపు పంపిస్తాను."

"తీసుకెళ్ళు" అని అతను వెళ్ళిపోయాక భార్యతో కలిసి లోపలికి వెళుతూ "బాగా ఏడ్చావేమిటోయ్? కళ్ళు వుబ్బినయ్" అన్నాడు నవ్వుతూ కవ్విస్తున్నట్టు వీపుతట్టి. సమాధానం ఆమెనుంచి రాలేదు. మరొక పక్కనుంచి వచ్చింది.

"మరి ఒక్కగానొక్క పాప. తల్లి మనసు ఎంత గాభరా పడుతుందో మగవాళ్ళం మనకేం తెలుస్తుంది బాబూ!"

శ్రీధర్ అటు చూశాడు.

కారిడార్ మసక చీకట్లో స్థంభానికి ఆనుకొని ఒక పొట్టివాడు నిలబడి వున్నాడు. నలభై ఏళ్ళుంటాయి. బట్టతల, తెల్లగా పండిన జుట్టు..... అతడు- సరస్వతీచంద్ర చటోపాధ్యాయ.

5

ఇక్కణ్నుంచీ అసలు కథ ప్రారంభమవుతుంది.

మొదలుపెట్టబోయే ముందు రచయితగా కొంత చెప్పాలనుకొంటున్నాను.

క్షుద్ర విద్యలూ, దెయ్యాలూ వున్నవా లేవా అన్న దానిమీద రచయిత అభిప్రాయం అనవసరం. ఈ నవలలో చాలావరకూ 'సేకరించిన' సమాచారమే అందజేయబడుతోంది.

పదిమంది మనుష్యులు వలయాకారంలో చేరి మధ్య ఒక దున్నపోతుని దాని కాలు విరిచేసి, వదిలి, అది దేక్కుంటూ ఆ వలయంలో తిరుగుతూ వుంటే అందరూ కలిసి దాన్ని హృదయవిదారకంగా చంపటం ఈ రచయిత స్వయంగా చూశాడు. ఇది క్షుద్ర దేవతల్ని సంతృప్తి పరుస్తుందట. ఇది అనాగరికం అయితే అయివుండవచ్చు. మరి హోలి రోజు కాముని దహనం ఇంకో యాభయ్ సంవత్సరాలు పోయాక ఆ తరంవాళ్ళకి అనాగరికంగా కనపడవచ్చుకదా!

పెరట్లో నిధికోసం పక్కింటి కుర్రవాణ్ని చంపినవాడు ఎంత మూర్ఖుడో- పెళ్ళాం మంగళసూత్రం అమ్మి తండ్రి అస్థికలు కాశీ గంగలో కలపటం కోసం వెళ్ళేవాడు కూడా అంతే మూర్ఖుడు. ఈ లెక్కన ముందు డాక్టర్ దగ్గరికి వెళ్ళి మందు తీసుకొని ఆ తర్వాత తగ్గకపోతే తిరుపతి వస్తానని మొక్కుకొనేవాడు పరమ మూర్ఖుడయి వుండాలి.

అయితే ఇది నమ్మకం.

ఈ నమ్మకం అనేదాన్ని వప్పుకోగలిగితే దేవుడైనా దెయ్యమైనా ఒకటే. దేవుడి మీద పూలు విసుర్తాం, దెయ్యం కోసం రక్తం విసురుతాం.

కాబట్టి క్షుద్ర విద్యలున్నాయా లేవా అన్న కాంట్రవర్సీ అనవసరం. దేవుడున్న చోట దెయ్యం వుంటుంది. దేవుడున్నాడా లేదా అన్నదే ప్రశ్న.

ఈ నవల వ్రాయాలన్న అభిప్రాయం కలిగి, దానికి సంబంధించిన విషయాలు సేకరించటం మొదలుపెట్టిన దగ్గర్నుంచీ చాలా ఆసక్తిదాయకమైన విషయాలు

బైటపడినయ్. మేము చూసిన సంఘటనలూ మాకు తెలిసిన విషయాలూ యధాతథంగా వ్రాస్తే అందులోని ఘాతుకాలూ, ఆ పచ్చి నిజాలూ పాఠకులకి ప్రింటింగ్‌లో చూపించటం కష్టమై– సగానికి సగం "ఎడిట్" చేయబడి వుండేదేమో! భువనేశ్వర్‌కి (ఒరిస్సా) వందమైళ్ళ దూరంలో ఒక మంత్రగాడు బ్రతికున్న మేక చర్మాన్ని నిలువునా వలవటం నేను స్వయంగా చూశాను. ఆ గ్రామం పేరు 'బిస్తా' గా నవలలో మార్చబడింది. అక్కడ ప్రతి మూడో ఇంటికి ఒక మంత్రగాడున్న మాట నిజం. మనదేశంలో ఒరిస్సా, కేరళలు మంత్రగాళ్ళకి ప్రసిద్ధి. దార్కాసాహు అన్న మంత్రగాణ్ని మేము ఇక్కడే కలుసుకొన్నాము.

స్త్రీని క్రాస్‌తో దేవుడికి అర్పించే "బ్లాక్‌మాస్" అనే ఫంక్షన్ కేరళలో ఇప్పటికీ జరుగుతుందని నమ్మకంగా తెలిసింది. కానీ సరిఅయిన ప్రాంతం ఏదో తెలియలేదు- ఎంత ప్రయత్నించినా! కన్‌సీల్డ్ కెమెరాతో వేసిన ఒక ఫోటో మాత్రం సంపాదించగలిగాము.

నాకు తెలిసినంతవరకూ క్షుద్ర విద్యల మీద తెలుగులో నవలలు రాలేదు. కళాప్రపూర్ణ ఒక నవలా (మానవాతీత శక్తులు), కవి సామ్రాట్ ఒక నవలా (బాణామతి) వ్రాశారు.

డిటెక్టివ్ నవలా ఛాయలు పడకుండా ఈ రకం నవలలూ సంఘటనలూ వ్రాయడం కష్టం. అంతేకాదు, ఈ రకం నవలలన్నిటిలోనూ దాదాపు కథ ఒకేలా వుంటుంది. ఉదా : డ్రాక్యులా. అంతేకాదు, నవలా రచనలో ముఖ్యమైన 'కారెక్టరైజేషన్' ఈ రకం నవలలో చొప్పించటం అసాధ్యం. నాకు తెలిసినంతవరకూ డేవిడ్ సెల్జెర్ వ్రాసిన 'ఓమెన్'లో ధాన్ (ఈ పాత్రని గ్రెగరీపెక్ పోషించాడు సినిమాలో) పాత్రలో ఇది కనబడింది. దానికీ శ్రీధర్ పాత్రకీ పోలికలు కనబడతాయి కొంచెం.

ఎఫ్.డి. కొలాబావాలా వ్రాసిన "విచ్‌క్రాఫ్ట్" లూయిస్ జాకొల్లా యిట్... 'అక్కల్ట్ సైన్సెస్ ఇన్ ఇండియా' అనే పుస్తకాలు క్షుద్రవిద్యల గురించి చాలా వివరాలు చెబుతాయి. అలాగే సండే స్టాండర్ట్, దక్కన్ క్రానికల్‌లో పడిన వ్యాసాలూ ఈ నవల వ్రాయటానికి తోడ్పడ్డాయి.

ఇన్ని పుస్తకాల్నుంచి ఇన్ని వివరాలు తీసుకొని వ్రాస్తున్న ఈ నవలలో.... ఒక నవల ఛాయలు పడకుండా వుండటానికి ప్రయత్నించాల్సి వచ్చింది. 'పాప' అనేసరికి జ్ఞాపకం వచ్చే ఆ నవల పేరు.... 'ఎగ్జార్సిస్ట్'.

ఈ నవల వ్రాయటంలో ప్రతి క్షణమూ సహకరించినది ప్రముఖ మెజీషియన్ శ్రీ పట్టాభిరాం. ఆయన సహకరించకపోతే ఈ నవలకి ఈ షేప్ వచ్చేది కాదేమో. సంగారెడ్డి దగ్గిర ఓ చేతబడిని ఫోటో తీయబోయి చావు తప్పి కన్ను లొట్టబోయినంత పనిచేసుకున్నాం యిద్దరం....

క్షుద్ర విద్యలున్నాయా?

ఏమో!.....

....

వీటిని తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్న వాళ్ళున్నారు. 'స్వామి' లా నీడని చూసి దెయ్యం అని భయపడి ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్ళున్నారు. నమ్మి సర్వం కోల్పోయిన వాళ్ళున్నారు 'అనిత'లా; వాటి పేరుతో మ్యాజిక్ చేసేవాళ్ళున్నారు అబ్రకదబ్రలా; నమ్మక చేతులు కాల్చుకొనే వాళ్ళున్నారు శ్రీధర్‌లా..... ....ఇక చదవండి....

* * *

పైటకొంగు నోటికి అడ్డు పెట్టుకొని "అబ్బా! మరింక నవ్వించకు మావయ్యా" అంది శారద. శ్రీధర్ కూడా నవ్వుతూ "ఎక్కడ నేర్చుకున్నారు ఇలా మాట్లాడటం?" అన్నాడు.

"మాట్లాడటం అనే ఒక్క విద్య తప్ప ఇంకేమీ రాదు నాయనా నాకు" అన్నాడు.

అనిత "చాలామందికి అదీ రాదు కదా" అని చప్పున నారాయణరావుకేసి చూసింది, హర్ట్ చేసేనేమో అని.

అతడి మొహంలో ఏ భావమూ లేదు.

"ఒకసారి బెంగుళూరు పోర్టులో మినిస్టరూ...." మళ్ళీ మొదలుపెట్టాడు.

"బెంగుళూరులో పోర్టెక్కడుంది బాబాయ్?" అనిత అడిగింది.

సరస్వతి తడుముకోకుండా "పోర్టు కాకపోతే ఎయిర్‌పోర్టమ్మా- అందులో మినిస్టరూ...." అన్నాడు.

శ్రీధర్ లేచి "సాయంత్రం మాట్లాడుకొందాం. ఫ్యాక్టరీ టైమయింది" అంటూ కోటు చేతిలోకి తీసుకొన్నాడు.

"సాయంత్రం నేను వెళ్ళిపోదామనుకొంటున్నానే...."

"మొన్నేగా వచ్చింది అప్పుడేం ఏం వెళతారు?"

"చాలా పన్లున్నాయి నాయనా."

"ఇంతకీ ఎక్కడ పనిచేస్తున్నది నువ్వు?" అనిత అడిగింది.

"సరస్వతి ఎక్కడ పనిచేస్తుంది? విద్యాలయంలో".

మళ్ళీ నవ్వులు. శ్రీధర్ కూడా నవ్వి "ఇంకో రెండు రోజులుండి వెళ్ళండి" అన్నాడు. ఇంట్లో ఒక పెద్ద వ్యక్తి వుంటే ఇంత సందడిగా వుంటుందని అతడికి అనుభవపూర్వకంగా తెలుస్తోంది. శారదకైతే తన తరఫు బంధువు ఒకడున్నాడని తెలియటమే ఆనందంగా వుంది. దూరపు బంధువైతేనేం!

శ్రీధర్‌కి తను తగనేమో అన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఆమె కేమూలో వుంది. పెళ్ళయిన తరువాత అంచెలంచెలుగా అతడు పైకి వెళ్ళటము, మొదట్నుంచీ అతడి గాంభీర్యం, అతడి తెలివితేటలూ.... అయితే శ్రీధర్ ఎప్పుడూ తనకి ఏమీ తక్కువ చేయలేదు. అయినా ఏదో భావం. ఒక తమ్ముడు తప్ప తన వాళ్ళెవరూ లేకపోవటము..... ఉన్నవాడు మూగవాడవటం.

సరస్వతీచంద్ర రాకపట్ల ఆ ఇంట్లో సంతోషించనివాడు ఒకడే ఒకడున్నాడు.

అతడు వంటవాడు రామయ్య.

రామయ్యకి ఏభై అయిదేళ్ళ వయసుంటుంది. ప్రపంచాన్ని చూసిన వాడు. అతడికి సరస్వతి చూపు నచ్చలేదు.

"మా అబ్బాయిని తీసుకొస్తానమ్మా! వాడికో ఉద్యోగం చూపించే బాధ్యత మీ ఆయనదే" అన్నాడు సరస్వతి.

"తప్పకుండా తీసుకురండి మావయ్యా!"

"ఏం చదివేడు?" శ్రీధర్ అడిగాడు.

"ఆఁ ..... వానాకాలం చదువు... పల్లెటూరులో ఏం చదువుంటుంది నాయనా?"

"పేరు?"

"పైడితల్లి...."

అనిత ఫక్కున నవ్వి "భలే పేరు బాబాయ్" అంది. సరస్వతి ఆమెవైపు క్షణంసేపు సాలోచనగా చూశాడు. పైడితల్లి..... భలే పేరు. అవును.... భలే పేరు. అతడు ఈ అమ్మాయినిచూస్తే అరవిచ్చిన మొగ్గలా వున్న ఈ ఇరవై ఏళ్ళ అమ్మాయి..... (కుందేలు మీద వెనుకనుంచి పంజా విసిరే పులి గుర్తుకొచ్చింది)

"అయితే మీరిద్దరూ రండి" అని శ్రీధర్ వెళ్ళిపోయాడు.

"పాపకి స్కూల్ లేదా.....?" స్కిప్పింగ్ చేస్తున్న పాపని చూస్తూ అడిగాడు.

"ఈ రోజు నెహ్రూగారి పుట్టినరోజుగా! స్కూల్లేదట....." అంది శారద.

"ఎంత పాప వయసు?" అటే చూస్తూ అడిగాడు క్యాజువల్‌గా.

"రేపు జనవరి పధ్నాలుగుకి పది నిండుతాయి".

ఎటో చూస్తున్న సరస్వతి ఉలిక్కిపడ్డాడు.

6

"**ఇంక** రెండు నెలలే.... సరిగ్గా రెండు నెలలు" అన్నాడు.

చిదానందస్వామి మాట్లాడలేదు.

"మనం తొందరపడాలి" మళ్ళీ అన్నాడు.

పైడితల్లి చుట్ట నుసి రాలుస్తూ దాని పొడిని చూస్తున్నాడు.

"ఇదంతా నా ఒక్కడికే పట్టినట్టూ మీరిద్దరూ మాట్లాడరేం?"

"అదే ఆలోచిస్తున్నాను నాయనా" స్వామి అన్నారు.

"నేను పైడితల్లిని తీసుకొస్తానన్నాను ఎందుకయినా మంచిదని".

"అది మొదటి తప్పు" అన్నాడు పైడితల్లి. "మొదటనుమానం మనమీద కొచ్చేయటానికా?"

"వెళ్ళకపోతే మానేద్దాం. ఎందుకైనా మంచిదని చెప్పి వుంచాను".

"అక్కడే వుండి స్లోపాయిజన్ చేస్తే....?" స్వామి రుద్రాక్షమాల తిప్పుతూ అన్నాడు.

"శ్రీధర్ డాక్టర్కి చూపిస్తాడు. స్లోపాయిజన్ అన్న అనుమానం ఆడు ఎలిబుచ్చిన మరుక్షణం శ్రీకృష్ణ బాలికల అనాధ శరణాలయమధికారులము ముగ్గురం శ్రీకృష్ణ జన్మస్థానంలో వుంటాం....." అన్నాడు పైడితల్లి చాలా క్యాజువల్‌గా.

స్వామి పైడితల్లి వైపు చూశాడు. పైడితల్లి ఏం చదువుకున్నాడూ అన్నది ఎప్పుడూ ఆయనకి సమస్యే!

"అయితే ఏం చేద్దాం?"

"లీగల్ పాయింటు సెప్పనా.... తరువాత మీ ఇష్టం".

"చూస్తూ ఇరవై లక్షల ఆస్తి వదులుకోలేం గదా?"

"మనకోసం కాకపోయినా ఈ అనాధ బాలికల కోసమైనా వదులుకోలేం గదా....."

"అవునవును" అన్నాడు పైడితల్లి. "రెండు లక్షలు బెట్టి మంచి ఎయిర్ కండిషను మిషన్లు పెట్టి బిల్డింగ్ కట్టించినామంటే రాత్రికి ఆడదానికి అయిదొందల సొప్పున సంవత్సరం తిరిగేసరికి కోటీశ్వరులమయిపోవచ్చు".

"రెండు లక్షలకేంలే.... ఇరవై లక్షల సంగతెజ్జెప్పు" సరస్వతి అడిగాడు.

"మూడో కంటికి అనుమానం రాకుండా పాప ఆత్మ పరమాత్మని చేరుకోవాలి నాయనా" అన్నారు స్వామివారు.

"అదీ జనవరి పధ్నాలుగు లోపులో" పూర్తిచేశాడు సరస్వతి.

"పాప చస్తే మొదటి అనుమానం మన మీదకే వస్తుంది" పైడితల్లి మాట్లాడటంలేదు, వింటున్నాడు.

"మామూలుగా వుండాలి".

"ఎవరికీ అనుమానం రాకూడదు".

పైడితల్లి చుట్ట విసిరేదు. అంటే ఏదో ఐడియా వచ్చిందన్నమాట. మిగిలిన యిద్దరూ అతడివైపు చూశారు.

"ఒకడే చెయ్యగలడు...."

"ఎవరు?" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

పైడితల్లి లేచాడు. "మనం వెళ్ళాలి" అన్నాడు.

"రేపే...."

"ఎక్కడికి?"

"ఒరిస్సా బార్డర్‌లో వున్న బిస్తాకి....! ఎక్కడయితే ప్రేతాత్మలు మనుష్యుల మధ్య తిరుగుతుంటాయో, ఎక్కడైతే మనిషి ప్రాణం గడ్డిపోచకంటే చౌకైందో- ఆ గ్రామానికి..... నరరూప రాక్షసుడు 'కాద్రా'ని కలుసుకోవటానికి..... ది డెవిల్ విల్ హెల్ప్ అజ్ టు కిల్ ది బేబి...." అతడి కళ్ళు అగ్ని గోళాల్లా వెలుగుతున్నాయి.

ఇప్పుడు పైడితల్లి అమాయకుడిలా లేడు క్రౌర్యం మూర్తీభవించిన రాక్షసుడిలా వున్నాడు.

* * *

రాత్రి ఎనిమిదయింది.

కీచురాళ్ళ శబ్దం తప్ప ఇంకేమీ వినపడటంలేదు. దూరంగా ఓ నక్క ఊళపెడ్తూంది. మువ్వల శబ్దం చేసుకుంటూ ఎడ్లబండి ముందుకు సాగుతూంది.

తొందరగా చేర్చాలని బండివాడు తొందరపడుతున్నాడు. రాత్రిపూట 'బిస్తా'లో వుండటమంత తెలివితక్కువతనం యింకొకటి లేదు. లోపల కూర్చున్న ముగ్గురూ మౌనంగా వున్నారు. లోపల బడబాగ్నిని దాచుకొని, పైకి నిర్మలంగా కనిపించే అగ్ని పర్వతాల్లా వున్నారు.

"ఇంకా ఎంత దూరం?" సరస్వతి అడిగాడు.

"అసంతి" (వచ్చేసేం) అన్నాడు బండివాడు.

మరో ఐదు నిమిషాల్లో బండి బిస్తా చేరుకొంది.

"కోంతిరహిబా?" (ఎక్కడాపాలి) అడిగాడు బండివాడు.

"కాద్రా....."

బండివాడు ఉలిక్కిపడటం వెన్నెలకాంతిలో స్పష్టంగా కనిపించింది. అయినా అతనేం మాట్లాడలేదు. బండి ఓ గుడిసె ముందు ఆగింది. ముగ్గురూ దిగారు.

నిర్మానుష్యమైన శ్మశానం మధ్యలో ఎండిపోయిన చెట్టులా వుంది ఆ గుడిసె. చుట్టూ చాలా దూరం వరకూ ఇళ్ళు లేవు.

"కాద్రా...." పిల్చాడు స్వామి నెమ్మదిగా. లోపల అలికిడి లేదు. నెమ్మదిగా తడికె తోసి లోపలికి ప్రవేశించారు ముగ్గురూ.

నిశ్చేష్టులై అలాగే నిలబడిపోయారు.

వాళ్ళని నిశ్చేష్టపరిచింది గుడిసె మధ్యలో వున్న ఓ పసిపాప శవం! ఇంకా మట్టి అంటుకునే వుంది. పాతిపెట్టబడ్డ గోతిలోంచి త్రవ్వి తీసుకొచ్చినట్టు తెలుస్తూనే వుంది. చచ్చిపోయి యింకా పదిహేను పదహారు గంటలు దాటి వుండదు. దాదాపు ఆర్నెల్లు ఈ భూమ్మీద జీవించి యిక యిష్టంలేక ఆత్మ శరీరాన్ని వదిలి వెళ్ళిపోయినట్టుంది. శరీరం నలుపు వర్ణానికి తిరుగుతూంది. చుట్టూ కప్పికట్టిన చాప వత్తిడికి నలిగిన చార శరీరం మీద కనబడ్తూంది. నాలుగడుగుల గోతిలో కప్పటంవల్ల మట్టి కాళ్ళ సందులో యింకా ఇరుక్కునే వుంది.

వాళ్ళని నిశ్చేష్టపరిచింది ఆ శవం వున్న భంగిమ. ఆ పాప మెడ పై భాగం లేదు. ఎర్రటి రక్తపు ముద్ద వుంది.... చెక్కేసినట్టు రొమ్ము ప్రాంతంలో కత్తితో గాటుపెట్టి గుండెని పెకిలించి నట్టున్నారు.

సంవత్సరం నిండని పసిపాప పుర్రె వొలిచి కుంపటి మీద పెట్టి, అందులో ఆ పాప గుండెని కాల్చి తింటే, క్షుద్ర దేవతలు ఆవహిస్తాయని ఇప్పటికీ కొంతమంది నమ్ముతారు.

సరస్వతి కడుపులో తిప్పింది. ఆ దృశ్యాన్ని చూసి కళ్ళు తిరిగినట్లయి, తూలి పడబోయేడు. అంతలో లోపలి గదిలోంచి కాద్రా బయటకొచ్చేడు.

అతడు ఆరడుగుల ఎత్తున్నాడు. చేతిలో కుడితొడ ఎముక వుంది. రొమ్ముమీద పులిని కాల్చిన భస్మం రాసుకున్నాడు. కళ్ళకి నల్లటి అంజనం వుంది. జుట్టు పాయలు పాయలుగా వ్రేలాడుతుంది. గుడ్లు అగ్నిగోళాల్లా వున్నాయి.

ఎన్నో హత్యలు చేసిన పైడితల్లి కూడా అతడి ఆకారాన్ని చూసి బెదిరేడు. అయితే అంతలోనే సర్దుకొని, "సలామ్ కాద్రా" అన్నాడు.

"సలామ్, సలామ్!" వంగి నేలని తాకి దక్షిణంగా తిరిగి గాలిలో నమస్కారం చేసేడు. ప్రేతాత్మలు మనిషిని దక్షిణంవైపు నుంచి గమనిస్తూ వుంటాయి. అందుకే క్షుద్రేవతోపాసకులు దక్షిణంవైపు తిరిగి ప్రతి పనీ చేస్తుంటారు. మామూలు సంభాషణ జరిగేక అసలు పని వివరించేడు పైడితల్లి.

"దానికేం- అలానే చేద్దాం".

"ఎంత?"

"- ఐదువేలు".

"చాలా ఎక్కువ" అన్నాడు సరస్వతి.

కాద్రాకి కోపం వచ్చిందేమో అని అటు చూసేడు స్వామి. కానీ అతడు నవ్వుతున్నాడు. మొట్టమొదటిసారి అతడి మొహంమీద నవ్వు కనిపించింది.

"-సంచి బియ్యానికి కూడా చేసేవాళ్ళున్నారు. కానీ...."

సరస్వతి ఏదో అనబోయాడు గానీ పైడితల్లి మధ్యలో అందుకొని "అట్టాగే సావీఁ" అన్నాడు. "- కానీ చేతబడి నెలలో పూర్తికావాలి".

స్వామివారు మౌనంగా జరిగేది పరిశీలిస్తున్నాడు. "అనుకొన్నది అనుకొన్నట్టు జరిగితే అయిదువేలో లెక్కలోది కాదు".

కాద్రా తలూపి, "పేరూ, వయసూ చెప్పండి?"

"తులసి. తొమ్మిది సంవత్సరాలు".

కాద్రా చేతిలో ఎముక నేలమీద పెట్టి "నేను చెయ్యను" అన్నాడు.

ముగ్గురూ విస్తుబోయి "అదేం?" అన్నారు.

"చిన్నపిల్లలకి చేతబడి పట్టదు. చేయటం అనవసరం".

ఈ మలుపు వాళ్ళు వూహించలేదు. ముందుగా తేరుకున్నది పైడితల్లి. "కానీ కొంతమంది పిల్లలకి సెయ్యటం సూసేనే".

"- తిప్పి కొడుతుంది".

"అయినా ప్రయత్నిస్తే...." అంటున్న సరస్వతి, కాద్రా సూటిగా చూడటంతో మాట మధ్యలోనే ఆపుచేశాడు.

"దీనిమీదే ఆశ పెట్టుకున్నాం. ఇంతదూరం వచ్చాక కాదంటే అన్యాయం అయిపోతాం. ఇంకా గడువు కూడా ఎంతో లేదు. ఐదువేలు కాకపోతే పదివేలు చేసుకోండి. ఎలాగైనా ఇది జరిగి తీరాలి".

కాద్రా మాట్లాడలేదు.

"పదివేలు కాకపోతే పదిహేనువేలు".

కాద్రా లేచాడు. ఇంకేదైనా మాట్లాడవలసి వుందా? అన్నట్టు చూశాడు. "చీకటి పడింది వెళ్ళిరండి" అని అక్కడ్నించి కదిలిపోయాడు మరింకేమీ మాట్లాడవలసింది లేనట్టూ.

వాళ్ళు ముగ్గురూ అతడు వెళ్ళినవైపే చూస్తూ కూర్చుండిపోయారు కొంచెంసేపు. ముందు స్వామి లేచాడు. వెనుకే ఇద్దరూ.

బండి ఎక్కేరు. ఎవరూ మాట్లాడలేదు. నెమ్మదిగా బండి కదిలింది. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

అంతవరకూ చాలా ధీమాగా వున్న పైడితల్లి కూడా ఈ హఠాత్సంఘటనతో మూగబోయాడు. మువ్వల చప్పుడు తప్ప ఇంకేమీ వినిపించటంలేదు. బస్తీ గ్రామపు పొలిమేరలు దాటింది బండి. స్మశానం మధ్యగా వెళుతూంది. మనిషి ఉనికిని ప్రశ్నిస్తున్నట్టూ సమాధులు- చిన్న చిన్న తుప్పలు, రాళ్ళు, దూరంగా మండుతున్న చితి, జుట్టు విరబోసుకున్న దెయ్యంలా మర్రిచెట్టు, మధ్యలోంచి సన్నటి దారి గతుకుల్లో పడిలేస్తూ వెళుతూంది ఆ బండి.

ఆలోచిస్తున్న వాడల్లా తలెత్తి ఏదో చెప్పబోయాడు పైడితల్లి. అంతలో దూరంనుంచి ఒక కేక వినబడింది. గాలిలో సన్నగా వచ్చిన కేకకి ముగ్గురూ చీకట్లో కళ్ళు చికిలించి చూశారు. దూరంనుంచి ఒక ఆకారం పరుగెత్తుకు రావటం కనిపించింది.

మరు నిమిషంలో అతడొచ్చి వాళ్ళముందు ఆగాడు. పరుగెత్తుకు రావటం వల్ల బాగా రొప్పుతున్నాడు. ఆయాసం తగ్గటానికి క్షణం ఆగి, "కాద్రా దగ్గరికి వచ్చింది మీరేగా?" అన్నాడు.

సరస్వతి అతడివైపు అసహనంగా చూస్తూ "అవును" అన్నాడు.

"నేను చేస్తాను మీక్కావలసిన పనిని". అతడన్నాడు వగరుస్తూ. "ఎంతిస్తారు?"

"నువ్వెవరివి? ముందు చెప్పు".

"కాద్రా శిష్యుణ్ని. నా పేరు సాహిర్....."

* * *

సాహిర్ బాసింపెట్లు వేసుకుని కూర్చొని వున్నాడు. అతడిముందు చిన్న కపాలం వుంది. అందులో మైదాపిండి వుంది. సింహం మూత్రంలో దాన్ని తడిపి బొమ్మ చేస్తున్నాడు. ప్రేక్షకులు ముగ్గురూ మౌనంగా జరుగుతున్నది చూస్తున్నారు.

చిన్నబొమ్మ తయారైంది. రెండు చేతులూ, రెండు కాళ్ళూ, సన్నటి నడుమూ, చిన్న మొహమూ. దాన్ని తాటాకుతో చుట్టాడు.

పుర్రె మధ్యలో పెట్టేడు. లేచి వెళ్ళి ఒక పాత్రలో నీళ్ళు తీసుకున్నాడు. దాంతో దాదాపు అరగంటసేపు నోటిని శుభ్రం చేసుకున్నాడు.

చేతబడి చేసేటప్పుడు నోట్లో ఏ చిన్న పదార్థమూ పళ్ళమధ్య యిరుక్కొని వుండకూడదు. అందుకే మంత్రవేత్తలు ఈ విషయంలో జాగ్రత్తగా వుంటారు. స్పష్టంగా రావాలి మంత్రం. అందుకే చేతబడి చేసే వాడిమీద ప్రజలకి అనుమానం వస్తే పళ్ళు పీకేస్తారు.

సాహిర్ కొంచెంసేపు నిలబడి మంత్రం చదివాడు.

తరువాత అతడు దక్షిణం దిక్కుగా కూర్చున్నాడు. క్షుద్ర దేవతని పిలవసాగాడు.

7

ఆ రోజు శ్రీధర్ ఆఫీస్‌కి వెళ్ళలేదు. ఎవరో ఫ్రెండ్ బోంబే నుంచి వస్తే అతడితోపాటు లంచ్‌కి వెళ్ళాడు.

ఇంటికొచ్చేసరికి మూడయింది. వచ్చేసరికి బ్రాహ్మిణ్ ఫ్యాక్టరీ నుంచి ఫోన్ చేశాడని శారద చెప్పింది. అతడు ఫోన్‌లో అబ్రకదబ్రని కాంటాక్ట్ చేశాడు.

"హల్లో మెజీషియన్! ఏమిటి విశేషాలు?"

"కంగ్రాచ్యులేషన్స్ గురూ! రేపు మా యింటికి డిన్నర్‌కి రావాలి. ఫ్యామిలీతో సహా...."

"మీ ఇంట్లో భోజనం చెయ్యటానికా కంగ్రాచ్యులేషన్స్".

"లేదులే. అంతకన్నా ముఖ్య విషయం వుంది".

"ఏమిటి?"

"ఫోన్‌లోనే చెప్పమంటావా?"

"చెప్పు".

"అయితే విను, అప్పుడెప్పుడో డ్రాప్ అయిన నీ ఫారిన్ ప్రోగ్రాం మళ్ళీ రివైవ్ అవబోతుంది."

శ్రీధర్ చెయ్యి రిసీవర్ మీద బిగుసుకుంది. ఈ అబ్రకదబ్రకి ఆఫీసులో తెలియని వాళ్ళంటూ లేరు. ఎక్కడెక్కడి విషయాలూ డైరెక్టర్ల కంటే ముందే సేకరిస్తాడు.

"ఏమిటంత మౌనంగా వుండిపోయావు?"

"నీ మాటల్లో నిజమెంతా అని ఆలోచిస్తున్నాను".

"అబ్రకదబ్ర మాటల్లో అబద్ధమూ, సైతాన్ చేతలలో మంచీ వుండవు" గంభీరంగా అన్నాడు.

శ్రీధర్ నవ్వి– "థాంక్యూ నేను వస్తాను ఫ్యాక్టరీకి" అన్నాడు.

పక్కనే వున్న శారద భర్త మొహంలో కనబడ్తూన్న ఆనందాన్ని గుర్తించి, "ఏమిటండీ?" అంది. అతడు చెప్పాడు.

"ఎప్పుడెళ్ళాలి?"

"ఇంకో పదిహేను రోజులలో...."

"అంత తొందరలోనా?"

"తొందరేముంది– అక్కడ మనం వుండేది ఆర్నెల్లకన్నా ఎక్కువ కాదు, ఈసారి ఛాన్స్‌పోతే మళ్ళీ రాదు".

ఆమె మాట్లాడలేదు. అంత తక్కువ టైమ్‌లో అన్నీ సర్దుకుని వెళ్ళటం కష్టమే. కానీ– వచ్చిన అవకాశం.....

వీళ్ళిలా మాట్లాడుకుంటున్న సమయంలో తులసి స్కూల్ నుంచి వచ్చింది.

"గుడ్ న్యూస్ బేబీ!" అన్నాడు శ్రీధర్ పాపని గాలిలోకి ఎత్తుతూ, "మనం పారిస్ వెళుతున్నాం".

పాప నవ్వలేదు. మామూలుగా వేసినట్టూ తండ్రి మెడచుట్టూ చేతులు వెయ్యలేదు. దాంతో ఆశ్చర్యపడి "అలా వున్నావేం?" అనడిగాడు చేతులమీద నుంచి దింపుతూ.

"ఏమిటీ, ఏమైంది?" అంది శారద కంగారుగా. ఆమె కంగారు చూస్తే అతడికి నవ్వొచ్చింది.

"వంట్లో బావోలేదా?" నుదుటిమీద చెయ్యి వేస్తూ అడిగాడు.

"బాగానే వుంది పప్పా" అంది తులసి. కానీ ఆమె కంఠంలో హుషారు లేదు.

స్కూల్‌నుంచి వచ్చిన అలసటేమో అనుకున్నారు ఇద్దరూ. "వళ్ళు వెచ్చగా లేదు" అన్నాడు శ్రీధర్. పాప మొహం కడుక్కుని వచ్చింది. "ఆలస్యం అయిందేమిటమ్మా ఈ రోజు?" అడిగాడు శ్రీధర్.

రామయ్య వచ్చి అన్నం వడ్డించాడు. పాప కుడిచేతిలో స్పూన్ తీసుకుని అన్నం కలపటం గమనించాడు.

"చేతికి ఏమైంది?" అడిగింది శారద.

"తెగింది".

"పెన్సిల్ నువ్వు చెక్కకూడదమ్మా. పెద్దవాళ్ళున్నారు కదా!"

"ఉహూ.... పెన్సిల్ చెక్కుతూ వుంటే కాదు నాన్నా! గోళ్ళు తీస్తూ వుంటే తెగింది."

"గోళ్ళా! ఎవరు తీశారు?"

"సరస్వత్తాతయ్య".

వంట గదిలోంచి డైనింగ్ రూమ్‌లోకి రాబోతున్న రామయ్య హఠాత్తుగా ఆగిపోయాడు. శ్రీధర్ శారదవైపు చూస్తూ "చూశావా! మీ మావయ్యకున్న ఇంట్రెస్ట్ నీ కూతురిమీద నీకు లేదు" అన్నాడు.

శారద మూతి ముడుచుకొని, "చాల్లెండి. గోళ్ళు తీసేస్తే ప్రేమ వున్నట్టా, ఏమిటి?" అంది. "అయినా మీ అరిస్టోక్రాట్ ఫ్యామిలీస్‌లో బెడ్ రూమ్‌లు కూడా వేర్వేరుగా వుండాలిగా" ఇంగ్లీషులో దెప్పి పొడిచింది.

శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు. తులసి భోజనం చేసేవరకూ ఇద్దరూ కబుర్లు చెబుతూనే వున్నారు. మధ్య మధ్యలో తులసి కూడా పాల్గొన్నది. శ్రీధర్ లేచి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళేడు. శారద మేడ మీదకు వెళ్ళింది. పాప చెయ్యి కడుక్కోవటానికి వాష్ బేసిన్ దగ్గరికి వెళ్ళింది.

అక్కడున్నాడు రామయ్య.

పాప చేతులు కడుక్కున్న తర్వాత నాప్‌కిన్ అందించేడు. ఆ లేత చేతుల్ని తన చేతులలోకి తీసుకున్నాడు రామయ్య.

"సరస్వత్తాతయ్య గోళ్ళు తీసేడా?"

తలూపింది.

"ఇంకేమీ చెయ్యలేదా?"

అడ్డంగా తలూపింది.

"కత్తిరించిన గోళ్ళు తొక్కకూడదమ్మా. దూరంగా పారవెయ్యాలి".

"అవునట. తాతయ్య చెప్పేడు. అందుకే పొట్లం కట్టేడుగా!"

పొట్లం!?

"ఇంకేం చేసేడు?"

పాప తువ్వాలిచ్చి వెనుతిరిగింది.

ఎక్కడో, ఏదో అస్పష్టంగా కదుల్తోంది ఏదో అనుమానం. అతడేదో అనబోయాడు. కానీ పాప గుమ్మం దాటి అవతలి గదిలోకి వెళ్ళి పోయింది.

అతడక్కడే నిలబడి వున్నాడు.

ఇంత చిన్న ఆధారంతో అంత పెద్ద అనుమానాన్ని పెంచుకోవటం న్యాయమేనా? గోళ్ళకేముంది? చిన్నపిల్లల గోళ్ళు ఎవరైనా తీస్తారు.

కానీ..... కానీ.... అంతలో పాప మళ్ళీ వెనక్కి వచ్చింది.

"మరేం..... నేను ముసల్దాన్నై పోతున్నానా?" అడిగింది.

రామయ్య తాత నవ్వేడు. "ఎందుకొచ్చిందమ్మా ఆ అనుమానం?"

"తెల్ల వెంట్రుకలు వస్తున్నాయటగా?"

"ఎవరన్నారు?"

"సరస్వత్తాతయ్య".

"తనే ముసలివాడైపోతున్నాడు. అందుకే కళ్ళు సరిగ్గా కనబడి వుండవు. నీకు తెల్ల వెంట్రుకలేమిటమ్మా?" నవ్వేడు.

"రెండు తీస్తేనో–

"రెండు తీశాడా?"

"ఆఁ.... పొట్లంలో పెట్టుకొంటేనో.....!' అతడి మొహంమీద చప్పున నవ్వు మాయమైంది. గోళ్ళు– వెంట్రుకలు–

ఆ వృద్ధుడు పాపవైపు క్షణంపాటు జాలిగా చూసేడు. పాప కదిలి వెళ్ళిపోయింది. అటే చూస్తూ నిలబడ్డాడు. ఆ మరుసటిరోజు అతడు యజమాని దగ్గర ఒక రోజుపాటు శలవు తీసుకుని వెళ్ళేడు.

ఇస్మాయిల్ దగ్గరికి.....

* * *

ఇంకో నాలుగు రోజుల్లో శ్రీధర్ కుటుంబం పారిస్ ప్రయాణం. పాస్‌పోర్టు, వీసాలు కూడా రెడీ అయ్యాయి.

అనితకి చూసిన సంబంధం ఆమెకి నచ్చకపోవటం వల్ల ఆ ఉద్దేశ్యం విరమించుకోవలసి వచ్చింది. ఆఖరి సంవత్సరం ఆమె హాస్టల్లో వుండి చదివేలా నిర్ణయం జరిగింది. శ్రీధర్ తన ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి నారాయణరావుకి ఓ ఉద్యోగం చూపించేడు. అతడింకో నాలుగు రోజులలో చేరాలి.

ఇలా అన్ని విషయాలూ సెటిల్ చేసేసరికి శ్రీధర్ నిశ్చింతగా ఫీలయ్యేడు. ఫీలవంది మిగిలిన ముగ్గురూ.

స్వామి పెనంమీద వేసిన గింజలా అల్లల్లాడసాగేడు. "ఇంక నెలకూడా లేదు. ఆ చేతబడి చేస్తానన్నవాడు డబ్బు తినేసి మనని మోసంచేసి నట్లున్నాడు. ఇంతవరకూ ఏమీ జరగలేదు".

సరస్వతి, పైడితల్లి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకొని కూర్చున్నారు. వాళ్ళకి జరిగిందేమిటో అర్థంకాలేదు. దాదాపు నెల గడిచింది. ఇంకో నెలే వుంది.

ఎందుకిలా జరిగింది?

స్వామి అన్నాడు. "ఇంకో నాల్గురోజులలో వాళ్ళు పారిస్ వెళ్ళిపోతారు. పుట్టినరోజు పండగ అక్కడ జరుపుకొంటారు. ఇరవై లక్షల ఆస్తి చాలా మామూలుగా వాళ్ళకి అందివ్వబడుతుంది. సర్వేజనా సుఖినోభవంతు. మనం మాత్రం వెధవల్లా జరిగేదంతా చూస్తూ వుంటాం".

"దీనికంతా కారణం ఆ సాహిర్‌గాడు".

"వాడ్ని చంపాలి".

"వాడ్ని సంపటం సంగతి తరువాత. ముందు పాపని సంపటం గురించి ఆలోసించండి" అన్నాడు పైడితల్లి చుట్ట వెలిగిస్తూ.

"మొత్తం ముగ్గురూ చచ్చిపోయేలా కారుకి యాక్సిడెంట్–" అతడి మాట పూర్తికాలేదు తలుపుదగ్గర చప్పుడయింది. ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. "ఎవరదీ?" సరస్వతి అరిచేడు. పైడితల్లి వెళ్ళి తలుపు తెరిచేడు.

అక్కడ ఓ మనిషి నిలబడి వున్నాడు. పొడుగాటి గడ్డం, మెడలో దండని కప్పుతూ భుజాలమీద వేసుకున్న గుడ్డ, కళ్ళలో కౄరత్వం, బిగించిన పెదాల మధ్య పట్టుదల. రెండు కళ్ళమధ్యా రక్తవర్ణంలో బొట్టూ, నిలువెత్తు విగ్రహం.

అతడు కాద్రా.

"సలామ్ కాద్రా!" అన్నాడు పైడితల్లి. మనసులో ఎటువంటి భావమున్నా పైకి మామూలుగా మాట్లాడటం పైడితల్లి గొప్పతనం. స్వామి, సరస్వతి విస్మయంతో లేచి నిలబడ్డారు. ఈ సమయంలో కాద్రాని అక్కడ చూడటం ఆశ్చర్యంగా వుంది. అతడెందుకు వచ్చేడిక్కడికి?

ఆలోచనలలో వుండగానే అతడు లోపలికి వచ్చి కూర్చున్నాడు. ఏం మాట్లాడాలో ఎవరికీ తోచలేదు.

ఇటువంటి సమయాలలో ఆదుకొనేది పైడితల్లే, "కాద్రా" అన్నాడు. "నువ్వు కాదన్న తర్వాత నీ శిష్యుడు ఆ పని చేస్తానని వప్పుకొన్న సంగతి నీకు తెలుసో తెలీదో...."

"తెలుసు" ముక్తసరిగా అన్నాడు కాద్రా. క్షుద్ర దేవతోపాసకులు సాధారణంగా తక్కువగా మాట్లాడతారు. తక్కువగా నవ్వుతారు.

"అతడికి డబ్బుకూడా ఇచ్చేం" ఇంకొంచెం ముందుకెళ్ళి అన్నాడు పైడితల్లి. "అయినా ఫలితం ఏమీ కనబడలేదు".

కాద్రా మాట్లాడలేదు. ఈసారి స్వామి అన్నాడు, "సాహిర్ తను వప్పుకొన్న పనిని చేశాడో లేదో తెలీదు".

"చేశాడు".

ఒక క్షణం నిశ్శబ్దం. సరస్వతి కొంచెం తటపటాయించి "ఇంతవరకూ ఏమీ ఫలితం కనిపించ లేదు" అన్నాడు.

"కనిపించదు."

"ఎందుకని...?"

"సాహిర్ చనిపోయేడు కాబట్టి".

ఆ గదిలో సూదిపడితే వినబడేటంత నిశ్శబ్దం ఆవహించింది. తమ కళ్ళముందు హుషారుగా తిరిగిన పాతికేళ్ళ యువకుడు చచ్చిపోయేడంటే వాళ్ళు నమ్మలేకుండా వున్నారు. ముగ్గురూ కాద్రానే చూస్తున్నారు. అతడు నిర్వికారంగా వున్నాడు. అయినా లోతుగా చూస్తే అతడి కళ్ళలో కదలాడుతున్న కసి కనబడుతుంది.

"అప్పుడే చెప్పేను–" అన్నాడతను. "చిన్నపిల్లలకు చేతబడి పట్టదని, అతడు వినలేదు."

"అంటే చిన్నపిల్లలకి చేతబడి చేసిన కారణంగానే అతడు చనిపోయాడా?"

"కాదు" అన్నాడు కాద్రా.

"మరి?"

"అతడికెవరో తిరుగుబడి చేసేరు".

"తిరుగుబడా?"

"అవును..... అందుకే చచ్చిపోయేడు. దారుణంగా.... రక్తం కక్కుకొని.... ప్రాణాలు పోయీ పోకా.... గిలగిలా కొట్టుకొని- పన్నెండు గంటలపాటు నరకయాతన అనుభవించి...."

వాళ్ళ వొళ్ళు జలదరించింది. చేతబడి చేసేవాళ్ళ జీవితం పూలపాన్పు కాదని వాళ్ళకి తెలీదు. వాళ్ళ ఆలోచన్లు ఇంకో సమస్య చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ఈ పథకం తప్పిపోతే ఇంకో దారెలా అని! ఇంకెంతో సమయం లేదు. నెలే..... ఇంకో నెలలో అనుకున్నది జరిగిపోవాలి.

"సాహిర్ చచ్చిపోయాడంటే నేను నమ్మలేకుండా వున్నాను" అన్నాడు స్వామి.

"ఈ చావుకి కారకులైన వాళ్ళని అంత సులభంగా నేను వదిలిపెట్టను" పళ్ళు బిగించి అన్నాడు కాద్రా. సాయంకాలపు మసక చీకటి అతడి మొహంమీద వికృతంగా పడుతోంది. ఆ కళ్ళని చూసి పైడితల్లి కూడా క్షణంపాటు బెదిరిపోయేడు.

ఆ నీరవంలో కాద్రా గొంతు కర్కశంగా వినిపించింది. "నా శిష్యుడు చేసిన చేతబడిని తిరగ్గొడ్తారా ఈ మూర్ఖులు. చూస్తాను.... దానికి ప్రతీకారం తీర్చుకొంటాను. ఈ రోజే నేను..... నేనే స్వయంగా పదహారో విద్యని ప్రదర్శిస్తాను. ఆ కుటుంబాన్ని సర్వనాశనం చేయటానికి ఈ రోజే 'కాష్మోరా'ని ప్రయోగిస్తాను".

వింటూన్న శ్రోతలు ముగ్గురూ ఉలిక్కిపడ్డారు.

కాష్మోరా!

ప్రపంచంలో ఏ ఒక్కరికో వచ్చిన విద్య..... కాష్మోరా....!! ఏ చేతబడి చేస్తే మనిషిని ఇంకెవరూ రక్షించరో ఆ విద్య.....

వాళ్ళకి ఆనందం వేసింది. సాహిర్ చచ్చిపోయినందుకు బాధ లేదిప్పుడు. అతడి గురువు రంగంలోకి దిగాడు. ఇంకా తమ కార్యం ఆగకుండా చేయలేని శక్తి ఏదీ ఈ లోకంలో లేదు. అందులో కాష్మోరా.....

ఒకళ్ళ మొహాలొకరు చూసుకొన్నారు. ఇరవై ఒక్క రోజులలో తమ కోర్కె నెరవేర్చబడుతుంది. కాష్మోరా!! పాతాళకుట్టి ప్రయోగించిన ఇరవై ఒక్క రోజులలో మరణం తథ్యం.

కాద్రా తనక్కావల్సిన వస్తువులు చెప్పసాగాడు.

8

గారేజి నుంచి కారు తెచ్చి పోర్టికోలో నిలిపి, శ్రీధర్ హారన్ కొట్టేడు. శారద కిటికీ దగ్గరకొచ్చి 'వస్తున్నా'నన్నట్టు చెయ్యి వూపి మళ్ళీ లోపలికి వెళ్ళింది. అతడు వాచీ చూసుకొన్నాడు. ఏడు అవుతోంది. పాప పరుగెత్తుకుంటూ వచ్చి కారెక్కింది.

"హౌ ఆర్యూ డాళింగ్-"

"ఫైన్ పప్పా థాంక్యూ!"

అతడు తలతిప్పి కూతురివైపు చూశాడు. పాలబుగ్గలు, చెవుల వెనుక కత్తిరించిన జుట్టు.... పెద్ద పెద్ద కళ్ళు....

"ఈసారి ఫస్ట్‌రాంక్ వస్తుందా?"

"ట్రయింగ్ పప్పా... కానీ ఆ రోజీ ఈజ్ టూ ఇంటిలిజెంట్. తనకే ఎప్పుడూ ఫస్ట్‌రాంక్".

"ట్రై హార్డ్ బేబీ-"

"పప్పా -"

"ఊఁ-?"

"అంకుల్ నన్ను రేపు జూకి తీసుకెళతానన్నాడు. వెళ్ళనా?"

అంకుల్ అంటే నారాయణరావు. దేనికీ స్పందించని ఆ మూగవాడికి కూడా తులసి అంటే ప్రేమ.

"వెళ్ళనా పప్పా!"

"ష్యూర్ బేబీ!"

"జూలోకి కొత్త పులులు వచ్చినయ్యట" అంది ఉత్సాహంగా "పప్పా మరి మనం కోతుల్నుంచి పుట్టేమటగా?"

"ఎవరు చెప్పారమ్మా?"

"మా భారతి టీచర్ చెప్పింది. నా గదిలో క్యాలెండర్ కూడా కోతిదే, రామయ్య తాత పెట్టేడు".

"కోతా?"

"ఆc.... ఆంజనేయస్వామిది".

"ఓ! అదా" నవ్వాడు శ్రీధర్. "నీ గదిలో అదెందుకమ్మా. సీనరీ ఏదైనా పెట్టుకోలేకపోయావా?" పాపకది అర్థంకాలేదు. అయినా దాన్ని పట్టించుకోకుండా ఇంకో ప్రశ్న అడిగింది. "మరి చచ్చిపోయి మనం దెయ్యాల మవుతామటగా?"

అతను ఉలిక్కిపడి.... "ఇదెవరు చెప్పారమ్మా?" అన్నాడు.

"సరస్వత్తాతయ్య" అంది తులసి. "దెయ్యం అయి గాలిలో తిరుగుతారట. ఎవరైనా మంచి పాపలుంటే వాళ్ళ నొచ్చి పడతారట".

అతడికి సరస్వతి పాపకి అలాటి కథలు చెప్పటం అంతగా నచ్చలేదు. ఈ లేత మనసులో అలాటి భయాల-సూపర్‌స్టిషన్ల ముద్రపడితే పెద్ద అయినా పోవు.

అతడి ఆలోచనల్ని చెదరగొడుతూ లోపల్నుంచి శారద వచ్చింది. "పదండి మీదే ఆలస్యం" అంటూ. అతడు తెల్లబోయి భార్యవైపు చూశాడు. చేసిన ఆలస్యమంతా చేసి, ఎంత నాజూకుగా తమ మీదకు తోసేస్తూంది.

ఆమె కారులో కూర్చుని డోర్ వేసింది. అతడు స్టార్ట్ చేస్తూ భార్య వైపు చూసి "మీ ఆడవాళ్ళకి బుద్ధిలేదోయ్" అన్నాడు.

ఆమె తెల్లమొహం వేసి "ఎందుకూ?" అంది.

"కొద్దిపాటి అలంకరణతోనూ, నీట్‌నెస్‌తోనూ, ఇంత అందాన్ని తెచ్చుకోవచ్చని తెలుసుండీ ఇంట్లో వున్నప్పుడు సర్వసాధారణంగా వుంటారు. పదిమందిలో అందంగా కనబడాలనే మీ తాపత్రయంలో పదోవంతు భర్తముందు కనపడాలని వుంటే ఎంత బావుణ్ను" అన్నాడు ఇంగ్లీషులో.

ఆమె చిరుకోపంతో "సర్లెండి, పాప వుంది. ఇలాటి మాటలు ఇక ఆపు చేయాలి" అంది ఇంగ్లీషులో.

"పాపకి అర్థమవుతుందని అనుకోను" అన్నాడు- "ఏమ్మా! నీకేమైనా అర్థం అయిందా?"

"నో పప్పా- నాట్ ఎ సింగిల్ వర్డ్" అంది తులసి. కారు కదిలింది.

*　　　*　　　*

క్షుద్ర దేవతోపాసకులు సాధారణంగా పెద్ద దేవతల్ని ఉపాసించరు. ఒకో విద్యా పైకి వెళ్ళేసరికి పని కష్టతర మవుతుంది. నిష్ట ఎక్కువ అవుతుంది.

"కాష్మోరా", "క్షిదం" ఇవన్నీ చాలా అరుదైన విద్యలు. ఇన్ని తెలిసినవాళ్ళు ఇప్పటికీ ఒరిస్సాలో వున్నారని అంటారుగానీ, దానికి ఋజువులు ఏమీలేవు.

తన శిష్యుణ్ని, అతడి చేతబడిని తిరగ్గొట్టి, దారుణంగా చంపినవారి మీద కసి తీర్చుకోవటానికి ఒక ముసలి మంత్రగాడు-క్షుద్ర దేవతలలోకెల్లా పెద్దవాడయిన కాష్మోరాని ఉపయోగించదల్చుకున్నాడు. పాతాళ కుట్టిని కాష్మోరాతో కలిపి

ప్రయోగిస్తే ఇక దానికి తిరుగులేదు. ఎవరూ తిరగబడి చెయ్యలేరు, దాన్ని తీసెయ్యలేరు.

ముగ్గు మధ్యలో కాద్రా కూర్చొని ఉన్నాడు. అతడి ప్రక్కన పాత్రలో మైదాపిండి ఉంది. తులసి చేతి కర్ఛీఫ్ ఉంది. తులసి తొక్కిన కాలి మట్టి ఉంది.

ముగ్గుకి ఎనిమిది వైపులా చిన్న చిన్న గొబ్బిళ్ళలాటి మాంసపు ముద్దలు ఉన్నాయి. ఆవు, పులి, పిల్లి, బల్లి, ఏనుగు, కుక్క కాకి, పసిపాపల మాంసం అది.

ముగ్గు మధ్యలో హ్రీం-క్రీం అన్న అక్షరాలు వ్రాయబడి ఉన్నాయి. సాంబ్రాణి పొగ దట్టంగా అలుముకొని వుంది.

అతడు మైదాపిండితో బొమ్మను చేశాడు. తులసి తాలూకు చేతి గుడ్డను దానికి కట్టేడు. తులసి తొక్కిన మట్టిని ఆ బొమ్మ కాలికి అద్దేడు.

బొమ్మ నెదురుగా పెట్టుకొని మంత్రం చదవటం మొదలుపెట్టాడు. (కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ మంత్రాన్ని యిక్కడ రాయటం కుదరటంలేదు, పూర్తిగా తెలీదు కూడా.)

అతడి పెదవులు కదులుతున్నాయి. స్పష్టంగా మంత్రాన్ని ఉచ్చరిస్తున్నాయి. అతని పక్కనొక అరిటాకు వుంది. దానిమీద తుమ్మముళ్ళు వున్నాయి. 108-నూట ఎనిమిది ముళ్ళు.

అతడు మంత్రాన్ని ఉచ్చరిస్తూనే ఉన్నాడు. మొత్తం నూట ఎనిమిది సార్లు ఉచ్చరించాలి. తరువాత నూట ఎనిమిది ముళ్ళు ఆ బొమ్మలో గుచ్చాలి. అతను గుచ్చసాగాడు. దాదాపు అరగంట.

అరగంటలో గుచ్చడం పూర్తయింది. శరీరం నిండా బాణాలు గుచ్చుకొన్న శవంలా వుంది బొమ్మ. "ఏ అంగానికైనా బాధ కల్గించాలా?" అడిగాడు.

"అంటే?"

"ఒక చెయ్యి ముందు చచ్చుబడిపోవాలంటే- ఆ చేతిమీద మరో ఎనిమిది ముళ్ళు గుచ్చాలి."

"పాపం పాప! అలాంటిదేమీ వద్దులే" అన్నాడు స్వామి.

"అట్టంటే ఎట్టా సామీ - ఆ పాప తొందరగా సావటం మనక్కావాలి" అని పైడితల్లి కాద్రావైపు తిరిగి "యూ పిన్ హర్ ఇన్ హార్ట్. గుండెలో ఎనిమిది గుచ్చు" అన్నాడు.

హృదయం భాగంలో మరో ఎనిమిది గుచ్చబడ్డాయి. మారణహోమానికి నాంది జరుగుతూంది. అతడు బొమ్మని పట్టుకొని లేచేడు. ఉత్తరం దిక్కుగా

సాగిపోయేడు. స్మశానాన్ని చేరుకొని చుట్టూ చూసేడు. నిర్మానుష్యంగా వుంది. తననెవరూ చూడటం లేదని నిర్ధారణ చేసుకొని మోకాళ్ళమీద కూర్చొన్నాడు. నెమ్మదిగా తవ్వటం ప్రారంభించేడు.

స్మశానపు ముందుభాగంలో వున్న కాలిబాట అది. శవవాహకులు ఆ దార్లోంచే వెళ్ళాలి. ఆ దార్లిలో అతడు మోచేయి లోతు తవ్వి బొమ్మని పాతిపెట్టి మట్టి కప్పేడు. పైనుంచి నడిచేవాళ్ళ 'కాలి అడుగు' బొమ్మమీద పడినప్పుడల్లా ఆ బొమ్మ తాలూకు మనిషి బాధతో విలవిల లాడిపోవటం జరుగుతుంది. చాలా హృదయ విదారకమైన బాధ ననుభవించ వలసి వస్తుంది. మట్టి కప్పి అతడు వెనక్కి తిరిగేడు.

చేతబడి- బాణామతి, బడీ కుట్టి- కుట్టి సైతాన్, పాతాళ్ కుట్టి- పేరే దైతేనేం? మనిషిలో దెయ్యం మరో మనిషిమీద దారుణంగా కసి తీర్చుకోవటానికి అన్నీ ఒకటే.

తిరిగి వస్తూంటే అతనన్నాడు.

"కాష్మోరా బయల్దేరుతూంది. ఈ రాత్రి పన్నెండు గంటలకి ఆ ఇంటిని చేరుకొంటుంది. తరువాత ఇరవై ఒక్క రోజుల్లో....." అతడు మరి పూర్తి చెయ్యలేదు.

ఇరవై ఒక్క రోజులు....

"ఇంకో ఆరు రోజులు ఆలస్యం అయినా ఫర్లేదు" అనుకొన్నాడు స్వామి. "కాని అవ్వాలి. తిరుగులేదు. ఉండటానికి వీల్లేదు".

కాద్రా అన్నాడు- "మీరు చెయ్యవలసిన పన్లు మూడు. ఒకటి- ఆ ఇంటి ప్రాంగణంలో తులసి మొక్క ఏదీ లేకుండా చూడండి. రెండు- నేను ఎండు మిరపకాయలూ, ఉప్పు యిస్తాను. వాటిని ఆ పాప తొక్కేటట్లు చూడండి. మూడు- రేపట్నుంచి ప్రతిరోజు రాత్రి సరిగ్గా పన్నెండింటికి ఆ పాప నోట్లో మూడు రక్తం చుక్కలు వెయ్యాలి 'మనిషివి'..... కాష్మోరాకి ఆహారంగా....."

ముగ్గురూ మొహమొహాలు చూసుకొన్నారు. స్వామి 'సరే' అన్నాడు. వెళ్ళబోయేముందు జేబులోంచి ఐదువేలు తీసి ఇచ్చేడు.

"వద్దు" అన్నాడు కాద్రా. "ఇది నా శిష్యుణ్ని చంపినందుకు ప్రతీకారం. దీనికి నాకు డబ్బేమీ అక్కర్లేదు. ఆ పాప గిలగిలా కొట్టుకుని రక్తం కక్కుకుని చావాలి. అంతే నాక్కావల్సింది. అది అయ్యాక డబ్బు ఇద్దురుగాని".

వాళ్ళు ముగ్గురూ అతడి దగ్గిర శలవు తీసుకొన్నారు. వాళ్ళకి సంతోషంగా వుంది. మంత్రగాళ్ళ ప్రపంచంలో కాద్రాని ఎదుర్కొనే వాళ్ళు ఎవరూ లేరని వారికి నిశ్చయంగా తెలుసు. వాళ్ళు బండి ఎక్కుతూంటే వెనుకనుంచి కాద్రా అరిచేడు. "ఈ రోజు రాత్రి పన్నెండింటికి..... పాప అనారోగ్యం మొదలు".

ఇంటికి ఆ టైమ్‌కి వాళ్ళు చేరుకోలేదు. అయినా చూడటానికి అక్కడేమీ వుండదు. ఆ రాత్రి సరీగ్గా పన్నెండు గంటలకి తులసి తన గదిలోకి వత్తిగిలి పడుకొని ఉన్నది. అప్పటివరకూ నిశ్చలంగా వున్న తెరలు కొద్దిగా కదిలినయ్. చెట్ల కొమ్మలు ఎవరో కదిపినట్టు అల్లల్లాడినయ్. ఆ పాప కప్పుకొన్న దుప్పటి అంచుకూడా కదిలింది. ఆ నిశ్శబ్దపు వాతావరణంలో కొద్ది కదలిక- అంతే!

అయితే దాన్ని పసిగట్టింది ఆ ఇంటి వసారాలో వున్న కుక్క అప్పటివరకూ మగతగా పడుకున్నదల్లా లేచి గొలుసు తెంపుకోవటానికి ప్రయత్నిస్తూ బిగ్గరగా అరవసాగింది.

"ఏమిటది?" నిద్రలోనే అడిగింది శారద. శ్రీధర్ లేచి బైటికొచ్చేడు. తలుపులు వేసినవి వేసినట్టే వున్నాయి. తోటలో ఎక్కడా కదలిక లేదు.

"సైలెన్స్. బూషీ- సైలెన్స్"

అది వినటంలేదు. ముందరి కాళ్ళమీద లేచి నిలబడి ఎగిరెగిరి పడుతోంది. అతడు విసుగ్గా దాన్ని కొడుతూ "చుప్" అన్నాడు. బాధగా అరిచి ముణగదీసుకొని పడుకొంది అది.

అతడో క్షణం దానివైపే చూసి కదిలేడు. మేడ ఎక్కి తన గదిలోకి వెళ్ళబోతూ ఆగి పక్కగదిలోకి నడిచేడు. తులసి పక్కకి వత్తిగిలి నిద్రపోతూంది అమాయకంగా. దుప్పటి కొద్దిగా కిందికి జరిపి మెడమీద ముద్దు పెట్టుకున్నాడు. తరువాత దుప్పటి సరిచేసి, ముంగురులు సర్ది తలుపు దగ్గిరగా వేసి గదిలోకి వచ్చేసేడు.

కిటికీ పక్కగా వున్న ఆంజనేయస్వామి కాలెండరు గాలికి తిరగబడి వుండటం అతను గమనించలేదు. అయినా అది చాలా కాజువల్‌గా జరిగింది.

* * *

"నువ్వు ఆగకుండా స్కిప్పింగ్ ఎంతసేపు చెయ్యగలవు?" సరస్వతి అడిగేడు.

"ఓ! ఎంతసేపయినా" తల ఎగరేస్తూ అంది తులసి.

"ఏది, చెయ్యి చూద్దాం".

పాప రెండు చేతులతోను తాడు తిప్పుతూ గెంతసాగింది. పది అడుగుల దూరంలో పైడితల్లి నిలబడి వున్నాడు. చిన్న ఆకులో ఎండు మిరపకాయలూ, సగం కోసిన నిమ్మకాయ, ఉప్పూ.... పెట్టుకొని. "గెంతుతూ ఇక్కడే వుంటావా- పరుగెత్తగలవా?" సరస్వతి అడిగేదు.

"పరుగెత్తనా?" అంది తులసి పెదాలు బిగపట్టి రొప్పుతూ.

"క్విక్" అన్నాడు పైడితల్లి.

పాప స్కిప్పింగ్ చేస్తూ ముందుకి దూకింది. ఒకడుగు- రెండు.... మూడు.... ఏద్దో అడుగు దాటి, తల్లి పిలిస్తే అలాగే లోపలికి పరుగెత్తింది.

సరస్వతి పైడితల్లి దగ్గిరగా వచ్చి అడిగేదు. "తొక్కిందా?" పైడితల్లి నేలవైపే చూస్తూ అన్నాడు- "తొక్కింది."

*   *   *

"ఏమైంది?" అడిగేడు శ్రీధర్.

"మొక్క కనబడటంలేదు".

"ఏం మొక్క?"

"తులసి".

"ఇప్పుడు దాని సంగతి ఎందుకు?" విసుగ్గా వాచీ చూసుకుంటూ అడిగేడు.

"ఏడు కావొస్తూంది".

"పెరట్లోకి వస్తే ఏమిటో బోసిగా అనిపించింది. చూస్తే మొక్క లేదు".

"ఏ ఆవో తినేసి వుంటుంది".

"కాంపౌండ్‌లోకి ఆవు యెలా వస్తుంది?"

శ్రీధర్ మొహం చిట్లించి "శారదా! ఈ తర్కం మాని తొందరగా బయల్దేరు. అక్కడ అందరూ ఎదురుచూస్తూ వుంటారు" అన్నాడు అబ్రకదబ్ర ఇంట్లో డిన్నర్ విషయం జ్ఞాపకం చేస్తూ.

".....ఈ రోజు శుక్రవారం" అని తనలో తనే గొణుక్కుంటూ లోపలికి వెళ్ళింది. అతను అటే చూస్తూ నిలబడ్డాడు.

మనిషిని ఈ సెంటిమెంట్ ఎందుకు వదలదు? చిన్నప్పటి నుంచీ రక్తంలో జీర్ణించుకుపోయిన భావాలా? పెద్దవాళ్ళు నూరిపోసిన అభిప్రాయాలా? ఎందుకిన్ని సూపర్‌స్టిషన్స్? శుక్రవారం.... తులసి చెట్టు.... శకునం..... అమావాస్య.... రాహుకాలం...... వీటన్నిటికీ నిజంగా మనం ఇస్తున్నంత ప్రాముఖ్యత వుందా? ఉంటే మరి సైన్సు సంగతి.... అడ్వాన్స్‌డ్ సైన్స్ .... సైన్స్ మళ్ళీ ముందుకు వెళ్ళి వెళ్ళి వేదాంతంలో కలుస్తుందా......? అన్నీ అనుమానాలే.....

అబ్రకదబ్ర ఇంటికి భోజనానికి వెళుతుంటే కారులో అనిత పెళ్ళి విషయం ఎత్తాడు. ఆమె వివాహం జరిగిన తర్వాత విదేశం వెళ్ళటం మంచిదని అతని ఉద్దేశ్యం. ఈ విషయంలో ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నాడు. అనితని హాస్టల్లో వుంచి వెళ్ళటం అతనికి ఇష్టంలేదు.

"నువ్వూ మీ మావయ్యా వెళ్ళి ఆ సంబంధం చూసి రాకూడదూ" అన్నాడు.

"ఏదీ?"

"అదే! అనితకి...."

శారద నవ్వి... "ఏమిటో మీకు వున్నట్టుండి ఇంత ఇంట్రస్టు పుట్టు కొచ్చింది?" అంది.

"మరి తనకి పద్దెనిమిది రావటంలేదా?"

"పద్దెనిమిదా!- ఇరవై రెండు వస్తుంటే."

అతడు కొద్దిగా ఆశ్చర్యపడి "ఇరవై రెండా? అరె, అంత అనుకోలేదు సుమా!" అన్నాడు.

"తను వెళ్ళిపోతే అసలు తోచదు" అంది శారద.

శ్రీధర్ నవ్వేడు- "నువ్వు ఓ ఇంటి బయట్నుంచి వచ్చినదానివి. ఇలా మాట్లాడుతూ వుంటే విన్నవాళ్ళు ఏం అనుకుంటారో తెలుసా? ఆడపడుచుకి కట్నం ఇవ్వాల్సి వస్తుందని పెళ్ళి వద్దంటూంది అని......"

శారద ఆ మాటలకి తేలిగ్గా నవ్వి- "నా గురించి ఎవరూ అలా అనుకోరులెండి. అనిత నా కూతుర్లాంటిది" అంది.

అబ్రకదబ్ర ఇంటికి వాళ్ళు చేరుకొనేసరికి ఏడున్నర అయింది. అప్పటికే మిగతా గెస్టులు వచ్చేసేరు. మొత్తం మూడు కుటుంబాలు.

అబ్రకదబ్ర ఇల్లు గమ్మత్తుగా వుంటుంది. డ్రాయింగ్ రూమ్‌లో రబ్బర్‌తో చేసిన తొండలూ, బల్లులూ గోడలకి వుంటాయి. ప్లాస్టిక్ పుర్రె ఆష్‌ట్రే.

"హ్రీం-క్రీం" అన్న అక్షరాలు పెయింట్ చేసి అద్దాలు బిగించేడు. ఈ రెండక్షరాలూ ప్రేతాత్మలకి ప్రియమయినవి. అలాగే 'ఓం' అన్నది దేవుడికి ప్రియమయినది. శ్రీధర్‌కి ఆ గది ఒక పెద్ద జోకు.

"హల్లో ఆన్టన్ స్పాంజర్!" అన్నాడు శ్రీధర్. ఆన్టన్ అమెరికాలో కెల్లా పెద్ద క్షుద్ర దేవతోపాసకుడు.

శ్రీధర్ తనకిచ్చిన బిరుదుతో అబ్రకదబ్ర మొహం చాటంతయింది. "రండి రండి" అంటూ ఆహ్వానించాడు. గోడలకున్న బొమ్మల్నీ, పటాల్నీ తులసి శ్రద్ధగా చూస్తోంది. శారద లోపలికి వెళ్ళింది. శ్రీధర్ మిగతా వాళ్ళని కూడా విష్ చేసేడు. బయట తన ఈడువాళ్ళు లైటు వెలుగులో ఆడుకోటం చూసి తులసి బయట కెళ్ళింది.

మొగవాళ్ళు డ్రాయింగ్‌రూమ్‌లో, ఆడవాళ్ళు లోపలా కబుర్లు చెప్పుకొంటున్నారు. అప్పుడప్పుడే హిపోక్రసీ నేర్చుకుంటున్న ఆడవాళ్ళు. అందువల్ల వాళ్ళ సంభాషణ చాలా గమ్మత్తుగా వుంది. శారద వాళ్ళ కబుర్లు నవ్వుతూ వింటూంది.

పాపా వాళ్ళు ఆడే ఆట డ్రాయింగ్ రూమ్‌లోంచి కనిపిస్తూంది.

"ఆ ఎఱ్ఱ ఫ్రాకు వేసుకున్న పాప ఎవరు?" లావుగా వున్నావిడ అడిగింది.

"మా అమ్మాయి" అంది శారద.

"ఎంత బావుందో!"

చివుక్కున తలెత్తి చూసింది శారద. లావుపాటావిడ అటే చూస్తూంది కన్నార్పకుండా. ఆవిడ కళ్ళలో ఏదో అస్పష్టమైన ఆకలి. ఆ దృష్టిలో ఏదో అపరిపక్వత.

దృష్టి. దబుష్టి

దిష్టి.....

అంటే.....? ఏమిటని ఆమె ఆలోచించలేదు. ప్రతిదానికీ సైంటిఫిక్ రీజనింగ్ ఇచ్చి ఆలోచించటం ఒక్క శ్రీధర్‌కే వున్న జబ్బు. ఆమె మాట మారుస్తూ "మీ అబ్బాయి ఏం చదువుతున్నాడు?" అని అడిగింది. ఆమె ప్రయత్నం సఫలమయింది.... సంభాషణ ఇంకోవైపుకి దారితీసింది. తరువాత వాళ్ళు భోజనానికి లేచేరు.

పెద్దవాళ్ళు భోజనం చేస్తూ వుండగా తులసి లోపలికి వచ్చింది. తండ్రిలాగే ఆమెదీ కొంచెం రిజర్వ్‌డ్ టైపు. ముందు గదిలో కూర్చుని కొంతసేపు ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో బొమ్మలు చూసింది. తరువాత పుస్తకాన్ని పక్కన పడేసి లేచింది.

డ్రాయింగ్ రూమ్‌కి కుడివైపున వున్న గదిలోంచి పైకి మెట్లున్నాయి. పైన గదులేమీ లేవు. మేడ. అంతే. అందుకనే కుడివైపు గదిని స్టోర్‌రూమ్ చేసేరు. అబ్రకదబ్ర తాలూకు సామానులన్నీ అక్కడే వున్నాయి.

తులసి అటు నడిచింది.

ఉన్నట్టుండి ఆ ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నట్టయింది. బయట పిల్లల అల్లరి, డైనింగ్ రూమ్‌లో పెద్దల సందడి లీలగా వినిపిస్తూంది.

తులసి ఆ చిన్నగది గుమ్మం దగ్గిర నిలబడి లోపలికి చూసింది. విచిత్రమయిన వాసన. వస్తువుల్ని కదల్చకుండా నెలల తరబడి వుంచితే వచ్చే వాసన. చిన్న చిన్న పెట్టెలు, రేకుడబ్బాలు, పాత చాప, విరిగిన మూడు చక్రాల సైకిలు, ఒకదానిమీద ఒకటి పడివున్న వస్తువులు. మెట్లక్రింద చిన్న తలుపు, చిన్న అల్మైరా.

తలుపు గొళ్ళెంమీద చెయ్యి వేసింది. లోపల అబ్రకదబ్ర వేసిన జోకుకి అందరూ నవ్వేరు.

మళ్ళీ నిశ్శబ్దం.

మెట్లక్రింద అడుగెత్తు వున్న చిన్న తలుపు.

గొళ్ళెం తీసింది.

పాత సామానుల మధ్య ఏదో కదిలిన చప్పుడు. మళ్ళీ నిశ్శబ్దం. ఒక సాలెపురుగు గబగబా ఇరుకుసందు మధ్యకి పరుగెత్తింది. పైనుంచి బూజు కొద్ది కొద్దిగా క్రిందికి రాలుతూంది.

తలుపు తెరుస్తూ వుంటే కిర్రున చప్పుడయింది. పాతకాలం తలుపు. పూర్తిగా తెరిచి లోపలికి మొహంపెట్టి వంగి చూసింది. అంతే ఆ ఇరుకు గదిలో ఆ చిన్న గొంతు కెవ్వు కెవ్వున ప్రతిధ్వనించింది.

ఒక బల్లి నల్లది.

పై కప్పుకు వేలాడేలా కట్టబడి వుంది. దానిక్రింద పళ్ళెంలో బియ్యం వున్నాయి. బల్లి నోట్లోంచి నల్లటి విషం బియ్యంలో ఒక్కో చుక్కా పడుతూంది.

తులసి తలుపు తీయగానే చావటానికి సిద్ధంగా ఉన్న బల్లి కదిలింది. గింజుకుంటూ, గాలిలో ఉయ్యాల ఊగినట్టూ వూగుతూ విసురుగా ముందు కొచ్చింది.

-దాని కళ్ళు-

మొహంలోంచి ముందుకు పొడుచుకొచ్చినట్లుగా, నల్లగా మెరుస్తూన్న రెండు గోళాలు.....మీదకొచ్చే గోళాలు.....

అది విసురుగా మీదికి రాగానే జివ్వున రెండు చుక్కల్ని చిమ్మింది. ఈ హఠాత్సంఘటనకి పాప బెదిరిపోయింది. కెవ్వున అరిచింది.

అరుస్తూనే వుంది.

....

ముందు పరుగెత్తుకు వచ్చినవాడు అబ్రకదబ్ర. వెనకే శ్రీధర్ వచ్చాడు. అబ్రకదబ్ర పాపని వెనక్కిలాగి తలుపు వేసేశాడు.

"ఏమైందమ్మా?" శ్రీధర్ అడిగాడు.

పాప మాట్లాడలేదు. బెదిరిపోయినట్టు చూస్తూనే వుంది. ముగ్గురూ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చారు. గుమ్మం దగ్గిరున్న వాళ్ళు పక్కకి తప్పుకొన్నారు.

అందరూ అడిగారు ఏమైందని. శ్రీధర్ గ్లాసుతో మంచినీళ్ళు పట్టించాడు. అవి తాగేక తేరుకొంది.

"వెళ్ళి ఆడుకోమ్మా" అన్నాడు. పాప మాట్లాడలేదు. తండ్రి వళ్ళో మరింత వత్తిగిలి కూర్చొంది.

"భయం పోయిందా?"

తులసి తలూపింది.

"అసలు ఏమైంది?" ఎవరో అడిగారు.

అబ్రకదబ్ర చెప్పాడు– "కేరళలో విధవలు, ఇలాటి బియ్యం వండిపెట్టి ఒక బ్రహ్మచారిని చంపితే మరుజన్మలో సుమంగళులవుతారట. అలా అని వాళ్ళ నమ్మకం. అసలు బల్లి నోట్లోంచి విషం కక్కుతుందా అని చూడటానికే ఈ ప్రయోగం".

"ఓరి నీ ప్రయోగాలు తగలెయ్యా. ఇలాంటివన్నీ ఇంట్లో చేస్తావుట్రా?" అన్నాడు భోజనానికి వచ్చిన యింకో యింజనీరు. ఆయనకి యాభై అయిదేళ్ళుంటాయి.

"లేదు బాబాయ్! అసలు బల్లి నోట్లోంచి నల్లటి విషం పడటం ఏమిటా అని చూశాను. అంతే" సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు అన్నాడు.

"ఏడిశావ్!"

అయితే ఈ సబ్జెక్టు అక్కడున్న మిగతా వాళ్ళలో ఇంట్రెస్టు పుట్టించింది. దానిమీద రెండు మూడు ప్రశ్నలడిగారు.

క్షుద్ర విద్యల గురించీ, అక్కల్ట్ సైన్సెస్ గురించి ఎవరైనా అడిగితే చాలు వళ్ళు మర్చిపోతాడు అబ్రకదబ్ర. విచ్‌క్రాఫ్ట్ ఎప్పుడు మొదలయిందీ మంత్రగత్తెల్ని ప్రజలు ఎలా హింసించి చంపింది ఉపన్యాసంగా చెప్పాడు.... కథలు, వళ్ళు జలదరించే కథలు..... క్షుద్ర దేవతలకి తమ శరీరాల్నీ, ఆత్మల్నీ అర్పించిన

మంత్రగాళ్ళు.... వాళ్ళు చచ్చిపోగానే ఆ శరీరం కోసం దెయ్యం రావటం.... ఇవన్నీ కథలుగా చెప్పాడు.

"ఇదంతా పెద్ద జోక్‌లా వుంది" ముసలాయన నవ్వాడు.

"నమ్మని వాడికి జోకు, నమ్మేవాడికి నిజం".

"పొసెషన్ అంటే ఏమిటి?" ఎవరో అడిగారు.

"బ్రతికున్న మనిషిలో దెయ్యం వచ్చి చేరటం".

"అది ఎలా తెలుస్తుంది?" ఇంటర్వ్యూలోలా అడిగేరింకెవరో.

"దెయ్యం పట్టినవాడు పెద్దగా ఆర్తనాదాలు చేస్తూ నేలమీద పడిపొర్లుతాడు. నోట్లోంచి రకరకాల పదార్థాలు వూస్తాడు. ఉదాహరణకి 1566 సంవత్సరంలో ఒక అబ్బాయి 'తారు'ని వూశాడట....."

"ఊc.... ఇంకా....."

".....అతని కంఠస్వరం మారిపోతుంది. అమెరికాలో 'సలేం' అన్న వూళ్ళో ఇది నిజంగా జరిగిందట..... ఒక బండి చక్రానికి దెయ్యం పట్టినవాణ్ని కట్టి, గాలిలో గిర్రున తిప్పటంవల్ల దెయ్యాన్ని పారద్రోలవచ్చని ఫ్రాన్స్‌లో ఇప్పటికీ నమ్ముతారు. ఈ క్షుద్ర విద్యలు చాలా వున్నాయి. నెక్రోమన్సీ...".

"అంటే?"

"చచ్చిన వాళ్ళతో మాట్లాడటం".

శ్రీధర్‌కి ఆ రోజు ఇస్మాయిల్ ఇంటికి వచ్చిన జర్మన్ ప్రేతాత్మ జ్ఞాపకం వచ్చింది.

అబ్రకదబ్ర చెబుతున్నాడు– "డెవినేషన్ అంటే ముగ్గువేసి, అందులో భవిష్యత్తుని చూడగల్గడం. మన జానపద కథలలో మంత్ర దర్పణం అంటామే అది" అన్నాడు. "అలాగే 'వేవిటేషన్' అంటే గాల్లో ఎగరటం. వేర్‌వుల్ఫ్స్– తెలుగులో మనుమెకాలు..... భద్రాచలం అడవులలో ఇప్పటికీ ఈ మనుమెకాలు వున్నాయనీ, రాత్రవగానే మనుషుల్నీ జంతువుల్నీ వేటాడతాయని చెపుతూ వుంటారు. ఆఫ్రికాలో 'వూడూ', పశ్చిమ దేశాలలో "బ్లాక్‌మాస్"– ఇవన్నీ దెయ్యాలకి సంబంధించిన క్షుద్ర కర్మలు. 1563లో ఇంగ్లాండ్‌లో విచ్‌క్రాఫ్ట్ ఆక్ట్ ప్రవేశపెట్టబడింది. ఉపాసకుల్ని శిక్షించే అధికారం న్యాయస్థానానికి లభించింది. మంత్రగాళ్ళనీ, అనుమానం వచ్చిన వాళ్ళనీ తలక్రిందులుగా వ్రేలాడదీసి క్రింద మంటపెట్టి చంపేవారు...." అబ్రకదబ్రా చెప్పుకుపోతున్నాడు.

శ్రీధర్ వినటంలేదు అపనమ్మకంతో.

అతడి వళ్ళో ముణగదీసుకొని కూర్చొన్న పాపమాత్రం వింటూంది భయంతో. ఆ తర్వాత......

కారులో ఇంటికి వస్తూంటే కారులో పక్కనే ఉన్న పాపమీద చెయ్యి వేసి ఒంటిచేత్తో దగ్గిరకి లాక్కొని "అలా వున్నావేమిటమ్మా?" అన్నాడు.

తులసి మాట్లాడలేదు.

అయిదు నిమిషాలలో కారు ఇంటిముందు ఆగింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. శారదకి అదంత ఇష్టం వుండదు. నిశ్శబ్దం మనిషి మనసులో కల్మషానికి నిదర్శనం అని ఆమె ఉద్దేశ్యం. ఎప్పుడూ లేనిది పాప ఆ రోజు అదోలా వుండటాన్ని గుర్తించింది తల్లి ఒక్కతే. అయితే అది, ఆ రోజు చూసిన సంఘటనవల్ల అని సరిపెట్టుకుంది.

సరస్వతి, పైడితల్లి బయటకు వెళ్ళారు. నారాయణరావు కూడా ఇంట్లో లేడు. శ్రీధర్ డైనింగ్ టేబుల్ మీద కూర్చున్నాడు. "తులసీ! కమ్ ఫర్ మీల్స్".

అర నిమిషం తర్వాత మెట్లపైన అలికిడి వినిపించింది. పైన మసక చీకట్లో నిలబడి వుంది పాప. "నా కాకలి లేదు డాడీ".

"కొంచెం తిని వెళ్ళమ్మా".

తులసి మాట్లాడలేదు. నెమ్మదిగా వెనక్కి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

భార్యాభర్తలిద్దరూ మొహమొహాలు చూసుకొన్నారు. తల్లి మాటల పట్ల తులసి ఇంత నిరాసక్తంగా ప్రవర్తించటం అదే మొదటిసారి. శ్రీధర్ కుర్చీ వెనక్కి తోసి మెట్లెక్కాడు. తులసి గదిలోకి నడిచాడు. తలుపు తీసే వుంది. గుమ్మం దగ్గర నిలబడి చూశాడు.

తల పక్కకు తిరిగి తలగడలో ముఖం దాచుకొని నిస్త్రాణగా పడుకొని వుంది. అతడికి ఒక్కసారిగా జాలేసింది.

(జాలి. జాలేమిటి? ఇక్కడ ఆ పదం చాలా విచిత్రంగా పడింది. ప్రేమ అని వుండాలి. సిక్స్‌సెన్స్ ఏమయినా చెబుతుందా?)

దగ్గిరకి వెళ్ళి, మీద చెయ్యివేసి "రామ్మా" అన్నాడు. తులసి అట్నుంచి కొద్దిగా ఇటు తిరిగి మళ్ళీ పడుకుంది.

ఇంతలో శారద గ్లాసుతో పాలు తీసుకొచ్చింది. పక్కమీద కూర్చొని- కూతుర్ని లేపి తాగించాడు. తరువాత పడుకోబెట్టి, మెదవరకూ దుప్పటి కప్పి

బయటికి వచ్చాడు. మెట్లమీద శారద, మళ్ళీ పైకి వస్తూ కనిపించింది. ఆమె పిడికిలి మూసుకొని వుంది.

"ఏమిటిది?"

"కొంచెం దిష్టి తీస్తాను".

అతనికి నవ్వొచ్చింది. అయినా మాట్లాడలేదు. చూస్తూ వూరుకొన్నాడు.

ఆమె పాప దగ్గరగా వెళ్ళి చేతిని తలచుట్టూ మూడుసార్లు కుడి పక్కకీ, మూడుసార్లు ఎడమ పక్కకీ తిప్పింది.

ఆమెతోపాటూ అతనూ క్రిందికి దిగుతూ అడిగాడు- "నీకు దిష్టి మంత్రం వచ్చా?"

ఆమె రాదన్నట్టు తలూపింది. మిరపకాయల్ని వంటింట్లోకి వెళ్ళి కుంపట్లో వేసింది. చిన్న చిన్న చప్పుళ్ళతో అవి పేల్తున్నాయి. చితుల మధ్యలో కపాలాల్లా.

ఆమె భర్తవైపు తిరిగి "చూశారా ఎంత ఘాటో?" అంది.

అతడు దగ్గుని ఆపుకోటానికి ప్రయత్నిస్తూ "మరి మిరపకాయలు నిప్పుల్లో వేస్తే ఘాటు రాదా?" అన్నాడు.

"దిష్టి ఎక్కువుంటే ఎక్కువొస్తుంది" అన్నదామె.

ఇద్దరూ బయటకొచ్చారు. "దిష్టి..... అంటే?" అడిగాడు.

ఆమె నవ్వి 'నేను అబ్రకదబ్రాని కాదు, అన్నీ ఇంగ్లీషులో వివరించటానికి" అంది.

"ఇంగ్లీషులోనా?"

"మరి మీరంతా తెలుగులో చెబితే నమ్మరుగా, దివ్యదృష్టి అంటే నవ్వుతారు, టెలిపతీ అంటే నమ్ముతారు".

"నేను దేన్నీ నమ్మను".

"మరి నేను పాపకి దిష్టి తీస్తూంటే చూస్తూ ఎందుకు వూరుకున్నారు?"

"నీ నమ్మకాన్ని పాడుచేయటం ఇష్టంలేక".

"కాదు" అంది శారద తలూపుతూ. "ఏ పుట్టలో ఏ పాముందో అన్న మనస్తత్వం. నిజానికి మీరీ దిష్టినీ, వీటినీ నమ్మరు. కానీ మీ కూతురికి వంట్లో నలతగా వుంటే, మీ భార్య దిష్టి తీస్తూవుంటే చూస్తూ వూరుకుంటారు. 'ఒకవేళ అలా తగ్గినా తగ్గొచ్చేమో చూద్దాం' అన్న మనస్తత్వం. అవునా?"

అతనన్నాడు "నా కర్థంకానిది ఒకటే! ఏదైనా అందంగా వుంటే 'చెడు చూపు' తగులుతుందంటారు. పచ్చగా పెరిగిన పైరుకి గుడ్డబొమ్మ తగిలిస్తారు. పిల్లలకి

ఒంట్లో బావోలేకపోతే ఉప్పు తిప్పి నీళ్ళలో వేస్తారు. లేకపోతే కాగితం మండించి బాల్చీ బోర్లా వేస్తారు. నూనెలో గుడ్డ ముంచి కాలుస్తారు. వీటికీ- ఒంట్లో తగ్గటానికీ ఏమిటి సంబంధం? కాళ్ళకి పసుపు రాసుకోవడానికీ, తినే విస్తరాకు చుట్టూ నీళ్ళు జల్లటానికీ సైంటిఫిక్ రీజనింగ్ వుందిగానీ, దిష్టి మంత్రానికి లేదే".

"మరి ఈ ఆర్గ్యుమెంటంతా దిష్టి మంత్రం నేను తీసేముందే చేసి నన్ను ఆపుచెయ్యొచ్చుగా? ఎందుకు ఆపలేదు?" అని వాదించింది శారద.

శ్రీధర్ నవ్వి వూరుకున్నాడు. నిజానికి అతని దగ్గిర కౌంటర్ ఆర్గ్యుమెంట్ లేదు. పూర్తిగా నమ్మినా ఫర్లేదు, నమ్మకపోతే అసలు ఘర్షణే లేదు. ఈ నమ్మీ నమ్మకపోవటాలు పోవాలంటే ఇంకో రెండు తరాలు మారాలేమో.

అయినా అది సాధ్యం కాకపోవచ్చు.

సైన్సు మళ్ళీ ఆధ్యాత్మికం వైపు వెళుతూంది. బాగా చదువుకున్న వాళ్ళుకూడా 'మెటీరియలిజం'ని పూర్తిగా విశ్వసించటం లేదు. అణువుని న్యూట్రాన్‌గా విడగొట్టిన సైంటిస్టు, న్యూట్రాన్‌ని విడగొట్టలేక ఫిలాసఫర్ అవుతున్నాడు. ఇప్పుడు తెల్సుకున్న దానికన్నా మనిషికి తెలియనిది చాలా వుంది. బహుశా ఓ వంద సంవత్సరాలు పోయిన తరువాత జనం ప్రేతాత్మల సహాయంతో గాలిలో ఎగరటం నేర్చుకొని, పూర్వం ఇరవయ్యో శతాబ్దంలో కార్లూ, సైకిళ్ళూ వుండేవని ఎవరయినా చెబితే నమ్మని స్థితికి రావచ్చునేమో.

బాగా అడ్వాన్సయిన బ్రిటన్‌లోనే ప్రస్తుతం పదివేలమందికి పైగా క్షుద్రదేవతోపాసకులున్నారని తెలుస్తూంది. ఏ కోణం దగ్గర సైన్సు ఫిక్షన్‌తో విడిపోతుంది? మంత్రదండంతో హాంఫట్ అని ఎదుటి మనిషిని శిలావిగ్రహము చేస్తే నవ్వే జనం, అల్ట్రావాయిలేట్ రేస్ వున్న పిస్టల్‌తో జేమ్స్‌బాండ్ ఎదుటి మనిషిని 'పారలైజ్' చేస్తే 'ఓహో' అంటారు.

* * *

డిసెంబర్ ఏడు.....

ఆ రోజు ఇల్లంతా హడావుడిగా వుంది. వాళ్ళ ప్రయాణం ఆ రోజే.

శ్రీధర్‌కి చాలా ఉత్సాహంగా వుంది. అతనంతకు ముందోసారి సింగపూర్ వెళ్ళాడు. కానీ ఈసారి వెళుతున్నది యూరప్....! అదీగాక ఆర్నెల్లపాటూ కష్టపడి సాధించిన విజయాల ఫలితం అనుభవించటంలో వున్న ఆనందం కష్టపడిన వాళ్ళకే తెలుస్తుంది.

శారదక్కూడా భర్తతో కలిసి పెళ్ళయిన ఇంతకాలానికి సమస్యలకు దూరంగా వెళ్ళటం ఆనందంగానే వుంది. సమస్యలంటే పెద్ద సమస్యలేం కావు. మామూలుగా వుండేవే. ఏది ఏమయినా ఇంటి బయటికి వెళితే స్త్రీకి ఏదో బరువు తొలగించి నట్టుంటుంది. అది ఇంట్లో బరువు మోయటాన్ని సూచించదు.

అనిత కదేమీ పట్టలేదు. ఇంకో నాలుగు నెలలలో పరీక్షలు. ఆమె దృష్టి అంతా పరీక్షల మీదే వుంది. ఇంటిలో వున్నా, హాస్టల్లో వున్నా ఒక్కటే.

ఏడింటికల్లా సిద్ధమయ్యారు. ఫ్లైట్ పదకొండున్నరకి. అభ్రకదభ్ర, విద్యాపతి, నారాయణరావు జీప్‌లో, మిగతావాళ్ళు కారులో బయల్దేరారు. గుమ్మం దగ్గిర రామయ్య నిలబడి వున్నాడు.

"ఇల్లు జాగ్రత్త" అంది శారద అతడితో.

"ఫారిన్ వెళుతున్నా నీకీ తాపత్రయం పోవటంలేదా?"

"ఫారిన్ వెళితే మాత్రం తిరిగిరామా ఏమిటి?"

"ఆర్నెల్ల తర్వాత గదా" అంది అనిత.

శారద "ఆర్నెల్ల తరువాత అయినా అరగంటలో తిరిగొచ్చినా ఇల్లు ఇల్లేకదా?" అంది. ఆర్నెల్లకీ, అరగంటకీ ప్రాస సరిగ్గా సరిపోయింది.

కారు ఎయిర్‌పోర్టు దగ్గిర ఆగింది. శ్రీధర్ 'చెక్ ఇన్ స్లిప్' తీసుకోవటం కోసం వెళ్ళాడు. బ్యాగేజి కౌంటర్లో వెయ్యింగ్ చేయబడుతోంది. దూరంగా అభ్రకదభ్ర, విద్యాపతి నిలబడి మాట్లాడుకుంటున్నారు.

"బాగా చదువు" అంది శారద అనితతో.

అనిత నవ్వింది. "ఇప్పటికి పదిసార్లు చెప్పేవీ విషయం నిన్నట్నుంచీ".

శారద కూడా నవ్వి, "ఒక్క నీ విషయమే దిగులుగా వుంది...." అంది.

"అలాటివేమీ పెట్టుకోకు వదినా.....! నువ్వు తిరిగొచ్చే సమయానికి ఫస్ట్‌క్లాస్ డిగ్రీతో ఎదురుచూస్తూ వుంటాను చూడు".

శారద తమ్ముడివైపు తిరిగి "అప్పుడప్పుడు హాస్టల్‌కెళ్ళి చూస్తూ వుండు" అంది. నారాయణరావు తలూపాడు.

విడిపోవాల్సి వస్తున్న ఆఖరి క్షణంలో ఆమెకి దిగులుగా వుంది. అది కప్పిపుచ్చుకొని మాట్లాడుతూంది.

శ్రీధర్ వచ్చి భార్య తాలూకు చెక్ ఇన్ స్లిప్ ఇచ్చాడు. మొదటి అనౌన్స్‌మెంట్ వినిపించింది. శ్రీధర్ చెల్లెలితో "వారానికో ఉత్తరం వ్రాయి. మర్చిపోకు...." అన్నాడు.

యండమూరి వీరేంద్రనాథ్

తులసిదళం

"పెద్ద జవాబు వ్రాసేవాడిలా అడుగుతావేం?" అంది అనిత.

శ్రీధర్ నవ్వేడు. "నేను వ్రాయననుకో; వదిన వ్రాస్తుంది కదా" అని నారాయణరావుతో "రామయ్య వుంటాడు. ఇంకా ఏదయినా కావాలంటే బ్రాహ్మిణ్‌ని కలుసుకో" నారాయణరావు తలూపాడు. ఇన్ని మాటల మధ్య తులసి మౌనాన్ని ఎవరూ గుర్తించలేదు. విద్యాపతి స్వీట్స్ కొనుక్కొచ్చి పాపకిచ్చేడు. అందుకుంది.

"థాంక్స్ చెప్పలేదేం?" బ్రాహ్మిణ్ అడిగాడు. అంతలో సెకెండ్ అనౌన్స్‌మెంట్ వినిపించింది.

"ఈ బ్రీఫ్‌కేసొకటేనా?" అంది శారద.

"ఆఁ మిగతావి లగేజ్‌లో ఇచ్చేసాను" చెప్పాడు శ్రీధర్.

శారద చేతులు జోడించి "వెళ్ళొస్తామండీ" అంది.

విద్యాపతీ, బ్రాహ్మిణ్ నమస్కారాలు చేశారు. శారద అనిత వైపు తిరిగింది.

అనిత నవ్వుతూ తలూపింది.

బ్రాహ్మిణ్ శ్రీధర్‌కి షేక్‌హాండ్ ఇస్తూ "విష్‌యూ ఏ వండర్‌ఫుల్ పారిస్" అన్నాడు.

శ్రీధర్ నవ్వి విద్యాపతి వైపు తిరిగాడు.

గాజు అద్దాల్లోంచి విమానంవైపు బ్రీఫ్‌కేస్‌లు పట్టుకొని వెళుతున్న ప్రయాణీకులు చెదురుమదురుగా కనపడుతున్నారు.

అందరికీ దూరంగా నిలబడి మామూలు దుస్తులలో వున్న ఒక వ్యక్తి చాలా ఆతృతగా వాచీ చూసుకుంటున్నాడు. ఒక్కోక్షణం గడుస్తున్న కొద్దీ అతడి మొహంలో ఆందోళన, ఆతృత ఎక్కువ అవుతున్నాయి.

అబ్రకదబ్ర జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుంటున్నాడు. విద్యాపతి డైరీలో విమానాల రాకపోకల వివరాలు వ్రాసుకుంటున్నాడు.

అబ్రకదబ్ర విద్యాపతి వైపు తిరిగి "పోదామా?" అన్నాడు.

"నాతో వస్తావా?"

"కారు శ్రీధర్ ఇంట్లో వదిలేసి, నీతో జీప్‌లో వచ్చేస్తాను".

ఇద్దరూ వెనుదిరిగారు.

శారద 'చెక్ ఇన్'ని సమీపిస్తూంది.

క్యూలో శ్రీధర్ ముందున్న వ్యక్తి లోపలికి వెళ్ళిపోయేడు.

శ్రీధర్ చేతిలో బ్రీఫ్‌కేస్ క్రిందపెట్టి, కోటు జేబులోంచి కర్చీఫ్ తీసి మొహం తుడుచుకొన్నాడు. దాన్ని తిరిగి జేబులో పెట్టుకొంటూ పక్కకి చూసేడు. పదడుగుల

దూరంలో శారద లోపలికి వెళ్ళబోతూంది స్త్రీల ద్వారం నుంచి. వెనుకనున్న పాప మాత్రం అక్కడే నిలబడిపోయి వుంది. తులసి తనతో రావటం చూసుకోలేదేమో అని భార్యకి సైగ చేయబోయి ఏదో అనుమానం వచ్చినట్టు అలానే ఆగిపోయాడు.

పాప నిలబడిన భంగిమ చాలా విచిత్రంగా కనబడింది. భూమికి కాళ్ళు అతుక్కుపోయినట్టూ ముందుకు రావటానికి చేసే ప్రయత్నాన్ని నిరోధిస్తున్నట్టూ.

చాలా చిత్రంగా కనబడింది.

ఆమె ఏదో చెప్పబోతున్నట్టూ...... క్రింది దవడని ఎవరో నొక్కి పట్టినట్టూ...... మెడ దగ్గిర నరం ఉబ్బి గింజుకుంటున్న భావన.

అతడికో క్షణం ఏమీ అర్థంకాలేదు.

'కమిన్ ప్లీజ్' అంటున్నాడు డ్యూటీ ఇన్‌స్పెక్టర్.

ఈ లోపులోనే శారద వెనుతిరిగి, కూతురు తనతో రావటంలేదని గుర్తించి "రా అమ్మా" అంది.

తులసి కదల్లేదు.

శ్రీధర్ డ్యూటీ ఇన్‌స్పెక్టర్ వైపు తిరిగి "ఎక్స్‌క్యూజ్‌మి" అని కూతురివైపు నడిచేడు.

ఈ లోపులోనే శారద అక్కడికి చేరుకొని "అలా వున్నావేం?" అని పాప చెయ్యి పట్టుకొంది. ఆమె స్పర్శ తగలగానే అప్పటివరకూ నొక్కిపట్టుకొని వున్న అదృశ్య శక్తి ఏదో ఒక్కసారిగా వదిలినట్టూ– వదుల్తూ వదుల్తూ కసి తీర్చుకున్నట్టు అయింది.

తల్లి చెయ్యి ఒక్క విసురుతో విదిలించుకొని పాప గాలిలో బంతిలాగా డైవ్ చేసింది. నాల్గయిదడుగులు గాలిలో ఎగిరి వెల్లకిలా ముద్దలా క్రిందకి పడింది. దబ్‌మన్న చప్పుడు! వేళ్ళతో గచ్చుమీద మట్టిని గోకటానికి ప్రయత్నిస్తూ– మెలికలు తిరిగిపోతూ– భయంకరంగా, హృదయ విదారకంగా అరిచింది.

"అమ్‌మ్‌మ్‌మ్‌మ్‌మ్మా!"

ఏభై అడుగుల వెడల్పూ, రెండు వందల అడుగుల పొడవూ వున్న ఆ హాల్ మొత్తం ఆ శబ్దపు ప్రకంపనాలతో నిండిపోయింది. ఎక్కడి వాళ్ళక్కడ స్థాణువులయి నిలబడిపోయారు.

మారణహోమం ప్రారంభం అయింది.

అందరికన్నా ముందు తేరుకున్నది శ్రీధర్.

ఒక్క ఉదుటున అక్కడకు చేరుకొని, మోకాళ్ళమీద కూర్చొని "అమ్మా.....తులసి...పాపా" అన్నాడు. ఈ లోపులో బయటకెళ్ళబోతూన్న బ్రాహ్మిన్, విద్యాపతి పరుగెత్తుకుంటూ వచ్చేరు. శారద షాక్ తగిలినట్టు ఉన్నచోటునే నిలుచుండి పోయింది. ఆమెకి జరుగుతూన్నదంతా లీలగా తెలుస్తూంది. మెదడు మొద్దుబారిపోయినట్టు అనిపించింది. అందరూ గుమిగూడటం కనిపిస్తూంది, ఏవేవో మాటలు..... అంతా గందరగోళం.

అంతమంది, వాళ్ళ కాళ్ళ సందులలోంచి పాప శరీరం నిప్పులమీద పెట్టినట్టూ వంకర్లు తిరగటం కనిపిస్తూంది. తల అటూ ఇటూ విదిలిస్తూంది. శ్రీధర్ రెండు చేతులతోనూ ఆపటానికి ప్రయత్నిస్తున్నాడు. విద్యాపతి పాప నోరు బలవంతంగా తెరచి, చేతిలో డైరీ పళ్ళమధ్య కుక్కేడు- నాలుక తెగకుండా. బ్రాహ్మిన్ పాప కాళ్ళు కొట్టుకోకుండా వుండటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు.

అర నిమిషం తర్వాత వాళ్ళ ప్రయత్నం ఫలించింది.

తులసి కదలటం మానేసింది. బలంగా శ్వాసతీయటం మాత్రం తెలుస్తూంది. అక్కడివాళ్ళు గుంపులుగా చేరి ఈ విషయమే మాట్లాడుకో సాగేరు. ఎయిర్‌పోర్టు డాక్టర్ ఇంజెక్షన్ చేసి, శ్రీధర్‌తో 'ఫర్లే'దంటున్నాడు. అప్పుడు కదిలింది శారద. అంతసేపు పట్టిందామెకి షాక్ నుంచి తేరుకోవటానికి.

డ్యూటీ ఆఫీసర్ రూమ్‌లో సోఫాలో పడుకోబెట్టారు పాపని. పక్కనే కూర్చొని వుంది శారద. డాక్టర్ పాప పల్స్ చూసి "షి ఈజ్ ఓకే నౌ" అన్నాడు. శ్రీధర్ నిస్త్రాణగా పడుకున్న కూతురివైపు చూసి "ఇప్పుడు ఫ్లయిట్‌లో వెళ్ళటం మీరు అడ్వైజ్ చేస్తారా" అని అడిగేడు.

డాక్టర్ ఒక క్షణం తటపటాయించేడు. అతడేదో చెప్పబోయేటంతలో శారద అంది "ఇప్పుడొద్దండీ" అని.

శ్రీధర్‌కి కూడా అదే మంచిదేమో అనిపించింది. అతడి భావాన్ని గుర్తించినట్టు డాక్టర్ "నోనో రేపు వెళ్ళండి" అన్నాడు. "ఇప్పటికైతే ఏమీ ఫర్లేదు. షి విల్ బి ఆల్‌రైట్ ఇన్ అనదర్ టెన్ మినిట్స్".

టికెట్స్ మరుసటిరోజుకు మార్పించటం కోసం శ్రీధర్ బయటకొచ్చేడు. దూరంగా నిలబడి అప్పటివరకూ ఆతృతగా వాచీ చూసుకొంటున్న వ్యక్తి అక్కడ గుమ్మం దగ్గిర నిలబడి వున్నాడు.

శ్రీధర్ బైటకి రాగానే "ఎలా వుంది నాయనా?" అని అడిగేడు.

"ఫర్వాలేదు!"

"ఈ స్థితిలో పాపని విమానం ఎక్కిస్తారా?"

"లేదు. కాన్సిల్ చేసుకొంటున్నాం" అనేసి వడివడిగా అక్కడ నుంచి కదిలిపోయాడు శ్రీధర్. ఒక క్షణం నిలబడి వుంటే అలా అడిగిన వ్యక్తి మొహం ఆ సమాధానంతో విచ్చుకోవటం గమనించేవాడే.

శ్రీధర్ వెళ్ళగానే ఆ వ్యక్తి పబ్లిక్ బూత్‌లోకి నడిచేడు. శ్రీధర్ ఇంటికి ఫోన్ చేసేడు. అక్కడ ఫోన్ రిసీవ్ చేసుకున్నది సరస్వతి.

"శ్రీధర్ వాళ్ళు తిరిగి వచ్చేస్తున్నారు".

"ఎవరు మాట్లాడుతున్నది?" సరస్వతి అడిగేడు.

"నేనూ.... స్వామిని".

ఫోన్ డిస్‌కనెక్టయింది.

పాప పడిపోవటాన్ని, ఈ విచిత్ర ప్రవృత్తినీ మామూలుగా, నిర్లిప్తంగా చూచినవాడు స్వామితోపాటు ఇంకొకడున్నాడు.

అతడు..... నారాయణరావు.

* * *

ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు కారులో ఎవరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. తల్లి వళ్ళో తలపెట్టి పాప పడుకొంది.

ఈ నిశ్శబ్దాన్ని ఛేదించింది సరస్వతీచంద్ర ఛటోపాధ్యాయ. విషయము తెలుసుకొని విశాలంగా నవ్వేడు. "అంతేకదా" అన్నాడు. "ఏదో చూసి భయపడి వుంటుంది. అయినా శారదమ్మా! పాపని అంతగా అలంకరించకపోతే ఏమైందమ్మా- అసలే అందమైన పిల్ల! ఏ దిష్టో తగిలి వుంటుంది" సరస్వతి ఇలా మాట్లాడటం అందరికీ ధైర్యం కలిగించింది. నిజానికి ఆ పరిస్థితిలో ఆ మాత్రం సానుభూతి ఎంతో అవసరం, చాలుకూడా.

పాపకూడా కారులోంచి మామూలుగా తనంత తానే లేచి ఇంట్లోకి రావటం శ్రీధర్‌ని సంతృప్తి పరిచింది.

"ఏం పాపా! ఇప్పుడు బాగానే వుంది కదూ?" విద్యాపతి అడిగేడు.

"ఇప్పుడు నాకేమయింది?"

అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. శ్రీధర్ మాట మారుస్తూ "ప్రోగ్రాం ఈ రోజుకి కాన్సిల్ అయింది బేబీ! రేపు వెళుతున్నాము" అన్నాడు. "ఈజిట్ ఓ.కే?"

"ఓ.కే. పప్పా!"

ఈ సంభాషణ ఇక్కడ ఇలా జరుగుతున్న సమయంలో బిస్తా గ్రామంలో తన ఇంట్లో కాద్రా మొదటి వాయువుని విజయవంతంగా ప్రయోగించి రెండో రంగానికి సిద్ధమవుతున్నాడు.

కాష్మోరాలో పదహారు అంకాలు - ఐదు 'వాయువులు' వుంటాయి. ఈ కాష్మోరా అనేది 'క్షిత్'కి చెల్లెలవుతుందని అంటారు. ఒక్కొక్క రోజు ఒకో వాయువునీ, అంకాన్నీ ప్రయోగించి- ఇరవై ఒకటవ రోజు రాత్రి ఎదుటి మనిషిని దారుణంగా చంపటం దీని లక్షణం. 'క్షిత్' అనే క్షుద్రదేవతని వశపర్చుకొన్నవాళ్ళు దేశంలో ఎవరూ లేరు. అయితే 'కాష్మోరా' వరకూ సాధించినవాళ్ళు ఇంకా దేశంలో ఒకరిద్దరు వున్నారని బలమైన ఆధారాల వల్ల తెలుస్తూంది. రాత్రి చంద్రోదయంతో మొదలైన ఈ ప్రయోగము పన్నెండు గంటల అర్థరాత్రి వరకూ జరుగుతుంది. మంత్రగాడు ఆ ఇరవై ఒక్కరోజులూ నిద్రపోకూడదు, మధువు ముట్టకూడదు. మరణాన్ని చూడకూడదు, తన రక్తాన్ని చూడకూడదు.

9

ఆ రోజు సాయంత్రం శ్రీధర్ కూతుర్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళేడు. పరీక్షలు జరిపి ప్రమాదమేమీ లేదనీ, నిస్సందేహంగా మరుసటి రోజు ప్రయాణం కొనసాగించవచ్చునీ డాక్టర్ హామీ ఇచ్చేడు.

"ఎందుకలా హఠాత్తుగా కేకవేసి పడిపోయి వుంటుంది?" పాపని విజిటర్స్ రూమ్‌లో కూర్చోపెట్టి లోపల అడిగేడు.

"హిస్టీరియా" అన్నాడు డాక్టర్. "అయితే అది చాలా తాత్కాలికంగా- అంటే షాక్ తగిలిగానీ, ఏదయినా దారుణాన్ని చూసిగానీ..... కారణాలు ఏమయినా అయివుండవచ్చు. కానీ ఇప్పుడు ఆమెలో ఏ 'సింప్టమూ' లేదు బలహీనత తప్ప. ఈ బీకాంప్లెక్స్ టాబ్లెట్స్.... ఈ టానిక్ వాడండి చాలు".

"రేపే మా ప్రయాణం".

డాక్టర్ లేచి అతడి భుజం తడుతూ "ఏం ఫర్వాలేదు. బై ఆల్ మీన్స్ యూకెన్ గో" అన్నాడు.

ఇద్దరూ బయటకొచ్చారు. తులసి కుర్చీలోంచి లేచింది. డాక్టర్ పాప భుజం చుట్టూ చెయ్యివేసి "పారిస్ నుంచి నాకేం తెస్తావ్ పాపా?" అన్నాడు.

"స్టెతస్కోప్".

డాక్టర్ బిగ్గరగా నవ్వి "గుడ్" అన్నాడు.

శ్రీధర్ కూడా నవ్వి "గుడ్‌బై డాక్టర్" అన్నాడు.

"గుడ్‌బై శ్రీధర్."

పాప ఫ్రంట్ సీట్లో కూర్చుంది. శ్రీధర్ మనసు తేలికగా వుంది. ప్రొద్దుట్నించీ జరిగిన సంఘటనలతో వికలమైన మనసు బాగా సర్దుకుంది.

సాయంత్రపు చల్లగాలి మనసును సేదతీరుస్తుంది.

కారు నెమ్మదిగా నడుపుతున్నాడు. పక్కనే విశాలమయిన ప్లే గ్రౌండు దూరంగా వీధిలైట్లు అప్పుడే వేశారు.

"పప్పా.... యూ సీ హౌ నైస్" అంది ఉత్సాహంగా అటు చూపిస్తూ.

శ్రీధర్ తలతిప్పి చూశాడు.

విశాలమైన మైదానం. అందులో భూమీ ఆకాశం కలిసే చోటు నుంచి నిండు చంద్రుడు నెమ్మదిగా పైకి వస్తున్నాడు.

చంద్రోదయం

....

అక్కడ బిస్తాలో అది రెండవ రోజు అంకపు ప్రయోగానికి ముహూర్త సమయం.

* * *

వాళ్ళు ఇంటికి వచ్చేసరికి ఏడున్నరయింది.

డాక్టర్ మరుసటిరోజు ప్రయాణానికి వప్పుకొన్నాడని శ్రీధర్ చెప్పాడు. శారద ఇంకా ప్రొద్దున్న తాలూకు ప్రభావం నుంచి తేరుకోలేదు. విని వూరుకుంది. ఆమె కొంచెం మామూలుగా వుండగల్గుతోందీ అంటే కారణం సరస్వతే. 'ఏమీ ఫర్లేదని' చెబుతున్నాడు. అంతా తానొక్కడై మాట్లాడుతున్నాడు. అతని ప్రయత్నం ఫలించింది. మరుసటిరోజు ప్రయాణానికి ఆమె ఆయత్తమవసాగింది.

"ఇల్లంతా నిశ్శబ్దంగా వుందేం?" శ్రీధర్ అడిగాడు.

"మావయ్య లేడుగా."

అదీ నిజమేనన్నట్టూ తల పంకించాడు అతను. శారద కూతుర్ని దగ్గరికి తీసుకుంది. మామూలుగా వున్నప్పుడు తెలియదుగానీ, కొద్దిగా పాప నలత చెందితే ఆ ఇంటిల్లిపాదీ పొందే ఆరాటం చూస్తూంటే, తమ హృదయాలలో ఆ చిన్న పాప ఎంత బలమైన ముద్ర వేసిందో తెలుస్తూంది.

ఎనిమిది అవుతూ వుండగా భోజనాలు పూర్తి చేశారు. శ్రీధర్ చేతులు నాప్కిన్‌తో తుడుచుకుంటూ బయటకొస్తూంటే సరస్వతి లోపలికి వస్తూ కనబడ్డాడు. వెనుకే ఓ వ్యక్తి, ఇరవై అయిదు సంవత్సరాల వయసు. అంగుళంకన్నా పెరగని జుట్టు.

"నా కొడుకు నాయనా".

శ్రీధర్ అతడివైపు చూశాడు.

"ఈ ఆర్నెల్లూ నాతోపాటే వుంటాడనే తీసుకొచ్చాను" అంటూ పేరు చెప్పాడు.

"తల్లి. పైడితల్లి".

* * *

అదే రోజు......

రాత్రి పదయింది.

తలక్రింద చేతులు పెట్టుకుని పై కప్పుకేసి చూస్తున్నాడు శ్రీధర్.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" శారద అడిగింది.

అతడు తల తిప్పకుండానే "ఏమీలేదు" అన్నాడు.

"పొద్దుటి విషయం గురించేనా?"

అతడు మాట్లాడలేదు.

"డాక్టరేమన్నారు?"

అతను కొంచెంసేపు మౌనంగా వుండి "స్కిజోఫ్రేనియా కాకపోవచ్చు నన్నాడు. మే బీ హిస్టీరియా" అన్నాడు. "తల్లీ తండ్రీ తరపు వంశంలో ఎవరికయినా ఈ లక్షణాలున్నాయేమో అని అడిగాడు. నాకు తెలిసినంతవరకూ లేవు అన్నాను. ఏదయినా చిన్న షాక్...." చెప్పుకుపోతున్నాడు.

శారదకు ఆమె దూరపు చుట్టం జ్ఞాపకం వచ్చాడు. మతిభ్రమించి, ఆర్నెల్ల తర్వాత చచ్చిపోయాడతను. వంశం అంటే దగ్గిర వాళ్ళేగా. ఆ విషయం చెబుదామా అని మళ్ళీ ఆ ఆలోచనే విరమించుకుంది.

అతను అన్నాడు- "అయితే నిశ్చయంగా ఏమీ చెప్పలేదు.... ఇంకొంచెం కాలం చూద్దామన్నాడు".

"కానీ మనం రేపు....."

"అతడికా విషయం తెలుసు. చిన్న షాక్‌వల్ల ఇదంతా జరిగిందనీ, తులసి చాలా ఆరోగ్యంగా వుందని తనన్నాడు. మనం వెళ్ళటానికి ఏ అభ్యంతరమూ పెట్టలేదు".

చాలా చిన్న విషయం గురించి తను అనవసరంగా మనసు పాడు చేసుకొంటుందేమో అనుకొంది శారద.

"శ్రీ!"

"ఊఁ?"

"హిస్టీరియా అంటే?"

అతడు ఆమెమీద ఆప్యాయంగా చెయ్యివేసి "ఇక వాటి గురించి ఆలోచించకు- పడుకో" అన్నాడు. శారద మౌనం వహించింది. అరగంట తర్వాత అతడు తలతిప్పి చూస్తే ఆమె నిద్రపోతూ కనిపించింది. అతడూ కళ్ళు మూసుకొని నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

దూరంగా పన్నెండు కొడుతూ వుండగా అతడికి నిద్రపట్టింది.

మసక చీకట్లో పైడితల్లి ఒక్కో అడుగే వేసుకుంటూ మెట్లెక్కాడు. పార్టిషన్ వున్న బెడ్‌రూమ్ తలుపుని చిన్న వూచతో అవలీలగా తెరిచాడు. తలుపు చప్పుడవకుండా తెరిచి లోపలికి ప్రవేశించాడు.

బెడ్‌లైట్ కాంతిలో తులసి వైపు చూశాడు. ముడుచుకుని పక్కకి వత్తిగిలి పడుకుని వుంది.

అతడు పక్క దగ్గర తలుపువేసి నిలబడ్డాడు.

అతడి మొహంలో ఏ భావమూ లేదు.

ఏమీ తెలియని పాప అమాయకంగా నిద్రపోతూ వుంది.

అతడు తన ఎడమచేతి చూపుడువేలుని బొటనవేలుతో నొక్కి పెట్టాడు. కుడిచేతిలో చిన్న సూది వుంది. దాంతో ఆ వేలుని బలంగా గుచ్చాడు. లావా పొంగినట్లు రక్తం.

పాప నోటికి పైగా వేలుని వంచి పట్టుకున్నాడు.

రక్తం పాప నోట్లో ఒక్కో చుక్కా పడుతూంది.

ఒకటి.......

రెండు........

మూడు........

....

....

ఆ తర్వాత అతడు తలుపు వేసి క్రిందికి..... దట్టమైన చీకట్లోకి వెళ్ళిపోయాడు.

10

అందరు డాక్టర్లలా కాకుండా డాక్టర్ పార్థసారధికి తెల్లవారుఝామున అయిదింటికే లేవటం అలవాటు. ఈ రోజు కూడా అతను అలాగే లేచాడు. మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వచ్చేసరికి ఆరయింది. ఆ తర్వాత షేవ్ చేసుకుని స్నానం చేశాడు.

పార్థసారధికి ఫిలియాస్‌ఫాగ్‌లాగా అన్నీ టైం ప్రకారం చేయటం అలవాటు. అయితే అతడి దురదృష్టం కొద్దీ అతడు ఈ వృత్తిలోకి వచ్చాక ఈ టైం మెయిన్ టెయిన్ చేయటం అనేది యిబ్బందిగా మారింది. అర్జెంటుగా ప్రాణాల మీదకు తెచ్చుకునే పేషెంట్లు అతడి దినచర్యని కొద్దిగా అస్తవ్యస్తం చేస్తూ వుంటారు. అన్ని విషయాల్లోనూ అంత టంచనుగా టైం ప్రకారం నడిచే ఆ నలభై అయిదేళ్ళ డాక్టరు- రోగిని పరీక్ష చేస్తున్నప్పుడూ సేవ చేయవలసి వచ్చినప్పుడూ మాత్రం టైం చూసుకోడు.

ఆ క్రితం రోజు రాత్రి అతడు హాస్పిటల్ నుండి ఇంటికొచ్చేసరికి ఒంటిగంటయింది.

అప్పుడే పుట్టిన ఒక పాప రక్తాన్ని ట్రాన్స్‌ఫ్యూజ్ చేసి కొత్త రక్తాన్ని ఎక్కించటం ద్వారా బ్రతికించడానికి ప్రయత్నం చేసి, చివరిక్షణం వరకూ పోరాడి అలసిపోయాడు. పరస్పర విరుద్ధమయిన రక్త కణాలున్న భార్యాభర్తలకు పుట్టిన పాప, పుట్టటమే రోగంతో పుట్టింది.

ఎరిత్రోబ్లాస్టోసిస్..... పుట్టీ పుట్టగానే పాత రక్తాన్ని బయటకు తీసెయ్యాలి. ఉహూ.... అయినా లాభం లేకపోయింది.

ఎన్నో చావుల్ని చూసిన డాక్టర్ పార్థసారధి- ఆ కళ్ళు తెరవని పసిగుడ్డు యీ ప్రపంచంలోకి రావటానికి చేసిన పోరాటం చూసి కదిలిపోయాడు.

చివరకు ఆ పాప అలసిపోయి కన్నుమూసేటప్పుడు తదేకంగా, నిశ్చలంగా, మొహంలో ఏ భావమూ లేకుండా నిలబడ్డాడు. అంతా అయిపోయిందని తెలిసిన తర్వాత బయటకొచ్చి, అక్కడ ఆతృతగా చూస్తున్న తండ్రికీ విషయం చెప్పి ఇంటికి వచ్చేశాడు. ఆ రాత్రి చాలాసేపటివరకూ నిద్రపోలేదు.

మరుసటిరోజు ప్రొద్దున్నే అతడు డైరీలో వ్రాసుకొన్నాడు.

"- ట్రాష్! ఈ ఫిజియాలజి, ఈ మెడిసిన్, ఈ సర్జరీ.... అంతా ట్రాష్! వంద సంవత్సరాల క్రితం రక్తం అంతా ఒకటే పదార్థమని అనుకున్న మనిషి ఎంత అజ్ఞానంలో వున్నాడో, ఇప్పుడు రక్తంలో డెబ్బై ఆరు వెరైటీలున్నాయని తెలుసుకున్న మనిషి కూడా అంతే అజ్ఞానంలో వున్నాడు. తెలుసుకొని ఏం లాభం? పుట్టబోయే పాప ఎరిత్రోబ్లాస్టోసిస్‌తో పుడుతుందని తెలుసు. బ్రతికించడమే తెలీదు. మనిషి విజ్ఞానవంతుడు అవుతున్న కొద్దీ- అతడి ప్రాబ్లమ్స్ ఎక్కువ అవుతున్నాయా....? అసలు విజ్ఞానం అంటే ఏమిటి? ఆర్. హెచ్. పాజిటివ్, ఆర్. హెచ్. నెగిటివ్ లేనా...."

వ్రాయటం ఆపి కిటికీలోంచి బయటకు చూస్తూ ఆలోచించసాగాడు. మనీప్లాంట్ తీగె కిటికీకి వేలాడుతూంది. వర్షానికి తడిసిన చెక్క వాసన గాలిలో వ్యాపించి వుంది. అతడికి ఫైనల్ డయాగ్నొసిస్ జ్ఞాపకం వచ్చింది.

"ఓ చిన్ని పాపా.....! నువ్వు మా సాయం కోరేవు. కానీ మేం అసమర్థులమయ్యేం. ఈ ప్రపంచంలోకి రావటానికి నువ్వు అందించిన చేయిని మేము అందుకోలేకపోయేము. కానీ ఇంకొకసారి ప్రయత్నం చెయ్యి..... అప్పుడప్పుడు మేము యింతకన్నా బాగా మా కర్తవ్యం నిర్వహిస్తాము. ఈ ఒక్క ఓటమితో మమ్మల్ని అంచనా వెయ్యకు. మా యీ వైజ్ఞానిక ప్రపంచంలో వున్న అస్పష్టతనీ, అజ్ఞానాన్నీ మాత్రమే చూడకు. ఇక్కడ యింకా ఇతర విషయాలు కూడా వున్నాయి. మా ప్రపంచంలోకి రా! అవి కూడా చూడు. కొంచెం గాలి పీల్చు పాపా! పోరాటాన్ని ఆపకు. ఇదిగో! ఈ రెండు చేతుల సాయంతో కొద్దిగా గాలి పీల్చు. నీ చిన్ని గుండె మా యీ ప్రపంచపు గాలితో నిండనీ".

డాక్టర్ పార్థసారధి తల విదిలించాడు. డైరీ మూసి లోపల పెట్టేశాడు. తెరచిన అల్మైరానిండా డైరీలు.... ముప్ఫై ఏళ్ళ జీవితం! డాక్టర్‌గా అతడు మరణాల్ని చూసి చలించడు. కాని చిన్నపిల్లలంటే....

ముప్ఫై డైరీలు, అతడి ఓటమీ - విజయాలూ..... డైరీల నిండా అవే.

అందుకే పెళ్ళయిన అయిదు సంవత్సరాలకే భార్య వదిలేసింది.

అస్పష్టమైన అశాంతి. దాన్ని వదిలించుకోడానికి మళ్ళీ ప్రొఫెషన్! గతాన్ని మర్చిపోయే ప్రయత్నం, చిన్న చిన్న పాపలు.... చిన్న జ్ఞాపకాలు.

అతడి ఆలోచన్లని చెదరగొడుతూ ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి, "హలో" అన్నాడు.

"డాక్టర్ పార్థసారధీ?"

"స్పీకింగ్".

"డాక్టర్! నేను శ్రీధర్‌ని. తులసికేమీ బావోలేదు. మీరు అర్జెంటుగా రాగలరా?"

ఆ కంఠంలో కనబడుతున్న అతని ఆతృతని చప్పున గుర్తించాడు.

"ఏమయింది?" అడిగాడు. ప్రిలిమనరీస్ ఫోన్‌లో తెలుసుకోవడం మంచిది.

"పక్కమీద నుంచి లేవలేకపోతూంది. బాగా నీరసపడిపోయింది. అంతేకాదు డాక్టర్...." ఆగి వణుకుతున్న కంఠంతో అన్నాడతను-

"పాప.... కుడివైపు భాగం అంతా నీలంగా మారిపోయింది. కుడివైపు మొహం అంతా- కుడిచెయ్యి- కుడికాలు...."

"నేను వెంటనే వస్తున్నాను" అని ఫోన్ పెట్టేసి తొందర తొందరగా బట్టలు మార్చుకొని, తాళాలు తీసుకొని, ఒక్క అంగలో కారులో కూర్చొని స్టార్ట్ చేస్తూ అతను అనుకున్నాడు-

సైనోటిక్ అటాక్??

*   *   *

పార్థసారధి అక్కడికి చేరుకునేసరికి ఇంటిల్లిపాదీ అతడికోసం చూస్తున్నారు. శ్రీధర్ అతడిని తులసి వున్న గదిలోకి తీసుకెళ్ళాడు. అలికిడికి తలతిప్పి చూసింది.

పార్థసారధి స్థూలు దగ్గరికి లాక్కొని కూర్చొన్నాడు. చేతిని తీసుకొని పల్స్ చూశాడు. నార్మల్!

ఒక్కక్షణం ఆమెవైపు పరిశీలనగా చూశాడు. మొహం సగం నుంచీ నీలంగా మారిపోయి వుంది. కుడివైపుకి వెళుతున్న కొద్దీ బాగా నీలంగా.... అతడు ఆమె కుడిచేతిని తీసుకొని పరీక్షించాడు. గోళ్ళు నీలంగా వున్నాయి. నొక్కితే అరచేయి మామూలుకన్నా మెత్తగా వుంది. కుడికన్ను రెప్ప లోపలిభాగం కూడా ఎర్రగా లేదు. అతడు పాప ఎడమ కంటిని చేత్తో మూసి "ఇప్పుడు బాగా కనిపిస్తుందా?" అనడిగాడు.

లేదన్నట్టు తల వూపింది.

స్టెతస్కోప్‌తో పరీక్షించాడు.

ఎబ్‌నార్మల్ ఫస్సింగ్‌సౌండ్, స్స్‌స్స్‌స్‌....లబ్..... స్స్‌స్స్‌స్.....

అతడు చాలాసేపు పరీక్షిస్తూ వుండిపోయాడు. పరీక్షిస్తూ ఆలోచిస్తున్నాడు. బలహీనంగా కొట్టుకుంటున్న గుండె లబ్ డబ్ శబ్దాల మధ్య అతడి ఆలోచనలు సాగుతున్నాయి. పెరాలిసిస్ కాదు. ఏమిటిది? ఎటువైపు దారితీస్తుంది? పదిరోజుల క్రితం హుషారుగా గంతులు వేసిన పాప- ఇంత హఠాత్తుగా ఇలా ఎలా మారిపోయింది?

అతడు ఆలోచన్లతోనే బయటకొచ్చాడు. వెనుకే వస్తున్న శ్రీధర్ ఆందోళన నిండిన కంఠంతో ప్రశ్నించాడు. "ఏమిటిది డాక్టర్?"

ఆ ప్రశ్నకి జవాబు చెప్పకుండా, "ఎప్పుడు కనుక్కున్నారిది?" అనడిగాడు.

"ప్రొద్దున్నే లేపటానికి వెళ్ళినప్పుడు శారద చూసింది".

"నిన్నేం జరిగింది?"

ఎయిర్‌పోర్ట్‌లో జరిగినదంతా వివరించి చెప్పాడు. సాలోచనగా వింటూ వుండిపోయాడు డాక్టర్. ఒకటే అనుమానం- అది హిస్టీరియా అనుకుంటే దానికీ, సైనోటిక్ అటాక్‌కీ సంబంధం ఏమిటి?

అతడు ఆలోచనలనుండి తేరుకోకముందే శ్రీధర్ అన్నాడు-

"డాక్టర్...."

అతడు తలెత్తి చూశాడు. "పాపకి షాకింగ్ అటాక్ రాకముందు చెయ్యి పట్టుకున్నాను... ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆ చెయ్యి ఐస్‌కన్నా చల్లగా వుంది. ఇది మీకేమన్నా లాభిస్తుందా?"

రోగి లక్షణాలు డాక్టర్‌కి కొన్నే లాభిస్తాయి. కొన్ని మరింత అయోమయంలో పడేస్తాయి. అకస్మాత్తుగా శరీరం చల్లబడిపోవటం, పెరిఫ్రల్ ఫెయిల్యూర్- అయితే యిదీ షాక్ వల్లనా? రాబోయే రుగ్మతకి ముందు సూచనా??

"డాక్టర్!"

పార్థసారధి ఆగాడు.

"ఈ పరిస్థితులలో మా ప్రయాణం ఆపుచేసుకోవటం మంచిదేమో అనుకుంటున్నాను."

డాక్టర్ శ్రీధర్‌వైపు జాలిగా చూశాడు.

ఔను! ఈ ప్రయాణం ఆపుచేసుకోవాలి. ఎంతో కష్టపడి సాధించిన దాన్ని వదులుకోవాలి. డాక్టర్‌కి శ్రీధర్ కంపెనీ విషయాలు తెలుసు.... ఇంత మంచి ఛాన్సు మళ్ళీ రాకపోవచ్చు. కానీ ఈ పరిస్థితిలో పేషెంట్‌ని గాలిలో హయ్యర్ ఆల్టిట్యూడ్స్‌కి తీసుకెళ్ళటం ఏ మాత్రమూ మంచిది కాదు. ఆ విషయమే చెప్పాడు.

శ్రీధర్ మౌనంగా విన్నాడు. ముఖంలో నిరాశ ఏ మాత్రమూ బయటకు కనిపించకుండా అంతా చెప్పి అతనన్నాడు, "ఇంకా కొన్ని టెస్ట్‌లు చేస్తేగాని నేనేమీ నిర్ధారణగా చెప్పలేను. కానీ నా అనుమానం...." అతడు తేలిక భాషలో అర్థమయ్యేటట్లు చెప్పాడు. "ఊపిరితిత్తులకి గాలి తీసుకెళ్ళే నాళం అడ్డుపడుతోందని.... నా అనుమానం నిజమైతే...."

"నిజమైతే?"

"బ్రాంకోస్పాడమ్....."

....

వెళ్ళిపోయిన కారు దుమ్ము తెరలా శ్రీధర్ మొహాన్ని కప్పేసింది. అక్కడలాగే నిశ్చలంగా నిలబడిపోయాడు. పదేళ్ళ తమ చిన్నారి పాపకి బ్రాంకోస్పాడమ్! అతడికిదంతా కల కాదనీ, నిజమని నమ్మశక్యం కావటం లేదు. ఏం జరగబోతోంది.....? అతడికిప్పుడు ఫారిన్ ప్రయాణం మీద మనసు లేదు. పాప, తమ ఇంటి వెలుగు-

అతడు వెనుదిరిగాడు.

వాళ్ళ మాటలు వింటూ స్థంభాన్ని ఆనుకొని శారద నిలబడి వుంది. ఆమె మొహం తెల్లగా పాలిపోయింది. అతడు ఆమెని నిర్లిప్తంగా చూస్తూ అలాగే నిలబడి వున్నాడు. అన్నిటికన్నా ఘోరమయిన స్థితి...... నిర్లిప్తత.

* * *

జరుగుతున్న అన్యాయాన్ని సహించలేనన్నట్టూ ఆ రోజు ప్రకృతి విజృంభించింది. ప్రకృతితో తనకు సంబంధం లేనట్టూ ఆ క్షుద్రదేవతోపాసకుడు స్మశానం మధ్యలో కూర్చొని తన పని నెరవేరుస్తున్నాడు.

అది నాలుగో రోజు. ఇంకా పదిహేడు రోజుల ఉపాసన.

దక్షిణం దిక్కునుంచి గాలి మనిషిని తోస్తున్నట్టూ బలంగా వీస్తూవుంది. జల్లు తెరలు తెరలుగా పడుతూంది. ఆకాశం మేఘావృతమయివుంది. ఎక్కడో సముద్రంలో ఏర్పడిన వాయుగుండం ఇక్కడ తన ప్రభావాన్ని చూపిస్తూంది. భూమి బీటలు వారుతుందా అన్నట్టుగా ఉరుముతోంది. మెరిసినప్పుడల్లా విరిగిన చెట్లతోనూ, పడిపోయిన సమాధులతోనూ ఆ ప్రదేశం భయానకంగా వుంది.

చెట్టుకొమ్మలలో ఇరుక్కున్న పక్షి వర్షం ధాటికి ఆగలేక హృదయ విదారకంగా అరుస్తోంది. కీచురాళ్ళ చప్పుడు వికృతంగా వినబడుతోంది.

వీటిని దేన్నీ పట్టించుకోకుండా తన పని చేసుకుంటూ పోతున్నాడు కాద్రా. తను అనుకున్నది నెరవేర్చుకోవటం కోసం- తన అనుచరుణ్ని బలి తీసుకున్న వాళ్ళమీద దారుణంగా కసి తీర్చుకోవటం కోసం అతను ఆ పనిలో నిమగ్నమయి వున్నాడు.

చేతబడికి, కాష్మోరాకి పెద్ద తేడాలేదు. రెంటిలోనూ బొమ్మలని తయారుచేస్తారు. అయితే చేతబడిలో బొమ్మని స్మశానానికి వెళ్ళే దారిలో పాతిపెడతారు. కాష్మోరాలో రెండు బొమ్మల్లో ఒక బొమ్మని మంత్రగాడే హింసిస్తాడు.

ఇరవై ఒక్క రోజుల హింస ద్వారా మనిషి నరనరాల్లో వున్న సత్తువనంతా పీల్చి, మరణానికి గురిచేస్తాడు. చేతబడిలో ఆ అవకాశం కాష్మోరా కన్నా తక్కువ.

కాద్రా దగ్గర వున్న బొమ్మకి తులసి తల వెంట్రుక కట్టబడుంది. బొమ్మ కుడివైపున నీళ్ళలో తడిసి వుంది. ఎడమవైపు బట్టలతో కప్పబడి వుంది.

నాలుగు రోజులలో ఆ బొమ్మ చాలా భాగం శిథిలమయింది.

ఇంక పదిహేడు రోజులు.....

చేతబడి చేసేవాళ్ళకి దయాదాక్షిణ్యాలుండవు. తాము బొమ్మమీద చేస్తున్న ప్రతిచర్యా- అక్కడ మనిషిమీద ప్రభావం చూపిస్తుందని వాళ్ళకు తెలుసు. కానీ హింసించాలి. హింసించి హింసించి చంపాలి.

ఇక్కడ కాద్రా రెండు వేళ్ళతో బొమ్మ చెయ్యి వెనక్కి విరిస్తే, అక్కడ పక్కమీద తులసి బాధతో విలవిలలాడింది. 'అమ్మా....చెయ్యి' అంటూ హృదయవిదారకంగా అరిచింది. ఎంతటి శత్రువుకయినా ఈ చేతబడి తాలూకు బాధ రాకూడదని మన

ఇళ్ళల్లో ముసలివాళ్ళు కోరుకుంటూ వుంటారు ఇందుకే. అది మాత్రం అక్షరాలా నిజం. సంవత్సరాల తరబడి కాళ్ళు చచ్చుబడినవాళ్ళు, వెన్నెముక నుంచి ఎన్నిసార్లు నీరు తీసినా బాగుపడనివాళ్ళూ, చెవులు వినపడనివాళ్ళూ, ఒంటికన్ను నుంచి నీళ్ళు ఎడతెరిపి లేకుండా కారుతున్న వాళ్ళు, పగవాడిక్కూడా ఈ బాధ రాకూడదు....

భూమాతని గాలిదేవుడు హింసిస్తూనే వున్నాడు. ఆకాశం బ్రద్దలవుతున్నట్టూ ఉరుముల చప్పుడు. గాలి విసురుగా వీస్తూ వుంది. పన్నెండయింది. ఆ రోజు అంకం పూర్తిచేసి లేచాడు కాద్రా. ఆ తుఫాను రాత్రీ- ఆ స్మశానమూ అతడికి భయం కల్గించటంలేదు. అతడే భయానకంగా వున్నాడు.

తనతోపాటు తీసుకొచ్చిన వస్తువులు- చీపురు, పులి ఎముక, పాప బొమ్మ ఒక గుడ్డలో కట్టుకొని వెనుదిరిగాడు. కాలిబాటలోంచి నీళ్ళు ప్రవహిస్తున్నాయి. దూరంగా నక్క ఊళ బెడుతోంది. వర్షం అయితే ఆగింది కానీ, ఆకాశాన్నంతా కప్పేసినట్టు నల్లటి మేఘం.

అతడు నడుస్తూ వుండగా కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరిసింది, పెద్ద చప్పుడు. కాద్రా ఒక్క గెంతులో పక్కకి దూకాడు. పక్కనున్న నిలువెత్తు చెట్టు నల్లగా మాడి మసయిపోయింది పిడుగుపడి.

గోతిలో పడ్డ కాద్రా కొంచెంసేపు అలానే వుండిపోయాడు. మెరిసిన మెరుపు వెలుగులో చెట్టు దగ్ధమవటం కనిపించింది. పడినప్పుడు రాయి భుజంలో లోతుగా గుచ్చుకొంది. తడి తగిలింది. దాన్ని రెండో చేతితో నొక్కిపట్టాడు. కళ్ళు గట్టిగా మూసుకొన్నాడు. అతికష్టంమీద గోతిలోంచి లేచి, కాలిబాటమీదికి వచ్చాడు. క్షణంలో వెయ్యోవంతు కన్ను తెరిచి, వెంటనే మూసుకొని తడుముకుంటూ నడవసాగాడు. రెండు ఫర్లాంగులు నడవటానికి దాదాపు గంటన్నర పట్టింది.

గ్రామంలోకి ప్రవేశించకుండానే- ఊరికి చివరగా ఉన్న ఒక పాక ముందు ఆగాడు. "విపూదా!" అని పిలిచాడు. రెండు నిమిషాల తరువాత తలుపు చప్పుడయ్యింది.

"ఎవరదీ?"

"కాద్రా....!"

తలుపు తీసిన చప్పుడు. వణుకుతూ ఒక ముసలివాడు బయటికి వచ్చాడు. కంటికి చెయ్యి అడ్డు పెట్టుకొని "ఎవరూ? కాద్రా!" అన్నాడు. చలికి అతడి కంఠం వణికింది.

"ఆఁ! నేనే" ఒంటిచేత్తో తడుముకుంటూ అతడు లోపలికి ప్రవేశించాడు. చిన్న దీపపు కాంతి అతడి భుజంమీద ఎర్రగా విశ్లేషించింది. అది చూసి వృద్ధుడు కంగారుపడి "అమ్మో! రక్తం" అన్నాడు.

కాద్రా మొహం చిట్లించి విసుగ్గా "తెలుసు" అన్నాడు. "అంతా తుడువు, పెద్ద గాయం కాదులే" అంటూ భుజంమీద చెయ్యి తొలగించాడు.

ముసలివాడు దీపాన్ని అతడి గాయం దగ్గిరగా పెట్టి పరీక్షించి.... "నిజమే పెద్ద గాయం కాదు" అంటూ గుడ్డని నీటితో తడిపి రక్తాన్ని తుడిచాడు.

అయిదు నిమిషాల తరువాత కాద్రా అడిగాడు "పూర్తిగాపోయిందా?"

"పోయింది!"

"ఆ గుడ్డనీ- ఇదిగో దీన్ని తగలబెట్టు."

వృద్ధుడు అప్పుడు చూశాడు కాద్రా కళ్ళు మూసుకొని వుండటాన్ని. మారుమాట్లాడకుండా రక్తంతో తడిసిన గుడ్డల్ని పోగుచేసి నిప్పుపెట్టాడు. భగ్గున మంట.

"చేతబడా?"

"ఉహూఁ - కాదు".

"మరి?" ఆశ్చర్యంతో అడిగాడు.

కాద్రా క్షణం మౌనంగా వుండి నెమ్మదిగా అన్నాడు-

"కాష్మోరా!"

దీపపు మసక వెలుతురులో వృద్ధుడు ఉలిక్కిపడటం అస్పష్టంగా కనిపించింది.

ఎన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఆ పేరు వింటున్నాడు! దాన్ని ప్రయోగించగలిగే ఒకే మనిషి నోటినుంచి.....

అతడి ఆలోచనలని తెగ్గొడుతూ కాద్రా అడిగాడు....."కాలిపోయిందా?"

"కాలింది!"

"ఎక్కడా చుక్క కూడా లేదుగా?"

"లేదు కాద్రా! నువ్వు కళ్ళు తెరవొచ్చు".

కాద్రా కళ్ళు విప్పాడు.

"ఇంకా ఎన్ని రోజులు?"

"పదహారు!"

"ఎవరు?"

చెప్పటాని కిష్టంలేనట్టుగా పక్కకి తిరిగి "వెళ్ళొస్తాను" అన్నాడు. అది గ్రహించి వృద్ధుడు మరి ప్రశ్నించకుండా "మంచిది" అన్నాడు.

బయట సన్నగా తుప్పర పడుతూంది. కాద్రా తలుపు తెరుచుకొని, చీకట్లోకి కలిసిపోయాడు.

ముసలివాడు అటే చీకట్లోకి చూస్తూ తనలో తాను అనుకున్నాడు-

కాద్రాకి నిశ్చయంగా అద్భుత శక్తులున్నాయి. ఈ ఇరవై ఒక్క రోజులు తన రక్తం అతడు చూడకూడదు. అయినా ఇంత రాత్రివేళ కళ్ళు మూసుకుని స్మశానం నుంచి తన ఇంటికి వచ్చాడంటే.....

అతనికి నిశ్చయంగా అద్భుత శక్తులున్నాయి.

* * * *

గుమ్మం దగ్గర నిలబడి "సిన్నమ్మా! లోపలికి రావచ్చా?" అని అడిగాడు పైడితల్లి. చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి "రా. కానీ ఆ చుట్ట పడేసి రా" అంది అనిత.

"అమ్మమ్మ, ఆ మాట మాత్రం అనకు. పైడితల్లికి సుట్టం యీ సుట్టే" అంటూ లోపలికి వచ్చాడు. నీట్‌గా వున్న ఆ రూమ్‌లో వస్తువుల కేసి పరికించి చూశాడు.

"ఈ ఏడుతో నీ సదువు అయిపోతుంది కదూ?"

నవ్వి తలూపింది.

"సదువైనాక ఏం సేత్తావ్ సిన్నమ్మా?"

తనకే తెలీదు ఏం చెబుతుంది? తలదిండు వళ్ళోకి తీసుకొంటూ "ఏం చెయ్యమంటావ్ నువ్వు చెప్పు" అంది నవ్వుతూ.

"యూ ఆరె గ్రాడ్యుయేట్. గ్రాడ్యువల్‌గా పిల్లల్ని కను సిన్నమ్మా".

ప్రాంతీయంలో ఇంగ్లీషు కలిపి మాట్లాడటంలో వుండే ఆ కొత్తదనాన్ని ఆమె ఇంకా జీర్ణించుకోలేదు. తన కాలేజీలో యీ ప్రయోగాన్ని చేసి స్నేహితురాళ్ళని థ్రిల్‌లో ముంచింది. కానీ ఎంత చేసినా పైడితల్లి మాట్లాడుతూ వుంటే వచ్చే క్యాజువల్‌నెస్ రాదు.

"నువ్వేం చదువుకున్నావ్?"

పైడితల్లి నవ్వి వూరుకున్నాడు.

"ఈ రెండూ కలిపి మాట్లాడటం ఎన్నాళ్ళు ప్రాక్టీసు చేశావు?"

....

"చెప్పన్నయ్యా?"

పైడితల్లి జాగ్రత్తగా లేచి వెళ్ళి చుట్టను కిటికీలోంచి బయటికి విసిరేసి వచ్చి కూర్చున్నాడు. "అన్నీ అనుకోగానే రావు సిన్నమ్మా. ముందు మనం ఏం సేద్దామనుకొన్నామో అది ఆలోసించి పెట్టుకోవాల. దెన్ ప్లాన్ ఇట్. ఒకసారి గానీ ప్లానేసుకొంటే నెమ్మదిగా దాన్ని సాధించేందుకు తొందరపడకుండా పనిచేసుకుంటూ పోవాల".

గెడ్డం క్రింద చెయ్యి పెట్టుకొని వింటున్న అనిత కొద్దిగా కదిలి "ఇన్ని విషయాలు తెలుసుకదా నీకు! ఏం చదువుకున్నావ్ నువ్వు?"

మళ్ళీ అదే నవ్వు. "విషయం తెల్సుకోటానికీ, సదువుకోటాన్నికీ సంబంధం లేదు సిన్నమ్మా. నేనేం సదువుకోలేదు. అయినా నాకు తెలియని ఫీల్డు లేదు. మెడిసన్ నుండి థామస్ ఆల్వా ఎడిసన్ వరకూ...."

అనితకి అతడొక అద్భుతమైన వ్యక్తిలా కనపడ్డాడు.

"నీకు మెడిసన్ తెలుసా?"

"పైడితల్లి ఆడితప్పుడు".

"అయితే మా తులసికి ఏమయిందో చెప్పు చూద్దాం. ఎలా తగ్గుతుందో..... ఏమిటో....."

అతడో క్షణం ఆలోచించి ఆమెవైపు చూశాడు. ఆతృతగా తన వైపు చూస్తున్న ఆ పెద్ద పెద్ద కళ్ళకేసి..... వంపు తిరిగిన గెడ్డం కేసి.... రాక్‌లో అమర్చిన పుస్తకాల కేసి..... అమాయకంగా వూగే కిటికీ తెరకేసి- జాలిగా కొట్టుకునే గడియారం కేసి.

"చెప్పగలవా?"

ఇంకొంచెంసేపు నిశ్శబ్దం. "చెప్పగలను."

"ఏమిటీ?"

పైడితల్లి అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేరని నిశ్చయించుకొని చిన్న కంఠంతో అన్నాడు. "నీ దగ్గర నాకు అబద్ధం సెప్పటం ఇష్టంలేదు సిన్నమ్మా. నాకు నిశ్చయంగా తెలుసు, పాపకి....."

"ఊc..... పాపకి?"

అతడు నెమ్మదిగా అన్నాడు "సేతబడి సేశారు".

బయటనుంచి చాటుగా వీళ్ళ సంభాషణ వింటున్న సరస్వతి ఉలిక్కిపడ్డాడు. పైడితల్లి.... తమవాడను కున్నవాడు.... సరస్వతికేం చేయాలో తోచలేదు.

తమవాడనుకున్న పైడితల్లి అటు తిరిగిపోయి రహస్యం చెప్పేశాడా? ఇప్పుడేం చేయాలి? స్వామి కూడా లేడు.

అనిత ఉలిక్కిపడి "చేతబడా?" అంది.

"మామూలు సేతబడి కాదు కాష్మోరా. క్షుద్రదేవత లందరిలోకీ క్షుద్రమయిన దేవత. అది ప్రయోగిస్తే తిరుగులేదు, మరణమే".

అనిత మొహం తెల్లగా పాలిపోయింది. లోపల్నుంచి దుఃఖం ముంచుకొచ్చింది. దాన్ని బలవంతం మీద అదిమిపట్టి "ఎలా..... ఇప్పుడెలా?" అంది.

"మీకు తెలీదు సిన్నమ్మా! పల్లెటూర్లో పుట్టి పెరిగినోణ్ని. ఈ సేతబడులూ, తంత్రాలూ నాకు బాగా తెలుసు. పాప మొదటిరోజు భయపడి పోయింది. రెండోరోజు నీలంగా మారింది. ఇదంతా సేతబడి ప్రభావమే.

ఇంక పదారురోజులు అంతే....."

"అన్నయ్యా" అన్నది అనిత వణుకుతున్న కంఠంతో. "దీన్ని..... దీన్ని... మనం ఆపుచెయ్యలేమా?"

"ఇదంతా నీకు సెప్పకూడదు సెల్లమ్మా! కానీ నిన్ను చూస్తే అబద్ధం సెప్పాలనిపించలేదు అందుకే సెప్పాను ఇదంతా. ఎల్లు సిన్నమ్మా! ఎల్లి మీ అన్నయ్యకి సెప్పు. భూతవైద్యుణ్ణి పిలిపించమను. ఇంకెన్నో రోజులు లేవు. తొందరపడాలి".

ఆమె లేచింది. అన్నయ్యని హెచ్చరించటానికి బయటకు రాబోయింది....

బయట సరస్వతి వేచివున్నాడు. ఆమె రాగానే కొట్టాలి. ఒకటే దెబ్బ-కిక్కురుమనకుండా...... తరువాత ఆ నమ్మకద్రోహి పైడితల్లి పని పట్టాలి. అతడు సిద్ధంగా వున్నాడు.

ఈలోపులో లేచిన అనిత నిరాశగా కూర్చొంటూ "అన్నయ్య నమ్మడు" అంది.

పైడితల్లి అర్థంకానట్టు చూశాడు.

"అన్నయ్యకి వీటిమీద నమ్మకం లేదు. మనం చెప్పినా నమ్మడు".

"అయితే మనమే పరిష్కారం ఆలోచించాలి" సాలోచనగా అన్నాడతను. "ఇంక నువ్వు దీన్ని గురించి ఆలోచించకు సిన్నమ్మా! అన్నీ నేను చూసు కొంటాను" అంటూ లేచాడు.

"ఎలా చూస్తావు?"

"ఫకీర్లుంటారు, బైరాగులుంటారు. వాళ్ళలో ఎవరో నిజంగా మహిమలున్న వాళ్ళుంటారు. అతన్ని పట్టుకోవాల. ప్రతీ విషానికి విరుగుడుంటుంది సిన్నమ్మా

దాన్ని పట్టుకోవాల. అంతే!" అని అతడు నెమ్మదిగా బయటికొచ్చాడు. ఆమె గదిలో పక్కమీద రక్తం ఇంకిపోయిన మొహంతో కూర్చొని వుంది. అడుగు బయటపెట్టిన పైడితల్లి అక్కడ నిలబడి తనని దహించేలా చూస్తున్న సరస్వతిని చూస్తున్నాడు. నెమ్మదిగా అతడి పెదవులు నవ్వుతో విచ్చుకొన్నాయి. సరస్వతి స్థాణువయ్యాడు.

తనని చూడగానే అతడు భయపడతాడనుకొన్నాడు. భయంతో అడుగు వెనక్కి వేస్తాడనుకొన్నాడు. చేసిన మోసం తెలిసిపోయినందుకు, పట్టుబడి పోయినందుకూ బెదిరిపోతాడనుకొన్నాడు. నవ్వుతాడనుకోలేదు.

11

ఆ ఇంట్లో విషాద చాయలు దట్టంగా అలుముకొని వున్నాయి. అప్పటికి ఏడో రోజు. పాప శరీరం నీలంగా మారటం మరింత ఎక్కువైంది. డాక్టర్ పార్థసారధి బ్రాంకోస్కోప్‌తో పరీక్ష చేశాడు.

మామూలు విషయాలకు చలించని శ్రీధర్‌కి కూడా ఆ పరీక్ష చూస్తుంటే కళ్ళనీళ్ళు తిరిగినాయి. బల్ల అంచున పాపని పడుకోబెట్టి, తల క్రిందకు వ్రేలాడేశారు. నోరూ, మెడ, రొమ్ము ఒకే సరళరేఖలో వుండేటట్టు అమర్చి ఒక స్టీల్ ట్యూబ్ పొడుగ్గా గొట్టంలా వుంది. ఆమె నోటినుండి, గొంతు ద్వారా అతికష్టంమీద లోపలికి తోశారు. బ్రాంకోస్కోప్‌లో ఎయిర్ ట్యూబ్‌ని పరీక్ష చేసి వాటిలో ఏ దోషమూ లేదని డాక్టర్లు నిర్ణయించారు.

దోషం ఎందులోనూ లేదుకానీ పాప శుష్కించిపోతుంది. ఈ చివర నాలుగు రోజులలోనూ మరీ. తలలో గోక్కుంటే జుట్టు పాయలు పాయలుగా వూడిపోతూంది. పళ్ళ చిగుళ్ళలో నుంచి రక్తం వస్తూంది. ఒకదానికి కారణం "విటమిన్ సి" లోపం అయితే, రెండోదానికి ఎలపేషియా ఏరియేటా.

ప్రతి దోషానికీ ఏదో ఒక రోగ కారణం కనబడుతూంది. అన్నిటికీ వెనుక మూలకారణం ఏమిటో డాక్టర్ సారధికి తెలియటం లేదు. ముందు బ్రాంకోస్పాడమ్ అనుకొన్నాడు కానీ అతడు అభిప్రాయం మార్చుకొన్నాడు. 'పెరిఫ్రల్ ఫెయిల్యూర్' ఏమో అన్న అనుమానాన్ని ధృవీకరించే విషయం శ్రీధర్ చెప్పాడు. పాప కళ్ళు మండుతున్నాయని ఏడుస్తూంది. చాలాసేపు బుజ్జగిస్తే మిగతా విషయాలు చెప్పింది. చెవులు కూడా సరిగ్గా వినిపించటం లేదు. కానీ పాలు పితికినప్పుడు ధార

చెంబులో పడిన శబ్దం, అగ్గిపుల్ల గీచిన శబ్దం, బ్లేడు పడిన చప్పుడు, ఊరపిచ్చుకల కిచకిచలు వినిపిస్తూంది. మనుష్యుల స్వరం మాత్రం బిగ్గరగా మాట్లాడితే గానీ వినిపించటం లేదు. పూర్తిగా వినిపించదని కాదు. స్పష్టంగా అర్థం కాదు. బ్యాటరీ అయిపోయేముందు ట్రాన్సిస్టర్ ప్రసారంలో గందరగోళంలా వుంటుంది.

పెరిఫ్రల్ ఫెయిల్యూర్?

....

....

రామయ్య చెప్పిందంతా ఇస్మాయిల్ విన్నాడు. చాలాసేపు మౌనంగా వున్నాడు. రామయ్య అతడివైపే ఆతృతగా చూడసాగాడు. "ఇది చేతబడి కాదు" అన్నాడు ఇస్మాయిల్. "చేతబడి చేస్తే ఆ లక్షణాలను చెప్పెయ్యవచ్చు. ఆ వ్యక్తికి బలహీనత ముఖ్య లక్షణం అయివుంటుంది. రోజురోజుకీ శరీరం కృశించిపోవటము మొదలుపెడుతుంది. కాళ్ళు నేలమీద పెట్టలేనంత బలహీనత మొదలవుతుంది. చేతబడిలో మనిషి ఒక అవయవం ముందు శిథిలమవటం ప్రారంభమవుతుంది. అది కాలు అయినా కావొచ్చు, గుండె అయినా కావొచ్చు. ఆ మనిషి తరువాత తరువాత పడే బాధలన్నీ ఆ అంగం కృశించిపోవటంవల్ల వచ్చినవే అయివుంటాయి. రోజులు గడిచేకొద్దీ దాని ప్రభావం మిగతా శరీరం మీద వుంటుంది. అంతేకాక చేతబడి చేయబడినవారు "తీసుకొని తీసుకొని" చస్తారు. ఏడురోజుల్లోనే ఇన్ని విపరీతాలు కనబడినాయంటే అది నిశ్చయంగా చేతబడి కాదు" ఇస్మాయిల్ ఆగి అన్నాడు. "అదీగాక పాపకి ఇంతకుముందు జరిగిన చేతబడికి విరుగుడు చేశాం. నిశ్చయంగా చేతబడి చేసినవాడో- చేయించినవాడో చచ్చిపోయి వుంటాడు. ఇంత జరిగాక మళ్ళీ వాళ్ళు ప్రయత్నిస్తారనుకోను".

రామయ్య ఈ మాటలకి నిరాశ చెందాడు. నాలుగు రోజుల నుండీ వేధిస్తున్న అనుమానం నిజమవ్వాలని అతడు కోరుకున్నాడు. అదే నిజమైతే, తిరుగుబడి చేయించి పాపని రక్షించుకోవచ్చు. కానీ ఇస్మాయిల్ నిశ్చయంగా అది చేతబడి కాదని చెబుతున్నాడు.

"ఇంకోసారి చూడు బాబూ!"

ఇస్మాయిల్ మాట్లాడలేదు. రామయ్యే అన్నాడు, "మా ఇంట్లో సరస్వతి అని ఒకదున్నాడు".

"అవును, చెప్పావు. అతడేగా పాప వెంట్రుకలు తీసికొన్నది".

రామయ్య తలూపాడు.

"అతను బాగానే వున్నాడా?"

"ఉన్నాడు".

"అయితే చేసినవాడు చచ్చిపోయి వుంటాడు".

"ఈ సరస్వతి ఇంకెవరితోనైనా చేయించి వుండొచ్చుగా?"

ఇస్మాయిల్ తన మొదటి మాట మీదే నిలబడ్డాడు. రామయ్య నిరాశతో లేచి "వెళ్ళొస్తాను" అన్నాడు. ఇస్మాయిల్ తలూపాడు. రామయ్య వెళ్ళిపోతూంటే అటే చూస్తూ నిలబడ్డాడు. "కాదు, నిశ్చయంగా అది చేతబడి కాదు" అనుకొన్నాడు. "అందులో అనుమానం లేదు".

* * *

రాష్ట్రంలోకెల్లా పెద్దదైన ఆ లైబ్రరీ విశాలమైన గదులలో ఒక మూల కొన్ని సంవత్సరాల నుంచి ఎవరూ చూడని ఒక పుస్తకం వుంది. ఒక సాలెపురుగు దాని వెనుక శాశ్వత నివాసమేర్పర్చుకొంది. సంవత్సరానికొకసారి రిజిష్టర్ పుస్తకంలో వ్రాయటానికి తప్ప ఇంకెందుకు ఆ పుస్తకాన్ని తియ్యరెవరూ.

ఆ పుస్తకం పేరు "తంత్ర".

ఆ పుస్తకపు పదహారో ప్రకరణంలో ఇలా వుంది. " 'కాష్మోరా' అనే విద్యని అభ్యసించినవాళ్ళు క్షుద్రదేవతలలో కెల్లా గొప్పవాడైన దేవతని సాధించినట్లే. అయితే దాన్ని సాధించడానికి అష్టానందాలు (బ్రహ్మానందం, ఆత్మానందం, అద్వైతానందం మొదలయినవి) వదిలిపెట్టాలి. అష్టార్ఘ్యములు (పెరుగు, తేనె.....) విసర్జించాలి. నవవిధ స్థాయి భావాలకి అతీతుడై వుండాలి. (శోకము, ఆశ్చర్యము, నవ్వు, భయము..... మొ॥) ఇవన్నీ దాదాపు అసాధ్యం కాబట్టే "కాష్మోరా" అనే విద్య దూరమైంది. కానీ వెయ్యి సంవత్సరాల క్రితం ఈ విద్యని..."

అదే పుస్తకపు చివరి ప్రకరణంలో వివిధ తంత్రాల ఫలితాలు వివరించబడ్డాయి. "కాష్మోరా" అనే పదం ఎదురుగా దాని ప్రభావ ఫలితాలు ఇలా వివరించబడ్డాయి.

ఇరవై ఒక్క రోజులలో మనిషిని "నిశ్చయంగా" చంపే కాష్మోరా ఒకోరోజు ఒకో రకంగా మనిషిని బాధపెడుతుంది. మొదటి రోజు వాతజము, రెండో రోజు శ్లేష్మజము....

దంతోద్భేదము, దంతశబ్దము, అహిపూతనము.

ఆరో రోజు అకాలవంతము.

ముఖపాకం, ఉదరోద్భావం, ఉపశీర్షికము, విచ్ఛిన్నము, పగర్భికము, శయ్యామూత్రం, కుకూనకం, రోదనం, అజగల్లి, ముఖస్రావం, గుదపాకం, పార్శ్వారుణం, తాలుకంఠం....

ఇరవయ్యో రోజు పీడనం (కోమా)

ఇరవయ్యొకటో రోజు మరణం.

ఆ వేళకి అది ఎనిమిదో రోజు. అంటే ఉదరోద్భాదనం.

* * *

పాప గొంతులో దిగుతూన్న బేరియం ద్రవాన్ని ఫ్లోరోస్కోప్‌లో చూస్తున్నాడు డాక్టర్ పార్థసారధి.

దాదాపు రెండు గంటల క్రితం వచ్చింది స్ట్రోకు. కడుపునొప్పి మెలికలు తిరిగిపోసాగింది. తెరలు తెరలుగా వస్తూన్న నొప్పికి కడుపు పట్టుకొని, పక్కమీద నుంచి కిందపడి, నేలమీద గదిలో దొర్లకుండా, శ్రీధర్ పాపని నొక్కిపట్టి వుంచాడు.

దేనికీ చలించని నారాయణరావు కూడా– ఈ దృశ్యాన్ని చూసి కళ్ళనీళ్ళు తిరిగాయి. "భగవంతుడా! పరాయివాళ్ళకి కూడా వద్దురా ఈ బాధ" అని ప్రార్థించాడు. ఆ చిన్న పాప లేత శరీరం, ఈ ఉధృతమైన బాధను తట్టుకోలేక మెలికలు తిరగసాగింది. అరవటానికి కూడా శక్తిలేనంత నీరసంతో వుండటమువల్ల గొంతులోంచి చిన్న శబ్దాలు మాత్రమే వస్తున్నాయి. అవి అక్కడి వాళ్ళందరి గుండెల్ని రంపపుకోత కోస్తున్నాయి.

"అమ్మా-అమ్మా" అని రోదిస్తూ దిండుమీద తల అటూ యిటూ కొట్టుకోసాగింది. కడుపులో శూలంతో గుచ్చినట్టు నొప్పి. చేత్తో పేగుల్ని మెలితిప్పినట్టు బాధ.

శారద పైటచెంగు నోట్లో కుక్కుకొని ఏడుపును ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ "ఫరవాలేదమ్మా, తగ్గిపోతుంది" అంటూ కూతుర్ని అనునయించసాగింది. అనిత ఇది చూడలేక గది బైటనే నిలబడి ఏడుస్తూంది.

* * *

మనిషి అస్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నట్టు వుంది. హాస్పిటలు ఎత్తయిన భవంతి. అంగాంగాన్ని పరీక్షించే డిపార్ట్‌మెంట్‌లు, న్యూరోలజీ, లోపెడిట్రిక్స్, సైకియాట్రీ.... గైనకాలజీ, యూరోలజీ, ఇంకోపక్క నర్సుల క్వార్టర్లు, ఆఫీసు అకౌంటింగ్ – పర్చేజింగ్, పొడవైన కారిడార్లు, కారిడార్లలో రోగుల తాలూకు ఆప్తులు – కొందరి మొహాలలో ఆశ, కొందరిలో నిర్లిప్తత. మొత్తం ప్రపంచం అక్కడ కనబడుతూంది.

రోగులు ముందు ద్వారం నుంచి వస్తున్నారు. (శవాలు వెనుక వరండాలోంచి వెళతాయి) సైన్సు చాలా సాధించింది. ముందునుంచి బయటికి వచ్చేవాళ్ళే ఎక్కువమంది.

– డాక్టర్ పార్థసారధి బట్టతలని సవరించుకొన్నాడు.

డియోడినమ్‌లోకి కడుపులోంచి వెళ్తూన్న బేరియం స్పష్టంగా కనిపిస్తూంది. దాని ప్రభావం వల్ల ఫ్లోరోస్కోప్‌లో ప్రతి అవయవమూ క్లియర్‌గా తెలుస్తూంది.

రేడియాలజిస్టు పాప కడుపుని వేళ్ళతో కుదిపాడు. ద్రవం నలుమూలలకి పాకింది. ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఫోటోలు తీసుకొంటున్నాడు. బేరియం ద్రవం ఇంకొంచెం క్రిందికి దిగింది. రేడియాలజిస్టు తన పనిని ఆపి పక్కకి తప్పుకున్నాడు. డాక్టర్ పార్థసారధి ఆతృతగా వంగి ముందుకు చూశాడు. తన ఇరవై అయిదు సంవత్సరాల అనుభవంతో అదేమిటో తెలుసుకోవటానికి పార్థసారధికి రెండు సెకన్లకన్నా ఎక్కువ పట్టలేదు.

అల్సర్!

అతడు తలెత్తి రేడియాలజిస్టు వైపు సాలోచనగా చూసాడు. అతడు తలూపాడు. పాప ఇరవై నాలుగ్గంటలపాటు అబ్జర్వేషన్‌లో వుంచబడింది. పాప కేసు చాలా విచిత్రంగా వుంది. సైనోటిక్ అటాక్‌నుంచి అల్సర్‌కి. "నేను నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నానా? నా డయాగ్నసిస్ కరెక్టేనా? నా అజ్ఞానంతో ఒక చిన్ని జీవితాన్ని నాశనం చేస్తున్నానా? వీటన్నిటికీ మూలకారణం మెదడో.... కాలేయమో..... ఇంకేదో..... అయివుంటుంది. అనవసరంగా నేను ఇన్ని రకాలుగా ట్రీట్ చేస్తున్నానా? మూలకారణం కనుక్కోలేకపోవటం నా అసమర్థత?"

పార్థసారధి డైరీ వ్రాయటం ఆపి అలసటగా కుర్చీ వెనక్కి వాలాడు. దూరంగా పన్నెండు కొట్టింది. హాస్పిటల్‌లో పాప బెడ్ పక్కనే పడుకున్న సరస్వతి నెమ్మదిగా లేచాడు.

12

.....రాత్రి ఒంటిగంటయింది.

శారద కిటికీ దగ్గర నిలబడి శూన్యంలోకి చూస్తూ వుంది. ఈ పది రోజులలోనూ ఆమె సగమయింది. తల దువ్వుకోలేదు. బొట్టు కూడా సరిగ్గా పెట్టుకోలేదు. లోలోపల ఆమె ఎంత కుమిలిపోతూందో అతడికి తెలుసు. నెమ్మదిగా "శారదా" అని పిలిచాడు.

ఆమె వెనుదిరగలేదు. అతడు లేచి దగ్గరగా వెళ్ళాడు. చేతిని ఆమె తలమీద వేసి నెమ్మదిగా– లాలనగా స్పృశించాడు. ఏ మాట వివరించలేని భావాన్ని ఆ స్పర్శ చెబుతుంది.

తెలుసు శారదా! నాకు తెలుసు నీ బాధ. ఉన్నది ఒక్కగానొక్క కూతురు.... మరి పిల్లలు పుట్టరు.... మన ఇంటిజ్యోతి గాలికి టపటపా కొట్టుకుంటూంది. నా యీ రెండుచేతులతోనూ ఆ దీపం ఆరిపోకుండా వుండటానికి శతవిధాల ప్రయత్నం చేస్తూనే వున్నాను. దేశంలోకెల్లా పెద్ద డాక్టర్లు శక్తివంచన లేకుండా తమ కర్తవ్యం నిర్వహిస్తున్నారు. ఇంకేం చెయ్యాలి?

"పాపని జెస్లోక్ తీసుకెళ్దామా?"

ఆమె మాట్లాడలేదు.

"రేపు పార్థసారధితో మాట్లాడతాను. అతను ట్రీట్ చేస్తున్నప్పుడు అతడిని అడగటం ధర్మం".

ఆమె నెమ్మదిగా తలెత్తి అతడివైపు చూసింది. చిన్న స్వరంతో అడిగింది. "అసలు పాపకేమిటి? ఏమయింది?"

తన దగ్గర సమాధానం లేనట్టు అతడు మౌనం వహించాడు. ఆ మౌనం ఆమెని మరింత కృంగదీసింది. కట్టలు తెంచుకొని రాబోయిన దుఃఖాన్ని నొక్కిపట్టి తన పక్క దగ్గరకు నడిచింది. "శారదా!" అన్నాడు. ఆమె దిండులో తల దాచుకొని రోదించసాగింది.

ఏడుపు మనసుకి శాంతినిస్తే– ఓదార్చటంకన్నా ఏడవనివ్వటమే మంచిది.

అతడు లేచి గదిలోంచి బైటకి వచ్చాడు. డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళి ఫ్రిజ్‌లోంచి ఐస్‌బాక్స్ తీసుకొని కారిడార్లోకి వెళ్ళి కూర్చున్నాడు. ఫ్రెండ్స్‌కి పార్టీ ఇవ్వటం కోసం వుంచిన బాటిల్ విప్పాడు.

చీకట్లోకి చూస్తూ తాగటం మొదలుపెట్టాడు.

....

తెల్లవారేవరకూ తాగుతూనే వున్నాడు. తూర్పునుంచి ఒక వెలుగు కిరణం సన్నగా ఆకాశంలో పైకి వచ్చింది. పక్షులు నిద్రలేవటం మొదలుపెట్టాయి. శారద కళ్ళు తెరిచింది. అవతలి పక్కమీద భర్త లేకపోవటం గమనించలేదు. లేచి క్రిందికి వచ్చింది. పాప ఆ రోజు ఏమీ గొడవ చేయకుండా నిద్రపోవటం సంతృప్తి నిచ్చింది. పూజగదిలో దేవుని ముందు చేతులు జోడించింది. "పాపకి త్వరగా నయం చేయి స్వామీ–" అని ప్రార్థించింది.

ఆమె పూజగదిలోంచి బైటకొచ్చేసరికి పావుతక్కువ ఏడయింది. మళ్ళీ ఇంకోసారి పాప గదిలోకి వెళ్ళింది. ఇంకా తను నిద్రలేవక పోవటముతో– దుప్పటి సరీగ్గా కప్పి, బయటకొచ్చింది. కారిడార్లో నడుస్తూ అనిత గదిముందు ఆగింది. ప్రతిరోజు ఆరున్నరకే లేచే అనిత ఇంకా లేవలేదేమిటా అని తలుపు తోసింది. దగ్గరగా వేసి వున్న తలుపు నెమ్మదిగా తెరచుకొంది.

అంతే!

ఆమె పెద్దగా పెట్టిన కేక ఆ భవంతి గోడల మధ్య ప్రతిధ్వనించింది. వరుసగా ఒకటి తర్వాత ఒకటి ఆమె కేకలు పెడుతూనే వుంది.

గది మధ్య ఫ్యాన్ రాడ్‌కి అనిత శరీరం వేలాడుతూంది..... అచేతనంగా.

*　　　*　　　*

భార్య కేక వినిపించి శ్రీధర్ కుర్చీలోంచి లేచాడు. రాత్రంతా నిద్రలేకపోవటం వల్ల తూలాడు.

అక్కడికి ముందు చేరుకున్నది నారాయణరావు. లోపలి దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. శారద పెడుతున్న కేకలు అతడినీ లోకంలోకి తీసుకొచ్చాయి. అక్కని పక్కకి తొలగించి ఒక్క అంగలో లోపలికి ప్రవేశించాడు. బల్ల దగ్గరగా లాగి, పైకి ఎక్కి ముడి వదులు చేశాడు. శరీరం ఒక్కసారిగా కింద పడకుండా చెయ్యివేసి నెమ్మదిగా దింపాడు.

బ్రతికి వున్నప్పుడు ఆమె చేరువకాలేదు. ఇప్పుడు నిర్జీవమైన ఆ శరీరం అచేతనంగా అతనికి దగ్గరయింది. దింపుతూ అతననుకున్నాడు "అనితా! నీ యీ చావుకి కారణం ఎవరైనా సరే ప్రాణాలతో వదిలిపెట్టను".

ఎప్పుడూ ఏ భావమూ కనబడని అతడి మొహంలో ఇప్పుడో భావం కనబడుతుంది.

పగ.....

13

ఆ రోజు సాయంత్రం పైడితల్లికి ఒక ఉత్తరం వచ్చింది స్వామి దగ్గర్నుంచి.

"డియర్ తల్లీ! ఈ రోజే బిస్తాపూరు వెళ్ళి అక్కడ కాద్రాని కలుసుకున్నాను. అన్నీ అనుకున్నవి అనుకున్నట్టే జరుగుతున్నాయి. ఇంక ఆర్రోజులు. అంతే! సరీగ్గా ఇరవై రెండో రోజున టెలిగ్రాం యివ్వండి. అంతా అయిపోగానే... కాద్రాకి ఇవ్వవలసింది ఇచ్చేసి నేను బయలుదేరి వచ్చేస్తాను. తర్వాత ఒక నాలుగు నెలలపాటు మనం కలుసుకోకుండా వుండటం మంచిది. ఈ విషయంలో మాత్రం చాలా జాగ్రత్తగా వుండాలి. నేను ఇన్ని రోజులూ ఆ వూళ్ళో లేకపోవటమే నాకు సాక్ష్యం. పాపని డాక్టరు రోజూ పరీక్షిస్తున్నారని వ్రాశావు. ఎంతమంది డాక్టర్లు కలిసినా ఏమీ చేయలేరు. ఆ విషయంలో ధీమాగా వుండవచ్చు. డాక్టర్లు పరీక్షించటం మంచిదే. తర్వాత- స్లో పాయిజనింగ్ జరిగిందని మనమీద కేసు పెట్టటానికి వీలుండదు. ఏ న్యాయస్థానానికి అందని "మంత్రశక్తి" మన వైపున్నంతకాలం ఎవరూ మనని ఏమీ చేయలేరు. సరస్వతి ఏమంటున్నాడు? మీరు కులాసాగా వున్నారని తలుస్తాను. ఇంకో ఆరు రోజులు. అంతే-

స్వామి".

చదివి పైడితల్లి అగ్గిపుల్ల వెలిగించి ఉత్తరాన్ని అంటించాడు. కిటికీలోంచి మండుతున్న కాగితాన్ని కిందకి పడేశాడు. రాత్రంతా దట్టంగాపడిన మంచుతో తడిసిన గడ్డిమీద పడింది ఉత్తరం.

అతడికి నవ్వొచ్చింది. చాలాకాలం తర్వాత నవ్వాడు. "కులాసా" అన్న పదం తలచుకొని.

కులాసా.

వెనక్కి వాలి కూర్చుంటూ అతడు మళ్ళీ నవ్వుకొన్నాడు.... అనిత జ్ఞాపకం వచ్చింది. అనుకున్న దానికంటే చాలా సులభంగా.... తొందరగా జరిగిపోయిందది. అతడి ఆలోచనలు రెండు రోజులు వెనక్కి వెళ్ళాయి....

....

"ఏమైంది కనుక్కున్నావా?" అతడొచ్చేసరికి అనిత ఆత్రుతగా అడిగింది.

"లేదు సిన్నమ్మా! నాకు తెలిసిన వాళ్ళందర్నీ అడిగాను- కాష్మోరా అంటే ఏమిటో ఎవరికీ తెలీదట" పైడితల్లి అన్నాడు.

ఆమె మొహం వాడిపోయింది. "ఎలా? ఇప్పుడెలా?" అంది బేలగా.

"ఫర్లేదులే, రేపు సూద్దాం" అతడు మామూలుగా అన్నాడు.

ఇనుము బాగా కాలిన తర్వాత దెబ్బతీయాలి.

"రోజు దాటి రోజు వస్తుంటే పాప మరణానికి దగ్గరవుతుంది".

"నాకు తెలుసు. సూద్దాం అన్నాగా!"

అనిత అతడి చేతులు పట్టుకొంది. "అలా కాదన్నయ్యా! నువ్వే చేయాలి ఏమైనా" ఆమె కళ్ళలో నీరు గిర్రున తిరిగింది. "ఈ ఇంట్లో ఎవరూ నా మాట నమ్మరు. చిన్నపిల్లనని మాట తోసేస్తారు. నువ్వొక్కడివే నా బాధ నర్థం చేసుకొన్నావు. అన్నయ్యా ప్లీజ్! ఎలాగైనా కనుక్కో ఏం చేస్తే పాప బ్రతుకుతుందో కనుక్కో" ఆమె కంఠం రుద్ధమయింది. అతడు దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

ఆమె అన్నది- ".....కావాలంటే నా దగ్గిర కొద్దిగా డబ్బున్నది. అప్పుడప్పుడు దాచుకొన్నది ఐదొందలదాకా వున్నది. అది ఖర్చు పెడదాము". ఆమె కంఠంలో కనబడుతున్న అమాయకత్వం ఎవరి గుండెనైనా కరిగించేలా వుంది.

"అక్కరలేదు సెల్లెమ్మా!" అన్నాడు అతడు. "నేనుండగా డబ్బు ప్రసక్తే లేదు. ఇంక ఈ విషయం గురించి నువ్వాలోసించకు. రెండ్రోజులలో అంతా నేను సరిసేస్తాను. ఈ సేతబడిని విడగొట్టేవాడు ఎక్కడున్నా పట్టుకొని నేను తీసుకొస్తాను. రెండ్రోజులు టైమియ్యి సాలు. నా మీద నమ్మకం వుంచు".

అతడి మీద నమ్మకం వుంచి ఆమె వెళ్ళిపోయింది. రెండ్రోజులు అవసరం లేకపోయింది. మరుసటిరోజే అతడు కబురు తెచ్చాడు. అతడి మొహం సంతృప్తితో వెలిగిపోతూంది. అతడేదో కనుక్కుని వచ్చి వుంటాడని అనిత చూడగానే గ్రహించింది.

"ఏమైందన్నయ్యా?" అడిగింది.

"పైడితల్లి తల్సుకుంటే సాధించలేనిది వుండదమ్మా!"

ఆమె టెన్షన్ భరించలేక "చెప్పు" అంది ఆత్రుతగా.

"ఈ కాష్మోరా గురించి తెలిసినవాడ్ని ఒకడ్ని పట్టుకొన్నాను సెల్లమ్మా! ఏం సెయ్యాలో సెప్పినాడు. కానీ అదంతా ఇన్న తర్వాత నాకు అనిపించింది. పాపకి అదిగాకపోతేనే బావుంటుందని... అయితే మాత్రం- ఆ విషానికి ఇరుగుడు..." ఆగాడు.

"లేదా?" ఆమె ఆందోళనగా అడిగింది.

"ఉంది. కానీ–" అతడు మాట మార్చి, "ముందు అసలు పాపకి అదో కాదో సూడాలి కదా" అని రెండు పొట్లాలు జేబులోంచి తీశాడు.

అందులో తెల్లపొడి వుంది.

ఒక దానిమీద "తుప్"మని వూశాడు. పొట్లాన్ని అనిత ముందు పెడుతూ "నువ్వూ వుమ్మెయ్యి సిన్నమ్మా!" అన్నాడు. ఆమెకి అర్థం కాలేదు.

"ఎందుకు?" అంది.

"సెప్తాగా!"

ఆమెకూడా అలాగే చేసింది. తెల్లటి పొడిలో ఏ మార్పూ లేదు.

"మంత్రించిన మైదాపిండి సెల్లమ్మా యిది" అన్నాడు. "ఇదే చెబుతుందట ఎవరికి సేతబడి సేసిందీ– ఇదిగో ఈ రెండో పొట్లం తీసుకెళ్ళి పాపచేత వూయించి, ఏం జరిగిందీ సెప్పు. ఏమీ జరక్కపోతే అది సేతబడికాదు".

ఆమె మొహంలో రకరకాల భావాలు మిశ్రితమై వున్నాయి. ఆందోళన, ఆతృత, ఆశ.... అన్నీ. వణుకుతున్న చేతులతో పొట్లం తీసుకొంది. "ఇప్పుడే వస్తా"నని చెప్పి, తడబడుతున్న అడుగులతో తులసి వున్న గదిలోకి వెళ్ళింది.

గదిలో శారద వుండటం చూసి బైటే నిలబడింది. అయిదు నిమిషాలపాటు– ఆతృతని అతికష్టంమీద అణుచుకుంటూ.

శారద బైటికి వెళ్ళాక ఆమె పాప దగ్గరికి వెళ్ళింది. ఇరవై నాలుగు గంటలు హాస్పిటల్లో సూపర్‌విజన్‌లో వుంచబడిన పాప ఇంటికొచ్చి పదహారు గంటలయింది.

"పాపా" నెమ్మదిగా పిల్చింది. తులసి కళ్ళు తెరిచింది.

రక్తం లేక తెల్లగా పాలిపోయిన మొహం.... లోతుగా పోయిన కళ్ళు.... పల్చగా మారిన పెదాలూ.... వూడిపోయిన జుట్టు.... బంతిలా వుండే పాప పుల్లలా మారింది.

అనిత పొట్లం విప్పి మంచం పక్కగా పట్టుకుంది. "దీనిమీద ఉమ్మి వేయి."

పాపకేమీ తెలియలేదు.

అర్థమయ్యేటట్టు మళ్ళీ చెప్పింది. ఒక చేత్తో మెడకింద చెయ్యివేసి పట్టుకుంది. పాప నోటి తడి తగలగానే మంత్రించిన మైదాపిండి బుసబుసా పొంగసాగింది.

రెండు నిమిషాల తర్వాత అనిత తన గదిలోకి వచ్చేసరికి ఆమె కళ్ళు పెద్ద రహస్యాన్ని కనుక్కున్న దీప్తితో వెలుగుతున్నాయి. ఉత్సుకతతో నరాలు తెగిపోతాయా అన్నట్టు వుంది. పరుగు పరుగున తన గదిలోకి వచ్చింది.

పైడితల్లి తలెత్తి చూశాడు. "నిజమే" అంది తొందర తొందరగా. "నువ్వు చెప్పింది నిజమే. పాప మంత్రించిన మైదాపిండి మీద వూయగానే బుసబుసా పొంగింది. ఎవరో గిట్టనివాళ్ళు పాపకి అన్యాయం తలపెట్టారు. అందరూ ఆనందంగా ఉండటం చూడలేక ఈ దారుణానికి వడిగట్టారు." ఆమె కంఠంలో చప్పున దైన్యం ధ్వనించింది. "ఎలా? ఎలా పాపని రక్షించటం? ఇంక ఈ మంత్రానికి విరుగుడే లేదా?"

పైడితల్లి మాట్లాడలేదు. "చెప్పన్నయ్యా" భుజాలు పట్టుకొని వూపింది. "పాపకి నయం అయ్యే మార్గమే లేదా? ఈ మందిచ్చినాయన ఏమీ చెప్ప లేదా?" అతను మౌనంగా వుండటం ఆమెని బాధ పెడ్తోంది. ఏదయినా చేసి పాపని రక్షించాలి, ఏం చేసైనా సరే.

"పాపకి చేతబడి అని నిరూపించినవాడు సామాన్యుడై వుండడు. మంత్రించిన మైదాపిండి యిచ్చిన వాడికింకా ఎన్నో మంత్రాలు తెలిసే వుంటాయి. ఇవన్నీ అన్నయ్య నమ్మడు, మనమే అతణ్ని బ్రతిమాలుకొని నయం చేయించాలి. నా దగ్గర డబ్బులున్నాయని చెప్పానుగా. ఇంకా కొద్దిగా కావల్సివస్తే వదిన్ని అడుగుదాం. తనని వప్పించడం పెద్ద కష్టం కాదులే. అదంతా నేను చూసుకుంటాగా. లే అన్నయ్యా! నువ్వెళ్ళి కనుక్కురా!"

పాప జబ్బు తాలూకూ రహస్యాన్ని కనుక్కున్న ఉద్వేగంతోనూ, తమ ఇంటి జ్యోతిని తిరిగి వెలిగించాలన్న తపనతోనూ వణికిన ఆ కంఠాన్ని వింటూ పైడితల్లి నెమ్మదిగా తలెత్తాడు.

"అక్కర్లేదు సిన్నమ్మా! డబ్బు ఖర్చు పెట్టక్కరలేదు" అన్నాడు. ఆపై చిన్న స్వరంతో "ఆ మంత్రగాడు మందు కూడా సెప్పాడు" ఆగాడు. "కానీ... కానీ....."

ఆమె ఆందోళనగా చూస్తూ "కానీ మనం ఆ మందు సంపాదించలేమా?" అంది.

అతడో క్షణం మాట్లాడలేదు. తరువాత అన్నాడు. "అదేమంత కష్టమైన మందుకాదు సిన్నమ్మా.... అయితే...." ఆలోచనల మధ్య తటపటాయించాడు.

ఆ గదిలో నిశ్శబ్దం ఆమెకు భరించరానిదయింది.

అతడో నిర్ణయానికి వచ్చినట్టు తల అడ్డంగా వూపి "ఉహూ.... చెప్పను.... చెప్పలేను. పాప సచ్చిపోయినా సరే" అన్నాడు.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక్కసారి బేలతనం ఆవరించింది. "ఏం, ఎందుకు చెప్పవ్?" అంది రుద్ధమైన కంఠంతో. "పాపని బాగుచేయటానికి ఏమైనా చేయాలి మనం. అదేమంత కష్టమైన మందు కాకపోతే మరెందుకు చెప్పవ్? పాపంటే నీకు ప్రేమ లేదూ?"

"ఉంది...ఉంది" అన్నాడు. ఆమె మాటల్ని మధ్యలో ఆపుచేస్తూ. "కానీ పాపకు పట్టిన దెయ్యాన్ని వదిలించాలంటే డబ్బు విషయంలో పెద్ద ఖర్చు కాకపోయినా మన జీవితాలకు సంబంధించినంత వరకూ అది చాలా పెద్ద పరిహారం సిన్నమ్మా! అందుకే దాన్ని సెప్పేముందు ఇంత ఆలోసిస్తున్నా."

"ఏమిటది?"

"పాపకి పట్టింది "కాష్మోరా" అనే క్షుద్రదేవతని సెప్పానుగా సిన్నమ్మా ఇంతకుముందే". ఆమె తలూపింది.

"క్షుద్రదేవతలకుండేయన్నీ క్షుద్రకోర్కెలే సిన్నమ్మా! అందుకే అవి అందరూ మంచోళ్ళుండే ఇంట్లో చేరతాయి. ఏది ఏమైనా వాటి కోర్కెతీరిస్తే అవి వెళ్ళిపోతాయి. అన్నిట్లోకి ఈ కాష్మోరా అనేది మరీ క్షుద్రమైనదట సిన్నమ్మా! అది తృప్తి చెందాలంటే..." ఆమె వూపిరి బిగపట్టి అతడివైపే చూస్తుంది.

"అది తృప్తి చెందాలంటే ఈ ఇంట్లో ఒక అనాచారం జరగాలి. అది ఎలాటి అనాచారమంటే..." ఆగాడు.

"తీరని కోర్కెలతో చచ్చిపోయిన ఆత్మలూ, కుత్సితమైన కోర్కెలతో మరణించినవాళ్ళూ కాష్మోరాని ఆశ్రయిస్తారట. ఇదంతా నాకా మంత్రగాడే సెప్పాడు సిన్నమ్మా. అసలా దేవతంటేనే కుత్సితమంట. ఈ ఇంటిలోంచి అది పోవాలంటే ఈ ఇంటివాళ్ళు ఇద్దరు కలియాలి. ఆ ఇద్దరూ తండ్రీ-కూతుళ్ళో, అన్నా-చెల్లెళ్ళో అయివుండాలి సిన్నమ్మా! ఇదంతా సెప్పనన్నది ఇందుకే. ఇయ్యన్నీ అయ్యే పనులు కావు. సరీగ్గా పన్నెండింటికి కలియాలట. ఆ కల్మషాన్ని చూసి క్షుద్రదేవత తృప్తిపడి వెళ్ళిపోతుందట" అతడు చెప్పటం ఆపి ఆమెవైపు చూశాడు.

ఆమె మొహం తెల్లగా పాలిపోయింది. పెదవులు వణుకుతున్నాయి. తను వింటున్నది నిజమో, అబద్ధమో అర్థంకావటంలేదు. ఇలాటి విషయాలుంటాయని కూడా ఆమె వూహించలేదెప్పుడూ.

పైడితల్లి అంటున్నాడు "నువ్వు ఇవన్నీ ఆలోసించకు సిన్నమ్మా! ఆలోసించి మనసు పాడుచేసుకోవటం తప్ప యింకేముంది ఇందులో. అందుకే ఇయన్నీ నీకు సెప్పనంది. మన పాపని వదులుకోవలసిందే. ఆ క్షుద్రదేవతని సంతృప్తి పరచటం మన చేతకాదు. ఏ తండ్రి వప్పుకొంటాడు కూతుర్ని చెరచడానికి? ఏ చెల్లి వప్పుకుంటుంది సెల్లమ్మా అన్నతో కలియడానికి?"

ఆమె ఆలోచిస్తుంది.

పైడితల్లి అక్కడనుంచి లేచి బయట తోటలోకి వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత అనిత అక్కడికి వెళ్ళింది.

"ఆ దెయ్యం వెళ్ళిపోవాలంటే రక్తం పంచుకొని పుట్టిన అన్నయ్యే...." ఆ తర్వాత ఏం చెప్పాలో ఆమెకి తెలియలేదు. ఆమె భావం గ్రహించినట్టుగా అతనన్నాడు. "అక్కర్లేదు సెల్లెమ్మా. వరుసకి అన్నయ్య అయినవాడు సాలు".

ఆమె మాట్లాడలేదు. ఆమె దగ్గరగా అతనొచ్చాడు. "నువ్వేం ఆలోసిస్తున్నావో నాకు తెలుసు. వద్దు సిన్నమ్మా! అలాటి ఆలోచన పెట్టుకోకు. నేను అంతపని సెయ్యలేను... నిన్ను అపవిత్రం సెయ్యలేను".

ఆమె ఎటూ తోచనట్టు అతడివైపు బేలగా చూసింది.

"నువ్వంత త్యాగం చెయ్యొద్దు సెల్లెమ్మా! పాపని చచ్చిపోనీ, ఇంకెంత.... ఎనిమిది రోజులు, అంతేగా! కొంచెం బాధపడుతుంది.... ఒక రోజు రక్తం కక్కుకుంటుంది.... ఒకరోజు కాళ్ళూ చేతులు కొట్టుకుంటుంది. నరకయాతన అనుభవిస్తుంది. అయినా ఎన్ని రోజులు? ఎనిమిది రోజులేగా. మనకి పాపమీద ఎంత ప్రేమైనా వుండనీ- అందుకని మన జీవితాలు పాడు చేసుకుంటామా? పాప సచ్చిపోతే ఇంకో నెల అయ్యాక ఆ విషయం అంతా మర్చిపోతాము. అంతేగా! ఈ ప్రేమలూ, అభిమానాలు అంతా బూటకం".

"కాదు...కాదు" అందామె. "పాప మా ప్రాణం... దాన్ని రక్షించుకోవటానికి నా జీవితం బలైనా సరే ఫరవాలేదు".

అమాయకంగా వూగే కిటికీ తెరలకేసి, నిస్సహాయంగా కదులుతున్న మల్లెతీగ కేసి ఓ క్షణం చూశాడు. "నువ్వంతగా నొక్కి సెబుతుంటే కాదనటానికి నాకూ మనసొప్పటం లేదు. కానీ సెల్లెమ్మా! ఈ రోజు నువ్వు సేస్తున్న త్యాగం ఎంత గొప్పదో మాటలలో వివరించలేను. మొత్తం ఆడజాతే గర్వించదగ్గ విషయము సిన్నమ్మా యిది! నా మనసు మాత్రం బాధపడుతూనే వుంది. కానీ పాప కోసం దాన్ని రాయిచేసుకోవాలి. ఇంకా ఈ విషయం గురించి ఆలోచన వద్దు. ఇదెవరికీ

తెలియాల్సిన అవసరమూ లేదుకూడా. ఈ రోజు రాత్రి పన్నెండు గంటలకి "కాష్మోరా" సూస్తున్న వేళ- అన్నా సెల్లెల్ని చూసి సంతృప్తిపడి దెయ్యం ఎల్లిపోవాలి. పాప రేపొద్దునకల్లా లేచి ఆడుతూ తిరగాలి. అలా పాపని బాగుచేసిన తృప్తి నీకే దక్కాలి. ఎల్లు సిన్నమ్మా! రాత్రికి నీ గది తలుపు తీసుంచు. నేనొస్తాను. సరీగ్గా రాత్రి పన్నెండు గంటలకి, ఎగ్జాట్లీ ఎట్ టెల్వోక్లాక్...."

*   *   *

గదిలో నిశ్శబ్దమూ, ఆమె మనసులో ఉద్వేగమూ మిగిలినవి. అప్పట్నించీ రాత్రి పన్నెండింటివరకూ ఆమె మనసులో మెదిలిన రకరకాల భావాల్ని వివరించడం ఎవరికీ సాధ్యంకాదు.

కాలు నలిగిన పిల్లిలా ఇల్లంతా తిరిగింది. కొంచెంసేపు వంటింట్లోకి వెళ్ళి రామయ్య చేసే వంటని చూసింది. మరికొంతసేపు తన గదిలోకొచ్చి పుస్తకాలు తిరగేసింది. పాప గదిలోకి వెళ్ళింది.

"అలా ఉన్నావేం?" శారద అడిగింది పరీక్షగా చూస్తూ.

అనిత ఉలిక్కిపడి "ఎలా వున్నాను?" అంది.

శారద మాట్లాడలేదు. పాప మెడ దగ్గర దుప్పటి సర్దుతూ వుండిపోయింది. లైటు వెలుతుర్లో అనిత శారదని పరీక్షగా చూసింది. ఎన్నో రోజుల్నించి సరీగా తిండి తినకపోవటం వలన ఆమె నీరసం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది. నిజానికి పాపకన్నా శారదే బలహీనంగా వుంది. శ్రీధర్ ఎంతో బలవంతం చేస్తే నాలుగు మెతుకులు తిని లేచిపోయింది.

ఒక సంగతి మాత్రం ఆ ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. పాప రోజురోజుకీ క్షీణించిపోతుంది. ఇలా అయితే ఇంకొద్ది రోజులలో... చాలా కొద్దిరోజులలో....

ఆపైన ఎవరూ ఆలోచించటంలేదు. డాక్టర్లు ప్రయత్నం చేస్తూనే వున్నారు.

"ఇది చూశావా?" అంది శారద పాప మొహం చూపిస్తూ. కళ్ళకింద చర్మం వుబ్బింది. లూజ్ స్కిన్! అనిత చూస్తూ వుంటే శారద అంది- "ఇదంతా ఏమిటో. ఈ మహమ్మారి ఇంకా ఎన్ని రోజులు పీడిస్తుందో తెలీటంలేదు".

అనిత చప్పున అంది "ఇంకెన్నో రోజులు లేదు, ఒక్కరోజే".

శారద విస్మయంగా చూసి, "ఒక్కరోజేనా.... ఏమిటి?" అంది.

చెప్పేద్దామా అనుకుంది అనిత. చెప్పేస్తే.... అమ్మో-ఇంకేమన్నా వుందా? కానీ పాప రేపు బాగయిపోతే- అది తనవల్లే అయితే- అప్పుడు ఆ థ్రిల్... అది

మాత్రం ఎలా చెప్పటం? లేదు....లేదు. ఈ రహస్యం తనతో వుండిపోవాలి. చెబితే ఎవరూ ఒప్పుకోరు. అన్నయ్య, వదిన... అయినా తను పిచ్చిది. ఎలా చెబుతుంది?

"ఏం లేదు" అని అక్కణ్నించి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఆమె భోజనం సరీగా చేయలేదు. ఉద్వేగం.... అంతటా ఉద్వేగమే.

అప్పుడు మాత్రం ఆమె మనసులో 'తప్పు' చేస్తున్నానన్న భావం ఏ మాత్రం లేదు. ఒక పవిత్ర కార్యక్రమం కోసం తన శరీరం ఉపయోగపడుతుందన్న భావం తప్ప.

దేవుడి ముందు నేలమీదపడి దొర్లేవాళ్ళూ, జాతర్లలో నిప్పులమీద నడిచేవాళ్ళూ ఏ ఉద్వేగంతో ఆ పనులు చేస్తారో అదే ఉద్వేగంతో ఆమె ఈ పనికి పూనుకుంది. అయితే జాతర్లలో నిప్పుల్ని తొక్కేవాళ్ళు, అలా తొక్కేముందు కాళ్ళు బాగా కడుక్కుంటారు. కాబట్టి ఆ నీరు ఆవిరయి పాదానికీ, నిప్పుకీ మధ్య పొరలా ఏర్పడి పాదం కాలిపోకుండా రక్షిస్తుంది. మరిప్పుడు అనిత శరీరాన్ని నిప్పులో కాలిపోకుండా ఏది రక్షిస్తుంది? ఏదీ రక్షించలేదు.

అంతా మామూలుగా, చాలా మామూలుగా జరిగింది. పన్నెండింటికి పైడితల్లి వచ్చాడు. తలుపు వేసి గడియ పెట్టేశాడు.

ఆమె అతడివైపే చూస్తూంది. చుట్ట ఓ మూలకి విసిరేశాడు. చెల్లెలివైపు చూసి నవ్వుతూ దగ్గరగా వచ్చాడు.

ఈ ఘోరాన్ని చూడలేనట్టు ప్రకృతి కూడా మౌనం వహించింది. గోడగడియారం చప్పుడు తప్ప మరేమీ వినిపించడంలేదు.... దూరంగా ఎక్కడో ఓ కుక్క ఏడుస్తూంది.... ఫెరన్ మొక్కమీద దీపపు కాంతి నిస్తేజంగా పడుతూంది. అతడి మోటు చేతులమధ్య ఆమె నాజూకు శరీరం నలుగుతోంది.

ఆమె అమాయకంగా గదంతా చూసింది. ఎక్కడైనా "కాష్మోరా" కనబడతాడేమోనని. 'ఓ కౄరమైన దెయ్యమా!' అనుకుందామె. 'ఇదిగో నీక్కావలసింది జరుగుతోంది ఇక మా పాపను వదిలిపెట్టు'. ఆమె భావాలతో సంబంధం లేనట్టు పైడితల్లి తన పని తను చేసుకుపోయాడు. అంతా అయిపోయాక, చుట్ట వెలిగించుకొని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆమె మిగిలిపోయింది.

చాలాసేపు పక్కమీద అలానే పడుకుని వుండిపోయింది. పాప గదిలోకి వెళ్ళి చూడాలన్న కోర్కెని బలవంతంగా ఆపుకుంది. దాదాపు అరగంట అయిన తర్వాత లైటకొచ్చింది.

దూరంగా గడియారం ఒకటి కొట్టింది. చీకటి మనిషి మనసులో పాపంలా వుంది. ఆమె మెట్లు దిగి వస్తూంటే 'వాళ్ళ' గదిలోంచి మాటలు వినబడ్డాయి. పైడితల్లి, సరస్వతి కంఠాలు!

"కాష్మోరా కాదుగానీ, కాష్మీరీ ఆపిల్ పండులా వుంది అమ్మాయి! ఇరవయ్యేళ్ళ వయసులో పిటపిటలాడిపోతూ..." పైడితల్లి కంఠం.

సరస్వతి "నాకు ముందు నీ మీద భలే అనుమానం వచ్చిందిలే" అంటున్నాడు.

పైడితల్లి నవ్వు– "అవతలివాళ్ళ అమాయకత్వాన్ని తన అవసరానికి వాడుకోవడం పైడితల్లి ప్రత్యేకత!"

"నీ కన్ను అక్కడ పడిందని తెలుసుగానీ, ఇంత తొందరగా చేతికి చిక్కించుకుంటావనుకోలేదు. అందులోనూ అసలేమీ అనుభవం లేనిదాన్ని...."

"ఈ విషయంలో మాత్రం 'కాష్మోరా'కి థాంక్స్ చెప్పుకోవాలి" ఇద్దరి నవ్వులా–

ఆమె మరి వినలేదు. వినటానికి కూడా ఏమీలేదు. తెల్లగా– రక్తం లేనట్టు పాలిపోయిన మొహంతో అక్కడనుంచి కదిలి తన గదిలోకి వచ్చింది.

తనెంత ఘోరంగా మోసపోయిందో తల్చుకునేకొద్దీ ఆమెకి దుఃఖం ముంచుకు రాసాగింది. అయినా ఇప్పుడు చేసేదేమీ లేదు. తన గదిలో పక్కమీద పడుకొని తనివితీరా ఏడ్చిన తర్వాత ఆమె ఆలోచించటం మొదలుపెట్టింది.

అసలు తనెందుకు అంత తెలివి తక్కువగా ప్రవర్తించింది? అంత దుఃఖంలోనూ ఆమెకి నవ్వొచ్చింది. పెరట్లో నిధి దొరుకుతుందంటే కన్న బిడ్డను బలిచ్చే తల్లి, మగపిల్లవాడు పుట్టటం కోసం ఇంకొకరి పిల్లవాడ్ని చంపాలంటే అలా చంపే తండ్రి, వీళ్ళకన్నా తనెందులో గొప్పది? వీళ్ళ అజ్ఞానం కంటే తన అజ్ఞానం ఏమంత తక్కువది? అందరూ తెలివితక్కువవాళ్ళే! బిడ్డకి నలతగా వుంటే దిష్టి తీసి, తగ్గకపోతే అప్పుడు డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళేవాళ్ళు, పని జరిగితే జుట్టు ఇస్తామని దేవుడికి లంచం పెట్టేవాళ్ళు, వేపమండలతో కొడితే రుగ్మత తగ్గుతుందని భావించే విద్యాధికులూ, అందరూ అజ్ఞానంతో బాధపడుతున్న వాళ్ళే! అయితే వాళ్ళ వాళ్ళ లెవల్స్‌లో ఎక్కువ తక్కువలుండొచ్చు. ఇప్పుడు తనుఅజ్ఞానంతో వేసిన అడుగు మాత్రం వెనక్కి తీసుకోలేనిది....! ఎంత అజ్ఞానంతో 'అతడు చెప్పిన మాటల్ని నమ్మిందీ' అన్నది అప్రస్తుతాంశం. నమ్మింది.... 'పాపకి తగ్గాలి' అన్న దొక్కటే అప్పటి కోర్కె.

మరిప్పుడు చెయ్యవలసిందేమిటి?

జరిగింది సమీక్షించుకోవటం మాత్రం కాదు.

స్త్రీ తన ప్రాణంకన్నా జాగ్రత్తగా రక్షించుకోవలసింది తాను కోల్పోయింది. ఈ రహస్యం ఇంకెవరికీ తెలియకపోవచ్చుగాక! అలా అని ఏమీ సంభవించనట్టూ మామూలుగా వుండగలదా? అయినా ఏం జరిగింది? కండరాలమధ్య కండరాల రాపిడికి మనిషి ఎందుకింత ఇంపార్టెన్స్ ఇస్తున్నాడు? అది అర్థంలేని ప్రశ్న అయివుండవచ్చు. కానీ నైతిక విలువల దృష్ట్యా ప్రాముఖ్యత వున్న ప్రశ్న! తెలిసి చేసిందో, తెలియక చేసిందో తప్పు తప్పే! ఈ తప్పుని కప్పిపుచ్చుకొని, ఆత్మవంచన చేసుకొని, తన జీవితంలోకి ప్రవేశించబోయే యువకుడిని మోసం చెయ్యలేదు. జీవితాంతం వివాహం చేసుకోకుండా గడుపుతానంటే ఎవరూ ఒప్పుకోరు. కారణం అడుగుతారు. తానెంత తెలివితక్కువగా మోసపోయింది చెపితే నవ్వుతారు– పగలబడి నవ్వుతారు.

ఆమెక్కూడా నవ్వొచ్చింది. నవ్వుకుంటూనే ఓ నిర్ణయాని కొచ్చింది. పైన ఫాన్‌రాడ్ కేసి చూసింది.

బీరువాలోంచి చీరె తీసి దానికి కట్టింది. చివర ముడివేసి, బల్ల ఎక్కి మెడకి బిగించుకుని బల్లని కాళ్ళతో తోసేసింది.

నిమిషం తరువాత ఆమె ప్రాణం పోయింది. ప్రాణం పోతూ వుంటే ఆమె అనుకుంది– "కోర్కె తీరని మనిషి దెయ్యం అవుతుందట. అదే నిజమైతే– పైడితల్లీ నేను చచ్చి నిన్ను సాధిస్తాను, దెయ్యమై పీడిస్తాను. నువ్వు చచ్చేవరకు వదిలిపెట్టను". ఆమె దెయ్యం అయిందో లేదో తెలీదుగానీ ఆమె కోర్కె మాత్రం తీరింది.

నారాయణరావు ద్వారా.

*   *   *

"చాలా చిన్న ట్రిక్" అన్నాడు పైడితల్లి. అతడు కాళ్ళు చాపుకుని గోడకి ఆనుకొని కూర్చుని వున్నాడు. సరస్వతి పక్కచుట్టకి మోచెయ్యి ఆన్చి పడుకొని వున్నాడు.

"కాల్షియం కార్బొనేట్-పొడిసున్నం- చూడటానికి మాత్రం దానికీ, మైదాపిండికీ తేడా వుండదు అయితే నీళ్ళు పడగానే ఒకటి బుసబుసా పొంగుతుంది. రెండోది మామూలుగా వుంటుంది. భూతవైద్యుడి దగ్గరికి దెయ్యం

పట్టినవాడిని తీసుకెళ్ళగానే వాడు ప్రయోగించే మొదటి ట్రిక్ యిదే! దెయ్యం పట్టిందని వాళ్ళ వాళ్ళని నమ్మించటానికి".

పైడితల్లి నవ్వాడు. సరస్వతి కూడా నవ్వాడు. అంతలో సన్నగా గాలి వీచింది.

అప్పటివరకూ నిశ్చలంగా వున్న కిటికీ తెరలు అల్లల్లాడినాయి. చూస్తూ వుండగానే గాలి ఉధృతమయింది. ఈ ఆకస్మిక వాతావరణ పరిణామానికి విస్తుబోతూ సరస్వతి కిటికీ తలుపు వేయటానికి వెళ్ళాడు. దుమ్ము తెరలుగా లేచి గాలిలో కలుస్తోంది. ఎండుటాకులు చప్పుడు చేస్తూ కదులుతున్నాయి. బలంగా తోసి కిటికీ తలుపుల్ని దగ్గరగా వేస్తూ వుంటే- సందులోంచి ఓ కాగితం పడవలాగే తేలివచ్చి నేలమీద పడింది.

సరస్వతి వంగొని కాగితం తీశాడు. మొదట అర్థంకాలేదు. చదువుతూంటే రెండోసారి అర్థమైంది. అతడి మొహం పాలిపోయింది. అతడి ముఖ కవళికలు గమనిస్తున్న పైడితల్లి "ఏమిటి? ఏమైంది?" అని అడిగాడు.

సరస్వతి వణుకుతున్న చేతులతో కాగితాన్ని పైడితల్లికి యిచ్చాడు. నలిగిపోయిన కాగితం. అస్తవ్యస్తంగా అక్షరాలు. మరణశయ్య మీద ప్రాణం పోతూ వుంటే- గింజుకుంటూ వ్రాసినట్టుంది.

'నా చావుకి కారణం నువ్వు, నిన్ను వదలను'.

పైడితల్లి తేలిగ్గా నవ్వాడు. "పాపం పిచ్చిది" అన్నాడు.

సరస్వతి నవ్వలేదు. చేతిలో కాగితం కేసి పరీక్షగా చూశాడు. తల ఎత్తి "ఇది అనితే రాసినట్లయితే.... ఇంత వంకర టింకరగా ఎందుకు వ్రాస్తుంది?"

ఆ ప్రశ్నకి వెంటనే సమాధానం దొరకలేదు పైడితల్లికి.

"అంటే ఇంకెవరయినా రాశారంటావా?"

"నువ్వు చేసిన వెధవ పని యింకెవరికయినా తెలుసా?" సరస్వతి ఎదురు ప్రశ్న వేశాడు.

"అసలాస్కారమే లేదు".

"మరి?"

ఒక్కక్షణం నిశ్శబ్దం. పైడితల్లి ఏదో ఆలోచన వచ్చినవాడిలా అన్నాడు- "ఆ రాత్రి మన మాటలు విని వుంటుంది. చచ్చిపోబోయేముందు బైట్నుంచి కిటికీలో ఈ కాగితం దోపి చచ్చిపోయి వుంటుంది" సమస్య విడిపోయినట్టు నిట్టూర్చాడు. "చీకట్లో వ్రాసి వుంటుంది కాబట్టి అక్షరాలు అలా వచ్చి వుంటాయి".

"అంతేనంటావా?"

"అంతే!"

"మరి ఈ మూడు రోజులలోనూ దాదాపు పదిసార్లు ఈ కిటికీ తీసి వుంటాం కదా! ఎప్పుడూ కనపడనిదీ ఇప్పుడెలా బయటపడింది?"

పైడితల్లి మొహం చిట్లించి "అయితే ఏమంటావ్?" అన్నాడు. "ఈ కాగితం దెయ్యం వ్రాసిందంటావా?"

సరస్వతి మాట్లాడలేదు.

పైడితల్లి కాగితం చింపిపారేస్తూ "పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోక" అన్నాడు. కానీ అతని కంఠంలోనే స్థిరత్వం లేకపోవటం అతడు గమనించాడు.

వింటూన్న నారాయణరావుకి మాత్రం కావల్సిన "కారణం ఎవరో" దొరికాడు.

అప్పటికి అనిత మరణించి నాల్గు రోజులైంది. అనిత పైడితల్లి చేతిలో మోసపోవటంలో చిత్రమేమీ లేదు. అంతకన్నా అమాయకమైనవాళ్ళు మన చుట్టూ ప్రపంచంలో చాలామంది వున్నారు.

14

ఆ తర్వాత మూడు రోజులూ పాప అంత కంగారు పెట్టలేదు. కంగారు పెట్టలేదంటే- క్షీణించిపోలేదని కాదు. పదిహేడు. పద్దెనిమిది.... పంతొమ్మిది రోజులలో వచ్చే పార్శ్వారుణం, తాలుకంఠంలాంటి రుగ్మతలు మిగతా రోగాలంత భయంకరంగా పైకి కనిపించవు.

కానీ పార్థసారథికి తెలుస్తూంది.

ఉధృతంగా వచ్చిన రోగం రెండు రోజులపాటూ 'ఆకస్మికం'గా తెరిపి యిచ్చిందంటే.... ఉప్పెనలా వచ్చి కబళిస్తుందన్న మాట.

కాని ఏమిటీ రోగం?

చాలా రోజుల్నుంచీ అతడికి సమాధానం దొరకటంలేదు.

ఒక పెద్ద హాస్పిటల్లో అనుభవజ్ఞులైన డాక్టరుగా అతడు చాలా కేసుల్ని చూశాడు. ఎంత కాంప్లికేటెడ్ కేసయినా కొద్ది రోజులలోనే ఒక 'క్లూ' యిస్తుంది. కనీసం మనిషిలో ఏ 'అంగం' సరీగ్గా పనిచేయకపోవటం వలన ఇలా జరుగుతుందో, ఏ 'సిస్టం' పనిచేయకపోవటం వలన ఇలా జరుగుతూందో తెలిసిపోతుంది. కానీ

ఈ కేసులో అలా జరగటం లేదు. ఒకరోజు కుడివైపు రొమ్ముకింద లివర్ పెరగటం స్పష్టంగా కనపడుతూంది. మరుసటిరోజుకి అది మామూలుగానే వుంటుంది. ఇంకోవైపు అల్సర్ కనబడుతూంది.

ఆలోచనలతోనే అతడు తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు.

"హల్లో!"

తిరిగి విష్ చేస్తున్నట్టు పార్థసారధి తల వూపాడు. కుర్చీలో కూర్చుంటూ "నా పేషెంటు....తులసి" అన్నాడు.

సీనియర్ రేడియాలజిస్ట్ జేమ్స్ తెలుసన్నట్టు తలూపేడు. "బ్లడ్ కౌంట్ చూశాను. ఈజ్నోఫీలస్ తప్ప అంతా మామూలుగా వుంది".

అంతకన్నా ఎక్కువ తను ఆశించనట్టు పార్థసారధి పేలవంగా నవ్వాడు. అనవసరంగా తను కంగారుపడుతున్నాడేమో. అసలిదేమీ కాంప్లికేటెడ్ కేసు కాదేమో. తన ఆలోచన తనకే తెలివితక్కువగా అనిపించింది అంతలోనే. అక్కడ పేషెంటు రోజురోజుకీ మరణానికి దగ్గర అవుతూంటే అది చూడటానికే తెలుస్తూంటే కాంప్లికేటెడ్ కాదా?

"డాక్టర్" అన్నాడు పార్థసారధి- "మీ అభిప్రాయం ఏమిటి?"

ఒక డాక్టర్ వేరొక డాక్టర్ని సంప్రదించడం మామూలే. జేమ్స్ నవ్వాడు. "నేనూ ఏమీ చెప్పలేకపోతున్నాను. అటాప్సీ అయితే గానీ...." ఆపాడు.

డాక్టర్ల మధ్య జోకులు మామూలుగా పేషెంట్ల గురించి జరుగుతూనే వుంటాయి. చాలా కాస్ట్లీ జోకులు.

రోగి చనిపోయిన తర్వాత, అటాప్సీవల్ల (శవాన్ని కోసి) అంతకు ముందు చేసిన రోగ నిర్ధారణ సరి అయినదో కాదో కనుక్కుంటారు. "నువ్వెక్కడ తప్పు చేశావో" అని ఏడిపిస్తూ వుంటారు. ఇవతలి డాక్టరు కూడా దాన్ని స్పోర్టివ్‌గానే తీసుకుంటాడు.

కానీ ఇప్పుడు మాట్లాడుతున్నది డాక్టర్ పార్థసారధితో అని జేమ్స్‌కి సగం వాక్యం అన్న తర్వాత జ్ఞాపకం వచ్చి మధ్యలో ఆపుచేశాడు. అప్పటికే అది అర్థమైంది.

పార్థసారధి మొహంలో ఏ భావమూ లేదు. వేళ్ళమధ్య పేపర్ వెయిట్‌ని తిప్పుతూ మౌనంగా వుండిపోయాడు. మనసులో ఆలోచనలు మాత్రం సముద్రంలో అలల్లా లేస్తున్నాయి. అతడి కళ్ళముందు ఓ దృశ్యం కనబడుతూంది.

అటాప్సీ టేబుల్‌మీద పాప.... నిస్తేజంగా, అచేతనంగా..... ప్రాణంలేని పాప శరీరం.... నిర్వేదంగా, నిరాసక్తంగా, చావుకి కారణం కనుక్కోవటం కోసం డాక్టర్లు ఆ శరీరాన్ని ఛిద్రం చేస్తారు. కడుపులోంచి పేగులు తీసి చూస్తారు. మెదని చెవుల వెనుకనుంచి కోసి మెదడును పరీక్ష చేస్తారు. .....శరీరాన్ని ఛిన్నాభిన్నం చేస్తారు.

ఒకప్పుడు ఆడుతూ పాడుతూ తిరిగిన పాప పోర్టికోలో కారు ఆగగానే పరిగెత్తుకుంటూ వచ్చి 'గుడ్‌మార్నింగ్ అంకుల్' అంటూ చెయ్యి పట్టుకొని లోపలికి తీసికెళ్ళే పాప, చేస్తున్న స్కిప్పింగ్ ఆపి తాడు తన చేతికిస్తూ "నువ్వూ చెయ్యి అంకుల్! వళ్ళు తగ్గుతుంది" అంటూ నవ్వే పాప.

ఆ శవం అటాప్సీ టేబిల్‌మీద. కృశించిన మాంసం తొలగించబడి, నరాలు ఛేదించబడి.... తెల్లటి వెన్నుముకలో దోషం వుందా? ఎర్రటి మెదడులో దోషం వుందా? అని శోధించే పేథాలజిస్టుల పదునైన కత్తుల ఎరకు గురవుతూ పాప.

అంతకుముందు నాలుగ్గంటల క్రితంవరకూ ఆ చిన్ని శరీరంలో కొట్టుకొని కొట్టుకొని బైటకొచ్చిన ప్రాణం- ఆ గదిలోనే పరిభ్రమిస్తూ తమను చూసి నవ్వుకొంటుందా? నవ్వుకొని అనుకొంటుందా- 'ఓ పిచ్చి డాక్టర్లారా- బ్రతికినప్పుడు నా రోగమేదో మీరు కనుక్కోలేకపోయారు. ఇప్పుడు నా లేత శరీరాన్ని రంపాలతో కోసి ఏం చేసుకుంటార్రా' అని వెక్కిరిస్తుందా....? అతడి చేతిలో పేపర్‌వెయిట్ బలంగా నలుగుతూంది.

తన ఫీలింగ్స్‌ని కంట్రోల్ చేసుకోవడానికి అతడు చాలా ప్రయత్నం చేశాడు.

"డాక్టర్" జేమ్స్ అన్నాడు. పార్థసారధి తలెత్తి చూశాడు.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్ అండ్...." ఆగాడు. "అయామ్ సారీ!"

అప్పుడు చూసుకొన్నాడు అతడు ఎడమ బుగ్గమీదికి జారిన కన్నీటి చుక్కని.

* * *

'పగ తీర్చుకొంటానని' అనుకొన్నాడేగానీ- ఎలా తీర్చుకోవాలో అతడికి తెలియలేదు. అతడు బలహీనుడు, పైగా మూగవాడు.

అనిత చావుకి కారణం పైడితల్లే అని ఎవరికీ చెప్పలేదు నారాయణరావు.

తన వ్యథలలో వుంటూనే- అనిత మరణం పోలీసుల వరకూ వెళ్ళకుండా చెయ్యటం కోసం శ్రీధర్ కష్టపడవలసి వచ్చింది. ఈ సమయంలో మళ్ళీ దాన్ని పైకి తోడటం అనవసరం అనుకొన్నాడు నారాయణరావు.

పైడితల్లి ఏ ట్రిక్ ద్వారా అనితని మోసం చేశాడు అన్నది నారాయణరావుకి అనవసరం. అప్రస్తుతం. అతడివల్లే ఆమె మోసపోయినట్టు ఋజువైంది చాలు.

దీనికి పగ తీర్చుకోవాలి. అది అంత కష్టమైన పనేమీ కాదు.

చీకట్లో పొంచివుండి, అతడు రాగానే కత్తితో రెండు మూడు పోట్లు పొడిస్తే సరి– మారుమాట లేకుండా చనిపోతాడు.

కానీ అతడు అంత సులభంగా చావటం యిష్టంలేదు. భయంతో కుళ్ళి కుళ్ళి చావాలి. అనిత తాలూకు స్మృతులు వెంటాడాలి. అప్పుడు చంపాలి.

పైడితల్లి మరణం తర్వాత పోలీసులు తనని అరెస్ట్ చెయ్యొచ్చు. తనకి ఉరిశిక్ష పడవచ్చు. చావుని నవ్వుతూ ఆహ్వానిస్తాడు తను. తను ప్రేమించిన యువతి చావుక్కారణం అయిన వాడిమీద పగతీర్చుకొన్నాక ఛస్తే మాత్రం ఏం?

అయినా మరణం అంటే ఏమిటి? ఇంకో లోకంలో వున్న తన ప్రియురాల్ని కలుసుకోవటమేగా. ఈ లోకంలో 'మాటలురాని కారణంగా' తనని తిరస్కరించిన ప్రియురాలు పై లోకంలోనైనా తనని ప్రేమిస్తుందేమో!

.....మరణానికి తెగించగానే అతడికి అంతులేని ధైర్యం వచ్చింది. ఇప్పుడు అతని ఆశయం ఒకటే. పైడితల్లిని చంపటం. దానికి ముందు అతడిని భయకంపితుణ్ని చేయటం. తన ఆలోచనలని అమలు పెట్టటానికి అతను ప్లాన్ వేయసాగాడు. చాలా చిన్న ప్లాన్ అది.

* * *

డాక్టర్లమీదా, ఇంగ్లీషు వైద్యం మీదా రామయ్యకి నమ్మకం లేదు. అతడు పాతకాలంవాడు, చిట్కాలని నమ్మినవాడు. అందులోనూ అంతకు ముందు అతడి నమ్మకం నిజమయింది. కానీ రెండోసారి పాపకి చేతబడి కాదు. అది ఇస్మాయిల్ నిర్ణయించటంతో ఏమీ తోచని పరిస్థితిలో పడ్డాడు.

'మొదటిసారి చేతబడి కాబట్టి రెండోసారి 'దెయ్యం' పట్టి వుంటుంది' అనుకొన్నాడు.

శారద దగ్గిరకెళ్ళి చేతులు నులుముకొంటూ తన అభిప్రాయం చెప్పాడు. ఆమె మాట్లాడలేదు. మాట్లాడటం దాదాపు మానేసి చాలాకాలం అయింది. పాప పక్కన కూర్చొని మౌనంగా సపర్యలు చెయ్యటం తప్ప ఇంకేమీ చెయ్యటంలేదు.

అది పద్దెనిమిదో రోజు. తుఫాను రాబోయేముందు ప్రశాంతతలా వుంది అక్కడ పరిస్థితి. శారద మనసు బండబారిపోయింది.

పాప రోజురోజుకీ మరణానికి దగ్గిరగా వెళ్ళటం స్పష్టంగా తెలిసిన తర్వాత ఆమె ఏడవటం మానేసింది. నిర్లిప్తంగా జరుగుతున్నది చూస్తోంది.

అందరూ నిద్రపోయాక ఆ నిశ్శబ్దపు అర్ధరాత్రి మౌనంగా చేతులు జోడించి ఆమె మనసులో దేవుణ్ని ప్రార్థిస్తూ వుంటుంది. "భగవంతుడా! ఈ చిన్నారి పాపని ఇంతగా బాధపెట్టకు. నీ కంతగా కావాలంటే తొందరగా నీ దగ్గరికి తీసుకెళ్ళిపో! ఇలా నరకయాతన మాత్రం పెట్టకు".

కన్నతల్లే అలా కోరుకున్నదీ అంటే ఎంత బాధని పాప కళ్ళల్లో చూస్తున్నదీ వూహించుకోవచ్చు. ఆ దీపం ఆరిపోతే ఆ యింట్లో శాశ్వతంగా అలుముకొనే చీకటి గురించి ఆ క్షణం ఆమె వూహించటం లేదు. ఆ చీకటి శాశ్వతం అని ఆమెకి తెలుసు. ఆ భవంతిలో ఇక ఏ చిన్నారి పాప కేరింతలూ వినబడవు. ఏ పాప చిలిపిచేష్టలూ కనబడవు.

అయినా పాప నిశ్చలంగా, ఆర్ద్రంగా భరిస్తున్న యీ బాధకన్నా శాశ్వత విముక్తే వాంఛనీయం. ఎంత బాధ!

ఒక క్షణం బాగానే వుంటుంది. మరుక్షణం బాధతో విలవిల్లాడి పోతుంది. ఎవరో ఛళ్ళున కొట్టినట్టు అమ్మా అని అరుస్తూంది దిక్కులు కదిలేలా. మీద కాళ్ళేసి తొక్కినట్టు మెలికలు తిరిగిపోతుంది. ఏం తాగించినా వెంటనే కక్కుకుంటుంది. తలదిండులో మొహం దూర్చి బాధని పళ్ళబిగువున అదిమిపెట్టి వెక్కి వెక్కి ఏడుస్తూంది. చూస్తున్నవాళ్ళు ప్రేక్షకులు అవుతారే తప్ప ఏమీ చెయ్యలేరు.

పాప స్వభావం చిన్నతనం నుంచీ అంతే! ఎక్కువ మాట్లాడదు. తన పనేదో తను చేసుకుపోతుంది. నిశ్శబ్దంగా టైం ప్రకారం. చిన్నప్పుడు కూడా ఉయ్యాలలోంచి ఎక్కువ ఏడుపు వినిపించేదికాదు. తల్లికి తెలుసు, ఎంతో బాధ శరీరంలో నరాల్ని మెలితిప్పితే తప్ప ఇంత బాధని ప్రకటితం చెయ్యదని.

ఇప్పుడు ఆమెకి స్పష్టంగా తెలుస్తూంది. ....పాప మరణం తథ్యమని!

ఆమె ఆలోచనలలో వుండగానే రామయ్య వచ్చి తన అనుమానం చెప్పాడు. ఆమె అవుననలేదు, కాదనలేదు. మౌనాన్ని అంగీకారంగా తీసుకొని అతడు వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం తీసుకొచ్చాడు. వచ్చినవాడు ఆరడుగుల ఎత్తున్నాడు. నల్లగా, తుమ్మ మొద్దులా వున్నాడు.

అడ్డపంచ కట్టాడు. పైన భుజంమీద తుండు వేసుకొన్నాడు. రాత్రంతా తాగినట్టు కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. రొమ్ముమీద దట్టంగా బూడిద రాసుకొన్నాడు. చెవులకు పోగులు, పూసల దండ, చేతికి కడియాలు, అతడే ఒక దెయ్యంలా

వున్నాడు. రాగానే పాపని చూసి బలంగా శ్వాస వదిలాడు. "దెయ్యమే కన బడుతూందిగా!" అన్నాడు.

దెయ్యం పట్టిందని చెప్పి ఎవర్ని తీసుకెళ్ళినా భూతవైద్యుడు చెప్పే మొదటి మాట ఇది. 'కాదు' అన్నది అతడి నోటివెంట రాదు. ఒక గ్లాసులో నీళ్ళు తెమ్మని చెప్పి మొలలోంచి ఒక పొట్లం తీశాడు. ముసాంబరం పొడి. దాన్ని నీళ్ళలో కలిపి పాపచేత తాగించాడు. నిమిషం తరువాత వాంతయింది.

రామయ్య తల మునకలయ్యే ఆశ్చర్యంతో చూస్తున్నాడు. నోట్లోంచి మాంసం ముక్క పడటం.... ఇంతకన్నా ప్రత్యక్ష తార్కాణం ఏం కావాలి? మంత్రగాడి చేతివేళ్లు మిషన్‌కన్నా వేగంగా కదలటం అతను చూడలేదు.

రామయ్య భక్తిగా "ఎంత తొందరగా బాగుచేస్తావు?" అన్నాడు.

"ఎంత! సాయంత్రానికల్లా వదిలించెయ్యనూ, నాక్కావల్సినవి..." అతను చెప్పటం మొదలుపెట్టాడు. నిమ్మకాయలు, కోడి, పసుపు-కుంకుమ, వగైరా వగైరా.

శారదని అక్కణ్నుంచి వెళ్ళిపొమ్మన్నాడు. ఒక ముంతలో నిప్పువేసి, అందులో ఎండుమిరపకాయలు, మెంతులు పడేశాడు. పాప మంచం క్రింద దాన్ని పెట్టి బైటకొచ్చి తలుపులు వేసేశాడు.

"ఏమిటది?" రామయ్య అడిగాడు గది బయట.

"ముంతపొగ" అన్నాడు భూతవైద్యుడు. "వంట్లో వున్న దెయ్యం బుర్రలోకి వస్తుంది. అదిగో విను" అన్నాడు.

లోపల దృశ్యం చాలా హృదయవిదారకంగా వుంది. మిరపకాయలు నిప్పులో చిటపటమంటూ పేలుతున్నాయి. కిటికీలూ, తలుపులూ వేసి వుండటంవల్ల ఘాటు గదిలో మరింత ఎక్కువైంది. పక్కమీద పాప ఎగిరిపడుతూంది, ఏడుస్తూంది.

పొగ.... కళ్ళల్లోకి, ముక్కులోకి పొగ వెళ్ళి, ఉక్కిరిబిక్కిరి చేస్తూంది. అందులోనూ మిరపకాయల ఘాటు, తల అటూ ఇటూ విదిలిస్తూ జాలిగా 'అమ్మా' అమ్మా' అని అరవసాగింది. బలహీనమైన ఆ కంఠం నుంచి మాట నీరసంగా వస్తూంది. అంత నీరసంలోనూ ఘాటుకి తట్టుకోలేక పక్కమీద నుంచి క్రిందికి పొర్లటానికి ప్రయత్నం చేసింది. కాళ్ళు గిలగిలా కొట్టుకుంది. ఉక్కిరిబిక్కిరి చేసేలా దగ్గు వస్తూంది.

బయట వైద్యుడు నిర్వికారంగా- ఇదంతా సామాన్యమే అన్నట్టు తన పని చేసుకుపోతున్నాడు. నిప్పులలో వూచ కాలుస్తున్నాడు. దెయ్యం ఒకచోటికి చేరుకున్న

తరువాత పొత్తికడుపు మీద వాతలు పెడతాడన్న మాట! ఎర్రగా కాలిన వూచతో వాతలు పెడితే ఆ బాధ భరించలేక దెయ్యం పారిపోతుంది.

బాధ భరించలేక ప్రాణం కూడా పోతుంది. చెట్టుకి కట్టినవాణ్ని వేపమండలతో కొట్టి కొట్టి చంపి దెయ్యాన్నీ, ప్రాణాన్నీ ఒకేసారి పారద్రోలేవాళ్ళు ఇప్పటికీ మన పల్లెలలో వున్నారు. ఆ తంతునంతా కళ్ళప్పగించి చూసే మూర్ఖులైన గ్రామీణులు కూడా వున్నారు. బండి చక్రానికి చేతులు విరిచికట్టి ఇరుసుమీద గిర్రున తిప్పటం ద్వారా నోట్లోంచి దెయ్యం పారిపోతుందని ఇప్పటికీ కొందరు నమ్ముతారు.

కానీ ఒకటి మాత్రం నిజం.

దెయ్యాన్ని వదిలించటం కోసం మనిషిని యింత బాధ పెట్టవలసి వస్తే- అంతకన్నా ఆ మనిషిని చంపెయ్యటమే నయం.

"చేతబడి జరిగిన మనిషిని బండి చక్రానికి గుచ్చి తిప్పటం ద్వారా దెయ్యం పారిపోతుందని ఇప్పటికీ కొందరు నమ్ముతారు".

ఏమి బాధ! పాప కళ్ళనిండా నీళ్ళతో, ముక్కునిండా నీళ్ళతో పేగులు తెగిపోయేలా దగ్గుతోంది. అంతకుముందే చాలా రోజుల్నుంచీ సరి అయిన ఆహారం లేకపోవటంవల్ల వచ్చిన నీరసంతో మరింత అలసిపోయింది. కేక పెట్టటానికి కూడా ఓపికలేదు. కానీ ఘాటు గొంతులో సుడులు తిరుగుతూంది.

వైద్యుడు తలుపు తెరిచేసరికి పాప నేలమీద స్పృహతప్పి పడివుంది. పక్కమీద కొట్టుకొని కొట్టుకొని క్రిందపడి నట్టుంది. ఆ గది తలుపులు తెరవగానే వచ్చిన ఘాటుకి రామయ్యే తట్టుకోలేకపోయాడు.

పాపని సరిగ్గా పడుకోబెట్టాడు. వైద్యుడు పదహారు నిమ్మకాయలు కోసి పడేశాడు. మెడ తెగిన కోడి గిలగిలా కొట్టుకొంటూంది. గదంతా రక్తం చిమ్మింది. గుడ్డచుట్టిన చేతితో ఊచని నిప్పులలోంచి తీశాడు.

పెదవులతో ఏదో మంత్రం ఉచ్చరిస్తూ ఆమె లేత చర్మంమీద ఎర్రటి ఊచతో వాత పెట్టబోయాడు.

అదే సమయానికి వెనుక తలుపు తెరుచుకుంది.

వెనుకనుంచి వచ్చిన శ్రీధర్ విసురుగా దాన్ని లాగెయ్యకపోతే అంతపనీ జరిగేదే. శ్రీధర్ చేతులు కాలినాయి. అయినా దాన్ని పట్టించుకోకుండా "గెట వుట్" అని అరిచాడు. "....ఇడియట్...."

సాధారణంగా కోపం రాని అతడు, ఆ క్షణం ఉద్రేకంతో వూగిపోతూ కనిపించాడు. మొహం ఎర్రగా కందిపోయింది. ఆవేశంతో పెదవులు అదరసాగాయి.

అతికష్టంమీద తనని తాను సంబాళించుకున్నాడు కానీ లేకపోతే అక్కడి కోడి రక్తంతో మంత్రగాడి రక్తం కలవాల్సిందే.

"వెళ్ళు.... నేను ఏమీ చెయ్యకముందే ఇక్కడ్నుంచి వెళ్ళు" బైటకి దారి చూపిస్తూ అరిచాడు మళ్ళీ. ఎంతోమంది దెయ్యంపట్టిన వాళ్ళని చూసిన వైద్యుడు కూడా ఆ క్షణం శ్రీధర్ ఆకారం చూసి భయపడ్డాడు. తన మూట సర్దుకొని బైటకు నడిచాడు.

అతడు వెళ్ళిపోయిన తర్వాత శ్రీధర్ చుట్టూ చూశాడు. వెదజల్లబడిన పసుపూ-కుంకుమ.... సగానికోసిన నిమ్మకాయలు.... మెడ తెగిన కోడి... పక్కనే చేతులు కట్టుకొని బిక్కుబిక్కుమంటూ చూస్తున్న రామయ్య. అతడి దృష్టి రామయ్య మీద నిలిచింది.

అతడు సన్నగా వణుకుతున్నాడు. గదిలో భయంకరమైన నిశ్శబ్దం తాండవిస్తూంది.

శ్రీధర్‌కి జాలేసింది. తనమీద, శారదమీద, రామయ్యమీద, అందరి మీదా. ఎవరికి తోచినట్టు వాళ్ళు ప్రయత్నం చేస్తున్నారు. రామయ్య తన పరిధిలో తను చేయగలిగింది చేస్తున్నాడు. ఆ అజ్ఞానాన్ని తొలగిస్తే- తన పాప పట్ల అతడు పెంచుకున్న ఆప్యాయత కనబడటంలేదూ....

ఈ ఆలోచన వచ్చాక శ్రీధర్ మొహం మామూలుగా మారిపోయింది. అతడి దగ్గరగా వెళ్ళి భుజంమీద చెయ్యి వేశాడు. "వెళ్ళు" అన్నాడు. రామయ్య అర్థంకానట్టు చూశాడు. శ్రీధర్ దాన్ని పట్టించుకోకుండా పాప దగ్గరికి నడిచాడు. పాప చెంపలమీద కన్నీటి చారలు కట్టినాయి. అప్పుడే స్పృహ వచ్చినట్టుంది. చేతులు చాస్తూ "నాన్నా" అంది బేలగా, ఆర్తిగా. ఇంతవరకూ తననుభవించిన బాధని అర్థం చేసుకోగలిగేది అతనొక్కడే అన్నట్టుగా.

అది పద్దెనిమిదో రోజు సాయంత్రం.

*　　　*　　　*

ఇంకా రెండు రోజులు.

అంతే....

కాద్రా తన పని తాను చేసుకుపోతున్నాడు స్మశానంలో.

అతడు తయారుచేసిన బొమ్మ- పద్దెనిమిది రోజుల క్రితం కొత్తగా వుండేది- దాదాపు శిథిలావస్థలో వుంది ఇప్పుడు.

ఇక్కడ పాప కూడా అలాగే వుంది.

స్వామి అటు కాద్రానీ- ఇటు పైడితల్లి వాళ్ళనీ ప్రతిరోజు 'కాంటాక్ట్' చేసి, అంతా సవ్యంగా జరుగుతున్నందుకు సంతృప్తి చెందుతున్నాడు.

డాక్టర్ పార్థసారథి మెడికల్ జర్నల్స్ అన్నీ తిరగేస్తున్నాడు. ఈ కేసునెలా సాధించాలని రాత్రింబవళ్ళు ఆలోచిస్తున్నాడు. తోటి డాక్టర్లని కన్సల్ట్ చేస్తున్నాడు. ఫలితం కనబడటంలేదు.

లాయర్ విద్యాపతి కూడా ఆందోళనగానే వున్నాడు. ఇంకో రెండు నెలలు పోతేగానీ పాపకు ఆస్తి అనుభవించే హక్కు రాదు. అయితే అతడి అనుమానం శ్రీకృష్ణ అనాథ బాలికల ఆశ్రమంవైపు పోలేదు. రోజురోజుకీ కృశించిపోతున్న పాపకీ, అక్కడెక్కడో వున్న ఆశ్రమానికి సంబంధం ఏమిటి అనుకొన్నాడు.

పాపని రోజూ చూస్తున్నా అబ్రకదబ్రకి కూడా ఇది క్షుద్రవిద్యలకి సంబంధించిన వ్యాధి అన్న అనుమానమే రాలేదు. ప్రతిరోజూ వస్తున్నాడు. శ్రీధర్ కుటుంబంతో కూర్చుంటున్నాడు. పాపని పరామర్శిస్తున్నాడు, వెళుతున్నాడు.

అబ్రకదబ్రకి పిల్లలంటే చాలా యిష్టం. తను చేసే చిన్న చిన్న మ్యాజిక్‌లను కళ్ళప్పగించి చూసి, పూర్తవగానే ఆనందంతో చప్పట్లు కొట్టే చిన్న చిన్న పాపలు అతడి నిజమైన ప్రేక్షకులు. పిల్లలతో వయసు మర్చిపోయి కలిసిపోవడం అతడికి ఇష్టం. తులసి అంటే అతడికి మరీ ఇష్టం.

15

అది పద్దెనిమిదో రోజు. తులసి 'కోమా'లోకి వెళ్ళిపోవటానికి ఇంకొక్కరోజే వుంది.

సాయంత్రం ఆరింటికి శ్రీధర్ ఇంటికి వెళ్ళేసరికి డాక్టర్ పార్థసారథి కూడా అక్కడే వున్నాడు. గొట్టంలాంటి సూదిలో ఇంట్రావీనస్ ఇంజక్షన్ యిస్తున్నాడు.

అబ్రకదబ్ర పాపవైపు జాలిగా చూశాడు. 'అదృష్టవశాత్తూ ఈ పాప బ్రతికినా ఏమీ లాభం వుండదు. ఈ డాక్టర్లు పొడిచిన సూది మందులతో రెండు చేతులూ చచ్చుబడిపోతాయి' అనుకున్నాడు. ఆ మాట నిజమే, ఆమె భుజాలూ- నడుమూ ఇంజక్షన్లతో తూట్లు పడ్డాయి.

హాస్పిటలూ, ఇల్లూ మధ్య పాప బంతిలా తిరుగుతూంది.

ఆ రోజు మళ్ళీ హాస్పిటల్లో జాయిన్ చేస్తే బావుంటుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు డాక్టర్ పార్థసారథి.

శ్రీధర్ మాట్లాడలేదు. తల పంకించి వూరుకొన్నాడు.

"వద్దు" అంది శారద. చాలా రోజుల తర్వాత ఆమె మాట్లాడింది. పార్థసారథి తలెత్తి ఆశ్చర్యంగా చూశాడు ఆమెవైపు. తన భావాల్ని కంట్రోల్ చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఆమె నెమ్మదిగా కానీ స్ఫుటంగా అన్నది. "ఏం చేస్తారు డాక్టర్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి? మరిన్ని సూదులతో పొడుస్తారు, మరింత బాధ పెడతారు- వెన్నెముకలోంచి నీరు లాగుతారు. ముక్కులో గొట్టాలు దూరుస్తారు. చిత్ర....హిం...స పెడతారు" ఆమె కంఠం దుఃఖంతో వణికింది. "ఆ..... అంతేగా" అంది. "ఎర్రగా కాల్చిన ఇనుపవూచతో వాతలు పెట్టే భూతవైద్యుడి మూర్ఖత్వానికి- సూది గుచ్చి రక్తాన్ని బయటికిలాగే మీ మూర్ఖత్వానికి తేడా ఏమీ కనబడటంలేదు నాకు" నవ్వింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు అలానే వున్నాయి. నవ్వుతూనే వుంది. ఏడుస్తూ నవ్వుతూ- నవ్వుతూ ఏడుస్తూ....

శ్రీధర్ ఆశ్చర్యంగా "శారదా!" అన్నాడు. ఎప్పుడూ గాంభీర్యముగా, నెమ్మదిగా వుండే తన భార్య ఇలా మాట్లాడటం - ముఖ్యంగా డాక్టరుతో అలా అనటం అతడికి విస్మయం కలిగించింది. ఆమె దగ్గరగా వెళ్ళబోయాడు.

అప్పటివరకూ అణచి పెట్టుకున్న అగ్నిపర్వతం బ్రద్ధలయింది. హిస్టీరియా వచ్చినదానిలా ఆమె అరిచింది. 'వెళ్ళండి' అని గది గోడల మధ్య ఆమె కంఠం ప్రతిధ్వనించింది. "....పాప చచ్చిపోతూంది. మీరింకేమీ కల్పించుకోకండి. మీకు చేతులెత్తి నమస్కారం చేస్తాను- పాపని యిలా వదిలిపెట్టండి. దాన్ని కనీసం చచ్చిపోయేప్పుడైనా నిశ్చింతగా చచ్చిపోనివ్వండి. సూదులతో గుచ్చీ, రక్తాన్ని పీల్చి దాన్ని మరింత హింసపెట్టకండి". ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ "ఈ నాలుగు రోజులన్నా పాపని నా దగ్గర పడుకోనివ్వండి" అని బావురుమంది.

ఆమె దగ్గిరగా వెళ్ళబోతున్న శ్రీధర్‌ని పార్థసారథి వారించాడు. ముగ్గురూ మౌనంగా బయటకొచ్చారు. 'జరుగుతున్న పరిస్థితులలో ఆమెకి హిస్టీరియా వచ్చినా ఆశ్చర్యం లేదు' అనుకున్నాడు అబ్రకద్రబ.

"రెండు నిమిషాలు ఆమెని అలా వుండనివ్వండి. తరువాత 'కన్సోల్' చేద్దురుగానీ" అని పార్థసారథి అన్నాడు. "ఇంకో రెండుగంటల తర్వాత నేను వస్తాను" అని జరిగిన దాని గురించి చర్చించటం యిష్టం లేనట్టు అతడు కారువైపు నడిచాడు. మరుక్షణం అతడి కారు కదిలింది.

పోర్టికో చుట్టూ మసక చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆ నీరవంలో స్నేహితులిద్దరూ మౌనంగా వుండిపోయారు ఎవరి ఆలోచనలో వాళ్ళు.... ముందు తేరుకున్నది అబ్రకదబ్ర. "నువ్వు లోపలికి వెళ్ళు శ్రీధర్! నేను వెళ్ళొస్తాను" అన్నాడు.

శ్రీధర్ ఏదో నిద్రలోంచి తేరుకున్నవాడిలా తలెత్తి చూసి, నెమ్మదిగా తలూపి లోపలికి వెళ్ళిపోయాడు. అబ్రకదబ్ర చేతులు రెండూ జేబుల్లో పెట్టుకుని మెట్లు దిగాడు. మెట్ల దగ్గర్నించి ప్రహరీ గేటువరకూ సన్నని కాలిబాట వుంది. గడ్డి- చిన్న తుప్పలు, గోడ పక్కనే దారి. అతడి మనసంతా శూన్యంగా వుంది. గోడ పక్కనే తల వంచుకొని నడవసాగాడు. పది అడుగులు వేసి ఆగాడు.

తుప్పల్లో ఒక కాగితం.... సగం కాలినది కనబడ్డది. దాని మీద "డియర్–" అని వుంది.

అతడికొచ్చిన మొదటి అనుమానం.... ఉత్తరాన్ని కాల్చవలసిన అవసరం ఎవరికున్నది? అని. వంగి కాగితం తీసి చూశాడు. చేతులతో పట్టుకున్న వేళ్ళభాగం తప్ప- చాలావరకూ కాలిపోయి వుంది ఉత్తరం. మంచులో తడిసిన అక్షరాలు అలుక్కుపోయి వున్నాయి. ఉన్నంతవరకూ చదివాడు.

"డియర్.... త....

–ఈ....జే బిస్రాపూరు వెళ్ళి అక్కడ కాద్రాని కల్సు....

....అనుకున్నవి అనుకున్నట్టే....

...టెలిగ్రా... ద్రాకి ఇవ్వు..."

అంతే. తర్వాత ఏమీలేదు. కాగితం మూలనుంచీ పూర్తిగా కాలిపోయింది.

అబ్రకదబ్రకి ఏమీ అర్థంకాలేదు. బిస్రా వెళ్ళి కాద్రా అనేది అసలు తెలుగేనా అనుకొన్నాడు.

కాగితాన్ని ఉండచుట్టి పొదల్లోకి విసిరేశాడు.

మామూలుగా మళ్ళీ ఫ్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని తలవంచుకుని బయటికి నడిచాడు.

* * *

అదే సమయానికి లాయర్ విద్యాపతి తన కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చొని పుస్తకాలు తిరగేస్తున్నాడు. ఇంటి ఔట్‌హౌస్‌నే అతడు తన స్టడీరూమ్‌గా మార్చుకున్నాడు.

విద్యాపతికి తండ్రి యిచ్చిన ఆస్తి ఏమీలేదు. చిన్నతనం నుంచీ కష్టపడి చదివి పైకి వచ్చాడు. ప్రాక్టీసు పెట్టిన మొదటి రెండు సంవత్సరాలూ అంత బాగా లేదుగానీ, ఒకరోజు అతడు కోర్టులో వాదిస్తూంటే రాబర్ట్ చూసి అతడిలోని చురుకుని గుర్తించాడు. ఆ తర్వాత అతడు జె అండ్ జెకి కన్సల్టెంట్‌గా నియమింపబడ్డాడు. దాంతో అతడి స్థితి మారింది. అయిదు సంవత్సరాలు తిరిగేసరికల్లా మంచి లాయరని పేరు తెచ్చుకున్నాడు.

అతడు మంచి స్థితిలోకి వచ్చాక కూడా తన పూర్వపు జీవితం గురించి మర్చిపోలేదు. బీదవాళ్ళకి, కష్టపడి చదువుకునే అనాధలకీ చేతనైన సాయం చేస్తూనే వున్నాడు.

శ్రీధర్‌తో అతడి పరిచయం ఈనాటిది కాదు. శ్రీధర్ కూడా అతడిలాగా చిన్నప్పటినుంచీ కష్టపడి వచ్చినవాడు. 'జె అండ్ జె' డైరెక్టరయినా ఆ గర్వం లేకపోవటం విద్యాపతిని అతడి దగ్గరికి చేర్చింది. ఇప్పుడు శ్రీధర్ కుటుంబానికి వచ్చిన కష్టంపట్ల వ్యధచెందుతున్న వాళ్ళలో అతడు ఒకడు.

అతడు తన కన్సల్టింగ్ రూమ్‌లో కూర్చొని కేస్‌లాస్ చదువుతూండగా బోయ్‌వచ్చి, అతడికోసం ఎవరో వచ్చారని చెప్పాడు.

"క్లయింటా?" అడిగాడు.

"ఒకావిడ సర్".

"రమ్మను".

రెండు నిమిషాల తర్వాత ఒకామె వచ్చింది. నలభై అయిదేళ్ళుంటాయి. విధవరాలు- వచ్చి నమస్కారం చేసింది.

"కూర్చోండి" అన్నాడు.

"ఫర్వాలేదండి" ఆమె నిలబడే అంది. ఆమె చేతిలో కొన్ని రశీదు పుస్తకాలు ప్లాస్టిక్ సంచీ వున్నాయి. చెప్పండన్నట్టు చూశాడు.

"అనాధ శరణాలయం నుంచి వచ్చాను. మీలాటి దయార్ద్ర హృదయులు కనికరించి సాయం చెయ్యటం వల్లనే దేముడి అదృష్టం నోచుకోని బిడ్డలు...." మామూలు రికార్డే.

"మీ పేరు?"

"మంగమ్మ...."

విద్యాపతి డ్రాయరులోంచి పర్సు తీస్తూ "ఉహూఁ అదికాదు. మీ శరణాలయం పేరు?" అన్నాడు.

"శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయం"

పర్సు తీస్తున్న చెయ్యి సగంలోనే ఆగిపోయింది. **శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయం.** మనసులోనే మళ్ళీ ఒకసారి అనుకున్నాడు. అప్రయత్నంగానే ఆలోచన వచ్చింది. పాప ఇంకో రెండు నెలలలో చచ్చిపోతే వీళ్ళిలా అడుక్కునే పని వుండదు. ఆ విషయమే అడిగాడు. "మీకు శ్రీధర్ తెలుసా? తులసి?- రాబర్ట్...?"

ఆమెకి అర్థంకాలేదు "ఎవరు బాబూ?" అంది.

అతడు పర్సులోంచి డబ్బు తీస్తూ "ఎవరూ లేదులే" అన్నాడు.

ఆమె బల్లమీద రశీదు పుస్తకం పెట్టి వ్రాస్తూ వుంటే అడిగాడు- "ఎంతమంది వున్నారు మీ ఆశ్రమంలో"

"దాదాపు ఎనభైమంది వున్నారు బాబూ!"

"మరి ఫండ్స్ సరిపోతాయా?"

"సరిపోవండీ. అందుకే ఇలా ఇల్లిల్లూ తిరగటం. మీలాంటి ధర్మాత్ములే కరువయ్యారు".

"గవర్నమెంటు సాయం చేయదా?"

"వాళ్ళిచ్చేది ఏ మూలకి బాబూ!"

ఆమె రసీదు చింపి అతనికిచ్చింది. రశీదు పుస్తకం ప్లాస్టిక్ కవర్లో పెట్టుకొంది.

"ఈ ఆశ్రమాన్ని నడుపుతూంది మీరేనా?"

"లేదు బాబూ! నేనాడదాన్ని ఒక్కత్తినీ ఎలా నడపగలను? మా గురువుగారు- స్వామీ చిదానందస్వామి మీకు తెలుసా బాబూ! మఠంలో ప్రతి శనివారం ఉపన్యాసం ఇస్తూ వుంటారు".

అతడికి తెలీదు. తెలుసూ తెలీదు అన్నట్టుగా మధ్యగా తలూపాడు.

"....ఆయనే దీనికి అధికారి. ఆయన విజయనగరం వెళ్ళారు. ఆయనగాక ఇంకా ఇద్దరున్నారు. పైడితల్లి, సరస్వతి అని. ఇద్దరూ ఎక్కడికెళ్ళారో చెప్పకుండా పోయారు. నెలరోజుల వరకూ రారట, ఈ నెలరోజులు నాకీ తిప్పలు తప్పవు".

పైడితల్లి. ఆ పేరు దగ్గర విద్యాపతి ఆలోచనలు ఆగిపోయినయ్. ఎక్కడో విన్నాడా పేరుని. ఎక్కడ? ఎక్కడ?

అతడు తన ఆలోచనల్లో వుండి- ఆమె వెళ్ళిపోవటం గమనించలేదు. అతడు తేరుకొనేసరికి ఆమె లేదక్కడ.

తల విదిలించి ఆలోచనల్ని పారద్రోలుతూ పుస్తకం మీద దృష్టి నిలిపాడు మరునిమిషం చదవటంలో మునిగిపోయాడు– ఆ విషయం మర్చిపోయి.

* * *

కాష్మోరాలో పందొమ్మిదవ రోజు "తాలు కంఠం". ఇరవయ్యవ రోజు పీడనం. ఆ రోజు రోగి కోమాలోకి వెళ్ళిపోతుంది.

ఇరవై రోజులపాటు బాధపడ్డ శరీరం మరణానికి ఆయత్తమవుతూ కోమాలోకి ప్రవేశిస్తుంది. బాధల్నుంచి శాశ్వత విముక్తికై. రోగిని కోమాలోకి ప్రవేశపెట్టటం మంత్రగాడికి అన్నిటిన్నా కష్టమైన పని. ఇరవై ఒక్క రోజుల ఉపాసనలో, ఆ రోజే ఎక్కువ నిష్టతో పూజ చేయాలి.

కాద్రా చేస్తున్నాడు. చంద్రోదయ సమయానికే అతడు స్మశానాన్ని చేరుకున్నాడు.

కాద్రా బాగా శుష్కించిపోయి వున్నాడు. సరయిన తిండీ, నిద్రలేక కృశించి వున్నాడు. మరింత భయంకరంగా కనబడుతున్నాడు. కళ్ళు మరింత ఎర్రబడ్డాయి. మొహం మరింత భయంకరంగా కనబడుతోంది. మొహం మరింత కర్కశంగా మారింది. ఇరవై రోజుల క్షుద్రదేవతోపాసన అతన్ని పీల్చేస్తుంది. అయినా పట్టుదలగా కాష్మోరాని సంతృప్తి పరుస్తున్నాడు.

మంత్రగాళ్ళ జీవితం పూలపాన్పు కాదు.

– అతనింత కష్టపడి వుండేవాడు కాదు. ఇన్ని వందల సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇంత ప్రయత్నంచేసి.... సమాధిలో ఉన్న కాష్మోరాని నిద్రలేపేవాడుకాదు. కేవలం తన అనుచరుణ్ని చంపారనే పగవల్లే యీ మారణహోమానికి పూనుకున్నాడు. ఓ అమాయకమైన పాపని బలిపెడుతున్నాడు. ఇరవై రోజుల పూజ పూర్తిచేశాడు.

ఇరవయ్యవ రోజు! ఈ రోజే అన్నిటికన్నా కష్టతరమైంది. కాష్మోరా దేవత బొమ్మకి కట్టిన బంధనాల్ని విప్పి శాశ్వత విముక్తి కలిగిస్తుంది. ఇక్కడ బంధనలు విప్పబడుతూ వుంటే, అక్కడ పాప బాధలన్నీ తొలగి మరణానికి చివరి ద్వారం అయిన 'కోమా'లోకి వెళ్ళిపోతుంది.

ఆ తర్వాత ఇరవై నాలుగ్గంటలు. అంతే! స్మశానపు నడిబొడ్డు మీద అతడు కూర్చుని వున్నాడు. చుట్టూ చీకటి. ఎప్పుడూ పెద్ద స్వరంతో మంత్రాలు చదువుతూ ఆర్భాటాలు చేసే అతడి గొంతు యీ రోజు మౌనం వహించింది. వెయ్యి సంవత్సరాల తర్వాత కాష్మోరా రాబోతున్నాడు. వచ్చి అతనికి సహకరించబోతున్నాడు.

క్షుద్రదేవతోపాసకులు లెక్కలేనంత మంది వున్నా, నిజాం కాలంలో బాణామతి ప్రయోగించే మంత్రగాళ్ళు ఎంతోమంది వున్నా అంతకుముందు కాలంలో కూడా 'కాష్మోరా' సాధించిన వాళ్ళు చరిత్రలో ఎవరైనా వున్నారని దాఖలాలు లేవు.

ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ.

ఈ 'పూజ'లో ఏమాత్రం కొద్దిగా తేడా వచ్చినా 'తన రక్తం పీల్చెయ్యబడుతుందని' అతడికి తెలుసు. అటో ఇటో తేలవలసిన సమయం వచ్చింది. అర్ధరాత్రి అయ్యింది. పుర్రెలో బొమ్మని వుంచి, మోకాళ్ళమీద కూర్చుని అతడు తదేకంగా దానివైపే చూస్తున్నాడు.

అస్పష్టంగా అతని పెదాలు కదులుతున్నాయి.

ఆ శ్మశానంలో ప్రకృతి కూడా జరగబోయే దారుణం తలుచుకొని భయపడుతున్నట్లు మౌనంగా వుంది. ఒకటి రెండు నిమిషాలు గడిచినయ్.

నిశ్శబ్దాన్ని చెదురుస్తూ ఎక్కడో ఓ గుడ్లగూబ వికృతంగా అరిచింది. దానికి ప్రతిగా తీతువుపిట్ట పలికింది. దూరంగా కపాలం పగిలిన చప్పుడు. ఎవరో వదిలేసి వెళ్ళిన శవం ఇంకా ఆగి ఆగి కాలుతోంది. అతడు వాటిని వేటినీ పట్టించుకోవటంలేదు. ముందు పుర్రెలో ఉన్న బొమ్మని చూస్తున్నాడు. ఇరవైచోట్ల బంధనాలు (కట్లు) వేయబడిన బొమ్మ. ఒక్కో అంగమూ బంధించబడిన బొమ్మ.

సమయం ముందుకు గడుస్తున్న కొద్దీ అతడిలో ఆతృత ఎక్కువ అవుతూంది. దిగులు పెరుగుతూంది. పెదవులు మరింత వేగంగా కదుల్తూ మంత్రాలు చదువుతున్నాయి. దూరంగా ఎక్కడో పన్నెండు గంటలు కొట్టిన చప్పుడు. అప్పటివరకూ ఆవేశంగా ఊగిపోతున్న అతడు చప్పున ఆగిపోయాడు. కళ్ళు పెద్దవి చేసి చీకట్లోకి చీల్చి చూశాడు. పుర్రెలో బొమ్మ కదులుతూంది.

నెమ్మదిగా కదుల్తూంది.

కాష్మోరా వచ్చాడు.

స్వయంగా బంధాలు విప్పి తన నైవేద్యాన్ని (పాపని) భక్షించటానికి కాష్మోరా వచ్చాడు. కాద్రా అటే చూస్తున్నాడు. పుర్రెలో బొమ్మ ఎవరో తోసినట్టు పక్కకి పడింది. మెడకి కట్టిన దారం ముడి దానంతట అదే విడిపోయింది. తర్వాత చేతులకి కట్టింది..... కాళ్ళకి కట్టింది.... వరుసగా ఒక్కొక్కటీ – అయిదు నిమిషాల్లో ఇరవై బంధాలూ విడిపోయాయి. బొమ్మ నిశ్చలమైంది. కాద్రా పెదవుల మీద నవ్వు వెలసింది. అది బిగ్గరగా మారింది. అలలు అలలుగా స్మశానం అంతా వ్యాపించింది. చాలాకాలం తర్వాత నవ్వు!

అక్కడ అదే సమయానికి పాప 'కోమా'లోకి ప్రవేశించింది.

పని పూర్తి చేసుకున్న కాద్రా తన ఆసనం మీదనుంచి లేచాడు. పుర్రెలోంచి బొమ్మని తీశాడు.

మెడ, చేతులూ, కాళ్ళూ, మధ్యభాగం..... ఇలా నాలుగుగా ఆ బొమ్మని విడగొట్టాడు. స్మశానపు నాలుగు దిక్కుల్లో నాలుగు భాగాలూ పాతాడు.

ఆ మరుసటిరోజు ఆ నాలుగు భాగాల్నీ వెలికితీసి హోమంలో వేయటం ద్వారా 'కర్మ' పూర్తవుతుంది. పాప ఆఖరి శ్వాస ఆఖరవుతుంది. కాద్రా పని పూర్తిచేసి ఇంటికొచ్చేసరికి స్వామి ఎదురు చూస్తున్నాడు.

"అంతా అయిపోయింది. ఇక చేయవలసిందల్లా కుంతలాభస్మ నిమజ్జనం. ఇదే సమయానికి అక్కడ అది జరిగి వుండాలి" అన్నాడు కాద్రా.

స్వామి తలూపి, "నిన్నే చెప్పాను. ఈపాటికి సరస్వతి ఆ పని చేస్తూ వుంటాడు" అన్నాడు.

ఇరవై ఒకటో రోజు చేతబడి చేయబడినవాని వెంట్రుకలు ఏడుతీసి స్మశానంలో వాటిని కాల్చి ఆ బూడిదని నల్లపిల్లి రక్తంలో కలపాలి. అదే సమయానికి ఇక్కడ పాప వెంట్రుకల్ని కాలుస్తున్నాడు.

అయితే స్వామి అన్నట్టు ఆ కాలుస్తున్నది సరస్వతి కాదు, పైడితల్లి. అందుక్కారణం తెలుసుకోవాలంటే ఒకరోజు వెనక్కి వెళ్ళాలి.

* * *

ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు రామయ్య. పేరుకి వంటవాడుగానీ, అతడికి ఆ ఇంటితో అంతకన్నా ఎక్కువ సంబంధమే వుంది.

అందుకే పాప అనారోగ్యాన్ని మామూలుగా తీసుకోలేకపోయాడు. మొదటిసారి ఇస్మాయిల్ దగ్గరికి వెళ్ళాడు. రెండోసారి భూతవైద్యుణ్ని తీసుకొచ్చాడు. అయితే అప్పుడతడు శ్రీధర్‌తో తల వాచేటట్లు చివాట్లు తిన్నాడు. దాంతో మరి సాహసం చేయలేకపోయాడు. మళ్ళీ శ్రీధర్ దగ్గరికి వెళ్ళటానికి ధైర్యం లేకపోయింది.

అయినా అతడి మనసు కొట్టుకుంటూనే వుంది. భూతవైద్యుడి విషయంలో మాత్రం తన నిర్ణయం తప్పుకాదు! ఇప్పుడు పాపకి మరో చేతబడా...? లేక మామూలు అనారోగ్యమా? అన్నది వేరే సంగతి..... ఒకప్పుడు పాపకి చేతబడి జరిగింది అన్న సంగతి మాత్రం తన ఇంటి యజమానికి తెలియాలి. 'తెలిస్తే ఏం లాభం?' అని అతడు ఆలోచించడం లేదు. తెలియాలి-అంతే!

ఆ విషయం చెప్పటం కోసం అతడు రెండు మూడుసార్లు శ్రీధర్ గదివరకూ వెళ్ళాడు. కానీ లోపలికి వెళ్ళడానికి ధైర్యం లేక తిరిగి వచ్చేశాడు.

భూతవైద్యుడి సంఘటన అతడి ధైర్యాన్ని పూర్తిగా దిగజార్చింది.

మూడోసారి అతడు మళ్ళీ వెళ్ళినప్పుడు బైట అలికిడికి శ్రీధర్ "ఎవరదీ?" అన్నాడు.

"క్రిందికి వెళ్ళిపోదామా" అనుకున్నాడు రామయ్య. క్షణం తటపటాయించాడు. శ్రీధర్ మళ్ళీ పిలవడంతో ధైర్యం తెచ్చుకొని లోనికే ప్రవేశించాడు. ఏమిటన్నట్టు చూశాడు శ్రీధర్. అతడికి నోరు పెకలలేదు. అసలు చెప్పదల్చుకున్నది ఎలా మొదలుపెట్టాలో కూడా తెలీదు. చేతులు నులుముకుంటూ నిలబడ్డాడు.

మూర్తీభవించిన విషాదంతో నిలబడ్డ ఆ యాభై ఏళ్ళ వృద్ధుణ్ని చూస్తుంటే శ్రీధర్‌కే జాలేసింది. "మొన్నటి విషయం గురించేనా? ఫర్లేదులే" అన్నాడు. అతడొచ్చింది భూతవైద్యుడి విషయమై వుంటుందన్న ఉద్దేశ్యంతో.

రామయ్య ఇంకా అలానే నిలబడి వుండటం చూసి "ఇంకేమిటి?" అన్నాడు.

చెప్పబోయి ఆగాడు. యజమాని గాంభీర్యత చూస్తూంటే అతనికి మాట రావటంలేదు. అతడి తటపటాయింపు చూసి ముఖంలోకి నవ్వు తెచ్చుకున్నాడు శ్రీధర్. "ఏమిటి చెప్పు?" అన్నాడు మార్దవంగా. అతడి ప్రోత్సాహానికి తగిన ఫలితం లభించింది.

రామయ్య చెప్పటం ప్రారంభించాడు. పాప గోళ్ళు సరస్వతి కత్తిరించడం గురించీ, ఆ తర్వాత అనుమానం గురించీ, ఇస్మాయిల్ దగ్గరికి వెళ్ళటం గురించీ, ఆ తర్వాత నాల్గురోజుల్లో పాప మళ్ళీ మామూలుగా మారటాన్ని వివరించాడు. మళ్ళీ అంతలోనే ఈ ఉపద్రవం వచ్చిందంటే- దానిక్కారణం ఆ దుర్మార్గులు మళ్ళీ ఏదో చేసి వుంటారని నొక్కి చెప్పాడు. శ్రీధర్ అతడు చెప్పిందంతా విన్నాడు. అతడి మొహంలో ఏ భావమూ లేదు. ఆ వృద్ధుడు చెప్పటం పూర్తిచేశాడు. శ్రీధర్ కొంచెంసేపు మాట్లాడలేదు. తర్వాత తనవైపే ఆతృతగా చూస్తూ నిలబడ్డ అతడివైపు సూటిగా చూశాడు.

"చేతబడి అంటే?"

రామయ్య ఈ ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు. తన యజమాని ఈ ప్రశ్న తెలియక అడుగుతున్నాడో, తెలిసి అడుగుతున్నాడో అర్థంగాక తటపటాయించాడు.

మళ్ళీ శ్రీధర్ అన్నాడు. "అక్కడెక్కడో చేతబడి చేస్తే ఇక్కడ యిలా జరిగిందంటావా? పోనీ జరిగిందే అనుకో- మరి నువ్వు, 'తిరుగు' ఏమిటటా

పదం? ఆc.... 'తిరుగుబడి' తిరుగుబడి చేయించావుగదా, దాంతో అంతా సర్దుకోవాలిగదా. నీవు చెప్పిన దానిలోనే ఎన్ని 'లొసుగులు' కనబడుతున్నాయో చూడు. నువ్వే అన్నావు, తిరుగుబడి చేయిస్తే చేతబడి చేయించినవాడు చచ్చిపోతాడు అని! మరి ఆ సరస్వతి? పాప గోళ్ళు పెరిగాయి. పాపం... తీసిననాడు వెంటనే చావాలి. చచ్చిపోలేదు కదామరి... ఇంకో విషయం! ఆ ఇస్మాయిల్ తిరుగుబడి చేయగానే పాప బాగవ్వాలి కదా? అవలేదేం...? ఆ సంగతి నువ్వు చెప్పావు, చేతబడిలో ఏదో ఒక అంగం కృశించిపోతుందని, ఇక్కడ అలా జరగటం లేదుగా?" అతడు లేచి దగ్గరగా వచ్చి అన్నాడు "రామయ్యా! నీకు బాగా తెలియని విషయాల్ని నువ్వు ప్రచారం చెయ్యకు. సైన్స్ యింత డెవలప్ అయిన రోజుల్లో కూడా నీలాంటి వాళ్ళుండబట్టే వీటికి యింత ప్రచారం జరుగుతూంది. నీకు పాప మీదున్న ప్రేమ ఎంత బలీయమైనదో నాకు తెలుసు. మన ఆత్మీయులకి కొంచెం ఉపద్రవం వాటిల్లగానే మన మనసు పరిపరివిధాల అపసవ్యంగా ఆలోచిస్తుంది. ఇందులో నేను నిన్నేమీ తప్పు పట్టటంలేదు. నేను కోరుకునేదల్లా ఒకటే- నీ అజ్ఞానంతో దెయ్యాలూ అవీ అని చెప్పి యీ ఇంట్లో వాళ్ళని భయపెట్టకు, పాపని వేపమండలతో కొట్టించి బాధపెట్టకు. ఇక నువ్వెళ్ళొచ్చు".

మసక చీకట్లో అస్పష్టంగా కనబడుతూన్న యజమాని ముఖంలోకి సూటిగా చూసే ధైర్యం లేక అతడు తలవంచుకొని ఆ గదిలోంచి బైటకు వచ్చాడు.

16

జీవితంలో కొన్ని సంఘటనలు అకస్మాత్తుగా జరుగుతాయి. కొన్ని పరిచయాలూ, కొన్ని విడిపోవటాలూ, అనుకోని సంఘటనలూ అన్నీ ఇలాటి కోవలోకి చెందినవే. జీవితాన్ని మార్చే సంఘటన ఒక క్షణం ఆలస్యమయితే సంభవించకపోయి వుండొచ్చు. కెన్నడీని చంపిన రివాల్వరు ఒక అంగుళం పక్కకి తప్పుకొని వుండివుంటే అమెరికా చరిత్ర ఇంకోలా వుండి వుండేది.

ఇలాంటి సంఘటనలే శారద జీవితంలో జరిగి, మంత్రాలు, చేతబడి లాటివి అభూతకల్పనలనీ, కొంతవరకు వాటి వెనుక సైన్సు (కొంతవరకూ మాత్రమే!) వున్నదని ఓ నిర్ణయానికి వచ్చేటట్టు చేసింది.

పంతొమ్మిదోరోజు – ఆ రోజు పాపని ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకురావడానికి నిర్ణయం జరిగింది. హార్లిక్స్ బాటిలూ, మిగతా బట్టలూ సర్దుకుంటూంటే బైట కలకలం వినిపించి ఆమె బైటకొచ్చి చూసింది. ఆమె కొంచెం రిలాక్స్‌డ్‌గా వుంది. కాష్మోరాలో పంతొమ్మిదోరోజు వచ్చే వ్యాధి అంత అపారమయినది కాదు....! తుఫాను వచ్చేముందు ప్రశాంతతలా.

వరండాలో ఒక పేషెంటుని తీసుకొస్తున్నారు. అయితే.... ఆ పేషెంటు గమ్మత్తుగా వున్నాడు. గాలిలో ఈతకొడుతున్నాడు. ఊపిరి పీల్చుకోడానికి నానాయాతన పడుతున్నాడు. నడి సముద్రంలో మునిగిపోతున్న వాడిలా ఈతకొడుతున్నాడు.

ఈ కేసుకి కూడా డాక్టరు పార్థసారథే అటెండ్ అయ్యాడు. అతడేదో ఇంజెక్షన్ యివ్వగానే పేషెంటు నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు. అయితే నిద్రలోనే ఎగిరెగిరి పడుతున్నాడు.

శారద గమనిస్తూంది పేషెంటుని కాదు- పేషెంటు పక్కనే పాలిపోయిన మొహంతో నిలబడ్డ ఇరవై ఏళ్ళ కుర్రవాణ్ణి. అందరూ పేషెంటుని చూసి కంగారుపడుతుంటే, ఆ కుర్రవాడు మాత్రం బిక్క మొహం వేసుకుని ఒక మూలగా నిలబడటమే కాక – నుదురు కొట్టుకుంటూ తనలో తానే 'ఇదంతా నా వల్లే – నేనే చేసింది' అని అనుకోవటం విన్నది. ఆమె అది హిస్టీరియా అని అనుకుంటున్నది మరి అతడు చేసిందేమిటో ఆమెకి అర్థంకాలేదు.

నిద్రలో పేషెంటు కొంచెం స్థిమితపడ్డాక, అతడు ఎవరికో ఫోన్ చేయటం గమనించింది ఆమె. ఇంతలో కారు తీసుకుని శ్రీధర్ వచ్చాడు. వాళ్ళు వెళ్ళటానికి ఆయత్తమవుతూండగా పేషెంటు నిద్రలోంచి లేచాడు. అతడూ యువకుడే! స్టూడెంట్‌లా వున్నాడు. నిద్రలోంచి లేవగానే మళ్ళీ ఎగిరెగిరి పడటం ప్రారంభించాడు.

కుర్రవాడు కంగారుపడుతూ డ్యూటీలో వున్న నర్సు కోసం చూసి ఆమెని డాక్టరు కోసం పంపిచాడు. ఇంతలో వరండాలో ఒక పొడవాటి విగ్రహంలా వున్న మనిషి రావటం కనిపించింది. అతడిని చూసి కుర్రవాడి మొహంలో అప్పటివరకు వున్న ఛాయలు తొలగిపోయాయి. ఒక్కసారి తేలిగ్గా శ్వాస పీల్చుకున్నాడు. ఆ పొడవాటి వ్యక్తి చెయ్యి పట్టుకొని ఓ మూలకి తీసుకెళ్ళి రహస్యంగా ఏదో చెప్పటం శారద గమనించింది. అతడు తల పంకించి పేషెంటు దగ్గరికొచ్చాడు. ఈ లోపులో డాక్టర్ పార్థసారధి కూడా వచ్చాడు. పొడవాటి మనిషి డాక్టరుతో ఏదో మాట్లాడటం,

డాక్టర్ తలపంకించటం చూసి వాళ్ళిద్దరూ అంతకుముందే పరిచయస్తులయి వుంటారని వూహించింది.

పొడవాటి వ్యక్తి పేషెంటు నుదుటిమీద తన అరచెయ్యి పెట్టి నెమ్మదిగా ఏదో ఉచ్చరించటం ఆమె గమనించింది. చాలా కొద్ది సేపట్లోనే పేషెంటు నిద్రలోకి జారుకున్నాడు మళ్ళీ. అయిదు నిమిషాలపాటు ఆ వ్యక్తి నిద్రపోతున్న వ్యక్తితో మాట్లాడుతూనే వుండటం ఆమెకి ఆశ్చర్యం కలిగించింది. అయితే అయిదు నిమిషాల తర్వాత నిద్రపోతున్న పేషెంటు చటుక్కున లేచి కూర్చుని ఆరోగ్యకరమైన వ్యక్తిలా నవ్వుతూ మాట్లాడటం ఆమెకి దిగ్భ్రాంతి కలిగించింది. వీటి అన్నిటికన్నా చిత్రమైన విషయం ఏమిటంటే బాగా చదువుకున్న పార్థసారథి కూడా ఆ నిలువెత్తు మంత్రగాడితో నవ్వుతూ మాట్లాడి, తన పేషెంటుని అతడిచేత ట్రీట్ చేయించటం.

"ఆయనెవరు?" ఆమె భర్తని అడిగింది.

శ్రీధర్ అటువైపోసారి చూసి, భార్యవైపు తిరిగి "అందుకే ప్రతిరోజూ పేపరు చదవమంటాను. అతను తెలీదా! ప్రముఖ హిప్నాటిస్ట్ ప్రొఫెసర్ జయదేవ్" అన్నాడు.

* * *

సదరన్ హిల్స్‌లో ఒక ఫ్లాట్‌లో వుంటున్నాడు ప్రొఫెసర్ జయదేవ్. అతని తల్లి ఆంగ్లో ఇండియన్. అతడు మాంట్రియల్‌లో పుట్టాడు. అంటారియో క్వీన్స్ యూనివర్శిటీలో సైకాలజీలో పట్టా పుచ్చుకుని, తరువాత ఎమ్మే చదివి కార్నెల్ యూనివర్శిటీ నుండి న్యూరాలజీలో డాక్టరేట్ సంపాదించాడు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ క్లినికల్ హిప్నాసిస్‌కి వైస్ ప్రెసిడెంటు అయ్యాడు. అయితే అతడి తండ్రి రక్తపు ప్రభావం ఆయన మీద బాగా ఉన్నది కాబోలు, పది రోజులపాటు ఇండియా చూడటానికి వచ్చి, ఆకర్షితుడై యిక్కడే వుండిపోయాడు.

అతడి తల్లీ తండ్రీ చాలాకాలం క్రితమే విడిపోవటంవల్ల జయదేవ్ జీవితం ఒంటరిగానే గడిచింది. తండ్రి మరణించి అయిదారేళ్ళు కావొస్తూంది. తల్లి మాంట్రియల్‌లోనే సెటిల్ అయింది. ఆమె దాదాపు ఇరవై ఏళ్ళ క్రితమే ఒక ఐరిష్ దేశస్థుణ్ని పెళ్ళి చేసుకుందని వినికిడి.

ఒంటరితనం మనిషి మెదడుని బాగా సానబెడుతుంది. విపరీతమైన విద్యారమైన మనస్తత్వాల మధ్య బ్రతికిన ఆ ప్రొఫెసరుకి మనస్తత్వ శాస్త్రం అభిమాన విషయమవటంలో ఆశ్చర్యంలేదు.

తన విశాలమైన గదిలో – దొంతర్లుగా వున్న పుస్తకాలమధ్య నిశ్శబ్దంగా అతడు చదువుకుంటున్నాడు. ప్రొద్దున్న జరిగిన సంఘటన తల్చుకుని అతడి పెదవుల మీద చిరునవ్వు కదులుతోంది.

పైకి చాలా భయంకరంగా కనిపించే విషయాలు హిప్నాసిస్‌లో నవ్వు తెప్పించేవే. అలాంటి సంఘటనే ప్రొద్దున్న జరిగి అందర్నీ ఆస్పత్రికి పంపింది.

ఆ కుర్రవాళ్ళిద్దరూ పాలిటెక్నిక్ స్టూడెంట్లు. అంతేకాక..... ఈ ప్రొఫెసరు దగ్గర హిప్నాసిస్‌లో ట్రెయినింగ్ పొందుతున్నవాళ్ళు. అనుభవం లేని హిప్నాటిస్టు ప్రయోగాలు చేయటం మొదలుపెడితే ఎలాటి దారుణాలు జరుగుతాయో వాళ్ళ చర్యే ఉదాహరణ.

హిప్నాసిస్‌లో ఒక వ్యక్తి మరో వ్యక్తి మెదడుని తన మాటలద్వారా లోబర్చుకొంటాడు. దీన్నే హిప్నాటిజం అంటారు. అయితే లోతుకు వెళ్ళేకొద్దీ ఇందులోనూ చాలా ఆసక్తికరమైన విషయాలు బయటపడతాయి. హిప్నటైజ్ చేయబడిన వ్యక్తి తన కంట్రోల్‌లోకి వచ్చాక హిప్నాసిస్ ఎటువంటి ప్రయోగాన్నయినా (వీలయినంతలో) అతడిమీద చేయవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తిని హిప్నటైజ్ చేసి "నీకు రాత్రి ఎనిమిదింటికి మెలకువ వస్తుంది. ఈ నిద్రనుంచి సరీగ్గా గంట పోయాక, అంటే తొమ్మిదింటికి నీకు విపరీతమైన దాహం వేస్తుంది" అని హిప్నాటిస్ట్ చెబితే ఆ వ్యక్తి నిద్రలేచి ఏ పని చేసుకుంటున్నా సరే తొమ్మిదింటికల్లా ఆటోమాటిక్‌గా, అనాలోచితంగా నీళ్ళు తీసుకుని తాగుతాడు. ఈ విషయంలో మంత్ర తంత్రాలు ఏమీలేవు. అంతా సైన్సే.

ప్రొఫెసరుగారి స్టూడెంట్లు యిద్దరూ ఉత్సాహవంతులయిన యువకులు. అందులో ఒకరు ఇంకొకర్ని తెలిసీ తెలియనితనంతో హిప్నటైజ్ చేశాడు. అతన్ని నిద్రపుచ్చుతూ "హాయిగా నిద్రపోతున్నావు, నువ్వు హాయిగా నిద్రపోతున్నావు" అంటూ నెమ్మదిగా నిద్రలోకి దింపాడు ట్రాన్స్‌లోకి. అక్కడ ఆ స్టూడెంటు చేసిన తప్పేమిటంటే "నిద్రలో నువ్వు సముద్రంలో ఈత కొడుతున్నావు" అని. ఆ పేషెంటు అలా చేయటం మొదలుపెట్టగానే కంగారుపడి అతడ్ని నిద్రలోంచి లేపేశాడు. పోస్ట్ హిప్నాటిక్ సజెషన్ ద్వారా "నువ్వు మామూలుగా వుంటావు" అని చెప్పకపోవటంతో ఆ హిప్నటైజ్ చేయబడిన వ్యక్తి సుషుప్తావస్థనుంచి బయటపడ్డాక ఇంకా సముద్రంలోనే వున్న ఫీలింగుతో చేతులూ, కాళ్ళూ కొట్టుకుంటూ, ఎగశ్వాస పీల్చటం, హాస్పిటల్లో చేర్పించడం జరిగాయి. ప్రొఫెసరు వచ్చి అతడిని

"రీ హిప్నటైజ్" చేసి నెమ్మదిగా "నువ్వు ఒడ్డుకు ఈదుకొస్తున్నావు- ఈదుకొస్తున్నావు" అని సంతృప్తి పరిస్తే తప్ప మామూలు మనిషి కాలేదు.

ఈ విషయం జ్ఞాపకం వచ్చి జయదేవ్ తనలో తను నవ్వుకుంటూ వుండగా కాలింగ్‌బెల్ చప్పుడయింది. బోయ్ వచ్చి ఎవరో వచ్చారని చెప్పాడు. "రమ్మను. అలాగే రెండు కప్పులు టీ తీసుకురా" అన్నాడు కుర్చీ వెనుకకి జారబడుతూ. ఒక నిమిషం తర్వాత తలుపు చప్పుడయింది. "కూర్చోండి" అన్నాడు అతడు అలసటతో కళ్ళు తెరవకుండానే.

*　　*　　*

"నమస్తే! నా పేరు శారద" అన్నదామె చేతులు జోడించి.

జయదేవ్ ఆమె చెప్పిందంతా విన్నాడు. ఎయిర్‌పోర్టు సంగతి.... తరువాత పాప అనారోగ్యం.... ఇరవై రోజులపాటు బాధ... అంతా విని కళ్ళు తెరిచి "మీరేమనుకుంటున్నారు?" అని అడిగాడు.

"మా రామయ్య అనటం ఇది చేతబడి అని" అన్నదామె.

ఒక్కసారిగా ఫక్కున నవ్వేసరికి ప్రొఫెసరికి పొలమారింది. తనని తనే కంట్రోల్ చేసుకుంటూ "చేతబడా!" అంటూ మళ్ళీ నవ్వాడు. "చదువుకున్న మీరు కూడా వీటిని నమ్ముతున్నారా?"

శారద నవ్వలేదు. తల వంచుకుని నెమ్మదిగా అంది- "ఆ రోజు విమానాశ్రయంలో పాప ప్రవర్తనకీ ఈ రోజు ఆస్పత్రిలో పేషెంటు ప్రవర్తనకీ చాలా దగ్గర సంబంధం కనిపించింది ప్రొఫెసర్ నాకు. అంత హడావుడి చేస్తున్న పేషెంటుని అయిదు నిమిషాల్లో మంత్రం వేసినట్టు బాగుచేశారు మీరు. నా కూతుర్ని కూడా అలాగే రక్షించండి ఏ మంత్రం వేసయినా సరే".

మళ్ళీ నవ్వబోయిన ప్రొఫెసరు చప్పున ఆగిపోయాడు. కిటికీలో నుంచి పడుతున్న వెలుగురేఖల్లో ఆ స్త్రీ మూర్తి దీనంగా కనిపించింది. ఏడ్చీ ఏడ్చీ ఉబ్బిన ఆమె కళ్ళూ, తైలసంస్కారంలేని జుట్టూ.... అతడికి జాలేసింది ఆమెమీద. సానుభూతిగా అన్నాడు- "చూడండి! పొరపాటున మీరు నా దగ్గరకొచ్చారు నేను డాక్టర్ని కాను, మంత్రగాడ్ని అసలే కాను. మీరు చూసిన ఆ పేషెంటు నా స్టూడెంటు. ఎవరో హిప్నటైజ్ చేస్తే నేను దాన్ని సరిదిద్దాను. అంతే".

ఆమె చప్పున "అదే పాపకీ కావల్సింది. ఎవరో ఆమెకి చేతబడి చేశారు. దానికి తిరుగుబడి చేయండి" అన్నది.

చేతబడులూ, మంత్రాలూ వున్నాయని వాదించే వాళ్ళతో అతడు విసిగిపోయాడు. కొంచెం బిగ్గరగానే- "నేనేమో సైన్సు గురించి మాట్లాడుతూ వుంటే మీరు క్షుద్రవిద్యల గురించి చెప్తారేమిటి" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. ఆమె కళ్ళలో తడిచూసి అతడు విచలితుడై నొచ్చుకుంటూ.... "ఐయామ్ సారీ" అన్నాడు. "నా ఉద్దేశ్యం దీన్ని డాక్టర్లే సరిచేయగలరని. పార్థసారధి మంచి డాక్టరు. పాపకి తప్పక నయమవుతుంది" అనునయంగా అన్నాడు.

ఆమె ఓ క్షణం ఆలోచించి అన్నది- "మీరు హిప్నటైజ్ చేసిన పేషెంటుని డాక్టరు పార్థసారధి బాగుచేసి వుండేవాడా ప్రొఫెసర్? ఒకవేళ చేయగలిగినా ఎంత కాలానికి?"

ప్రొఫెసరు మాట్లాడలేదు, మౌనంగా వుండిపోయాడు.

"హిప్నటిజానికి గురికాకుండా తట్టుకోగలిగే వ్యక్తులు మనలో ఎంత శాతం వుంటారు ప్రొఫెసర్?"

అతడికి లీకార్న్ యిచ్చిన అంకెలు జ్ఞాపకం వచ్చాయి. అసలు గురికానివాళ్ళు - అయిదు శాతం. అటూ ఇటూగా వుండేవాళ్ళు - పది శాతం. మత్తులోకి వెళ్ళేవాళ్ళు ..... ఇరవై అయిదు శాతం. గాఢమైన మత్తులోకి వెళ్ళేవాళ్ళు .... ముప్పై అయిదు శాతం. మత్తులో హిప్నాటిస్ట్ ఏం చెపితే అది చేసేవాళ్ళు - ఇరవై అయిదు శాతం. ఆమెకు చెప్పాడు.

ఆమె అన్నది- "మీరు నన్ను హిప్నటైజ్ చేసి, నేను సుషుప్తిలో ఉండగా, "రేపు నువ్వు నిద్రలోనుంచి లేవగానే రోజంతా విపరీతమైన తల నొప్పితో బాధ పడతావు" అని ఆజ్ఞ యిచ్చారనుకోండి. నేనలాగే బాధపడతానా?"

"నూటికి తొంభై శాతం స్కోపు వున్నదని సైన్సు చెబుతున్నది" అన్నాడు ప్రొఫెసర్. "అంతేకాదు. ఆఫీసులో గడియారం పదకొండు కొట్టగానే లేచి డ్యాన్స్ చెయ్యి అని నేను హిప్నసిస్‌లో చెపితే, మరుసటి రోజు అదే టైమ్‌కి ఆ క్లర్కు అలానే చేస్తాడు అందరి సమక్షంలో...." అని నవ్వాడు. (ఈ రచయితకి 'నాగరాజ్' అన్న హైద్రాబాద్‌కి చెందిన ప్రముఖ హిప్నాటిస్ట్ ఈ విషయాన్ని స్వయంగా చేసి నిరూపించాడు.)

"దాన్నేమంటారు?"

"పోస్ట్ హిప్నాటిక్ సజెషన్".

శారద కుర్చీ వెనక్కి వాలి, "పోస్ట్ హిప్నాటిక్ సజెషన్ ద్వారా నా కూతుర్ని ఎవరో ఇరవై రోజులుగా బాధపెడుతున్నారు ప్రొఫెసర్! అదే నేను చెప్పాలనుకుంటున్నది. దాన్నే నేను 'చేతబడి' అంటే మీరు నవ్వారు".

ప్రొఫెసర్ దిగ్భ్రాంతితో చూశాడు. 'మామూలుగా అతి సామాన్యముగా కనబడే గృహిణి' ఎంత సున్నితంగా తనని బుట్టలో పడేసింది.

"మీరేం చదువుకున్నారు?" అని అడిగాడు. ఆమె నవ్వి ఊరుకొంది. అయితే నవ్వులో జీవం లేదు, కూతురి విషయంలో దిగులే వుంది. ఆమె చేతి బ్యాగులోంచి కాగితం తీసి ఇస్తూ "పాపకి మూడు వారాలుగా వస్తున్న బాధలన్నిటినీ వ్రాసి పెట్టాను చూడండి" అన్నది. ప్రొఫెసరు కాగితం అందుకొని పరిశీలించాడు.

మొదటిరోజు హిస్టీరియా వచ్చినట్టు ప్రవర్తించింది. రెండోరోజు చిగుళ్ళనుంచి రక్తం. మూడోరోజు జుట్టు వూడిపోతోంది. నాలుగోరోజు కడుపులో విపరీతమయిన నొప్పి. అయిదో రోజు కుడిచెయ్యి ఎవరో విరిచేస్తున్నట్లు బాధపడింది.

ప్రొఫెసరు చదువుతుండగా ఆమె అన్నది– "జాగ్రత్తగా దాన్ని గమనిస్తే, ఒక్కోదానికి అసలు సంబంధమే లేదు అని తెలుస్తుంది. ఇదేదో మానవాతీతశక్తి- కేవలం పాప భావన పాప శరీరంలో తాత్కాలికమైన మార్పు మీరన్న ఇంగ్లీషు పదం హెట్రో సజెషన్ వల్లనే జరుగుతున్నాయని నాకనిపిస్తుంది. ఒక్కో మనిషిని హిప్నటైజ్ చేసి, నీ గుండె వేగం నెమ్మదిగా తగ్గిపోతుందని సైన్సు నిరూపించింది కదా. అలాగే పాప జుట్టు వూడిపోవటం, చిగుళ్ళనుంచి రక్తం రావటం, వీటన్నిటికీ కారణం లెతర్జీ, కాటలెప్సి, సోమ్నాలెన్స్, హిప్నటిక్ కోమా- మీరే పదమన్నా పెట్టుకోండి- ఎవరో, ఎక్కణ్నించో 'ఆటో సజెషన్'తో నా కూతుర్ని బాధపెడుతున్నారు. నాకు తెలిసిన ఈ కొద్ది ఇంగ్లీషు పదాలు నేనెందుకు వాడుతున్నానంటే, నేను తెలుగులో చేతబడి, దెయ్యం పట్టడం అని అంటే మీరు నవ్వుతున్నారు కాబట్టి. ఒకరి మెదడుని మన చెప్పుచేతలలోకి తీసుకుని, దాని ద్వారా ఆ వ్యక్తి శరీరాన్ని కూడా బాధపెట్టవచ్చని సైన్స్ నమ్ముతోంది కదా- అదే జరుగు తోంది ఇప్పుడు. అందుకే డాక్టర్ పార్థసారధికి ఏమీ అంతు బట్టటం లేదు".

కొంచెంసేపు ప్రొఫెసర్ ఆమెవైపు సాలోచనగా చూశాడు. తరువాత తల అడ్డంగా ఊపుతూ, "మీరు చెప్పిన ఆ మంత్రగాడు- ఎక్కణ్నుంచో ఆటోసజెస్ట్ చేసి ఇక్కడి పాపని బాధ పెట్టడాన్ని సైన్సు ఒప్పుకోదు. అలా నిరూపించలేం" అన్నాడు.

"టెలివిజన్ ద్వారా ప్రేక్షకుల్ని వాళ్ళ వాళ్ళ యిళ్ళల్లో నిద్రలోకి దింపొచ్చా ప్రొఫెసర్?"

ప్రొఫెసరుకి కొన్ని సంవత్సరాల క్రితం బి.బి.సి.లో పీటర్ కాసన్ అలానే హిప్నాటిక్ ప్రయోగం చేసి ప్రేక్షకుల్ని కుర్చీలలో విరుచుకు పడిపోయేటట్లు చేయటం, దాంతో టెలివిజన్‌లో హిప్నాటిజం ప్రదర్శనలని రద్దుచేస్తూ ఆర్డర్ రావటం గుర్తొచ్చాయి.

ప్రొఫెసరు తలూపటంతో శారద వాదనకి బలం చేకూరింది. "మరి ఎక్కడినుంచో మాటలద్వారా యిక్కడి వ్యక్తిని బాధలకి గురి చెయ్యొచ్చు అన్న విషయాన్ని కూడా సైన్సు ఒప్పుకుంటున్నప్పుడు మనకి అర్థంకానిదల్లా ఆ మంత్రగాడు ఏ పరికరాల ద్వారా ఇక్కడి పాపని యిన్ని హింసలకి గురి చేస్తున్నాడో తెలియకపోవటం అంతేగా!"

ప్రొఫెసర్ నవ్వి "అంటే ఆ మంత్రగాడు వైర్‌లెస్ ద్వారా పాపకి పోస్టు సజెషన్స్ ఇస్తున్నాడంటారా?" అన్నాడు.

శారద నవ్వలేదు. "వైర్‌లెస్ ద్వారా యిస్తున్నాడో, టెలివిజన్ ద్వారా యిస్తున్నాడో తర్కించేంత వైజ్ఞానిక పరిజ్ఞానం నాకు లేదు ప్రొఫెసర్! నాకు తెలిసిన కొద్ది సైన్సుని, జరుగుతున్న దానికి అన్వయించుకోవటం ఒక్కటే తెలుసు నాకు. అయినా ఇక్కడ తర్క వితర్కాలకి చోటులేదు. నా కూతురి జీవన్మరణ సమస్య యిది" అన్నది. కూతురు జ్ఞాపకం వచ్చేసరికి ఆమె ఆవేశం చప్పున చల్లారిపోయి ఒక్కసారి దిగులు ముంచుకొచ్చింది.

ప్రొఫెసరు కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరకు వచ్చాడు. అతడి మొహంలో ఇప్పుడు నవ్వులేదు. "నాకు తెలిసిన కొద్దిపాటి హిప్నాసిస్ ప్రయోగం నీ కూతుర్ని ఈ బాధల్నుంచి రక్షించగలిగితే అంతకన్నా నాకు కావల్సిందేమీ లేదమ్మా" అన్నాడు.

* * *

"నువ్వు నేను చెప్పేది జాగ్రత్తగా విను. నా కళ్ళల్లోకి చూస్తున్నావు నువ్వు. నీ కనురెప్పలు నెమ్మదిగా మూతలు పడుతున్నాయి. కళ్ళు మూత పడుతున్నాయి. (ఇంకో రెండుసార్లు రిపీటు) నీ మెదడు నిద్రపోతూంది. ఇంకేం ఆలోచించటం లేదు. కేవలం నిద్రే.... కేవలం నిద్రే. (రెండుసార్లు) నీ కాళ్ళూ చేతులూ అన్నీ నిద్రని ఆహ్వానిస్తున్నాయి. (రెండుసార్లు రిపీటు) నీ అన్ని బాధల్నీ నువ్వు మర్చిపోతున్నావు.

నెమ్మదిగా సుషుప్తిలోకి వెళుతున్నావు. నీకు నా కంఠం తప్ప యింకేమీ వినబడటంలేదు. చీకటి తప్ప ఇంకేమీ కనబడటంలేదు. చీకటి- అంతా చీకటి- రిలాక్స్, రి-లా-క్స్- బాగా ఊపిరి పీలుస్తూ హాయిగా నిద్రపో" ప్రొఫెసరు కంఠం మందస్వరాన ఆ గదిలో రిథమాటిక్‌గా వినిపిస్తూంది. పాప పక్కమీద పడుకుని వుంది. చిన్న లైటు ఆమె మీదకు ఫోకస్ చెయ్యబడి వుంది. శారద జరుగుతున్నది మౌనంగా గమనిస్తూంది. శ్రీధర్ ఇంట్లో లేదు.

"....నువ్వు నిద్రపోతున్నావు. నిద్ర అనే ఆలోచన తప్ప ఇంకేమీ లేదు నీకు. ఇంకా ఇంకా గాఢమైన నిద్ర. నీకు నా కంఠం తప్ప ఇంకేమీ వినిపించటంలేదు. అన్ని బాధల్నీ మర్చిపో- నీకేమీ బాధలేదు. నిన్ను నేనుగాక ఇంకెవరూ ఆజ్ఞాపించలేరు. (రిపీట్) ఇంకా గాఢంగా నిద్రపో, నిద్రపో, నిద్రపో, నిద్రపో - ఒకటి నుంచి పది లెక్క పెట్టేలోపులో- నేను తప్ప నిన్ను ఎవరూ ఆజ్ఞాపించలేరు. నా కంఠం తప్ప నీకు ఇంకేమీ వినబడదు. ఒకటి నిద్రపో.... నిద్ర.... రెండు.... ఇంకా.... ఇంకా గాఢమైన నిద్ర.... మూడు.... నాలుగు.... ఐ....దు.... ఆ....రు.... నిద్రపో.... నిద్ర.... ఏడు.... ఎ....ని....మి....ది... తొమ్మిది...పది" అని లైటువేశాడు. పాప తేలికగా నిద్రపోతూంది. శారద మొహం విప్పారింది. చాలా రోజుల తరువాత పాప తేలికగా నిద్రపోతూంది. ప్రొఫెసరు ఆమెవైపు తిరిగి "మళ్ళీ మనం లేపేవరకూ పాప లేవదు".

"అంటే.... నేను లేపొచ్చా?"

అతడు నవ్వి "మీరు కాదు- నేనే లేపాలి. నా మాటల ట్యూన్‌కీ, వైబ్రేషన్‌కి సరిపోయే కంఠం వున్నవారు తప్ప ఇంకెవరూ లేపలేరు ఆమెని" అన్నాడు.

ఆమె కిదంతా చాలా ఆశ్చర్యంగా వుంది. సైన్సు ఇంత అడ్వాన్సు అయిన సంగతి ఆమెకు నమ్మశక్యం కావటం లేదు. ఆ విషయమే అతడితో అన్నది.

"ఇంకా ఆశ్చర్యకరమైన సంగతులు చాలా వున్నాయి. ఒక సూది తీసుకొని, పాప చెవి పోగుకి కావల్సిన రంధ్రం చేసినా ఆమె లేవదు. కావాలంటే పరీక్షించుకోండి. (ఈ విషయాన్ని సాగర్‌కి చెందిన ఓ ప్రొఫెసరు ఇప్పటికీ నిరూపించగలరు.) నేను పాప గుండె వేగంగా కొట్టుకునేలా చెయ్యగలను. కొంచెం టైమిస్తే పాప గాలిలో నాట్యం చేయగలిగేలా చేయగలను". అతడు చదివిన చదువు, విజ్ఞానం అతడి పెదవులమీద ధీమాతో కూడిన నవ్వుని చేర్చినయ్.

"ఇన్ని చేయగలిగిన మీరు చేతబడి చేయలేరంటే నేను నమ్మను".

బులెట్‌లా వచ్చిన శారద మాటలకి అతడు పక్కలో బాంబు పడినట్లు ఉలిక్కిపడ్డాడు. ఆమెవైపు అయోమయంగా చూశాడు.

"చెప్పండి. నిజంగా మరో మనిషిని మంత్రాలతో - సారీ ! ఏమన్నారు వైబ్రేషన్ - ఆ వైబ్రేషన్ వున్న మాటలతో చంపాలీ అనుకుంటే చంపలేరు?"

"మీరు నన్ను ఏ వాదనలకి తీసుకెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నారో అర్థమయింది. కానీ చేతబడి అంటే అది క్షుద్రవిద్య. అక్షరజ్ఞానం లేని మనిషి కేవలం మంత్ర తంత్రాలతో కొంచెం నిప్పుతో పొగవేసి సైన్సు ఉపయోగించగలడంటే నేను నమ్మను. అయితే మీరు చెప్పిందీ నిజమే. మన మాటలకి ట్యూన్ చేసుకోగలిగే స్థితికి అవతలి మనిషిని తీసుకురాగలిగితే, అయిదో అంతస్థు మీదనుంచి దూకమన్నా దూకేస్తాడు."

"అంతే ప్రొఫెసర్ నాక్కావలసింది. ఇప్పటివరకూ మాయలూ, మంత్రాలూ వున్నాయని నమ్ముతూ వచ్చాను నేను, కానీ వీటన్నిటి వెనుకా సైంటిఫిక్ రీజన్ వుందని యిప్పుడే అర్థమయింది నాకు. ఈ క్షణంనుంచీ పాపని మీ చేతులలో పెడుతున్నాను. ఏం చేస్తారో మీ ఇష్టం".

ప్రొఫెసర్ లేచాడు. "నిజంగా పాప బ్రెయిన్‌వేవ్ ఇంకొకరి మాటలచేత కంట్రోల్ చేయడం వల్లనే ఇదంతా జరుగుతుందని మీరు నమ్మితే, నిజంగా పాప శరీరంలో ఏ లోపమూ లేకపోతే, ఈ క్షణంనుంచి పాపని నేను గార్డు చేస్తాను. ఈ విషయంలో మీరు నిశ్చింతగా వుండొచ్చు" అతడి మొహంలో సిన్సియారిటీకి ఆమె కదిలిపోయి, "థాంక్యూ ప్రొఫెసరు" అంది.

* * *

"ఏమిటీరోజు ఎవరో కొత్తగా ఇంట్లోకి వచ్చారు?" అని అడిగాడు సరస్వతి.

"ఎవరో ప్రొఫెసరట" పైడితల్లి నవ్వాడు. "ఎంత ప్రొఫెసరయినా మన మంత్రాలకి ఎదురు నిలవలేడు. పురాతనమైన క్షుద్ర విద్యలకి రీజనింగ్ ఇవ్వలేడు".

సరస్వతి "అదికాదు సమస్య. రాత్రంతా ఆ పాప దగ్గర కూర్చునేలా వున్నాడు. అలా అయితే పన్నెండింటికి .... " అంటూ మధ్యలో ఆపుచేశాడు. పైడితల్లి మళ్ళీ నవ్వాడు. "ప్రొఫెసర్లు ఎంత తెలివైనవాళ్ళో, మిగతా విషయాలలో అంత అమాయకులు. నువ్వే చూడు. ఈ రోజు నేను వేస్తాను రక్తం" అని లేచి, గది

బయటకు వచ్చాడు. వెనుకే సరస్వతి కూడా వచ్చాడు. అప్పుడు రాత్రి పదవుతూ వుంది.

బయట వరండాలో చీకటిగా వుంది. ఇద్దరూ బయటకొచ్చి, మేడమీదకి వెళుతుంటే, అప్పటివరకూ చీకట్లో నిలబడ్డ నారాయణరావు వాళ్ళ గదిలోకి చప్పుడు చేయకుండా ప్రవేశించాడు. అయిదు నిమిషాల తర్వాత అలాగే నిశ్శబ్దంగా బయటకొచ్చాడు. అతడు చెయ్యాలనుకున్న పనికి అయిదు నిమిషాలు చాలు.

....

....

రాత్రి పదయింది. తులసి పక్క దగ్గర జయదేవ్ కూర్చుని వున్నాడు. పాప హాయిగా నిద్రపోతూంది, చాలా రోజుల తర్వాత. పదింపావు. .... పదిన్నర. ఆలస్యంగా చంద్రోదయం అయింది ఆ రోజు.

పాప కొద్దిగా కదిలినట్టు అనిపించింది జయదేవ్‌కి. అతడికి అనుమానం వచ్చింది. ఎవరైనా పాప తల దగ్గర చిన్న ట్రాన్స్‌మీటర్ పెట్టి తన అనల్జీసియా (ANALGESIA) కి వ్యతిరేకంగా పని చేస్తున్నారా అని. ఆమె తలదిండు క్రింది, మంచంకోళ్ళని పరీక్ష చేశాడు. ఏమీ కనబడలేదు. అతడికి నవ్వొచ్చింది. 'ఇదంతా అబ్సర్డ్ – అనవసరంగా నేను నా టైమ్ వేస్టు చేసుకుంటున్నాను' అని అనుకొన్నాడు.

మళ్ళీ పక్కమీద పాప ఇబ్బందిగా కదిలినట్టు అనిపించింది. అక్కడికి వెయ్యి మైళ్ళ దూరంలో స్మశానంలో కాద్రా తన పందొమ్మిదో అంకాన్ని ప్రారంభించాడు. పాప బొమ్మకి మరో ముడి వేశాడు.

పదకొండయింది. పాప మళ్ళీ కదుల్తోంది. "తులసి....." అని పిల్చాడు. అతడి కంఠానికి ట్యూన్ అయివున్న పాప మెదడు నిద్రలోనే జవాబు చెప్పింది.

"ఊ!"

"నేను చెప్పినట్టుగానే నిద్రపోతున్నావా?"

"నిద్రపోతున్నాను".

"ఏ బాధా లేకుండా".

"ఏ బాధా లేకుండా". శారద ఈ సంభాషణని విస్మయంతో వింటూంది. "నిన్న నీకేదైనా బాధ అనిపించిందా?"

"అనిపించింది".

"ఎక్కడ?"

"గుండెల్లో".

"మొన్న?"

"కడుపులో".

"నీతో ఎవరన్నా మాట్లాడుతున్నారా ...... ఈ బాధ గురించి, అంటే ఇలా బాధపడతావని .... ప్రతిరోజూ...... "

మౌనం.

"నిన్ను ఎవరైనా ముట్టుకుంటున్నారా.... కళ్ళమీదా, కణతల మీదా?" మౌనం.

"ఇరవై రోజుల క్రితం నీకేమన్నా బాధగా వుందా? నెల రోజుల క్రితం, నలభై రోజుల క్రితం?"

"ఉంది".

"ఏమిటి?"

"అమ్మా నాన్నా నన్ను వాళ్ళ దగ్గర పడుకోబెట్టుకోరు. అది......."

చెంపమీద ఛెళ్ళున కొట్టినట్టు శారద ఉలిక్కిపడింది. తాము అరిస్టోక్రసీ పేరుతో చేస్తున్న పని పాప సబ్‌కాన్షస్‌లో యింత గాఢంగా ముద్రింపబడి బాధపెడుతుందా ? సైకాలజీ ప్రొఫెసర్ ఆమెవైపు చూస్తే తల దించుకుంది. అతడు మాట మార్చి– "శరీరం బాధపడ్తూందా ? అది చెప్పు?" అన్నాడు.

"లేదు".

శారద టీ తేవాలన్న మిషమీద అక్కడ్నుంచి తప్పుకొంది. ఆమెకి తల కొట్టేసినట్టు వుంది. ప్రొఫెసర్ అంటున్నాడు "నువ్వు నా మాటే వినాలి. నీకే బాధాలేదు. అవునా?"

"అవును".

అయిదు నిమిషాలు తక్కువ పన్నెండుకి తలుపు దగ్గర చప్పుడయింది. "దండాలు సామి" అని పైడితల్లి లోపలికి వచ్చాడు. ప్రొఫెసర్‌తల పంకించాడు.

"మా పాపకి నయం అయిపోతుందటగా సామీ .... శారదమ్మ సెప్పింది".

"చూద్దాం".

"సానా సంతోషం సామీ".

అంతలో శారద వచ్చింది. "పాపకి హార్లిక్స్ పట్టావా అమ్మా" అని అడిగాడు పైడితల్లి. "నిద్రలో కూడా చూడు, ఎంత నీరసంగా వుందో". శారద ప్రొఫెసర్ వైపు

చూసింది సాలోచనగా. "తీసుకురా" అన్నాడు జయదేవ్. ఆమె తీసుకొచ్చే లోపులో పైడితల్లి ప్రొఫెసర్ స్నేహితుడై పోయాడు. ఆ గ్రామీణుడు అమాయకంగా అడిగే ప్రశ్నలకి అతడికి విపరీతంగా నవ్వువస్తూంది. శారద హార్లిక్స్ తీసుకొచ్చింది. పైడితల్లి అందుకున్నాడు.

"పాప లేవకుండానే తాగుద్దా సామి?"

"తాగుతుంది".

"నీవు మడిసివి కాదు సావీఁ.............దేవుడివి. మహిమగల దేవుడివి".

ప్రొఫెసర్ నవ్వి వూరుకున్నాడు. హార్లిక్స్ పాప పెదవులకి చేరుస్తున్నప్పుడూ, పాప అది తాగుతున్నప్పుడూ, తాగాక పెదవులు తుడుస్తూనూ ఎంతో చాకచక్యంగా ఆమె నోట్లో మూడు రక్తం చుక్కల్ని పోసేదంటే- అతడి చూపుడువేలు కదలికని అక్కడ వున్న ఇద్దరూ కనుక్కోలేకపోయారు.

పన్నెండూ అయిదుకి అతడు తన గదికి చేరుకున్నాడు. అక్కడ సరస్వతి విస్కీ బాటిల్‌తో ఎదురుచూస్తూ వుంటాడని అతడికి తెలుసు.

పాప మరణానికి ఇంకా నలభై ఎనిమిది గంటలు.

17

"ఏదో జరుగుతూంది" అన్నాడు కాద్రా. రాత్రి జరిగిన పూజని తల్చుకొని .... "ఎవరో ఏదో చేస్తున్నారు. కాష్మోరా నిన్న సంతృప్తిగా లేదు ..."

స్వామి భయపడి .... "అంటే మన పని జరగదా ?" అన్నాడు.

"మూర్ఖుడా- కాష్మోరాని ఎదుర్కొనే శక్తి యీ ప్రపంచంలో ఎవరికీ లేదు. ఎవరో అడ్డు తగులుతున్నారంతే".

"రేపే ఫోన్ చేస్తాను, స్వామీ" అన్నాడు స్వామి.

....

....

పాప నోట్లో విజయవంతంగా రక్తంపోసి, పైడితల్లి తమ గదికి వచ్చేసరికి సరస్వతి రెడీగా వున్నాడు. తలుపులన్నీ బిగించుకుని మూడో కంటికి తెలియకుండా తాగటం వాళ్ళకి అలవాటు.

అప్పటికి అనిత మరణించి వారం రోజులైంది. ఎవరికీ ఏ అనుమానమూ రాకపోవటం వాళ్ళకి చాలా ఆనందంగా వుంది. ముఖ్యంగా పోలీసులు రాకపోవటం.

"నేన్నిన్ను వదిలిపెట్టను" అని అనిత చచ్చిపోతూ వ్రాసిన ఉత్తరము పైడితల్లిని అంతగా భయపెట్టలేదు. అయితే అతడిలో ఏ మూలోకొద్దిగా అనుమానం మాత్రం కలిగింది. ఆ అనుమానంతోనే అతడు ఎవరూ చూడకుండా అనిత గదిలో ప్రవేశించి ఆమె నోట్‌బుక్స్ పరీక్షించాడు.

అందులో గుండ్రంగా ముత్యాల్లా వున్న అక్షరాలకి, తనకు వచ్చిన ఉత్తరంలో అక్షరాలకీ ఏ మాత్రం సంబంధం లేదు. అయితే ఆమె చనిపోయేముందు కసితో - వేదనతో - పగతో వ్రాయబట్టి ఆ అక్షరాలు అలా తొందర తొందరలో వ్రాసి వున్నట్టు వుండి వుంటాయని అతను అనుకున్నాడు. నవ్వుకున్నాడు కూడా.

(కానీ అతని అభిప్రాయం తప్పని తొందర్లోనే అతనికి తెలిసింది.)

ప్రతి శుక్రవారం ఆ ఇంట్లో ప్రతి గదీ కడగటం అలవాటు. ఆ విషయం వాళ్ళిద్దరికీ (పైడితల్లికీ, సరస్వతికీ) తెలుసు. వాళ్ళు బజార్నుంచి వచ్చేసరికి వాళ్ళ గది కడిగి వుంది. అందులో చిత్రం ఏమీలేదు. ఇద్దరూ తలుపులు బిగించి గొళ్ళెం పెట్టారు. "పక్క వేసుకుని కూర్చుందామా?" అడిగాడు సరస్వతి.

పైడితల్లి "నేల ఇంకా తడిగా వుందిగా - ఆరనీ" అన్నాడు.

జేబులోంచి జిన్ సీసాని, రమ్‌ని తీశాడు. పైడితల్లి జిన్ తాగుతాడు. సరస్వతికి రమ్ అలవాటు. రెండు కోలా బాటిల్స్ అల్మైరాలో వున్నాయి. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. బల్లమీద గ్లాసులూ, బాటిల్సూ, నిమ్మకాయలూ పెట్టుకుని.

"ఆడోళ్ళ డ్రింకు జిన్ను" అన్నాడు సరస్వతి బాటిల్ మూత తిప్పుతూ.

"అయితేనేం?"అన్నాడు పైడితల్లి చాకు తీసుకుంటూ - "ఇందులో నిమ్మకాయ రసం కలిపి తాగితే రుచి యింకెందులోనూ వుండదు".

కుర్చీ వెనక్కి వాలి పైకప్పుకేసి చూసిన సరస్వతి "అరె? అదేమిటి?"అన్నాడు.

పైడితల్లి కూడా పైకి చూశాడు. ఒక మూల పైన కప్పుకి తెల్లకాగితం వేలాడుతూ వుంది. చిన్న నోట్‌బుక్‌లో కాగితం తెల్లగా వుంది. అతని నోట్‌బుక్‌లోది. "ఆ కాగితం అక్కడికెలా వెళ్ళింది?"

పైడితల్లి దాని గురించి పట్టించుకోకుండా "దాని సంగతికేంలే - ముందు మందు సంగతిచూడు" అని తొందరపెట్టాడు. సరస్వతి కుర్చీలోంచి లేచి నిలబడి కుర్చీ ఎక్కి కాగితంవైపు చూశాడు. తెల్లటి కాగితం. రెండువైపులా తెల్లగా వుంది.

రెండు గోడలూ పైకప్పు కలిసేచోట బూజులో చిక్కుబడి వుంది. ఒక సాలెపురుగు హడావుడిగా అక్కడ్నుంచి సురక్షితమైన ప్రదేశానికి పరుగెత్తింది.

సరస్వతి కుర్చీ దిగి కూర్చుంటూ "ఏం లేదు" అన్నాడు.

"నీకు లార్జా, స్మాలా?" పైడితల్లి రమ్ సీసా వంచుతూ అడిగాడు.

"లార్జ్". అతడి గ్లాసులో రమ్ పోసి, తన గ్లాసులో జిన్ పోసుకున్నాడు. కోలా బాటిల్ సీలు తీసి అతని గ్లాసులో సగం వరకూ పోస్తూ....... దిగ్భ్రాంతితో అలానే ఆగిపోయాడు.

కోలా రమ్‌లో కలుస్తూ, తెల్లగా పాలలా .... నీళ్ళలా మారిపోతూంది.

సరస్వతి తెరచిన నోరు అలానే వుండిపోయింది. పైడితల్లి విస్మయంగా క్షణంసేపు చేతిలోని సీసాకేసి చూశాడు. తరువాత మూలకి విసిరేస్తూ "కొత్త స్టాకు రావటం మానేసిన తరువాత కల్తీలు ఎక్కువయిపోయినాయి" అన్నాడు.

సరస్వతి మాట్లాడలేదు. "దాంట్లో కల్తీ వుంటే వుండొచ్చుగాక, కానీ రంగెలా మారుతుంది? అందులోనూ అకస్మాత్తుగా!"

"నీళ్ళతో కొట్టేస్తావా లేకపోతే నాతోపాటు జిన్ తీసుకుంటావా?" పైడితల్లి అడిగాడు.

"నేనూ జిన్నే". గ్లాసులో తెల్లటి ద్రవం పారబోసి రెంటిలోనూ జిన్ వేశాడు. నిమ్మకాయని-బొటనవేలూ చూపుడువేలులమధ్య పట్టుకుని చాకుతో కోయసాగాడు. నిమ్మకాయ రసం చిప్పిల్లి - రెండు మూడు చుక్కలు ధారగా నేల మీదకు పడుతున్నాయి. సరస్వతి నోట్లోంచి కెవ్వుమని చిన్నగా కేక!

నిమ్మకాయలోంచి రక్తం కారుతుంది. ఒక్కో చుక్కా .... ధారగా!

ఎంతో ధైర్యవంతుడైన పైడితల్లి కూడా క్షణంపాటు వణికాడు.

చేతిలో నిమ్మకాయ మామూలుగానే వుంది. బజార్లో కొన్నది.

"వదిలెయ్" అన్నాడు సరస్వతి. పైడితల్లి కూడా అర్థంకానట్టు చూశాడు.

"దాన్నొదిలెయ్....... " వణుకుతూన్న కంఠంతో భయం భయంగా అన్నాడు సరస్వతి. అప్రయత్నంగా పైడితల్లి చేతిలోని నిమ్మకాయని జారవిడిచాడు.

కడిగిన గచ్చుమీద ఎర్రగా రక్తం చుక్కలు! ఎంతటి ధైర్యవంతుడి మనసైనా గగుర్పాటు చెందేలా భయంకరంగా వున్నాయి.

"ఇదంతా దెయ్యం పనేనా?"

"నోర్ముయ్" అన్నాడు పైడితల్లి.

"దెయ్యం లేదు, భూతం లేదు".

అతడి మాట పూర్తికాకుండానే గోడమీద వున్న నిలువెత్తు ఫోటో పెద్ద శబ్దం చేస్తూ 'ధన్'మని పడిపోయింది. ఆ ధ్వని గది గోడలమీద రెండుసార్లు ప్రతిధ్వని అయింది....... చాలా పెద్ద శబ్దం ...... ఒళ్ళు జలదరింప చేసే శబ్దం......

ఆ తరువాత అంతకన్నా భయంకరమైన నిశ్శబ్దం. నిజానికి శబ్దం కన్నా "నిశ్శబ్దం" భయంకరమైనది. ఆ నిశ్శబ్దమైన గదిలో ఇద్దరూ ప్రేతాత్మల్లా కూర్చుని వున్నారు. ఆ నిశ్శబ్దాన్ని చెదరగొట్టటానికి ప్రయత్నం చేయటం లేదు ఎవరూ.

"ఏమిటది?" సరస్వతి అడిగాడు.

పైడితల్లి అతడివైపు చూసి "ఏమిటి?" అని అడిగాడు.

"ఎవరో నవ్వలేదూ ఆడపిల్ల?" అన్నాడు సరస్వతి.

పైడితల్లికానవ్వు వినిపించలేదు. "లేదే" అన్నాడు.

సరస్వతి లేచి నిలబడ్డాడు. "నేను వెళ్ళిపోతా నిక్కడినుంచి. నేనీగదిలో వుండలేను" అన్నాడు. అతని మొహం తెల్లగా పాలిపోయి వుంది. ఎన్నో ఘాతుకాల్ని నవ్వుతూ చూసి అతడి కళ్ళు యిప్పుడు బెదురుతున్నాయి.

"నిశ్చయంగా ఎవరో ఆడపిల్ల నవ్వింది. అనితే...... అనితే......" అంటున్నాడు అతడు. అతడి చేతులు కుర్చీకోడుని గట్టిగా పట్టుకున్నాయి. దాన్ని ఆసరాగా తీసుకొని నిలబడి సరిగ్గా వుండటానికి ప్రయత్నం చేస్తున్నాడు. "వెళ్ళి పోవాలి - వెళ్ళిపోవాలి - వెళ్ళిపో ....." అతడి స్వరం ఆగిపోయింది.

పైడితల్లి అతడి గొంతుని రెండుచేతుల్తోనూ పట్టుకున్నాడు. "ఎక్కడికి వెళ్ళటం? మన పనయ్యేవరకూ ఎక్కడికీ వెళ్ళం. అర్థమయిందా? ఒక్క అనితేగాదు, వెయ్యి దెయ్యాలు వచ్చినా మనల్ని ఏమీ చేయలేవు. ఇంకెంత ? రెండు రోజులు - జాగ్రత్త, నీ పనిలో ఎక్కడ లోపమొచ్చినా ఆ దెయ్యం కాదు - నేను చంపుతాను నిన్ను" ఆ క్షణం అతడి కళ్ళలో కనబడిన ఎర్రటి జీరలు చూసి సరస్వతే భయపడ్డాడు.

"సరే" అన్నాడు హీనమైన కంఠంతో. పైడితల్లి అతడిని వదిలిపెట్టాడు. కొంచెం సేపటికి సరస్వతి నిద్రపోయాడు. పైడితల్లికి మాత్రం నిద్రపట్టలేదు. సరస్వతి సన్నటి గురక భయంకరంగా వినబడుతూంది ఆ నిశ్శబ్దంలో. పైడితల్లి ఆలోచనలు మాత్రం పరిపరి విధాల సాగుతున్నాయి.

నిమ్మకాయలోంచి ఎర్రగా కారిన రక్తపుచుక్కలు కళ్ళముందు కదలాడుతున్నాయి. అకస్మాత్తుగా ఫోటో ఎలా పడింది?

అన్నిటికన్నా ముఖ్యంగా....... తనకి వినబడని నవ్వు సరస్వతికి ఎలా వినబడింది?

వీటన్నిటినీ క్రోడీకరిస్తే...... దెయ్యాలున్నాయ్యా? 'లేవు లేవు' అనుకున్నాడు అతడు. అయినా ఆలోచనలు తెగలేదు.

నిద్రపట్టడంలేదు. దూరంగా ఎక్కడో ఒంటిగంట కొట్టిన చప్పుడు. ప్రపంచమంతా నిద్రలో మునిగి వుంది. సృష్టి నిశ్శబ్దంలో విశ్రాంతి తీసుకుంటున్నట్టు వుంది. చిన్న గాలి తెమ్మెర కిటికీ తెరని కదిల్చింది. సన్నటి చప్పుడు. స్ స్ స్ స్ .... మని రంధ్రం నుంచి గాలి వెళుతున్న చప్పుడు. చెట్టుకొమ్మల మధ్య నుంచి ప్రకంపనం....

దెయ్యాలు గాలి రూపంలో వుంటాయా? – అనుకున్నాడు పైడితల్లి. అనుకొంటూ తల విదిలించాడు. ఏమిటీ రాత్రి? ఈ దెయ్యం ఆలోచన తనని వదిలిపోదా....

పక్కనుంచి వెల్లకిలా తిరిగి పడుకున్నాడు. అప్పుడు పడింది అతడి దృష్టి కిటికీ తెరమీద. రెప రెపా కొట్టుకుంటుంది అది గాలికి. మరి గాలి లోపలికి రాదేం? అంత బలంగా బయట వీస్తున్న గాలి – అసలు లోపలికి రావటం లేదేం?

అతడు పక్కమీద నుంచి లేవబోయాడు. కరెంటు పోయి, బెడ్ లైటు ఆరిపోయింది. కాటుకలాంటి చీకటి........

అతడు అలాగే పక్కమీద పడుకుని చీకట్లోకి చూస్తున్నాడు. ఊరంతా పోయినట్టుంది కరెంటు. బయట కూడా చీకటిగా వుంది. కిటికీ లోంచి బయట మసక చీకట్లో చెట్లు జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా వున్నాయి. నెమ్మదిగా వూగుతున్నాయి.

ఉన్నట్టుండి గదంతా చల్లగా మారుతున్నట్టు అనిపించింది అతడికి. ఎక్కణ్ణుంచో చల్లటిగాలి రివ్వున వీస్తూ వస్తూంది. తనని చుట్టుముడుతూంది. అంత చలిలోనూ అతడి నుదుటిమీద చెమట పట్టింది. ఒకవైపు గాలి, మరోవైపు చమట. ఇంతలో ఇంకో చిత్రమైన సంఘటన జరిగింది. ఒక అదృశ్యమైన శరీరం తనమీద పడుకొన్నట్టు అనుభూతి కలిగింది. ఐస్ కన్నా చల్లగా వుంది ఆ శరీరం. శరీరం కాదు గాలి. ఏదో వాయువు బలంగా తనని నొక్కి పెడుతుంది. రక్తం గడ్డకట్టుకు పోయేటంత చలి. అతడు చెయ్యి కదల్చబోయాడు. కదల్లేదు. నరాలు ఎదురు తిరుగుతున్నాయి. ఆ చీకట్లో అతడికేమీ తోచలేదు. నేను మామూలుగానే వున్నాను. నేను మామూలుగానే వున్నాను అనుకున్నాడు. మనసు స్వాధీనంలోకి

తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. దాంతో అతడి శరీరం మామూలు బలాన్ని చేకూర్చుకుంది.

దీపం వెలిగించటం కోసం లేవబోయాడు. లేస్తూ వుండగా ..... ఆ గదిలో ఒక చిత్రం జరిగింది.

బల్ల మీద పెట్టిన అగ్గిపెట్టె బుస్సుమన్న శబ్దంతో దానంతట అదే ఒక్కసారిగా మండిపోసాగింది. అన్ని పుల్లలు ఒక్కసారిగా మండేసరికి ఆ గది పెద్ద వెలుగుతో నిండిపోయింది. నిలువునా అగ్గిపెట్టె కాలిపోవటం చూస్తున్నాడు అతడు. తన కళ్ళు తననే మోసం చేస్తున్నాయా అన్న దిగ్భ్రాంతితో ఊపిరి పీల్చటం కూడా మర్చిపోయాడు. వెన్నెముక చివర నుంచి ప్రారంభమైన భయం వళ్ళంతా పాకింది. వెలుగు కొద్ది కొద్దిగా క్షీణించి – పూర్తిగా నిస్తేజమైంది. మళ్ళీ దట్టమైన చీకటి. దబ్‌మన్న చప్పుడుతో అతడు స్పృహ తప్పి విరుచుకు పడిపోయాడు.

అప్పుడు రాత్రి ఒంటిగంటన్నర కావొస్తుంది. మేడమీద గదిలో ప్రొఫెసర్ జయదేవ్ ఇంకా మెలకువగానే వున్నాడు. నిద్రపోతున్న పాపని చూస్తూ. ఆ ఇంట్లో అప్పుడు ఇంకో వ్యక్తికూడా మెలకువగానే వున్నాడు. అతడు నారాయణరావు.

* * *

మళ్ళీ పైడితల్లికి మెలకువ వచ్చేసరికి తెల్లవారిపోయింది. తెల్లటి వెలుగు కిటికీలోంచి లోపలికి వాలుగా పడుతుంది. ఏడు కావొస్తూంది. రాత్రి జరిగిందంతా కలగా అనిపించింది. కల కాదని బల్లమీద కాలిపోయిన అగ్గిపెట్టె నిరూపిస్తూంది. పక్కనే సరస్వతి ఇంకా నిద్రపోతున్నాడు. అతని గురక సన్నగా వినిపిస్తూంది. పైడితల్లి ఒళ్ళు విరుచుకుంటూ పక్కమీంచి లేవబోతున్నవాడల్లా షాక్ తగిలినట్టు అలాగే ఆగిపోయాడు.

నేలమీద అతని పక్క దగ్గర– కాళ్ళు పెట్టుకునేచోట ..... ఒక ముగ్గువేసి వుంది. సర్పబంధంలా వుంది ఆ ముగ్గు. 'భద్రాచలం అడవుల్లో మనిషిని 'మనుమెకంగా' మార్చటానికి రాత్రిపూట, నిద్రపోతున్నప్పుడు వేసే ముగ్గు' ఎవరు వేశారు?

అతడి వెన్నులో చలి మొదలై వళ్ళంతా వణికించింది. చుట్టూ చూశాడు. తలుపు గొళ్ళెం వేసింది వేసినట్టే వుంది.

మళ్ళీ ముగ్గువైపు చూశాడు. ఎవరో ముగ్గుమీద పూజ చేసినట్టూ- సగం కోసిన నిమ్మకాయ, కుంకుమ.

ఆ గది తలుపులు వేసి వుండగా మానవమాత్రుడెవరూ ఆ గదిలో ప్రవేశించలేడని పైడితల్లికి నిశ్చయంగా తెలుసు. అందులో ఏ విధమైన అనుమానంలేదు.

మాయమరలూ అవీ ఉండటానికి ఇదేమీ జానపద చిత్రం కాదు. ఇది మరెలా జరిగింది? అతడు చుట్టూ చూశాడు.

అప్పుడు పడింది దృష్టి కాగితం మీద. క్రితం రోజు గోడకున్న బూజు మధ్యలో చిక్కుబడి వున్న కాగితం. బూజు బూజులానే వుంది. మధ్యలో కాగితం కాగితంలానే వుంది. ఎవరూ దాన్ని కదపలేదన్న విషయం తెలుస్తూనే వుంది. కాగితం మీద సన్నటి సాలెపురుగు దారాలు అసలు చెదర్లేదు. అయినా కాగితం మీదవ్రాసుంది.

నిన్న రాత్రి తెల్లగా వున్న కాగితం మీద- ప్రొద్దున్నకల్లా అక్షరాలు!

అతడు నెమ్మదిగా లేచి వెళ్ళి వాటిని చదివాడు. కాగితం మీద నిద్రపోతున్న సాలెపురుగు అలికిడికి లేచి పరుగెత్తింది. తెల్లటి కాగితం మీద ఎర్రటి రక్తంతో వ్రాసిన అక్షరాలు అలుక్కుపోయినట్టు వున్నాయి. అతడు ఒక్కో అక్షరమే కూడబలుక్కుంటూ చదివాడు. కాగితం మీద రక్తాక్షరాలు ఇలా వున్నాయి.

"ఇంకో ఇరవై నాలుగ్గంటలు- అంతే!"

తన చేతిలో ఉన్న కాగితాన్ని అతడు పాలిపోయిన మొహంతో చూస్తూ వుండగా రామయ్య వచ్చి ఫోను వచ్చిందని చెప్పాడు. పైడితల్లి కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు. తనకి, ఆ ఇంటికి ఫోను రావటం ఏమిటి?

వెళ్ళి రిసీవరు అందుకుని "ఎవరదీ" అన్నాడు యాసగా. దూరంగా సన్నగా, పీలగా వినిపించింది కంఠం. "నేను- స్వామిని".

ఉలిక్కిపడ్డాడు పైడితల్లి. చప్పున అటూ ఇటూ చూశాడు. రామయ్య లేడు. శ్రీధర్ - శారద పైన పాప దగ్గర వున్నారు. అయినా అతడు సంతృప్తి పడలేదు. ఇలా ఇంటికి ఫోను రావటం అతడికి ఇష్టంలేదు. ప్రతిరోజూ తనే ఫోను చేయాలన్నది వాళ్ళు ముందు అనుకున్నది. అందుకే "రాంగ్ నెంబర్" అన్నాడు పెట్టెయ్యబోతూ!

"సరే ! అది నాకు తెలుసు. నువ్వేం మాట్లాడకు. నేను చెప్పేది జాగ్రత్తగా విను. అంతా సవ్యంగానే అనుకున్నట్లే జరుగుతున్నది. ఇప్పుడు ఎనిమిదయింది. ఈ రోజు ఇరవయ్యో రోజు. నిన్న రాత్రి పన్నెండింటికి పాప నోట మాట పడిపోయి వుంటుంది. పోయిందా?"

"ఏమో చూళ్ళేదు. ఇప్పుడే లేచాను" అన్నాడు విసుగ్గా.

"అయితే చూడు" అన్నాడు స్వామి అట్నుంచి. "ఈ రోజు కాద్రా చాలా కోపంగా వున్నాడు. నిన్న రాత్రి కాష్మోరా సరిగ్గా జరగనట్లుంది-"

పైడితల్లి చేతిలో రిసీవరు బిగుసుకుంది. దవడ కండరం ఎత్తుగా లేచింది. "ఏమిటి?" అన్నాడు.

"అందుకే మరి ఫోను చేసింది. నిన్నెవరైనా కొత్తవాళ్ళు పాప దగ్గరికి వచ్చారా?"

పైడితల్లి క్షణం ఆలోచించాడు- అటూ ఇటూ చూసి ఎవరూ వినటం లేదని నిశ్చయించుకున్నాక మౌత్‌పీస్‌లోకి నెమ్మదిగా "ఆ, ఎవరో ప్రొఫెసర్ అట వచ్చారు" అన్నాడు.

"అయితే అతణ్ణి ఈ రోజు సాయంత్రంలోగా మన దారినుంచి తొలగించు. ఏ చిన్న ఆటంకమూ మనకీ రెండు రోజుల్లో రావటం నా కిష్టంలేదు" అట్నుంచి వినబడింది.

"రాష్మోకాకి అడ్డు లేదు" అన్నాడు పైడితల్లి పదాన్ని తిరగేసి.

"అయినా కాద్రా కొద్దిపాటి అలజడి చెందటం కూడా నా కిష్టంలేదు" అట్నుంచి స్వామి కంఠం స్థిరంగా వినిపించింది. "తర్క వితర్కాలు ఫోన్‌లో అనవసరం. ఈ రోజు ఆఖరి రోజు. రాత్రి పన్నెండుకి పాప కోమాలోకి వెళ్ళిపోతుంది. అదే సమయానికి పాప వెంట్రుకలు స్మశానంలో కాలాలి. ఆ పని నువ్వు చేయి. సరస్వతి ఎలా వున్నాడు?"

"బాగానే వున్నాడు".

"ఈ రోజే ఆఖరి రోజని చెప్పు. రేపట్నుంచి వేలు సూదితో పొడుచుకోనక్కర్లేదు. ఈ రోజు మూడు చుక్కలు పోయగానే పాప కోమాలోకి వెళ్ళిపోతుంది. ఆ తర్వాత ఇరవై నాలుగు గంటలు కోమామత్తులోనే వుంటుంది. ఆ మత్తులోనే రేపు రాత్రి పన్నెండింటికి ఆమె ప్రాణం పోతుంది. నువ్వు చేయాల్సింది వెంట్రుకలు కాల్చటం, ఆ ప్రొఫెసర్ని అడ్డు తొలగించడం ఆ రెండు పన్లూ. ఇంతకీ పాప మాట పడిపోయిందా ? పోకపోతే ప్రొఫెసరు సైన్సు గెలిచినట్టు. పోతే మన మంత్రశక్తి గెలిచినట్టు. పోయిందా ... "

పైడితల్లి ఆ మాటలకి సమాధానం చెప్పబోతూంటే మెట్లమీద చప్పుడయింది. రామయ్య మెట్లమీద దాదాపు పరుగెడుతున్నట్టు దిగుతున్నాడు. అతడి మొహం ఆతృతతో నిండివుంది.

"శారదమ్మగోరు ఫిట్టొచ్చి పడిపోయారు. డాక్టర్‌కి ఫోన్ చేయండి బాబూ!"

"ఫిట్టొచ్చా ! ఎందుకు?"

కంగారుగా, "తులసమ్మకి ఇప్పుడే మెలకువొచ్చింది బాబూ......! మాట్లాడటంలేదు. మాట పడిపోయింది" అన్నాడు. ఆ విశ్వాసపాత్రమైన నౌకరు నుదురంతా చెమట పట్టింది. చేతులు నులుముకుంటున్నాడు.

పైడితల్లి "అయ్యో! మాట పడిపోయిందా? అయితే తొందరగా డాక్టర్‌కి ఫోన్ చెయ్యాలి.... " అన్నాడు. మాట పడిపోయిందన్న మాట ఫోన్‌లో అవతలి వ్యక్తికి వినబడిందన్న విషయం పైడితల్లికి తెలుసు.

18

అస్థిపంజరంలా పక్కమీద పడివున్న కూతుర్ని చూస్తున్నాడు శ్రీధర్.

పాప నోటమాట రావటంలేదు. ఏ..... ఏ ...... ఏ..... అంటుంది. అంతే. ఆపైన మాట రాదు, చెప్పాలన్న తపన తప్ప. ఏడుస్తూంది. కంటి నుంచి నీటిచుక్క చెంపమీదకు రాలుతుంది. అంతే తప్ప మాట రాదు.

చుట్టూవున్న వాళ్ళకి కూడా కంటనీరు తిరుగుతుంది. మౌనంగా అక్కణుంచి నిష్క్రమిస్తారు.

పాపకి మాట పడిపోయిందని తెలియగానే శారదకి ఫిట్ వచ్చింది. నిజానికి పాపకన్నా ఆమె పరిస్థితే విషమంగా వుంది. పాప గొంతులో ఏదో అడ్డుపడినట్టు గురగురలాడుతుంది. మాటరాదు.

డాక్టరు సంగతి మామూలే. వచ్చాడు. రకరకాల పరీక్షలు చేశాడు. ఈసారి రోగానికి కొత్త పేరు పెట్టాడు. రోజుకో పేరు పెడుతూనే వున్నాడు.

ఇంటెన్సివ్‌కేర్‌లో పాపని ఉంచటానికి శారద ఒప్పుకోలేదు. ఈ విషయంలో ఆమె వాదనతో ఏకీభవించాడు శ్రీధర్.

రోగం ఏమిటో తెలియప్పుడు ఏ కేర్ అయితేనేం?

అతడి కెందుకో సిక్స్‌సెన్స్ చెబుతోంది– 'పాపం మరణం తధ్యమని'.

జరుగుతున్నది అంతా ప్రేక్షకుడిలా చూస్తున్నాడు అతను. మనసులో ఏ మూలో ఒక మారుమూల ..... ఒక చీకటి కోణపు గదిలో అతడు అస్పష్టంగా దేవుణ్ని ప్రార్థిస్తున్నాడు. "భగవంతుడా! అశుభం శుభం తెలియని పాపని యిక బాధపెట్టకు. తొందరగా నీలో ఐక్యం చేసుకో".

ఏ తండ్రీ కోరని ప్రార్థన అది. ఏ తండ్రికీ రాకూడని స్థితి అది! కానీ జరుగుతున్నదంతా చూస్తూంటే అదే మంచిదేమో అనిపిస్తుంది. ఓ పసిపాప బాధతో మెలికలు తిరిగిపోవటం, రెక్కలు విరిగిన పక్షిలా గిలగిలా కొట్టుకోవటం.

నోరున్నప్పుడు 'అమ్మా' అని ఆక్రందన అన్నా చేసేది. ఇప్పుడు అదీ లేదు. కంటి నీటిచుక్కే మనసు బాధను బహిర్గతం చేసేది.

డాక్టర్ పరీక్ష చేసి వెళ్ళాడు. ఇంకో నాలుగు మందులూ, రెండు ఇంజక్షన్లూ, ఐ.వి. ఫ్లూయిడ్స్, ఇంట్రావీనస్.

గోడ గడియారం పన్నెండు కొట్టింది. మధ్యాహ్నమయింది. ఎక్కడో కాకి దాహంతో అరుస్తోంది. గంటలు లెక్కపెట్టిన పైడితల్లి అనుకున్నాడు. "ఇంకా ముప్పై ఆరు గంటలు, అంతే" అని.

ఇంకో పన్నెండు గంటలలో ఇరవై ఒకటో రోజు ప్రవేశిస్తుంది. పాప 'కోమాలోకి వెళ్ళిపోతుంది'. ఆ తర్వాత ఒకరోజు ..... ఇరవై నాలుగ్గంటలు!

అక్కడ ఇరవై ఒకటో రోజు రాత్రి పన్నెండింటికి కాష్మోరా నిద్ర లేవగానే, హోమంలో పాప బొమ్మ తాలూకు భాగాలు పడగానే, చండి, ప్రచండి, చండోగ్ర, చండనాయిక, ఉగ్రచండి మొదలయిన అష్టశక్తులు సంతృప్తి చెందగానే, ఇక్కడ పాప ఆఖరి శ్వాస వదులుతుంది.

హోమం సంగతి అనుకోగానే అతనికి పాప వెంట్రుకలు శ్మశానంలో ఆ రోజు రాత్రి కాల్చాలన్న సంగతి గుర్తుకు వచ్చింది.

'కాష్మోరా'లో ఇరవయ్యవరోజు రాత్రి రోగి వెంట్రుకల్ని కాల్చాలి.

అతడు లేచి పాప ఉన్న గదిలోకి వెళ్ళాడు. పాప పక్కనే కుర్చీలో శ్రీధర్ కూర్చొని వున్నాడు. జుట్టు తైలసంస్కారం లేక రేగి వుంది. నిద్ర లేక కళ్ళు ఎర్రగా వున్నాయి. "నేనుంటాను. మీరు వెళ్ళండి" అన్నాడు పైడితల్లి.

"ఫర్లేదు".

"మీరసలు విశ్రాంతే తీసుకోవటంలేదు. కొంచెం సేపు తీసుకోండి."

శ్రీధర్ ఏదో అనబోతూ ఉంటే కింద ఎవరో వచ్చిన అలికిడి వినిపించింది. బాల్కనీలోంచి చూస్తే అబ్రకదబ్ర. అతడిని తీసుకురావటానికి కిందికి వెళ్ళాడతను.

పాప పైడితల్లినే చూస్తూంది. అతను పాపను చూసి వికృతంగా నవ్వాడు.

రెండడుగులు ముందుకు వేశాడు. పాప భయంతో కుంచించుకు పోయింది. ఎటూ వెళ్ళలేని కుందేలు దగ్గరికి తాపీగా వెళ్ళే పులిలా పక్క దగ్గరికి చేరాడు.

చిన్న జుట్టు పాయని వేళ్ళతో లాగి పట్టుకున్నాడు. అరచేతి చుట్టూ మెలితిప్పి బలంగా లాగాడు. భూమిలో చెట్టు వేళ్ళతో పైకి వచ్చినట్టు వెంట్రుకలు వూడుతున్నాయి. ఆ బాధకి కెవ్వున అరవవలసిందే. కానీ అశక్తతతో బాధగా మూలిగింది. జుట్టు పాయ అతడి చేతిలోకి వచ్చింది. ఏడు వెంట్రుకలున్నాయా లేదా అని లెక్క పెట్టి చూసుకొని సంతృప్తిచెంది లోపల పెట్టుకున్నాడు.

కంటినిండా నీటితో పాప అతడిని చూసింది. ఆమె మాట్లాడలేదనీ, జరిగింది ఎవరికీ చెప్పలేదని అతడికి తెలుసు. అతడి మొహంమీద క్రూరమైన నవ్వు బైటవాళ్ళు లోపలికి వస్తున్నట్టు అలికిడి వినిపించగానే మాయమయింది. వాళ్ళు వస్తుంటే నమ్రతగా పక్కకి తొలగి నిలబడ్డాడు. అర క్షణం తర్వాత బైటపడ్డాడు.

"ఎలా వుంది?" అబ్రకదబ్ర అడిగాడు.

"మామూలే! మరింత వీక్ అయింది" శ్రీధర్ చెప్పాడు.

"పార్థసారధి ఏమంటాడు?"

"ది హెల్ విత్ హిమ్! నాకు అందరి మీదా నమ్మకం పోయింది" అలసట, విసుగు, ఓటమి అన్నీ కలసిన స్వరంతో అన్నాడు. రెండు కప్పులతో రామయ్య కాఫీ తీసుకొచ్చాడు. అబ్రకదబ్ర అతడిని చూసి పలకరింపుగా నవ్వాడు.

"నాకొద్దు" అన్నాడు శ్రీధర్. అబ్రకదబ్రకి ఒక కప్పు యిచ్చి ఇంకొకటి లోపలికి తీసుకెళ్ళి పోయాడు.

"ఆయుర్వేదం వాడితే ?" కాఫీ కప్పు క్రింద పెడుతూ అబ్రకదబ్ర అన్నాడు.

శ్రీధర్ మాట్లాడలేదు. అబ్రకదబ్ర లేచి పాప దగ్గరికి వెళ్ళాడు. నుదుటిమీద చెయ్యివేసి చూశాడు నార్మల్........ ! అంతా నార్మల్‌గానే వుంటుంది. రోగం మాత్రం తగ్గదు.

"ఎలా ఉంది పాపా?"

పాప అతడివైపు చూసింది. "ఏ ...... ఏ..... వ్ వ్ వ్వ్ వ్వ్......."

శ్రీధర్‌కి ఉప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది.

నోటికి చెయ్యి అడ్డుపెట్టుకొని బైటకి వెళ్ళిపోయాడు.

రెండు నిమిషాల తర్వాత అబ్రకదబ్ర బయటి కొచ్చేసరికి అతడు పిట్టగోడని పట్టుకొని నిలబడి వున్నాడు. ఆ కొద్దిసేపట్లో అతడు సర్దుకున్నాడు. అబ్రకదబ్రా అతడి భుజంమీద స్నేహ పురస్కారంగా చేయివేసి "నీకు చెప్పేటంత పెద్దవాణ్ని కానుగానీ, ఒకటి మాత్రం చెప్పగలను. కష్టమొచ్చినప్పుడే మనం ధైర్యంగా వుండాలి".

అతడు తలూపి, "ఇట్సాల్‌రైట్" అన్నాడు. ఇద్దరూ అక్కడే కొంచెంసేపు నిలబడి ఆ విషయం గురించి మాట్లాడుకున్నారు. "ఇంకో డాక్టరుకి చూపిద్దామా?"

శ్రీధర్ తల అడ్డంగా వూపుతూ "నో ......" అన్నాడు. "పార్థసారధి మీద నాకు బాగా నమ్మకం వుంది. అదీగాక ఇంకో యిద్దరు డాక్టర్లని తనే తీసుకువచ్చాడు కూడా..... "

అబ్రకదబ్ర మాట్లాడలేదు.

ఇద్దరూ మెట్లు దిగి క్రిందికి వస్తూంటే అతను మళ్ళీ అన్నాడు. "పోనీ నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో చేర్పిస్తే......"

"ఏమని చేర్పిస్తాం" అన్నాడు శ్రీధర్. "అసలు రోగం ఏమిటో తెలియదు. వచ్చిన రోగం రావటంలేదు. రోజుకో కంప్లెయింట్. ఇరవై రోజుల్నుంచీ రోజుకో రోగం......"

అబ్రకదబ్ర మెదడులో ఏదో మెరిసినట్టయింది. మెట్లు దిగుతున్న వాడల్లా చటుక్కున ఆగిపోయాడు. **ఇరవై రోజుల్నుంచీ రోజుకో రోగం.** అతడికి ఎప్పటివో ఫకీరు మాటలు జ్ఞాపకం వచ్చినయ్. చేతబడికన్నా పెద్ద విద్య ఏమిటది? కా...... కా...... కాష్..... కాష్ ఆ కాష్మోరా.

అతడి మొహం ఏదో రహస్యాన్ని కనుక్కున్నట్టు వెలుగుతో నిండిపోయింది. "యురేకా" అని అరిచాడు. శ్రీధర్ అతడివైపు చిత్రంగా చూశాడు.

"పెట్టిన బాధ పెట్టకుండా మనిషిని ఇరవై ఒక్క రోజులపాటు పీడించి చంపే విద్య ...... కాష్మోరా" అతడి కళ్ళు మిల మిల మెరుస్తున్నాయి.

అయితే శ్రీధర్ మొహంలో ఏ భావమూ లేదు. ఈ మంత్రతంత్రాల గురించి వినీ వినీ అతడు అలసిపోయాడు.

"నాకో ఫకీరు చెప్పాడు..... ఈ కాష్మోరాని ప్రయోగించేవాళ్ళు దాదాపు ఇప్పుడెవరూ లేరట. కానీ యిది నిశ్చయంగా కాష్మోరాయే!"

శ్రీధర్ మొహం చిట్లించి – "ఏమిటి నువ్వనేది?" అన్నాడు.

"మన పాపమీద ఎవరో కాష్మోరాని ప్రయోగించారు".

"ఎందుకు?"

అబ్రకదబ్ర దీనికి వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కానీ లోపల్నుంచి ఉద్వేగం తన్నుకొస్తూంది. తను ఇంత కష్టపడి కనుక్కున్న దానిని ..... అంత తేలిగ్గా

శ్రీధర్ తీసెయ్యటం అతడికి నచ్చలేదు. తనతో పాటు అతడు ఎగిరి గంతేస్తాడని అనుకొన్నాడు. వెంటనే భూతవైద్యుణ్ని సంప్రదిస్తాడనుకున్నాడు.

శ్రీధర్ మాత్రం తాపీగా "ఆ ఫకీరు నీకింకా ఏం చెప్పాడు బ్రాహ్మిణ్?" అని అడిగాడు.

అతడా మాత్రం ఇంటరెస్టు చూపించటం చూసి, బ్రాహ్మిణ్ ఉత్సాహంగా ముందుకు వంగి "వెయ్యి సంవత్సరాల క్రితం కొంతమంది ఈ విద్యని ఉపయోగించి ప్రత్యర్థుల్ని చంపేవారట. ఆ ఫకీరు నాకు నేర్పుతానన్నాడు. పెట్రోలులో చెయ్యి ముంచి, దానిమీద అగ్గిపుల్ల వెలిగిస్తే..... " చెప్పబోతున్న వాడల్లా ఆగాడు.

అంత విషాదంలోనూ శ్రీధర్ నవ్వాడు. అబ్రకదబ్ర నాలిక్కర్చుకొని, "చెయ్యి కాల్చుకోవటం, అదంతా వేరే సంగతనుకో! కాష్మోరాలో...." అంటూ ఏదో చెప్పబోయాడు.

"బ్రాహ్మిణ్" ఆపుచేసాడతన్ని. "దయచేసి నువ్వు ఇంకేమీ చెప్పకు, ఇలాంటి విషయాలన్నీ మీ ఆవిడయితే ఇంటరెస్టింగ్‌గా వింటుందని నా ఉద్దేశ్యం. నువ్వెళ్ళి అక్కడ చెబితే బాగుంటుంది".

అతడి మొహం ఎర్రబడింది...... "సర్లే, అయితే, ఇక ఆ విషయం వదిలి పెట్టు" అన్నాడు.

"నేను కోరేదీ అదే" అన్నాడు శ్రీధర్.

"నేను వెళ్ళొస్తాను".

శ్రీధర్ అతడి దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యి వేశాడు. "బ్రాహ్మిణ్! మా మీద మీరందరూ చూపిస్తున్న అభిమానానికి నా కృతజ్ఞతలు మాటల్లో చెప్పుకోలేను. కానీ మా స్థితికూడా అర్థం చేసుకో! నా తరపు నుంచి ఏదైనా తప్పుంటే క్షమించు".

ఆ మాటల్లో ఆప్యాయతకి కదిలిపోయాడు బ్రాహ్మిణ్. "సారీ శ్రీధర్! నేనే ఈ అర్థంలేని భూతాల గురించీ, దెయ్యాల గురించీ మాట్లాడి మిమ్మల్ని మరింత బాధపెడుతున్నాను" అన్నాడు.

"ఇంకీ విషయం మర్చిపోదాం".

"నేను అదే చెబుదామనుకొంటున్నాను".

"గుడ్‌నైట్ బ్రాహ్మిణ్!" "గుడ్‌నైట్" షేక్ హేండిచ్చి వెనుతిరిగాడు. శ్రీధర్ లోపలికి వెళ్ళిపోయాడు. అబ్రకదబ్ర తల తిప్పి చూశాడు. ఏదో చెప్పాలన్న ఆతృతతో తనవైపే చూస్తున్న రామయ్య కనిపించాడు. సాయంత్రం ఆరయింది.

* * *

సాయంత్రం ఆరయింది.

"ఇంకా ఆరుగంటలు" అన్నాడు పైడితల్లి. "ఇంకా ఆరుగంటలలో పాప కోమాలోకి ఎళ్ళిపోతుంది. ఆ తర్వాత ఇరవై నాలుగు గంటలు".

ఇద్దరూ గుంభనంగా నవ్వుకున్నారు.

"అర్థరాత్రి వరకూ మెలకువగా వుండే శ్రమకూడా తప్పుతుంది. పన్నెండింటి వరకూ ప్రతిరోజూ మెలకువగా వుండలేక చచ్చాను బాబూ!" సరస్వతి అన్నాడు.

పైడితల్లి లేచాడు. "మరి నేనూ వెళ్ళొస్తానూ వీటిని స్మశానంలో కాల్చాలి" అంటూ వెంట్రుకలు పట్టుకొని లేచాడు.

"మనం రేప్రొద్దున్న ఆ యిల్లు ఖాళీ చెయ్యొచ్చా?"

"ఇలా వెంటనే ఖాళీచేస్తే అనుమానం రావొచ్చు. పెద్దకర్మ వరకూ వుందాం" నవ్వాడు. పైడితల్లి వెళ్ళాక, తలుపు దగ్గరగా వేసి గోడకి ఆనుకొని కూర్చున్నాడు సరస్వతి. చూపుడు వేలు పైకెత్తి చూసుకున్నాడు. సూది గుచ్చీ గుచ్చీ తూట్లుపడింది. ఇంకెంత ఒక రోజేగా అనుకున్నాడు.

* * *

"మీతో కొంచెం మాట్లాడాలి బాబుగారూ! ఇప్పుడు కుదురుతుందా?" అని రామయ్య అబ్రకదబ్రని అడుగుతున్న సమయానికి జయదేవ్ కారు ఆ ఇంటిని చేరుకొంది. అయితే వాళ్ళిద్దరూ అతణ్ని పట్టించుకోలేదు.

జయదేవ్ లోపలికి వెళ్ళాడు.

శ్రీధర్ ఆ సమయానికి ఆస్పత్రిలో వున్నాడు. పాపకి మూడుచోట్ల ఎక్స్‌రే తీశారు. విభ్రాంతి కల్గించే విషయం ఏమిటంటే పాప గొంతు అడుగు భాగాన ఉన్న బంతిలాంటి పదార్థం ఎక్స్‌రేలో బైటపడింది.

"ఈ ఫారిన్ బాడీ (బంతిలాంటి పదార్థం) వల్లే మాట పడిపోయిందా?" శ్రీధర్ పార్థసారధిని అడిగాడు. పార్థసారధి జవాబు చెప్పలేదు. ఇది అతనికి తెలుసుకానీ

అది చెప్పి మరోసారి తేలిక అవడంలేదు. ఇప్పటికే ఓటమి చివరి అంచున వున్నాడతడు.

పాప కంఠం వుబ్బిలేదు. మామూలుగానే వుంది. మాట మాత్రం రావడంలేదు. ప్రొఫెసర్ పాపవైపు జాలిగా చూసి తల పంకించాడు. శారద నిర్వికారంగా ఇద్దర్నీ చూస్తోంది.

తాంత్రిక విద్యలకి, సైన్సుకి మధ్య నున్నది హిప్నాసిస్ అనుకొంటే, హిప్నటిస్టులు కూడా మంత్రతంత్రాల్నీ, చేతబడుల్నీ నమ్మరు. ఒక విధంగా హిప్నాటిజం కూడా సైన్సే. దురదృష్టవశాత్తు శ్రీధర్‌కి, 'ఈ సైన్సు'మీద కూడా నమ్మకంలేదు. కాని శారద దీన్ని స్వయంగా తన కళ్ళతో చూసింది. ఈ ప్రపంచంలో పాపని రక్షించగలిగే వాడెవడైనా వుంటే అది యీ ఒక్క ప్రొఫెసరేనని ఆమె నమ్మింది. అయితే కొన్ని వేల వేల సంవత్సరాల చరిత్ర వున్న క్షుద్ర తాంత్రిక విద్యల ధాటిని ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఈ సైన్సు ఎలా ఎదుర్కోగలదనేది వేచి చూడాల్సిందే!

పాప మాట ఎలా పడిపోయిందీ- అన్న కారణం ఆలోచించటం లేదు ప్రొఫెసర్. పాప నోట మాట పలికించటం ఎలాగా అని ఆలోచిస్తున్నాడు. శారద అతడినే చూస్తున్నది. జయదేవ్ ముందుకు వంగి "నీ పేరేమిటి పాపా" అన్నాడు.

"....... ఎ ..... ఏ ....వ్వే.... " బలం అంతా గొంతులోకి తెచ్చుకున్న పాప నోటమాట రాలేదు. అతడు గొంతుని వేళ్ళతో సుతారంగా నిమిరాడు. ఎంత సున్నితంగా ముట్టుకొన్నా పాప గిజగిజలాడి పోతూంది. ఆ బాధ తను చూడలేనట్టు శారద అతడిని వారించింది. అది అర్థం చేసుకున్న వాడిలా అతడు మరేమీ ప్రయత్నించలేదు. పాప కనురెప్పల మీద చేయివేసి, "నువ్వు నిద్రపోతున్నావు.... నువ్వు నిద్రలోకి జారుకున్నావు..... నువ్వు హాయిగా నిద్రపోతున్నావు...... స్లీప్.... స్లీప్......" అంటున్నాడు.

రిథమాటిక్‌గా వినిపిస్తున్న అతడి కంఠం ఒక విధమైన తీగమీద వేలితో మీటుతున్నట్టు ఆ గది గోడల మధ్య ప్రతిధ్వనిస్తూ వుంది. వింటూన్న శారదకే మైకం వచ్చినట్టు వుంది. పది సెకండ్లలో పాప ట్రాన్స్ (మత్తు)లోకి జారుకుంది.

(మొదటిసారి హిప్నాసిస్‌కి లోబర్చుకోవటమే కష్టం. తరువాత తరువాత చేయబడే వారి మెదడు చేస్తున్న వారి మాటలకి ససెప్టబులిటీని పొందుతుంది. తొందరగా లోబడిపోతుంది.)

పాప మత్తులోకి జారుకున్నాక జయదేవ్ శారదవైపు తిరిగాడు.

"ఎంతసేపయింది మాట పడిపోయి?" అని అడిగాడు.

"ప్రొద్దున లేచినప్పట్నుంచి".

జయదేవ్ సాలోచనగా పాపవైపు చూశాడు. పాప మెదడు తన మాటలకోసం, తన ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ వుందని తెలుసు. తనకు తెలిసిన ఒకే విద్యని పాపమీద ప్రయోగించదల్చుకున్నాడతను.

అది - **రిగ్రెషన్**

హిప్నాటిజంలో రిగ్రెషన్ అన్నది ఒక అంశం. రిగ్రెషన్ ద్వారా మనిషిని తన గత జీవితంలోకి ప్రవేశింపచేయవచ్చు. వెనక్కి .... వెనక్కి ....ఇంకా వెనక్కి ..... ఇలా గతంలోకి తీసుకెళ్ళి యాభై ఏళ్ళ వృద్ధుడిని ఏడేళ్ళ కుర్రవాడిగా చేసి గోళీలాడించవచ్చు. చిన్న తనంలో అతడు మర్చిపోయిన ఎన్నో విషయాలని అతడి ద్వారానే వినవచ్చు. అయితే యీ రిగ్రెషన్ ద్వారా వెనక్కి తీసుకెళ్ళి యాభై ఏళ్ళవాడ్ని ఐదేళ్ళవాడిగా చేసి ..... ఇంకో సంవత్సరం వెనక్కి తీసుకెళ్ళి నాలుగేళ్ళ వాడిగా చేసి....... తరువాత మూడు ఏళ్ళు- రెండేళ్ళు-ఒకేడు- తల్లి కడుపులోపిండం - అంతే....... అంతవరకూ మాత్రమే చేయగలడు హిప్నాటిస్టు. ఇంకా వెనక్కి వెళ్ళగలిగితే....

రీ ఇన్‌కార్నేషన్ గతజన్మ !

మళ్ళీ ఇది తాంత్రిక విద్య. సైన్స్‌కి అందనిది. దీన్ని హిప్నాటిస్ట్ సాధించలేకపోతున్నాడు. మనిషిని తల్లి కడుపులోనికి తీసుకెళ్ళగలిగినవాడు, అంతకన్నా వెనక్కి ప్రస్తుతం 1980 లో వెళ్ళలేకపోతున్నాడు. ఏమో! 2080 వ సంవత్సరంలో వెళ్ళగలడేమో.

ఈ రిగ్రెషన్ ద్వారానే జయదేవ్ పాపతో మాట్లాడించడానికి పూనుకున్నాడు. అతడు పాప మీదుగా వంగి చెవిలో నెమ్మదిగా మాట్లాడసాగాడు.

"....... నువ్వు నా మాటలు తప్ప ఇంకేమీ వినటంలేదు...... నీ ఆలోచనల్నీ నా మాటలు కంట్రోలు చేస్తున్నాయి...... నువ్వు నెమ్మదిగా...... నెమ్మది నెమ్మదిగా నిన్నటికి వెళుతున్నావు.... నువ్వు నిన్నట్లోకి వెళుతున్నావు. నువ్వు నిన్నట్లోకి వెళుతున్నావు....... నిన్న నువ్వు మాట్లాడుతూనే వున్నావు. నువ్వు నిన్నట్లోకి వెళుతున్నావు..... నిన్న నువ్వు మాట్లాడుతూనే వున్నావు. నీ గొంతు కండరాల్లో బలం వుంది...... నిన్న మాట్లాడావు నువ్వు .... నిన్న నీ పేరేమిటి అని అడిగితే

చెప్పగలిగావు ......జ్ఞాపకం తెచ్చుకో నిన్నటి రోజు ......నిన్నటిరోజు (రెండుసార్లు అన్నాడు) నీవు 'నిన్న'లోకి ప్రవేశిస్తున్నావు (మూడుసార్లు) నిన్న నువ్వు మాట్లాడగలిగావు..... నీ గొంతు కదిలింది.... మాట్లాడగలిగావు......"

నెమ్మదిగా పాప గొంతు కండరాలు కదలటాన్ని శారద దిగ్భ్రాంతితో చూసింది. "నిన్న నువ్వు మాట్లాడావు..... నీ గొంతు కదులుతూంది.... నిన్న ని..... న్న" అని ఆగి, "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"తులసి".

పాప జవాబు చెప్పేసరికి శారద ఆనందం పట్టలేక చిన్నగా అరిచింది. అదే ఆమె చేసిన తప్పు. ఆ కేక ఆ క్రింద గదిలో వున్న పైడితల్లికి వినిపించింది. అతడు చప్పున లేచాడు. మరుక్షణం బల్లిలా అతడు చప్పుడు చేయకుండా నెమ్మదిగా మెట్లెక్కుతున్నాడు.

"ఈ రోజే వారం?"

"గురువారం".

శారద టేబుల్‌వైపు చూసింది. ఆ రోజు శుక్రవారం.

కిటికీలోంచి సన్నటి నీడ పడటం వాళ్ళిద్దరూ గమనించలేదు. కిటికీ అవతల పైడితల్లి వింటున్నాడు. తులసి మాట్లాడటం విని అతడి దవడ కండరం కసితో బిగుకుంది.

పైడితల్లి ఏం చదువుకున్నాడో ఎవరికీ తెలీదు. కానీ ఒకోసారి అతడికి తెలియని విషయం లేదేమో అనిపిస్తుంది. సైన్సు, జాగ్రఫీ, ఇంగ్లీషు అన్నీ. ప్రొఫెసర్ జయదేవ్ రిగ్రెషన్ ద్వారా పాపని వెనక్కి తీసుకెళ్ళి పాపతో మాట్లాడగలిగాడని అతడు గ్రహించాడు.

బాగా చీకటిగా వుంది. అప్పుడు ఏడు కావొస్తుంది. ఇంకా ఐదు గంటలుంది పన్నెండు కొట్టడానికి. పన్నెండయితే చాలు పాప కోమాలోకి వెళ్ళిపోతుంది. అప్పటివరకూ ఎంతో బాధ ననుభవించిన ఆ పాప లేత అవయవాలు శాశ్వత నిద్రలో విశ్రాంతి తీసుకోవటం ప్రారంభిస్తాయి. కళ్ళు, హృదయం, చెవులూ అన్నీ.

హిప్నాటిస్టు ఏం చేయగలిగినా అవతలి వ్యక్తి మెదడు ససెప్టబుల్‌గా ఉన్నంతవరకే. ఇంకో అయిదు గంటల తర్వాత పాప కోమాలోకి వెళ్ళాక ఏం చేయగలడు? ఈ విషయం గుర్తొచ్చి పైడితల్లి పెదవుల మీద చిరునవ్వు వెలిసింది. ఇంకో అయిదు గంటలు – పాప చెవులు పనిచేయటము మానెయ్యగానే ..... మెదడుకు 'అజ్ఞ తీసుకొనే శక్తి' పోగానే.....

అయినా పైడితల్లి ఏ విధమైన రిస్కూ తీసుకోదల్చుకోలేదు. అందులోను అతడికి బిస్త్రా నుంచి ఫోను కూడా వచ్చింది.

మనుషుల్ని చంపటం అతడికి కొత్త కాదు. అయితే అతడికీ ఆ రోజు చాలా పనులున్నాయి. ముఖ్యంగా పన్నెండింటికి శ్మశానంలో పాప వెంట్రుకలు కాల్చి నల్లపిల్లి రక్తంలో కలపాలి. ఈ హిప్నాటిస్టు ఏమీ సాధించడనేది నిర్వివాదాంశం. అయినా ఎందుకు అతణ్ని బ్రతికించటం? అతడి మెదడులో ఒక ఊహ మెరిసింది.

మరుక్షణం అతడు చప్పుడు చెయ్యకుండా మెట్లు దిగాడు. సరిగ్గా పది నిమిషాల తర్వాత సదరన్ హిల్స్‌లో వున్న జయదేవ్ ప్లాట్ దగ్గర వున్నాడతడు. పక్కనే ఇండస్ట్రియల్ ఎస్టేట్ లైట్లు మసకగా కనిపిస్తున్నాయి. అతడు మెట్లెక్కుతూ వుంటే కింద ఇంటావిడ అడిగింది.

"కౌన్ హై?"

పైడితల్లి ఆగి తడబడకుండా "ప్రొఫెసర్ సాబ్‌కే వాస్తే" అని తిరిగి మెట్లెక్కసాగాడు.

ప్రొఫెసర్ ఫ్లాట్ వరండా మసక చీకట్లో నిర్మానుష్యంగా వుంది. ద్వారానికి తాళం కప్ప వేలాడుతూ వుంది. పైడితల్లి మిషన్ కన్నా వేగంగా పనిచేస్తున్నాడు. జేబులోంచి సన్నటి తీగ తీసి తాళంకప్పకి చుట్టాడు. గోడమీదనుంచి దాన్ని క్రిందకి విసిరేశాడు. తీగ గోడకి తగిలేచోట రబ్బరు హోల్డరు మధ్యలో పెట్టాడు.

మెట్లు దిగి క్రిందకి వచ్చాడు. అయిదు నిమిషాల తర్వాత అతడి చేతిలోని వంద రూపాయల నోటు లైన్‌మెన్ చేతిలోకి మారింది. రెండు నిమిషాల మెయిన్ ఆఫ్‌లో వుండగా అతడు చిరుతలా పోల్ ఎక్కాడు. ఇంకో నాలుగు నిమిషాల తర్వాత అతడింటికి వెళ్ళిపోయాడు.

ఎలక్ట్రిసిటీ లైన్‌మెన్ అనుకోకుండా తన చేతికొచ్చిన వందనోటువైపు ఆనందంగా చూసుకున్నాడు. అతడికి తెలీదు –

ఇండస్ట్రియల్ ఎస్టేటు తీగెలగుండా ప్రవహించే అత్యంత భయంకరమైన 440 కె.వి.ఎ. కరెంటు పక్క వీధిలో వున్న జయదేవ్ అనబడే హిప్నాటిస్టు ఇంటిముందు ద్వారానికి వేసున్న తాళంకప్పకి కనెక్టు చేయబడిందనీ, ఆ చీకట్లో ఆ గృహస్తు తాళం తీయటానికి దాన్ని ముట్టుకున్న మరుక్షణం వళ్ళు గగుర్పొడిచే రీతిలో ...... ఆ షాక్‌కి అతడి మెదడుకణాలు చచ్చిపోయి– శరీరం కుదించుకుపోయి దారుణంగా మరణిస్తాడనీ.

* * *

తన మరణానికి తన ఇంటి దగ్గర ఈ ప్రయత్నం జరుగుతున్న సమయంలో ట్రాన్స్‌లో వున్న తులసితో మాట్లాడుతున్నాడు జయదేవ్.

"ఇంకోరోజు వెనక్కి వెళుతున్నావు...... బాధగా వుందా?"

"ఉంది"

శారద కేలండరు మీద గుర్తుపెట్టింది. అది పదిహేనో రోజు.

"ఏం బాధ?"

"వెన్నులో ఎవరో పొడుస్తున్నారు. కత్తులతోనూ, బల్లేలతోనూ" మంచంమీద ఎగిరెగిరి పడుతూ అరిచింది తులసి. జరుగుతున్నదంతా పాప మెదడులో నిక్షిప్తమై వున్న జ్ఞాపకాల పరిశీలనే అని శారదకి తెలుసు. అయినా ఆ తల్లి మనసు ఆ రోజునాడు పాప అనుభవించిన బాధని తల్చుకొని విలవిల లాడింది.

"ఇంకొక్కరోజు వెనక్కి ఏమైంది?" పాప మెడ అటూ ఇటూ విసురుతూ - "నా మెడ.... నా మెడమీద ఎవరో కాలువేసి నొక్కుతున్నారు. అమ్మా" అని హృదయవిదారకంగా అరిచింది. శారదకి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగినయ్. కింది పెదవిని పంటితో నొక్కి పెట్టి కేలండర్‌లో నోట్‌చేసింది అది పదహారో రోజు.

"ఇంకో రోజు వెనక్కి - బాధగా వుందా?"

"ఉంది".

"ఏమిటి?"

మౌనం. జయదేవ్ రెట్టిస్తూ "ఏమిటి చెప్పు?" అన్నాడు. మౌనం.

"నువ్వీ రోజునుంచి పదిహేడు రోజులు వెనక్కి వెళ్ళావు. నీకు బాధగా వుంది. ఏమిటది? ఏం బాధ?" అనునయిస్తున్నట్టు అడిగాడు.

పాప నిశ్శబ్దంగా కొంచెం సేపు వుండి చప్పున అరిచింది -

"శ్మశానం, నల్లటి శ్మశానం. అదిగో ఎవరో వస్తున్నారు. మీదకు వస్తున్నారు. మీది మీది కొస్తున్నారు".

జయదేవ్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా "ఎవరు? ఎలా వున్నారు?" అని అడిగాడు. మౌనం. "చెప్పు ఎలా వున్నారు?" మౌనం. శారద ఊపిరి బిగపట్టి వింటూంది.

"వాళ్ళు ఇద్దరు - ఒకడు నల్లగా వున్నాడు, ఇంకొకడు పొట్టిగా వున్నాడు. వాళ్ళ చేతిలో చీపురుకట్టలున్నాయి" అన్నది.

నిజానికి ఇది తప్పు. ఆ రోజుకి పదిహేడు రోజులు వెనక్కి వెళితే, అంటే పాపకి చేతబడి చేసిన నాలుగోరోజు, రామయ్య మాటల సందర్భంలో ఈ ప్రసక్తి

రావటం పాప మగతనిద్రలో విన్నది. ఆమె మెదడులో ఎక్కడో ఇది నిక్షిప్తమైపోయి ఆ రోజు బైటకొచ్చింది. అంతేకానీ చేతబడిలో ఎవరో శ్మశానంలో తనకేదో చేసేస్తున్నారని ఇక్కడి వ్యక్తి చూస్తున్నట్టు చెప్పటానికి వీలులేదు. అయితే తన మెడమీద ఎవరో కాలితో నొక్కుతున్నట్టు వుందని అనటం, చెయ్యి వెనక్కి విరిచేస్తున్నారనటం మాత్రం కరక్టే. జయదేవ్ పాప మాటలకి అంత ప్రాముఖ్యత ఇవ్వకుండా ముందుకు సాగాడు. అతడికి తెలుసు ఈ శ్మశానం సంగతి చెప్పటం కేవలం కో-ఇన్సిడెంటల్ మాత్రమేనని.

అతడు తన ప్రొఫెస్‌లో ఇంకో నాలుగురోజులు వెనక్కి వెళ్ళాడు. అంటే సరిగ్గా ఇరవై రోజుల వెనక్కి - "ఈ రోజెలా వుంది?"

"ఎలా వుందంటే?"

"అంటే బావుందా - ఏదైనా బాధగా వుందా?"

"బాధా - అంటే?"

శారద అయోమయంగా చూసింది జయదేవ్ వైపు. జయదేవ్ అన్నాడు - "రాబోయే ఇరవై రోజుల్లోనూ తను నరకాన్ని అనుభవించబోతూందని పాపకి ఇరవై రోజుల క్రితం తెలీదు" శారద అర్థమైనట్టు తల వూపింది.

"నీ దగ్గరకెవరయినా వస్తున్నారా? తెలియనివాళ్ళు నిన్నేదయినా చేస్తున్నారా?" శారద ఆతృతగా అడిగింది. జయదేవ్ నవ్వి "పాప మెదడుని కేవలం నా మాటలు మాత్రమే కంట్రోలు చేయగలవు" అని పాప వైపు తిరిగి అదే ప్రశ్న వేశాడు.

"లేదు" అన్నది పాప.

"నువ్వు నిద్రపోతున్నప్పుడు?"

"నేను నిద్రపోను".

శ్రోతలిద్దరూ ఉలిక్కిపడ్డారు. "అస్సలు నిద్రపోవా!?"

"కొంచెంసేపు -"

"కొంచెంసేపంటే - గంటా? రెండు గంటలా ? నాలుగ్గంటలా?"

"పావుగంట".

"ఎన్ని గంటలకి?"

"అర్ధరాత్రి పన్నెండు గంటలకి".

జయదేవ్ సాలోచనగా శారదవైపు చూశాడు. శారద అన్నది - "పాప మామూలుగానే నిద్రపోతున్నది. మొదట నాల్రోజులు మాత్రం వేరేగా పడుకుంది.

కానీ తరువాత నేనూ ఆయన చెరోవైపు పడుకుంటూనే వున్నాం. పగలెంత గొడవ చేసినా రాత్రి అయ్యేసరికి పాప బాగానే నిద్రపోతున్నది".

ఆమెకీ, జయదేవ్‌కీ తెలియని విషయం ఒకటున్నది. చేతబడిలో, చేతబడి చేయబడిన వ్యక్తి అన్ని రోజులూ నిద్రపోదు. పడుతున్న బాధల వలన శోషతో కొద్దిసేపు కన్నుమూస్తే మూయవచ్చుగాక. అది నిద్ర అని భ్రమపడకూడదు. ఆ శోషతో వచ్చిన మత్తుతో ఒకోసారి మనం గిల్లినా అది ఆ వ్యక్తికి తెలియదు. ఒకోసారి కళ్ళు తెరచుకుని కూడా ఆ వ్యక్తి నిద్ర (మత్తు) పోవచ్చు.

"పావుగంట సేపు నిద్ర నీకు సరిపోతుందా? అయినా సరీగ్గా పన్నెండింటికే నిద్ర ఎలా పడుతుంది? సరీగ్గా పన్నెండింటికి?" జయదేవ్ అడిగాడు. పాప మాట్లాడలేదు.

ఇంకేం అడగాలో తెలియలేదు ఆ ప్రొఫెసర్‌కి. నిజానికి తనిలా పాపని రిగ్రెషన్ ద్వారా గతంలోకి తీసుకెళ్ళి ఏం సాధించగలడో అతడికే అర్థంకాలేదు. అతడు సమస్యకి పాపం ఎంత దగ్గరగా వచ్చి కొద్దిలో తప్పిపోయాడో అతడికి తెలియదు. 'పాపా ! నిన్నెవరయినా బాధపెట్టారా నిన్న' అని ఒక ప్రశ్న అడిగుంటే పైడితల్లి జుట్టు పీకటం గురించి చెప్పివుండేదేమో. అయినా అది తెలిస్తే ఏం జరుగుతుంది? ఆ సమయానికి పైడితల్లి స్మశానం దగ్గరున్న పాడుబడిన సత్రంలో పడుకుని పన్నెండు ఎప్పుడవుతుందా - జుట్టు ఎప్పుడు కాలుద్దామా అని చూస్తున్నాడు. ఇదంతా చేతబడి అని తెలుసుకున్నా ఆ విజ్ఞానవంతులు దీన్ని నమ్ముతారా? అయినా కాష్మోరాని ఎదిరించగలిగిన మహాశక్తి ఏముంది ఈ ప్రపంచంలో?

జయదేవ్ శారదవైపు తిరిగి "ఈ రోజుకిది చాలు, రేపు చూద్దాం మళ్ళీ. ఈ రోజు మనం సాధించిన విషయం తక్కువదేమీ కాదు" అన్నాడు. రేపనేది పాపకి లేదనీ, ఆ రోజు రాత్రి పాప కోమాలోకి వెళ్ళిపోబోతూందనీ తెలియని శారద అలాగే అన్నట్టు తలూపింది.

"కొంచెం చల్లటి నీళ్ళు–" అని అడిగాడు జయదేవ్. హిప్నటైజ్ చేయబడిన వ్యక్తిని మామూలుగా మార్చటానికి చల్లటినీళ్ళు మంచి సాధనం. ఫ్రిజ్‌లో నీళ్ళు తేవటం కోసం శారద క్రిందికి వెళ్ళింది.

జయదేవ్ సాలోచనగా పాపవైపు చూశాడు. అతడికి అంతక్రితం రోజు డాక్టర్ సారధి తనతో అన్న మాటలు గుర్తొచ్చినాయి. "పాప ఇంకెంతో కాలం

బ్రతకదు. నలభై ఎనిమిది గంటలు ..... మహా అయితే ఇంకో రోజు–"అతడు పాపవైపు చూశాడు. ఒక రకమయిన తేజస్సుతో వెలిగిపోతూంది పాప మొహం ఆ బాధలన్నిటికీ అతీతంగా. అతననుకున్నాడు– "నలభై ఎనిమిది గంటలు కాదు ...... ఇరవైనాల్గు గంటలు....... అంతే" అని. మరణానికి ఒకరోజు ముందు చేతబడి చేయబడిన వ్యక్తి సమస్త బాధల్నుంచీ తాత్కాలికంగా విముక్తి పొందుతాడు. అది చూసి ఇంటిల్లిపాదీ అప్పటివరకూ అనుభవించిన కష్టాలు తొలగిపోయాయి కదా అనీ సంతోషపడతారు కూడా– కానీ ప్రొఫెసర్ ఈ అంచనా వేసింది చేతబడి గురించి కాదు, పాప మొహంలో కనబడుతున్న చావుకళని చూసి. అతడు జాలిగా పాప నుదుటిమీద చేయివేసి నిలబడ్డాడు, నిలబడబోతూంటే కనబడింది అది.

చిన్న దూదిగుడ్డతో చుట్టివున్నది. పాప పక్కన మంచం కింద పడివుంది. అతడికి ఆ పడివున్న తీరు అనుమానం కలిగించింది. వంగి దాన్ని తీసుకుని పరీక్షించాడు. వాసన చూస్తే క్లోరోఫాంలా వుంది.

అదిక్కడెందుకుంది?

అతడు దాన్ని పరీక్షిస్తూ వుండగా నీళ్ళతో శారద వచ్చింది. ఆమెకి దాన్ని చూపించి అడిగాడు. ఆమెకీ అర్థంకాలేదు. అదిక్కడికి ఎలా వచ్చిందో. అందులోనూ క్లోరోఫారం. ఒక్కక్షణం ఆలోచిస్తే అర్థమయినట్టూ అనిపించింది....... స్లో పాయిజనింగ్, పాప పక్కలో పడుకున్న తల్లిని మత్తులో నిద్రపుచ్చి పాపకి రాత్రి ఎవరో విషమిస్తున్నారు ప్రతిరోజూ.

అతడు మరి ఆలస్యం చేయకుండా డాక్టర్ సారధికి ఫోన్ చేశాడు. అయితే అతడి థ్రిల్‌నంతా ఆ డాక్టర్ ఒక్క క్షణంలో కొట్టిపడేశాడు. "చూడు జయదేవ్ ! నీ ఫీల్డ్‌లో నువ్వు గొప్పవాడివే కావచ్చు. కానీ నాకూ వైద్యంలో అన్ని సంవత్సరాల అనుభవముంది. పాప కెవరయినా స్లోపాయిజనింగ్ చేస్తున్నారన్న విషయం నువ్వు నిరూపిస్తే నేను ఉద్యోగం నుంచి రిజైన్ చేస్తాను. అటువంటి విషప్రయోగం ఏదయినా జరుగుతూ ఉంటే ఆ విషయం నాకు మొదటి నాలుగు రోజులలోనే తెలిసి వుండేది".

జయదేవ్ నిరాశగా ఫోన్ పెట్టేశాడు. ఎంతో గొప్ప విషయాన్ని కనుక్కున్నాననుకున్నాడతను. కానీ సారధి వైద్య పరిజ్ఞానాన్ని కూడా కొట్టిపడెయ్యటానికి వీలులేదు. ఎక్కడో ఏదో మెలిక వుంది. ఎక్కడ? ఎక్కడ ? ఎక్కడ?

అతడో నిర్ణయానికి వచ్చినట్టు శారదవైపు తిరిగాడు. "ఈ కేసుని హిప్నాటిస్టు ఏమీ చెయ్యలేడని నేను మీకు ముందే చెప్పాను. అయినా బలవంతం చేసి నన్ను రప్పించారు. కేవలం మాటపడిపోయిన పాపని మాట్లాడించటం, అదైనా తాత్కాలికంగా మాట్లాడించటం తప్ప నేనింకేమీ చేయలేకపోయాను. నా కనిపిస్తూంది- పాపనెవరో 'పోస్ట్ హిప్నాటిక్ సజెషన్' ద్వారా బాధ పెడుతున్నారని".

"చేతబడి?" అన్నది శారద చప్పున.

"చేతబడి అంటే ఎక్కడో వుండి చేసేది. సైన్సు దానికంత ప్రాముఖ్యత యివ్వదు. నా ఉద్దేశ్యంలో ఎవరో ప్రతిరోజూ రాత్రి పాపకి మరుసటిరోజు బాధల గురించి హిప్నటైజ్ చేసి చెబుతున్నారు. నిన్నరాత్రి ఎవరో పాపకి 'రేపు నీ నోటమాట పడిపోతుంది' అని చెప్పారన్నమాట. అలా చెబుతున్నప్పుడు మీకు మెలకువ రాకుండా ఈ క్లోరోఫాం".

"ఇలాంటి పోస్టు హిప్నాటిక్ సజెషన్స్‌ని సైన్సు నమ్ముతుందా?" అడిగింది శారద.

"నమ్ముతోంది" అన్నాడు జయదేవ్. "ఈ రాత్రి మీరెలాగైనా మెలకువగా వుండండి. నా అభిప్రాయ నిజం కాకపోవచ్చు. కానీ పరీక్షిస్తే తప్పులేదుగా.

"నేను చూస్తాను ప్రొఫెసర్" అందామె ఒక నిర్ణయానికి వచ్చినట్టు.

"ఏమైనా తెలిస్తే నాకు తిరిగి ఫోన్ చేయండి. ఏమీ లేకపోతే నేను రావటం కూడా అనవసరం. మళ్ళీ కలుసుకుందాం. ఎప్పుడైనా ..... " అని వెళ్ళబోతూ ఆగి, "సారీ ఫర్ యువర్ డాటర్" అన్నాడు. శారద మాట్లాడలేదు. అతడు కదుల్తూ "నాల్గయిదు రోజుల తర్వాత ఫోన్ చేసి చెప్పండి పాపకెలావుందో" అని గదిలోంచి బైటకు నడిచాడు. నాల్గయిదు రోజులుకాదనీ, ఇంటిదగ్గర మృత్యువు తనకోసం పొంచివున్నదనీ అతడికి తెలీదు.

శారద తన స్థానంలోంచి కదలలేదు. అలాగే చూస్తూ నిలబడుంది. ఓ నిర్ణయానికి వచ్చినట్టు ఆమె పెదవులు బిగుసుకున్నాయి. బల్లమీద ఆపిల్స్ కోసే కత్తిని చేతిలోకి తీసుకుంది. చాలా పదునైన కత్తి. దీపం వెల్తుర్లో తళుక్కున మెరుస్తూంది.

పాప కోసం రాత్రికి ఎవరైనా వస్తారా?

రానీ...... తనెవరికీ చెప్పదు. భర్తకు కూడా.

ముందు పొత్తికడుపులో పొడుస్తుంది. తర్వాత వేళ్ళతో రెండు కళ్ళూ పొడిచేస్తుంది. బాధతో గిలగిలా కొట్టుకోవాలి. పాప ఈ నెల రోజుల్లోనూ ఎంత బాధ అనుభవించిందో, అమ్మా కళ్ళు మంటలే అని ఎలా విలవిల లాడిందో అంతకు రెట్టింపు బాధ ఆ వ్యక్తి అనుభవించాలి. అప్పుడు గానీ తన కసి చల్లారదు. ఆ తర్వాత తనకి ఉరిశిక్ష పడినా సరే ! ఒళ్ళంతా తూట్లుపడేలా పొడిచి చంపెయ్యాలి.

ఆమె గడియారంవైపు చూసింది. రాత్రి ఎనిమిది కావొస్తూంది ......

19

ఎనిమిది కావటానికి ఇంకా పావుగంట వుంది. రక్తం అంతా మొహంలోకి జిమ్మినట్లు అబ్రకదబ్ర మొహం ఎర్రగా వుంది. రామయ్య చెప్పినదంతా అతడు శ్రద్ధగా విన్నాడు.

రామయ్య అంతా వివరంగా చెప్పాడు. పాపగోళ్ళు సరస్వతి కత్తిరించటం దగ్గర్నుంచీ, ఇస్మాయిల్‌తో తను తిరుగుబడి చేయించటం వరకు, ఆ తర్వాత ఓ నాలుగురోజులు పాప బావుండటం గురించీ, మళ్ళీ వచ్చిన రోగం గురించీ, తను ఇస్మాయిల్ దగ్గరికి వెళ్ళటం, ' ఈ సారి ఇది చేతబడి కాదనటం ' అంతా ఒక్కమాట పొల్లుపోకుండా చెప్పాడు.

టెన్షన్‌తో అబ్రకదబ్ర పిడికిళ్ళు బిగుసుకున్నాయి. మానవాతీత శక్తుల్ని పూర్తిగా నమ్మినవాడు అతడు, ఆ సంగతి వినగానే ఉద్వేగంతో కదిలిపోయాడు.

రామయ్య చెప్పడం పూర్తిచేసి మౌనం వహించాడు. ఒక్కక్షణం నిశ్శబ్దం. ఓ నిర్ణయానికి వచ్చినట్టు అబ్రకదబ్ర కదిలాడు. మోటార్ సైకిల్ స్టాండ్ తీసి "ఎక్కు" అన్నాడు.

రామయ్య ఉలిక్కిపడి "నేనా బాబూ?" అన్నాడు.

"ఔను నువ్వే".

"ఎక్కడికి?"

"అవన్నీ తర్వాత చెబుతా, ముందు ఎక్కు".

"ఇంట్లో చెప్పొస్తాను".

"అక్ఖర్లేదు ఎక్కవయ్యా! అవన్నీ నేను చూసుకుంటానులే". రామయ్య క్షణం తటపటాయించి ఎక్కాడు. మొదటిసారి మోటార్ సైకిల్ ఎక్కటం అనుకుంటా -

ముందు కూర్చున్న అబ్రకదబ్రని గట్టిగా పట్టుకున్నాడు. అయిదు నిమిషాల్లో మురికి వీధులగుండా పయనించి అతడి మోటారుసైకిలు ఇస్మాయిల్ పాకముందు ఆగింది.

దాని శబ్దానికి బైటకొచ్చిన ఇస్మాయిల్ వీళ్ళని చూసి "రండిసాబ్" అంటూ నవ్వుతూ ఆహ్వానించాడు. ముగ్గురూ లోపలికి వెళ్ళి కూర్చున్నాక "చెప్పండి సాబ్! ఏమిటి విషయం?" అనడిగాడు.

అబ్రకదబ్రకి ఎలా మొదలు పెట్టాలో మొదట అర్థంకాలేదు. "పాప సంగతి" అన్నాడు. ఇస్మాయిల్ అర్థంకానట్టు చూశాడు. రామయ్య కల్పించుకొని - "మనం తిరుగుబడి చేశామే ఆ పాప" అన్నాడు. ఇస్మాయిల్ అర్థమయినట్లు తల పంకించాడు.

"ఆ పాపకి మళ్ళీ అనారోగ్యం" అన్నాడు అబ్రకదబ్ర.

"అవును సార్ ! అయితే అది చేతబడి కాదు. అసలు ఆ లక్షణాలే వేరు. చేతబడిలో ఒక అంగం క్షీణించాలి. ఇది మాములు అనారోగ్యమేదో అయివుంటుంది. రామయ్య అంతా నాకు చెప్పినాడు. ఇది చేతబడికాదు".

"కానీ పాపకి ఇరవై రోజుల్నుంచీ అనారోగ్యం".

"చేతబడి కుదరక ఎవరో విషం పెడుతూ వుండొచ్చు సార్!"

రామయ్య కల్పించుకొని "ప్రతిరోజూ డాక్టరు చూస్తూన్నాడు. అటువంటిదేమీ లేదు" అన్నాడు. మళ్ళీ ఒకక్షణం నిశ్శబ్దం. దాన్ని చెదరగొడుతూ అబ్రకదబ్ర, "ఇరవై రోజుల్నుంచీ, వచ్చిన రోగం రాకుండా వస్తూంది. రెండు రోజులక్రితం నోటమాట పడిపోయింది".

తనిక చెప్పవలసిందేమి లేనట్టు ఇస్మాయిల్ మౌనంగా వుండిపోయాడు చేతిలో అగ్గిపెట్టె తిప్పుతూ.

"చేతబడి చేసిన వాళ్ళు దాన్ని తిప్పికొడితే వూరుకోరుగా, ఇంకో ప్రయత్నం ఏదో చేస్తారు".

దీనికీ అతడు మాట్లాడలేదు. "అలాటివి చెయ్యటం వలన పాపకి మళ్ళీ....."

మధ్యలో అతడి మాటని ఖండిస్తూ "చేతబడి లాంటిది ఇంకేమీలేదు సార్! ఉన్న దాన్ని తిరిగి కొట్టాం" అన్నాడు.

"ఇంకొకటి ఉందని నా ఉద్దేశ్యం".

"లేదు సార్!"

"ఉన్నది" రెట్టించాడు.

"ఏమిటది?" ఇస్మాయిల్ కూడా గట్టిగా అన్నాడు.

"కా....... ష్మో....... రా"

ఆ గది కంపించినట్టయింది. ఇస్మాయిల్ చేతిలోంచి అగ్గిపెట్టె క్రిందపడిన శబ్దం చిన్నగా చప్పుడు చేసిందంతే! అది తప్ప తర్వాత గాఢమైన నిశ్శబ్దం ఆ గదిలో అలుముకుంది. కన్నార్పటం కూడా మర్చిపోయి ఇస్మాయిల్ వారివైపు చూశాడు.

కొద్ది సేపట్లోనే తేరుకొని "కాష్మోరా?"అన్నాడు. ఆ పేరు అంటుంటూనే అతడి కంఠం కంపించింది. "అసంభవం! దాదాపు అయిదువందల సంవత్సరాల క్రితమే మా గ్రంథాల్నుంచి తొలగించిన ఆ విద్యని ఈనాడు ఎవరో మళ్ళీ ప్రయోగిస్తున్నారంటే నమ్మటం ..... ఉహు ..... అసంభవం!"

"కానీ కళ్ళముందు కనిపిస్తున్నది అది..... "

"రోజుకో రోగం వస్తే అది కాష్మోరా కాదు...." కంఠం పెంచి అన్నాడు ఇస్మాయిల్. "అర్థంలేని అనుమానాల్ని పెంచుకోకండి. ఈ రోజులలో కాష్మోరా తెలిసిన వాళ్ళు ఎవరూ లేరని నిశ్చయంగా చెప్పగలను".

"అయితే అయివుండవచ్చు. కానీ అదో కాదో తెల్సుకోవటంలో తప్పేముంది?"

"ఎలా తెలుసుకోవటం?"

"అది నువ్వే చెప్పాలి".

ఇస్మాయిల్‌కీ తెలీదు. నిజానికి అతడెప్పుడో దానిగురించి విన్నాడు. అంతే!

"అలాటి విద్య ఒకటుందని నాకు తెలుసు. అంతకన్నా ఎక్కువేమీ నాకు తెలీదు" అన్నాడు ఇస్మాయిల్. అంతలోనే ఏదో అనుమానం వచ్చినట్టు "...... ఈ కాష్మోరా గురించి మీకెలా తెలుసు?" అని అడిగేడు. "ఓ ఫకీరు చెప్పాడు" అన్నాడు అబ్రకదబ్ర. రామయ్య ఇద్దరి మాటలూ వింటున్నాడు.

"కాష్మోరా గురించి నీకేం తెలుసు, ఏ కొద్దిగా తెలిసినా చెప్పు" అన్నాడు అబ్రకదబ్ర. ఇస్మాయిల్ మాటల్తో అతడు పూర్తిగా నిరాశ చెందినట్టు కనిపించాడు. తను అనవసరంగా ఒక చిన్న విషయాన్ని పట్టుకొని లాగుతున్నాడేమో అనిపించింది.

ఇస్మాయిల్ పాత విషయాల్ని గుర్తుకు తెచ్చుకోవటానికి అన్నట్టు కొంచెం సేపు మౌనంగా వుండిపోయాడు. చాలా సేపు ఆలోచించాక ఏదీ జ్ఞాపకం రానట్టు తల విదిలించాడు. "ఏదో మాటవరసకి అప్పుడు మా గురువు చెబితే వినటమేగానీ,

దానినంత పట్టించుకోలేదు. మొత్తం అది ఇరవై ఒక్క రోజులపాటు పీడిస్తుందని తెలుసు. ఆ ...... ఆఖరి రోజు ఇరవై నాలుగ్గంటలపాటు రోగి మూర్ఛపోతుందట అదే ఆఖరు......"

"కోమా......?" అబ్రకదబ్ర ఆగాడు.

"ఇంగ్లీషులో అదే అంటారేమో !" అన్నాడు ఇస్మాయిల్. "ఇప్పటికి ఎన్ని రోజులైనాయి?"

"ఇరవై ఒకటి అయినట్టున్నాయి. లేకపోతే పందొమ్మిదో ...... ఇరవయ్యో ...... సరిగ్గా లెక్క తెలీదు....... "

"నేను చెప్పానుగా కాష్మోరా కాదు" అన్నాడు లేస్తూ ఇస్మాయిల్.

ఇంక మాట్లాడవలసిందేమీ లేనట్టు బ్రాహ్మిణ్ కూడా లేచాడు.

రామయ్యతో పాటు బయటకొచ్చాడు. వెనుకే ఇస్మాయిల్ కూడా వస్తూ "మంచి డాక్టరుకి చూపించండి" అన్నాడు.

"ఇప్పుడు చూస్తున్నది మంచి డాక్టరే-" విసుగ్గా అబ్రకదబ్ర మోటర్ సైకిల్ స్టార్టు చేశాడు. వెనుకే రామయ్య కూర్చున్నాడు.

"వెళ్ళొస్తాం".

"మంచిది బాబూ!"

ఫస్టు గేర్ వేసి ఆక్సిలేటరుపెంచి క్లచ్ వదలబోతూంటే "ఇంకో విషయం జ్ఞాపకం వచ్చింది బాబూ-" అన్నాడు ఇస్మాయిల్.

అబ్రకదబ్ర కాలు నేలమీద పెట్టి 'ఏమిటి?' అని అడిగాడు.

"అది కాష్మోరా అయితే దాన్ని సంతృప్తి పరచటానికి ప్రతిరోజూ పాప నోట్లో మూడు రక్తపు చుక్కలు పొయ్యాలి. మీరది కనుక్కోండి" అన్నాడు ఇస్మాయిల్.

అబ్రకదబ్ర చప్పున ఇంజెన్ ఆపుచేసి "ఏమిటది సరిగ్గా చెప్పు?" అన్నాడు విభ్రాంతితో. దూరంగా ఎనిమిది కొట్టింది. పాప కోమాలోకి వెళ్ళటానికి ఇంకా నాలుగ్గంటలుంది.

20

"ఈ రోజు నేను మన గదిలో పడుకుంటాను" అన్నది శారద. శ్రీధర్ విస్మయంగా ఆమెవైపు చూశాడు. ఆమె మొహంలో ఏ భావమూ లేదు. "మీరు తులసి దగ్గర పడుకోండి" అన్నది.

శ్రీధర్ ఏదో అనబోయి అంతలోనే మనసు మార్చుకొని "సరే" అన్నాడు.

శారద అక్కణ్నుంచి కదిలింది. వెళుతున్న భార్యని అతడు జాలిగా చూశాడు. మతి చలించే లక్షణాలు కనబడుతున్నాయి అతడికి ఆమెలో ...... అయితే అతని అభిప్రాయం తప్పు. అతడు పరిశీలనగా చూసి వుంటే ఆమె కళ్ళలో కనబడుతున్న కృత నిశ్చయాన్ని గమనించి వుండేవాడే.

ఆమె ఆ గదిలోంచి బయటకు వచ్చి అనిత గదిలోకి వెళ్ళింది. ఆ గది అంతా బోసిగా వుంది. అనిత జ్ఞాపకాలు మాసిపోకుండా ఆ గది నావరించుకొనే వున్నాయి. అనిత టేప్‌రికార్డరూ, జానే చలే జాతే హై కహా అన్న పాటున్న క్యాసెట్టూ, వాడిన దువ్వెనా, చూసుకున్న అద్దం అన్నీ. శారద తలెత్తి ఫ్యాన్‌కేసి చూసింది. ఈ రాడ్‌కే కదూ తన ఆడపడుచు ఉరివేసుకుని చచ్చిపోయింది.

ఆమె స్టూల్‌ని ఫ్యాన్ క్రిందికి జరిపింది. తన కూతుర్ని ఇన్ని బాధలు పెట్టిన దుర్మార్గుణ్ని చంపిన తర్వాత తనకి ఉరిశిక్ష పడేంతవరకూ వేచివుండదల్చుకోలేదు ఆమె. అన్ని ఏర్పాట్లు ఇప్పుడే చూసుకుంటూంది. ఆమె ఆ గదిలోంచి బయటికి వచ్చి ఇంకా అక్కడే నిలబడి ఉన్న భర్తకేసి చూసింది.

ఈ రోజు ఆఖరిరోజు. తనకీ, తన భర్తకీ ఉన్న సహచర్యం ఈ రోజుతో ముగియబోతూంది...... ఆమెకి ఏడుపు రాలేదు. ఉద్వేగం, మనసు నిండా ఉద్వేగమే. ఏం చేస్తాడు తన భర్త? తను పోయాక ...... పద్దెనిమిది సంవత్సరాల ఆ బంధాన్ని మర్చిపోవటానికి అతనికి ఎన్నాళ్ళు పడుతుంది? పొద్దున్నే అతడికి కాఫీ ఎవరు యిస్తారు? అలసిపోతే ఎవరు సేద తీరుస్తారు? అతడి సుఖాల్లో కష్టాల్లో ఎవరు పాలుపంచుకుంటారు? అతడు ఈ భవనంలో ఒంటరిగా మిగిలిపోతాడా? మిగిలిపోవాలి. తప్పదు. పాపని మిగల్చటంకోసం తను వెళ్ళి పోవాలి. అప్పుడు అర్థమయిందామెకి. అనిత ఎందుకు వెళ్ళిపోయిందో. ఏదో జరిగింది. పాపని రక్షించటం కోసమే అనిత వెళ్ళిపోయింది. అవును అది నిస్సంశయం.

అప్పుడొచ్చిందామెకి ఏడుపు. అన్ని భావాలూ కలిసిన అద్వైత భావం ఆమె కళ్ళనిండా నీళ్ళుగామారి ఓ కన్నీటి చుక్క రూపంలో చెక్కిలి మీదకు జారింది. వంగి భర్త కాళ్ళకి దణ్ణం పెట్టి నెమ్మదిగా కదిలిపోయింది అక్కడ్నుంచి. అతడు నిశ్చేష్టుడై వుండిపోయాడు. భార్య ప్రవర్తన చాలా చిత్రంగా కనిపించింది అతనికి.

"ఈ రాత్రి ఏదో జరగబోతోంది. చాలా దారుణమైన విషయం"

అని అతడి సిక్త్ సెన్స్ చెబుతోంది. అతడు భార్యని పిలవబోతూంటే గాలిలా అబ్రకదబ్ర మోటార్ సైకిల్ గేటులోంచి దూసుకురావటం కనిపించింది. అతడు ఇస్మాయిల్ ఇంటినుంచి సరాసరి వస్తున్నాడు. అతని మొహంలో ఏదో తెలియని టెన్షన్ కొట్టొచ్చినట్టు కనబడుతూంది. వస్తూనే "నేనీ రాత్రికి సరస్వతిని భోజనానికి తీసుకుపోతున్నాను" అన్నాడు.

శ్రీధర్ అతనివైపు విస్మయంతో చూసి – "సరస్వతినా ?" అన్నాడు అబ్రకదబ్ర తలూపాడు. "అతనికీ, నీకూ అంత పరిచయం లేదుగా? అయినా ఇప్పుడు రాత్రి తొమ్మిదవుతూంది".

"భోజనానికి పిలవటానికి పెద్ద పరిచయం ఎందుకు?"

"అయినా రేపు పిలవొచ్చుగా. పది అవుతూంటే ఇప్పుడు భోజనం ఏమిటి?"

"ఎందుకో నాకు అలా బుద్ధి పుట్టింది".

"సరే నీ యిష్టం" అన్నాడు శ్రీధర్ – "ఈపాటికి అతను భోజనంముగించి వుంటాడు".

"చూసి తీసుకుపోతాను" అంటూ అబ్రకదబ్ర సరస్వతి గదివైపు వెళ్ళాడు.

"ఈ ఇంట్లో అందరికీ నిశ్చయంగా మతిపోయింది" అనుకున్నాడు శ్రీధర్. "లేకపోతే ఇంత రాత్రి అకస్మాత్తుగా యీ కోర్కె పుట్టటం ఏమిటి?" అంటూ వాచీ చూసుకున్నాడు.

పదయింది. ఇంకా ఇరవై ఆరు గంటలు పాప మరణానికి.

* * *

అదే సమయానికి అబ్రకదబ్ర సరస్వతి గది తలుపు తట్టాడు. సరస్వతి తలుపు తీశాడు. "గుడ్ ఈవినింగ్!" చేయి చాస్తూ అన్నాడు అబ్రకదబ్ర. "నేను జ్ఞాపకం వున్నానా?"

"లేకేం – రండి" ఆహ్వానించాడు సరస్వతి. పొట్టిగా ..... పైజామాలో ఉన్న ఎదుటి మనిషిని క్షణంపాటు లోతుగా చూశాడు అబ్రకదబ్ర. చాలా సాధువుగా కనబడ్డాడు సరస్వతి. వినయంగా, నమ్రతగా.

"ఏమిటిలా చూస్తున్నారు?" అడిగాడు సరస్వతి.

అతడు తడబడి, "ఏం లేదు....... ఏం లేదు" అని నవ్వి, "మిమ్మల్ని డిన్నర్‌కి తీసుకుపోదామని వచ్చాను. ఈ రోజు మా అబ్బాయి పుట్టిన రోజు".

సరస్వతికి ఓ క్షణం అతడు చెబుతున్నది అర్థంకాలేదు.

"ఇప్పుడా ?" అన్నాడు.

"ఇప్పుడే, ఏం?"

నవ్వాడు. "అబ్రకదబ్రకి చీకటిపడేది యిప్పుడే".

సరస్వతి ఆశ్చర్యంగా – "అబ్రకదబ్ర ..... అంటే..... ?" అన్నాడు.

"జర్మన్‌లో దెయ్యాల్ని తోలేవాడ్ని 'అబ్రకదబ్ర' అంటారు".

దెయ్యం ప్రసక్తితో సరస్వతి ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ "అలాగా" అన్నాడు. "మీకు వాటిమీద నమ్మకముందా?" సరస్వతి ముఖంలో అలజడి గుర్తించి– "మనుషులకన్నా అవి భయంకరమైనవి కావని నా వుద్దేశ్యం" అని "పదండి పోదాం" అన్నాడు.

"ఇప్పుడెందుకు? రేపు పెట్టుకుందాం".

"మావాడి పుట్టినరోజు రేపు రాదుగా? రండి షీవాజ్ రీగల్ వుంది".

ఆ పేరుతో సరస్వతి కొంచెం కదిలిన మాట నిజమే. అయినా అన్నాడు – "మీరు నన్నిలా బలవంతపెట్టడం ఆశ్చర్యంగా వుంది".

"ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. శ్రీధర్ని తీసుకుపోవచ్చు కదా అని ఇంకెవర్నీ పిలువలేదు. మనవాడేమో పాపకి బావోలేదూ, రానన్నాడు. నాకేమో కంపెనీ వుంటేగాని కూర్చోబుద్ధిగాదు, ఆ మాటే శ్రీధర్‌కి చెప్తే మీ పేరు చెప్పాడు. మీరు బాగా మాట్లాడతారనీ– మంచి కంపెనీ అనీ అన్నాడు".

సరస్వతి మొహమాటంగా నవ్వి– "అబ్బే! నాకు మాట్లాడటం రాదండీ– ఏదో వానాకాలం చదువు చదువుకున్నవాణ్ణి" అన్నాడు.

"మందుకొడితే చదువుకున్నవాడూ, చదువుకోనివాడూ ఒకటే లెండి. పదండి".

"నాకు తొందరగా నిద్రపోవటం అలవాటు".

"పన్నెండు కొట్టకముందు మిమ్మల్ని దింపే బాధ్యత నాది". 'పన్నెండు' అన్న పదాన్ని నొక్కి పలకటం సరస్వతి గుర్తించలేదు.

ఇద్దరూ బయటకొచ్చారు. అబ్రకదబ్ర మోటార్‌సైకిల్ స్టార్ట్ చేశాడు. సరస్వతి వెనుక కూర్చుని "పోనివ్వండి" అన్నాడు. అబ్రకదబ్ర గేర్ మారుస్తూ అనుకున్నాడు– "వెల్‌డన్ జేమ్స్ బాండ్ ! గోఎహెడ్" అని. అప్పుడు పదకొండు కావొస్తుంది. అదే సమయానికి బిస్త్రాలో కాద్రా ఆఖరిరోజు సన్నాహాలు చేసి కాష్మోరాని పిలుస్తున్నాడు.

పైడితల్లి సత్రం నుంచి బయల్దేరి ఒక చేత్తో నల్లపిల్లినీ , ఇంకో చేత్తో పాప తల వెంట్రుకల్నీ పట్టుకొని శ్మశానానికి బయల్దేరుతున్నాడు. అదే సమయానికి ప్రొఫెసరు జయదేవ్ తన యింటితాళం తీయటానికి మెట్లెక్కుతున్నాడు.

* * *

పదకొండు కొట్టొంటే శారద లేచింది. ఆ గదిలో ఆమె ఒక్కతే పడుకుని వుంది. ఆ నిశ్శబ్దంలో ఆమె లేచి, నెమ్మదిగా పాప గది దగ్గరకు వచ్చింది. గుమ్మం దగ్గరే కొంచెంసేపు నిలబడింది. పక్కమీద పాప నిశ్శబ్దంగా నిద్రపోతూంది. పక్కనే శ్రీధర్. తండ్రీ కూతుళ్ళిద్దర్నీ క్షణంపాటు కన్నార్పకుండా చూసింది. తరువాత ఆమె లోపలికి వెళ్ళింది. బెడ్‌లైట్ ఆర్పెయ్యగానే గదిలో చీకటి కాటుకలా పరచుకుంది. కప్పేసిన చీకట్లో గదిలో ఒక మూల నిశ్శబ్దంగా కట్రాటలా నిలబడి రాబోయే వ్యక్తికోసం ఎదురు చూడసాగింది. కిటికీలోంచి పడుతున్న సన్నటి వెలుగురేఖలో, ఆమె చేతిలో కత్తి తళుక్కుమంటూంది.

* * *

"చాలా బాగుంది గురూగారూ ! ఏమిటది .... షీ .....షి"

"షీవాజ్ రీగల్."

"షీవాజ్ రీగల్....... నిజంగా చాలా బాగుంది థాంక్సు, థాంక్స్".

"ఫర్లేదు ఇంకో పెగ్గు పోయనా ?"

"అమ్మో! హాఫ్ బాటిల్ నేనొక్కడ్నే కొట్టేశాను. ఇంకానా ?"

ఇంకొద్దు అనలేదు కాబట్టి ఇంకో పెగ్గు పోశాడు అబ్రకదబ్ర.

పదినిమిషాలు తక్కువ పన్నెండయింది.

"శారద గారు మీకేమవుతారు?"

"ఏదో దూరపు బంధుత్వం. మనసులు మంచివి అవ్వాలేగానీ - బంధుత్వాలదేముందండీ?"

"మీరింతకుముందు ఎక్కడ పనిచేసేవాళ్ళు?"

"ఏదో పొట్ట గడవటానికి నానా గడ్డి కరిచేవాడిని బాబూ".

పైకి మామూలుగా కనిపించే ఈ ముసలివాడు అంత తెలివితక్కువ వాడేమీ కాదని అనిపించింది. "మావాడు మీకేదయినా ఉద్యోగం యిప్పిస్తానన్నాడా?"

"ఈ వయసులో నేనేం చేయగలను బాబూ? మా పైడితల్లికి ఇప్పిస్తే అదే పదివేలు. నువ్వయినా చూసిపెట్టు బాబూ".

అబ్రకదబ్ర మెదడులో ఏదో మెరిసినట్టయింది. అతను ఎంత తప్పు చేశాడో అర్థమైంది. ఆ వైపు "దారి"ని మూయటం మర్చిపోయాడు. ఇంట్లో పైడితల్లి వున్నాడు. పోస్తే...... రక్తం చుక్కలు .... పాపనోట్లో.....

తన మనసులో అలజడిని కప్పిపుచ్చుకుని లేచాడు. "మీరు కొద్దూవుండండి - ఇప్పుడే వస్తాను" అన్నాడు.

సరస్వతి మూతపడుతున్న కనురెప్పల్ని బలవంతం మీద పైకెత్తి "ఎక్కడికి గురూగారూ" అంటూ లేచాడు. 'పదండి- నేనూ వస్తాను".

"అమ్మమ్మ వచ్చి గంటకూడా కాలేదు- అప్పుడేనా?" భుజాలు పట్టుకుని కూర్చోబెట్టాడు. "ఎంత.... రెండు నిమిషాల్లో వచ్చేయనూ" అంటూ బయటకు పరుగెత్తాడు.

బయటంతా చీకటిగా వుంది. వీధి దీపాలు మినుక్కు మినుక్కుమని వెలుగుతున్నాయి. గదిలోంచి బయటకొచ్చేసరికి ఒక్కసారిగా చలిగాలి చుట్టు ముట్టింది. నాలుగయిదు అడుగులు మామూలుగానే వేశాడు. టెన్షన్ ఎక్కువయింది. అతడు పరుగెత్తసాగాడు.

వీధి చివర మెడికల్ షాపు అప్పుడే మూసెయ్యబోతున్నారు. గాలిలా దూసుకుని వెళ్ళి "ఒక ఫోను చేయాలి - అర్జెంటు" అన్నాడు.

యజమాని తలూపాడు.

డయల్ చేశాడు.

"హల్లో" నిద్ర మధ్యలో లేచినట్లు శ్రీధర్ గొంతు విసుగ్గా వినిపించింది.

"నేనూ బ్రాహ్మిణ్‌ని".

"ఏమిటి చెప్పు?"

"శ్రీధర్" అర్థిస్తున్నట్టు అన్నాడు బ్రాహ్మిణ్ -"ఒక చిన్న కోరిక. నీకు నా పనుల మీదా, చేతల మీదా నమ్మకం లేకపోయినా ఈ పనిమాత్రం చేసిపెట్టు- ఈ ఒక్క పనీ".

"ఏమిటది?" అతని నిద్రమత్తు వదిలిపోయింది.

"పాప గదికి దూరంగా నువ్వు కనపడకుండా చీకట్లో కూర్చో. ఇంకో అయిదు నిమిషాలలో పైడితల్లి పాప గదిలో ప్రవేశిస్తాడు. అతడేం చేస్తున్నాడో గమనించు - సరిగ్గా పన్నెండు గంటలకి".

"హలో!" లైను కట్ అయింది.

ఆపాటికి శ్రీధర్‌కి ఇంకా కాస్త మత్తేమన్నా వుంటే పూర్తిగా దిగిపోయింది. వడివడిగా పాప గదివైపు నడిచాడు.

* * *

మెడికల్ షాపు వాడికి ఫోన్ తాలూకూ డబ్బు యిచ్చి వెనుదిరగబోతూ వుంటే సీసాలో అనాసిన్ టాబ్లెట్లు కనబడ్డాయి. ఇంకో రూపాయి తీసిస్తూ "రెండు టాబ్లెట్లు యివ్వండి" అన్నాడు.

షాపువాడు ఆశ్చర్యపోయాడు. అంత హడావుడిగా వచ్చి ఫోన్ చేస్తే ఎవరికో ఎమర్జెన్సీ అనుకున్నాడు. అంత హడావుడిగా పరుగెత్తుకొచ్చి ఫోన్ చేసినవాడు- ఇప్పుడు తాపీగా అనాసిన్ టాబ్లెట్లు కొంటూంటే ఆశ్చర్యమే మరి! టాబ్లెట్లు జేబులో వేసుకుని మెట్లు దిగాడు అబ్రకదబ్ర. అతడిలో టెన్షన్ తగ్గింది. తేలిగ్గా వూపిరి పీల్చుకుంటూ టైమ్ చూసుకున్నాడు.

సరిగ్గా పన్నెండయింది.

* * *

ఇంకా ఇరవై నాలుగ్గంటలు ! అంతే చివరి రోజు వచ్చేసింది.

పాప కోమా లోకి వెళ్ళిపోవటానికి – ఆఖరి రక్తపు చుక్కల కోసం చూస్తూంది.

అక్కడ బిస్తా దగ్గర శ్మశానంలో– కాద్రా చేసిన పూజకి సంతృప్తిపడి కాష్మోరా స్వయంగా వచ్చి, బొమ్మకి కట్టివున్న బంధనాల్ని విప్పుతున్నాడు. అది అవగానే - బొమ్మని నాల్గు భాగాలు చేసి, ఆ మంత్రగాడు నాలుగు దిక్కుల పాతిపెడతాడు. ఆ మరుసటిరోజు హోమంలో ఆ బొమ్మ భాగాల్ని వేయటం ద్వారా – ఇరవై ఒక్క రోజుల మారణహోమం పూర్తవుతుంది.

అదే సమయానికి పైడితల్లి శ్మశానంలో పాప వెంట్రుకల్ని కాల్చటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాల్చిన తర్వాత ఆ బూడిద నల్లపిల్లి రక్తంలో కలపాలి. బయట వరండాలో శ్రీధర్ చీకట్లో కూర్చుని పాప గదివైపు చూస్తున్నాడు. గదిలో శారద కూడా వేచి వుంది. అందరూ తమ తమ ఆలోచనలలో ఏమి జరుగుతుందా అని చూస్తున్నారు. కానీ జరిగింది వేరొకటి. అబ్రకదబ్ర ఇంటికి చేరేసరికి సరస్వతి మరో రెండు పెగ్గులు లాగించేశాడు. అయినా మనిషి మామూలుగానే వున్నాడు. 'ఇది కడుపుకాదు, డ్రమ్ము' అనుకున్నాడు అబ్రకదబ్ర.

"సారీ గురూగారూ! అర్జెంటుగా వెళ్ళాల్సి వచ్చింది" అన్నాడు.

"పర్లేదు" అన్నాడు సరస్వతి.

ఆ తర్వాత పెగ్గులో అనాసిన్ పొడి కలిపాడు. అదీ పూర్తయింది. దాని ఎఫెక్టు అరగంట తర్వాత కనిపించింది. అరగంటలో వెళ్లి పోతానన్నవాడు రెండు గంటలున్నాడు. ఒంటిగంట అవుతూ వుండగా లేచి, "థా .... థా.... థాంక్స్ గురూ! మర్నే వెళ్ళొస్తాను" అంటూ లేచి, తూలి బల్ల పట్టుకుని నిలబడటానికి ప్రయత్నించాడు.

"నేను మీకు థాంక్స్ చెప్పాలి, మంచి కంపెనీ యిచ్చినందుకు".

"ఇంకో నెల తిరగనీ నాయనా. అంషా మంచి కంపెనీయే ...... " తూలుతూ బైటకొచ్చాడు. వెనకే వస్తున్న అబ్రకదబ్ర అతడు తూలి పడకుండా పట్టుకుంటూ "ఈ పరిస్థితిలో నాతో మోటారు సైకిల్ మీద రాగలరా స్వామీ ?" అన్నాడు.

"మేం సైకిలు మీద రాము సైకిలు రిక్షా ఎక్కుతాం. నక్షత్రాలని చూసుకుంటూ హాయిగా పయనిస్తాం".

"సరే సరే" అంటూ రిక్షాని బేరమాడాడు. వాడి చేతిలో రెండ్రూపాయలు పెట్టి సరీగ్గా ఇంటిదగ్గర దింపమన్నాడు. ఇద్దరూ సాయం పట్టి సరస్వతిని రిక్షా ఎక్కించారు. రిక్షా కదిలింది.

అబ్రకదబ్ర అటే చూస్తూ నిలబడ్డాడు. రిక్షా నెమ్మది నెమ్మదిగా చీకటిలో అదృశ్యమైపోయింది. అతడలాగే నిలబడి వున్నాడు. అతడికేమీ సంతోషం అనిపించలేదు. తన ఓటమి తనకే తెలుస్తుంది.

సరస్వతి ఒంటిగంట వరకూ తనతోనే ఉన్నాడు. పైడితల్లి పాపగదిలోకి సరస్వతి బదులు వెళ్లివుంటే.... శ్రీధర్ తనకి వెంటనే ఫోన్‌చేసి వుండేవాడు.

రెండూ జరగలేదు. అంటే ......

కాష్మోరా కాదు పాపమీద ప్రయోగించింది - కాష్మోరా కాదు!

తను ఇప్పటివరకూ చేసిందంతా వేస్టు.

దిగులుగా లోపలికి వెళ్ళాడు. మరుసటిరోజు శ్రీధర్ తనని పెట్టబోయే చివాట్లని గురించి ఆలోచిస్తూ పక్కమీద పడుకున్నాడు. రేపు శ్రీధర్‌కి మొహం ఎలా చూపించాలా అని మధనపడసాగాడు.

తనని ఇంకో అరగంటలోపే శ్రీధర్ కలుసుకోబోతున్నాడని ఆ క్షణం అతడు వూహించలేదు.

* * *

యండమూరి వీరేంద్రనాథ్

తులసిదళం



దాదాపు అరగంటనుంచి శ్రీధర్ అలాగే అచేతనంగా చీకట్లో కూర్చొని వున్నాడు. అతడి మనసు పరిపరివిధాల ఆలోచిస్తూంది.

.... అర్ధరాత్రిపూట అబ్రకదబ్ర చేసిన ఫోను అతడిని అయోమయములో పడేసింది. అతడలా ఎందుకు చేశాడో అర్థంకాలేదు. వివరాలు అడగబోయేలోపులోనే అతడు ఫోన్ పెట్టేశాడు. సాయంత్రంవరకూ తనతో వున్నవాడికి, రాత్రయ్యేలోపులో కొత్త విషయం ఏం తెలిసింది? అందులోనూ అర్థరాత్రి పన్నెండు గంటలకి అంత అర్జెంటుగా ఫోన్ చేయవలసిన అవసరం ఏం వచ్చింది? అతడి ఆలోచన వెంటనే "స్లో పాయిజనింగ్" వైపు మళ్ళింది. పాపకి ఎవరైనా స్లో పాయిజనింగ్ చేస్తున్నారా అన్న అనుమానం కలిగింది. అలాగయితే డాక్టర్లు వెంటనే కనుక్కొని వుండాలి! ఒకవేళ స్లో పాయిజనింగ్ అనుకుందాం..... మరి దాన్ని సరీగ్గా 'రాత్రి పన్నెండు గంటలకే' ఎందుకివ్వాలి? అందరూ నిద్రపోయాక ఎప్పుడన్నా యివ్వచ్చుగా? అతనికి అబ్రకదబ్ర మీద కోపం వచ్చింది. ఏ విషయమూ సరీగ్గా చెప్పడు.

పన్నెండున్నరయింది. అబ్రకదబ్ర చెప్పిన టైం దాటి అరగంట గడిచింది. ఇక వెళ్ళి పడుకోవచ్చు.

కానీ అది విషం ఇవ్వటం అయితే...... అప్పుడు 'పన్నెండుగంటలు' అన్న సమయానికి విలువ ఏమీ వుండదు.

అతను కొంచెం సేపు సందిగ్ధంలో పడ్డాడు. వెళ్లి పడుకోవటమా? ఇంకా వేచి చూడటమా అని.

'ఇంకా కొంచెంసేపు చూద్దాం' అనుకున్నాడు. అబ్రకదబ్రయే గాని వివరంగా ఫోన్‌లో అన్నీ చెప్పివుంటే- దాన్ని కొట్టిపడేసేవాడు. అతడలా చెప్పకపోవడమే శ్రీధర్‌ని మెలకువగా వుండేటట్లు చేస్తూంది. అదే లాభించింది.

ఒంటిగంటయింది. అతనికి విసుగొస్తుంది. ఇంకోవైపు అబ్రకదబ్ర మీద కోపం కూడా. ఇటు నారాయణరావుగానీ, అటు పైడితల్లిగానీ, సరస్వతిగానీ ఇంట్లో లేరు. అందరూ కట్టగట్టుకున్నట్లు వెళ్ళారు. సెకండ్ షో సినిమా అయినా ఎవరూ రాకపోవటం అతనికి ఆశ్చర్యంగా వుంది.

ఒంటిగంటంపావు అవబోతూంటే లేచాడు. అబ్రకదబ్రా గోరంతలు కొండంతలు చేశాడు. ఏదో చిన్న అనుమానం వచ్చి వుంటుంది. దాన్నే రకరకాలుగా వూహించుకొని తనకలా చెప్పి వుంటాడు. అంతా రేపు చూసుకోవచ్చు.

అలా అనుకుంటూ అతడక్కణ్ణుంచి వెళ్ళబోయాడు. అప్పుడు వినిపించింది చిన్న శబ్దం.........

గుర్ ర్ ర్ ర్ .... స్ స్

అతడు క్షణం ఆగి విన్నాడు. మళ్ళీ అదే శబ్దం చాలా సన్నగా ...... ఎక్కడో లోయల్లోంచి వస్తూన్నట్టు వుంది. అతడి భృకుటి ముడిపడింది. ఎక్కణ్ణుంచి వస్తూంది ఆ శబ్దం? అతడు చెవులు రిక్కించి విన్నాడు. ఈ సారి శబ్దం స్ఫుటంగా వినిపించింది.

తులసి గదిలోంచి!

పాము బుస కొడుతున్నట్టూ.... ఆగి...... ఆగి...... నెమ్మదిగా దేనికోసమో ఆశిస్తున్నట్టూ.... గొంతులో ఏదో అడ్డుకున్నట్టూ....

గుర్ ర్ ర్ ...... స్ స్....

ఈసారి శబ్దం ఎక్కువైంది. తులసి గదిలోంచే .... ! పక్క కదిలిన చప్పుడు. ఏదో లాగుతున్న ధ్వని, గదిలో ఒక మూల నిలబడిన శారద ఊపిరి బిగపట్టింది.

అతడు లోపలికి వెళ్ళబోయాడు. అంతలో గేటు తీస్తున్న ధ్వని.

ఆగాడు.

అడుగుల చప్పుడు వినిపించసాగింది. రెండు సెకన్ల తర్వాత బయట తలుపు తెరుచుకుంది. సరస్వతి లోపలికి వచ్చాడు. బాగా తాగినట్లు ఆ నిలబడిన భంగిమ తెలియజేస్తూంది. తలుపులు మూసి, ఒక క్షణం దానికానుకొని పడిపోకుండా నిలబడ్డాడు.

శ్రీధర్ చీకట్లో నిలబడున్నాడు శబ్దం చేయకుండా.

సరస్వతి ఒక అడుగు ముందుకేసి తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు. తన గదివైపు వెళుతున్నాడు. మసక చీకట్లో అతడు అస్పష్టంగా కనబడుతున్నాడు. శ్రీధర్ మాత్రం పూర్తి చీకట్లో వున్నాడు. సరస్వతి ఇంకో అడుగు వేస్తుంటే తులసి గదిలోంచి శబ్దం వినిపించింది.

సరస్వతి అది విన్నాడో లేదో తెలియదుగానీ, ఆగాడు. కళ్ళు చిట్లించి పాప గదివైపు చూశాడు. ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా అటో అడుగు వేశాడు.

తులసి గది తలుపులు నెమ్మదిగా తెరుచుకోవడం చూసి శ్రీధర్ ఉలిక్కిపడ్డాడు. వెనుకనుంచి పడుతున్న వెలుగులో- గుమ్మం దగ్గర పాప నిలబడి వుంది. జుట్టు విరబోసుకుని వుంది! స్టిల్ ఫ్రేమ్‌లోలా, నిశ్చలంగా నిలబడుంది. కళ్ళు మూసుకొని కోమాలో వున్నట్టుంది. బాగా శుష్కించిన శరీరం అస్థిపంజరంలా వుంది. వెనకనుంచి పడుతున్న కాంతితో సన్నటిమెడ, బలహీనమైన కాళ్ళూ.

శ్రీధర్ ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు.

పాపని చూసి సరస్వతి కదిలాడు. బాగా తాగి వుండడంవల్ల తూలుతున్నాడు. పాపకి రెండు అడుగుల దూరంలో నిలబడి, కళ్ళు భారంగా పైకెత్తి - "ఈ రోజు రక్తం పోయటం మర్చిపోయాను పాపా...." అంటూ వెకిలిగా నవ్వి ఒక చేత్తో చూపుడువేలు పట్టుకొని ఇంకో అడుగు ముందుకేశాడు. తూలుతున్న కాళ్ళని నిలదొక్కుకుంటూ ఇంకో అడుగు!

అంతే .....

ఫెట్‌మన్న చప్పుడు ఆ గదిలో వినిపించింది.

కొబ్బరికాయ పగిలిన ధ్వని.

పాప తన స్థానంలోంచి కదలలేదు. సరస్వతి తన దగ్గరకు వచ్చి నిలబడిపోతూ వుంటే రెప్పపాటు వేగంతో ఆమె చెయ్యి కదిలింది. అరచెయ్యి చాకులా మారి అతడి 'మాడు'ని కొట్టడం మెరుపుకన్నా వేగంగా జరిగింది. ఆ నిశ్శబ్దంలో- ఆమె చెయ్యి గాలిలో కదులుతుంటే 'సర్'మన్న ధ్వని వినిపించింది.

ఆ తరువాత చిన్న చప్పుడుతో సరస్వతి కపాలం పగిలిపోవటం శ్రీధర్ స్పష్టంగా చూశాడు. సరస్వతి తల రెండుగా చీలిపోయింది. నోట ఒక మాట లేదు. ఒక అరుపు లేదు. ఆర్తనాదం లేదు. కూలిపోయాడు.

అతడు మోకాళ్ళ మీదనుంచి నిశ్శబ్దంగా నేలమీదకు జారిపోతూ వుండగా, ఆ క్షణమే ప్రాణం పోయిందనటంలో సంశయం లేదు. శారద ఒకవైపు నోటినుంచి కెవ్వున రాబోయిన కేకని చేత్తో ఆపుకుంది. ఇంకో వైపు శ్రీధర్ బల్లిలా గోడకి ఆనుకొని నిశ్చేష్టుడై చూస్తున్నాడు. చీకటి అతడిని కప్పేసింది. మసక వెలుతురులో పగిలిన కపాలంలోంచి తెల్లటి మెదడు స్పష్టంగా కనిపిస్తూంది. ఎర్రటి రక్తంతో తడిసిన తెల్లటి మెదడు .... ఎన్నో కుతంత్రాలని యోచించిన మెదడు ....ఎన్నో దారుణాలని నవ్వుతూ చెయ్యటానికి పురికొల్పిన మెదడు ..... అచేతనమైంది! ఇప్పుడు.

పాప వంగి, చిటికెన వేలుని రక్తంలో ముంచింది.

మూడు చుక్కలు అంతే.

తాగేసి నిశ్శబ్దంగా లోపలికి వెళ్ళిపోయింది.

శ్రీధర్ నిలబడి వున్నాడు షాక్‌లోంచి తేరుకోకుండా. చీకట్లో శారద కూడా అలాగే దిగ్భ్రాంతితో నిలబడి వుంది. ఒకళ్ళు చూస్తున్నారనీ ఇంకొకరికి తెలీదు.

21

సరస్వతి వెళ్లిపోయాక అబ్రకదబ్రకి మాగన్నుగా నిద్రపడుతూంది.

ఆ మరుసటి రోజు ఏం చెయ్యాలా అన్న ప్రశ్న ఒకవైపూ, తను అనవసరంగా యిదంతా వూహిస్తున్నాడేమో అన్న అనుమానం ఇంకోవైపు ఈ పరస్పర విరుద్ధమైన ఆలోచనలతోనే పక్క మీద అటూ ఇటూ చాలా సేపు పొర్లాడు. ఇదంతా అబద్ధమైతే శ్రీధర్ తనని తలవాచేటట్లు చివాట్లు పెడతాడు. అతడికి కొద్దిగా నిద్రపడుతూన్న సమయంలో బయటెవరో తలుపు తట్టినట్లయింది. ముందు భ్రమేమో అనుకున్నాడు. రెండున్నర కావొస్తుంటే ఎవరొస్తారు?

మళ్ళీ చప్పుడు వినిపించింది.

"ఎవరది?"

"నేనే"

కప్పుకున్న దుప్పటిని తొలగించి క్రిందకి దిగాడు. స్లిప్పర్సు వేసుకొని లైటు వేశాడు. ముందు గదిలోకి వచ్చి తలుపు తీశాడు.

అక్కడ నిలబడి వున్నాడు శ్రీధర్.

జుట్టు చెదిరిపోయి వుంది. బట్టలు నలిగిపోయి వున్నాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. మొహం పీక్కుపోయి వుంది. రహస్యాన్ని శోధించిన కళ్ళు స్తబ్దత పోగొట్టుకున్నాయి. ఝుం ఝూ మారుతంలాంటి అనుభవం జీవితాన్ని స్పృశించినట్లు భావన. నల్లటి మేఘం వర్షించి తేలిక పడితే- బరువుతో కదిలిన గాలి. బిగుసుకున్న దవడ కండరం మీద వెలుగురేఖ ప్రతిబింబిస్తూ వుంది. ఎప్పుడూ నిశ్చలంగా, భావరహితంగా, మౌనంగా వుండే ఆ మొహం ఏదో దీప్తితో ప్రకాశిస్తూంది. అనుభవంతో సంయమనాన్ని సాధించినట్టు కనులు అంతర్గతమైన ఆవేశాన్ని సూచిస్తున్నాయి.

అబ్రకదబ్ర అతడివైపే చూస్తున్నాడు ఆశ్చర్యంతో, విస్మయంతో.

శ్రీధర్ పెదవులు కదలటం మసకచీకట్లో అస్పష్టంగా కనిపిస్తూంది. ఒక నిర్ణయానికి వచ్చినట్టూ- ఒక అనుభవంతో పండినట్టూ అతడి స్వరం గంభీరంగా పలికింది. "...... ఇన్నాళ్ళ నా ఆలోచనల సరళి, ఈ అర్ధరాత్రి ఓ భయానకమైన అనుభవంతో మారిపోయింది. మనకి తెలియని అతీత శక్తులు గాలిలో వున్నాయని నేను నమ్ముతున్నాను. క్షుద్రశక్తులున్నాయనీ, అవి మనుషుల్ని ఆవహిస్తాయనీ, ఈ

క్షణం నుంచీ నేను విశ్వసిస్తున్నాను. బ్రాహ్మిణ్ ! ఇంకెంతో టైమ్‌లేదు. పాపని మనం రక్షించుకోవాలి. ఎలా అయినా సరే . ఎలా .....అ .... యి .... నా..... స......రే!"

రాత్రి మూడయింది.

* * *

రాత్రంతా పాపని పరిశీలిస్తూ వుండమని శారదకి సలహా యిచ్చిన తరువాత ప్రొఫెసర్ జయదేవ్ తిన్నగా ఇంటికి వెళ్ళలేదు. అతడు వెళ్ళేసరికి పన్నెండు దాటింది. కారు గారేజీలో పెట్టి సన్నగా విజిల్ వేసుకుంటూ ఫ్యాంటు జేబులో రెండు చేతులు పెట్టుకొని తాపీగా మెట్లెక్కసాగాడు.

అతడుగానీ కొద్దిగా తలపైకెత్తి చూసివుంటే ఆ వెన్నెల వెలుగులో ఎలక్ట్రిక్ పోల్ నుంచి తన ఇంటిమీదకు వేలాడుతున్న వైరుని చూసి వుండేవాడే! చూడకుండా లోపల మెట్లు ఎక్కేశాడు.

"కౌన్ హై?" అంటూ ఇంటావిడ ఉబ్బసం కంఠం వినిపించింది.

"మై" అన్నాడు జయదేవ్ మెట్లమీద ఆగకుండా సాగిపోతూనే.

"తుమ్హారే వాస్తే కోయీ ఆయా బేటా, షామ్‌మే" (నీ కోసం ఎవరో వచ్చారు నాయనా, సాయంత్రం) అన్నదామె. అతడి గురించి చాలా మంది వస్తూ వుంటారు. దానికి ప్రాముఖ్యత ఇవ్వకుండా అతడు తలూపి, పైకి వెళ్ళిపోయాడు. గుమ్మం దగ్గర నిలబడి, జేబులోంచి తాళంచెవి తీసి ముందుకు వంగాడు.

డాబామీద ఫెరన్ మొక్క గాలికి వూగుతుంది. నల్లటి మబ్బు తన పయనాన్ని క్షణం ఆపింది. ప్రకృతి అంతా నిశ్చలంగా వుంది. చీకట్లో అతడు తాళంకప్ప కోసం తడిమాడు.

అరక్షణం తరువాత అతడి చేతివేళ్ళకి తగిలింది తాళం కప్ప గరుగ్గా. అప్పుడు వినిపించింది శబ్దం - చెవులు బద్దలయ్యేలా! ఆ నిశ్శబ్ద నీరవంలో ఆ చప్పుడు తాలూకు ప్రకంపనాలు భయకరంగా వ్యాపిస్తున్నాయి. ఒక విస్ఫోటనపు భ్రాంతిని కలిగిస్తున్నాయి.

అతడు చప్పున తాళంతీసి లోపలికి వెళ్ళి ఫోన్‌మీద నుంచి రిసీవరు తీశాడు. చప్పున ఆగిపోయింది. "హల్లో" అన్నాడు.

"నేనూ శారదని!"

అతడు చప్పున రిసీవరుని చెవి దగ్గరగా చేర్చుకొని, "చెప్పండి- ఏమైనా జరిగిందా?" అని అడిగాడు ఆతృతగా.

శారద కంఠం చాలా నెమ్మదిగా, స్ఫుటంగా వినిపించింది. "ఇంత కాలం ఏవో అతీత శక్తులూ- దెయ్యాలూ వున్నాయని నమ్ముతూ వచ్చాను- ప్రొఫెసర్ ! కానీ అదంతా తప్పని ఈ రోజే తెలుసుకొన్నాను. పాపకి పోస్ట్ హిప్నాటిక్ సజెషన్స్ ద్వారా ఎవరో స్లో పాయిజన్ యిస్తున్నారు. అయితే ఆ విషం మనిషి రక్తం. అందుకే అది మెడిసిన్‌కి అందలేదు! అనవసరంగా తాయెత్తులూ అవీ కట్టించాను. ఈ క్షణం నా కర్థమయింది. దీని వెనుక వున్న సైన్సు. మీరు వెంటనే రావాలి".

"వస్తున్నాను".

ఫోన్ పెట్టేసి జయదేవ్ లేచాడు. ఫోన్‌లో వివరాలు అడగటం ఇష్టంలేదు అతడికి. తడుముకుంటూ బైటకొచ్చి మళ్ళీ తాళం వేశాడు. చెవి జేబులో వేసుకొని నడుస్తూ వుంటే కాలికి ఏదో చుట్టుకొని బోర్లాపడ్డాడు. విసుక్కుంటూ కాలికి అడ్డుపడిన తీగెను లాగి దూరంగా పడేస్తూ "వెధవ ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు ఎప్పుడూ కరెంట్ ఫెయిల్యూరే" అని ముందుకు సాగాడు.

ఆ వెధవ డిపార్టుమెంటే తన ప్రాణాన్ని ఈరోజు రక్షించిందని అతడికి తెలియదు.

అయిదు నిమిషాల తర్వాత అతడి కారు శ్రీధర్ ఇంటిని సమీపిస్తూ వుంటే ఆ ఇంట్లోంచి ఇంకో కారు బయటకి రావటం అతడు చూశాడు. ఆ కార్లో శ్రీధర్, అబ్రకదబ్ర ఉన్నారు. అపుడు రాత్రి మూడున్నర అయింది. తను అప్పటివరకూ నమ్మనిదాన్ని కళ్ళతో చూసి స్వయంగా నమ్మేస్థితికి వచ్చిన శ్రీధర్ అబ్రకదబ్రని తీసుకొని తిరిగి తనింటికి వచ్చాడు. చచ్చిపోయిన సరస్వతి శరీరం వాళ్ళకి సమస్యకాదు. పాపని బ్రతికించుకోవటం ఎలా అన్నది ప్రశ్న.

శ్రీధర్ తన డైరీ వెతకటం మొదలుపెట్టాడు. అయిదు నిమిషాలలో దొరికింది తన డైరీ. గబగబా పేజీలు తిప్పాడు. ఈ మధ్య పాపతాలూకు దిగులుతో వ్రాయలేదు. అన్నీ తెల్ల పేజీలే! వెనక్కి తిప్పుతూ వుంటే- ఆ రోజు దొరికింది.

"ఈ రోజే పారిస్ ప్రయాణం. ఎంతో సంతోషంతో బయల్దేరాం. మొట్టమొదటిసారి శారదని తీసుకొని- పాపతో కలిసి విమానంలో ప్రయాణం ఎంతో ఉత్సాహంగా బయల్దేరినదల్లా అనుకోకుండా ఎయిర్‌పోర్ట్‌లో పడిపోవటంతో తిరిగి రావలసి వచ్చింది. ఇక రేపే .... పాపకి ఏమైంది ఈ రోజు...... "

ఆనాడు డైరీ చూశాడు. ఆ రోజు ఒకటో తారీఖు. చప్పున వాచీ చూసుకొన్నాడు. అప్పుడే తేదీ మారిపోయి కొత్త తేదీ వచ్చేసింది. శ్రీధర్ మొహం వాడిపోయింది. వాచీ ఇరవై ఒకటి చూపిస్తున్నది. కంపిస్తున్న స్వరంతో "బ్రాహ్మిణ్" అన్నాడు.

అబ్రకదబ్ర ఆతృతగా "ఎన్ని రోజులైంది?" అడిగాడు.

"ఇరవై ఒకటి".

ఎప్పుడూ లేనిది ఆ క్షణం శ్రీధర్ కెందుకో భయంవేసింది. వెన్నులో ప్రారంభమైన జలదరింపు ఒళ్ళంతా పాకింది. మృత్యుకళ పాప మొహంలో తాండవిస్తూంది. ఆ నిర్మలత్వమే కర్కశంగా పాపని మృత్యువులోకి పంపుతుందని అక్కడవున్న యిద్దరికీ తెలుసు. చావబోయే ప్రతి వ్యక్తీ క్షణాలపాటు, గంటలపాటు యీ వైతరిణి దాటాలి.

"పాపా! అమ్మా తులసీ" అంటూ తట్టాడు శ్రీధర్.

తులసి లేవలేదు. అతడు విసిగిపోయేవరకూ లేపి పక్కకి తప్పుకున్నాక అబ్రకదబ్ర పాప మీదికి వంగి భుజం మీద రక్తం వచ్చేలా గిల్లాడు.

పాప లేవలేదు. కోమాలో వుంది. గాఢమైన నిద్రలో ఆమె వూపిరి పాము బుస కొడ్తున్నట్టుంది.

ఒక నిశ్చయానికి వచ్చినట్టు శ్రీధర్ కదిలాడు. పార్థసారధికి ఫోన్‌చేస్తూ అన్నాడు "డాక్టర్! పాప కోమాలో వుంది..... మీరు రండి ...... పాపని మీ చేతుల్లో వదిలిపెడుతున్నాను. ఈ రోజు రాత్రి పన్నెండు గంటల్లోగా మీ సైన్సు పాపని బ్రతికించగలిగితే ...... పన్నెండులోగానే బ్రతికించాలి. ఇది ఆఖరిరోజు....." అతను ఆగాడు. ".... నేను బహుశా ఈ రోజంతా మీకు కనబడకపోవచ్చు, ఎందుకని అడక్కండి. ఒకవేళ పాప బ్రతక్కపోతే–" అతను మళ్ళీ ఆగాడు. "...... కనీసం నా భార్య మరణించకుండా చూడండి. గుడ్‌బై...." అని అవతల పార్థసారధి ఏదో అంటూండగా ఫోన్ పెట్టేసి అబ్రకదబ్ర వైపు తిరిగాడు.

"బ్రాహ్మిణ్ ! మూడున్నర కావొస్తూంది. సూర్యోదయం వరకూ కూడా ఆగలేం పద...."

"ఎక్కడికి?"

"ఇస్మాయిల్ దగ్గరికి. పాపని అతడొక్కడే రక్షించగలడు".

అబ్రకదబ్ర శ్రీధర్‌వైపు జాలిగా చూశాడు. కాష్మోరాలాంటి క్షుద్రవిద్యని ఇస్మాయిల్ లాటి సామాన్య తిరుగుబడిదారుడు తిప్పికొట్టలేడనీ, అసలు కాష్మోరాకి తిప్పికొట్టటం అన్న ప్రసక్తే లేదని అతడికి తెలుసు. క్షిత్ అనే దేవతని ఇన్ని వందల

సంవత్సరాల తర్వాత ఓ మంత్రగాడు నిద్రలేపగలిగాడంటేనే అతడికి ఆశ్చర్యంగానూ, నమ్మశక్యం కాకుండానూ వుంది. అంత పెద్ద దేవతని నిద్ర లేపగలిగిన మంత్రగాడు యింత చిన్న పాపని దానికి నైవేద్యంగా తీసుకోవటం అతడికి వేదననీ, కసినీ కలిగిస్తూంది. క్షణంలో అతడు మామూలుగా మారి శ్రీధర్ని చూసి 'పద శ్రీధర్' అన్నాడు. వెళ్ళినా ఏం పని జరగదని అతడికి తెలుసు. అయినా స్నేహితుణ్ని నిరాశపర్చటం అతడికి ఇష్టంలేదు.

ఇద్దరూ కార్లో ఇస్మాయిల్ దగ్గరికి బయల్దేరారు.

అప్పుడు మూడున్నర కావొస్తూంది.

ప్రహరీ గేటు దాటుతుంటే ఒక కారు లోపలికి వచ్చింది. మలుపులో ఇంకో కారు ఎదురు తగిలింది. రెండూ శ్రీధర్ ఇంటికే.

ఒకటి డాక్టర్ పార్థసారధిది.

ఇంకొకటి ప్రొఫెసరు జయదేవ్‌ది.

* * *

అతడి నడుముకి చిన్న గుడ్డ తప్ప యింకేమీ లేదు. చేతులు రెండూ గాలిలో సాచి నిలబడి వున్నాడతను. దక్షిణం దిక్కుగా తిరిగి ప్రేతాత్మల్ని పిలుస్తున్నాడు. రెండు గంటల్నుంచీ ప్రార్థిస్తూనే వున్నాడు. అతడి ముందు ఏడు కుండలు, కుండలలో మట్టి, మట్టి దోపల్లో ఏడు పుల్లలూ వున్నాయి. వాటికి ఆకులు గుచ్చబడి వున్నాయి. ఆ ఆకుల్ని కదిల్చి, తన ప్రశ్నలకి జవాబు చెప్పటం కోసం ప్రేతాత్మలని ఆహ్వానిస్తున్నాడతను.

శ్రీధర్, అబ్రకదబ్ర ఇస్మాయిల్‌నే చూస్తున్నారు ఆత్రంగా.

నిద్రమత్తులో తలుపు తీసిన ఇస్మాయిల్ ఆ అర్ధరాత్రి వీళ్ళిద్దర్నీ చూసి ముందు ఆశ్చర్యపోయాడు. బ్రాహ్మిణ్ పరిస్థితి వివరించాడు.

"నాకు దాని గురించేమీ తెలియదు సార్! ఎప్పుడో మా గురువు చెప్పింది కొద్దిగా జ్ఞాపకం వుంది. అంతే..... అదే చెప్పాను" అన్నాడు ఇస్మాయిల్. అతడి నిద్రమత్తంతా వాళ్ళు చెప్పింది వినగానే దిగిపోయింది.

"కాష్మోరాయే కదా?"

"కాష్మోరాయే సార్! అనుమానం లేదు".

"అంటే దాన్నుంచి ఎవరూ రక్షించలేరంటావా?"అబ్రకదబ్ర అడిగాడు.

ఇస్మాయిల్ మాట్లాడలేదు..

శ్రీధర్ క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టాడు. "ఎలా ..... ఇప్పుడెలా?"

"అసలెవరు చేసుంటారీ చేతబడి?"

ఎవరూ మాట్లాడలేదు.

అంతకన్నా ముఖ్యమైన ప్రశ్న - "ఎందుకు చేసుంటారు?"

"చేతబడిని తిరగ్గొట్టటానికి వీల్లేదా?" మనసు అర్థంలేని ప్రశ్నలని అడిగిస్తొంది.

ఇస్మాయిల్ అన్నాడు, "చేతబడయితే తిరగ్గొట్టవచ్చు. కానీ అదయినా ఒక్క రోజులో అవ్వాలంటే కష్టం సార్! అదీగాక చేతబడికి ఆఖరిరోజు యిదీ అంటూ లేదు. మనిషి శుష్కించి పోతుంటే ఎప్పుడైనా 'తిరుగుబడి' చెయ్యవచ్చు. కాష్మోరాలో అలాక్కాదు. అందులో ఇరవై రోజులు అప్పుడే గడిచిపోయాయి. ఒకవేళ ఇదంతా మొదటిరోజే తెలిసినా మనం ఏమీ చేయలేక పోయేవాళ్ళం సార్! ఎందుకంటే 'కాష్మోరా' అనేది అన్నిట్లోకి పెద్ద విద్య. అసలు దాన్ని ప్రయోగించేవాళ్ళు యింకా వున్నారంటేనే ఆశ్చర్యంగా వుంది. మీరు కళ్ళారా చూసింది చెప్పకపోతే నేను అసలు నమ్మేవాడ్ని కాను" ఒక నమ్మలేని అద్భుతాన్ని నమ్మవలసి వస్తున్నట్టు అతని కంఠం ధ్వనించింది.

మళ్ళీ అతనే అన్నాడు-

"ఎప్పుడో మా గురువు చెప్పాడు సార్! కొన్ని వందల సంవత్సరాల క్రితం నవాబుల కాలంలో వుండేవారట యీ కాష్మోరా ప్రయోగించే వాళ్ళు. ఇప్పుడు ఆ పేరు వినడమేగానీ దానిగురించి తెలిసినవాళ్ళు ఎవరూ లేరని, ఇన్నాళ్ళకి అది తెలిసినవాడు పుట్టాడంటే ....." తరువాత ఏం అనాలో తెలియక అతడు ఆగాడు.

"ప్రతీ క్షుద్ర విద్యకీ తిరుగుబడి వుంటుందని నేనెక్కడో చదివాను" అన్నాడు అబ్రకదబ్ర, "దీనికి కూడా వుండే వుంటుంది".

"లేదు సార్! లేదు" ఇస్మాయిల్ తల అడ్డంగా ఊపాడు. "ఒక దానికన్నా కష్టమైన విద్య మరొకటి. మామూలు చేతబడికే చాలా తతంగం వుంటుంది. అటువంటిది అన్నిటికన్నా కష్టమైన కాష్మోరాని తొలగించాలంటే ఎవరికీ సాధ్యం కాదు".

ఎవరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ఏదో ఆలోచన వచ్చినట్టు నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ శ్రీధర్ అన్నాడు- "దీనికి విరుగుడు చెప్పమని ప్రేతాత్మని ప్రార్థిస్తే?"

పక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు అబ్రకదబ్ర.

"పరిష్కరం ప్రేతాత్మ సూచిస్తుందా?"

అతడు ఇస్మాయిల్‌వైపు చూశాడు. ఇస్మాయిల్‌కి ఒక్క క్షణం శ్రీధర్ అన్నది అర్థంకాలేదు. అర్థమయ్యాక విస్తుబోయాడు. అతడికి వెంటనే వచ్చిన అనుమానం ఇది సాధ్యమేనా అని.

అవునెందుకు సాధ్యం కాకూడదు. ప్రేతాత్మకి భూత భవిష్యత్ వర్తమానాలు తెలుసునంటారు. అటువంటప్పుడు దీనికి పరిష్కారం అదెందుకు చెప్పదు? చెప్పాలి.

వెంటనే కుండలో మట్టిపోసి, పుల్లల్ని గుచ్చాడు. వాటికి ఆకుల్ని దోపాడు.

ఒకప్పుడు శ్రీధర్ యీ చర్యనే నవ్వుతూ పరిహాసంగా చూశాడు. ఇప్పుడు గుండెలు బిగపట్టి, టెన్షన్‌తో చూస్తున్నాడు. అతడి జీవిత సర్వస్వపు భవితవ్యం ఇప్పుడు నిర్ణయింపబడుతోంది.

అయిదు నిమిషాలు గడిచినయ్. ఇస్మాయిల్ పెదవులు నెమ్మదిగా, అస్పష్టంగా కదుల్తూ మంత్రాల్ని ఉచ్చరిస్తున్నాయి.

పది నిమిషాలయింది. అతడు శిలా ప్రతిమలా నిలబడి వున్నాడు. తెలతెల్ల వారుతూంది.... ఆకుల్లో కదలిక లేదు.

ఇంకో అరగంట గడిచింది.

అతడు ప్రార్థిస్తున్నాడు. గాలిలో తిరుగాడే ప్రేతాత్మల్ని దేన్నయినా వచ్చి ఆవహించమని అర్థిస్తున్నాడు.

మరో గంట గడిచింది. ఆ పాకలో ముగ్గురూ అలానే వున్నారు. ఇద్దరు గుండెల్ని చిక్కబట్టుకొని కూర్చునున్నారు, ఒకడు నిలబడి ప్రేతాత్మల్ని ఆహ్వానిస్తున్నాడు.

బాగా తెల్లవారి పోయింది. ప్రత్యూషపు వెలుగురేఖ పాక పైకప్పుసందులోంచి చోటు చేసుకుని లోపలకు వస్తూంది. ఇంకో అయిదు నిమిషాలు గడిచినాయి. ప్రేతాత్మ రాలేదు.

దూరంగా ఆరు కొట్టింది.

ఇస్మాయిల్ కళ్ళు తెరిచాడు. తనవైపే ఆతృతగా చూస్తున్న యిద్దరితో నిస్పృహగా "లాభం లేదు సార్! ఇక రాదు" అన్నాడు.

శ్రీధర్ మొహం వాడిపోయింది. అప్పుడే ఆరయిపోయింది. ఇంక పద్దెనిమిది గంటలు! ఏ అద్భుతం జరిగి తన చిన్నారి పాపని బ్రతికించగలదు? అసలేమీ

తెలియకపోయినా బాగుణ్ణు. అది తెలిసిన తరువాత ఎలా ఎలా చూస్తూ నిస్సహాయంగా వూరుకోగలడు? నిమిష నిమిషానికీ మృత్యువుకి దగ్గరవుతున్న తన కూతుర్ని ఎలా రక్షించుకోగలడు?

"మళ్ళీ ఇంకొకసారి ప్రయత్నించకూడదా?" ఆశగా అడిగాడు.

ఇస్మాయిల్ తల అడ్డంగా వూపాడు. "రాదు సార్! వచ్చేదయితే ఇంత సేపా?"

"ఎందుకు రావటంలేదు?" అడిగాడు అబ్రకదబ్ర.

"మనం అడుగుతున్నది క్షుద్రదేవత గురించి కాబట్టి ప్రేతాత్మలు రావు సార్. అలా అప్పుడప్పుడూ జరుగుతూ వుంటుంది. పెళ్ళిళ్ళ గురించి అడిగినప్పుడూ, చెడెప్పుడొస్తుంది అని అడిగినప్పుడు అవి సమాధానం ఇవ్వవు. ఈసారి అయితే అసలు పూర్తిగా రానేలేదు". స్పష్టంగా చెప్పాడు.

"మరెలా?"

నిశ్శబ్దమే ఆ ప్రశ్నకి సమాధానమయింది.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మౌనంగా వుండిపోయారు. ముందు తేరుకున్నది శ్రీధర్, లేస్తూ, "మేం వెళ్ళొస్తాం" అన్నాడు.

"ఏం చేస్తారు ఇప్పుడు?" ఇస్మాయిల్ అడిగాడు.

"ఇక్కడుండి చేసేదేముంది? అబ్రకదబ్ర కూడా లేచాడు.

"వెతుకుతాను" దృఢంగా అన్నాడు శ్రీధర్.

"తెలిసిన వాళ్ళందర్నీ అడుగుతాను. కనబడిన వాళ్ళందర్నీ తెలుసునేమో చెప్పమంటాను. నా పాపని ఎలాగైనా రక్షించుకొంటాను ఈ పట్టణాన్ని జల్లెడ వేసైనా సరే పరిష్కారము చెప్పగలిగే వ్యక్తిని పట్టుకుంటాను" ఆవేశంతో అతడి పిడికిలి మూసుకొంది.

"లేరు, చెప్పలేరు. ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రితంనాటి ఈ విద్యల గురించి ఎవరూ చెప్పలేరు. కాష్మోరాలాటి దేవతకి ఎవరూ ఎదురు నిలవలేరు" అబ్రకదబ్ర తనలో తానే అనుకున్నాడు.

ముగ్గురూ బయటకొచ్చారు.

"బాగా చదువుకున్న వాళ్ళూ- భూతాల్ని తరిమేవాళ్ళూ- మంత్రగాళ్ళమని చెప్పుకునే వాళ్ళెవరూ చెప్పలేరు సార్" ఇస్మాయిల్ అన్నాడు. అతడి కంఠం నెమ్మదిగా, సాలోచనగా వినిపించింది. "చెప్పగలిగితే ఒకడే చెప్పగలడు. మా చిన్నప్పుడు ఈ బస్తీలోనే వుండే పిచ్చివాడు. ఒంటిమీద బట్టల్లేకుండా తిరుగుతుంటే

పిల్లలందరూ చుట్టూ చేరి ఏడిపిస్తూ వుండేవాళ్ళం. కానీ నాకు తెలుసు సార్, అతడికి ఈ విద్యలన్నీ బాగా తెలుసు. అన్నీ తెలిసినవాళ్ళే పిచ్చివాళ్ళలా కనిపిస్తారు సార్".

"అతని పేరు?" టెన్షన్ నిండిన కంఠంతో శ్రీధర్ అడిగాడు.

"సంతాన్ ఫకీర్".

అబ్రకదబ్ర ఉలిక్కిపడ్డాడు..... సంతాన్ ఫకీరు ! శ్రీధర్ "ఇప్పుడతను ఎక్కడ దొరుకుతాడు?" అని అడిగాడు.

"నేను చూసి ఎన్నో సంవత్సరాలయింది సార్! ఆ ...... ఆ మధ్య పాతపేట వెనుక శ్మశానంలో చూసినట్టు గుర్తు".

అబ్రకదబ్ర "కరెక్ట్......." అని అరిచాడు. ఇద్దరూ అతడివైపు చిత్రంగా చూస్తూ- "ఆ సత్రంలోనే చూశాను. కాష్మోరా గురించి చెప్పింది అతనే" అని కొంచెం స్వరం తగ్గించి "నేను సిగ్గుపడుతున్నాను శ్రీధర్! అయినా ప్రాణాలు పోతున్న ఈ సమయంలో సిగ్గేమిటి! అతడు నాకు కాష్మోరా నేర్పుతానన్నాడు. పెట్రోలు చేతిమీద పోసి వెలిగించుకోమన్నాడు" అన్నాడు.

ఇంక మాటలతో టైం వేస్ట్ చెయ్యటం ఇష్టంలేకపోయింది శ్రీధర్‌కి. అబ్రకదబ్రతో "నీకు తెలుసా ఆ ఫకీరు? గుర్తుపట్టగలవా?" అని అడిగాడు.

అబ్రకదబ్ర తలూపాడు.

"సరే ! ఇంకేం చెప్పకు. నువ్వు పాత పేటనుంచి వెతకటం మొదలు పెట్టు. మేము అట్నుంచి ప్రారంభిస్తాం. మా యిల్లు పాయింట్‌గా పెట్టుకుందాం. ప్రతి అరగంటకి నేను ఫోన్ చేస్తాను. నువ్వూ అలా చెయ్యి. ఇస్మాయిల్ నాతోనే వుంటాడు. అంతా అర్థమయిందా?"

అబ్రకదబ్ర తలూపి వెంటనే వెళ్ళి పోయాడు. టైమ్ విలువ అతడికి ఇప్పుడు అర్థమయింది. శ్రీధర్, ఇస్మాయిల్ కారులో బయల్దేరారు. కారు డ్రైవ్ చేస్తున్నాడన్న మాటేగానీ శ్రీధర్ మనసులో సముద్రకెరటాల్లా ఆలోచనలు. ఆ ఫకీరు కనబడతాడా? కనపడినా అతడికి కాష్మోరాని ఆపే విధానము తెలుసా? తెలిసినా చెప్పే మూడ్‌లో వుంటాడా? అసలు టైమ్ వుందా వీటన్నిటికీ?

ముందు ఇంటికి వెళ్ళాడు. అనుకున్నట్లే పాప కోమాలో వుంది. హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. శారద ఆస్పత్రిలోనే వుంది. అక్కడికి వెళ్ళి చూసే టైమ్‌లేదు, అనవసరం కూడా.

ఎనిమిది కావొస్తుంది. ఇంకా పదహారు గంటలు- శ్రీధర్ టెన్షన్‌తో వణుకుతున్నాడు. అబ్రకదబ్ర దగ్గర్నించి మొదటి ఫోన్ వచ్చింది. ఫకీరు దొరకలేదు.

మళ్ళీ ప్రయాణం మొదలయింది. సత్రాలు, మఠాలూ, స్మశానాలూ, తుప్పలూ, రాళ్ళూ, చెట్లూ పుట్టలూ. రాత్రంతా నిద్ర లేకపోవటం వల్లా, ఏమీ తినకపోవటం వల్లా శోషవస్తున్నట్టు అవుతూంది శ్రీధర్‌కి. అలసటని పళ్ళ బిగువున అదిమిపెట్టి వెతకటం సాగిస్తున్నాడు. రెండో ఫోను అరగంట తర్వాత. ఫకీరు దొరకలేదు.

సంతాన్ ఫకీరు గురించి ఎవరికీ తెలీదు. అందరి దృష్టిలో అతడో పిచ్చివాడు. ఆకులూ, అలములూ తింటూ, శ్మశానాల్లోనూ, కూలిపోయిన సత్రపు గోడల క్రిందా పడుకునేవాడు. అతడి గురించి ఎంక్వయిరీ చెయ్యటం కూడా చాలామందికి ఆశ్చర్యంగా వుంది.

ఎనిమిదిన్నర అవుతూండగా కొంచెం ఇన్ఫర్మేషన్ తెలిసింది. అతడిని మిట్ట ప్రాంతంలో వున్న శ్మశానంలో నాలుగురోజుల క్రితం ఎవరో చూశారట.

మళ్ళీ అటు ప్రయాణం. ఊరి చివర మామిడి తోటలు దాటాక ఆ శ్మశానం ప్రారంభం అవుతూంది. తరువాత ఇళ్ళు లేవు. నాలుగైదు మైళ్ళ తర్వాత చిన్న కొండ. మధ్యలో అన్నీ చెట్లూ, చేమలూ.... కొన్ని వందల సంవత్సరాల క్రితం ఎవరో నవాబులు కట్టిన కోట. కోట శిథిలమై కనిపిస్తూంది.

సూర్యుడు తీక్షణతని పుంజుకుంటున్నాడు. అయినా శ్మశానం నిద్రపోతున్నట్లే వుంది. పాడుపడిన శ్మశానం అనుకొంటా కాపరి కూడా లేడు.

పది నిముషాలపాటు వెతికారు. ఇంతలో మోటార్‌సైకిల్ చప్పుడు వినిపించింది. అబ్రకదబ్ర చెమటలు కక్కుకుంటూ వచ్చాడు.

"అనవసరం బ్రదర్! వెతకటం పోదాం పద".

"ఏం ?"

"ఆ ఫకీరు మొన్న లారీ క్రింద పడ్డాడట. రెండురోజులు గవర్నమెంటాస్పత్రిలో ట్రీట్‌చేసి ఇక బ్రతకడని వదిలేశారట. తలమీద బాగా పెద్ద గాయం అయి, ఆస్పత్రిలో జేర్చేముందే రక్తం చాలా పోయిందట".

శ్రీధర్ నవనాడులూ కృశించినట్టయింది. మొహం తెల్లగా పాలిపోయింది. ఏం చెయ్యాలో తోచనట్టు నిశ్చేష్టుడయ్యాడు. మిగతా యిద్దరు కూడా అతడి వేదనని పంచుకొన్నట్టు మౌనంగా వుండిపోయారు.

ముందు తేరుకున్నది అబ్రకదబ్ర. స్నేహితుడి దగ్గరగా వెళ్ళి భుజం మీద చేయి వేసి "శ్రీధర్ ! సారీ ! రియల్లీ సారీ !" అన్నాడు.

శ్రీధర్ తలెత్తి అతడివైపు చూశాడు. అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తనకోసం ఇతడెంత చేస్తున్నాడు. తను చీదరించుకున్నా పట్టువిడవకుండా పరిష్కార మార్గాన్ని చూపించాడు. నిద్రలేక, తిండిలేక, తనతో పాటూ తన వేదననీ పంచుకుంటున్నాడు. స్నేహం అంటే యిదేనేమో!

అతనో నిశ్చయానికొచ్చినట్టు "ఓ.కే ! బ్రాహ్మిన్ పోదాం పద" అన్నాడు వెనుతిరుగుతూ.

"అంతేనంటావా?"

ఆ మాట శ్రీధర్‌లో నిక్షిప్తమై వున్న వేదన తాలూకు ఆనకట్టని బ్రద్దలుకొట్టింది.

"లేకపోతే ఏం చెయ్యమంటావు? విధి ఇంత కర్కశంగా మనని ఎదుర్కొంటూ వుంటే ఇంకా ప్రయత్నం చెయ్యమంటావా? పోదాం పద బ్రాహ్మిన్. కనీసం ఈ ఆఖరి క్షణాలయినా నా కూతురి పక్కనుండనీ నన్ను. ఇంకొన్ని గంటలలో ప్రాణాలు పోగొట్టుకుంటూన్న నా చిన్నారి తల్లిని వళ్ళో తీసుకోనీ" అతడి కంఠం వణికింది... "శారదని ఓదార్చటానికైనా చివరి క్షణాలలో నేనక్కడుండాలి".

ఇస్మాయిల్ ఏదో అనబోయాడు. అబ్రకదబ్ర కళ్ళతోనే వారించాడు. ఏడుస్తే బాధ తగ్గుతుంది. మనసు తేలికపడుతుంది. ముగ్గురూ ఆస్పత్రివైపు కదిలారు.

* * *

అదే సమయానికి డాక్టర్ పార్థసారధి పాప పల్స్ చూస్తున్నాడు.

పక్కనే ప్రొఫెసర్ జయదేవ్ వున్నాడు. అతడి మనసంతా చికాకుగా వుంది. అంతకుముందే అతడికీ డాక్టర్‌కీ సంభాషణ జరిగింది.

"రోజూ మూడు రక్తం చుక్కల చొప్పున తాగితే ఏమవుతుంది?"

"ఏమీ అవదు" అన్నాడు పార్థసారధి. "ఆఫ్రికాలో మనిషి మాంసం తినేవాళ్ళు ఏమీ అవటం లేదుగా?""

"వాళ్ళు కాల్చి, తింటారుగా".

"పేగుల ద్వారా వెళ్ళిన రక్తం ఏమీ చెయ్యదు. ఇంట్రావీనస్ ద్వారా పరాయి గ్రూపు రక్తం ఎక్కిస్తే మాత్రం చాలా దారుణాలు జరుగుతాయి. రక్తం విరిగిపోవటం, కిడ్నీ ట్రబుల్, జాండిస్-"

"నాకో పైశాచికమైన కోర్కె కల్గుతూంది".

"ఏమిటది?"

"ఒక వ్యక్తికి ప్రతిరోజు మూడు రక్తం చుక్కలు తాగించి ఏం జరుగుతూందో చూడాలని వుంది. మొదటి రోజు హిస్టీరియా, రెండోరోజు చిగుళ్ళనుంచి రక్తం, మూడోరోజు జుట్టు వూడిపోవటం, నాల్గవరోజు కడుపులో నొప్పి, ఇరవై ఒకటో రోజు మరణం. ఇలా పరిణామాలు సంభవిస్తే అది –"

"ఊ– అది?" అడిగాడు డాక్టర్.

"కాష్మోరా" కసిగా అనేసి జయదేవ్ బయటికి వచ్చేశాడు.

చేతబడి చేయగలిగేవాళ్ళు ప్రస్తుతం ప్రపంచంలో ఎవరైనా వున్నారా?

లేరు. లేరు. లేరు.

అతడు ఆలోచనల్లోనే తన ఇంటి దగ్గర కారు ఆపుచేశాడు. మెట్లెక్కి పైకి వచ్చాడు. మేడమీద – తన బాల్కనీలో కూర్చొని వున్న వ్యక్తిని చూసి స్థాణువై నిలబడిపోయాడు.

కుర్చీలో కూర్చొని అతడి కోసమే ఎదురుచూస్తూన్నాడు ఓ పోలీసు ఇన్‌స్పెక్టరు.

* * *

చట్టానికి పట్టుబడే దోషుల్ని శిక్షించడానికి కంకణం కట్టుకొన్నట్టు వుంది పోలీస్‌స్టేషన్. జేగురు రంగు రాళ్ళు నిస్తేజంగా వున్నాయి.

ఇన్‌స్పెక్టరు కుర్చీలో వెనక్కి వాలుతూ – "అదీ జరిగింది. ఫ్యూజ్‌వెయ్యగానే కరెంట్ పోవడంతో లైన్‌మెన్‌కి అనుమానం వచ్చి చెక్‌చేశాడు. పోల్‌నుంచి ఒక వైరు మీ ఇంటి డాబామీదకి వచ్చింది. అది మామూలు కరెంటు కాదు, ఇండస్ట్రియల్ కరెంట్. ముట్టుకోగానే చచ్చిపోయేటట్లు ఎవరో దాన్ని ఏర్పాటు చేశారు. లైన్‌మెన్ ముందు ఒప్పుకోలేదు. కానీ పోలీస్‌స్టేషన్ 'కారం' కొంచెం రుచి చూపించేసరికి అంతావప్పేసుకొని, తనకి వందరూపాయలిచ్చిన వ్యక్తి పోలికలు వర్ణించాడు. ఆ వ్యక్తి పల్లెటూరివాడిలా వుంటాడు........ " అంటూ ఇన్‌స్పెక్టర్ వర్ణించటం మొదలు పెట్టాడు.

అతడు వర్ణిస్తూ వుంటే జయదేవ్ మెదడు అనుమానం పొరల్లా విడిపోయింది. ఇన్‌స్పెక్టర్ ఆపుచేయగానే "పైడితల్లి" అన్నాడు జయదేవ్. "నన్ను చంపటానికి ప్రయత్నించిన వాడి పేరు పైడితల్లి. నేను మూర్ఖుణ్ని ఇన్‌స్పెక్టర్. ఇప్పుడు నాకంతా అర్థమవుతూంది. మొన్న రాత్రి నా కళ్ళముందే వాడు ఎంతో తెలివిగా హార్లిక్స్‌తోపాటు పాప నోట్లో రక్తం వేస్తున్నా కనుక్కోలేకపోయాను..... "

ఇన్‌స్పెక్టర్‌కి హార్లిక్స్కూ, రక్తం వేయటం ఏమీ అర్థంకాలేదు. పైడితల్లి అన్న పేరు మాత్రం నోట్ చేసుకున్నాడు.

"ఈ పైడితల్లి అనేవాడిని ఎలాగైనా పట్టుకుంటాం. అంతవరకూ మీరు కొంచెం జాగ్రత్తగా వుండండి ప్రొఫెసర్".

"అక్కర్లేదు" అని తనలో తనే అనుకున్నాడు జయదేవ్. ఇక అతడు ఏమీ చెయ్యనవసరం లేదు. చెయ్యవలసినదంతా పైడితల్లి నిన్నరాత్రితోనే చేసేశాడు.

ఇన్‌స్పెక్టర్‌కూడా పైడితల్లిని పట్టుకున్నా ఏమీ చేయలేడు. సరిగ్గా పదహారు గంటల తర్వాత పైడితల్లి ఇరవై లక్షలకి వారసుడు అవుతాడు. ఏ మాత్రం అనుభవమున్న లాయరైనా పైడితల్లి మీద కేసు దూదిపింజల్లా కోర్టులో ఎగర కొట్టేస్తాడు.

(అయితే ఇదంతా జయదేవ్‌కి తెలీదు. అతడికి తెలిసిందొకటే. పాప మరణంతో పైడితల్లికి సంబంధం ఉంది అని అతననుకొన్నాడు).

అతడు ఇన్‌స్పెక్టర్‌కి షేక్‌హాండిచ్చి "ఆ పైడితల్లి కనబడితే నాకు ఫోన్ చెయ్యండి" అన్నాడు. ఇన్‌స్పెక్టర్ తలూపాడు.

పోలీసులు అతడిని పట్టుకోలేరనీ, పైడితల్లి వాళ్ళిద్దరికీ అందనంత దూరంలో వున్నాడనీ, ఆపాటికే పోలీస్ జ్యూరిస్‌డిక్షన్ దాటి వెళ్ళిపోయాడనీ వాళ్ళకి తెలీదు.

అతడు మెట్లు దిగుతుండగా తొమ్మిది కొట్టింది. సూర్యుడు పైకి వచ్చాడు.

22

ఆస్పత్రి గడియారం తొమ్మిది కొడుతూ వుండగా శ్రీధర్, అబ్రకదబ్ర అక్కడికి చేరుకున్నారు. పాప నిశ్చింతగా మరణించబోతుందని శారదకి చెప్పదల్చుకోలేదు శ్రీధర్. చెప్పి బాధపెట్టటం దేనికి? అతడు నిర్లిప్తంగా జరిగినదంతా చూస్తున్నాడు. అతడు లోపలికి ప్రవేశించగానే పార్థసారధి పాప పల్స్ చూస్తున్నాడు. అతడి పక్కనే డాక్టర్ జేమ్స్ వున్నాడు. పాప కోమాలో వుంది.

"ఇది కోమా కాదు, కోమా కాదు .... " పార్థసారథి అనుకొంటున్నాడు.

పాప ముక్కుకు ఆక్సిజన్ ట్యూబ్ అమర్చి వుంది. చిన్న గురక లాంటి శ్వాస. పాప పల్స్ తగ్గిపోసాగింది డ్రిప్ ఎక్కువ చేస్తే మామూలు గాలవుతోంది. కానీ ఎంతసేపిలా ? బి.పి. కూడా అనిశ్చితంగానే వుంది. ఒక్కోసారి 100, 50 కు వచ్చేస్తూంది.

"డాక్టర్!"

"ఎస్. జేమ్స్!"

"ఇలా ఎంతసేపు సింపమాటిక్ ట్రీట్‌మెంట్ యిస్తాం..... డయాగ్నొసిస్ తెలియకుండా".

పార్థసారధి మాట్లాడలేదు. అక్కడ మాట్లాడటానికేమీ లేదు.

....

....

శారద పాప పక్కనే కూర్చుని వుంది.

శ్రీధర్ కదిలాడు. ఆమె తలెత్తి చూసింది ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

అతడు బయటకొచ్చేశాడు. తర్వాత ఏం చెయ్యాలో తోచలేదు. ఒంటరిగా వుండిపోవాలన్న భావన.

బయట కారిడార్‌లో ఇస్మాయిల్, బ్రాహ్మిణ్ నిలబడి వున్నారు. హాస్పిటల్‌లో కలకలం మొదలైంది. తొమ్మిది కావస్తూంది. ఎవరో దూరంగా చచ్చిపోయిన బంధువు కోసం ఏడుస్తున్నారు. గాలిలోంచి ఏడుపులు.

అవుట్ పేషెంట్ల వార్డు దగ్గర క్యూ పొడుగ్గా వుంది. అంబులెన్సులోని రోగిని స్ట్రెచ్చరు మీద లోపలికి తీసుకుని వస్తున్నారు. ...... లోపలి కొచ్చే రోగులు, బయటకొచ్చే మనుష్యులూ, శవాలూ.

ఈ ప్రపంచమే ఒక హాస్పిటలు.

అతడు ఆస్పత్రి ఆవరణలోనికి వచ్చాడు. ఊరికి చివర కట్టబడింది. దూరంగా చెట్లు విరబోసుకున్న దెయ్యాల్లా వున్నాయి. అతడు నడుస్తున్నాడు గమ్యం లేకుండా, ఎక్కడికో ఎక్కడెక్కడికో.

పల్లెల్నుంచి రోగుల్ని తీసుకొచ్చిన వాళ్ళు చెట్లక్రింద అన్నం వండుకుంటున్నారు. బిచ్చగాళ్ళు ఇంకా కొందరు నిద్రపోతూ వున్నారు. అందులో చాలామందిని ఆస్పత్రే బిచ్చగాళ్ళుగా చేసింది. కాళ్ళు లేనివాళ్ళు, కళ్ళు పోయినవాళ్ళు, కుష్టువాళ్ళు..... దేవుడి చదరంగంలో పావులు.

అతను నడుస్తున్నాడు. అతడి మనసంతా శూన్యమై వుంది. అందులో దుఃఖం లేదు. ఆనందం లేదు. శ్మశాన వైరాగ్యం కూడా కాదు. అంతా తన వాళ్ళన్న భావన. మనిషి జీవితం బుద్బుదమన్న ఆలోచన. చిన్న చిన్న తుప్పలు. జీవితం అనే దార్లో అడ్డంకుల్లా పెద్ద పెద్ద చెట్లు. అనుభవాల్లా...... గోతులు....... మిట్టపల్లాలు.

ఎక్కడో కాకి దాహంతో అరుస్తూంది. ఆకాశం వెల – వెల బోతున్నట్లు తెల్లగా వుంది. చిన్న మేఘపు తునక కూడా లేదు. అతడు తూలటం లేదు. అతడికి నిద్ర రావటం లేదు. ఆకలి వెయ్యటం లేదు. అసలేమీ లేదు. ఏమీ లేకపోవటం గొప్ప స్థితి ఎందుకంటే.....

..... ఏమీ వుండదు కాబట్టి.

"దా .... దాహం ...." సన్నటి మూలుగు వినిపించి ఆగాడు. ఎవరో పాపం లేవలేక అడుగుతున్నారు. చెట్టు మొదట్లో పడివున్నారు. తుప్పల్లోంచి ఆకారం కనిపిస్తూంది.

అతడు చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో మనుష్య సంచారం లేదు. దూరంగా ఎవరో ముష్టివాళ్ళు వంట వండుకుంటున్నారు. అతడు వాళ్ళ దగ్గరికి వెళ్ళి నీళ్ళడిగాడు. వాళ్ళు అతడివైపు విచిత్రంగా చూశారు. చిన్న బొచ్చెలో నీళ్ళిచ్చారు.

అతడు తీసుకొచ్చి పోసాడు. పోస్తుంటే నవ్వొచ్చింది. రోడ్డుపక్కన ఇతడు పడివుంటే– తను కార్లో వెళ్తూ చూసి వుంటే కారు ఆపేవాడా? తన ఎయిర్ కండీషన్ రూము అద్దాల కిటికీలోంచి క్రింద రోడ్డుమీద చూస్తే– దిగి వుండేవాడా?

ఒకే పడవలో మునిగిపోతున్న ఇద్దరు అపరిచితులు.

అతడికెందుకో నవ్వొచ్చింది మళ్లీ. చిప్పలో నీళ్ళు అతడి నోట్లో పోశాడు. రెండు నిమిషాల తర్వాత అతడు తేరుకున్నాడు.

"థూ ! ఎదవ మనుషులు, ఎదవ మనుషులు. రెండ్రోజుల్నుంచి పడున్నా చూసి తప్పుకున్నారు తప్ప గుక్కెడు నీళ్ళు పొయ్యలేదు. నువ్వు పోశావు. సింహం మేకపిల్ల కథ తెల్సా– నేనట్ట సాయం జేస్తానీకు".

శ్రీధర్‌కి అంత విషాదంలోనూ నవ్వొచ్చింది.

"ఎవర్నువ్వు?" అడిగాడు.

"కనబడటంలే? నా వంటిమీద సిన్న గుడ్డ తప్ప ఇంకేంలే. నీ మెదడులో మట్టి తప్ప ఇంకేంలే. బారెడు జుట్టుంది. నిలువెత్తు గడ్డముంది. మెళ్ళో పూసలు గట్టి, నా వంటికి మట్టి హ్హి హ్హి హ్హి...... ఫకీర్ .... ఫకీర్".

శ్రీధర్‌కి షాక్ తగిలినట్లయింది. ఎదుటి వ్యక్తివైపు పరిశీలనగా చూశాడు. నుదుటి మీద పెద్ద గాయం .... కాలికి హాస్పిటల్ ఎప్పుడో కట్టిన బ్యాండేజీ......

సంతాన్ ఫకీర్!

ఆ మాటే అస్పష్టంగా గొణిగాడు.

అనుమానంగా "నా పేరు నీకెట్లా తెలుసు?" అని, అంతలోనే బిగ్గరగా నవ్వుతూ "అంతేలే. వోల్ జిల్లా మొత్తంమీద బట్టల్లేకుండా తిరిగేది ఈ సంతాన్ ఫకీరొక్కడే కదా" అని చెట్టుమీదకు చూసి- "అంతేకదా కాకీ" అన్నాడు.

శ్రీధర్ మాట్లాడలేదు. తన కళ్ళ ముందున్నది కలో నిజమో అతడు ఇంకా నిర్ధారణకు రాలేకపోతున్నాడు. నీళ్ళు తాగిన చిప్పని నెత్తిమీద టోపీలా పెట్టుకుని బ్యాలెన్స్ చెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాడు ఫకీర్. కళ్ళు పైకెత్తి పిచ్చిగా చిప్పని చూస్తున్నాడు. శ్రీధర్ నెమ్మదిగా మోకాళ్ళ మీద కూర్చున్నాడు. రెండు చేతులూ జోడించి అర్థిస్తున్నట్టు అన్నాడు.

"...... ఫకీర్ మరణశయ్య మీద వున్న నా కూతుర్ని రక్షించవా నువ్వు?"

మళ్ళీ పెద్ద నవ్వు. "అందరినీ రక్షించేది ఆ దేవుడు".

శ్రీధర్ దాన్ని పట్టించుకోలేదు- "దేవుడు కూడా రక్షించలేదు. ఎందుకంటే- పట్టింది దెయ్యం కాబట్టి. ఫకీర్ ! యీ ప్రపంచంలో నా పాపని రక్షించగలిగేది ఎవరైనా వుంటే అది నువ్వే".

"గాలికి తిరిగే ఫకీర్ని నేను, నేనేం చెయగలను?"

"నువ్వు చేస్తానన్నావు. సాయం చేస్తానన్లేదూ!"

"సరే చేస్తాను. ఏం చెయ్యమంటావు? తాయెత్తియ్యమంటావా?"

"తాయెత్తులకి తగ్గదది".

"మంత్రం చెప్పమంటావా! చూ ....మంతర్........ " నవ్వాడు.

"మంత్రాలకి లొంగదది......"

ఫకీర్ కిదంతా నవ్వులాటగా వుంది. శ్రీధర్ని ఏడిపించటం. "తాయెత్తులూ, మంత్రాలు తప్ప ఇంకేమీ రావే నాకు. గుడ్డని మూడుమడతలేసి కడితే అది తాయెత్తు .... హ్రీం అన్న అక్షరాన్ని మూడుసార్లంటే అది మంత్రం" నవ్వాడు బిగ్గరగా.

"మూడు మడతలే వేస్తావో- మూడుసార్లు మంత్రమే వేస్తావో- మూడు రక్తం చుక్కలు తాగిన నా కూతుర్ని మాత్రం రక్షించు".

'మూడు రక్తం చుక్కలు.......' అన్న మాటతో ఫకీరు పెదవుల మీద చిరునవ్వు మాయమైంది.

"ఏమిటి నీ కూతురుకి....." అడిగాడు.

"కాష్మోరా...... " ఆ మాట వినగానే ఫకీరు చేతిలోంచి పెద్ద శబ్దంతో చిప్ప నేలమీద పడింది.

అప్పటివరకు కనబడిన చేష్టలు ఒక్కసారిగా మాయమయినాయి. 'కాష్మోరా' తనలో తనే గొణుక్కున్నాడు. మొహం వివర్ణమైంది. నవ్వు తప్ప ఇంకే భావమూ కనబడని అతడి మొహంలో ఆశ్చర్యం, విస్మయం కనబడుతున్నాయి. అయోమయంగా శ్రీధర్కేసి చూశాడు. శ్రీధర్ మౌనంగా అతడికేసి చూస్తున్నాడు. ఫకీరు తడబడ్డాడు.

"ఎలా ..... ఎలా తెలుసు నీకిది కాష్మోరా అని".

ఇరవై రోజుల్నుంచీ జరుగుతున్నది. క్రితం రాత్రి తను చూసింది చెప్పాడు వివరంగా.

"నమ్మను, నేను నమ్మలేను" తల వూపుతూ అన్నాడు ఫకీరు. "కాష్మోరా చేసేవాళ్ళు ఇంకా ఇప్పటికీ వున్నారంటే....... లేరు ....ఎవ్వర్లేరు. ఉండటానికి వీల్లేదు" అరిచాడు.

"కానీ వున్నారు. దృష్టాంతరం కళ్ళముందే కనబడుతుంది" నొక్కి చెప్పాడు శ్రీధర్. "ఫకీర్! ఇంకెంతో సమయం కూడా లేదు. తొందరగా చెప్పు, పాపనెలా రక్షించుకోవాలో ....ఈ రోజే ఆఖరిరోజు".

ఫకీరు వెనక్కి వాలి, చెట్టునానుకొని కళ్ళు మూసుకొన్నాడు. అతడిప్పుడు ఫకీరులా లేడు. మూసివున్న కనురెప్పల వెనుకనుంచి కూడా కళ్ళు తీక్షణతని చూస్తున్నాయి. అతడి మాటలలో యాస లేదు.

"వింధ్యారణ్య ప్రాంతాలలో మా గురువు వుండేవాడు. అన్నీ నేర్పాడు. అతడికన్నీ తెలుసు. అణిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశత్వ, వశత్వాలు. కాష్మోరా గురించి కూడా చెప్పాడు కానీ ఆ దేవతతో మాత్రం సంబంధం పెట్టుకోవద్దన్నాడు. అంతకన్నా క్షుద్రమైన దేవత ఇంకోటి లేదు..... ఎవడువాడు దాన్ని ప్రయోగించింది? ఎన్నోవేల సంవత్సరాలనుంచి నిద్రపోతున్న ఆ క్షుద్రదేవతని మేల్కొలిపింది ఎవడు? వాడు పూర్తిగా నాశనమైపోతాడు".

"కానీ ఈ లోపులో నా కూతురు నాశనమైపోతుంది".

అతడో క్షణం మౌనంగా వున్నాడు. "ఏ క్షుద్ర దేవతయినా భయపడే ఒకే ఒకటి ఏమిటో తెలుసా?"

శ్రీధర్ తలెత్తాడు.

"తులసిచెట్టు".

శ్రీధర్ సన్నగా వణికాడు.

తమ పెరట్లో తులసి చెట్టు అంతర్ధానం అవటం అతడికి జ్ఞాపకం వచ్చింది. ఆ రోజుల్లోనే కొంచెం తెలివితో ప్రవర్తించి వుంటే ఎంత బావుండేది..... కానీ గతజలసేతుబంధం.

"నీ పేరేమిటన్నావ్?"

"శ్రీధర్".

"శ్రీధర్! నిజంగా కాష్మోరాని ఎలా వదిలించాలో నాకు తెలుసు. నాకు తెలిసినంతలో పరిష్కారం చెబుతాను. నిజానికి కాష్మోరాకి తిరుగుబడి లేదు. ఈ రోజు ఆఖరి రోజు అన్నావ్ కదూ? ఏం జరిగినా ఈ రాత్రి పన్నెండు లోపులో జరగాలి"....... అంటూ లేచాడు.

అతడు- అతడి వెనకే శ్రీధర్ నడుస్తున్నారు. శ్రీధర్ ఏదో మత్తులో వున్నట్టు మంత్రముగ్ధుడిలా నడుస్తున్నాడు. ఓ ఇంజనీరు - బాగా చదువుకొన్నవాడు - ఆ క్షణం అన్నీ మర్చిపోయి బికారిలా, ఇంకో బికారి వెనుక నడుస్తున్నాడు. ఇదంతా చదవటానికీ, చూడటానికీ చాలా హాస్యాస్పదంగా వుండొచ్చు. కానీ జరుగుతున్నదది. ఆత్మీయులు మరణశయ్య మీద ఉన్నప్పుడు, అదీ మానవాతీత శక్తి అని నమ్మకం కలిగినప్పుడు సంస్కారం రియలిజపు పొరల వెనక్కి వెళ్ళి పోతుంది.

అరగంట తర్వాత వాళ్ళు ఆ పాడు పడిన కోట చేరుకున్నారు. దారి రాళ్ళతోనూ, తుప్పల్తోనూ నిండివుంది. ముళ్ళు తగిలి అతడి ఫ్యాంటు చినిగిపోయింది. పాదాల్నుంచి రక్తం స్రవించసాగింది. సూర్యుడు తీక్షణతని పొందుతున్నాడు. నుదుటి మీదనుంచి చెమట ధారాపాతంగా కారుతోంది. అయినా శ్రీధర్ వీటిని పట్టించుకోకుండా సాగిపోతున్నాడు.

కోటలో రాళ్ళ వెనుక నున్న చిన్న సందులోకి దారి వున్నట్టు అతడు గమనించాడు. ఒకప్పటి గుర్రపుశాల అనుకుంటా ...... బాగా చీకటిగా వుంది. వర్షపు నీరు అక్కడకు చేరుకొని నిలవ వుండిపోవటంతో అదోరకమైన వాసన వస్తుంది.

"ఇక్కడే నేను వుండేది" అన్నాడు సంతాన్ ఫకీర్.

అప్పుడు చూశాడు శ్రీధర్ నేలమీద పడివున్న పూలనీ, పసుపునీ. "తూర్పువైపు కూర్చొని,కళ్ళు మూసుకొని ఇష్టదైవాన్ని ప్రార్థించు" అన్నాడు ఫకీరు. శ్రీధర్ కళ్ళు

మూసుకొన్నాడు. తన తలమీద ఫకీరు చెయ్యి పడటం మాత్రం అతడికి తెలుసు. అంతే ! ఒక బలమైన జ్యోతి అతడి కళ్ళముందు బ్రహ్మాండమైన వెలుగుతో మండుతూ గిర్రున తిరుగుతూ ఆత్మస్థానాన్ని సోకటం అతడు ట్రాన్స్‌లోనే గమనించాడు. అతడికి ఏమీ అర్థంకావటంలేదు ! అంతా మత్తే. అతడికి ఓ దివ్యానుభూతిని ఇస్తూంది.

ఆ మత్తులోనే అతడు ఫకీరు కంఠాన్ని వినసాగాడు. మందస్వరాన ఫకీరు మాట్లాడుతున్న మాటలు ఆ పాడుబడిన కోట కూలిన గోడలమధ్య నెమ్మదిగా ప్రతిధ్వనించసాగాయి.

"చేతబడి అన్న దానికి పూర్వపదం 'చేతన్‌బడి' అన్నది. ఒక మనిషిని తన చేతన్‌బడేటట్టు చేసుకోవటం ఆరు శతాబ్దాల క్రిందే మనకి తెలుసు. ఎవరికీ తెలియని రహస్యాల్నీ, ఎవరూ వూహించని ఫలితాల్నీ నీకు చెబుతున్నాను. ఈ చెప్పటం నిషేధించబడింది. ఈ విషయాల్ని గురువు అనుమతి లేకుండా వెల్లడిస్తే ఆ వెల్లడించిన వాడు దారుణంగా చచ్చిపోతాడు. వంశంలో ఎవరూ మిగలకుండాపోతారు. అయినా నీకు చెబుతాను. నేను సర్వనాశనం అయినా సరే. నా కుటుంబంలో ఒక వ్యక్తి మిగలకుండా పోయినా సరే - నేను అనుకున్న విషయాలు చెప్పాలి. అందరికీ చాటించాలి ఎన్నో వందల సంవత్సరాల్నుంచీ యీ విషయాలు క్లుప్తంగా- కేవలం కొంతమంది మంత్రగాళ్ళ చీకటి అరల్లో, రహస్య స్థావరాల్లో వుండిపోయినవి.

బృహత్ జ్యోతి అభ్యాసం చేసిన వారికి ధాతువుల మీద సమాహితం చేయటం సులభం. సప్తధాతువులు- అంటే త్వక్ (చర్మం), అసృక్ (రక్తం), మాంసం, కొవ్వు (మేదస్), ఎముకలు, ఎముకలలోని గుజ్జు (మజ్జా), రేతస్సు- ఈ సప్తధాతువులకి సప్త అధిష్టాన దేవతలు వున్నారు. చర్మానికి ఢాకినీ నుంచి, రేతస్సుకి యాకిని ద్వారా ఈ సప్త దేవతల్ని, చేతబడి చేయబడిన వాడి సప్తప్రదేశాల్లో చూడవచ్చు. ఢాకినీని గొంతుక (విశుద్ధ)లో, మిగతా దేవతల్ని వరుసగా హృదయం, బొడ్డు, శిశ్నం, మూలాధారం, భూమధ్యం, బ్రహ్మరంధ్రాలలో చూడవచ్చు. ఈ దేవతలు బీజాక్షరాలకి పలుకుతారు. యం, రం, లం, వం, శం, సం, హం- అనే సప్త బీజాల ద్వారా మనిషి అంగాల్ని ఆశ్రయించుకొని వున్న దేవతల్ని ఉద్రిక్తపరచి బాధపెట్టవచ్చు. అందుకే ఒక్కోరోజు ఒక్కోబాధ, ఆ తర్వాత ఉపాసకుడు వాయువుల్ని

తన చెప్పుచేతల్లోకి తీసుకుంటాడు. ప్రాణవాయువునే కాకుండా, బొడ్డు దగ్గర వుండే సమాన వాయువునీ, గొంతులో వుండే ఉదాన వాయువునీ, స్థంభింపజేసి బాధపెడతాడు".

....

"శ్రీధర్! ఇప్పుడు నీ పాపని రక్షించే ఒకే ఒక విధానం చెబుతాను. వెన్నెముక కొసన కందస్థాన సుషుమ్న ముఖసంధికి చెందివున్న చక్రాన్ని మూలాధార చక్రం అంటారు. కుండలిని లేపి సుషుమ్న ద్వారా మూలాధారం నుంచి సహస్రారానికి చేర్చగల్గినవాడు యోగి. మూడు ఏకబీజ మంత్రాల్ని నీకు ఉపదేశిస్తాను. క్షాం అనేది నారసింహ బీజం. హ్రీం...... అనేది భువనేశ్వరీ మంత్రం. క్లీం - అన్నది కామరాజ బీజం. నూట ఎనిమిది సార్లు మంత్రాన్ని జపించు. ఈ నీటిలో కూర్చొని ఆ మంత్రాన్ని జపిస్తూ ఈ నూనె తాగు. ఈ నూనె సూర్యగ్రహణపు రోజు మాలకం గుడిగింజల నుంచి పాతాళ మంత్రం ద్వారా తీస్తే వచ్చినది. నువ్వు జపించిన నూట ఎనిమిది మంత్రాలూ నీ కూతురు బొమ్మలో గుచ్చబడిన నూట ఎనిమిది ముళ్ళకూ వ్యతిరేకంగా పనిచేస్తాయి. బొమ్మ యీ పాటికే శిథిలమయిపోతే నేనేం చేయలేను. కాష్మోరాని ఎదుర్కోగలిగేది కాళి ఒక్కటే. దుర్గా ప్రసన్నం చేసుకో. కాషాయ వస్త్ర రహితంగా పుష్యమిరోజు తీసిన విష్ణుక్రాంత పూలచూర్ణాన్ని నీ నుదుట బొట్టుగా పెడుతున్నాను. దాన్ని తిలకంగా ధరించి ఎవరినైతే చూస్తావో ఆ దుష్టుడు దాసుడు అవుతాడు. నీ కూతురి మీద చేతబడి చేసినవాడు ఎక్కడున్నాడో పట్టుకో. ఈ రోజు ఇరవై ఒకటో రోజు. అది యీ రాత్రి పన్నెండులోగా జరగాలి. ఈ రాత్రి పన్నెండింటికి శిథిలమయిన నీ పాప బంధాలు విప్పి, ఆ బొమ్మని హోమంలో వేస్తాడు ఆ మంత్రగాడు. అది పడకముందే జరగాలి. ఇదిగో యీ చెక్కమీద శ్రీ చక్రాన్ని చెక్కుతున్నాను. దీనితోనే అతడు అణచబడాలి. ఈ తులసి తీర్థం ఆ హోమంలో పడాలి. ఇక నువ్వు కళ్ళు తెరవొచ్చు-"

శ్రీధర్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఫకీర్ నిలబడి వున్నాడు. ఒక వెలుగుతూన్న చక్రం అప్పటివరకూ తిరుగుతున్నది అదృశ్యమైంది. అప్రయత్నంగా అతడు చేతులు జోడించాడు. నెమ్మది నెమ్మదిగా ట్రాన్స్ విడిపోతోంది. ఫకీరు చేతిలోంచి శ్రీ చక్రమున్న కర్రను తీసుకున్నాడు.

చెక్కమీద శ్రీ చక్రం ఇలా వుంది :



పూర్వం అడవి మనుష్యులు ఉపయోగించే రాతి గదలా వుంది. "వెళ్ళొస్తాను ఫకీర్" అన్నాడు శ్రీధర్. "ఆ మంత్రగాడు ఎక్కడున్నా పట్టుకొంటాను".

ఆ క్షణం అతడికి తెలీదు. ఆ మంత్రగాడు అక్కడికి ఎనిమిది వందల మైళ్ళ దూరంలో వున్నాడని.

23

కారిడార్‌లో బల్లమీద శారద కూర్చొని వుంది. మెట్ల మీద అబ్రకదబ్ర నిలబడి "ఏడి, ఎక్కడికి వెళ్ళాడు?" అని తనలో తానే అనుకొంటున్నట్టు అన్నాడు. ఇస్మాయిల్ మాట్లాడలేదు.

లోపల్నుంచి పార్థసారధి బయటకొచ్చి, మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు. పాప పరిస్థితి విషమంగా వుందని అతన్ని చూస్తేనే తెలుస్తూంది. అబ్రకదబ్ర ఇస్మాయిల్ వైపు తిరిగి ఏదో అనబోతూ అలానే ఆగిపోయాడు.

శ్రీధర్ దూరంనుంచి వస్తూ కనిపించాడు. అతడి మొహంలో రవ్వంత సంతోషమూ, దానికన్నా ఎక్కువ ఉద్వేగమూ, వీటన్నిటినీమించి దీప్తి అన్నీ మిళితమయి వున్నాయి. ఏదో కాంతితో మొహం ఉజ్వలంగా వెలుగుతూంది. వస్తూనే అన్నాడు - ఒకే ఒక మాట అతని నోటిలోంచి బుల్లెట్‌లా దూసుకు వచ్చింది.

"బ్రాహ్మిణ్ ! సంతాన్ ఫకీర్ కనిపించాడు".

అబ్రకదబ్ర విస్మయంతో నోరు తెరిచాడు. ఇస్మాయిల్ ఉత్సుకతతో ముందుకి వంగి "ఎక్కడ?" అన్నాడు.

శ్రీధర్ దానికి సమాధానం చెప్పకుండా "బ్రాహ్మిణ్! మనం వెళ్ళాలి. పాపని రక్షించాలంటే ఆ మారణహోమం జరిగే చోటికి వెళ్ళాలి. ఆ రోజు రాత్రి పన్నెండు గంటలలోపులో అక్కడికి చేరుకోవాలి. దానివల్ల యిది జరుగుతుందా, లేదా అన్నది వేరే సంగతి. కానీ యిది తప్ప యింకో మార్గం లేదు" అంతా ఒక్క గుక్కలో చెప్పాడు. వడివడిగా రావటంవల్ల ఆయాసపడుతున్నాడు. నుదుటి మీదనుంచి చెమట ధారగా కారుతూంది.

ఇస్మాయిల్, అబ్రకదబ్ర ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఇస్మాయిల్ శ్రీధర్ వైపు తిరిగి "సంతాన ఫకీరేమన్నాడు?"అడిగాడు, ఇంకొంచెం వివరంగా చెప్పమన్నట్టు.

"అవన్నీ వెళుతూ మాట్లాడుకోవచ్చు. ముందు మనం ఆ చేతబడి జరిగే చోటుకి వెళ్ళాలి. ఆ మంత్రగాణ్ణి పట్టుకోవాలి".

"ఎక్కడ అది?" శ్రీధర్ కదలబోతున్న వాడల్లా చప్పున ఆగిపోయాడు.

అవునెక్కడ అది?

అయోమయంగా మిగతా ఇద్దరివైపూ చూశాడు. కొంచెం సేపు నిశ్శబ్దం తర్వాత శ్రీధర్ కదిలాడు. "ఇది జరిగేచోటు ఎక్కడో చెప్పగలిగేవాడు ఒక్కడే వున్నాడు".

"ఎవరు?"

"సరస్వతి కొడుకునని చెప్పుకుంటూ మా ఇంట్లో తిష్ట వేసినవాడు, పైడితల్లి" అతడి గొంతు ఖంగున మ్రోగింది. "వాడ్ని పట్టుకోవాలి. రక్తం పిండైనా సరే ఆ రహస్యం వెళ్ళగక్కించాలి...."

అప్పుడు పదింపావు అయింది.

* * *

పది నిమిషాల్లో వాళ్ళు శ్రీధర్ ఇల్లు చేరుకున్నారు. మార్గ మధ్యంలో ఎవరూ మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ఆ తెలిసిన వాళ్ళు యిద్దరే. అందులో సరస్వతి నిన్న రాత్రే మరణించాడు. ఇక మిగిలింది పైడితల్లి ఒకడే

అతడే చెప్పాలి. అతనితో చెప్పించటం కోసం ఏదయినా చేయాలి. ..... ఏదయినా సరే...... చిత్రవధ చేసయినా సరే....

వాళ్ళు ఇంటికొచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు రామయ్య తప్ప.

"పైడితల్లి ఏడి?" కార్లోంచి దూకి లోపలికి ఒక్క గంతులో వస్తూనే శ్రీధర్ అడిగాడు.

"రాలేదు బాబూ".

"రాలేదా?"

"పొద్దున్నుంచి అసలు కనబడలేదు బాబూ.. మరి రాత్రి ఎక్కడికి వెళ్ళాడో పొద్దున్నంతా పోలీసులు......" రామయ్య సరస్వతి మరణం గురించి చెబుతున్నాడు. శ్రీధర్ వినటంలేదు. అతడిని ఒక్కసారిగా నిరాశ ఆవరించినట్లయింది. చేతిలోకి వచ్చింది వచ్చినట్లే అవకాశం జారిపోయింది. ఇప్పుడు మళ్ళీ పైడితల్లిని వెతకాలి. దానికెంత టైం పడుతుందో -

ఒక్కో క్షణమూ గడుస్తూన్న కొద్దీ పాప మరణానికి దగ్గరవుతూంది.....

ఎలా? ఎలా పైడితల్లిని పట్టుకోవటం?

అతడు నిస్పృహగా స్నేహితుడి వైపు చూశాడు. అబ్రకదబ్ర కూడా ఏమీ తోచనట్టు తల విదిలించాడు.

"నారాయణరావు ఎక్కడున్నాడు?" శ్రీధర్ రామయ్యని అడిగాడు.

"ఇప్పుడే లాయరు గారింటికి వెళతానని చెప్పి వెళ్ళారు బాబూ."

లాయరంటే విద్యాపతి.

"పైడితల్లి ఎక్కడున్నదీ నారాయణరావుకి తెలుస్తుందంటావా?" అబ్రకదబ్ర అన్నాడు.

"చూద్దాం" అంటూ విద్యాపతికి ఫోన్ చేశాడు. అతడి కూతురు ఎత్తింది.

విద్యాపతి వాళ్ళు బెంగుళూరు దగ్గర పల్లెకి చెందిన వాళ్ళు. ఇంట్లో కూడా కన్నడమే మాట్లాడతారు. వచ్చీరాని తెలుగులో ఆ పాప చెప్పింది.

"మా వూరి .... నుంచి రైతు వచ్చి .... నాడు. నాయిన అతడితో .... మాట్లాడు..... తు..... న్నాడు".

ఇంతలో ఆమె చేతినుంచి ఫోన్ తీసుకున్న చప్పుడు.

"హలో ! లాయర్ విద్యాపతి హియర్".

"నేనూ శ్రీధర్ని".

"ఎస్ శ్రీధర్".

"నారాయణరావు అక్కడున్నాడా?"

"ఉన్నాడు. ఇప్పుడే వచ్చాడు".

"వెంటనే కనుక్కో- పైడితల్లి ఎక్కడుంటాడో అతనికి తెలుసునేమో ......"

"ఒక్కక్షణం" అని విద్యాపతి ఫోన్ పెట్టి, పక్కగదిలో కూర్చున్న నారాయణరావుని పిలిచి అడిగాడు. "ఎవడో పైడితల్లి అట, ఎక్కడున్నాడో నీకు తెలుసా......?"

నారాయణరావు చెప్పే జవాబు మీద కూతురి జీవితం ఆధారపడి వుంది. శ్రీధర్ అట్నుంచి వచ్చే జవాబు కోసం ఊపిరి బిగపట్టి రిసీవరు పట్టుకుని నిలబడి వున్నాడు. అంతలో అట్నుంచి రిసీవర్ కదిలిన చప్పుడు.......

"ఏమైంది ? తెలుసటా ?" ఆతృతగా అడిగాడు శ్రీధర్.

క్షణం నిశ్శబ్దం. విద్యాపతి కంఠం వినిపించింది- "తెలుసట".

శ్రీధర్ మొహంలోకి రక్తం జివ్వున చిమ్మింది. రిసీవరు మీద చెయ్యి బిగుసుకుంది. పిస్టల్ నుంచి వెలువడిన బుల్లెట్‌లా అతని నోటినుండి ప్రశ్న వచ్చింది- "ఎక్కడ?-"

ఇవతలివైపు ఎంత టెన్షన్‌లో వున్నారో అటువైపు విద్యాపతికి తెలీదు. "ఒక్క నిమిషం" అని మళ్లీ ఫోన్ పక్కకి తీసి, నారాయణరావు వైపు తిరిగి "ఎక్కడున్నాడు పైడితల్లి?" అని అడిగాడు.

నారాయణరావు గది నాలుగు పక్కలా చూశాడు. అతడి ఉద్దేశ్యం గ్రహించి విద్యాపతి ఫోన్ పక్కనే వున్న ప్యాడూ, పెన్సిలూ యిచ్చాడు.

ఇటు శ్రీధర్ ఆతృతతో నుదుటిమీద చెమట తుడుచుకుంటున్నాడు. నారాయణరావు వ్రాయటం పూర్తిచేసి విద్యాపతికి చూపించాడు. అది చదివి విద్యాపతి ఉలిక్కిపడ్డాడు.

శ్రీధర్ "హలో" అంటున్నాడు. "...... ఎక్కడున్నాడుట తొందరగా చెప్పు పతీ - మనం అతడిని వెంటనే కలుసుకోవాలి".

అంతలో లైన్ కట్ అయింది. శ్రీధర్ ఆలోచిస్తున్నాడు. ఎందుకు విద్యాపతి ఫోన్ పెట్టేశాడు ? అతడికి అంతు చిక్కలేదు. బ్రాహ్మిణ్ వైపు తిరిగి "పద విద్యాపతి దగ్గరకు వెళదాం" అన్నాడు కంగారుగా.

.... అక్కడ ....నారాయణరావు వ్రాసిన "నేను శిక్షార్హుడ్నా?" అన్న కాగితం పైపే చూస్తున్నాడు విద్యాపతి. చదువుతూంటే నారాయణరావు రెండో పేజీ వ్రాయసాగాడు.

ఆ క్రితం రోజు జరిగిన కథ - ఇరవయ్యో రోజు రాత్రి

సరస్వతి తలని కాష్మోరా బ్రద్దలుకొట్టిన రోజు రాత్రి

పాప వెంట్రుకలు కాల్చటానికి పైడితల్లి స్మశానానికి వెళ్ళిన రోజురాత్రి.

శ్రీధర్ స్వయంగా కంటితో చూసి క్షుద్ర విద్యలున్నాయని నమ్మిన రోజు రాత్రి.

బిస్తా - స్వామి ఆనందంతో విందు చేసుకున్న రోజు రాత్రి.

కాష్మోరా - బొమ్మ ముడిని స్వయంగా విప్పిన రాత్రి

ఆ రాత్రి -

....

ఆ రాత్రి-

* * *

జయదేవ్ ఇంటికి ఎలక్ట్రిక్ కనెక్షన్ అమర్చిన తర్వాత పైడితల్లి శ్మశానం పక్కనే వున్న పాడుబడిన సత్రంలో కొంచెం సేపు పడుకున్నాడు. పన్నెండు అవుతూండగా అతడు లేచాడు. సత్రం బయటకొచ్చాడు. మరుసటిరోజు అమావాస్య అవటం వల్ల చీకటి దట్టంగా అలుముకుని వుంది.

సరస్వతి అబ్రకదబ్ర ఇస్తున్న పార్టీకి వెళ్ళాడు అని అతనికి తెలీదు.

సత్రం మెట్లు దిగబోతూ చప్పున ఆగాడు.

తలుపు పక్కనే వున్న కిటికీలోంచి రెండు మెరుస్తున్న నక్షత్రం లాంటి కళ్ళు తననే గమనిస్తున్నట్టు చూశాడు. మెరుస్తూ ఆరుతూ- శవం మీదకి వాలబోయే డేగ కళ్ళలా- పొద మధ్య పులి కళ్ళలా-"ష్-" అన్నాడు అదిలిస్తూ. నక్షత్రాలు అలానే మినుక్కు మినుక్కు మంటూనే వున్నాయి. చెయ్యి విదిలించి మళ్ళీ "-ష్" అన్నాడు.

అంతే-

ఏం జరిగిందో ఊహించేలోపల అతడిమొహం మీదకు దూకింది. ఆ ఆకారం మొదట మెత్తగానే తగిలింది. కానీ మరుక్షణం వాడిగోళ్ళు అతడి మొహాన్ని సర్రున చీల్చాయి. గొంతులోంచి కెవ్వున రాబోయిన కేక గొంతులోనే ఆగిపోయింది. శబ్దం రాకూడదు - ఎవరికీ నిద్రాభంగం కలగకూడదు - అంతా క్షణంసేపే. అతడి మీదకు దూకిన ఆకారం నేల మీదకు గెంతి - 'మ్యావ్' అని అరుచుకుంటూ చీకట్లో కలిసిపోయింది. చిక్కటి ద్రవం బుగ్గమీదుగా పెదవి పైకి జారి ఉప్పగా తగిలింది.

అతడు స్థాణువై నిలుచుండిపోయాడు. శరీరంలో రక్తం వడివడిగా ప్రవహించసాగింది. కోలుకోవటానికి నిమిషం పట్టింది. చీకట్లో హఠాత్తుగా దూకిన పిల్లి అతడిని కొద్దిగా భయపెట్టిన మాట నిజమేకానీ, అతడి కళ్ళముందు ముప్ఫయ్ లక్షల ఆస్థి మెదుల్తూంది.

మనిషిని చూడగానే పారిపోయే పిల్లి- బెదిర్తే మీదకు దూకుతుంది.

పిల్లి ఎదురు రావటం అపశకునం.

చేస్తున్న పనే క్షుద్రం. ఇంకా దానికి అపశకునం ఏమిటి?

అతడు చీకట్లో కలిసిపోయాడు. పిల్లి పారిపోయినందుకు విచారం లేదు. ముందు వెంట్రుకలు కాల్చాలి. ఊరి చివర శ్మశానం. బ్రతుకు చివర మనిషిని ఆహ్వానించే శ్మశానం.

అతడు శ్మశానం చేరుకుంటూంటే చర్చి గంటలు వినిపించాయి. ఆగి నిలబడి లెక్కపెట్టాడు.

పదకొండు! అంటే ఇంకా ఒక గంట!!

ఇంకో గంటలో పాప కోమాలోకి వెళ్ళిపోతుంది.

ఆ తరువాత ఇరవై నాలుగ్గంటలలో-

"ఇరవై నాలుగ్గంటల" న్న పదం అతడికి ఏదో జ్ఞాపకాల్ని రేపింది నిన్నటి ఉత్తరం.

"ఇరవై నాలుగ్గంటలు. అంతే!"

ఈ రోజునుంచి నాలుగ్గంటలు పాప మరణానికి.

నిన్నటి నుంచి ఇరవై నాలుగ్గంటలు తన మరణానికి. అంటే ఇంకో గంటలో.

ఈ శ్మశనంలో మరణిస్తే అసలు మరణించినట్టూ ఎవరికైనా తెలుస్తుందా? శ్మశానంలో మరణం. చాలా విచిత్రమైన వాక్యం అది. తనని దెయ్యం చంపుతుందా? ఇంకో ఇరవై నాలుగ్గంటలు అని వ్రాసిన చేతులు ఎవరివి? దెయ్యానికి చేతులుంటాయా? అతడు అప్రయత్నంగా మెడతడుముకొన్నాడు. భగ్గున మంట. పిల్లి గోళ్ళు చేసిన గాయం- దెయ్యానికి పిల్లి మిత్రుడంటారు. తన స్నేహితుడికి సాయం చేయటం కోసం పిల్లి మీదకు దూకిందా? అలా దూకి తన కళ్ళు పీకి-

"సన్నగా వణికేనేమో" అన్న అనుమానం వచ్చింది అతడికి. తల విదిలించాడు. నవ్వొచ్చింది. వెధవ ఆలోచనలు. క్షణం ఏమరపాటుగా వుంటే ఆలోచనలు ఎంత వేగంగా పయనిస్తాయో-

పైడితల్లి శ్మశానంలోకి ప్రవేశించబోతూ ఆగాడు.

మనిషి మనసులో పాపంలా దట్టంగా చీకటి.....

జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా చెట్లు. కదలకుండా ..... నిశ్చలంగా ...... అతడినే గమనిస్తూన్నట్టూ, అతడేం చేస్తాడో చూస్తూన్నట్టూ....

అతడు చుట్టూ చూశాడు.

చెట్లు..... పొదలు .... చీకటి....... తుప్పలు....... రాళ్ళు .... అన్నీ ఇతన్నే ఉత్సుకతతో చూస్తూన్నాయి. ఒక చిన్నారి పాపని చంపటానికి అతడు చేస్తున్న ప్రయత్నాలను విషాదంగా, నిస్సహాయంగా చూస్తున్నాయి.

సమయం కోసం వేచి వున్నట్టు ఆగాయి అన్నీ!

అతడు చుట్టూ చూసి శ్మశానం లోపలికి ప్రవేశించాడు.

గాలి స్థబ్దంగా వుంది. ఆకాశం నిర్మలంగా వుంది. కానీ ఉత్తరం దిక్కున మేఘాలు దట్టంగా-

పైన తీతువుపిట్ట వికృతంగా అరుచుకొంటూ సాగిపోతోంది. అతడు నడుస్తూంటే కాళ్ళక్రింద ఎండుపుల్లలూ ఎముకలూ చప్పుడు చేస్తూ నలుగుతున్నాయి.

అతడు ఆగాడు.

"చాలా లోపలికి వచ్చేశానా?" అనుకొన్నాడు. వచ్చేస్తే ..... బయటకి వెళ్ళటం కష్టం. శ్మశానంలోంచి బయటకి దారి వుండదు, తెలిస్తే తప్ప. తెలియకపోతే ...... రాత్రంతా ఇక్కడే ..... నక్కల మధ్య........

అతడు ఏం చదువుకున్నాడో ఎవరికీ తెలీదు. అతడి మెదడులో ఎంత క్రూరమైన ఆలోచనలు వున్నాయో ఎవరూ వూహించలేరు. ఎన్నో దారుణాలను అతడు నవ్వుతూ చేశాడు. అతని మనసులో పాపభీతి లేదు. కానీ ఈ రోజు ..... ఈ క్షణం .... 'భీతి' ప్రవేశించింది. అది క్షణం క్షణం పెరుగుతూంది. మహావృక్షమవుతూంది. అందుకే తన ఆలోచనలని అతడు కంట్రోలు చేసుకోలేకపోతున్నాడు. ఆలోచనలు, మనిషిని భయపెట్టి చంపే ఆలోచనలు.

అతడు కదలబోతూ మళ్ళీ ఆగాడు.

ఎవరో వచ్చిన ధ్వని. సన్నగా కిలకిలా.

"లేదు. లేదు. ఇదంతా భ్రాంతి" అనుకున్నాడు. నవ్వేరా ..... లేదు. కానీ వినిపించిందే. ..... వినిపించిందా.... అసలు అది నవ్వేనా...... నవ్వు అయితే ఎవరిది? అనితదా ? ఈ ప్రేతాత్మల్లో అనిత వుందా? తన కోసం ఎదురు చూస్తుందా? అసలు ఇదంతా తన భ్రమ ఏమో .... కానీ నవ్వు వినిపించిందే.....

అతడు తల విదిలించాడు. మనసు దిటవు పర్చుకోవటానికి ప్రయత్నించ సాగాడు.

అప్పుడో చిత్రం జరిగింది.

చిన్న గాలి తెమ్మెర దక్షిణం నుంచి వీచింది. అంతా స్థబ్దంగా వున్న శ్మశానంలో ఒక చిన్న గాలి తెమ్మెర అకస్మాత్తుగా వీస్తే అంతకన్నా భయానక దృశ్యం యింకొకటి వుండదు.

"వూ వూ వూ ళ్ ళ్ ళ్ ఝ్యూ ఝ్యూ ఝ్యూ వ్ వ్ వ్ వూ వూ వూ"

కపాలంలో గాలి దూరి బయటకి వస్తూంటే పిశాచాల నాట్యానికి సన్నాయిలా, సన్నటి వూళ వినిపిస్తూంది. ఎంతటి ధైర్యవంతుడికైనా వళ్ళు జలదరింపచేస్తుంది ఆ శబ్దం. ఆ శబ్దం వినాలంటే నిశ్శబ్దమైన స్మశానంలోకి అర్థరాత్రి వెళ్ళాలి. ప్రపంచంలోని ఏ వాయిద్యమూ పలికించలేని శబ్దాన్ని కపాలం పలికిస్తుంది.

అతడి నుదుటిమీద చెమట ధారాపాతంగా కారుతూంది. భయం ప్రారంభమైంది. ఉత్తరంగా వున్న మేఘం వేగంగా పయనిస్తూ వస్తూంది. గాలి ఉధృతమైంది.

అప్పటి వరకూ స్థబ్దంగా ఉన్న చెట్లు శృంఖలాలు తెంచుకొన్నట్టు అటూ ఇటూ వూగసాగాయి. క్షణంలో మారిన వాతావరణం చూసి అతడు నిర్విణ్ణుడయ్యాడు. అంతలో పెద్ద శబ్దం.... చెవులు బ్రద్దలయ్యేలా, మనిషి కంపించేలా.... అతని కళ్ళముందే ఒక పెద్ద కొమ్మ ఎలా పడింది? ఆ పడటం కూడా మామూలుగా పడలేదు. గాలిలో పళ్ళెం ఎగిరినట్లు కొంచెం సేపు ఎగిరి కిందపడింది. ఆ చెట్టుక్రింద తను వుండినట్టయితే ......

గదిలో అకస్మాత్తుగా జారిపడిన నిలువెత్తు పటం ! కపాలాల మధ్యనుంచి వస్తున్న గాలి చేస్తున్న ధ్వని దెయ్యం వేస్తున్న ఈలలా వుంది. తనంతట తనే పడిన పటం .... గదిలో ధడేలున– ఇక్కడ పడిన కొమ్మ– కొమ్మ పడటానికి కారణం గాలి. మరి నిన్న 'పటం' పడటానికి కారణం ఏమిటి ...... అన్ని తలుపులూ మూసిన గదిలో–

నిన్నటి స్మృతులు ఈ రోజు జ్ఞాపకాలై భయపెడుతున్నాయి. నిన్నరాత్రి గదిలోకి చల్లటి గాలి ఎలా వచ్చింది? అన్నీ అనుమానాలే – అయితే వాటితో ఇంకా సమయాన్ని వృధా చేయదల్చుకోలేదు. పాప వెంట్రుకలు తీశాడు. వాటితోపాటే అగ్గిపెట్టె.

వెంట్రుకల్ని అంటించాలి.

గాలి వీస్తూంది.

అతడు సమాధి చాటుగా కూర్చోవాలనుకున్నాడు. సగం కూలిన సమాధి ఒకటి కనబడింది. దాని దగ్గరగా వెళ్ళి మోకాళ్ళమీద కూర్చున్నాడు. గాలికి అగ్గిపుల్ల ఆరిపోకుండా సమాధి ఆపుతూంది. చిన్న చిన్న చెట్లు సమాధి మీద వూగుతున్నాయి. మనిషిని పైకి లాక్కుపోయే యమపాశాల్లా.

మధ్యకి విరిగిన సమాధిలోంచి మట్టి పెళ్ళలు పెళ్ళలుగా రాలుతూంది. అతడు పక్కకి చూసి ఉలిక్కిపడ్డాడు. సమాధి మీద బొమ్మ అతడిని పరిహసిస్తున్నట్టు వుంది.

సర్పబంధం



ఎవరో మంత్రగాడు ఎవర్నో చంపటానికి సమాధి మీద వ్రాసిన అతి పురాతనమైన ప్రయోగం. పాము మెలికల్లో ఒక్కో మెలిక ఒక్కో ప్రత్యేక అక్షరం వ్రాసి ప్రత్యర్థిని పాముకాటుకి గురిచేయటం ఒకప్పటి విద్య ! సర్పబంధం.

పైడితల్లి చూస్తున్నది బొమ్మని కాదు, బొమ్మ మధ్యలో ఇరవై నాలుగు అన్న అంకెని.

ఇరవై నాలుగు.

ఇరవై నాలుగ్గంటల్లో.

ముగ్గు.....

ప్రొద్దున్న లేవగానే తన కాళ్ళముందు దెయ్యం వేసిన ముగ్గు చేసిన హెచ్చరిక. అతడు చప్పున అక్కడ్నుంచి లేచాడు.

అక్కడ్నుంచి వెళ్ళిపోవటానికి ఆయత్తమయ్యాడు.

అప్పుడు వినిపించింది, గాజుల చప్పుడు.

సన్నగా– గాలిలో తేలి. ఒకసారి– ఒకేసారి.

"ఎవరదీ?" అతని కంఠం అతనికే వికృతంగా కీచుగా వినిపించింది. అతడి ప్రశ్నకి సమాధానంగా గాలి వీచింది. కపాలాల్లోంచి వూళలు జవాబిచ్చాయి.

అతడు ధ్వని వినిపించిన వైపు రెండు అడుగులు వేసి నిశ్చేష్టుడై ఆగిపోయాడు. వెన్నులోంచి చలి ప్రారంభమై వళ్ళంతా వణికింది. ఇప్పటివరకూ చెవులే మోసం చేసేయనుకున్నాడు. కానీ ఎదుటి దృశ్యం అతడి నోట్లో తడారిపోయింది.

ఎదురుగా పది అడుగుల దూరంలో నాట్యం చేస్తూన్న రెండు కపాలాలు ప్రేతాత్మ అడుగుల లయలా కదుల్తున్నాయి. అతడు కళ్ళు నలుముకుని చూస్తే ఆగినట్టే వున్నాయి. మళ్ళీ కదిలినట్టున్నాయి. అతడు పక్కకి తిరిగి– అలాగే స్థాణువై పోయాడు. అక్కడో నాలుగు కంకాళాలు ..... ఇటు తిరిగితే మరో మూడు.....

అతడి చుట్టూ పిశాచాలు నృత్యం చేస్తున్నట్టు వున్నాయి. నెమ్మదిగా ..... తమలోకి అతడిని ఆహ్వానిస్తున్నట్టు ...... లయబద్ధంగా....

ఓ క్షణం అతడు పిచ్చెక్కినట్టు వూగిపోయాడు. అతడి పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి. పళ్ళు బిగుసుకుపోయాయి.

అన్నిటిమధ్య అతడు.....

ఉన్నట్టుండి అతనికి ధైర్యం వచ్చింది. చావు ధైర్యం. నన్నెవరూ భయపెట్టలేరు అనుకున్నాడు.

"వూవూవూవూవూవూ .... " అని అరుస్తూ గాలికన్నా వేగంగా వెళ్ళి రెండు కపాలాల్ని కాళ్ళతో తన్నాడు. బంతుల్లా అవి దొర్లుకుంటూ వెళ్ళి దూరంగా పడ్డాయి. తీగల్లేవు, నాట్యం చేయించే చేతులు లేవు. ఒక ఎముక అతని కాలిక్రింద దానంతట అదే కదిలింది. అతడు చూస్తుండగానే ఒక పుర్రె టపాలున పగిలింది. ఎముక విరిగిన చప్పుడు, ఎవరో ఆర్తనాదం చేసిన ధ్వని, అతని చుట్టూ కంకాళాలు నాట్యం చేస్తూనే వున్నాయి. పుర్రెఎలా పగిలింది? ఎలా పగి.......లిం....దీ?

"ఆపం..... డీ" ఎలుగెత్తి అరిచాడు. అతని గొంతు శ్మశానంలో ప్రతిధ్వనించింది. ఒక్కసారిగా గాలి ఆగిపోయింది. శ్మశానం నిశ్శబ్దమయింది. భయంకరమయిన నిశ్శబ్దం..... అందులో శ్మశానంలో నిశ్శబ్దం అంటే ..... చెట్టూ పుట్టలూ అతణ్నే చూస్తున్నాయి.

"అనితా ....." అతను అరిచాడు. "...... నువ్వు నన్ను భయపెట్టలేవు. చచ్చి దెయ్యమై సాధిద్దామనుకున్నావా? ఇదిగో ఇప్పుడే చూడు .... ఈ వెంట్రుకలు కాలుస్తున్నాను. ఈ మంటతో నువ్వు పారిపోవాలి. పారిపోవాలి...... పోవాలి.... హ్హ హ్హ హ్హ......" అంటూ హిస్టీరియా వచ్చిన వాడిలా అగ్గిపెట్టెలోంచి పుల్ల తీసి, ఒక చేత్తో వెంట్రుకలు పట్టుకొని పుల్ల గీశాడు.

"బుస్‌స్‌స్ ..." అంటూ పెద్ద పొగ అతని మొహాన్ని ఒక్క సారిగా కప్పేసింది. అగ్గిపుల్లని అప్రయత్నంగా వదిలేశాడు. మరోపుల్లని వెలిగించాడు. మంట రాలేదు. మేఘంలా తెల్లటి పొగ! అగ్గిపుల్ల వెలిగిస్తే మంట రావటంలేదు. పొగవస్తూంది.

అప్పుడు వినిపించింది మళ్ళీ నవ్వు.

అనితది ......

అంతక్రితం రోజు బల్లమీద దానంతట అదే అగ్గిపెట్టె మండిపోయినప్పుడు – తనకి వినిపించకుండా సరస్వతికి వినిపించిన నవ్వు..... పాప వెంట్రుకలు కాల్చనివ్వకుండా, ఇప్పుడు మంట రానివ్వకుండా చేసిందెవరు?

అతడు పిచ్చెక్కినట్టు ఏడుస్తూ నవ్వాడు. "దెయ్యమా ! నీకు మంటంటే భయంకదూ ..... " అరిచాడు.

చిన్న నవ్వు. టప్‌మని చిన్న చప్పుడు. అతడి పక్కనున్న పొదలోంచి ఒక్కసారిగా పెద్దమంట వచ్చింది. అరక్షణంలో ఎండు కర్రలు అంటుకొని చిటపట చప్పుడుతో మండిపోసాగినయ్. కపాలాలు మరింత ఉధృతంగా ఎగరటం మంటల్లో భయంకరంగా కనిపించసాగింది.

ఒక్కసారి వెర్రిగా అరిచి- అతడు పరుగెత్తసాగాడు. ఒక గమ్యం లేకుండా.

చుట్టూ శ్మశానం. చంద్రుణ్ని నల్లటి మేఘం కప్పేసింది. చీకటి మరింత దట్టమైంది. అతడు ప్రాణాలు దక్కించుకోవడం కోసం పరుగెత్తుతున్నాడు. చెమట ధారాపాతంగా కారుతూంది. అతడు చేసిన పాపాలు దెయ్యాలై అతణ్ని వెంటాడుతున్నట్టున్నాయి. పొదల్లోంచీ, తుప్పల్లోంచీ పరుగెడుతున్నాడు. రాళ్ళనీ రప్పల్నీ దాటుకుంటూ దూరంగా కనిపించే సన్నటి వెలుగుకేసి పరుగెడుతున్నాడు.

దూరంగా కనిపిస్తూన్న ఆ వెలుగు ఓ చితిమంట.

అయిదు నిమిషాలు అతడు ఆగకుండా పరుగెత్తి అక్కడికి చేరుకున్నాడు. ఎవరో సగం కాల్చి వదిలేసిన చితి. అతడు రొప్పుతూ ఆగాడు. వెనక్కి తిరిగి చూశాడు.

అతడు రెండడుగులు వెనక్కి చితివైపు వేసి "ఎవరదీ?" అనబోయాడు. ఆయాసం వల్లనూ, గొంతులో తడారిపోవటం వల్లనూ మాట పెగల్లేదు.

మళ్ళీ ఎండుటాకుల మీద ఎవరో నడిచిన ధ్వని. భయంతో కుంచించుకుపోయాడు.

మరో రెండడుగులు వెనక్కి వేశాడు. వెనకేముందో చూసుకోలేదు.

అప్పుడు తగిలింది వేడి. చితిది...

అతడు చప్పున వెనుతిరిగాడు. ఒక అడుగు దూరంలో వుంది చితి.

అతడు వెనక్కి అడుగు వెయ్యబోతూ.... గొంతు ఎవరో పట్టుకున్నట్టూ ఆగిపోయాడు. కాళ్ళు భూమికి తాపడం చేసినట్టయింది. కనుగ్రుడ్లు వికృతంగా పెద్దవయ్యాయి. భయంతో ఆర్తనాదం కూడా గొంతుదాటి బయటకు రాలేదు.

సగం కాలిన శవం చితిలో నిలువుగా లేస్తూంది. నల్లటి శవం..... కర్రలుగా మారిన చేతులు గాలిలోకి సాచి పైకి వస్తూంది. ఒక కనుగుడ్డు మంటకి పేలిపోయింది. జుట్టు అక్కడక్కడ కాలి, వికృతంగా వుంది. మంటకి కడుపు ఉబ్బింది. శవం కాల్చేటప్పుడు పైకి లేవకుండా కర్రలతో నొక్కి పెడతాడు కాపరి. అది లేకపోవడంతో జరిగిన పరిణామం యిది! దిక్కూ మొక్కూ లేని శవాల్ని శ్మశానంలో కాల్చిపారేసినప్పుడు జరిగేది.

నిలువెత్తు శవాన్ని అడుగు దూరంలో చూసేసరికి అతడి ప్రాణాలు నిలువునా పోయినయ్. చేతులు సాచి తన కౌగిలిలోకి ఆహ్వానిస్తున్నట్టూ శవం, మంటల మధ్యనుంచి లేచిన శవం !

పైడితల్లి పళ్ళ మధ్య నాలుక 'టప్'మని తెగింది. భయంతో పళ్ళు బిగుసుకుపోయాయి. నోరంతా రక్తం. అయినా అతడు ఆ బాధని గుర్తించే స్థితిలో లేడు. ఒక్క గంతులో అక్కణ్నుంచి పక్కకి దూకాడు. లేడి కన్నా వేగంగా పది అడుగులు పరుగెత్తాడు.

పెద్ద గొయ్యి- చూసుకోలేదు. ధభిల్లున పడ్డాడు వెల్లకిలా. ఫట్‌మన్న చప్పుడు, ఏదో విరిగిన ధ్వని.

క్రింద తుమ్మచెట్టున్నట్టుంది. ఒక్క సారిగా కొన్ని వందల ముళ్ళు అతడి శరీరాన్ని స్పృశించినయ్.

అంతే ..... తరువాత గాఢమైన నిశ్శబ్దం !

అతడికంతా తెలుస్తూనే వుంది. కానీ ఏ అవయవమూ కదల్చలేక పోతున్నాడు.

అతడికి తెలిసిపోయింది, తన ప్రాణం పోవటం ఖాయమని!

మనుష్య సంచారంలేని ఆ శ్మశానం నడిబొడ్డులో తోడేళ్ళకి ఆహారము అవటము కోసం తన శరీరం ఆయత్తమవబోతోందని.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతడికి.

అనిత.

తనని అతనికి అర్పితం చేసుకుంటూ, పాపకి నయమవ్వాలని దేముణ్ణి ప్రార్థించిన అమాయకురాలు.....

దాని ఫలితమేనా ఇంత హేయమైన చావు?

అతడు కదల్టానికి ప్రయత్నం చేశాడు. వంటినిండా ముళ్ళు..... తుమ్మ ముళ్ళు. ఎన్ని ? నూట ఎనిమిదా ? వెయ్యా ఎనిమిదా??

చిన్న పాపని చిత్రహింస చెయ్యాలని- మరో ఎనిమిది ముళ్ళు గుండెలో గుచ్చమన్నాడే .... దానికి పదిరెట్లు శరీరం అంతా గుచ్చుకొని వున్నాయి. అతడు చేసిన పాపాలకు అతడు ఈ లోకంలోనే శిక్ష అనుభవిస్తున్నాడు.

అతని కళ్ళు తెరుచుకునే వున్నాయి. మెదడు ఆలోచిస్తూనే వుంది. నోట్లోంచి రక్తం కారుతూనే వుంది. నిలువుగా పడి వున్నాడు.

రక్తం వాసన పసిగట్టినట్టు పైన అలికిడి అయింది. అతడు పైకి చూశాడు. ఆ చివరి క్షణం అతడు ప్రాణభయంతో కంపించిపోయాడు. నెమ్మదిగా గోతిలోకి దిగుతూ వస్తూంది.

తోడేలు......

అతడు అరవబోయాడు. తెగిన నాలుక వీలుపడనీయలేదు. అతడు లేవబోయాడు. విరిగిన వెన్నెముక వీలుపడనీయలేదు. చేతులు కదల్చబోయాడు, ముళ్ళు కదల్నివ్వలేదు.

అది అతడి దగ్గరగా వచ్చింది. దాని నాలుక వికృతంగా వేలాడుతూంది. నోట్లోంచి చొంగ కారుతూంది. అతడు బేలగా దాని కళ్ళలోకి చూశాడు. అదీ ఒక క్షణం ఆగి నెమ్మదిగా అతడి మొహం మీదకు నాలుకను చేర్చింది.

అప్పుడు పోయింది. అతని ప్రాణం- భయంతో!

* * *

ఆ తరువాత ఒక నిమిషానికి అక్కడికి చేరుకున్నాడు నారాయణరావు.

"ఇష్షో" అని రాయితో కొట్టాడు. కుయ్యోమంటూ కుక్క గోతిలోంచి బయటికి దూకి పారిపోయింది. అతడు లోపలికి దిగాడు. పైడితల్లి ప్రాణం పోయినట్టు గ్రహించాడు, ఆ శవముందు నిలబడి మనసులో అనుకొన్నాడు - "అనితా! నిన్ను మోసం చేసినవాణ్ని ఈ చేతులతో చంపుదామనుకొన్నాను. ఇదిగో ! కత్తి కూడా తెచ్చాను. కానీ దీని అవసరం లేకపోయింది, నన్ను క్షమించు".

అతడు గోతిలోంచి బైటకొచ్చి ఊరువైపు నడక సాగించాడు. అతడిని ఏ దెయ్యమూ భయపెట్టలేదు. ఎందుకంటే దెయ్యాలు శ్మశానంలో వుండవు. మనిషి మనసులోనే వుంటాయి.

భయం అనే పేరుతో.....

కుక్కని చూసి తోడేలనుకొన్న భయమే, లేని దెయ్యాన్ని ఉన్నట్టూ కంపింపజేస్తుంది.

24

"ఫెంటాస్టిక్. రియల్లీ ఫెంటాస్టిక్" అన్నాడు విద్యాపతి, "ఇంతకీ ఇదంతా ఎందుకు చేశావ్?"

నారాయణరావు కాగితం మీద వ్రాశాడు. అసలు సంగతి చెప్పలేదు. "నేను శిక్షార్హుణ్నేనా?"

విద్యాపతి ఒక క్షణం మాట్లాడలేదు. తరువాత సాలోచనగా అన్నాడు.........

"కాదు, న్యాయశాస్త్ర ప్రకారం కాదు. అయినా అతడు చేసిన అన్యాయాలకీ, అతడి మోసాలకీ అంత క్రూరమైన చావే సరిఅయిన శిక్ష. అసలు నువ్విదంతా ఎలా చేశావు ? ఒక్కటొక్కటే వివరంగా చెప్పు?"

నారాయణరావు వ్రాయడం ప్రారంభించాడు.....

....

మనిషి మనసులో భయం తాలూకు మొదటి బీజం పడటం కష్టం. అది పడిందంటే, తరువాత మహావృక్ష మవుతూంది.

నిమ్మకాయ కోసే కత్తికి మందారపూలు రాసి, ఎండబెడితే అది కోస్తున్నప్పుడు రక్తం కారుతుంది. అలాగే 'కోకో - కోలా'కి బదులు సీసాలో అన్నభేది, చాకలిసోడా నీళ్ళూ కలిపి పోస్తే కోకోకోలా లాగే వుండి, గ్లాసులో అడుగున కొద్దిగా నిమ్మ ఉప్పు వుంచితే కోకోకోలా అనుకొని పోసిన ద్రవం, ఉప్పు తగలగానే రంగు కోల్పోయి, నీళ్ళుగా మారుతుంది.

పడుకోబోయేముందు కడిగిన గచ్చుమీద ముగ్గుపెడితే అప్పుడు కనపడదు. ప్రొద్దున్న లేచాక కనబడుతుంది. అలాగే తెల్లకాగితం మీద నిమ్మరసంతో అక్షరాలు వ్రాసి, దాన్ని గోడకి అమర్చి, మరుసటిరోజు ప్రొద్దున్నే సూర్యరశ్మిని దానిమీదకి కిటికీలోంచి అద్దంతో 'ఫోకస్' చేస్తే అక్షరాలు ఎర్రగా కనబడతాయి.

ఫోటో అకస్మాత్తుగా పడిపోవటానికి కారణం దానివెనుక దారానికి కట్టిన సిగరెట్టు, అలాగే అగ్గిపెట్టెలో కొద్దిగా సల్ఫ్యూరిక్ ఆసిడ్ పోసివుంచితే, అరగంట అయ్యాక దానంతటదే మండిపోతుంది. శ్మశానంలో, పాప వెంట్రుకల్ని కాల్చటానికి పైడితల్లి అగ్గిపుల్ల వెలిగించగానే పెద్దపొగ రావటానికి కారణం, ఆ అగ్గిపుల్లల్ని సోడియం సిలికేట్‌లో ముంచి ఎండబెట్టటమే. గది అకస్మాత్తుగా చల్లబడి పైడితల్లిని భయపెట్టటానికి కారణము 'ఈథర్'.

కప్పలు కపాలాన్ని కదుపుతాయి. భాస్వరం పొదల్ని మండిస్తుంది. సున్నంలో నానిన కొబ్బరిచిప్ప, నీటిచుక్క పడగానే కపాలంలా పగులుతుంది.

కొన్ని మానవ నిర్మితాలు, కొని యాదృచ్ఛికాలు. అన్నీ కలిసి పైడితల్లిని చంపాయి.

* * *

విద్యాపతి వున్న గదిలోకి గాలిలా దూసుకువచ్చారు శ్రీధర్, అబ్రకదబ్ర.

"ఏమైంది పైడితల్లికి?"

విద్యాపతి వివరంగా చెప్పాడు అతడి మరణం సంగతి. శ్రీధర్ మొహం వాడిపోయింది. ఉన్న ఒక్క ఆధారమూ పోయింది. ఇక యీ ప్రపంచంలో ఆ ఆచూకీ చెప్పేవాళ్ళు ఎవరూ లేరు.

బ్రాహ్మిణ్ అతడినే చూస్తున్నాడు.

శ్రీధర్ ఇస్మాయిల్ దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యివేస్తూ అన్నాడు, "మన చేతుల్లోంచి అంతా జారిపోయింది ఇస్మాయిల్. ఆ చేతబడి జరిగేచోటు చెప్పగలిగే ఒక్కడూ ఈ భూలోకంలో మరిలేడు. మాతో ఇంతసేపూ వున్నందుకూ - మా కష్టాన్ని సానుభూతితో అర్థం చేసుకున్నందుకూ యీ పరిస్థితులలో కృతజ్ఞతలు చెప్పటం తప్ప ఇంకేమీ చెయ్యలేను. వెళ్ళిరా ఇస్మాయిల్" అతడి కంఠం దుఃఖంతో వణికింది. "మళ్ళీ తర్వాత ఎప్పుడైనా కల్సుకుందాం....... బ్రతికుంటే....."

మంత్రగాడూ, ఎన్నో మాయలు నేర్చినవాడూ అయినా ఇస్మాయిల్‌కి కూడా కళ్ళనీళ్ళు తిరిగాయి. మళ్ళీ తటపటాయించి, ఒకసారి ఇద్దరివైపూ చూసి, నెమ్మదిగా వెనుదిరిగి, అక్కణ్నుంచి నిశ్శబ్దంగా వెళ్ళి పోయాడు.

మిగిలిన ఇద్దరిమధ్యా మౌనం రాజ్యం చేసింది. దాన్ని భంగపరుస్తూ బ్రాహ్మిణ్, "ఆస్పత్రికి వెళదామా?" అన్నాడు.

"ఏముంది అక్కడ ?" నిరాశగా అన్నాడు శ్రీధర్.

"అసలు పైడితల్లి శ్మశానానికి ఎందుకు వెళ్ళాడు?"

"పాప వెంట్రుకలు కాల్చడానికి".

"మీకెలా తెలిసిందంతా?"

"నారాయణరావు రాత్రంతా- అతడు చచ్చేవరకూ అతడితోపాటే వున్నాడు కాబట్టి".

ఇద్దరూ నారాయణరావు వైపు చూశారు. అతడి మొహంలో ఏ భావమూ లేదు. పగ తీర్చుకున్న తృప్తి మాత్రం కనిపిస్తూంది.

"పైడితల్లిని నువ్వు వెంటాడావా?"

అవునన్నట్టు తలూపాడు. "ఎందుకు?"

అతడు విద్యాపతి వైపు చెప్పమన్నట్టు చూశాడు.

విద్యాపతి చెప్పటం మొదలుపెట్టాడు- అనితని వాళ్ళు మోసం చెయ్యటం..... అనిత ఆత్మహత్య .... నారాయణరావు పగ తీర్చుకోవటం...... అంతా వివరంగా.

మోకాళ్ళ మధ్య చేతులు వుంచుకొని, తల క్రిందకు వంచి శ్రీధర్ వింటున్నాడు ఒక్కో విషయం వింటుంటే అతడి మొహం తెల్లగా పాలిపోయింది. అమాయకురాలైన తన చెల్లెల్ని ఎంత దారుణంగా మోసం చేశారు వాళ్ళు...... అతడికి ఆవేశం రావటంలేదు. దుఃఖం వస్తూంది. తన చెల్లెలు 'పాప ప్రాణాన్ని రక్షిస్తున్నాను' అనుకొని మోసపోయిన విధానం తల్చుకొని, పాప కోసం త్యాగం చేసిన వైనాన్ని తల్చుకొని, అతడి వళ్ళంతా కంపించసాగింది.

'అనితా........ అనితా........' అనుకున్నాడు మనసులో.

ఒక్కరోజు ముందు ఇదంతా తెలిసివుంటే ఎంత బావుణ్ను ! ఆ పైడితల్లిని నరికి పోగులుచేసి.... తన కళ్ళముందు తిరుగుతూ, తన ఇంట్లో ఉంటూ ఎంత దారుణంగా తనని మోసం చేశారు. ..... తమ కుటుంబాన్ని సర్వనాశనం చేశారు. తనొక ఫూల్‌లా - ప్రేక్షకుడిలా చూస్తూ వుండిపోయాడు. అయినా వాళ్ళు ఇదంతా ఎందుకు చేశారు? ఎందుకు?

అతడు తలెత్తాడు. తనలో తనే అనుకొంటున్నట్టూ అదే ప్రశ్న అడిగాడు. "ఎందుకు వీళ్ళు ఇదంతా చేసారు?"

ఎవరూ మాట్లాడలేదు.

శ్రీధర్ మళ్ళీ అన్నాడు., "పాప చచ్చిపోతే ఎవరికి లాభం?" అని. ఈ ప్రశ్న అతడే ఉద్దేశ్యంతో అడిగాడో తెలీదుకానీ, విద్యాపతి ఆ ప్రశ్నను లాయరులాగే తీసుకొని "శ్రీకృష్ణ అనాథ బాలికల శరణాలయానికి ......" అన్నాడు. అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, "నిన్న చచ్చిపోయినవాడి పేరేంటన్నావ్? పైడితల్లి కదూ........ ఆ అతడు అనాథ శరణాలయంవాడే శ్రీధర్, లే ...... మనం అర్జంటుగా అక్కడికి వెళ్ళాలి. చాలారోజుల క్రితం నా దగ్గరికి చందా కోసం ఒకావిడ వచ్చింది. ఆవిణ్ణి కల్సుకుంటే మనకి ఏదైనా క్లూ దొరకవచ్చు" అన్నాడు ఉద్వేగంగా.

శ్రీధర్ ఒక్కగంతులో కిందికి దిగాడు. మరుక్షణం ముగ్గురూ కార్లో వున్నారు. కార్లో విద్యాపతి చెప్పాడు- ముప్ఫయి లక్షల ఆస్తి గురించి. పాప పదో ఏడు రాకుండా చచ్చిపోతే ఆ ఆస్తంతా శరణాలయానికి దక్కుతుందన్న సంగతి.

రహస్యం అంతా మంచులా విడిపోయింది.

కానీ పూర్తిగా చేతులు కాలేక.

వాళ్ళు వెళ్ళేసరికి శరణాలయం తాళంవేసి వుంది. పదిరోజుల క్రితం పోలీసులు రైడింగ్ చేశారట.

విద్యాపతి ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి, జైల్లో మంగమ్మని కలుసుకున్నాడు. ఆమె ఏమీచెప్పలేకపోయింది. నెలనుంచీ ముగ్గురూ ఆమెకు కనబడలేదు. స్వామి విజయనగరం ప్రాంతంలో వున్నట్టు చెప్పింది. పైడితల్లి, సరస్వతి ఎక్కడున్నారో ఆమెకి తెలీదు.

ఎక్కడ విజయనగరం......

విజయనగరం దగ్గర ఎక్కడ?

కథ మళ్ళీ మొదటికొచ్చింది.

టైమ్ పదకొండు కావొస్తుంది.

ఇంకా పదమూడు గంటలు.

25

11 ఎ.ఎమ్.

"శ్రీకృష్ణ బాలికల శరణాలయం తరఫున చందాకొచ్చినప్పుడు 'పైడితల్లి' అనే చెప్పింది. ఎక్కడో విన్నట్టుందే అనుకొన్నాను. మీ ఇంట్లో చూసినట్టూ అప్పుడు జ్ఞాపకం వచ్చివుంటే ఎంత బావుణ్ను" అన్నాడు విద్యాపతి.

ఎవరూ మాట్లాడలేదు. ఈ లోపులో శ్రీధర్ హాస్పిటల్‌కి ఫోన్ చేశాడు. పరిస్థితిలో మార్పులేదు. మరింత దిగజారిందేమో కూడా. డాక్టర్లు ప్రయత్నిస్తూ వున్నారు.

"ఇదంతా నాదే .... నాదే తప్పు. ఆ శరణాలయానికే డబ్బు వెళుతుందని తెలిసీ పాపకిలా అయినప్పుడు దాని గురించి ఎంక్వయిరీ చేయకపోవటం నాదే తప్పు. లాయర్నయివుండీ - ఛీ" పిడికిలి అరచేతితో కొట్టుకున్నాడు విద్యాపతి కసిగా.

"నువ్వేం చేస్తావ్? మాకే అనుమానం రాకపోతే " అన్నాడు శ్రీధర్ దిగులుగా.

విద్యాపతి అబ్రకదబ్రవైపు తిరిగి "నువ్వేం మాట్లాడటం లేదే" అన్నాడు. ఏదో కలలో వున్నట్టు సాలోచనగా చూశాడు అబ్రకదబ్ర. అయినా చూస్తూ నెమ్మదిగా అన్నాడు. "ఆలోచిస్తున్నాను".

"దేని గురించి?"

కొంచెంసేపు నిశ్శబ్దం. ఇంకా ఆలోచనలలోనే వున్నట్లు, తనలో తను అనుకొంటున్నట్టూ పైకి అన్నాడు. "పది రోజుల క్రితం ఓ కాలిపోయిన కాగితం ముక్క చూశాను. చదివాను కూడా. సరిగ్గా జ్ఞాపకం రావటం లేదు. ఏమిటది....." నుదురు మీద వేళ్ళతో కొట్టుకున్నాడు. "ఏదో చదివాను..... ఏదో......"

"ఆ కాగితం మీద ఊరు పేరుందా?"

అబ్రకదబ్ర మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. పన్నెండయింది.

* * *

12-00 నూన్.

పాప యింకా అచేతనంగా వుంది. శ్వాసకి సంబంధించిన కదలిక తప్పించి యింకే విధమైన కదలికా శరీరంలో లేదు.

ఆక్సిజన్ ట్యూబ్ తన పని చేసుకుపోతున్నది. కాళ్ళూ, చేతులూ చల్లగా వున్నాయి. డాక్టర్ పార్థసారథి పాపవైపు చూస్తూ నిలబడ్డాడు. అతడి మనసులో ఒకే ప్రశ్న చాలా సేపట్నుంచీ మెదులుతూంది.

తను డయాగ్నసిస్ సరీగ్గా చేయలేక పోతున్నాడా?

వ్యాధి నిర్ధారణ కానంత కాలం ఏ డాక్టరూ ఏమీ చేయలేడు. డాక్టర్ గొప్పతనం వ్యాధి నిర్ధారణ చేయటంలోనే వుంది. అతడు ఆలోచిస్తున్నాడు. తనుగాక యీ స్థానంలో ఇంకో డాక్టరుంటే ఇంకోలా డయాగ్నైజ్ చేసివుండేవాడా? తన 'తెలియనితనం'తో పరిస్థితిని యింతవరకూ తీసుకొచ్చాడా? అదే జరిగుంటే అంతకంటే దారుణమూ, అవమానకరమూ ఇంకొకటి లేదు.

అతడు పాప పక్కనే వున్న కుర్చీలో కూర్చొని కేస్ హిస్టరీ అంతా మొదటి నుంచీ చదివాడు. ఎయిర్‌పోర్ట్‌లో పడిపోయిన దగ్గర్నుంచీ ఈ రోజున తన పక్కనున్న స్థితివరకూ.

ఇరవై ఒక్క రోజులు. ఒక్కో రోజూ ఒక్కో సింప్టమ్.

చాలా సేపు దానివైపే చూస్తూ కూర్చున్నాడు. అతడి మెదడులో మాత్రం సముద్ర తరంగాల్లా ఆలోచనలు.

ఎక్కడో ఏదో చెడిపోయింది. ఎక్కడో ఏదో మెలిక వుంది. ఎక్కడ?

గుండెలోనా ? మెదడులోనా? లివర్‌లోనా? స్పైనల్ కార్డ్‌లోనా?

అతడు లేచి నిలబడి పాపవైపు దీర్ఘంగా చూశాడు. తెల్లగా పాలిపోయిన శరీరం..... పాయలుగా జుట్టు..... వదులుగా గౌను........ సన్నగా, పొడుగ్గా కనబడుతూన్న మెడ.

అతడు తల వంచుకొని బయటికొచ్చాడు.

పొడవుగా ఉన్న కారిడార్ రోగుల్ని నయంచేసి బయట ప్రపంచములోనికి పంపే 'రన్‌వే' లాగుంది.

అతడు రెండడుగులు వేశాక అలికిడి వినిపించింది. తిరిగి చూస్తే శారద.

"డాక్టర్...." అంది.

అతడు మౌనంగా వున్నాడు.

ఆమె ఒకే ప్రశ్న అడిగింది – "పాప బ్రతుకుతుందా? నేనేమీ అనుకోను, గోల చేయను. నిజాయితీగా చెప్పండి...... పాప బ్రతుకుతుందా?"

ఆమె నిశ్చలత్వాన్ని చూసి అతడికి భయం వేసింది. అతడు నవ్వి "అదేమిటమ్మా! ఎందుకంత అధైర్యం? పాప తప్పక బ్రతుకుతుంది......" అనబోయాడు. కాని అనలేదు.

ఆత్మవంచన చేసుకోవటం అంత సులభం కాదు.

* * *

అబ్రకదబ్ర గదిలో ఒక్కడే వున్నాడు. అతడు ఒంటరిగా వుండటాన్ని కోరుకుంటున్నాడు.

ఆలోచిస్తున్నాడు. ఎప్పుడో అరక్షణం పాటు చదివిన ఆ కాగితంలో ఏముందో తిరిగి జ్ఞాపకం తెచ్చుకోవటానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. ఎక్కడనుంచో పైడితల్లికి వచ్చిన ఉత్తరంలో ఒక వాక్యం.

కానీ విద్యాపతికీ, శ్రీధర్‌కీ దానిమీద నమ్మకం లేదు. "ఏం వుండి వుంటుంది అందులో? దానివల్ల ఏం తెలుస్తుంది?" అనే ఉద్దేశ్యంతో వున్నారు.

ఆ చేతబడి జరుగుతున్న ప్రదేశమెక్కడో తెలిసిన యిద్దరూ చచ్చిపోయారు. మిగిలిన ఒక్కడూ ఆ చేతబడి జరిగే ప్రదేశం దగ్గరే వున్నాడు. ఇంకెవరికీ దాని గురించి తెలీదు.....

ఎలా ? శ్రీధర్ పూర్తిగా ఆశ వదిలేసుకున్నాడు.

అతడు పైడితల్లి గదంతా వెతికి, ఏ ఆధారమూ దొరక్క ఆస్పత్రికి బయల్దేరే సమయానికి, విద్యాపతి యింట్లో డ్రాయింగ్ రూంలో అబ్రకదబ్ర ఆలోచిస్తున్నాడు.

ఏదో ఒక వాక్యం.... ఒకే వాక్యం...... మొదటి ఉత్తరంలో మొదట వాక్యమే అది.

ఏమిటది?

మెదడులో ఎక్కడో నిక్షిప్తమైపోయిన జ్ఞాపకాన్ని వెలిదియ్యటానికి ప్రయత్నిస్తున్నాడు. అతడి సిక్స్ సెన్స్ చెబుతోంది ఆ వాక్యంలోనే పూర్తి పేరూ, మనిషి పేరూ వున్నాయని.

లోపల విద్యాపతి కన్నడంలో ఏదో అంటున్నాడు. 'కాఫీ' అన్న ఒక పదం అర్థమయింది. రెండు నిమిషాల తరువాత విద్యాపతి కూతురు కప్పుతో కాఫీ తీసుకొచ్చి పెట్టింది.

కాఫీ చూడగానే అతడి ప్రాణం లేచి వచ్చింది. నిజానికి శ్రీధర్ కన్నా అతడు ఎక్కువ అలసిపోయినట్టున్నాడు.

ఇంతలో బయట కారు చప్పుడయింది. శ్రీధర్ వచ్చినట్టున్నాడు. కిటికీలోంచి చూశాడు.

"ఎలా వుంది?" విద్యాపతి అడుగుతున్నాడు.

"అలాగే వుంది?" శ్రీధర్ కంఠం.

అబ్రకదబ్ర తల తిప్పుకొన్నాడు. కళ్ళు మూసుకొన్నాడు. ప్రార్థించాడు, కళ్ళనిండా నీళ్ళతో అతడు దేముడ్ని ప్రార్థించాడు. "భగవంతుడా! ఇన్నాళ్ళూ నేను దెయ్యాల గురించి ఆలోచించాను. చీప్‌ట్రిక్స్‌నీ, మ్యాజిక్‌లనీ ఉపయోగించి ప్రజల్ని ఆకర్షించటానికి ప్రయత్నించాను. ఈ క్షణంనుంచీ నేను అవన్నీ వదిలిపెడుతున్నానని ప్రమాణం చేస్తున్నాను. క్షుద్రదేవత ఆ చిన్నారి పాపని చంపకముందే నాకు ఆ ప్రదేశం పేరు జ్ఞాపకం వచ్చేలా చెయ్యి. ఇంకేమీ కోరనయ్యా నిన్ను. ప్రమాణం చేస్తున్నాను – దేవుడా పాపని బ్రతికించు".

"ఏడుస్తున్నావా అంకుల్?"

అబ్రకదబ్ర చప్పున కళ్ళు తెరిచాడు. విద్యాపతి కూతురు ఎదురుగా నిలబడి వుంది. అమాయకంగా అడుగుతూంది. ఎప్పుడూ నవ్వుతూ తిరిగే బ్రాహ్మిన్ అలా వుండటం ఆ పాపకి చిత్రంగా వుంది.

అబ్రకదబ్ర తేరుకొని "అబ్బే...... ఏం లేదమ్మా"అంటూ కళ్ళు తుడుచుకున్నాడు. పాప వెళ్ళిపోయింది. మళ్ళీ అతడు కళ్ళు మూసుకున్నాడు.

ఒంటిగంట కావొస్తూంది.

* * *

1-00 పి.ఎమ్.

"ఇంకా పదకొండు గంటలు..... నా కూతురు మరణించటానికి" అన్నాడు శ్రీధర్. విద్యాపతి జాలిగా స్నేహితుడివైపు చూశాడు.

కాలం ముందుకు నడుస్తున్నకొద్దీ శ్రీధర్ పిచ్చెక్కిపోయేలా వున్నాడు. అతడిని ఈ స్థితినుంచి బయటకు తీసుకురావాలని విద్యాపతి - "పద హాస్పటల్‌కి వెళదాం" అన్నాడు.

"ఎందుకు ?" పేలవంగా నవ్వాడు. "బ్రతికే అవకాశం ఆస్పత్రి కల్గిస్తుందంటే అక్కడకు వెళ్ళినా ఆశ వుంటుంది. లేకపోతే వెళ్ళటం అనవసరం. రాత్రి పన్నెండున్నరకి వెళదాం" అతడి కంఠం వణికింది "......శవాన్ని తెచ్చుకోవటానికి".

అతడి మనస్థితిని అర్థంచేసుకొన్నట్టు విద్యాపతి భుజంమీద చెయ్యివేసి "కంట్రోల్ యువర్ సెల్ఫ్ శ్రీధర్" అన్నాడు. బ్రాహ్మిణ్ కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకొని వున్నాడు.

ఇంతలో బయట ఎవరో వచ్చిన శబ్దం వినిపించింది. విద్యాపతి బయట కెళ్ళాడు. అతడి పల్లెనుంచి పాలేరు కొడుకు వచ్చాడు. గదిలో శ్రీధర్, అబ్రకదబ్ర మిగిలారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

బయట విద్యాపతి పాలేరు కొడుకుతో మాట్లాడటం వినిపిస్తూంది కన్నడంలో.

"చెన్న గిద్యా" (ఎలా వున్నావు) అడుగుతున్నాడు.

"తమ్మదయ దింద" (మీ దయవల్ల).

తాగి పెట్టిన కప్పుమీద ఈగ వాలి వుంది. శబ్దం చెయ్యకుండా ఫాన్ తిరుగుతూంది, కిటికీలోంచి చేతులు కట్టుకుని నిలబడ్డ పాలేరు కనబడుతున్నాడు.

"హౌదు బుద్ధి?" (అవునయ్యా)

"మదువె చెన్నాగాయి తెనో ....."

"హౌదు బుద్ధి"

"ప్రస్తకాగిహళ్ళి ఇంద బందిరా"

వింటూన్న అబ్రకదబ్ర కుర్చీలోంచి ఎగిరి దూకాడు. అతడి మెదడులో ఏదో మెరిసినట్టయింది.

ప్రస్తాకాగిహళ్ళి ..... బంద్రా

ప్రస్తాకాగిహళ్ళి..... బంద్రా

"మళ్ళీ అనూ ఆ మాట....." ఇవతలి గదిలోంచి ఒక్కసారిగా అరిచాడు.

శ్రీధర్ ఆశ్చర్యంగా తలెత్తాడు, అబ్రకదబ్ర అది పట్టించుకోకుండా, కిటికీలోంచి విద్యాపతితో అన్నాడు .... "ఇప్పుడేమన్నావ్ నువ్వు? మళ్ళీ అనూ".

అతడు ఎందుకు అడుగుతున్నాడో అర్థంకాక "ప్రస్తకాగిహళ్ళి ఇంద బందిరా" ఇంకోసారి అన్నాడు విద్యాపతి. "అంటే కార్యం కోసం ఊరొచ్చావా అని".

అతడి తెలుగు అనువాదాన్ని బ్రాహ్మిణ్ పట్టించుకోలేదు. మెదడులో నరాలన్నిటినీ కాన్‌సన్‌ట్రేట్ చేశాడు. మారుమూల నిక్షిప్తమై పోయిన జ్ఞాపకాల పొరల్లో ఏదో కదలిక. ....

"ప్రస్తాకాగిహళ్ళి ఇంద బంద్రా"అనుకున్నాడు తనలో తనే. ఒక్కొక్క పొర విడిపోయింది. ప్రసా ...... ప్రసా .... ప్రసా.....

జ్ఞాపకం వచ్చేసింది.

బిస్తా....

ప్రస్తకాగిహళ్ళి ఇంద బంద్రా

"బిస్తాపూరు వెళ్ళి అందు ఆద్రా".

"యురేకా" అని ఆనందంతో అరిచాడు.

"వచ్చేసింది. ఆ ఊరి పేరు వచ్చేసింది" అతడి కంఠం గదిలో ప్రతిధ్వనించింది.

"ఏమిటి?" శ్రీధర్ అడిగాడు కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేస్తూ.

"బిస్తా.... వెళ్ళి ఆ వూళ్ళో మంత్రగాడు ఆద్రా ... అతడి పేరు ఏదో '..... ద్రా'తో పూర్తవుతుంది. బాద్రా - మాద్రా - వాద్రా అతడిని కలుసుకొమ్మని పైడితల్లికి ఉత్తరం వచ్చింది" అబ్రకదబ్ర చెప్పుకుపోతున్నాడు.

శ్రీధర్ వినటం లేదు.

వెంటనే ఫోన్ దగ్గరికి దగ్గరికి స్టూల్ లాక్కున్నాడు. నెంబర్ డయల్ చేశాడు. పోస్టు మాస్టర్ జనరల్ ఆఫీసులో తనకు తెలిసిన స్నేహితుడికి.

అతడి చెయ్యి టెన్షన్‌తో వణుకుతూంది. అవతలివైపు లైన్లోకి రాగానే "రామ్‌సాహూ" అన్నాడు.

"స్పీకింగ్".

"నాకు అర్జంటుగా ఓ ఇన్ఫర్మేషన్ కావాలి".

"ఏమిటి?"

"బిస్తా – అదీ ఊరు పేరు. విజయనగరం దగ్గర అది ఎక్కడుందో ఆంధ్రప్రదేశ్‌లో లిస్టు వెతికి చెప్పు. అర్జెంట్. ఎక్కడది... ?"అవతలి వ్యక్తికి ఇవతలివాళ్ళ ఆతృత అంతగా పట్టలేదు. తాపీగా అడిగాడు.... "బిస్తా".

"అవును ! బిస్తా".

"వెతకనక్కర్లేదు. ఆ పేరు గల వూరు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేదు. నిశ్చయంగా చెప్పగలను" ధీమాగా వినిపించింది. అవతలి వైపు నుండి కంఠం.

"కొంచెం చూడు. పోస్టాఫీసు లేకపోయి వుండవచ్చు".

"చూడక్కర్లేదు".

శ్రీధర్ విసుగుతోనూ, అసహనంతోనూ అరిచాడు. "అంత ధీమాగా ఎలా చెబుతున్నావ్?"

"బిస్తా ఆంధ్రప్రదేశ్‌లో లేదు కాబట్టి" అవతలి కంఠం తాపీగా వినిపించింది. "బిస్తా గురించి తెలీదా గురూ? మంత్రగాళ్ళ పుట్టిల్లది. విజయనగరానికి రెండొందలు కిలోమీటర్ల దూరంలో వుంది ఒరిస్సాలో. ఎవర్నడిగినా చెబుతారు. నేను ఒరిస్సావాడినే కదా! 'గంజాం'జిల్లాలోకి ప్రవేశించబోతూంటే .... " రామ్‌సాహూ చెబుతూనే వున్నాడు. ఫోను పెట్టేశాడు శ్రీధర్.

టైమ్ చూశాడు.

రెండు కావొస్తుంది.

తలెత్తి స్నేహితులిద్దరివైపు చూశాడు.

"టైమ్ రెండు కావొస్తుంది" అన్నాడు. "ఇంకా పదిగంటలు. విద్యా ! నువ్వు కారు తీసికెళ్ళు. టాంక్ ఫుల్ చేయించు, ఎయిర్ .....రేడియేటర్ అన్నీ. బ్రాహ్మిన్, మోటార్ సైకిల్ మీద నేను హాస్పిటల్‌కి వెళుతున్నాను. సరిగ్గా అయిదు నిమిషాలలో నువ్వు అక్కడుండాలి. ఈ లోపులో పాపని చూసి వస్తాను. మన ప్రయత్నం సఫలం కాకపోతే తనని చూడటం అదే ఆఖరిసారి అవుతుంది....." అతడి మొహంలో ఏ భావమూ లేదు. అతడిప్పుడు శ్రీధర్‌లా లేదు. రెండు మూడు కోట్ల ప్రాజెక్టు నిర్వహిస్తున్నప్పుడు నిర్ణయాలు తీసుకునే ఎగ్జిక్యూటివ్‌లా తొణక్కుండా వున్నాడు .... "సరిగ్గా రెండుంపావుకల్లా మనం ఈ ఊరి పొలిమేర్లు దాటాలి. ఇక్కణ్నించి విజయనగరం దాదాపు ఎనిమిదొందల కిలోమీటర్లు. మొత్తం వెయ్యి..... మనం గంటకి నూరు కిలోమీటర్లు కవర్ చెయ్యాలి. బ్రాహ్మిన్ ! హర్రీ అప్".

ప్రశ్నలతోనూ, అనుమానాలతోనూ టైమ్ వేస్టు చేయటం తెలివి తక్కువ అని మిగతా యిద్దరికీ తెలుసు. ఇక్కడ్నుంచి ప్రతిక్షణమూ విలువైందే. మారు ప్రశ్న వేయకుండా యిద్దరూ తమ పనులలో నిమగ్నమయ్యారు.

పది నిమిషాలయ్యాక ఒక కారు ఆ వూరి పొలిమేర్లు దాటుతోంది. విద్యాపతి ఎక్స్‌పర్టు డ్రైవరు. ఏకాగ్రతతో డ్రైవ్ చేస్తున్నాడు. నూరూ నూటపది మధ్య వెళుతూంది కారు. అతడి పక్కనే అబ్రకదబ్ర కూర్చొని వున్నాడు. ఎవరూ మాట్లాడటం లేదు.

వెనుక సీటుకి ఆనుకుని కళ్ళు మూసుకుని కూర్చొని వున్నాడు శ్రీధర్. అతడి పక్కనే సంతాన్ ఫకీర్ యిచ్చిన కర్ర వుంది.

26

కాద్రా మంటల్లో గుగ్గిలం, వేపాకు, వస, చెంగల్వ, కరక్కాయ, ఆవాలు, నేయి, యవలు వేశాడు. అష్టధూప ద్రవ్యాలతో మంట ఉజ్వలంగా వెలువడుతూంది. "పీడనం ప్రారంభమై సగంరోజు దాటింది. పాప శాశ్వత నిద్రలోకి వెళ్ళటానికి ఇంకా ఏడు గంటలుంది".

"పాప కోమాలోకి వెళ్ళిందీ, లేనిదీ మనకు తెలియటం లేదు" అన్నాడు స్వామి బొమ్మనే చూస్తూ. బొమ్మ శిథిలమై వుంది. గుండె ప్రాంతంలో కొయ్యముక్క గుచ్చబడి వుంది.

"వెళ్ళకుండా వుండటానికి వీలులేదు".

సరస్వతి నుంచిగానీ, పైడితల్లి నుంచిగానీ ఎందుకు వార్త రాలేదో స్వామికి అర్థంకావడంలేదు. వాళ్ళిద్దరూ ఈ లోకంలో లేరని అతడికి తెలీదు. "నేను వెంటనే బయల్దేరి వెళతాను. అక్కడెలా వుందో– మళ్ళీ వస్తాను రేపు" అన్నాడు స్వామి.

"ఈ రాత్రి పన్నెండింటికి పాప మరణాన్ని దేవుడు కూడా ఆపలేదు" అన్నాడు కాద్రా. "అయినా నువ్వు వెళతానంటే వెళ్ళు, రేపొద్దున్నే బయల్దేరిరా.... నా కివ్వాల్సిన డబ్బుతో".

స్వామి లేచి "వెళ్ళొస్తాను కాద్రా" అన్నాడు.

"మంచిది".

స్వామి వెళ్ళినవైపే చూస్తూ నిలబడ్డాడు కాద్రా. ఆ తరువాత నెమ్మదిగా వంగి, స్వామి కుడికాలి అడుగు క్రింద నలిగిన మట్టిని తీసుకున్నాడు.

పని జరిగిపోయింది కాబట్టి స్వామి అట్నుంచి అటే మాయమవుతే ఈ మట్టి అతడిని చంపుతుంది.

* * *

6-00 పి.ఎమ్.

చేతబడికీ, సైన్సుకీ జరుగుతున్న పోరాటంలో పార్థసారధి తన శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నాడు. మనిషిని సైన్సు బ్రతికించలేక పోవచ్చుగాక. కానీ కారణం చెప్పాలి కదా! ఏమిటా కారణం? ఏమిటి?

సిస్టర్ లీడ్స్ అన్నీ అమర్చింది. లబ్ డబ్ .... లబ్ డబ్ .... చిన్న వెలుగుచుక్క ఎలక్ట్రో కార్డియోగ్రామ్‌లో ప్రయాణం చేస్తూంది. పార్థసారధి ఇ.సి.జి. ఛార్టు చూస్తూ ఉలిక్కిపడ్డాడు. ఒక క్షణం అతడికి తను చూస్తున్నది కలో నిజమో అర్థంకాలేదు.

పి.క్యూ.ఆర్. వేవ్‌కిగానీ, ఎస్.టి. సిగ్మెంట్‌గ్గానీ అసలు సంబంధం లేదు. పక్కనున్న మరో డాక్టర్ కూడా విస్తుపోయాడు. ఇద్దరూ మొహమొహాలు చూసుకున్నారు. ఏమిటిది? హార్ట్ ఫెయిల్యూర్? హార్ట్ బ్లాక్...హార్ట్ ఎన్‌లార్జిమెంట్?

ఇటువంటి పరిస్థితులలోనే డాక్టర్లకి పరీక్ష. ఎన్నో సంవత్సరాల అనుభవమూ, చదువుకున్న చదువూ సంయమన పర్చాలి. అలా చేయకపోతే డాక్టరు చెల్లించవలసిన ఖరీదు– మనిషి ప్రాణం.

ఒక చేతితో నుదుటిమీద చెమటను తుడుచుకుంటూ మరో చేతితో పాప పల్స్ చూడడానికి అందుకున్నాడు పార్థసారధి. నాడి దూరంగా లోపలెక్కడో కొట్టుకుంటూంది. ఒకటి.... రెండు... మూడు.... ఉలిక్కిపడి చప్పున వదిలేశాడు చేతిని. చిన్న శబ్దంతో పాప చెయ్యి పక్కమీద పడిపోయింది. అతడు నిశ్చేష్టుడై తన అనుభవాన్ని తనే నమ్మలేనట్టూ అలానే వుండిపోయాడు. కారణం....

పాప చేతిని పట్టుకున్నప్పుడు అతడికి సన్నగా షాక్ కొట్టింది. సన్నగా– అరక్షణంపాటు–

అతడి ఒళ్ళు జలదరించింది షాక్‌వల్ల కాదు.... భయంతో.

* * *

ఆస్పత్రి వరండాలో నిల్చొని వున్నాడు జయదేవ్. శ్రీధర్ వాళ్ళు ఫకీర్ మాటలు విని అంతదూరం వెళ్ళటం జయదేవ్‌ని వంటరివాణ్ణి చేసింది.

అతడు చుట్టూ చూశాడు. వరండాలో పాప గదిముందు వేసిన బల్లమీద శారద కూర్చొని వుంది. అలసటతో ఆమె మొహం వడలిపోయి నిస్త్రాణగా కళ్ళు మూసుకుని– ఏ ఆలోచనా లేని శూన్యంలో స్థబ్దంగా వుండిపోయింది.

బల్లకిటు చివర పక్కగది పేషెంటు తాలూకు అనుకుంటా– ఒక యువకుడు కూర్చుని వున్నాడు. ఒళ్ళో బ్రీఫ్‌కేస్ పెట్టుకుని, ఏదో ఎలక్ట్రానిక్స్ మాగజైన్ చదువుతున్నాడు.

జయదేవ్ లోపలికి వెళదామా అనుకున్నాడు. కానీ లావుపాటి నర్సు జ్ఞాపకమొచ్చి ఆ ప్రయత్నం విరమించుకుని వెళ్ళి బల్లమీద కూర్చున్నాడు. అలికిడికి శారద కళ్ళు విప్పి మళ్ళీ మూసుకుంది. అతడు వాచీ చూసుకున్నాడు. ఆరుంపావు. పక్క యువకుడ్ని మాగజైన్ అడిగాడు. చదువుకుంటున్న అతడు జయదేవ్ హఠాత్తుగా అడగటంతో ఉలిక్కిపడి నవ్వి, పక్కనే వున్న యింకో పుస్తకం యిచ్చాడు. జయదేవ్ బల్ల వెనక్కి ఆనుకొని పుస్తకం తెరిచాడు. అదీ ఎలక్ట్రానిక్ మాగజైనే. విసుగుతో అతడు దాన్ని పక్కనే పడేసి చుట్టూ చూశాడు. బాగా చీకటి పడింది. శారద అలాగే కూర్చుని వుంది. ఆమెను డిస్టర్బ్ చేయటం యిష్టంలేక అతడు గుమ్మంవైపు నడిచాడు. అంతలోనే డాక్టరు లోపలనుంచి రావడం చూసి "ఎలా వుంది డాక్టర్?" అని అడిగాడు. పార్థసారధి మొహం ఉద్విగ్నతతో నిండివుంది. మాట్లాడకుండా లోపలికి నడిచాడు, వెనుకే జయదేవ్‌ని రమ్మని.

పక్కమీద పాప పడుకుని వుంది. ఆమె శరీరం నుండి వైర్లు రకరకాల మీటర్లకి కనెక్టు చేయబడి వున్నాయి. మనిషి శరీరపు పరిణామాన్ని అంకెల్లో చెప్పే మీటర్లు. చిన్న చుక్క మీటరు ఒక చివర వెలిగి నెమ్మదిగా పయనించి ఇంకోవైపు అదృశ్యమవుతూంది. చుక్క పయనంలో వంపుల్లేవు. గుండె బలహీనంగా కొట్టుకుంటోందన్నమాట.

"ఇంకోరోజు బ్రతికితే అదృష్టవంతులమే" అన్నాడు డాక్టరు. జయదేవ్ ముఖంలో మార్పులేదు. ఆ విషయం డాక్టరు చెప్పనక్కరలేదు.... పాపని చూస్తేనే తెలుస్తూంది. అతడికి కోపం వచ్చింది డాక్టరుమీద కాదు, శ్రీధర్ మీద. ఈ స్థితిలో కూతుర్ని వదలి వెళ్ళిపోయినందుకు. పార్థసారధి ఏదో చెప్పబోయి మళ్ళీ ఆగిపోయాడు.

జయదేవ్ మౌనంగా వెనుదిరిగాడు. ఇద్దరూ బయటకు వస్తూంటే డాక్టరు తటపటాయిస్తూ అన్నాడు– "జయదేవ్! మీతో ఒక మాట చెప్పాలి".

జయదేవ్ ఆగి ఏమిటన్నట్టు చూశాడు.

"గంట క్రితం పాప చెయ్యి పట్టుకుని పల్స్ చూస్తుంటే...." అని చెప్పాలా అక్కర్లేదా అన్నట్టు ఆగాడు.

"ఏమైంది డాక్టర్?"

"నన్ను గట్టిగా అడిగితే నిర్ధారణగా చెప్పలేను– కానీ...."

"ఊఁ.... కానీ...." అసహనంగా అన్నాడు జయదేవ్.

"పాప శరీరం సన్నగా షాక్ కొట్టింది. ఎంతో కాదు– చాలా తక్కువగా– ఇరవై – ఇరవై అయిదు వోల్టుల మధ్య".

తనకే షాక్ తగిలినట్టు నిశ్చేష్టుడై వుండిపోయాడు జయదేవ్. డాక్టరు ఏదో మాట్లాడుతున్నాడు– అతనికేమీ వినబడటం లేదు.

పాప శరీరం కరెంటుని బహిర్గతం చేస్తుందా? ఎలా?– ఎలా ఇది సాధ్యం? పాప మంచం దగ్గరికి వడివడిగా నడిచి పరీక్షించాడు. సారథి అన్నాడు– "అన్నీ నేనూ చూశాను జయదేవ్. ఎవరికయినా చెబితే నవ్వుతారని చెప్పలేదు. నేనీ వైర్లూ, చివరికి మంచం జరిపి కూడా చూశాను. ఇదంతా నా భ్రాంతి కావొచ్చు. క్షణంలో నాలుగోవంతు కొట్టిందంతే. ఇప్పుడంతా మళ్ళీ మామూలుగానే వుంది".

"మంచం జరిపి చూశారా?"

"ఆఁ".

చాలాసేపు నిశ్శబ్దం. జయదేవ్ చూపుడు వేలుతో నుదురు కొట్టుకుంటూ ఆలోచించసాగాడు. చప్పున ఏదో స్ఫురించినట్టూ "ఫోన్ వుందా ఇక్కడ?" అడిగాడు. డాక్టరు చెయ్యి సాచి చూపించాడు. జయదేవ్ ఫోన్ చేసి "సుధీర్" అన్నాడు.

"స్పీకింగ్".

"ఒకసారి వెంటనే రాగలవా? నీతోపాటూ ఒక అమ్మీటరు కూడా పట్టుకురా. నేను ఆస్పత్రి ఇంటెన్సివ్‌కేర్‌లో వున్నాను".

ఎందుకని అడక్కుండా ఫోన్ పెట్టేసి, పది నిమిషాలలో వచ్చాడు అతడు. అతడికి పాతికేళ్ళుంటాయి. ఇంగ్లాండులో ఇంజనీరింగ్ చదువుకున్నాడు. తండ్రి తాలూకు ఫ్యాక్టరీ చూసుకొంటున్నాడు. పెదాలమీద ఎప్పుడూ అబ్బానో బోనీయెమ్మో ఆడుతూ ఉంటారు. చాలా తెలివైన, చురుకైన కుర్రవాడు.

"చెప్పండి గురూగారూ! ఏమిటి ఇంత హఠాత్తుగా ఫోన్‌చేసి ఇంత చిన్న కోరిక కోరారు?" వస్తూనే అడిగాడు.

జయదేవ్ నవ్వి, "నీకో గంట టైమిస్తున్నాను. ఇదిగో ఈ పాప శరీరం నుంచి ఏదైనా కరెంట్ పాసవుతుందేమో చెప్పాలి నువ్వు" అన్నాడు. "గంట టైమిస్తున్నాను".

సుధీర్ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి, "శరీరం కరెంటుని ఎమినేట్ చేయడమేమిటి? దాన్ని అమ్మీటర్తో కొలవడమేమిటి? మీకేమైనా–" అని ఆగిపోయాడు. 'మతిపోయిందా' అనకుండా.

"అవన్నీ తర్కించడానికి టైమ్ లేదు. చెప్పింది చేయి" అన్నాడు జయదేవ్. పైకి మాట్లాడుతున్నాడన్న మాటేగానీ మెదడులో ఆలోచనా తరంగాలు.... ఒక అద్భుతమైన రహస్యం శోధించడానికి కారణమైన ఆలోచన....

పార్థసారథి మధ్యలో కల్పించుకొని "నాది భ్రమ అయుండవచ్చు. దానికింత రాద్ధాంతం అనవసరం" అన్నాడు. "అయినా ఇది హాస్పిటల్. ఎలక్ట్రికల్ షాపు కాదు– అమ్మీటర్లు, వోల్టామీటర్లూ రోగులకు తగిలించడానికి".

"అబ్జెక్షన్ ఓవర్ రూల్డ్" అనేసి వడివడిగా బయటకొచ్చాడు జయదేవ్. శారద అలికిడికి అటు చూసింది. "శారదగారూ! మనం ఓసారి మీ ఇంటికి వెళ్ళాలి" అన్నాడు.

"ఎందుకు?"

"కార్లో చెబుతాను. లేవండి. పాప నిద్రలో వుంది. ఓ అరగంటలో వచ్చేద్దాం. డాక్టరుకు చెప్పాను" తొందర తొందరగా అని, ఆమె లేచి మెట్లు దిగే లోపులో కారు తీసుకొచ్చాడు. ఆమె కూర్చోగానే కారు నెమ్మదిగా కదిలింది.

వాళ్ళు వెళ్ళగానే అప్పటివరకూ వీళ్ళ మాటలు వింటున్న యువకుడు బల్లమీద నుంచి లేచాడు. మాగజైన్స్ బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుని తన కారువైపు వడివడిగా నడిచాడు. మరునిమిషం ఆ కారు కూడా శ్రీధర్ ఇంటివైపు సాగిపోయింది.

27

"దాదాపు ఏడొందల యాభై కిలోమీటర్లు కవర్ చేశాం. టైమ్ ఏడు కావొస్తూంది. అంటే దాదాపు పావుగంట ఆదా చేయగలిగామన్న మాట" అన్నాడు

విద్యాపతి. వాళ్ళు కనీసం 'టీ' తాగటానికి కూడా ఆగలేదు. అంచెలంచెలుగా డ్రైవ్ చేస్తున్నారు.

చలిగాలి రివ్వున వీస్తూంది. ఎక్కడో కుండపోతగా వర్షం కురుస్తున్నట్టు ఆకాశం మేఘావృతమై వుంది. ఆ రోజు అమావాస్య. స్పీడోమీటరు ఎనభై తొంభై మధ్య వూగిసలాడ్తూంది. మలుపుల్లో కూడా వేగం తగ్గించకుండా నడుపుతున్నాడు శ్రీధర్. "జాగ్రత్త! మరీ వేగంగా వెళ్ళకు" అని హెచ్చరించబోయి మళ్ళీ వూరుకున్నాడు విద్యాపతి. తన మాటలు తనకే అన్వయించవని అతనికి తెలుసు.

"ఇంకా యాభై కిలోమీటర్లలో—" అని అబ్రకదబ్ర ఏదో చెప్పబోతూ వుంటే చిన్న చప్పుడుతో కారు నెమ్మదయింది. శ్రీధర్ కారుని సర్రున పక్కకి క్రోసి ఆపుచేశాడు. అబ్రకదబ్ర ఒక్క గెంతులో కారు దిగాడు. బోనెట్ పైకెత్తి చూశాడు. ఆవిర్లు చిమ్ముతూ రేడియేటరు పైప్‌లోంచి నీరు కారిపోయింది.

నిస్పృహతో శ్రీధర్ కళ్ళ నీళ్ళు గిర్రున తిరిగాయి. స్టీరింగ్ మీద తల టపటపా కొట్టుకున్నాడు కసితో.

* * *

జయదేవ్ సైకాలజీ చదువుకున్నవాడు. మనిషి మూడ్‌ని మాటలతో మార్చగలడు. తన పక్కనే నిర్లిప్తంగా, మౌనంగా కూర్చున్న శారదని చూస్తే అతనికి జాలేసింది. పాప పరిస్థితి విషమంగా వుందనీ, మహా అయితే కొన్ని గంటలనీ అతనికి తెలుసు. శ్రీధర్ వాళ్ళూ ఏదో చేయగలరని అతడు అనుకోవటం లేదు. అసలు వాళ్ళు అంత కొద్ది సమయంలో అంత దూరం ప్రయాణం చేయగలరని కూడా అతను అనుకోవటం లేదు. పాప శరీరం కరెంటుని ఎలా ఎమినేట్ చేసిందీ అన్న విషయం ఆలోచిస్తున్నాడు అతడు. ఇప్పటికే ఇరవై రోజుల్నించీ వున్న పాప అనారోగ్యానికీ ఈ కరెంటుకీ ఏదైనా సంబంధం వుందా? ఉంటే అది శ్రీధర్ ఇంట్లోనే దొరకాలి. అది కనుక్కోవటానికి శారద సహకారం కావాలి. దానికామె మూడ్ మార్చాలి.

'తను అనుకొంటున్నది తప్పు కావొచ్చు' అన్న అభిప్రాయం కూడా అతనికి ఏదో మూల వుంది. ఇ.సి.జి. మిషన్ వైరు లీక్ అయినా షాక్ కొట్టవచ్చు, లేదా డాక్టర్ అన్నట్టు తనే పొరపాటు పడివుండవచ్చు.

"మనం మీ ఇంటికి ఎందుకు వెళుతున్నామో తెలుసా?" అని అడిగాడు. శారద తల వూపి, "పాప ఇంకొన్ని నిమిషాల్లోనో, గంటల్లోనో వుంది. ఆ క్షణం అక్కడ నేను లేకుండా వుండటం కోసం నన్ను తీసుకెళుతున్నారు" అంది. అతడు నిశ్చేష్టుడై "అదికాదు-అదికాదు" అన్నాడు.

ఆమె హిస్టీరిక్‌గా మారి, ఒక్కసారిగా బావురుమంది. అప్పటి వరకూ వున్న గంభీరత అంతాపోయి "అందరూ నా నుంచి దాస్తున్నారు. నాకు ఏమీ తెలీదనుకోకండి- నాకంతా తెలుసు. ఈ రోజు పాప పోవటం తథ్యం! దాన్నెవరూ ఆపలేరు" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ. "ఈ వ్యధ భరించలేక ఆయనెక్కడికో పారిపోయారు".

ఏడ్చే ఆడాళ్ళని ఓదార్చటం తెలియని ఆ సైకాలజిస్ట్, "ప్లీజ్! మీరేడవకండి- మీరేడిస్తే నాకున్న కాస్త ధైర్యమూ పోతుంది" అన్నాడు. రెండు నిమిషాల్లో ఆమె తేరుకుంది. కళ్ళు పైటతో తుడుచుకుంటూ "సారీ ప్రొఫెసర్!" అంది.

అప్పుడు చూశాడు ప్రొఫెసరు- తన కారు వెనకే ఇంకో కారు రావటం, చాలా సేపట్నుంచీ అదీ ఫాలో అవుతూనే ఉండటం. అతడి భృకుటి ముడిపడింది. ఎవరు తమని వెంటాడుతున్నారు? సరస్వతి చచ్చిపోయాడు. పైడితల్లి రాత్రే శ్మశానంలో అంతమొందాడు. అంటే.... అంటే ఇక మిగిలింది.

- స్వామి.

జయదేవ్ దవడ కండరం ఆవేశంతో బిగుసుకొంది. కారు అలాగే రివర్స్‌లో తీసుకెళ్ళి దానికి డాష్ ఇద్దామన్నంత కసి పెరిగింది. మళ్ళీ అంతలోనే సర్దుకొని కారు వేగం హెచ్చించాడు. వెనుక కారు వేగం కూడా పెరిగింది, రెండు నిమిషాలలో అతడు పోలీస్‌స్టేషన్ ముందు కారు ఆపాడు. "ఇదేమిటి- ఇక్కడికొచ్చాం?" అంటూంది శారద. అతడు ఒక్కగెంతులో కిందికి దిగి, వెనుక కారు నెంబరు చూడబోయాడు. అదే అతడు చేసిన తప్పు అతడు వూహించలేనంత స్పీడ్‌లో ఆ కారు అతన్ని దాటి వెళ్ళిపోయింది.

తన అజాగ్రత్తకి తనని నిందించుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌కి రావటంతో వెనుక వస్తున్నవాడికి అనుమానం వచ్చి ఉంటుంది. వేగంగా వెళ్ళిపోయాడు. తను కనీసం చౌకబారు డిటెక్టివ్ పని కూడా చేయలేక పోయాడు. తనని తానే తిట్టుకుంటూ కారు ఎక్కబోతూంటే లోపల్నుంచి ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. పైడితల్లి కరెంట్ కేసులో పరిచయమైన ఇన్‌స్పెక్టరు జయదేవ్‌ని విష్ చేసి "ఏమిటిలా వచ్చారు?" అన్నాడు.

"సర్లెండి" అందామె పంచదార డబ్బాతీస్తూ. "మీకు షుగర్ ఎక్కువ వెయ్యాలా?"

"మీడియమ్".

ఆమె స్పూన్‌తో పంచదార కలిపి డబ్బా తిరిగి దాని స్థానంలో పెట్టబోతూంటే–

....అప్పుడు చూశాడు అతడు– డబ్బాలు పెట్టుకొనే అరలో గోడమీద వున్న చిన్న డయాగ్రమ్‌ని. కుర్చీ స్పీడ్‌గా వెనక్కి జరిపి ఒక్క అంగలో దగ్గరగా వెళ్ళాడు. గోడమీద పెన్సిల్‌తో వేసిన బొమ్మ! ఒక లెక్కల కుర్రవాడు ఆలోచన వచ్చినపుడు కాగితం దొరక్క గోడమీద లెక్క చేసినట్టు చిన్న డయాగ్రమ్. అతడు దాన్ని పరీక్షగా చూశాడు.

అది ఇలా వుంది.



జయదేవ్ చూస్తున్నది బొమ్మని కాదు, హిప్నాటిజం అన్న పదాన్ని. ఇరవై ఒకటి అన్న అంకెని. ఇరవై ఒకటి.... ఇ....ర...వై ఒ...క...టి.... పైన 86400 అన్న అంకె.

"ఏమిటిది ప్రొఫెసర్" అంటూంది శారద భయంగా. అతడు జవాబు ఇవ్వలేదు. ఒక్క అంగలో ఫోన్ దగ్గరకు పరుగెత్తాడు. ఎనిమిద్నిర కావొస్తూంది. తొందర తొందరగా ఫోన్ చేశాడు.

"సుధీర్! ఎలా వుంది పాపకి. కరెంట్ విషయం ఏమయినా తేలిందా?"

"లేదు!"

"లేదా?"

"లేదు".

"నాకో విషయం చెప్పు. ఆర్.ఏ.ఎమ్ అంటే?"

"ఎలక్ట్రానిక్స్‌లో ఒక పదం– రాండమ్ అక్సెస్ మెమొరీ".

ఎలక్ట్రానిక్స్ అన్న పదం వినిపించేసరికి ఉలిక్కిపడ్డాడు. "సుధీర్" అన్నాడు దాదాపు వణుకుతున్న గొంతుతో. "బైట బెంచీమీద ఒక కుర్రవాడు కూర్చొని వుంటాడు చూడు. ఉంటే అతడ్ని ఎలాగయినా బంధించు. ముందు, వున్నాడో లేడో చూసి చెప్పు".

క్రింద రిసీవరు పెట్టిన చప్పుడు. పది క్షణాల తర్వాత సుధీర్ అన్నాడు, "అలాటివాడు ఎవడూ లేడు. అసలు మీరెక్కడ్నుంచి మాట్లాడుతున్నారు? బంధించటం ఏమిటి?" అయోమయంగా అతడి గొంతు వినిపించింది.

"అవన్నీ తరువాత చెప్తాను. నువ్వు వెంటనే రా. శ్రీధర్ ఇంట్లో వున్నాను నేను– వెంటనే రావాలి" అని ఫోన్ పెట్టేశాడు.

"ఏమిటిదంతా?" అడిగింది శారద అర్థంకాక.

"చెబుతాను. ముందు మనం ఇల్లంతా వెతకాలి–పూచికపుల్ల అయినా వదలకుండా....మీరొక వైపునుంచి, నేనొక వైపునుంచీ.... శారదగారూ– మీ పాప ఆస్పత్రిలో ఎలావుంది అని కంగారు పడకండి. ఒక అరగంట నా గురించి వెచ్చించండి. క్విక్...." అతడు సమాధానం గురించి చూడకుండా మేడమీదకు పరుగెత్తాడు.

ముందు శ్రీధర్ గది, తరువాత శారదా, పాప పడుకునే గది, తరువాత అనితది, నారాయణరావుది– అన్నీ చూసి క్రిందికి వచ్చాడు. వంటిల్లు, వరండా అన్నీ చూశాడు. చివరకు స్టోర్ రూమ్ ప్రవేశించాడు. చీకటిగా వుంది. లోపల బ్యాటరీ లైటుతో వెతకటం ప్రారంభించాడు.

అయిదు నిమిషాల తర్వాత దొరికింది చిన్న పెట్టె. పోకెట్ కాలిక్యులేటర్‌లా వున్నది. దాంతోపాటే చిన్న కాగితం కూడా వుంది. అతడు దాన్ని చదవబోతూ వుంటే వినిపించింది చెవులు చిల్లులు పడేలా కేక.... శారదది.

అతడు నిర్విణ్ణుడై వెనక్కి తిరగబోయాడు. కానీ అప్పటికే క్షణం ఆలస్యం అయింది. అతడి తలమీద బలంగా దెబ్బపడింది. కుప్పగా కూలిపోతూ మూతపడబోతున్న కళ్ళను బలవంతంగా పైకెత్తి చూశాడు. ఆ స్థితిలో కూడా కొట్టిన వ్యక్తిని చూసి షాక్ తిన్నాడు. ఉప్పటి రక్తం తలమీదనుంచి పెదవుల మీదకు జారుతుంటే "ను.....నువ్వా..." అనబోయాడు. నోట మాట రాకముందే స్పృహ తప్పింది.

గోడ గడియారం పది కొట్టింది. పాప మరణానికి సరిగ్గా రెండు గంటలుంది. శారద గోడకి బల్లిలా అతుక్కుపోయింది. అనూహ్యమైన షాక్‌వల్ల "నువ్వా ఇదంతా చేసింది" అన్నమాట ఆమె నోటివెంట రాలేదు.

*　　*　　*

10-00 పి.ఎమ్.

దాదాపు గంట క్రితంవరకూ శ్రీధర్ చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాడు. కానీ ఇప్పుడు.... ఇంకా 'రెండు' వందల కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి రెండు గంటలలో...

అతడి మనసు పరిపరి విధాలా ఆలోచిస్తున్నది- అక్కడ పాప ఎలావుందో.... అసలా మంత్రగాడూ దొరుకుతాడా- దొరికినా ఫలితం వుంటుందా? విజయనగరం దగ్గర్లో అయిదు నిమిషాల ఆలస్యం అయింది. అయిదు కిలోమీటర్లు వెళ్ళాక ఎవరో బెబ్బులి వైపు అన్నారు. సరీగ్గా తెలుసుకోవటానికి ఇంకో రెండు నిమిషాలు ఆలస్యం. మేఘాలు మరింత దట్టంగా అలుముకుంటున్నాయి. కారు హెడ్‌లైట్స్ పడుతున్నచోట తప్ప మిగతా అంతా కన్ను పొడుచుకున్నా కానరానంత చీకటిగా వుంది. ఏ అరగంటకో ఒక లారీ ఎదురొస్తూంది.

"వర్షం వస్తే కష్టం" అనుకొన్నాడు శ్రీధర్. అప్పుడు ఎంక్వయిరీ చెయ్యటం కష్టం. టైమ్ చూసుకొన్నాడు. పదీ ఇరవై. ఇంకా వంద నిమిషాలు... లాభంలేదు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప పాప బ్రతకదు.

అతడి ఆలోచనలని తెగ్గొడుతూ అబ్రకదబ్ర కంఠం వినిపించింది. "ఒరిస్సాలోకి వచ్చాం".

శ్రీధర్ ముందుకు వంగి చూశాడు. హెడ్‌లైట్స్ కాంతిలో బోర్డు కనబడింది. వెల్‌కం టు ఒరిస్సా స్టేట్.

*　　*　　*

కారు నడుస్తూనే వుంది. 'రాయగడ' వచ్చింది. రాత్రి పదకొండు కావొస్తూ వుండటంవల్ల అంతా నిర్మానుష్యంగా వుంది. ఎదురుపడిన ఒకరిద్దరికి తెలుగు రాదు. చివరికి ఒక ముసలివాడు దొరికాడు.

"బిస్తాకి వెళ్ళే దారెటు?" తల బైటకి పెట్టి అడిగాడు విద్యాపతి.

ఆ గ్రామీణుడు కారులో వాళ్ళవైపు విచిత్రంగా చూసి "బిస్తా?" అని అడిగాడు అనుమానంగా.

"ఆఁ... బిస్తానే" అసహనంగా అన్నాడు శ్రీధర్.

"కళ్యాణ్ సింగొపురమ్ పోయి ఎనక్కి తిరగండి. కాషీపూర్.... కాషీపూర్ తెలుసా? దాని దగ్గర గ్నానాపూర్‌కో మైలుంది".

"ఇక్కడ్నుంచి ఎంతదూరం?" శ్రీధర్ ఆతృతగా అడిగాడు.

"వంద మైళ్ళుండదా?" తనలో తానే ప్రశ్న వేసుకుంటున్నట్టూ ఆ గ్రామస్తుడు అన్నాడు. ఒక్కసారిగా ముగ్గుర్నీ నిరాశ ఆవరించింది. వందమైళ్ళు అంటే... నూట అరవై కిలోమీటర్లు. సమయం సరిగ్గా గంట కూడా లేదు. విద్యాపతి నిరాశగా గేరు మార్చబోయాడు.

కారు కదలపోతూంటే ఆ గొల్లవాడు అన్నాడు- "అడ్డదారిని బోకూడదూ".

కారులో ముగ్గురూ ఉలిక్కిపడ్డారు.

"అడ్డదారా!"

"ఆఁ... కళ్యాణెల్లి వెనక్కి దిరిగేది ఎందుకూ- అదో ఆ కొండల లోంచి పొండి, రోడ్డు అంత బాగోదు. వర్షమొస్తే ఏరుపొంగి తగ్గేవరకూ ఆగవల్సి వస్తుంది".

"ఇలా అయితే ఎంత దూరం?" అతడి మాటల్ని మధ్యలో ఆపుచేస్తూ శ్రీధర్ అడిగాడు. బుల్లెట్‌కన్నా వేగంగా ఆ ప్రశ్న అతని నోటిలోంచి వచ్చింది.

"ఏభై మైళ్ళుండదూ?" గొల్లవాడి మాటలు పూర్తి కాకుండానే కారు కొద్దిగా రివర్స్‌చేసి మెయిన్‌రోడ్ మీదనుంచి ఎడమపక్క గతుకుల బాటలోకి సర్రున దింపాడు. అరక్షణంలో చీకట్లో అదృశ్యమైన కారువైపే చిత్రంగా చూస్తూ నిలబడిపోయాడు గొల్ల.

అసలు సంగతి చెప్పటం ఇష్టంలేక, "ఊరికినే- ఆ శరణాలయం వాళ్ళ విషయం ఏదైనా తెలిసిందా?" అని అడిగాడు.

"లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టరు. "ముగ్గురూ మిస్సింగ్. ఈ శరణాలయం రామకృష్ణా ట్రస్ట్ అని ఒక దేవాలయానికి సంబంధించింది. మద్రాసులో దేవాలయం. శ్రీనివాసపిళ్ళై అనే ఒకాయన ఆ వ్యవహారాలు చూస్తాడు. ఆయనకీ, ఈ శరణాలయానికీ ఏదైనా సంబంధం ఉందా అని ఎంక్వయిరీ చేశాం. అటువంటిదేమీ లేదు. ఆయన పరమ సాత్వికుడూ, దైవ భక్తుడునూ. వీళ్ళు ముగ్గురే ఇక్కడ శరణాలయం పేరిట ఈ పనులన్నీ చేస్తున్నారు".

ఇన్‌స్పెక్టర్‌కి షేక్‌హాండిచ్చి కారెక్కాడు జయదేవ్.

* * *

"పొయ్యి" అన్నాడు అబ్రకదబ్ర- "ఎక్కువ నీళ్ళు వేస్టు చేయకుండా జాగ్రత్తగా పొయ్యి".

విద్యాపతి పోయసాగాడు. స్టీరింగ్ మీద నిస్త్రాణంగా తలపెట్టుకున్న శ్రీధర్ విస్మయంతో తలెత్తాడు. బ్రాహ్మిణ్ రెండు చేతులూ లోపలికి పెట్టి కర్చీఫ్‌తో పైపు కట్టసాగాడు.

విద్యాపతీ, శ్రీధర్ ఇద్దరూ బ్రాహ్మిణ్‌నే చూస్తున్నారు. క్రింది పెదవిని పంటితో నొక్కిపట్టి కర్చీఫ్‌తో బిగిస్తున్నాడు. కర్చీఫ్ బలంగా బిగించటం కోసం అతడు పెదవి నొక్కిపట్టలేదనీ, పైన విద్యాపతి నీళ్ళు పోస్తుంటే, క్రింద అతడి చేతులమీద సలసలాకాగే నీళ్ళు పడుతున్నాయనీ పడినచోటల్లా చేతులు అప్పటికప్పుడే బొబ్బలెక్కుతున్నాయనీ వాళ్ళకు తెలుసు.

రెండు నిమిషాలలో పని పూర్తిచేసి వచ్చి కూర్చుని "స్టార్ట్ క్విక్" అన్నాడు. శ్రీధర్ కారు స్టార్టు చేయలేదు.

"బ్రాహ్మిణ్" అన్నాడు.

"నో సెంటిమెంట్స్ ప్లీజ్" అన్నాడు బ్రాహ్మిణ్. కారు కదిలింది. విండోలోంచి వస్తున్న చల్లగాలి- బొబ్బలెక్కిన చేతుల్ని చల్లారుస్తుండగా తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకొన్నాడు. కారు ఈ స్థితిలో ఇంకో పదిమైళ్ళ కన్నా ఎక్కువ ప్రయాణం చెయ్యదని, కొత్త పైపు వెయ్యటానికి అరగంట పడ్తుందనీ తెలుసు. అతనలా ఆలోచిస్తూ వుండగానే కారు మళ్ళీ ఆగింది. లెవెల్ క్రాసింగ్.

అదృష్టవశాత్తూ రైలు వస్తూంది. దూరంగా లైటు కనబడ్తూంది. అబ్రకదబ్ర వాచీ చూసుకున్నాడు. అయిదు నిమిషాలు తక్కువ ఎనిమిదయింది. అతడు రైలు వైపు కసిగా చూశాడు.

ఆ రైల్లోనే స్వామి ప్రయాణం చేస్తున్నాడని వాళ్ళకి తెలీదు.

* * *

8-00 పి.ఎమ్.

శ్రీధర్ ఇంటిముందు కారాపి "దిగండి. అయిదు నిమిషాలకన్నా ఎక్కువసేపు పని వుండదు. పైడితల్లి వాళ్ళ గది వెతకాలంతే" అని వడివడిగా నడిచాడు జయదేవ్ లోపలికి.

పైడితల్లి గదిలో బద్దలైన పటం అలానే వుందింకా. క్రింద వేసిన ముగ్గు, సాలెగూడూ అలానే నిశ్చలంగా వున్నాయి. జయదేవ్ ఒక మూలనుంచి వెతకటం ప్రారంభించాడు. ముందు బట్టలు, తరువాత పెట్టె, అద్దం వెనుకా- అన్నీ వరుసగా వెతికాడు.

గదంతా వెతకటానికి అరగంట పట్టింది. ఒక్కో నిమిషమూ గడిచే కొద్దీ అతడిలో టెన్షన్ పెరుగుతూంది. నుదుటిమీద చెమట పట్టింది. అసలు ఏం దొరుకుతుందని వచ్చాడు తనిక్కడికి? వీళ్ళు నిజంగా పాపకి చేతబడి చేయించి వుంటే- దానికి తార్కాణాలు ఇక్కడ ఎందుకు వుంచుకొంటారు? ఒకవేళ అవి దొరికినా లాభం ఏమిటి?

గదిలో ఇక వెతకవలసినదేమీ లేదని నిశ్చయించుకొని అతడు బైటకొచ్చి "శారదగారూ" అని పిలిచాడు. ఆమె వంటింటిలో నుంచి జవాబిచ్చింది. కాఫీ కలుపుతూంది. "ఇప్పుడెందుకు ఈ శ్రమంతా" అన్నాడు నొచ్చుకుంటూ. పాప జీవితం ఇంకో నాల్గు గంటలే అని తెలిస్తే ఈమె ఇలా వుంటుందా అని అనుకుంటూ.

"మా కోసం మీరు పడుతున్న శ్రమతో పోల్చుకొంటే ఇదేపాటిది" అన్నది శారద. అతడు డైనింగ్ టేబుల్ పక్కనే కూర్చొని "మీరూ తాగుతానంటేనే నేనూ" అన్నాడు. ఆమె విషాదంగా నవ్వి "పాపకలా వుంటే ఇప్పుడు నాకు కాఫీయే తక్కువ" అంది.

"అలా అయితే నాకూ వద్దు" లేవబోయాడు.

చర్చీ స్థంభపు గంటలు గాలిలో తేలివచ్చాయి... పదకొండుసార్లు.

28

11-00 పి.ఎం.

జయదేవ్ కళ్ళు విప్పాడు. తన మీదకే వంగి ఆతృతగా చూస్తూ ఉన్న శారద మొహం కనిపించింది. అతడు కళ్ళు విప్పటం చూసి "ఎలా వుంది?" అని అడిగింది. తలమీదనుంచి కారిన రక్తాన్ని కడిగినట్టూ వుంది. ఇంకా తడి ఆరలేదు.

"ఎంతసేపిలా వున్నాను?"

"గంట- మేం చాలా కంగారు పడుతున్నాం".

'మేం' అన్న పదంతో తలతిప్పి చూశాడు. ఒకమూల సుధీర్ కూర్చొని వున్నాడు. అతనిముందు కాగితాలు పరిచి వున్నాయి.

చుట్టూ పరికించి చూశాడు. స్టోర్‌రూమ్ పక్కనే కిచెన్... అందులో తాము బంధింపబడి వున్నట్టూ గ్రహించాడు.

"నువ్వూ బోనులోకి వచ్చేశావా?" అడిగాడు జయదేవ్.

"ఆహా" అన్నాడు తలెత్తి సుధీర్. "మీ ఫోన్‌కాల్ రాగానే నేరుగా లోపలికి వచ్చేశాను. మీ వంటవాడు రామయ్య అట. పెద్ద ఇనుప గరిటతో నిలబడి వున్నాడు. రాగానే వడ్డించాడు" తల తడుముకుంటూ.

"ఏమిటి చేస్తున్నావ్?" జయదేవ్ అడిగాడు నేలమీద బొగ్గులతో గీసిన అంకెల్ని చూస్తూ.

"మీకు ప్రథమ చికిత్స చేసే పనిని శారదగారికి వదిలిపెట్టి, ఈ కాగితాల రహస్యం కనుక్కుంటున్నాను".

"ఏమైనా తేలిందా?" జయదేవ్ చాలా తాపీగా మాట్లాడటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఒకవైపు టెన్షన్‌తో రక్తప్రసరణం ఎక్కువ అవుతూంది. పదకొండుంపావు కావొస్తూంది. ఇంక నలభయ్ అయిదే నిమిషాలు.

"అంతా తేలిపోయింది. ఇదిగో ఈ మూడూ తప్ప" అని ఓ కాగితం యిచ్చాడు. శారద ఇటు చూడటం లేదు. జరిగినదంతా ఇంకా ఆమెకి నమ్మశక్యంగా లేదు.

"ఎన్నో సంవత్సరాల నుంచీ పని చేస్తున్నాడు. చాలా నమ్మకస్తుడైన నౌకరు" అన్నది తనలో తనే అనుకుంటున్నట్టు.

"డబ్బు మనిషిని ఎంతకయినా దిగజారుస్తుంది" అన్నాడు జయదేవ్ సుధీర్ దగ్గర్నుంచి కాగితాలు అందుకుంటూ.

ఆ కాగితం మీద ఇలా వుంది-

ప్రశ్న ఒకటి- 86400 అన్న పదానికి అర్థం ఏమిటి?

ప్రశ్న రెండు- కన్‌సోల్ ఆఫ్ హిప్నాటిజం అంటే ఏమిటి?

ప్రశ్న మూడు మూడు చుక్కలు అంటే ఏమిటి?

జయదేవ్ తలెత్తి 'ఆఖరి ప్రశ్నకి సమాధానం నేను చెప్పగలను' అన్నాడు చుక్కలలోను, గీతలలోను వాక్యాన్ని వ్రాయటాన్ని మోర్సుకోడ్ అంటారు. టెలిగ్రాఫ్ ఆఫీసులో చూసే వుంటారు. టిక్....టిఈ ఈటిక్ అన్న రెండు శబ్దాలతో టెలిగ్రామ్ మొత్తం ఒకచోట నుంచి ఒక చోటుకు పంపిస్తారు. టిక్ అన్న పదానికి ఒక్క చుక్క (.) టిఈఈటిక్ అన్న శబ్దానికి గీత (-). ఈ రెంటితో భాష తయారవుతుంది" అని పెన్‌కోసం జేబులు తడుముకున్నాడు. సుధీర్ నవ్వి "బొగ్గే శరణ్యం ఈ వంట ఇంట్లో" అన్నాడు. జయదేవ్ వంగి నేలమీద బొగ్గుతో వ్రాశాడు యిలా-

ఎ • బి •—— సి •——•—— అలా అలా జడ్ వరకూ వ్రాసుకుంటూ పోయాడు. తరువాత సుధీర్‌వైపు తిరిగి "వీటితో నీ దగ్గరున్న దాన్ని డీ కోడ్ చేయటం నీ పని. అయిదు నిమిషాలు టైం యిస్తున్నాను" అని శారదవైపు తిరిగి "ఈ అయిదు నిమిషాల్లోనూ మనం బయటపడే మార్గం ఆలోచించాలి" అన్నాడు.

"ఎలా? ఇవి బలమైన చెక్క తలుపులు. అదీగాక బయట రామయ్య కూర్చుని వున్నాడు" అంది శారద. జయదేవ్ వాచీ చూసుకున్నాడు. "పదకొండు గంటలా ఇరవై అయిదు నిమిషాలు. ఒకవేళ అంతా చేతబడి ప్రకారం జరిగేటట్టయితే ఇంకా ముప్ఫయ్ అయిదు నిమిషాలు. ప్రతీ క్షణమూ విలువైనదే. క్షణ-క్షణం" అతని మెదడులో ఏదో మెరిసినట్టయింది. 60 క్షణాలు అంటే ఒక నిమిషం. 60 నిమిషాలు అంటే ఒక గంట. ఇరవై నాలుగ్గంటలు.

"ఇరవై నాలుగూ × అరవై × అరవై ఎంత?"

బొగ్గుతో వ్రాసుకుంటున్న సుధీర్ తను మామూలుగా "86400" అని ఏదో స్ఫురించగానే చప్పున తలెత్తాడు. ముగ్గురూ ఒకళ్ళ మొహాలొకరు చూసుకున్నారు. సుధీర్ చేతిలోంచి బొగ్గు కిందపడేసి "అర్థమైంది" అన్నాడు.

"ఏమిటి?"

"ప్రోసెసింగ్ యూనిట్‌కి రిస్ట్‌వాచీ కనెక్షన్ యిచ్చారు. సెకన్ల చప్పుడు 86400 సార్లు వినబడేసరికి (పల్సెస్) అంటే రోజుకోసారి ఆర్వోయెమ్ నుంచి అది

తనకి కావల్సిన సూచనని అడుగుతుంది. అంటే సరిగ్గా రోజుకోసారి ఇలా అడుగుతుందన్నమాట. ఆర్వోయెమ్‌లో ఇరవై ఒక్క సూచన్లు నిక్షిప్తం చేయబడ్డాయి. రోజుకో సూచన ఇక్కడ్నుంచి ప్రయాణంచేసి పల్స్ విడ్త్ మాడ్యులేటర్‌కి చేరుతుంది, అక్కడ్నుంచి అంటెనా ద్వారా గాలిలోకి ప్రయాణం చేస్తుంది. రేడియో స్టేషన్‌లోలా ఇది రిసీవింగ్ అంటెనాకి చేరుస్తుంది. ఆ రిసీవింగ్ అంటెనా పాప దగ్గర వుందన్నమాట".

"అంటే పాపకి వార్తలు పంపటానికి ఈ ఇంట్లో ఒక రేడియో స్టేషన్ స్థాపించారంటావా?"

"చెప్పటానికీ చూడటానికీ ఇదంతా ఇంత కాంప్లికేటెడ్‌గా కనిపిస్తుంది కానీ మొత్తం దీన్నంతా ఒక బ్రీఫ్‌కేస్‌లో సర్దేయొచ్చు".

బ్రీఫ్‌కేస్ అనగానే జయదేవ్‌కి ఆస్పత్రి బల్లమీద కూర్చున్న యువకుడి బ్రీఫ్‌కేస్ జ్ఞాపకం వచ్చింది. ఎంతలో అతడు తన నుంచి తప్పించుకున్నాడు.

"ఈ వార్తల్ని పాపకి ఎప్పుడు పంపిస్తున్నారంటావ్? పాప దగ్గర ఎవరూ లేకుండా చూసి పంపాలి కదా. మరి ఎన్నింటికి పంపుతున్నారు వార్తల్ని?"

"రాత్రి పన్నెండింటికి" అని చప్పున "అదే సమయానికి పైడితల్లి క్లోరోఫాం ద్వారా మమ్మల్ని నిద్రపుచ్చేవాడు, చేతబడిలో మూడు రక్తం చుక్కలు పోయటం కోసం. ఆ సమయాన్ని నిజమైన శత్రువులు తమ కోసం ఉపయోగించుకుంటూ వచ్చారన్నమాట".

"అంటే ఈ వార్త పాపకి రాత్రి 11-30కీ 12-00కీ మధ్య చేరుతుందన్న మాట" అన్నాడు సుధీర్.

ఇది వింటూ జయదేవ్ ఉలిక్కిపడి టైమ్ చూసుకున్నాడు. పదకొండూ నలభై అయిదు! వార్త బయలుదేరిందా?

"సుధీర్! క్విక్ - ఆ ఆఖరి సూచన ఇరవై ఒకటో రోజుది ఏమిటి? వెంటనే డీకోడ్ చెయ్యి. తొందరగా" అన్నాడు.

సుధీర్ కాగితంవైపు చూశాడు. అందులో ఇలా వుంది.

-.-- --.-.--. .... -.-. .... -..---..-.

--.----..---.--..-.--..-.-..-.-..

సుధీర్ డీకోడ్ చేస్తూంటే జయదేవ్ ఆలోచిస్తున్నాడు. వార్తలు పంపబడుతున్నాయి సరే, కానీ పాప ఎలా రిసీవ్ చేసుకుంటుంది. నిశ్చయంగా పాప మెదడే వార్తల్ని రిసీవ్ చేసుకొంటూ వుండి వుంటుంది. అంటే పాప మెదడు

ఆపరేట్‌చేసి కుట్టేశారా? ఇంపాసిబుల్. మరెలా? పాప ఇంట్లో వుంటే ఇంట్లోనూ, ఆస్పత్రిలో వుంటే ఆస్పత్రిలోనూ ఈ సూచనలు పాపకెలా చేరుతున్నాయి?

సుధీర్ కంఠం "వచ్చింది" అని వినిపించడంతో ఆలోచన్ల నుంచి తేరుకొని చూశాడు. తెల్లటి గోడమీద బొగ్గుతో గీసిన అక్షరాలు భయం కొల్పేటట్టు వున్నాయి. ముగ్గురూ శ్వాస పీల్చటం కూడా మర్చిపోయి ఆ అక్షరాలవైపే నిశ్చేష్టతతో చూస్తున్నారు.... ఆ అక్షరాలు ఇలా వున్నాయి.

YOUR HEART IS GOING TO
STOP SLOWLY S....L...O..W....L...Y...
S....L....O....W....L...Y...

* * *

అందరికన్నా ముందు తేరుకున్నది జయదేవ్. ఇంకో నాల్గయిదు నిమిషాలలో - మహా అయితే పది నిమిషాలలో ఈ వార్త బయలుదేరి పాపకి చేరబోతూంది. ఆపాలీ అంటే ఆ వాచీ సెకన్ల ముల్లు ఆపుచెయ్యాలి. ఎలా? ఎక్కడుంది ఆ వాచీ? అన్నిటికన్నా ముందు ఈ గదిలోంచి బయటపడాలి. దానికెంత కాలం పడుతుంది?

అతడు చుట్టూ చూశాడు. కూరగాయలు, మసాలా దినుసులున్న సీసాలు, కాల్‌గాస్.

అక్కడ ఆగిపోయింది అతని దృష్టి. శారదవైపు తిరిగి "ఆ సిలెండర్ ఇలా గుమ్మం దగ్గరగా జరపాలి రండి" అన్నాడు.

"ఎందుకు?"

"స్టవ్‌నుంచి రబ్బర్ గొట్టం లాగేసి సిలెండరు తలుపు దగ్గర పెట్టి వెలిగిద్దాము".

"మీకేమయినా మతిపోయిందా?" అన్నట్లు చూశాడు సుధీర్. "సిలెండరు కనెక్షన్ పీకి అగ్గిపుల్ల వెలిగిస్తారా? మనం బ్రతకాలనేనా మీ ఉద్దేశ్యము? సిలెండరుతోపాటు మన మాంసఖండాలు కూడా గాలిలో ఎగిరిపోవాలనా?"

"సిలెండరు పేలదనే నా ఉద్దేశ్యం".

శారద కల్పించుకొని "గదంతా కార్బన్-డై-ఆక్సైడ్ నిండి ఊపిరి ఆడక చచ్చిపోతాం" అంది.

జయదేవ్ తాపీగా అన్నాడు. 'సిలెండరు పేలిపోవచ్చు. ఆక్సిజన్ లేక మనం చచ్చిపోవచ్చు. కానీ మనం వెంటనే బయటపడకపోతే రేపు ప్రొద్దున్న వరకూ పాప ప్రాణానికి హామీ యివ్వలేను. ఇక్కడే వుందామా, రిస్క్ తీసుకొని వెళదామా?"

"వెళదాం" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

జయదేవ్, సుధీర్ సిలెండరుని గుమ్మం దగ్గరికి లాగారు. బయటి గది కుర్చీలో కూర్చొని యజమాని ఎప్పుడొస్తాడా అని చూస్తున్న రామయ్యకి లోపల జరుగుతున్నది తెలీదు. లోపల రబ్బరుగొట్టం లాగగానే .....స్స్స్.... మన్న శబ్దంతో గ్యాస్ బయటికి రాసాగింది. బొటనవేలితో దాన్ని అడ్డుపెట్టి శారదవైపు తిరిగి అన్నాడు.... "వెలిగించండి".

సుధీర్ రెండు వేళ్ళూ చెవులలో పెట్టుకున్నాడు.

వెలుగుతున్న అగ్గిపుల్లతో శారద వంగింది. జయదేవ్ వేలు అడ్డు తొలగించాడు.

* * *

11-49 పి.యమ్.

గతుకుల రోడ్డుమీద నుంచి కారు పడి లేస్తూ వెళుతూంది. ఎద్దులబండి వెళ్ళే బాట అది. కొండని చుట్టి ఒరిస్సా రాష్ట్రం లోపలికి వెళ్ళిపోయారు.

శ్రీధర్ ఆలోచిస్తున్నాడు. ఇంత అర్థరాత్రిపూట పల్లెలో ఎవర్నని అడగాలి! ఈ పది నిమిషాల్లో ఎక్కడని వెతకాలి?

పార్థసారధి ఏం చేస్తున్నాడు? శారద ఈ రాత్రి ఏం చేస్తూ వుంటుంది? ఇంకా ఆ వరండాలో, అలాగే కూర్చుని వుంటుందా? పాప చచ్చిపోతే.... ఇక అంతా ఒంటరితనమే. వెన్నెముక విరిగిన తనకి ఇక పిల్లలు పుట్టరు. అనిత కూడా లేదు. ఇక అంతా ఒంటరితనమే.

కారు ఒక పెద్ద గుంటలో పడి లేవటంతో ఆ కుదుపుకి ఈ లోకంలోకి వచ్చాడు. అంతలో అబ్రకదబ్ర అరిచాడు. "అదిగో బిస్రా...." అని.

ఆ అరుపుకి ఇద్దరూ చప్పున తల తిప్పి చూశారు.

క్రింది లోయలో అక్కడక్కడ విసిరేసినట్టు వున్న పాకలూ, మినుక్కు మినుక్కుమని వెలుగుతున్న దీపాలూ– అక్కడ గోచరమవుతూంది మెరుపులో.....

"బిస్రా!"

* * *

ఎక్కడో చెక్క కాలుతున్న వాసనకి అనుమానంగా వాళ్ళని బంధించిన గదివైపు చూశాడు రామయ్య. గాలిలో పొగవాసన వస్తూన్నట్టు కూడా అనిపించింది.

గడియ సరిగ్గా వుందో లేదో చూడటానికి వంగాడు. లోపల్నుంచి జయదేవ్ 'వన్ టూ త్రీ' అనటం వినిపించింది. అది సుధీర్‌ని పరిగెత్తుకుంటూ వచ్చి తన్ను అని చెప్పటం.... వంగిన రామయ్య మీదకు ధడేలున తెరుచుకున్న తలుపుల మధ్యనుంచి సుధీర్ వచ్చి పడ్డాడు. ఆ వూపుకి రామయ్య కిందపడి తేరుకొని లేవబోయే లోపులో జయదేవ్ బయటకొచ్చాడు. "సుధీర్! ఇక్కడి విషయం నేను చూసుకుంటాను. నువ్వు వెంటనే ఆస్పత్రికి వెళ్ళు. బ్రీఫ్‌కేస్‌తో ఒక యువకుడు కనబడతాడు. తరువాత చెయ్యవలసింది నీకు తెలుసు" రామయ్య చేతులు వెనక్కి విరిచి పట్టుకుంటూ అన్నాడు.

ఇది జరిగిన రెండు నిమిషాలకి రామయ్యని ప్రశ్నిస్తున్నారు జయదేవ్.

"ఎవరు ఇదంతా చేయించింది?" అని. బయట సుధీర్ బయల్దేరిన చప్పుడు వినిపించింది.

"నాకు తెలీదు. తెలిసినా చెప్పను" చేతులకు కట్టబడిన తాళ్ళను గింజుకుంటూ అన్నాడు రామయ్య. జయదేవ్ ఫట్‌మని కొట్టాడు. రామయ్య నోటినుంచి రక్తం స్రవించసాగింది. జయదేవ్‌కి తొందరగా వుంది. ఎలాగైనా విషయం రాబట్టాలి. అదీ అయిదు నిమిషాల్లో.... పాప మెదడుకు ఆ ఆజ్ఞ చేరకముందే.... అయినా తన ఆతృత రామయ్యకు తెలియనివ్వకుండా అతనన్నాడు. "నువ్వు చెప్పనక్కర్లేదు. దీనివెనుక వున్నదీ నిన్ను కొన్నదీ శ్రీనివాసపిళ్ళై అని మాకు తెలుసు. అతడు పాపకి ఎలా వార్తల్ని పంపుతున్నాడు. ఆ విషయం చెప్పు?"

"నాకు తెలీదు."

"పోనీ అతడి బ్రీఫ్‌కేస్ ఎక్కడుంది?"

"నాకు తెలీదు".

జయదేవ్ శారదవైపు తిరిగి "కొంచెం కారం వుందా?" అని అడిగాడు. శారద "ఎందుకు?" అంది. "చెబ్తాను" అన్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది. అతడు రామయ్యవైపు తిరిగాడు. "పాపకి నయంచేసే నెపంమీద నువ్వో భూతవైద్యుడ్ని తీసుకొచ్చావు. అతడు పాపని గదిలో వుంచి తలుపులన్నీ బిగించి ముంత పొగ పెట్టాడు. జ్ఞాపకం వుందా? కళ్ళల్లోంచి ముక్కులోంచి నీళ్ళొచ్చి పాప గిలగిలా తన్నుకొంది. ఆ బాధెలా ఉంటుందో చూద్దువుగాని".

ఇంతలో శారద వచ్చింది. "కారం దొరకలేదు. ఆవకాయ జాడి తెచ్చాను" అంది.

"ఫర్లేదు" అన్నాడు జయదేవ్. చూపుడు వేలితో దాని కారం కొద్దిగా తీసుకొని, రామయ్య కళ్ళకి కాటుకలా పెట్టాడు.

అప్పుడు రామయ్య అరిచిన అరుపు ఆ గది గోడలమధ్య రెండుసార్లు ప్రతిధ్వనించింది. జయదేవ్ తాపీగా అన్నాడు, "నువ్వు అరచి గీపెట్టినా ఇక్కడెవరూ జాలి చూపించరు. రామయ్యా ఇరవై ఒక్క రోజులు పాప ఎంత బాధపడిందో దానికి రెట్టింపు బాధ నువ్వు పడాలి ఇప్పుడు".

పైకి ఇలా తాపీగా మాట్లాడుతున్నాడన్నమాటేగానీ, జయదేవ్‌కి క్షణం క్షణం టెన్షన్ పెరిగిపోతూంది. ఒక్కో నిమిషం గడిచేకొద్దీ పాప మరణానికి దగ్గరవుతూందని తెలుసు అతడు వాచీ చూసుకొన్నాడు. పన్నెండవటానికి ఎనిమిది నిమిషాలుంది.

* * *

11-52 పి.ఎమ్.

కారులోంచి ఒక్క గెంతులో క్రిందికి దిగాడు విద్యాపతి.

చిన్న పాకముందు కూర్చొని చుట్ట తాగుతున్నాడో వృద్ధుడు.

దక్షిణం దిక్కునుంచి చలిగాలి రివ్వున వీస్తూంది.

అప్పుడప్పుడు ఆకాశంలో మెరుపులు. విద్యాపతి గొంతు పెంచి ఒరియాలో అడిగాడు ".....కాద్రా ఇల్లెక్కడ?"

వృద్ధుడు చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్న విద్యాపతి మొహంకేసి పరకాయించి చూస్తూ "ఏమిటీ...." అన్నాడు. వాళ్ళ ముగ్గురికీ పేరు తెలీదు. 'మాద్రానో, ఏదో...." ద్రాతో పూర్తయ్యే రెండక్షరాల పేరని మాత్రం తెలుసు. అందుకే "అద్రా" అన్నాడు.

"కాద్రా?" తిరిగి ప్రశ్నించాడు. కారులో వున్న వాళ్ళ మొహాలు విప్పారినయ్. "అవును! కాద్రా.... అతని ఇల్లెక్కడ?" ఆత్రంగా అడిగాడు.

వృద్ధుడు చెయ్యి చూపిస్తూ "అదిగో అటు వెళ్ళండి. అక్కడ ఎవరిని అడిగినా చెబుతారు" అన్నాడు. విద్యాపతి కారువైపు పరుగెత్తుతుంటే వెనుకనుంచి వినబడింది.

"అయినా ఇప్పుడు కాద్రా యింట్లో లేడుగా.... శ్మశానంలో వుంటాడు". ముగ్గురూ ఒకేసారి అడిగారు "నీకెలా తెలుసు?" అని.

"కాష్మోరా చేస్తున్నాడు. మొన్న గోతిలో పడితే రక్తం తుడిచింది నేనేగా. ఆ పక్క శ్మశానం...." అతడి మాటల్ని ఎవరూ వినటంలేదు. శ్మశానం వైపు వెళ్ళినంత

దూరం వెళ్ళి కారు ఆపు చేశారు. ముందు పరుగెత్తింది శ్రీధర్. చీకట్లో విశాలమయిన శ్మశానం ఆహ్వానిస్తున్నట్టుంది. పొదలు....తుప్పలు....సమాధులు.... ఎక్కడని వెతకడం? విద్యాపతి వాచీ చూసుకొన్నాడు.

* * *

11-54 పి.యమ్.

"సిస్టర్!"

"సర్!"

"క్విక్... డూ ఇట్ క్విక్" కంగారుపడుతూ అన్నాడు పార్థసారథి. కెరోటిడ్ పల్స్ దొరకడం లేదు.... చైన్ స్ట్రోక్ బ్రీతింగ్.... పాప మొహం దగ్గరున్న రబ్బరు మాస్కునుంచి ఆక్సిజన్ హిస్‌స్... మని శబ్దం వినబడుతూంది.

టెంపరేచర్ దిగిపోతూ వుంది. తొంభై ఆరు.... తొంభై ఐదు.... తొంభై నాలుగూ పాయింట్ ఐదు.... కొద్ది కొద్దిగా...

"వీనస్ ప్రెజర్ చెక్ చెయ్యి". వెర్టికల్ కాతెటర్‌లో రక్తప్రసరణ కనబడుతూంది. "ముప్ఫై అయిదు" అన్నాడు జేమ్స్.

తక్కువ... చాలా తక్కువ. పార్థసారథి తలెత్తాడు. నర్సు అతడివైపే చూస్తూంది. ఆ చూపులో భావం అతడు చదవగలిగాడు. "మనం చేయగలిగేది ఏమీలేదు" అని పార్థసారథి సన్నగా గొణిగాడు.

జేమ్స్ స్టెత్‌తో పాప ఊపిరితిత్తుల ధ్వని వింటూ అన్నాడు, "రెస్పిరేషన్ ఫెయిలవుతూంది" ఇంకో నిమిషం అతడలాగే నిశ్శబ్దంగా పరీక్షచేసి, తలెత్తి ఇంగ్లీషులో అన్నాడు.

".... పాప వూపిరి ఆగిపోయింది".

* * *

11-55 పి.యమ్.

"చెప్పు" అన్నాడు జయదేవ్. "ఎలానూ ఆస్తి మీకు దక్కదు. అనవసరంగా పాపని చంపకు".

కుర్చీలో తల వాల్చేసిన రామయ్య దగ్గర్నుంచి జవాబు లేదు. జయదేవ్ కంగారుపడ్డాడు. ఇతడికిగానీ స్పృహ తప్పిందా? రహస్యం తప్పితే ఎలా తెలుస్తుంది -అదీ ఇంకో రెండు నిమిషాల్లో....

అతడు ఆలోచిస్తూంటే ఫోన్ మ్రోగింది. ఒక్క అంగలో వెళ్ళి అందుకొని "హల్లో" అన్నాడు.

"నేనూ.....సుధీర్ని".

"తెలుసు" అన్నాడు విసుగ్గా జయదేవ్. "తొందరగా చెప్పు. శ్రీనివాసపిళ్ళై కనబడ్డాడా?"

"లేదు"?

"లేదా?" నిస్పృహతో ఫోన్ అతడి చేతినుంచి జారిపోయింది. ఎక్కణ్ణుంచి శ్రీనివాసపిళ్ళై పాప మెదడుకి వార్త అందిస్తున్నాడు? అందులోను చుక్కల ద్వారా, గీతల ద్వారా (మోర్స్‌కోడ్‌లో) ఎందుకు పంపుతున్నాడు? మామూలు మాటల ద్వారానే పంపొచ్చుగా. అయినా పాప చెవిలో చెవిటివాళ్ళు పెట్టుకొనే మిషన్ లాటిదేమీ లేదే.... మరి యీ ప్రసారం పాపకి ఎలా చేరుతుంది?" అయోమయంగా అతడు తల విదిలించాడు.

ఆలోచనలలో వుండి అతడు తన వెనుక రామయ్య కదలటం గమనించలేదు. ముందు చూసింది శారద. ఆమె ఏదో అనబోయే లోపులో రామయ్య వేగంగా కదిలాడు. సర్వశక్తులూ కూడగట్టుకొని కాళ్ళలోకి బలం తెచ్చుకొని పరుగెత్తాడు.

జయదేవ్ కదిలి అతడ్ని పట్టుకోబోయేలోపులో అతడు బాల్కనీ అంచుకు చేరుకోవడం జరిగింది. "ఆగు" అని జయదేవ్ అరిచిన అరుపులను లెక్కచేయకుండా యింకో అడుగు ముందుకు వేశాడు.

మరుక్షణం అతడు పెట్టిన కేక ఇంటి ఆవరణలో మారుమ్రోగింది.

జయదేవ్ వంగి చూశాడు. ఎన్నో ఏళ్ళుగా ఆ ఇంటిని అంటిపెట్టుకొని వుంటూ, జీవితపు చివరి దశలో దబ్బుకు ఆశపడి తిన్న యింటి వాసాలు లెక్కపెట్టటానికి సిద్ధపడ్డ ఆ వృద్ధుడి శరీరం రక్తపు మడుగులో కొంచెంసేపు గిలగిలా కొట్టుకొని నెమ్మదిగా అచేతనమైంది.

రహస్యం తెలిపే ఆఖరి లింకు తెగిపోయింది.

పన్నెండవటానికింకా మూడు నిమిషాలుంది.

* * *

అలికిడి విని వెనక్కి తిరిగాడు జయదేవ్. శారద వస్తూంది. చప్పున ఆమెకు అడ్డుగా వెళ్ళి "అటు చూడకండి" అన్నాడు చెయ్యి అడ్డుపెడుతూ. ఆమె విషాదంగా

నవ్వి "ఇన్ని దారుణమైన విషయాలు, కలలో కూడా వూహించలేనివి చూసీ చూసీ మనసు రాయి అయిపోయింది ప్రొఫెసర్" అని అటు చూసింది. ఇద్దరూ ఆ శరీరంకేసి చూస్తూ మౌనంగా వుండిపోయారు. ఇద్దరిమధ్యా శ్మశాన నిశ్శబ్దం తాండవించింది. ఆ నిశ్శబ్దంలో నెమ్మదిగా, విషాదంగా శారద కంఠం వినిపించసాగింది.

"మనుషుల్లో ఇంత రాక్షసత్వం దాగుంటుందని ఇప్పుడే తెలుసుకున్నాను ప్రొఫెసర్ నేను. చేతబడి అనేది వుందో లేదో నాకు తెలీదు. కానీ అంతకన్నా దారుణంగా సాటి మనుషుల్ని హింసించగలదు మనిషి. నవ్వుతూ మన మధ్య తిరుగుతూ– మనల్నే దారుణంగా నాశనం చేయగలిగే మనిషి ఓ దెయ్యంకన్నా, ఓ క్షుద్రదేవతకన్నా ఏ విధంగా తక్కువ? పాప కొంచెం నలత చెందగానే ఈ రామయ్య విలవిలలాడినట్టు నటించాడు. ఇస్మాయిల్ దగ్గరికి తీసుకెళతానని చెప్పి అక్కడ్నించి శ్రీనివాసపిళ్ళై దగ్గరకు తీసుకెళ్ళి బ్రెయిన్ ట్యూనింగ్ చేయించాడు. భూత వైద్యుడిని తీసుకొచ్చి తాయెత్తు కట్టించాడు. ఇంట్లో పూజలు చేయించే...."

జయదేవ్ వినటం లేదు. అంతకుముందు "తాయెత్తు" అన్న పదం దగ్గరే అతడి ఆలోచనలు ఆగిపోయాయి.

* * *

పన్నెండవటానికి రెండు నిమిషాలుంది.

మనిషి జీవితంలో 'సెకను' కాలానికి ఏమీ విలువ లేకపోయి వుండవచ్చు. కానీ సెకనులోనే మనిషి నిర్ణయం తీసుకొంటాడు. 'సెకను'ని విడగొట్టగలిగితే ఆ వేల వేల భాగాలలో కొన్ని కోట్ల పరస్పర విరుద్ధమైన భావాల ఘర్షణ జరుగుతుంది.

అదే స్ప్లిట్ సెకండ్!

పార్థసారధి ఆ క్షణం ఆ స్థితిలో వున్నాడు. తనలో తనే అనుకొన్నాడు "గుండె పనిచేస్తున్న విధానానికీ, దాని పాథాలజీకీ, పరీక్షలవల్ల బయటపడుతున్న రిజల్ట్స్‌కీ ఏమీ పొత్తు కుదరటం లేదు. దీని గురించి వివరంగా ఆలోచించటానికి కూడా సమయం లేదు. ఎలా?"

అతనిలోని సబ్‌కాన్షస్ జవాబిచ్చింది. "ఎనాటమికల్‌గా ఎక్కడో ఏదో తప్పుంది. ఏ పరికరమూ పట్టుకోలేని సైన్సు కింకా అందనిదేదో లోపల వుండి వుండొచ్చు".

"నేను నా దయాగ్నిసిస్‌తో ఏదైనా చేస్తున్నానా?"

"అవన్నీ ఆలోచించటానికి టైం లేదిప్పుడు... వెంటనే ఏదో చేయాలి".

"ఏం చేయాలి?"

"గుండె తెరిచి చూడు".

"బ్రతికుండగానే అటాప్సీ చేస్తే అది మెడికల్ ఎథిక్స్‌కే విరుద్ధం" అంతరాత్మ హెచ్చరించింది. అతడొక క్షణం తటపటాయించాడు. ఏమిటి విరుద్ధం? రోగి బ్రతకటం కావాలి ఎవరికైనా.... ఈ పరిస్థితిలో బ్రతకటం దాదాపు శూన్యం. అసలు కారణం కనుక్కోవాలి.... కారణం కనుక్కోవాలంటే మార్గం...

అతడో నిర్ణయానికొచ్చాడు. డాక్టర్ జేమ్స్ అతడి నోటి వెంబడి వచ్చే మాట కోసం చూస్తున్నాడు. ఆ సీనియర్ డాక్టర్ మనస్థితిని అతడు అర్థం చేసుకోగలడు.

ఒక నిర్ణయానికి వస్తే..... ఇక అది ఫైనల్!

దాని ఖరీదు ఒక రోగి ప్రాణం, జీవితం. అతడు చదివిన చదువు, అతడి అనుభవం అవన్నీ రంగరించి ఒక నిర్ణయానికి వచ్చాడు పార్థసారథి. అది జేమ్స్‌కి చెప్పాడు. డాక్టర్ జేమ్స్ ఆశ్చర్యపడినట్టు కనిపించాడు. కానీ అదీ క్షణకాలం మాత్రమే.

మరు నిమిషంలో పాప ఎడమవైపు ఛాతి దగ్గర కోయబడింది. డాక్టర్ పార్థసారథి వేళ్ళు మిషన్‌కన్నా చురుకుగా పనిచేస్తున్నాయి. సన్నటి పదునైన కత్తితో ఆంటీరియర్ ఆక్సిలరీ లైన్ వరకూ ఇన్‌సెషన్ యిచ్చాడు. పల్చటి రక్తం... బుస బుస కొద్దిగా పొంగింది.

నీడల్ని మింగేసే షాడో లెస్ లాంప్. ఇరవై అయిదు డిగ్రీల సెంటీగ్రేడ్‌లో మెదడు శాతం కంట్రోల్ చేయబడుతూంది. ఆ టెంపరేచర్లో నాలుగు నిమిషాల వరకూ మెదడు ఆక్సిజన్ లేకుండా వుండగలుగుతూంది.

ఆ గదిలో ఉన్న వాళ్ళందరూ మౌనంగా చకచకా తమ పని చేసుకుపోతున్నారు. నర్స్ రిబ్‌రిట్రాక్టర్ అందించింది. ఎర్రటి చర్మం క్రింద తెల్లటి ఎముకలు. గుండెని కప్పి వుంచిన ఛాతి ఎముకల్ని రిట్రాక్టర్తో విడదీసి మరింత లోపలికి వెళ్ళాడు.

గదంతా నిశ్శబ్దంగా వుంది. ప్రకృతి కూడా స్థబ్దమై, ఆ డాక్టరు చేస్తున్న ప్రయత్నాన్ని మౌనంగా పరిశీలిస్తున్నట్టు వుంది.

ఇక్కడో నాళం తెగి రక్తం స్రవిస్తూంది. పార్థసారథి దాన్ని పట్టించుకోలేదు. గమ్యంవైపు సాగిపోతున్నాడు. చర్మం సర్రున తెగింది. విడగొట్టబడిన ఛాతి

ఎముకల మధ్య, పల్చటి బాదం పప్పుని కవర్ చేసి వుంచిన కాయని విడగొట్టినట్టు, పెరికార్డియమ్‌ని నెమ్మదిగా విప్పాడు. అప్పుడు కనబడింది ఎరుపూ, నీలి వర్ణాల్లో వున్న గుండె.

తను కదులుతూ పది సంవత్సరాలపాటు ఇంటిల్లిపాదినీ ఆట పాటలతో సంతోషపెట్టిన గుండె. ఆగిపోయిన గుండెని కదపటానికి అతడు చూపుడువేలితో దాన్ని పట్టుకొన్నాడు. నెమ్మదిగా అటూ ఇటూ కదపసాగాడు.

29

11-58-30

గాలి మరింత ఉధృతమైంది. ఎక్కడ్నుంచో తీతువు పిట్ట వికృతంగా అరుస్తూంది. నక్కలు వూళబెడుతున్నాయి.

వింటినుంచి వెలువడిన బాణంలా పరిగెడుతున్నాడు శ్రీధర్. ముళ్ళ బారినుంచి పాదాల్ని బూట్లు రక్షించలేకపోతున్నాయి. తూలి కింద పడుతున్నాడు, వెంటనే లేచి పరిగెడుతున్నాడు. అతని కాలి కింద కాలిన ఎముకలు విరుగుతున్నాయి. కపాలాలు దూరంగా దొర్లిపోతున్నాయి. పుర్రెల్నుంచి వీస్తున్న గాలి విచిత్రమైన శబ్దం చేస్తూంది. దూరంగా కనబడే చిన్న మంటే గమ్యాన్ని సూచిస్తున్నట్టు వుంది.

ప్రకృతి కదిలిపోయేలా గుడ్లగూబ ఒకటి అరిచింది. రెక్కలు టపటపా కొట్టుకుంటూ పక్షులు చెట్లమీదనుంచి లేచాయి. దూరంగా ఉరిమింది!

నల్లటి మేఘాలు కమ్ముకొస్తున్నాయి.

విరిగిన సమాధుల మధ్యనుంచి పరిగెడుతున్నాడు అతడు. మనిషిని విసిరేసినట్టు గాలి. వెనుక ఇద్దరూ అతడిని అందుకోలేక పోతున్నారు. అంత గాలిలోనూ వాళ్ళకి చెమట పడుతూంది. రొప్పుతూ పరిగెడుతున్నారు. అంతలో అతడు చప్పున ఆగిపోయాడు. వెనుక ఇద్దరూ అతన్ని చేరుకొన్నాడు. తమకు దాదాపు వంద గజాల దూరంలో పెద్దగా వెలుగుతున్న మంటకేసి నిశ్చేష్టులై చూస్తూ వుండిపోయారు వాళ్ళు ముగ్గురూ. అస్పష్టమైన మంత్రాలు చదువుతూ ఆ హోమం ముందు నిలబడి వున్నాడు....

కాద్రా.

* * *

రామయ్య పాపకి తాయెత్తు కట్టాడు.

జయదేవ్ మరి ఆలోచించలేదు. చప్పున బయటకు పరుగెడుతూ "రండి, క్విక్" అని అరిచాడు. శారద అతన్ని వడివడిగా అనుసరించింది. రెండు క్షణాల్లో వాళ్ళిద్దరూ కారులో వున్నారు.

ట్రాఫిక్ రూల్స్‌ని కూడా లెక్కచేయకుండా కారుని ఆస్పత్రివైపు పోనిస్తున్నాడు జయదేవ్. వెంట్రుకవాసిలో తప్పిపోతున్న ప్రమాదాల్ని లెక్కచేయకుండా సాగిపోతున్నాడు. శ్రీనివాసపిళ్ళై పంపే వార్త పాపని చేరకముందే ఆపుచేయాలి. రిసీవింగ్ పాప నుంచి వేరుచేయాలి.

అతడికి ఇప్పుడు అంతా అర్థమైంది. పాప శరీరం ఎందుకు షాక్ కొట్టిందో.

నిజంగా సైన్సు ఇంత అభివృద్ధి చెందిందా? అతని వళ్ళు జలదరించింది.

ఇంతలో కారు ఆస్పత్రి కాంపౌండులోకి దూసుకుంటూ ప్రవేశించింది. గుమ్మం దగ్గర సడెన్‌బ్రేక్ వేసి, శారద వస్తుందా, రావటంలేదా అనికూడా చూడకుండా ఒక్క ఉదుటున మెట్లు ఎక్కాడు.

గుండె వేగంగా కొట్టుకుంటూంది. ఆయాసంతో రొప్పుతూ టైమ్ చూసుకొన్నాడు. పన్నెండు కావటానికి సరిగ్గా ఒక్క నిమిషం వుంది.

విశాలమైన కారిడాల్లో జనం అటూ ఇటూ తిరుగుతున్నారు. జయదేవ్ పరుగెత్తటం చూసి, అతడివైపే ఆశ్చర్యంగా చూస్తున్నారు. అతడు వీటిని పట్టించుకోవటం లేదు. పరుగెత్తుతున్నాడు. ఓ పీ దాటాడు. ఆర్థోపెడిక్స్ వార్డ్ ముందునుంచి ఎడమవైపుకి తిరిగాడు. అక్కడ వరండా నిర్మానుష్యంగా వుంది. వంద అడుగుల దూరంలో కనబడుతూంది "ఆపరేషన్ థియేటర్". అక్కడ నిలబడి వుంది లావుపాటి నర్సు. అతడు లోపలికి వెళ్ళబోతూ వుంటే చెయ్యి అడ్డుపెట్టి "ఎక్కడికి?" అని గర్జించింది.

అతను దాన్ని పట్టించుకోలేదు. ఒక్క విసురుతో ఆమె చేతిని పక్కకి తోసి లోపలికి ప్రవేశించాడు.

అక్కడ దృశ్యం చూసి స్థాణువై నిలబడిపోయాడు.

పాప గుండె ప్రాంతంలో కోయబడి వుంది. పార్థసారథి వంగి వేళ్ళతో గుండెని కదుపుతున్నాడు. తనంతట తానే గుండె కొట్టుకునేట్టు చేయటానికి శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు.

జయదేవ్ అంతలో తేరుకుని అడుగు ముందుకు వేశాడు. ఆయాసంతో రొప్పుతున్నాడు అతడు.

డాక్టర్ జేమ్స్, సహాయం చేస్తున్న నర్సు, అందరూ అతడినీ, అతని ఆకారాన్నీ చూసి విస్తుబోయారు. ఆ క్షణం అతను అలా ఆపరేషన్ థియేటర్లో ప్రవేశించటాన్ని వాళ్ళు వూహించలేదు. నోటికి అడ్డుగా గుడ్డ వున్నదన్న విషయం కూడా మర్చిపోయి "ఇడియెట్" అన్నాడు సారథి. "గెటవుట్ ఫ్రం హియర్".

జయదేవ్ మాట్లాడలేదు. పాప దగ్గరికి బులెట్‌లా దూసుకుపోయాడు.

పన్నెండవడానికి పది సెకన్లున్నాయి.

* * *

శ్రీధర్ గుండెల్నిండా వూపిరి పీల్చుకొన్నాడు...

.....తనతో ఉన్న ఇద్దర్నీ అక్కడే ఆగిపొమ్మన్నట్టు సైగచేశాడు. ఒక్కో అడుగూ ముందుకు వేయసాగాడు. కాలి క్రింద ఎండుపుల్లలు విరిగిన శబ్దం వినిపించనివ్వకుండా ముందుకు సాగిపోతున్నాడు.

వాతావరణం భయంకరంగా వుంది. దెయ్యం పట్టిన స్త్రీ జుట్టు విదిలించి నాట్యమాడినట్టు చెట్ల కొమ్మలు అటూ ఇటూ గాలికి కొట్టుకుంటున్నాయి. భూమి విడిపోతుందా అన్నట్టు ఉరుములు.

కాద్రా మంట ముందు నిలబడి వున్నాడు. గాలి తోడై మంటలు నాలుకలు సాచి పైకి లేస్తున్నాయి. ఆ మంటల వెలుగు అతని కళ్ళలో ఎర్రగా ప్రతిబింబించి, అతన్ని మరింత భయంకరంగా కంపింపచేస్తూంది.

అంతక్రితం రోజు శ్మశానంలో నాలుగు మూలలా పాతిన పాప బొమ్మలో భాగాల్ని అతను తవ్వి తీశాడు. ఒక్కో భాగాన్నీ మంటలో వేయసాగాడు. ప్రేతాత్మలకి అర్పితం చేయసాగాడు. ముందొక కాలు..... చెయ్యి..... మరో కాలు.... ఒక్కొక్క అంగమే మంటలో పడుతూంది.

శ్రీధర్ అతని వెనక్కి... అడుగు దూరంలోకి చేరుకొన్నాడు. మంట వేడి అతడి శరీరాన్ని తాకుతూంది. గుండెల్నిండా ఊపిరి పీల్చుకోవటానికి శ్రీధర్ క్షణంపాటు ఆగాడు.

దూరంనుంచి చూస్తున్న విద్యాపతి, బ్రాహ్మిణ్‌లు ప్రేక్షకులే అయ్యారు. కఱ్ఱని రెండు చేతులతోనూ పట్టుకొంటూ శ్రీధర్ అనుకొన్నాడు.

"- ఈ పనిని నేను వైషమ్యంతో చేయటంలేదు. ప్రేతాత్మలని క్షుద్రంగా సంతృప్తి పరుస్తూ తన కోర్కెల్ని తీర్చుకొనే ఒక మాంత్రికుడ్ని, అతడి చర్యల్నుంచి

నివారించటానికి ఇది చేస్తున్నాను. దీనివల్ల కలిగే ఏ పరిణామమూ నాకు వర్తించకుండుగాక!"

ఈ లోపులో కాద్రా రెండు చేతులతోనూ పాప శరీరపు శిరస్సుని పట్టుకొన్నాడు. గాలిలో బొమ్మని పైకెత్తాడు. ప్రేతాత్మలకి అర్పితం చేయటం కోసం మంటలోకి వదలబోయాడు.

అప్పుడు వినిపించింది వెనుకనుంచి శ్రీధర్ కంఠం.

గాలిలో....

నెమ్మదిగా- స్ఫుటంగా.

".... కాద్రా" అని.

* * *

11-59-59

"మీ పని మీరు చూసుకోండి" అంటూ పాప దగ్గరికి చేరుకొన్నాడు జయదేవ్. డాక్టర్ వేళ్ళు ఇంకా గుండెని కదుపుతూనే వున్నాయి. దాన్ని పట్టించుకోలేదు జయదేవ్. పాప నడుముకి కట్టివున్న తాయెత్తును గట్టిగా లాగాడు. పైకి రాగిలా కనబడుతున్న ప్లాస్టిక్ తాయెత్తు.

అది చేతులలోకి రాగానే అక్కణ్ణుంచి తప్పుకొన్నాడు. ఆపరేటస్‌కి అటువైపు టేబుల్ దగ్గరికి చేరుకొని ట్రేలోంచి ఫోర్‌సెప్స్ తీసుకొని, తాయెత్తు విడగొట్టాడు. ఆ తాయెత్తులోంచి కరెంట్ ఎమినేట్ అయి సన్నగా షాక్ కొట్టింది. సూచన రావటం ప్రారంభం అయిందన్నమాట. క్షణంలో ఆరోవంతు పాటూ షాక్.

అతడు తాయెత్తుని విడగొట్టడం ఆపుచేసి, అలాగే పట్టుకొన్నాడు. మళ్ళీ షాక్ కొట్టింది. ఈసారి కొంచెం ఎక్కువసేపు.

చేతిలో వున్న ఫోర్‌సెప్స్‌తో బల్లమీద గీత గీశాడు. కొద్దిసేపు షాక్ కొడితే చుక్కా ఎక్కువసేపు కొడితే గీత- ఇలా ఆపరేషన్ టేబుల్‌మీద వ్రాశాడు. పావు నిమిషంలో సూచన పూర్తయింది.

— —— ——• . .— . .— .... . .— .— .—

మిగతాది చదవక్కర్లేదు. అతడికి సూచన అర్థమయింది.

Your heart is STOPPING STOPPING STOPPING

అతడు గుండెల్నిండా వూపిరి పీల్చుకొన్నాడు. ఆ తరువాత తాయెత్తు విడగొట్టడంలో నిమగ్నమయ్యాడు.

పార్థసారధి ఇంకా వేళ్ళతో పాప గుండెని కదుపుతూనే వున్నాడు. అతడి నుదుటి నుంచి చెమట ధారాపాతంగా కారుతూంది. ఇంకా ఎంతసేపో లేదు. మహా అయితే అరనిమిషం.... అరనిమిషంలో ఆ గుండె తనంతట అది కొట్టుకోకపోతే....

ఇక అంతే-

* * *

"కాద్రా!" అన్న శబ్దం గాలిలో అలలు అలలుగా తేలివచ్చి కర్ణపుటాలకు సోకగానే కాద్రా ఉలిక్కిపడ్డాడు. క్షణంపాటూ నిశ్చేష్టుడై, ఆ నిశ్చేష్టతలో అసంకల్పితంగా వెనుదిరిగాడు.

అంతే!

శ్రీధర్ చేతిలో కర్ర రాతిగదలా గాలిలోకి లేచింది. మెరుపుకన్నా వేగంగా అతడి మొహాన్ని తాకింది, ముక్కు క్రింద.

కాద్రా వెనక్కి తూలి నిలదొక్కుకున్నాడు. థూ అని వూసిన వుమ్ముతో రెండు పళ్ళు క్రిందపడ్డాయి. అప్రయత్నంగా అతడు నోటి మీద చెయ్యిపెట్టి తడిమి చూసుకొన్నాడు. మంట వెలుగులో ఎర్రటి రక్తం చేతికి అంటుకొని కనిపించింది.

అతడు తన రక్తాన్ని చూశాడు.

తన తప్పు గ్రహించే లోపులోనే సమయం మించిపోయింది. అతడి చుట్టూ గాలిలో తిరుగుతున్న ప్రేతాత్మలు ఒక్కసారిగా అతడిమీద పడ్డాయి. ఊడిన పళ్ళ మధ్యనుంచి మంత్రం స్పష్టంగా రాలేదు. మంత్రగాడికి అతడి ప్రాణంకన్నా పళ్ళు ముఖ్యమైనవి, మంత్రం స్పష్టంగా రావాలి. రాలేదు.

ముగ్గురూ ప్రేక్షకుల్లా నిలబడి వున్నారు. ఏం జరుగుతూందో వాళ్ళకి తెలియటంలేదు. అప్పటివరకూ లేని కలకలం ఏదో గాలిలో వస్తూందని మాత్రం గమనించారు. హిస్‌మన్న శబ్దం. వేల వేల గొంతులు గుసగుస లాడుతున్న ధ్వని- దేన్నో పీక్కుతింటున్న భావన. శ్రీధర్ నిశ్చేష్టుడై చూస్తున్నాడు. తను కొట్టింది పెద్ద దెబ్బేమీ కాదని అతడికి తెలుసు. కానీ....కానీ...

కాద్రా నోటినుండి ఒక కేక వెలువడింది.

మ్ మ్ మ్ మ్ మ్మా మ్మా... అన్న ఆర్తనాదం.

అతడి చేతులు గాలిలోకి లేచి కర్రల్లా బిగుసుకున్నాయి. పిడికిళ్ళు మూసుకుపోయినయ్.

అప్పుడర్థమైంది వాళ్ళకి.

అతడి రక్తం పీల్చివేయబడ్తూంది.

అతడి శరీరం చుట్టూ చేరి కొన్నివేల ప్రేతాత్మలు విందు చేసుకొంటున్నాయి.

వాళ్ళు తమ కళ్ళని నమ్మలేకపోతున్నారు. కానీ కనబడ్తూన్న దృశ్యం అది. మానవ కంకాళాల్లోంచి వస్తూన్న గాలి మరింత శబ్దం చేస్తూంది.

కాద్రా మెలికలు తిరిగిపోతున్నాడు. నిప్పుల పెనంమీద చీమ తిరిగినట్టూ మెలికలు తిరుగుతున్నాడు. అతడి శరీరం గాలి తగ్గిపోతూన్న బ్లాడర్‌లా కొద్ది కొద్దిగా కుదించుకుపోతూంది. తల అటూ ఇటూ కొట్టుకుంటూ ఆక్రందనలు చేస్తూనే వున్నాడు.

"యీా యీా యీాక్... ఈ ఈ ఈ మ్.... మ్మా ఆ ఆ ఆ- ఖ్హా ఊ ఊ ఊ" పిడికిళ్ళతో మట్టి పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. గోళ్ళతో నేలని గోకుతున్నాడు.

శ్రీధర్ తన చేతిలోని నీటిని మంటమీద జల్లాడు. అంతశ్శబ్దాను విద్ధము, అంతర్నిర్వికల్పకము మొదలైన షడ్విధ సమాధులలో వుండి ఫకీరిచ్చిన శుద్ధ తులసి తీర్థమది. క్రతుధ్వంసి ఫాలనేత్రపు అరుణారుణ రుధిర జ్వాల నార్పే సురునిమగ్నమై, ప్రళయకాల ఝంఝూమారుతము నాపే మహీమై, అహస్కరుని తాకిడికి ఘర్మధమైన గహ్వరిని చల్లార్చేందుకు వచ్చిన మొయిలురేని ఆయుధం అయింది.

ప్రకృతి విలయతాండవాన్ని ఆపింది.

శ్మశానం మధ్యలో కాద్రా శరీరం స్థాపితం అయిపోయింది.

వేల వేల సంవత్సరాల నిద్రలోంచి మేల్కొన్న కాష్మోరా అసంతృప్తుడై తిరిగి సమాధిలోకి వెళ్ళిపోవటానికి ఆయత్తమవుతున్నాడు.

శ్రీధర్ బొమ్మ చుట్టూ కట్టిన ఒక్కో బంధాన్ని విప్పుతున్నాడు. మిగతా ఇద్దరూ అతడిని చేరుకొన్నారు. శ్మశానంలో నెమ్మదిగా మామూలు వాతావరణం నెలకొంటూంది.

* * *

00-00 హవర్స్.

ఫోర్‌సెప్స్‌తో తాయెత్తుని నెమ్మదిగా విప్పాడు జయదేవ్. లోపల చింతగింజల్లాంటి లిథియమ్ బ్యాటరీలు ఎనిమిది వున్నాయి. చిన్న రిసీవర్ ఆంటెనా వుంది. ప్లాస్టిక్ కవరుకి అక్కడక్కడా చిన్న చిన్న కన్నాలున్నాయి. శరీరానికి తాయెత్తులు తగిలేచోట వున్న రంధ్రం నుంచి షాక్ కొడుతుందన్నమాట. డిమాడ్యులేటర్‌ని తీసి పక్కన పెడుతూ తలెత్తాడు.

అదే సమయానికి పెరికార్డియం కుట్టేసి, రిబ్ రిట్రాక్టర్ తీసేశాడు పార్థసారథి. తను ముందు యిచ్చిన ఇన్‌సిషన్ మూసేశాడు.

పాపవైపు తదేకంగా ఒక క్షణం చూశాడు.

తరువాత నెమ్మదిగా తలెత్తాడు.

డాక్టరు జేమ్స్, నర్సు, జయదేవ్ అందరూ అతడివైపే ఆతృతగా చూస్తున్నారు. ఒకటి.... రెండు.... మూడు... నాలుగు నిమిషాలు గడిచినయ్. వాళ్ళమధ్య పేరుకున్న గాఢమైన నిశ్శబ్దంలోంచి నెమ్మదిగా డాక్టర్ పార్థసారథి విజయపూరితమైన నవ్వు వెలిసింది.

నాలుగు నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్న గడియారం పన్నెండు కొట్టింది.

ఉపసంహారం

"డాక్టర్! ఒక విషయం చెప్పండి. దెయ్యాలూ, క్షుద్రదేవతలూ వున్నాయా?" అడిగాడు విద్యాపతి.

పార్థసారథి నవ్వాడు. "ఎందుకా అనుమానం వచ్చింది?"

విద్యాపతి కూడా నవ్వి "నా ప్రశ్నకి సమాధానం అదికాదు" అన్నాడు.

"ఈ ఇరవయ్యో శతాబ్దంలో, చదువుకున్న వాళ్ళకి కూడా అలాంటి అనుమానాలు రావటం విచారకరం".

అబ్రకదబ్ర, శ్రీధర్, విద్యాపతి ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నారు. శ్రీధర్ ఏదో అనబోయి వూరుకొన్నాడు. అనటంవల్ల లాభం లేదు. సారథి నమ్మడు. తాము స్వయంగా అనుభవించిందీ, కళ్ళతో చూసిందీ వివరించి చెప్పినా నమ్మడు.

చేతబడీ, బాణామతీ లాటివి వున్నవని నమ్మేవాళ్ళు లేవని చెప్పేవాళ్ళని ఎంత హేళనగా చూస్తారో, లేవని అనేవాళ్ళు వున్నవని చెప్పేవాళ్ళని అంత చులకనగానూ చూస్తారు. ఇది నిరంతర భావాల ఘర్షణ.

అదే సమయానికి ప్రొఫెసర్ జయదేవ్, బాల్కనీలో కూర్చొని శారద యిచ్చిన టీ తాగుతూ ఆమెకి జరిగినదానికి సైంటిఫిక్ రీజనింగ్ యిస్తూ వివరిస్తున్నాడు.

"పాపకి యిలా ఇరవై ఒక్క రోజుల బాధకి ముందు, కొంతకాలం నలతగా వుందని మీరు చెప్పారు గదా! దానికి ఇస్మాయిల్ తిరుగుబడి కూడా చేశాడని అన్నారు. ఆ రోజులలోనే పాప మెదడు మోర్స్‌కోడ్‌ని రిసీవ్ చేసుకోవడానికి వీలుగా ట్యూన్ చేయబడిందన్నమాట".

"నా కిప్పుడు జ్ఞాపకం వస్తూంది ప్రొఫెసర్! ఒకరోజు పాప ఆలస్యంగా ఇంటికొచ్చింది. మేము చాలా కంగారుపడ్డాము. వాళ్ళ టీచర్ తనకేమీ తెలియదంది. ఇస్మాయిల్ ప్రేతాత్మల్ని పిలిచి అడిగాడు కూడా" నవ్వింది శారద.

"నమ్మేవాళ్ళుంటే మంత్రగాళ్ళు ఎన్ని వేషాలయినా వేస్తారు. కాద్రా ఇరవై ఒక్క రోజులు నాటకం అదే-"

"ఈ మంత్రాలూ తంత్రాలూ లేవంటారు".

"లేవు".

శారద మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూంది. జయదేవ్ అన్నాడు- "పాప గోళ్ళూ, వెంట్రుకలూ సరస్వతి కత్తిరించటం రామయ్యకి తెలిసింది. పైడితల్లి, సరస్వతీ కల్సి పాపని ఎలా చంపదల్చుకున్నారో పొంచి విన్నాడు. శ్రీనివాసపిళ్ళైకి చెప్పాడు. ఆ ఇరవై ఒక్క రోజుల చేతబడి బాధలూ కంప్యూటరైజ్ చేసి పాపకి నిజంగా చేతబడి జరిగిందనీ- అందర్నీ- చివరికి బాగా చదువుకున్న శ్రీధర్ని కూడా నమ్మేటట్లూ చేశారు. నిజానికి కంప్యూటర్ తాయెత్తు ద్వారా కరెంటుని పంపేది. సరిగ్గా రాత్రి పన్నెండింటికి దాన్ని అలా అరేంజి చేశారు. ఎందుకంటే ఆ టైమ్‌లో మూడు రక్తం చుక్కలు పోయడానికి పైడితల్లి వాళ్ళు క్లోరోఫాం ఉపయోగించి అయితేనేం, ఇంకోలా అయితేనేం, చుట్టూవున్న వాళ్ళని నిద్రపుచ్చుతున్నారని శ్రీనివాసపిళ్ళైకి తెలుసు. అందుకని పాప శరీరం షాక్ కొడుతుందని ఎవరికీ తెలిసే ఆస్కారం లేదు".

"కాని సరస్వతి తల పాప బ్రద్దలుకొట్టడం-"

"హిప్నాటిక్ సజెషన్స్ ద్వారా" అన్నాడు జయదేవ్. "మామూలుగా కపాలం బ్రద్దలు కొట్టాలంటే హేమర్ వుపయోగిస్తారు డాక్టర్లు. కానీ హిప్నాటిజం ద్వారా చేతిని గునపంకన్నా బలంగా తయారు చేయవచ్చు. అలా చేసి తమ ప్రత్యర్థులలో ఒకరిని (సరస్వతిని) చంపాడు శ్రీనివాసపిళ్ళై. ఈ ఇరవై ఒక్క రోజులలో శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయం వాళ్ళందర్నీ చంపటం అతని ఆశయం. ఒకవేళ మధ్యలో ఇదంతా బయటపడినా అందరూ చేతబడి అనే అనుకోవాలని, అతడు ఈ కాష్మోరా సాయం తీసుకున్నాడు. అలా ఆస్తి అంతా అతనికి వస్తుంది. ఆ ఆశ పెట్టే రామయ్యని కొనేశాడు. ఇదంతా ఎంత పకడ్బందీగా చేశాడంటే- ఏ న్యాయ స్థానమూ అతనికి శిక్ష విధించలేదు. ఏ కోర్టూ అతని నేరాన్ని నిరూపించలేదు".

"మీరు చెబుతున్నదంతా వింటూంటే ఈ చేతబడులూ అవీ లేవనీ, అంతా సైన్స్ అనీ నమ్మాలని అనిపిస్తుంది ప్రొఫెసర్. చాలాకాలం క్రితం మా ఇంట్లో ఒక చిత్రం జరిగింది. స్టౌని దెయ్యం ఆవహించి ప్రశ్నలకి జవాబు చెప్పటం. ఆయన అన్నారు- ఇదంతా సైన్సనీ, స్టౌ కింద గాలి వేడి ఎక్కి- దాన్ని పైకి తోస్తుందనీ, నాకు అప్పుడు అర్థంకాలేదు. స్టౌని వెలిగించకుండానే అది ఎలా కదిలిందీ అని".

ఆమె ఆగి సాలోచనగా అన్నది "ఇరవై ఒక్క రోజులపాటూ ఇరవై ఒక్క సూచనలు పాపని బాధ పెట్టినయ్. ఇరవయ్యవ రోజు సూచన పాపని కోమా లోకి పంపటం, ఇరవై ఒకటో రోజు సూచన గుండె ఆగిపోవటం. అవునా ప్రొఫెసర్?"

జయదేవ్ తలూపాడు.

ఆమె తనలో తనే అనుకుంటున్నట్టూ అంది- "పాప మెదడుకు ఇరవయ్యవ సూచన రాగానే పాప కోమాలోకి వెళ్ళిపోయింది. ఇరవై ఒకటో సూచన పాపని చేరకుండా తాయెత్తు మీరు పీకేశారు- అంటే నీ గుండె ఆగిపోతుందీ అన్న సూచన పాపని చేరనే లేదు. మరి పాప గుండె ఎందుకు ఆగిపోయింది? గుండె ఆగిపోవటం అనేది సూచన వచ్చిన తరువాత జరగాలి కదా".

జయదేవ్ నెమ్మదిగా తలెత్తి- అర్థంకానట్టూ- అయోమయంగా చూశాడు. గాలిలో చిన్న కదలిక, ఎవరో కదిపినట్టూ కదిలిన కిటికీ కర్టెన్ చిన్న సంచలనం.

శారద అడిగిన ఆ ప్రశ్నకి సమాధానం తెలిసినరోజు నిశ్చయంగా చెప్పొచ్చు ప్రపంచంలో ఏ క్షుద్రవిద్యా లేదని.

30

"నమస్తే! ఇంట్లో ఎవరూ లేరా?" ప్రొఫెసర్ జయదేవ్ అడిగాడు.

"లేరు. మీరెవరు?"

"తెలియనట్లు నటించకండి. నేనెవరో మీకు తెలుసు".

"తెలుసు. మీకేం కావాలి?"

ప్రొఫెసర్ జేబులోంచి కత్తి తీశాడు. గెడ్డాన్ని షేవ్ చేయటానికి మంగలి వాడే కత్తి అది. అడుగు ముందుకేశాడు.

"ఆగు" అని అరిచాడు. శ్రీనివాసపిళ్ళై. "మీలో ఎవరో ఒకరు నా దగ్గరకి వస్తారని తెలుసు. పాపకి నేను చేసినదానికి మీరు ఎలాగో ఒకలా నా మీద ప్రతీకారం తీర్చుకోవటానికి ప్రయత్నిస్తారు అనికూడా నాకు తెలుసు. అందుకని ఒక సీల్డు కవర్లో మీ అందరి పేరులూ వ్రాసి నా లాయర్ కిచ్చాను. నాకు ఏమాత్రం అపకారం జరిగినా ఆ కవరు పోలీసులకి అందజేయబడుతుంది. శ్రీధర్‌తో సహా మీరందరూ జైల్లో వుంటారు" అంటూ నవ్వాడు.

జయదేవ్ ముందుకు వెళ్ళాడు. కుందేల్ని చంపటానికి వెళ్ళే పులిలా తాపీగా వున్నాడు. శ్రీనివాసపిళ్ళై కుర్చీ వెనక్కి జరుగుతూ "ప్రొఫెసర్ జయదేవ్! నీకు బంగారంలాంటి భవిష్యత్తు వుంది. దాన్ని జైల్లో గడపాలనుకుంటే నన్ను చంపు" అన్నాడు.

జయదేవ్ ఇంకో అడుగు ముందుకేశాడు.

శ్రీనివాసపిళ్ళై ఆశ వదిలేసుకున్నవాడిలా మరణానికి సిద్ధపడి కళ్ళు మూసుకున్నాడు. అయితే అతను వూహించిన విధంగా ఆ కత్తి అతని మెడకి చేరుకోలేదు. "నేను నిన్ను చంపను" అని జయదేవ్ గొంతు వినబడింది.

విస్మయంతో పిళ్ళై కళ్ళు తెరిచాడు. "మీరు చాలా తెలివైనవాళ్ళు. ఎలక్ట్రానిక్స్‌తో అద్భుతమైన విజయం సాధించిన వాళ్ళు. అదీగాక నాతో సమానంగా హిప్నటైజ్ చేయగలిగిన సామర్థ్యం వున్నవాళ్ళు. ఇంత గొప్పవాళ్ళని చంపటం నా కిష్టం లేదు. పాపకి మీరు చేసిన అపకారానికి మిమ్మల్ని నరికి పోగులు పెట్టాలి. కానీ మీకున్న విజ్ఞానం దృష్ట్యా అంత పెద్ద శిక్ష వేయటం లేదు".

"మరేం చేస్తావు? అంగవైకల్యుడ్ని చేస్తావా?"

"ఉహూ" అన్నాడు జయదేవ్. "మీ తల గుండు చేస్తాను".

"వ్వాట్?" అని ఆశ్చర్యంతో అరిచాడు పిళ్ళై. "నాకు గుండు చేస్తావా?"

తలూపాడు జయదేవ్. "దాంతోపాటూ ఇరవై నాలుగు గంటలు ఈ గదిలో మిమ్మల్ని కుర్చీకి కట్టేసి బందీగా వుంచుతాను. అంతే.... ఆ తరువాత మీకూ నాకూ సంబంధం లేదు. మీ మీద నాకు ఏ పగా వుండదు. పాపని ఇరవై ఒక్క రోజులు బాధ పెట్టినందుకు మీకు ఇరవై నాలుగు గంటలు శిక్ష. అయితే ఇంకో చిన్న విషయం- మీ నెత్తిమీద ఒక్కో చుక్కా పడేటట్టు ఓ కుండలో నీళ్ళు పెట్టి పైన కడతాను. ఇరవై నాలుగు గంటలు స్నానం చేయాలి- తప్పదు మీకు. అఫ్‌కోర్స్! ఒక్కో చుక్కా అనుకోండి అంతే".

"అంతేనా?"

"అంతే! ఇంకేమీ లేదు".

"తరువాత నా మీద మీకేమీ పగ వుండదా?"

"ఉండదు" అని, "మీ చేతులు వెనక్కి పెట్టండి" అంటూ కుర్చీ వెనుక వాటిని కట్టేశాడు. పిళ్ళై యువకుడు. అయినా జయదేవ్ బలం ముందు ఎదురు తిరగటం అవివేకం అని అతనికి తెలుసు. అదీగాక జయదేవ్ చేతిలో కత్తి వుంది.

పిళ్ళై తల కదలకుండా కుర్చీ వెనుక ఆనుకునేదానికి కట్టేశాడు. అతను చాలా తాపీగా కోల్డ్ బ్లడెడ్ మర్డర్ చేస్తున్నట్టు తన పనిని నిర్వహిస్తున్నాడు.

తల కట్టేసిన తర్వాత చేతిలోని కత్తితో గుండు గీయటం ప్రారంభించాడు.

"మీకు నిజంగా మతిపోయింది ప్రొఫెసర్" తల ఎటూ కదల్చడానికి వీల్లేకుండా వుండటం వల్ల కళ్ళు మూసుకుని అన్నాడు పిళ్ళై- "రేపట్నుంచి నేనీ గుండు వేసుకుని బజార్లో తిరగడానికి చాలా సిగ్గుపడాలి".

జయదేవ్ మాట్లాడకుండా తన పని చేసుకుపోతున్నాడు.

"జాగ్రత్తగా గీయండి. మీకు అనుభవం వుందో లేదో?"

జయదేవ్ దవడ కండరం బిగుసుకుంది. "పాప చిగుళ్ళ నుంచి ఒకరోజు రక్తం వచ్చింది. గుండె ఆపరేట్ చేస్తున్నప్పుడు చాలా రక్తం పోయింది. దానితో పోల్చుకుంటే ఒకవేళ మీకు కొంచెం తెగినా ఫర్లేదు లెండి."

"కానీ మీరు నాకు ఏ హానీ చేయనని మాటిచ్చారు".

జయదేవ్ ఈ లోపులో తన పని పూర్తి చేశాడు. బయటికి వెళ్ళి కారు డిక్కీలోంచి ఒక కుండని బరువుగా లోపలికి మోసుకొచ్చాడు. పిళ్ళై తలమీద కప్పుకి ఫ్యాన్ తిరుగుతూ వుంది. దాన్ని ఆపి ఆ రాడ్‌కి కుండని ఉట్టి కట్టినట్టు కట్టాడు.

"ఏముంది అందులో?" అడిగాడు పిళ్ళై.

"ఐస్" అన్నాడు జయదేవ్. "తొందరగా కరగకుండా వుండటానికి కొంచెం ఉప్పు కలిపాను".

అంతలో టప్ మని ఒక నీటిచుక్క కిందపడింది. పిళ్ళై తలని దాని క్రిందుగా అమరుస్తూ "కుండకి చిల్లు- చాలా చిన్న చిల్లు పెట్టాను" అన్నాడు జయదేవ్.

"మీరు రేపు తప్పకుండా వచ్చి ఈ చలినుంచి నన్ను తప్పిస్తారుగా".

"జయదేవ్ ఆడినమాట తప్పడు" జేబులోంచి సెలోఫిన్ టేప్‌తీస్తూ అన్నాడు.

"థాంక్స్ ప్రొఫెసర్".

"దేనికీ?"

"ఇంత చిన్న శిక్షతో నన్ను వదిలేసినందుకు".

"ఇది మీకు ఇస్తున్న గౌరవం కాదు. మీ విజ్ఞానానికి యిస్తున్న గౌరవం" అని సెలోఫిన్ టేప్‌తో నోటిని మూసేశాడు. సరీగ్గా నీటి చుక్కపడే సమయానికి అతడు తన తల కదల్చడానికి వీలేమీ లేకుండా పోయిందని నిర్ధారణ పర్చుకొని, కదిలి తలుపు దగ్గరికి వెళ్ళి వెనక్కి తిరిగి.... "గుడ్‌బై పిళ్ళై! ఇరవై నాలుగ్గంటల తర్వాత కలుసుకుందాం" అని తలుపు బయట తాళంవేసి వెళ్ళిపోయాడు.

కారు స్టార్టు అయిన శబ్దం వినిపించింది. అది దూరంగా కదిలిపోతున్న ధ్వని. పిళ్ళై కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు పడింది తలమీద నీటిచుక్క టప్ మని.

చాలా చల్లగా వుంది ఐస్...కరిగిన నీరు...నున్నటి చర్మం మీద.

అతడు మళ్ళీ ఆలోచనలలో పడ్డాడు. 'ఎందుకు జయదేవ్ యింత చిన్న శిక్షతో సరిపుచ్చాడు? నిజంగా తను పోలీసులకి తెలుపుతాడని భయపడ్డాడు' అంతలో మరో చుక్క పడింది.

టప్ మని.

ఆలోచన తెగింది. ఒకో చుక్కా ఎంతసేపటికి పడుతూంది? చుక్కకీ చుక్కకీ మధ్య సమయం ఎంత? అతను మరో చుక్క పడే వరకూ ఆగి, దానికీ నాలుగో చుక్కకీ మధ్య సమయాన్ని లెక్క పెట్టడానికి ప్రయత్నించాడు. దాదాపు పదిహేను సెకన్లు అంటే నిమిషానికి నాలుగు. గంటకి రెండువందల నలభై-మొత్తం అయిదువేలా ఏడువందలా అరవై చుక్కలు పడతాయన్నమాట తన తలమీద.

టప్

మరో చుక్క పడింది. ఆలోచన తెగింది. ఐస్ నీరు చల్లగా వుంది. ఉప్పు కలిపాడు కాబట్టి తొందరగా నీరుగా మారదు ఐస్. మొత్తం కుండలో నీరు అంతా ఐస్‌గా మారేసరికి రాత్రి ఏ రెండో....

టప్

ఇంకో చుక్క ఆలోచన మళ్ళీ తెగింది. ఈ చుక్క కరెక్టుగా పదిసెకన్లకి ఒకసారి పదుతుందా? పధ్నాలుగు సెకన్లుకా- వాచీవుంటే బావుణ్ను.

టప్

అరె! ఈసారి తొందరగా పడిందే. లేదు-లేదు- సరీగ్గానే పడింది. తను తప్పు లెక్క వేశాడు. ఎలక్ట్రానిక్ ఇంజనీరు తను. తను లెక్కలలో తప్పటానికి వీల్లేదు. పదిహేను సెకన్లు. అంతే! అయితే సమయం గడిచేకొద్దీ ఐస్ కరుగుతుంది. అప్పుడు పధ్నాలుగు సెకన్ల కొకసారి చుక్క పడుతుంది అదీ లెక్క. అప్పటికి నీరు వేడెక్కుతుంది. అవునూ.... పధ్నాలుగు సెకన్లు అయిపోయాయి. పదిహేను....పదహారు కూడా అయినయ్. పడదేం....పడదేం....పడ.....

టప్

ఇదేమిటి - క్రితం చుక్కకన్నా ఈ చుక్క పెద్దగా వుంది? లేదు లేదు. రంధ్రం ఒకటేగా. పడినచోట పడటంవల్ల అలా అనిపించిందేమో. అదే నిజమయితే.... ఏ అయిదు వేల చుక్కో పడేసరికి గునపంతో కొట్టినట్టూ....

టప్

భయమేస్తోంది. ఈ చుక్కల ఆలోచన తప్ప ఇంకేదైనా...

టప్

ఇదేమిటి ఇంత తొందరగా పడి.....

టప్

లేదు. లేదు అది సరిగ్గానే పడుతుంది. తన ఆలోచనలోనే ఏదో మార్పు వచ్చింది. ఈసారి తను కాన్సన్‌ట్రేట్ చేస్తాడు. చుక్క పరిమాణములో కూడా మార్పులేదు. కేవలం భ్రమవల్లే అది ఓ పెద్ద చుక్కలా తనకి అనిపించింది. ఇదిగో ఈసారి ఇంకా పడలేదు. అరె ఎందుకు పడటం లేదు? ఇరవై సెకన్లు కూడా

అయిపోయినయ్. మరి ఇంకా పడదేం- ఈ రోజు తన మెదడుకి ఏమయింది? పడదేం.... నీటిచుక్క..... పడదేం?

ఇప్పటికి ఎంతసేపయింది జయదేవ్ వెళ్ళి? అరగంట అయిందా? లేదు... లేదు. ఎనిమిది చుక్కలేగా పడింది. అంటే...అంటే.... రెండు నిమిషాలేనా..... రెండు నిమిషాలు అరగంటలా కనప......

టప్

అమ్మో అని అరవబోయాడు. తలమీద పెద్ద దెబ్బ పడిన భావన. లేదు లేదు. ఇది మామూలు నీటిచుక్క- తనే పొరపాటు.

టప్

అతడు తల విదిలించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. కుర్చీని ఆ స్థానంలోంచి కదపటానికి ప్రయత్నిస్తున్నాడు. అయినా లాభంలేకపోయింది. జయదేవ్ చేసినదేమిటో అర్థమైంది. నిద్రవచ్చినా బావుణ్ను, స్పృహ తప్పినా బావుణ్ను. లేకపోతే.....లేకపోతే ఈ నీటిచుక్కల ఆలోచన మెదడుని కోసేస్తుంది. చుక్క తరువాత చుక్క వేయి సమ్మెటల పోటయి బాధ పెడుతుంది. పడేవరకూ పడటం లేదేమని, పడేటప్పుడు.

టప్

అతడు ఆర్తనాదం చెయ్యబోయాడు. మాట రాలేదు. అప్పటికింకా పది నిమిషాలు కూడా కాలేదు. ఇంకా ఇరవై మూడు గంటలు ఎలా...... ఎలా.....

అతడు ఆ రోజు నిద్రపోలేదు. ఏం ఆలోచించాడో ఎవరికీ తెలీదు. ఎంత గింజుకున్నాడో ఎవరూ చూడలేదు. చుక్క చుక్కకీ మధ్య ఆలోచన, క్షణ క్షణానికీ పెద్దదవుతూన్న చుక్క ఈ చుక్కల మధ్య కొట్టుమిట్టాడుతూ, మరుసటిరోజు జయదేవ్ వచ్చేసరికి....

పిచ్చివాడైపోయాడు శ్రీనివాసపిళ్ళై.

ఒక చిన్నారి పాపని ఇరవై ఒక్క రోజులపాటూ దారుణంగా బాధపెట్టిన అతడి ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానాన్ని అతడు శాశ్వతంగా మర్చిపోయాడు.

* * *

"మంగోలియాలో బ్రెయిన్ వాషింగ్‌కి చాలా పురాతనమైన పద్ధతి అది" అన్నాడు జయదేవ్ శారదతో. 'మనిసిని పూర్తిగా పిచ్చివాడ్ని చేస్తుంది'.

"పాపం రోడ్డుమీద పిచ్చివాడై తిరుగుతున్నాడట" అంది శారద– "చూస్తే జాలేస్తుంది".

"పాపకి అతడు చేసిన దానికి అదే సరి అయిన శిక్ష. అతడు మన కన్నా తెలివైనవాడు. పోలీసులకి ముందే చెప్పి వుంచాడు. కానీ ఇప్పుడు వాళ్ళకీ తెలీదు. ఇదంతా అతడికెవరో తిరుగుబడి చేయించారని వాళ్ళు అనుకొంటారు. అందుకే అతడు పిచ్చివాడవటానికి కారణం ఎవరో మందు పెట్టడం అని భావిస్తున్నారు అందరూ."

"సైన్సుకీ, చేతబడికీ ఎంత దగ్గర సంబంధముందో చూశారా ప్రొఫెసర్" అంది శారద. "రామయ్యకి ఇటువంటి వాటిమీద నమ్మకం లేకపోవచ్చు. కేవలం పాపని బ్రతికిస్తున్నాననే నమ్మకం మనకు కలిగించటంకోసం అతను పాపని ఇస్మాయిల్ దగ్గరికి తీసుకెళ్ళి తిరుగుబడి చేయించాడు. అక్కడ్నించి శ్రీనివాసపిళ్ళై దగ్గరికి తీసుకెళ్ళి వుండొచ్చుగాక. అది వేరే సంగతి..... కాని ఇస్మాయిల్ చేసిన తిరుగుబడితో సాహిర్ అనేవాడు చచ్చిపోయాడు అని స్వామి చెప్పాడు కదా! మరి అలా అయితే సాహిర్ మరణానికి సైన్సు ఏం సమాధానం చెబుతుంది?"

"ప్రతి మరణానికీ సైన్సు సమాధానం చెప్పనక్కర్లేదు" అంటూ జయదేవ్ నవ్వి బాల్కనీలోంచి క్రిందికి చూశాడు. క్రింద ముందు తోటలో విద్యాపతీ, శ్రీధర్, అబ్రకదబ్ర కూర్చొని వున్నారు. పార్థసారథి కూడా.

"వాళ్ళకి చెప్పరా?" అంది శారద– "ఈ శ్రీనివాసపిళ్ళై, ఈ ఎలక్ట్రానిక్స్– ఈ విషయం అంతా....."

"నమ్మరు" అన్నాడు జయదేవ్. "వాళ్ళకి చెప్పినా నమ్మరు"

క్రింద కూడా అదే చర్చ జరుగుతూంది.

"దెయ్యాలున్నాయి డాక్టరుగారూ! కేవలం సైన్సుకి అందనంత మాత్రాన అవి లేవూ అనలేం" అన్నాడు ఆవేశంగా అబ్రకదబ్ర.

పార్థసారథి "నాన్సెన్స్" అన్నాడు. ఈ లోపులో దూరంగా స్కూల్ బస్ వస్తున్న చప్పుడు వినిపించింది. సాయంత్రం అయిదున్నర కావొస్తూంది. చల్లటిగాలి వీస్తూంది.

ఆగిన బస్‌లోంచి తులసి బయటికి గెంతింది. బస్ కదులుతూవుంటే వెనుక సీటులోంచి ఇస్మాయిల్ చెయ్యి వూపాడు. ఇట్నుంచి శ్రీధర్, అబ్రకదబ్ర కూడా చెయ్యి వూపారు. పార్థసారథికి అర్థంకాలేదు, ఒక మామూలు క్లీనరుకి వీళ్ళు చెయ్యి వూపటం.

అంతలో పాప దగ్గర కొచ్చింది. "హౌ ఆర్యూ బేబీ" డాక్టరు అడిగాడు.

"ఫైన్ డాక్టర్! థాంక్యూ!"

"ఎప్పుడు మీ పారిస్ ప్రయాణం?"

"ఏప్రిల్ నాలుగున" శ్రీధర్ అన్నాడు.

"పారిస్ నుంచి ఏం తెస్తావమ్మా తులసీ నాకు?"

"స్టెతస్కోప్...."

అందరూ నవ్వారు. పాప స్కూల్ సంచి లోపల పెట్టటానికి పరుగెత్తింది.

"చాలా తొందరగా పికప్ చేసింది...." అన్నాడు డాక్టరు అటే చూస్తూ.

కొంచెంసేపు నిశ్శబ్దం. దాన్ని భంగపరుస్తూ శ్రీధర్ అన్నాడు– "ఏది మానవ నిర్మితమో, ఏది మానవాతీతమో మనకి తెలీదు డాక్టర్! సైన్సు ముందుకు

జరిగినకొద్దీ మానవాతీతమంతా శోధించబడుతూంది. ఆత్మల్ని ట్రాన్స్‌ప్లాంట్ చేసే విధానం కూడా తొందర్లోనే కనుక్కోబడుతుందేమో...."

"కానీ వీటిని ఆధారం చేసుకుని, కొందరు సూడో మంత్రగాళ్ళూ, మ్యాజిక్ చేసేవాళ్ళూ మనుష్యుల బలహీనత మీద ఆడుకొంటున్నారు. ఏం బ్రాహ్మిణ్. ఏమంటావ్?"

"నేనేం అనను".

"ఏం?"

"ఈ మంత్రాలూ, మాజిక్‌లూ మానేసి చాలా కాలమైంది. ఇరవై రోజుల క్రితం ప్రయోగించిన ఒకే ఒక విద్య.... అదే ఆఖరిది... అంతే...."

"ఇరవై రోజుల క్రితమా? ఏమిటది?"

అబ్రకదబ్ర విద్యాపతి వైపు చూశాడు. ఇద్దరూ గుంభనంగా నవ్వుకున్నాడు.

అబ్రకదబ్ర చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

"పరలోకంలో ఉన్న నీ తండ్రి ఆత్మ శాంతిస్తుంది నాయనా! షడ్రసోపేతమైన భోజనం పెట్టావు" అన్నారు స్వామివారు.

"మీరు కనబడటం నా అదృష్టం స్వామీ, నా తండ్రి తద్దినంనాడు" అన్నాడు విద్యాపతి వినయంగా.

ఇంతలో తలుపు దగ్గర చప్పుడయింది. అబ్రకదబ్ర లోపలికి వచ్చాడు. స్వామి తత్తరపాటుతో లేచి "ఇతను.... ఇతను....." అన్నాడు.

"నా స్నేహితుడు బ్రాహ్మిణ్".

ఏమీ తెలీనట్టు అబ్రకదబ్ర నమస్కారం చేశాడు. తనలో అలజడిని కప్పి పుచ్చుకుంటూ కూర్చున్నాడు స్వామి.

"తాంబూలం స్వీకరించండి స్వామీ" విద్యాపతి ప్లేటు ముందుకి అందించాడు.

స్వామి కిళ్ళీ నోట్లో పెట్టుకోబోతూంటే- "శ్రీకృష్ణ అనాథ బాలికల శరణాలయాన్ని పోలీసులు రైడ్ చేశాక మీరిప్పుడు ఎక్కడుంటున్నారు స్వామీ?" అన్నాడు నెమ్మదిగా అబ్రకదబ్ర.

తెరుచుకున్న నోరు అలానే వుండిపోయింది. స్థాణువైపోయాడు స్వామి. విద్యాపతి నవ్వి, "మిమ్మల్ని పట్టుకోవటానికి మాకు చాలా శ్రమ అయిపోయింది స్వామీ! మీ యిద్దరు ఆంతరంగిక మిత్రులు పైడితల్లి, సరస్వతీ కూడా ఈ లోకంలో లేరాయె...."

స్వామి చప్పున తలుపు వైపు పరుగెత్తాడు. అది మూసి వుంది. అతనికి వున్నట్టుండి చావు ధైర్యం వచ్చింది.

"అవును! అన్నీ చేసింది నేనే.....! నా ఇద్దరు సహచరులూ చచ్చిపోయారు. ఇప్పుడు నా మీద ఏ నేరం మోపగలరు మీరు? నేను బిస్తాలో కొంతకాలం వున్నమాట నిజమే! అది నేరం కాదు. ఇండియాలో క్షుద్ర విద్యలు ప్రయోగించే వాడిమీదా, దానికి పురిగొల్పిన వాడిమీదా ఏ నేరమూ లేదు. 'లా'లో ఎక్కడా అది లేదు. లాయరుగారికి అది తెలుసు" గర్వంగా విద్యాపతి వైపు చూశాడు.

అది నిజమే అన్నట్టు విద్యాపతి తలూపాడు. స్వామి నవ్వాడు. అబ్రకద్రబ వైపు చూసి హేళనగా అన్నాడు- "మరిప్పుడు ఏం చేయగలరు మీరు? ఇక్కడ పాపకి జరిగినదానికి, ఆ సమయంలో అక్కడెక్కడో వెయ్యిమైళ్ళ దూరంలో వున్న నా మీద ఏ కేసు పెట్టగలరు?" అంటూ లేచాడు.

దగ్గరగా వేసి ఉన్న తలుపు తెరిచి వెనుదిరిగి స్వామి వారిద్దరివైపూ చూశాడు. "ఇవన్నీ మేం ముందే ఆలోచించాం. పాప చచ్చిపోతే ఆ నేరం మా మీదకు వస్తుందని మాకు తెలుసు. అందుకే పకడ్బందీగా ప్లానువేశాం. ఫేలయింది! అది వేరే సంగతి. కానీ ఏ న్యాయస్థానమూ నన్ను ఏమీ చేయలేదు. హ్హాహ్హాహ్హా.... ఏ న్యాయస్థానమూ నన్ను ఏమీ చేయలేదు" అతను బైటికి వెళ్ళబోయాడు.

"నిజమే స్వామీ" అని వెనకనుంచి వినిపించింది. అబ్రకదబ్ర మాట విని స్వామి ఆగాడు. "మీరు చేసిన నేరాల్ని ఏ న్యాయస్థానంలోనూ మేము నిరూపించలేం, ఆ విషయం లాయరుగారే ఒప్పుకున్నారు-" అన్నాడు బ్రాహ్మిణ్.

స్వామి విజయపూరితమైన నవ్వు నవ్వాడు.

"కానీ..... మీరు కూడా ఏ న్యాయస్థానంలోనూ మా మీద నేరం నిరూపించ లేరు" అన్నాడు.

స్వామి పెదవులమీద చిర్నవ్వు మాయమైంది. 'అంటే?' అన్నాడు.

"నల్లబల్లిని తలక్రిందులుగా వ్రేలాడగడితే అది విషాన్ని కక్కుతుంది. దాన్ని బియ్యంలో కలిపి వండిపెడితే తిన్నవాడు ఇరవై ఒకటో రోజున అకస్మాత్తుగా హరీ మంటాడు. అయ్యా స్వామివారూ! మీరు యీ విద్యాపతి తండ్రిగారి తద్దినం అన్న పేరుతో తిన్న భోజనం అదే...." తాపీగా అన్నాడు అబ్రకదబ్ర.

ఆ గదిలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు స్వామి. అతడి నుదుటి మీద చెమట పడుతుంటే "ఏమిటీ" ఏమిటీ?" అన్నాడు.

"సరిగ్గా ఇరవై ఒక్క రోజులు స్వామీ.....! ఈ ఇరవై ఒక్క రోజులూ మీరు ప్రతిక్షణం దిగులుతొ ఛస్తారు. పాపకి ఇరవై ఒక్కరోజుల చేతబడి జరిగినప్పుడు అది నయం అవుతుందేమో అన్న నమ్మకం మాకు కొద్దిగా వుండేది. ఇప్పుడు మీకు అదికూడా లేదు. ఎవరయినా డాక్టరు దగ్గరికి వెళ్ళినా 'నీకేం దుక్కలా వున్నావ్.....' అంటారు. కానీ ఇరవై ఒకటోరోజు తెల్లవారేసరికి మీరు చచ్చి పడివుంటారు. కాష్మోరాకైనా తిరుగుంటుందేమోగానీ దీనికి లేదు. వెళ్ళిరండి స్వామివారూ! టిట్ ఫర్ టాట్! వీలయితే ఏదైనా పోలీస్ స్టేషన్‌లో మా మీద కంప్లైంట్ చేసుకోండి".

* * *

శ్రీధర్ కుర్చీలోంచి లేస్తూ "ఇడియట్" అన్నాడు.

"నువ్వు 'ఇడియట్' అనూ, 'వెధవా' అను. మేం చెయ్యదల్చింది మాత్రం చేశాం. ఇది మర్డరో కాదో తెలీదుగానీ, ఆ దుర్మార్గుడికి యింత కన్నా మంచి శిక్ష వుంటుందని నేననుకోను".

"ఇంతకీ ప్రయోగించటం మాకిదే మొదటిసారి గురూ! మాకూ నిశ్చయంగా తెలీదు".

"ఇన్ని రోజుల్నించీ స్వామిని కల్సుకోలేదా?"

"లేదు".

"ఇది జరిగి ఎన్ని రోజులైంది?"

అబ్రకదబ్ర తనలో తనే లెక్కకట్టి "ఈ రోజుకి ఇరవై ఒకటి" అన్నాడు.

"అంతే.....అంటే....."

"ఇవాళ పొద్దున్న స్వామివారు పరమపదించి వుంటారు. నేను ఎంక్వైరీ చెయ్యలేదు. కావాలంటే నవ్వు చేసుకోవచ్చు. శ్రీకృష్ణ అనాధ బాలికల శరణాలయానికి ఫోన్ చేస్తే ఎవరైనా చెబుతారు. నాకు మాత్రం పూర్తి నమ్మకం వుంది. ఆయన మరణం అనివార్యం ఆనీ, దాన్ని ఎవరూ ఆపలేరనీ...." తాపీగా అన్నాడు.

"ఇరవై రోజులు మామూలుగా ఉండి, ఇరవై ఒకటోరోజు వున్నట్టుండి ఛస్తాడా? అన్‌బిలీవబుల్! సైన్సు ఒప్పుకోదు" అన్నాడు డాక్టర్.

"ఇది సైన్సు కాదు- క్షుద్రవిద్య" అన్నాడు అబ్రకదబ్ర. శ్రీధర్ ఇది వినలేదు వడివడిగా లోపలికి వెళ్ళాడు. బయట తోటలో మిగతా ముగ్గురూ కూర్చుని ఉన్నారు. లోపల శ్రీధర్ ఫోన్ చెయ్యటం వినిపిస్తోంది అతడు రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేశాడు.

బయట కూర్చున్న ముగ్గురూ ఆతృతగా అతడికోసం చూస్తున్నారు మానవాతీత శక్తులు వున్నాయా లేవా అని తెలుసుకోవటం కోసం-

మరునిమిషం మెట్ల దగ్గర చప్పుడయింది.

శ్రీధర్ మెట్లు దిగుతున్నాడు స్వామి మరణించాడో, బ్రతికి వున్నాడో చెప్పడం కోసం!

"ప్రామిస్"

ఈ నవల సీరియల్‌గా ప్రచురితమవుతున్న కాలంలో చాలా విచిత్రాలు జరిగాయి. నాకు రెండు పార్శిల్సు వచ్చాయి. ఒక పార్శిలులో ఎవరివో గోళ్ళు, వెంట్రుకలు వున్నాయి. ఆ గోళ్ళు తాలూకు వ్యక్తిమీద చేతబడి చేసినట్టయితే- (చేయించినట్టయితే) ఆ వ్యక్తి చనిపోయిన క్షణం ఇరవై వేల డ్రాఫ్టు పంపబడుతుందనీ, ఎలాగైనా జరిగేలా చూడమనీ ఫ్రం అడ్రసు వ్రాయకుండా ఎవరో వ్రాశారు.

ఇంకో పార్శిలులో ఒక తాయెత్తు వచ్చింది. చేతబడులు లేవనిగానీ రచయిత నవల పూర్తిచేసినట్టయితే, ఆ తాయెత్తు కర్ణపిశాచిగా మారి రచయితనీ, ఎడిటర్ని వేధిస్తుందట. అలాగే చేతబడి వున్నట్టు చెప్పినట్టయితే ఆ తాయెత్తు ఇద్దరికీ మంచి చేస్తుందట.

నాకు సంబంధించినవే కాక, బైట కూడా ఇలాటివే జరిగినయ్. చిన్న బొమ్మకి గుడ్డలు కట్టి నాలుగు రోడ్డుల కూడలిలో వేసి, అమ్మాయిలు భయంతో తప్పుకుపోతే అల్లరి చేయటం యూనివర్శిటీ విద్యార్థులకి ఒక హాబీ అయింది.

ఒంట్లో ఏ మాత్రం నలతగా ఉన్నా ఎవరో తమకేదో చేశారని భయపడటం, గ్రామస్థులు ఇప్పుడిప్పుడే ఇలాటివి వున్నాయని మర్చిపోతున్న వాళ్ళు-వీళ్ళని 'తులసిదళం' మళ్ళీ వెనక్కి తీసుకువెళుతుందని ఒక విమర్శ ఈ నవలపై వచ్చింది.

చాలా మంచి విమర్శ ఇది.

చేతబడులు లేవని నేను, నా మిత్రులు టెలివిజన్‌లో వరుసగా ప్రదర్శనలిచ్చాము. ఎక్కడైనా చేతబడి జరిగిందని వార్త రాగానే మేము బయల్దేరి వెళ్ళేవాళ్ళం. అదేం విచిత్రమో అప్పటివరకూ పడుతున్న రాళ్ళు ఆగిపోయేవి.

చేతబడి స్కిన్ డిసీజ్ అయ్యేది. సైన్సుకి అంతుపట్టని రోగాలు కొన్ని వున్నాయి. వాటికి చేతబడి అని పేరు పెట్టి, వాటిమీద తాయెత్తులకీ వేపమండలకీ డబ్బు తగలేసే వాళ్ళని చూస్తే జాలి- అంతే! మేం వెళ్ళిన చోటల్లా గోరంతలు కొండంతలు చేసి చెప్పేవాళ్ళు.

చేతబడే కాదు టెలిపతీ-క్లారవాయెన్స్ - అంతా బోగస్. అంటే ఇవన్నీ లేవని కాదు. వీటి గురించి చేసేవి మాత్రం అభూత కల్పనలే.

వాటిని ఆపటం ఎవరికీ సాధ్యంకాదు! అలాగే మనకి తెలియనిదంతా లేదని అనుకోవటం కూడా అమాయకత్వమే. ఒక అద్భుతమైన శక్తిని సాధించిన మంత్రగాడు దాన్ని క్షుద్రమైన చేతబడికోసం ఉపయోగించడు. ఎందుకంటే- ఆ శక్తిని సాధించటానికి పడే శ్రమలోనే అతడు వేదాంతి అవుతాడు. ముని అవుతాడు. అతడు శాపం యివ్వడు. వరాలే యిస్తాడు. ఈ మాటలు ద్వారకాసాహూ అనే మంత్రగాడు (?) మాతో అన్నాడు. ఈ మాటల్లో చాలా నిజం వుందని నేను ఈ విషయం గురించి లోతున వెళ్ళిన కొద్దీ తెలుసుకోగల్గుతున్నాను.

మరి ఈ చేతబడులూ ఇవన్నీ-?

మనిషి చేతకానితనం మీద తెలివయినవాడు ఆడుకొనే ఆటలు.

అప్పుడో ప్రశ్న ఉద్భవించవచ్చు- మరి చేతబడి గురించి ఇంత నమ్మకంగా ఎలా వ్రాశాడు రచయిత అని. దీనికి జవాబు ముందే వ్రాయటము జరిగింది. నిజమైన శక్తులు వేరని. అందుకే ఎక్కడో నిక్షిప్తమైన కాష్మోరాని బైటకి తీసుకురావటం జరిగింది. అలాగే కాద్రాని సృష్టించవలసి వచ్చింది.

దురదృష్టవశాత్తు మనిషికి బలహీనత లెక్కువ. కష్టాల్లో వున్న మనిషికి మరీ.... ఏ మాత్రం ఆధారం దొరికినా చాలనుకుంటాడు. బాబాల్నీ, బైరాగుల్నీ నమ్ముతాడు. కొద్దిగా ట్రిక్ చేసి అతడి మనసుని గెలవగలిగితే ఇక అతను దాసోహం అంటాడు. ఆ కష్టంలోంచి అతన్ని బైటకు తీసుకురాగలిగేది అతను ఒక్కరే అని నమ్ముతాడు. ఎంతయినా ఖర్చు పెడతాడు.

ఇలా తులసిదళం సీరియల్ వస్తున్నంతకాలం రకరకాల అనుభవాలు, కొత్త కొత్త స్నేహాలు, విమర్శలు, వాదోపవాదాలు! ఇంట్లో వాళ్ళకి ఏ చిన్న విపత్తు జరిగినా ఎవరో ఏదో చేశారనే భయం ఒకవైపు గిల్టీ కాన్షస్‌నెస్. ఇంకోవైపు టెన్షన్- అన్నిటి మధ్యా చివరికి అది పూర్తయింది.

కొందరడిగారు నవల ద్వారా ఏం చెప్పావు అని.

అయినెస్కో మాటలు జ్ఞాపకం వస్తున్నాయి- ఏదైనా చెప్పటానికి 'రచయిత ప్రవక్తకాడు' అని.

ఈ అనుభవాలతో, తులసిదళం వ్రాస్తూ వుండగా తెలిసిన విషయాలను మరింత నిజాయితీగా మరో నవలలో విపులీకరిద్దామనిపించింది. దానికి ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక నుంచి ప్రోత్సాహం లభించింది.

అందుకే "సైన్సుకీ, క్షుద్రవిద్యకీ పేర్లల్ లైన్‌గా" మరో నవల వ్రాయాలనే-ప్రామిస్సే-

'తులసి'

పదకొండు సంవత్సరాల తర్వాత కాష్మోరా నిద్రలేవటంతో ప్రారంభం అయే మరో నవల--

"తులసి"

- రచయిత.